

అల్లరి పిల్లలలో అద్భుత మార్పులు

ఏ.ఎస్.మకరెంకో

అల్లరిపిల్లలలో అద్భుతమార్పులు

ఆంటన్ సెమ్యోనోవిచ్ మకరెంకో

ముందుమాట : మాక్సిం గోర్కీ

తెలుగు : టి. ఎన్. వి. రమణమూర్తి

హైదరాబాద్ బుక్ ట్రస్ట్

ఆంగ్ల మూలం : The Road To Life, A.S. Makarenko,
Progress Publishers, Moscow, 1951

ప్రథమ ముద్రణ : ఫిబ్రవరి 2002
పునర్ముద్రణ : జనవరి 2005

ప్రతులకు,వివరాలకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్,
ప్లాట్ నెం. 85, బాలాజినగర్, గుడి మల్కాపూర్,
మెహిదీపట్నం, హైదరాబాద్ - 28 ఫోన్ : 23521849

ముద్రణ : అనుపమ ప్రింటర్స్, 126, శాంతినగర్, హైదరాబాద్ - 28 ఫోన్ : 23391364

కలం స్నేహితులను కలసిన తరుణం

మాక్సిం గోర్కీ

1891 వేసవిలో నేను కుర్యాజ్ మొనస్ట్రీకి వెళ్లి, అప్పట్లో ప్రఖ్యాతిగాంచిన క్రోన్‌స్టాట్ జాన్‌తో మాట్లాడాను. మూడు దశాబ్దాలు దాటిన తరువాత మరోసారి అక్కడకు వెళ్లిన మూడోరోజు కానీ ఆ విషయం గుర్తుకురాలేదు. అప్పుడు నాకు ఆతిథ్యమిచ్చినది నాలుగువందలమంది మాజీ వీధి పిల్లలు, "సామాజికంగా ప్రమాదకరమైనవారు". నాతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్నవారు.

ఈ కాలనీ పిల్లలతో నాలుగేళ్లుగా నాకు కలం స్నేహం ఉంది. వారి భాషలో, వాక్య నిర్మాణంలో, భావవ్యక్తీకరణల్లో క్రమంగా, స్థిరంగా వచ్చిన మార్పులను నేను గమనించాను. వాటితోపాటు వారిలో పెరిగిన సామాజక చైతన్యాన్ని, పరిసరాల పట్ల పరిజ్ఞానాన్ని నేను పరిశీలించాను. ఈ పిల్ల అరాచకవాదులు, దిమ్మరులు, దొంగలు, బాలవేశ్యలూ నిజమైన శ్రామికులుగా పరివర్తనం చెందడాన్ని గుర్తించాను.

ఈ కాలనీ ఏడేళ్లుగా నడుస్తోంది. అందులో నాలుగేళ్లు పాల్టొవా ప్రాంతంలో ఉండింది. ఈ ఏడేళ్ల కాలంలో కాలనీ నుంచి అనేకమంది వివిధ వృత్తుల్లో నైపుణ్యం సంపాదించేందుకు రబ్‌ఫాక్‌లో చేరారు. దాంతోపాటే వ్యవసాయ, సైనిక శిక్షణా శిబిరాలకూ వెళ్లారు. మరికొందరు టీచర్లుగా మారి ఇతర కాలనీలకు తరలారు. పోలీసులకు పట్టుబడి, నేర పరిశోధన విభాగం పంపిన పిల్లలే కాక, స్వచ్ఛందంగా వచ్చి చేరే పిల్లలతో కాలనీవాసుల సంఖ్య ఎప్పుడూ నాలుగు వందలకు తక్కువ ఉండేది కాదు. గత అక్టోబర్‌లో కాలనీ వాసులందరి తరఫునా ఎక్ డెన్సింకో నాకొక లేఖ రాశాడు.

"మీరు వచ్చి వెళ్లిన తరువాత ఆ కాలనీలో చాలా మార్పులు వచ్చాయి. కాలనీ వాసుల్లోని సీనియర్లు చాలామంది బయట ఫ్యాక్టరీల్లో, పారిశ్రామిక శిక్షణా సంస్థల్లో చేరేందుకు వెళ్లిపోయారు. ప్రస్తుతం కాలనీవాసుల్లో పాతవారు అతి తక్కువమంది మిగిలారు. అత్యధికులు కొత్తగా వచ్చినవారే. శ్రమ నేర్చిన పాతవారితో కంటే, కొత్త పిల్లలతో కాలనీని నిర్వహించడం ఎక్కువ కష్టం. పాతవారంతా వెళ్లిపోవడంతో కాలనీలో క్రమశిక్షణ కొరవడింది. కానీ ఇంకా మిగిలిఉన్న పాతకాలనీవాసులం దీన్ని సాగనివ్వకూడదు. సాగనివ్వం కూడా. ప్రస్తుతం కాలనీలోని పాఠశాలను పూర్తిగా పునర్వ్యవస్థీకరించాం. ఇప్పుడు ఇక్కడ ఏడేళ్ల పాఠశాల ఉంది. పాఠశాల అవకాశం కోల్పోయినవారి కోసం వేరే చేతివృత్తుల శిక్షణా వ్యవస్థ వుంది."

నాకు తెలిసి ప్రస్తుతం ఆ కాలనీలో అరవై ఇద్దరు కామ్సొమోల్ సభ్యులు ఉన్నారు. అందులో కొందరు ఖార్కోవ్‌లో చదువుతున్నారు. ఒకరైతే రెండవ ఏడాది వైద్యకోర్సులో ఉన్నాడు. అయితే అందరూ ఇప్పటికీ కాలనీలోనే నివసిస్తున్నారు. పట్టణానికి అది దాదాపు పదికిలోమీటర్ల దూరంలో ఉంది. పిల్లలంతా రోజువారీ కాలనీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారు.

ఈ నాలుగు వందలమంది పిల్లలూ ఇరవై నాలుగు డిటాచ్‌మెంట్లుగా ఏర్పడి విడిభాగాల కూర్పరులుగా, ఫిట్టర్లుగా, వ్యవసాయ, తోటల కార్మికులుగా, పశుపాలకులుగా, పందుల పెంపకందార్లుగా, ట్రాక్టర్ డ్రైవర్లుగా, లాబ్ మెన్‌లుగా, చెప్పుల తయారీదార్లుగా వివిధ బాధ్యతలు నిర్వర్తిస్తారు. నాకు జ్ఞాపకం ఉన్నంతవరకూ అక్కడ 43 హెక్టార్ల సాగుభూమి, 27 ఎకరాల అటవీ భూమి ఉంది. ఆవులూ, గుర్రాలూ, పందులూ పుష్కలంగా ఉన్నాయి. ఈ పందులకు వ్యవసాయ దారులనుంచి మంచి డిమాండ్ ఉంది. వారికి వివిధ వ్యవసాయ పనిముట్లు, రెండు ట్రాక్టర్లు, వారి సొంత విద్యుత్ కేంద్రం కూడా ఉన్నాయి. తుపాకిమందు కర్మాగారం ఈ కాలనీకి పన్నెండువేల ప్యాకేజి పెట్టెల తయారీకి ఆర్డర్ ఇచ్చింది.

కాలనీ రోజువారి కార్యకలాపాలన్నీ ఇరవై నాలుగు డిటాచ్‌మెంట్లు తమ కమాండర్లుగా ఎన్నుకొన్నవారే నిర్దేశిస్తారు. వారివద్దే అన్ని గోదాముల తాళాలూ ఉంటాయి. వారే అన్ని పనులకూ కార్యక్రమాలు రూపొందిస్తారు. పనులు సవ్యంగా జరిగేలా చూడటమే కాక, ఆ పనుల్లో పాలుపంచు కుంటారు. స్వచ్ఛందంగా వచ్చి కాలనీలో చేరగోరే పిల్లల విషయంలో కమాండర్ల మండలి నిర్ణయం తీసుకుంటుంది. నాటి కాలనీవాసులు ఏమైనా పొరపాటుచేసినా, క్రమశిక్షణను ఉల్లంఘించినా కమాండర్ల మండలే వారికి శిక్ష విధిస్తుంది. కాలనీ డైరక్టర్ ఏ.ఎస్. మకరెంకో ఈ సమావేశంలో పాల్గొంటారు. పెద్ద తప్పు లేదా అదే పొరపాటు పదేపదే చేసిన వారిని, సోమరిపోతులను, పనిఎగ్గొట్టేవారిని, తోటి కాలనీ వాసులను అవమానించిన వారిని, మొత్తం సమిష్టి ప్రయోజనాలకు హాని కలిగించినవారిని అవసరమైతే కాలనీ నుంచి బహిష్కరిస్తారు. అయితే ఇటువంటి సందర్భాలు బహు అరుదు. 'బయట' తమ గతం ఎలా గడిచిందో కమాండర్లకూ, దోషులకూ కూడా స్పష్టంగా గుర్తుంటుంది. మొత్తంమీద ఈ కాలనీ ఎవరూ అనాథలుగా మిగిలిపోవడాన్ని ఇష్టపడదు.

నేర పరిశోధన విభాగం సిబ్బంది కాలనీకి కొత్తగా ఎవరైనా పిల్లవాడిని, బాలికను తీసుకొచ్చి అప్పగించినప్పుడు ఆ పిల్లల గతం గురించి కానీ, వారెందుకు పట్టుబడ్డారనే విషయం గురించి కానీ ఎలాంటి సమాచారం తెలుసుకోరాదన్నది కాలనీ కచ్చితంగా పాటించే నియమం. కాలనీలో ఎవరూ అడక్కపోయినా కొత్తపిల్లలు తమంత తాముగా ఆ వివరాలు చెప్పబోయినా వినకపోవడం, వాళ్లు తమ ఘనకార్యాల గురించి గొప్పలు చెప్పే ప్రయత్నం చేస్తే వారిని వేళాకోళం చేసి, వారు చెబుతున్నదేమీ నమ్మనట్టు వ్యవహరించడం ఇక్కడి సంప్రదాయం. ఇది పిల్లలపై మంచి ప్రభావాన్ని కలిగిస్తోంది. పైగా వారికి కాలనీలో సీనియర్లు ముందు చెబుతారు. "ఇది జైలు కాదు. మేమే ఇక్కడ మీకు అధిపతులం. నువ్వూ అంతే. ఇక్కడ ఉండు, మాతోపాటు చదువుకో, పని చెయ్యి. ఇష్టం లేదా, వెళ్లిపో. అంతే" అని. ఇదంతా నిజమేనని కొత్తవారికి వెంటనే అర్థమవుతుంది. దీనితో సులభంగా ఆ వాతావరణంలో ఇమిడిపోతారు. నేను పొరబడకపోతే ఏడేళ్ల కాలనీ చరిత్రలో అక్కడినుంచి వెళ్లిపోయినవారి సంఖ్య పదిలోపే.

ఈ కాలనీలో ఒక కుర్రవాడు పదమూడేళ్ల వయసప్పటి నుంచి ఉంటున్నాడు. వాడికిప్పుడు పదిహేడేళ్లు. పదిహేనేళ్ల వయసు నుంచి అతను దాదాపు ఏభైమంది సభ్యులు గల డిటాచ్‌మెంట్‌కి కమాండర్‌గా ఉన్నాడు. అతను మంచి కామ్రేడ్ అని విన్నాను. నిక్కచ్చిగా వ్యవహరించే కమాండర్ కూడా. అతను తన జీవిత చరిత్రలో రాసిన వివరాల ప్రకారం, ఒక కామ్సొమోల్ సభ్యులు అరాచకానికి పాల్పడితే అతన్ని కాలనీ నుంచి బహిష్కరించారు. తనకు జీవితం అంటే అపారమైన ప్రేమ అని, సంగీతం, సాహిత్యాలను అభిమానిస్తానని అతను రాసుకున్నాడు. సంగీతమంటే మరింత గాఢమైన అనురక్తి అని కూడా పేర్కొన్నాడు.

అతని ప్రేరణతోనే కాలనీవాసుల్లో రెండు వందల ఎనభై నాలుగు మంది పిల్లలు తమ ఆత్మకథలు స్వయంగా రాసి నాకు బహుమతిగా పంపారు. వారిని ప్రోత్సహించిన ఆ కుర్రవాడు కవి. ఉక్రేనియన్ భాషలో రాస్తాడు. కాలనీలో మరికొందరు కవులు కూడా ఉన్నారు. కాలనీపిల్లలు 'ప్రోమెన్' అనే సచిత్ర పత్రికను వెలువరించేవారు. అందులో ఒక కుర్రవాడు బొమ్మలు గీసేవాడు. అతనొక కమాండర్. నిజంగా ప్రతిభగలవాడు. కానీ తన పనితనం గురించి తనకే అనుమానం. ఎనిమిదేళ్ల వయసులోనే పోలాండ్ నుంచి తరలివచ్చి అనాథగా వీధుల్లో పడ్డాడు. మొదట యరోస్లావల్‌లోని ఒక కాలనీలో ఉండేవాడు. అక్కడినుంచి పారిపోయి ట్రామ్‌కార్లలో జేబుదొంగగా మారాడు. తరువాత కొంతకాలం ఒక దంతవైద్యుడితో కలిసి ఉన్నాడు. అక్కడే చదువన్నా, చిత్రకళ అన్నా అతనికి

అభిరుచి పెరిగింది. కానీ దిమ్మరి జీవితమే అతన్ని మళ్లీ ఆహ్వానించింది. దానితో ఆ పల్లెవైద్యుడి వద్దనుంచి కొన్ని జార్ చక్రవర్తుల నాటి బంగారు నాణేలు దొంగిలించి పారిపోయాడు. ఆ డబ్బుని వాడు పుస్తకాలు, కాయితం రంగులకోసం వెచ్చించాడు. కొంతకాలం తెల్ల సముద్రంలో ఒక నౌకలో సహాయకునిగా పనిచేసి "దృష్టిలోపం కారణంగా" ఆ పని వదిలేశాడు. అక్కడినుంచి పెబోరీ వెళ్లి జరియన్లతో కలిసి జీవించాడు. ఆ భాష నేర్చాడు. అక్కడినుంచి ఉరల్ పర్వత శ్రేణులు దాటి అర్ఖంగెల్ చేరాడు. అక్కడ దొంగతనాలు సాగించాడు. అక్కడే సైన్‌బోర్డులు రాయడం, ప్రకృతిదృశ్యాలు చిత్రీకరించడం సాగించాడు. ఏడేళ్ల స్కూలు కోసం తయారవుతూ కళలు-చేతివృత్తుల వర్క్‌షాప్‌లో పనిచేశాడు. నకిలీ పత్రాలు సృష్టించి వాటి సాయంతో వ్యాత్కా ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ స్కూలులో చేరాడు. అక్కడ పరీక్షలో ఉత్తీర్ణులైన ప్రథమ బృందంలో ఇతనొకడు. ప్రతిభ గలవాడిగా గుర్తింపు పొందాడు. దానిని తను నమ్మలేకపోయాడు. అక్కడ విద్యార్థుల కమిటీకి ఎన్నికై సాంస్కృతిక కార్యకలాపాలు సాగించాడు. శీతాకాలం సెలవల్లో అతని నకిలీ పత్రాల వల్ల పోలీసులు అరెస్టు చేశారు. అధికారులు అతన్ని నేరస్థుల సంస్కరణా కేంద్రంలో కొంతకాలం ఉంచారు. అక్కడ అతను అనేక పుస్తకాలు చదివాడు. తరువాత కాలంలో అతను ఒక పత్రికా విలేఖరిగా మారాడు.

ఈ కథనంతో అతను గొప్పలకు పోకుండా, సానుభూతి ఆశించకుండా, జరిగినది జరిగినట్టు రాశాడు. మొత్తానికి ఈ కుర్రవాడు ప్రతిభావంతుడు. మళ్లీ పాతదారి తొక్కడని నా నమ్మకం. నేను విన్నది ఇదొక్కటే కథ కాదు. అటువంటి ఎన్నో కథలు చదివాను, విన్నాను.

అసలు ఈ అనాథ పిల్లలంతా ఎక్కడినుంచి వచ్చారు? వారంతా పశ్చిమ ప్రాంతాల శరణార్థుల పిల్లలు. యుద్ధం అక్కడి ప్రజానీకాన్ని కకావికలు చేసింది. వారు తలోదిక్కు పారిపోయి వచ్చారు. అంతర్యుద్ధం, అంటువ్యాధులు, కరువు మూలంగా దుర్మరణం పాలైన జనం సంతతివారంతా. వీధుల్లో, దిమ్మరి బతుకులలోని ఆకర్షణలకు లోనైన వారు పతనం అయారు. మనుగడ కొనసాగించడం కోసం పట్టుదలగా పోరాడినవారు నిలవగలిగారు. ఆత్మగౌరవానికి ఇబ్బంది రానంతవరకూ వారు ఏ పని అయినా చేసేందుకు ముందుకు వచ్చారు.దానికి సంబంధించిన క్రమశిక్షణకు కట్టుబడ్డారు. చదువుకొని బాగుపడాలనుకున్నారు, సాధించారు. సమిష్టి కృషి ప్రాధాన్యాన్ని గుర్తించి, దీనివలన కలిగే ప్రయోజనాలను అర్థం చేసుకొన్నారు. కచ్చితంగా వ్యవహరించే ఒక మంచి ఉపాధ్యాయుడు పిల్లల్లో 'సమిష్టి స్ఫూర్తి'ని కలుగచేయగలడు.ఇదే సమయంలో ఈ పిల్లలంతా ఎవరికివారు ప్రత్యేక వ్యక్తిత్వం గలవారిగా, సొంత శైలి కలిగిన మనుషులుగా కూడా రూపొందగలరు. పిల్లలను సున్నితంగా ఎదగనివ్వడం కుర్యాజ్ కాలనీ వాసులకు తెలుసనిపించింది. కొత్తగా కాలనీకి చేరే పిల్లల విషయంలో అక్కడి సీనియర్లు వ్యవహరించే పద్ధతిని చూస్తే ఇది బోధపడుతుంది. పెద్ద కుర్రవాళ్లు తమను ఆప్యాయంగా ఆదరించే ఒక కొత్త అనుభవం కొత్తగా ఇక్కడ చేరిన పిల్లలకు ఎదురవుతోంది. వీధుల్లో ఉన్న రోజుల్లో ఇటువంటి పెద్ద కుర్రవాళ్లు తమను ఇష్టం వచ్చినట్టు కొట్టడం, వేధించడం వారి పూర్వ అనుభవం. కాలనీలో పశువుల పోషణలో ఉన్న ఒక పిల్లవాడు కాలనీ బ్యాండు బృందంలో అద్భుతంగా మురళి వాయిస్తాడు. వాడు ఐదు నెలలపాటు కష్టపడి వేణుగానం నేర్చాడు. వాడు నాతో చెప్పాడు. "నేనిక్కడకు వచ్చినప్పుడు భయంతో వణికిపోయాను, ఎంతమంది పెద్ద కుర్రవాళ్లు! వీళ్లుకనక కొట్టడం మొదలుపెడితే ఇక దానికి అంతుంటుదా! అని బెదిరిపోయాను. కానీవారిలో ఒక్కరు కూడా ఎన్నడూ నాపై చెయ్యి చేసుకోలేదు."

ఈ పిల్లల మధ్య నేను ఎంతో సంతోషంగా గడిపాను. నేను స్వతహాగా పిల్లలతో మాట్లాడగలిగే వాడిని కాను. ఎక్కడేం పొరపాటు మాట్లాడతానో అనే భయంతో మౌనం పాటించేవాడిని. కానీ

కుర్యాజ్ కాలనీ పిల్లలలో ఉన్నప్పుడు నాకిటువంటి భయం కలుగలేదు. పైగా నేనసలు మాట్లాడవలసిన అవసరం పెద్దగా రాలేదు. ఎందుకంటే ఆ పిల్లలంతా చక్కగా మాట్లాడగలిగిన వారు, దానితోపాటు ప్రతి ఒక్కరికీ మాట్లాడవలసిన సంగతులు అనేకం ఉన్నాయి.

జీవితపు వొడిదుడుకుల్లో నలిగిపోయిన వందలాది పిల్లలకు మళ్లీ చదువు నేర్పి, వారిలో ఇటువంటి అనూహ్యమైన మార్పు తేగలిగినది ఎవరు? కాలనీ నిర్వాహకులు, సూపరింటెండెంట్ ఏ.ఎస్.మకరెంకో. నిస్సందేహంగా ఆయన మంచి విద్యా బోధకుడు. కాలనీ వాసులు ఆయన్ను ఎంతగానో ప్రేమిస్తారు. ఆయన తమ సొంతమనిషన్నట్టు ఎంతో గర్వంగా ఆయన గురించి మాట్లాడతారు. తీక్షణంగా చూసే కళ్లు, పెద్ద ముక్కు గల ఈ పెద్దమనిషికి వయసు నలభై పైనే. ఒకసారి ఆయన సైనికునిగానో, మామూలు పల్లెటూరి అధ్యాపకునిగానో అనిపిస్తారు. ఎప్పుడూ గొంతు బొంగురుపోయినట్టు మాట్లాడే మకరెంకో కదలికల్లో నెమ్మదితనం ఉంటుంది. కానీ ఆయన ఎప్పుడూ అందర్నీ గమనిస్తోనే ఉంటారు. కాలనీవాసులందరి గురించి ఆయనకు ఎంత బాగా తెలుసునంటే ఎవరి గురించైనా ఐదు ముక్కల్లో ఆయన చేసే వ్యాఖ్యానం ఆ పిల్లల వ్యక్తిత్వాలను కచ్చితంగా, ఒక ఫోటోలా ప్రతిబింబిస్తుంది. పిల్లలు ప్రతిఒక్కరితో ఆయన దయగా మాట్లాడతారు. చిరునవ్వుతో పలకరిస్తారు. ఆప్యాయంగా వారి తలలను తడతారు.

కాలనీలో పని గురించి, ఆహార సప్లైల గురించి, వేర్వేరు డిటాచ్‌మెంట్‌ల పనితీరులోని లోపాల గురించి, కొందరి నిర్లక్ష్యం, వాటి పొరపాట్ల గురించి చర్చించేందుకు జరిగే కమాండర్ల సమావేశంలో ఆంటన్ మకరెంకో ఎప్పుడూ అంటీముట్టనట్టుగా కూర్చుని అప్పుడప్పుడు ఒకటి, రెండు మాటలు మాట్లాడతారు. సాధారణంగా అవి మందలింపులే అయి ఉంటాయి. కానీ ఆయన వారిలోనే ఒక సీనియర్ కామ్రేడ్‌గా ఈ వ్యాఖ్యలు చేస్తారు. కాలనీ పిల్లలు ఆ పాటలని శ్రద్ధగా వింటారు. అవసరమైతే ఆయనతో వాదించేందుకు వెనుకాడరు. ఈ ఇరవై నాలుగు మంది కమాండర్లూ ఆయన తోవలోనే ఇరవై అయిదవ మనిషిగా పరిగణిస్తారు. అయితే తమకంటే అనుభవం, తెలివితేటలు గల వ్యక్తిగా గౌరవిస్తారు.

ఆయన ఈ కాలనీలో సైనిక పాఠశాలల పద్ధతులు ప్రవేశపెట్టారు. దీనిలో ఉక్రెనియన్ విద్యాశాఖ అధికారులతో ఆయనకు విభేదాలు తలెత్తాయి. ఆయన విధించిన క్రమశిక్షణ ప్రకారం కాలనీ ఆవరణ ఉదయం ఆరుగంటలకల్లా బగిల్ నాదం ప్రతిధ్వనిస్తుంది. ఉదయం పలహారాల అనంతరం ఏడు గంటలకు మరో సంకేతం వినిపిస్తుంది. అప్పుడు కాలనీవాసులంతా ఆవరణ మధ్యలో గుమిగూడతారు. మకరెంకో ఆ శ్రేణులను ఉద్దేశించి క్లుప్తంగా మాట్లాడతారు. ముఖ్యంగా ఆ రోజు చేయవలసిన పనిని వివరిస్తారు. కమాండర్ల మండలి తీర్మానం ప్రకారం ఎవరినైనా మందలించవలసివస్తే ఆయన ఆ పని చేస్తారు. తరువాత కమాండర్లు తమ డిటాచ్‌మెంట్‌లలో తమకు అప్పగించిన పనులను నిర్వర్తించేందుకు తరలి వెళ్తారు. ఈ తతంగం పిల్లలని బాగా ఆకట్టుకుంటుంది. ప్రతిరోజూ ఇదొక ఉత్సవంలా జరిగేది.

పిల్లల దృష్టిలో మరింత మహోత్సవం ఏమిటో నేను స్వయంగా చూశాను. తామే, తమ వర్క్‌షాపులో తయారుచేసిన ప్యాకేజి పెట్టెలను ఐదు బళ్లలోసర్ది వాటిని కొనుగోలు చేసిన ఫ్యాక్టరీకి పంపే తరుణాన్ని సైతం వారొక సంబరంలా జరుపుకున్నారు. కాలనీ బ్యాండు వాయిద్యం అనంతరం ప్రసంగాలు సాగాయి. శ్రమకు గల ప్రాధాన్యం, అది సృష్టించే ప్రత్యేక సంస్కృతి గురించి వక్తలు మాట్లాడారు. స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో సాగే సమిష్టి కృషి మాత్రమే ప్రజలకు సరైన న్యాయాన్ని చేకూరుస్తుందని, అలాగే వ్యక్తిగత ఆస్తులు రద్దయినప్పుడు ప్రజల మధ్య స్నేహం,

సౌభ్రాతృత్వం పెంపొందుతాయనీ చెప్పారు. తామే స్వయంగా తయారుచేసిన సామాగ్రి అలా బల్లకు ఎక్కుతున్నప్పుడు నాలుగు వందల జతల కళ్లు ఆ తతంగాన్ని గర్వంగా, చిరునవ్వుతో చూస్తున్న దృశ్యం ఎవరికైనా భావోద్వేగం కలిగించక తప్పదు. మకరెంకో శ్రమ విలువ గురించి ప్రశాంతంగానే అయినా శక్తివంతంగా పిల్లలకు వివరించగలరు. అందుకాయన భారీ పదజాలాన్ని ఉపయోగించరు కూడ. తన కాలనీవాసులు రాసుకున్న ఆత్మకథలకు ఆయన రాసిన క్లుప్తమైన ఉపోద్ఘాతం ఆయన తత్వాన్ని గురించి బాగా వివరించగలదు.

"పిల్లలు రాసిన దానితో నూరవ ఆత్మకథను టైప్ చేస్తున్నప్పుడు నేనొక అద్భుతమైన పుస్తకాన్ని చదువుతున్నాననే సంగతి హఠాత్తుగా నాకు స్ఫురించింది. నిర్దాక్షిణ్యంగా, సులభమైన మాటల్లో పిల్లలు అనుభవిస్తున్న దారుణమైన వేదనను ఈ కథలు వివరిస్తున్నాయి. పాఠకుల్లో ఉద్వేగాన్ని రేపే ప్రయత్నం కానీ, నాటకీయత కానీ మొత్తంమీద ఎక్కడా ఒక్క మాటలో కూడా కనిపించలేదు. పరిసరాల నుంచి శత్రుభావం తప్ప, సానుభూతి అన్నది ఏనాడూ పొందని ఆ పరిస్థితి పట్ల ఎటువంటి నిరసన వ్యక్తం చేయకుండా ఒంటరితనంలో మగ్గే అనాథబాలలు పూర్తి నిజాయితీతో మన ముందుంచిన కథ ఇది. ఇది మన కాలనీకి సంబంధించిన విషాదం. కానీ ఈ విషాదం మనకే గోచరమవుతుంది. కాలనీవాసులకిది నిజానికి పెద్ద విషాదం కాదు. ఎందుకంటే బయటి ప్రపంచంతో వారి సంబంధంలోని వాస్తవం ఎప్పుడూ ఇదే కనుక. బహుశా నాకు ఈ విషాదం మరెవరికంటే ఎక్కువ బాధను మిగిల్చిందేమో. ఎందుకంటే ఎనిమిదేళ్లుగా నేను ఈ పిల్లల వేదనను ప్రత్యక్షంగా చూడడమే కాక, నైతికంగా వారెంత పతనమయారో కూడా గమనిస్తూ వచ్చాను. కేవలం వారి పట్ల జాలి, సానుభూతి మాత్రమే చూపి చేతులు దులుపుకునే హక్కు నాకు లేదు. వారిని వారి కష్టాల నుంచి గట్టెక్కించాలంటే నేను నిరంతరం కఠినంగా, కచ్చితంగా వ్యవహరించి తీరాలి. ఇదీ నా అసలు విషాదం. పిల్లలు రాసుకునే ఈ కథలు చదువుతుంటే ఆ విషాదం మరింత ఉధృతమైంది. ఇది మనందరి విషాదం కూడా. దీనిని పట్టించుకోకుండా ఉండే హక్కు మన కెవరికీ లేదు."

కుర్యాజ్‌లో కాలనీతో పాటు నేను, ఖార్కోవ్ సమీపంలోని జర్జిన్‌స్కీ కమ్యూన్‌ను కూడా సందర్శించాను. అక్కడ కేవలం వంద నూట ఇరవైమంది పిల్లలే ఉన్నారు. బాల నేరస్థులు, అనాథలు, సమాజానికి ప్రమాదకరమైన వారు అయిన పిల్లల కోసం పనిచేసే శ్రామిక కాలనీ ఎలా ఉండాలో చూపేందుకే ఆ కమ్యూన్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా నిర్మించిన రెండంతస్తుల భవనం అది. అక్కడగల మూడు వర్క్‌షాపుల్లో ఆధునిక యంత్రాలు, అమూల్యమైన పరికరాలు ఉన్నాయి. గాలీ, వెలుతురూ బాగా వచ్చేలా పెద్ద పెద్ద కిటికీలు, లోపల అనేక దీపాలతో ప్రకాశవంతంగా ఉంది. పిల్లలంతా సౌఖ్యవంతంగా ఉండే పెద్ద ఓవరాల్స్ ధరించారు. మంచి మంచాలతో డార్మెటరీ విశాలంగా ఉంది. అన్ని సౌకర్యాలతో స్నానాల గదులు, పరిశుభ్రంగా ఉన్న చదువుకునే గదులూ అనేకం ఉన్నాయి. అందులోనే ఒక అసెంబ్లీ హాల్, పెద్ద గ్రంథాలయం, భారీ సంఖ్యలో స్కూలు సప్లైలు అక్కడ కనిపించాయి. ఏ విధంగా చూసినా ప్రదర్శనకు పెట్టదగ్గ ఆదర్శ కాలనీ అది. చివరకు కమ్యూన్‌వాసులు కూడా 'ప్రదర్శన కోసమే' అన్నట్టు ఎంతో ఆరోగ్యంగా కళకళలాడే పిల్లలే. పిల్లల కాలనీల నిర్వాహకులు ఈ కమ్యూన్ నుంచి ఎన్నో విషయాలు నేర్చుకోగలరు.

✣ ✣ ✣

మా గురువు మకరెంకో

- సెమ్యోన్ కలాబలిన్

1920లో చాలా అసాధారణమైన పరిస్థితుల్లో అంటే బాల్యంలో నేను చేసిన నేరాలకు గాను జైల్లో ఉన్నప్పుడు తొలిసారిగా ఆంటన్ సెమ్యోనోవిచ్ మకరెంకోను కలుసుకున్నాను. ముప్పై నాలుగేళ్ల క్రితం సంగతి అది. అయినా నాటి ప్రతి సంఘటన ప్రతి క్షణం నాకు గుర్తున్నాయి.

అదెలా జరిగిందంటే, ఒకరోజు జైలు గవర్నర్ నాకు కబురు చేశారు. ఆయన గదికి వెళ్లినప్పుడు అక్కడ ఒక కొత్త వ్యక్తి కనిపించారు. గవర్నర్ పక్కనే బల్లని ఆనుకున్న ఒక కుర్చీలో కాలు మీద కాలు వేసుకుని కూర్చుని ఉన్నారాయన. నలిగిపోయిన పెద్దకోటు ధరించారాయన. పెద్ద తల, విశాలమైన నుదురు, పొడవాటి ముక్కు, దాని చివర నిలిచిన కంటి అద్దాలు, వాటి వెనకనుంచి తెలివితేటలు ఉట్టిపడుతున్న తీక్షణమైన కళ్లు నా వంకేదో శోధిస్తున్నట్టు దయగా చూస్తున్నాయి. ఆయనే ఆంటన్ సెమ్యోనోవిచ్ మకరెంకో.

"అయితే నువ్వేనన్నమాట సెమ్యోన్ కలాబలిన్ అంటే" అని ఆయన నాతో అన్నారు.

నేను తల ఊపాను.

"నువ్వు నాతో రావడానికి సిద్ధంగా ఉన్నావా?"

నేను ఆయన వంక, జైలు గవర్నర్ గారి వంక చూశాను. ఎందుకంటే నా నిర్ణయానికి ఆయన అనుమతి అవసరం. ఆంటన్ సెమ్యోనోవిచ్ కొనసాగించారు.

"నాకు అర్థమైంది. నేను స్వయంగా మీ గవర్నర్‌తో మాట్లాడి ఏర్పాటు చేస్తాను. సరే, సెమ్యోన్ దయచేసి ఒక నిమిషం బయటికి వెళ్తావా?" అంటూ గవర్నర్ వంక చూశారు.

"అవును, నువ్వు బయట ఉండు" అన్నారు నాతో గవర్నర్.

నేను బయటికి నడిచాను.

నేను బయట వార్డర్‌తో కలిసి నుంచుని ఆయన అన్న మాటలని గుర్తు తెచ్చుకున్నాను వెక్కిరింతగా "సెమ్యోన్ దయచేసి ఒక నిమిషం బయటికి వెళ్తావా?" నాకేం అర్థం కాలేదు. అటువంటి మాటలు నాకు పూర్తిగా కొత్త మరి. ఏమైనా వింతమనిషే.

కొద్దిసేపటి తరువాత మళ్లీ గదిలోకి పిలిచారు. ఆంటన్ సెమ్యోనోవిచ్ నిలబడి ఉన్నారు.

"సరే సెమ్యోన్ నీ వస్తువులు ఏమన్నా ఉన్నాయా?"

"ఏమీ లేవు."

"మంచిది" అని గవర్నర్ వైపు తిరిగి "మేం ఇక తిన్నగా వెళ్లిపోవచ్చా?" అని అడిగారు.

"వెళ్లవచ్చు" అంటూ గవర్నర్ నా వంక తిరిగి "గుర్తుంచుకో కలాబలిన్ –" అంటూ ఏదో చెప్పబోయారు.

మకరెంకో ఆయన్ను అడ్డుకున్నారు. "పర్వాలేదు, అంతా సవ్యంగా జరుగుతుంది. వెళ్తాం మరి. రా సెమ్యోన్" అన్నారు మకరెంకో.

జైలు తలుపులు బార్లా తెరుచుకున్నాయి. మకరెంకోతో కలిసి నా అత్యంత ఆనందదాయకమైన నా జీవనపథంలో అడుగుపెట్టాను.

పదేళ్ల తరువాత, నేను ఆయన సహాయకుల్లో ఒకరిగా ఎదిగిన తరువాత కానీ ఆ రోజు జైలు గవర్నర్ గది నుంచి నన్ను కొద్దిసేపు ఎందుకు బయటికి పంపారో మకరెంకో నాకు చెప్పలేదు.

"నిన్ను నా ఆధీనంలోకి తీసుకుంటున్నట్టు గవర్నర్‌కు పత్రం రాసి ఇచ్చాను. అది నీకు తెలిస్తే అవమానకరంగా భావిస్తావు" అందుకేనని వివరించారు.

విద్యాశాఖ కార్యాలయం వైపు నడుస్తున్నప్పుడు నేను ఆయనకంటేఒక అడుగు ముందు నడిచేందుకు ప్రయత్నించాను. అందువల్ల ఆయన నాపై ఒక కన్ను వేసి ఉంచగలరనీ, అంతేకాక ఆయననుంచి పారిపోయే ఉద్దేశం నాకు లేదనీ చెప్పడం నా ఉద్దేశం. కానీ ఆయన నన్ను తనతోపాటే నడవనిచ్చారు. కాలనీ గురించి, దాని నిర్వహణ బాధ్యతల్లోని కష్టం గురించి ఆయన నాతో కథలు కథలుగా చెప్పారు. జైలు, నా గతం తప్ప ప్రపంచంలోని అన్ని విషయాలూ ఆయన నాతో ప్రస్తావించారు.

విద్యాశాఖ ఆవరణలోకి ప్రవేశించిన తరువాత కాలనీ గుర్రబ్బండిని నాకు అప్పగించారు. నాకు ఏదో పని చెప్పారు. నేను నివ్వెరపోయాను. ఆయన అదేం పట్టించుకోకుండా "నీకు చదవడం, రాయడం వచ్చా" అని అడిగారు.

"వచ్చు".

"మంచిది" అంటూ ఆయన జేబులోంచి ఒక కాగితం తీసి నాకు ఇచ్చారు. (సరఫరాల విభాగానికి వెళ్లి) "నాకు కావలసిన ఈ సరకులు తీసుకురా. ఆ పని చేసేందుకు నాకు వ్యవధి లేదు, ఇవాళంతా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి ఉంది. అదీకాక దుకాణదారులతో పని అంటే నాకు చిరాకు. వాళ్లు నన్ను తప్పనిసరిగా మోసం చేస్తారు, తక్కువ తూకాలు, చిల్లర ఇవ్వడంలో మోసం.. ఇవన్నీ చిరాకు. ఈ పని నువ్వే బాగా చేయగలవు" అన్నారు.

దిగ్భ్రాంతి చెందిన నేను సమాధానం చెప్పేలోపే ఆయన గబగబా నడిచి వెళ్లిపోయారు. అర్థం కాలేదు. ఎంతటి అవకాశం! జైలునుంచి వస్తున్నాను. ఈయనేమో నన్ను నమ్మి (కాలనీ కోసం) రొట్టె, చక్కెర తెచ్చే బాధ్యత నాకు అప్పగించారు! ఇదేమన్న పరీక్షా? ఇందులో ఏదన్నా మతలబు వుందా? అక్కడే నిలబడి కొంతసేపు ఆలోచించాను. ఆయన కొంచెం తేడా మనిషి అనిపించింది. లేకపోతే నాబోటి వాడిపై ఈ నమ్మకం ఏమిటి?

నేను సామాన్ల విభాగంలోనికి వెళ్లినప్పుడు, అక్కడున్న పెద్దమనిషి నన్ను అడిగాడు. "సరుకులు నువ్వే తీసుకెళ్తావా? నువ్వెవరో తెలుసుకోవచ్చా?" అని.

"అది నీకే తెలుస్తుందిలే" అంటూ సరకుల విడుదల ఆదేశాల పత్రం అతనికి ఇచ్చాను. సరుకులన్నీ తీసుకుని నా బండిపై అమర్చాను. ఈలోగా మకరెంకో వచ్చారు. పని పూర్తయిందని గ్రహించి ఇక వెళ్దాం పదమన్నారు.

నా అరుపులు, చెర్నకోల చరుపులు, నోటితో చేసే శబ్దాల ఫలితంగా ఆ ముసలిగుర్రం కదిలింది. మా బండి విద్యాశాఖ కార్యాలయం దాటి దాదాపు రెండు వందల మీటర్లు వచ్చిన తరువాత మకరెంకో బండిని ఆపమని ఆదేశించి నాతో అన్నారు.

'చెప్పడం మరిచాను, సరుకులు తీసుకోవడంలో చిన్న పొరపాటు జరిగింది. వాళ్లు పొరపాటున మనకు రెండు రొట్టెల ప్యాకెట్లు ఎక్కువ ఇచ్చారు. దయచేసి వాటిని వెనక్కు తీసుకెళ్లి ఇచ్చెయ్యి. లేకపోతే ఆ సరుకుల విభాగం మనిషి పెద్ద అల్లరి చేస్తాడు. నీకోసం నేనిక్కడ ఎదురుచూస్తుంటాను.' అని అన్నారు.

నా మొహం సిగ్గుతో కాలిపోతున్నట్టు అనిపించింది. ఏం జరిగింది? ఇలా నాకెన్నడూ జరగలేదు. బండిమీద నుంచి కిందకి దూకాను. బండిలో పరచిన గడ్డి కింద నుంచి రెండు రొట్టెల ప్యాకెట్లు

తీసి, వెనక్కు దుకాణం వైపు నడిచాను. నా బుర్రలో ఆలోచనలు మెదులుతున్నాయి. ఈయన ఎటువంటి మనిషి. తాను మోసపోయానని స్వయంగా చెబుతున్నాడు. ఈ దుకాణదారులపై ఎలా పగ తీర్చుకోవాలి? రెండు రొట్టెలంటే పెద్ద సంగతేం కాదు. వాడు బహుశా 'ఫర్వాలేదు తీసుకుపో' అంటాడనుకున్నాను

అయితే దుకాణదారు నాకు కృతజ్ఞతలు తెలిపాడు. "ఏదో పొరపాటు జరిగిందనుకున్నాం. అదే సర్దుబాటు అవుతుందనుకున్నాం. ఏమైనా కృతజ్ఞతలు" అన్నాడాయన.

నేను వాడివంక చిరాగ్గా చూసి బయటికి నడిచాను.

నేను బండిని సమీపించగానే మకరెంకో నన్ను మందహాసంతో పలుకరించారు. "ఇవిగో ఈ పప్పులు తిను. ఇవంటే నాకెంతో ఇష్టం" అంటూ వేయించిన పొద్దుతిరుగుడు గింజలు గుప్పెడు నా చేతిలో పెట్టారు.

రొట్టె గురించి మాట్లాడనేలేదు. కానీ లోలోపల ఆయన ఈ విధంగా ఆలోచించి ఉండవచ్చు. "నేను నిన్ను నమ్మాను. నా పలుకుబడి, ప్రతిష్ట ఉపయోగించి జైలునుంచి బయటకు తీసుకు వచ్చాను. కానీ కేవలం రెండు రొట్టెల విషయంలో నువ్వు నా పరువు తీశావు.."

కానీ ఆయన అలా అనలేదు.అలా అనుకుంటున్నట్టు ప్రవర్తించలేదు. నన్ను మందలించక పోవడం ద్వారా ఆయన నా గురించి నేను మరోసారి అంచనా వేసుకొనేలా చేయలేదు. నా దృష్టిలో రొట్టెలు దొంగలించడం ప్రతీకార న్యాయం. కానీ ఆయన నేను అలా ఆలోచించే అవకాశం ఇవ్వలేదు ఆయన కనుక నన్ను మందలించి ఉంటే ఇద్దరం కలిసి కాలనీదాకా వెళ్లే వాళ్లమా అనే అనుమానం నాకిప్పటికీ ఉంది.

ఇతర సందర్భాల్లో వేరే వారి విషయంలో కూడా ఆంటన్ సెమ్యోనోవిచ్ అలాగే ప్రవర్తించారు. ఒకసారి హాస్యంగా, ఒకసారి కఠినంగా తన వ్యతిరేకత వ్యక్తపరుస్తూ, ఒక్కొక్కసారి దురాగ్రహం వ్యక్తంచేసి పిల్లల్లో భయం రేకెత్తిస్తూ, ఇలా ప్రతి సందర్భంలోనూ వేర్వేరుగా వ్యవహరిస్తూ ప్రతిసారీ ఒక కొత్త పద్ధతుల్లో తన భావాలను ప్రకటిస్తూ, ఎన్నడూ తన భావ వ్యక్తీకరణలను పునరావృతం కానివ్వకుండా ఎప్పటికప్పుడు ఆయా సందర్భాలకు తగినట్టుగా ప్రవర్తించడం ఆయన సహజ లక్షణం. అయితే ఈ క్రమంలో ఆయన ఎప్పుడూ నిజాయితీగా ఉంటూ ఎదుటివారిని వొప్పించగలిగేవారు.

(కాలనీ పరిసర గ్రామంలో) అక్రమ సారా బట్టీలపై దాడులు నిర్వహించినప్పుడు, అందుకు ఆయన ఎంపిక చేసిన బృందంలో దాదాపు ప్రతిఒక్కరూ రహస్యంగా తాగుబోతులే. చాలాసార్లు పట్టుబడ్డవారే. దోపిడీలు చేసి పట్టుబడి కాలనీకి వచ్చిన కుర్రవాళ్లనే ఆయన దారిదోపిడీలను నిరోధించే బృందంగా ఏర్పాటు చేశారు. ఆయన అనుసరించిన ఈ పద్ధతులు మమ్మల్ని తరచు దిగ్భ్రాంతికి గురి చేసేవి. చాలా ఏళ్ల తర్వాత కానీ ఆయన ఎంత తెలివిగా, వ్యూహాత్మకంగా మమ్మల్ని విశ్వసించి రంగంలో దింపేవారో అర్థం కాలేదు. దీనిద్వారా మీలో నిద్రావస్థలో ఉన్న ఉన్నత మానవతా విలువలను ఆయన ఉత్తేజితం చేశారు.

మకరెంకో ఆఫీసు గది ఎప్పుడు రద్దీగా ఉండేది. కాలనీ వ్యవహారాల్లో సంప్రదింపులకేకాక, సొంత విషయాలు మాట్లాడేందుకు కూడా కాలనీవాసులు ఆయన దగ్గరకు వెళ్లేవారు. ప్రతివారి సమస్యనూ మకరెంకో పట్టించుకొనేవారు. ఒక్కొక్కసారి ఆయన అంటీముట్టనట్టుగా, గంభీరంగా మాట్లాడేవారు. ఒక్కోసారి తేలికగా, హాస్యంతో విషయాన్ని తీర్చేసేవారు. ఇది నాకు అనుభవమైంది.

1921లో ఓల్గా అనే యువతితో నేను గాఢమైన ప్రేమలో పడ్డాను. ఈ విషయాన్ని నేను తండ్రిలా పరిగణించే మకరెంకోకు తొలిసారిగా చెప్పాను. ఆయన నేను చెప్పింది విన్నారు. తరువాత తన కుర్చీలోంచి లేచి నా భుజాలపై చేతులుంచి "కృతజ్ఞతలు సెమ్యోన్. నువ్వు నాకెంతో సంతోషం కలిగించావు. కృతజ్ఞతలు" అన్నారు.

నాకు అర్థం కాలేదు. "ఎందుకు ఆంటన్ సెమ్యోనోవిచ్?" అని అడిగాను.

"నువ్వు నన్ను ఇంతగా విశ్వసించావు. ఇది నీ సొంత వ్యవహారం, చాలా రకాల జనం ఉన్నారు. ఎవరో ఒకరికి నువ్వీ విషయం చెప్పి ఉండవచ్చు. కానీ నువ్వు నాకు చెప్పావు. పోతే నువ్వేం ప్రత్యేకమైన మనిషి కాదని తెలియచేశావు. ప్రతివారికీ ప్రేమ అత్యంత ప్రత్యేకమైనది. అది అందరికీ సాధారణం. దీని ద్వారా నువ్వు కూడా అతి సాధారణమైన, మామూలు చక్కటి మనిషివని తేలింది. ఇక నీ ప్రేమ గురించి; దాన్ని వృధా చేయక. అబద్ధాలతో, వాంఛలతో దాన్ని మలినం చేయకు. అందంగా, హాయిగా, పూర్తిగా ప్రేమించు. నువ్వు ఈ విషయం తెలిపిన తరువాత నాకు నా మామూలు పని చేయబుద్ధి కావడం లేదు. రా ఇద్దరం కలిసి భోజనం చేద్దాం" అన్నారాయన.

ఆయన నన్ను భయపెట్టలేదు. నేనేదో తప్పు చేశాననే భావాన్ని కలుగనివ్వలేదు. నన్ను మందలించి నా ప్రేమను తక్కువ చేయలేదు. అవమానించలేదు. నిర్లిప్తంగా ఉండిపోలేదు. వేళాకోళం చేయలేదు. 1924లో సెలవులకు కాలనీకి వచ్చినప్పుడు ఓల్గా నన్ను కాదు మరొకరిని పెళ్లాడబోతోందని తెలిసింది. ఓల్గా ఉండే గ్రామానికి మూడు కిలోమీటర్లు పరుగెత్తుకెళ్లాను. అది నిజమేనని తేలింది.

సాయంత్రం ఆలస్యంగా కాలనీకి తిరిగివచ్చాను. ఆంటన్ సెమ్యోనోవిచ్‌ని కలుసుకున్నాను.

"ఏమైంది సెమ్యోన్ వంట్లో బాగోలేదా?"

"తెలియదు. బహుశా బాగోలేదనుకుంటాను."

"డార్మెటరీకి వెళ్లి పడుకో. నేను ఆసుపత్రి నుంచి ఎలిజావెటాను పంపుతాను."

"అవసరం లేదు. ఏ మందులూ నాకు సాయపడలేవు. ఓల్గా నన్ను తిరస్కరించింది.

మరొకరిని వివాహమాడుతోంది. ఆదివారం పెళ్లి. వాళ్లు మన కాలనీవాసులని నమ్మడం లేదు."

"నిజమేనా?"

"అవును, అంతా ఖాయమైపోయింది. తనతో జీవితాంతం కలిసి ఉందామనుకున్నాను. కానీ..." అంటూ బావురుమని ఏడిచాను.

"క్షమించు సెమ్యోన్. కానీ నాకు అర్థం కావడం లేదు. మూడు నెలల క్రితమే ఓల్గాతో నేను మాట్లాడాను. తను నిన్ను ప్రేమిస్తోంది. ఎక్కడో పొరపాటు జరిగింది."

"పొరపాటేమీ లేదు. పెళ్లి నిశ్చయమైపోయింది. నాపై కోపం తెచ్చుకోవద్దు. ఇలా అంటున్నానని వేరేలా అనుకోవద్దు. తను లేకుండా నేను బతకలేను... ఉరి వేసుకుని చస్తాను."

"అరే! పిచ్చా ఏమిటి?"

"పిచ్చికాదు ఇక బతికేందుకు నాకేం మిగల్లేదు."

"అలాగా, అయితే ఫో." పోయి ఉరివేస్కో. చవటా. కానీ చిన్న సాయం చెయ్యి. కాలనీకి దూరంగా ఎక్కడో ఉరివేస్కో. కనీసం ప్రేమతో కుళ్లిన నీ శవం కంపు మాకు రాదు."

మకరెంకో ఆగ్రహంగా తన బల్లమీది వస్తువులని కదిపారు. ఆయన మాటల తక్షణ ప్రభావం ఏమిటంటే, ఇకనాకు చావాలనిపించలేదు. ఆయన నా పక్కన సోఫాలో కూర్చున్నారు. ప్రేమతో

నా హృదయాన్ని, గుండెనీ కమ్ముకున్నారు. తరువాత ఇద్దరం కలిసి నక్షత్రాల పందిరి వంటి ఆకాశం కింద కూర్చుని మాట్లాడుకున్నాం. అందమైన జీవితం గురించి, అద్భుతమైన భవిత గురించి ఆయన ఎన్నో చెప్పారు.

ఆంటన్ సెమ్యోనోవిచ్ సమున్నతమైన మానవతా విలువలు కలిగిన వ్యక్తి. ఆయన నుంచి ఎవరైనా నేర్చవలసిన సంగతులు అనేకం ఉన్నాయి. ఆయన రాసిన ఈ గ్రంథం గోర్కీ కాలనీలో నిజంగా నివసించిన మనుషుల గురించి. ఆయన కొందరి పేర్లు మాత్రం మార్చారు. పుస్తకం చివరిలో మకరెంకో తన విద్యార్థుల భవిష్యత్తు జీవితం గురించి రాశారు. ఆ రోజుల్లో ఆ కాలనీలో పెరిగిన వారంతా, అనాథలు, నేరస్థులు - అందరూ జీవితంలో ఎదిగారు. కార్మికులు, ఇంజనీర్లు, వ్యవసాయ నిపుణులు, వైద్యులు, పైలట్లు, టీచర్లు అయ్యారు. చాలామంది కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలై మహత్తర దేశభక్తియుత యుద్ధంలో పోరాడారు. ప్రస్తుతం దేశం కోసం, దాని ప్రగతి కోసం కృషి చేస్తున్నారు. ఇవాన్ కోలోస్ (పుస్తకంలో గోలోస్) ఒక ఇంజనీరుగా పని చేస్తున్నాడు. నికొలాయ్ షెర్షనెవ్ (వెర్షనెవ్) ఒక డాక్టరు, పావెల్ ఆర్ఖన్‌గెలెస్కీ (జదరోవ్) మిలటరీ ఇంజనీరింగ్ విభాగంలో లెఫ్టినెంట్ కల్నల్. వాసిలాక్లుష్నిక్ (క్లుష్కేవ్) సోవియట్ సేనల్లో ఒక అధికారి. చాలామంది యుద్ధంలో మరణించారు. యుద్ధంలో తీవ్రంగా గాయపడిన లెఫ్టినెంట్ కల్నల్ గిగారి సుప్రూన్ (బరున్) కూడా 1954లో మరణించాడు.

ఆంటన్ సెమ్యోనోవిచ్ ఎప్పుడూ అనేవారు. మనిషి ఎప్పుడూ విశిష్టమైన వ్యక్తిగా ఉండాలని. ఆ విశిష్టత గల మహా మనిషి ఆంటన్ సెమ్యోనోవిచ్ మకరెంకో. తన ఆధీనంలోని పిల్లలంతా అటువంటి వ్యక్తిత్వం గలవారిగా తయారయేందుకు ఆయన చేయగలిగినదంతా చేశారు.

✤ ✤ ✤

1920 సెప్టెంబర్‌లో నాకు విద్యాశాఖ చీఫ్ నుంచి రమ్మని ఆదేశాలు అందాయి. వెళ్లాను.

"చూడు మిత్రమా" అంటూ పలకరించాడాయన. "మీ స్కూలు కోసం కేటాయించిన ఆర్థిక మండలి విభాగం వారి భవనం గురించి ఏదో గోల చేస్తున్నావట. ఏంటి?"

"అది స్కూలా! ఆ చెత్తకొంపని మీరు స్కూలు భవనం అంటున్నారా? స్కూలు అంటే అదేనని మీ అభిప్రాయమా? చాలు! చాలు! తలుచుకుంటేనే ఒళ్లు భగ్గుమంటోంది".

"సరే... నాకు తెలుసు. ఎలా వుంటే మీకు నచ్చుతుందో? ఓ కొత్త బిల్డింగ్ కట్టి అందులో సరికొత్త బెంచీలు వేస్తే మీరు హాయిగా వెళ్లిపనిచేస్తారు. కానీ మిత్రమా... స్కూలు భవనం ఎలా ఉందనేది సమస్య కాదు. ఒక నూతన మానవుడిని సృష్టించడం...నవతరాన్ని ఎదగనివ్వడం... అదీ ముఖ్యం. మరి మీరేమంటారు? ఆ భవనం బాగాలేదు. బల్లలు సరిగా లేవు అంటూ గోలచేస్తారు. ఫ్చ్... లాభం లేదు. మీకు సరైన స్ఫూర్తి - విప్లవ స్ఫూర్తి లేదు. చొక్కా నలక్కుండా డాబుగా పనిచేయాలని మీ ఉద్దేశం కదూ?"

"చాల్చాలు... నేను వైట్‌కాలర్ మనిషినా? ఎంత మాత్రం కాదు."

"సరే.. మీరు అలాంటివారు కారు. కానీ మీరంతా పనికిమాలిన మేధావుల మూక. కానీ నా బాధ్యత మాటేమిటి? పనిచేసేవాడి కోసం నేను వెదుకుతున్నాను. ఎంత పని ఉందని! ఇల్లు వాకిలీ లేని అనాథ పిల్లలు రోజురోజుకీ పెరుగుతున్నారు. ఇప్పుడు అటువంటి వారి కోసం వీధుల్లో వెదకనవసరం లేదు. అంతగా వారి సంఖ్య పెరుగుతోంది. వాళ్లిప్పుడు ఇళ్లను దోచుకునేందుకు సిద్ధపడుతున్నారు. నాకేమో పైనుంచి గూటింపులు... వాళ్లను దారిలో పెట్టడం నీ పని అంటూ అధికారులు బాధ్యతంతా విద్యాశాఖపైకి నెట్టి చేతులు దులుపుకుంటున్నారు. అందుకు సాయపడవలసిన మీబోటివారు మాత్రం హాయిగా చదువుకోవడానికి, సుఖంగా రోజులు గడపడానికి అవకాశం కోసం తాపత్రయపడుతున్నారు."

నాకు నవ్వొచ్చింది.

"ఇదో ఆరోపణా?" అడిగాను.

"అవును. మీ అందరికీ కావాల్సింది సుఖం. మీ పుస్తకాలేవో చదువుకుంటూ కడుపులో చల్ల కదలకుండా రోజులు గడిపెయ్యాలి. అంతేగా? నిజమైన మనిషికి సంబంధించిన సమస్య ఎదురైతే చాలు. వణికిపోతారు."

విద్యాశాఖ ప్రధానాధికారి చూపులు ఆయన కళ్లజోడు నుంచి నన్ను గుచ్చుకుంటున్నాయి. అదే ఉగ్రమైన ధోరణిని ఆయన కొనసాగించారు. "అమెరికాలో అప్పుడెప్పుడో ఏర్పాటుచేసిన సంస్కరణ కేంద్రాల్లాంటివి కావాలని మీ అభిప్రాయంలా ఉంది. విప్లవానికి పూర్వం అలాంటివి మనకీ ఉండేవి. అవి ఇప్పుడు కుదరవు. అలాంటివి పనికిరావు."

కష్టపడి సందు చూసుకుని నోరు విప్పాను. "అవును అలాంటివి మనకు కుదరవు. కొత్త తరహా పద్ధతులు కావాలి. అవి ఎలాంటివో నాకు తెలియదు" వివరించాను.

ఒప్పుకున్నాడాయన. "అవును. మీకు తెలీదు. చెప్పేవాళ్లు, చెప్పగలిగేవాళ్లు విద్యాశాఖలో ఉన్నారు."

"వారు చెప్తారుగానీ, ఏమీ చేయరుగా" నా అనుమానం.

"అవును. వాళ్లేమీ చేయరు" అంగీకరించాడు.

"వాళ్లేమీ చెప్పరు. మేం చెప్పిందంతా తప్పంటారు. మీరేమో వాళ్లనే సమర్థిస్తారు." అంటూ దాడి ప్రారంభించాను.

రాజీకొచ్చాడాయన. "అలా అనను. మీ పద్ధతులు మీవి. మనకు కావాల్సింది ఫలితం. కానీ మీకు తెలుసుగా. మనకు కావాల్సింది సామాజిక విద్య. మనలాంటి మనిషిని, ఈ తరహా స్కూల్లో సృష్టించగలగాలి. అదీ సంగతి."

"బానే వుంది. దానికి ఓ స్థలం అంటూ ఉండాలిగా. ఉందా?"

నవ్వాడాయన. "కంగారుపడవద్దు. అటువంటి ప్రదేశం ఉంది. ఇదివరకు అక్కడ బాలనేరస్థుల సంస్కరణ కేంద్రం ఉండేది. ఇక్కడ్నుంచి ఆరు కిలోమీటర్లు. అడవి, పొలాలు... ఆవులు కూడా ఉంటాయి. బండి కావాలేమోగా?" అంటూ డ్రాయర్ సొరుగులోంచి ఒక నోట్లకట్ల తీసి ఇచ్చాడు.

మొత్తానికి సమస్య తీరింది స్కూలు పేరుతో ఇచ్చిన చెత్త భవనాన్ని వదిలించుకోగలిగాను. కొత్త స్కూలు ఎలా ఉంటుందో?

2

పోల్టావాకు ఆరు కిలోమీటర్ల దూరాన ఇసుక దిబ్బల నడుమ ఉన్న దాదాపు 200 హెక్టార్ల పైన్ వృక్షాల తోపులో ఓ మూలనగల 40 హెక్టార్ల భూమిలో నిలిచిన ఇటుక కట్టడాల సమూహం మా భవిష్యత్తు! ఖార్కోవ్ హైవే పక్కనే ఉన్న ఈ ప్రదేశం ఒకప్పుడు బాలనేరస్థుల సంస్కరణల కేంద్రం.

ఎలా ఉందని! చల్లని సరస్సు అంచున నిన్నటి భూస్వామ్య కులక్కుల భూముల సరిహద్దుల వెంబడి పురాతన బిర్చి వృక్షాలే రక్షణగా... ఎంత బావుందని!

1917లో విప్లవం తర్వాత ఇక్కడివారంతా పారిపోయారు. వారు మిగిల్చిన ఆనవాళ్ళు, కనిపించిన నాలుగు రిజిస్టర్లు చూస్తే ఇక్కడి పిల్లలకు ఎటువంటి శిక్షణ లభ్యమైందో అర్థమవుతుంది. మిలిటరీలోని నాన్ కమిషన్డ్ అధికారులే ఇక్కడ ఉపాధ్యాయులుగా ఉండేవారని రిజిస్టర్లు చెబుతున్నాయి. వాళ్లు బెత్తాన్నే ప్రధాన ఆయుధంగా ప్రయోగించి విద్యాబోధన చేసేవారని రాత్రింబవళ్లు పిల్లల్ని కనిపెట్టడమే వాళ్ల వ్యాపకమని తేలింది. విప్లవానంతరం ఇక్కడి పిల్లలు, ఉపాధ్యాయులు కనుమరుగైన తర్వాత పరిసరాల గ్రామీణులు తమ ప్రతిభ చూపించి పాఠశాలలోని ప్రతి వస్తువునీ అదృశ్యం చేసేందుకు ప్రయత్నించారు. కుర్చీలు, బెంచీలు, కార్ఖానాల్లోని పనిముట్లు అలమరాలు... ఒకటేమిటి ఎత్తుకుపోగలిగిన ప్రతి వస్తువునీ వాళ్లు తమ సొంతం చేసుకున్నారు. అయితే ఈ క్రమంలో ఎవరూ విధ్వంసానికి పాల్పడకపోవడం విశేషం. ఆవరణలోని తోటను సైతం అదృశ్యం చేసిన గ్రామీణులు అందుకు శాస్త్రీయ పద్ధతులే అవలంభించారు. ఏ చెట్టునీ వారు అడ్డంగా నరికేయలేదు. వేళ్లతో సహా పెకలించుకుపోయారు. కిటికీ అద్దాలను కూడా భద్రంగా వాటి ఫ్రేములనుంచి పెకలించి పట్టుకెళ్లారు. తలుపులను వాటి బందులతో సహా అతి భద్రంగా తీసి తమ ఇళ్లలో ప్రతిష్టించుకున్నారు. వారు వదిలేసిందల్లా ఆ ఆవరణలోని ఒక పెద్ద అల్మారాను మాత్రమే.

"అద్దైనా ఎలా మిగిలింద"ని పొరుగున ఉన్న పెద్దాయన్ని అడిగాను.

"అంత పెద్ద అల్మరాను మా ఇళ్లలోకి తీసుకెళ్లడం కష్టం. అంత ఎత్తు, వెడల్పు ఉంటే అది మా ఇళ్లలోకి రాదు. అలా అని దాన్ని ముక్కలుచేస్తే ప్రయోజనం ఉండదు. అందుకు..." అని కారణం బోధపరిచాడాయన.

మొత్తానికి గ్రామస్థులు వదిలేసిన కొన్ని వస్తువులు ఆ ఆవరణలోని కొన్ని గదుల్లో, షెడ్‌లలో కనిపించాయి. అయితే వాటిల్లో దేనివల్లా ఏ నిర్దిష్ట ప్రయోజనం ఉండదు. ఈలోగా లభించిన కొన్ని స్పష్టమైన సాక్ష్యాధారాల సాయంతో ఇటీవలే గ్రామీణులు ఎత్తుకెళ్లిన కొన్ని వస్తువుల ఆచూకీ కనిపెట్టి వాటిని తిరిగి సంపాదించగలిగాను. కొన్ని విరిగిన బెంచీలతోపాటు విత్తులు నాటే పరికరం దొరకడం నా అదృష్టం.

నేను ఈ కేంద్రానికి చేరడానికి ముందే మాకు అవసరమయ్యే సప్లైల మేనేజర్‌గా కలీనా ఇవానోవిచ్ ఇక్కడకు వచ్చాడు. నన్ను చూడగానే ఉక్రెయిన్ యాసలో పలకరించాడు. “ఇక్కడ విద్యాబోధన విభాగం అధిపతి మీరేనా?” అని.

“నేనా? నేను ఈ కాలనీ డైరెక్టర్‌ని” అని బదులిచ్చాను.

అయితే ఇవానోవిచ్ నా సమాధానాన్ని అంగీకరించలేదు. తీరికగా నోట్లోంచి పైపుని తీసి విదిలించి “మీరు విద్యాబోధన విభాగం డైరెక్టర్. నేను సప్లైల మేనేజర్‌ని” అని తన అధిక్యాన్ని వివరించబోయాడు.

ఇవానోవిచ్ రూపమే చిత్రంగా ఉంది. పూర్తి బట్టతల, రెండు చెవులపైనా గుప్పెడు గుప్పెడు వెంట్రుకలు. సన్నగా కత్తిరించిన మీసం. పళ్లమధ్య బిగించిన పొగాకు పైప్. చిన్నపిల్లల శిక్షణా కేంద్రంలో సప్లైల మేనేజర్ అనే సాధారణమైన పనికి మించిన పెద్దమనిషిగా కనిపించాడాయన. యాభైయేళ్లు పైబడిన ఇవానోవిచ్ ఇంతకుముందే సైన్యంతో సహా అనేక పనులు చేశాడు.

ఈ కాలనీ అధిపతిని నేనేనని ధృవపరచవలసిన అవసరం నాకులేదు. కానీ కంటి ఎదుట కనిపించే ప్రతి అంశాన్నీ తృణీకరిస్తూనే కాలాన్ని మరింత అర్థవంతంగా కులాసాగా కొనసాగించాలన్న నిశ్చయాన్ని కనబరిచే ఆ కళ్లను చూస్తే ఈ మనిషి స్పందిస్తాడని నాకు తోచింది. అందుకే ఓపికగా వివరించాను.

“చూడు కామ్రేడ్. కాలనీ మొత్తానికి ఒక డైరెక్టర్ అంటూ లేకుండా ఉండటం సాధ్యం కాదు. ఇక్కడ ప్రతి విషయానికి బాధ్యుడంటూ ఒకరు ఉండాలిగా” అన్నాను.

ఇవానోవిచ్‌కి నేను చెప్పింది అంతగా నచ్చినట్టు లేదు. నింపాదిగా నోట్లోంచి పైపుతీసి విదిలించి “అంటే మీరు ఈ కాలనీ అధిపతిగా ఉండదలిచారన్నమాట. అంటే నేను మీకింద పనిచేసే ఉద్యోగినన్నమాట” అన్నాడు.

“అబ్బెబ్బే. ఈ ఏర్పాటు మీకు నచ్చకపోతే మీరే డైరెక్టర్‌గా ఉండండి. నేను మీకింద ఉద్యోగిగా ఉంటాను.” అని బదులిచ్చాను.

“చదువు చెప్పడం ఎలాగో నాకు చాతకాదు. నాకు తెలియని విషయం గురించి నేను మాట్లాడను. మీరు యువకులు. అయినా నాలాంటి వృద్ధుడు మీ అనుయాయుడిగా ఉండాలని, పిలిస్తే పలకాలని భావిస్తున్నారు. ఇది సమంజసం కాదు. కానీ ఒక డైరెక్టర్‌గా ఉండేందుకు కావాల్సిన జ్ఞానం నాకు లేదేమో. అదీగాక నేనే డైరెక్టర్‌గా ఉండాలన్న కోరిక కూడా నాకు లేదు” అంటూ నెమ్మదిగా ఆయన అక్కడ్నుండి వెళ్లిపోయాడు.

ఆ రోజంతా ఆయన అన్యమనస్కంగా తిరిగాడు. నిర్లిప్తంగా కనిపించాడు. చివరకు ఒక నిశ్చయానికి వచ్చినట్టుంది. అందుకు ఆయన ఎంత నిస్పృహకు లోనయ్యాడో తెలుస్తూనే ఉంది. నా దగ్గరకు వచ్చి “ఒక టేబుల్‌ని, మంచాన్ని సంపాందించి ఇక్కడ వేశాను. నాకు దొరికిన వాటిల్లో ఇవి మంచివి” అని చెప్పాడు. నేను కృతజ్ఞతలు తెలిపాను.

ఆయన కొనసాగించాడు "నేను బాగా ఆలోచించాను. ఈ కాలనీ కోసం ఏం చేయగలం అని ఆలోచించాను. మీరే డైరెక్టర్ అయితే మంచిదని నేను మీకింద ఉద్యోగిగా ఉండటం సరైనదని నిర్ణయించుకున్నాను."

"మనం కలిసి పనిచేయగలం ఇవానోవిచ్" అని బదులుచెప్పాను.

మొత్తానికి శిథిలావస్థలో ఉన్న కాలనీ భవనాలను ఒక దారికి తెచ్చే బ్రహ్మయత్నం మొదలైంది. గ్రామంలోని నిపుణుల సాయంతో, పొరుగువారి సహకారంతో ఇద్దరం కలిసి మొదటి రెండు నెలల్లో ఇక్కడి బ్యారక్‌లకు ఒక రూపం తేగలిగాం. కిటికీలు, తలుపులు బాగుచేసి నేలను శుభ్రం చేసి పడిపోతున్న పైకప్పులను నిలబెట్టి చలికాచుకునే పొయ్యిలను పనికొచ్చేలా చేయగలిగాం. ఈ రెండు నెలల్లో 'బయటినుంచి' అందిన సాయం ఒక్కటే. ఫస్ట్ రిజర్వ్ ఆర్మీ ఆహార విభాగం నుంచి మా కాలనీ కోసం 150 పూడ్‌ల రైపిండిని సంపాదించగలిగాం. సాధించవలసిన లక్ష్యాన్ని దృష్టిలో వుంచుకుంటే మాకు లభ్యమైన సాయం అతి స్వల్పమని మాకు తెలుసు. కానీ ఇంతకంటే చేయగలిగిందేమీ లేదని అర్థమవుతోంది. బాల నేరస్థుల సంస్కరణ కేంద్రం ఏర్పాటు పూర్తయినట్టేనని తేల్చేశాను. ఇవానోవిచ్ సైతం నాతో ఏకీభవించాడు. ఇంతకంటే చేయగలిగిందేమీలేదని ఒప్పుకున్నాడు. ఇక కావలసిందల్లా ఈ కాలనీలో శిక్షణ పొందవలసిన పిల్లలకు ఉపాధ్యాయులు. ఆ విషయంలో బెంగ అవసరం లేదని ఇవానోవిచ్ హామీ ఇచ్చాడు.

కానీ అది అంత తేలిక కాదు. ఈ కారడవిలో ఒక నూతన మానవుడిని తయారుచేసే ఉద్దేశం ఎవరికీ ఉన్నట్టు కనిపించలేదు. చేయగలమన్న నమ్మకం వారిలో లేదు. చివరకు ఒకరోజు గ్రామంలోని టీచర్ల సమావేశంలో నేను మాట్లాడాను. ఆ ఉపాధ్యాయులను ఈ పనికి ఒప్పించేందుకు నా ప్రావీణ్యాన్ని పూర్తిగా ఉపయోగించాను. ఎలాగైతేనేం ఇద్దరు మహిళా ఉపాధ్యాయులు ముందుకు వచ్చారు. వారిలో ఒకరైన లిడియా పెట్రోవ్నా చాలా చిన్నపిల్ల. చెప్పాలంటే ఓ స్కూలు పిల్లలానే ఉంది. నిన్న మొన్ననే హైస్కూలు చదువు పూర్తిచేసింది. ఆమెను ఉపాధ్యాయురాలిగా తీసుకునేందుకు ప్రజా విద్యాశాఖ అధిపతి అభ్యంతరం చెప్పకపోయినా "ఈ పిల్లతో ఉపయోగం ఏమిటి? ఆమెకు ఒక్క విషయం తెలియదు" అన్నారు. నా ఉద్దేశం వేరు. "నేను సరిగ్గా ఇటువంటి వారి కోసమే ప్రయత్నిస్తున్నాను. చదువు, అనుభవం మాత్రమే ప్రస్తుతం ముఖ్యం కాదు. ఏ ప్రభావమూ లేని లిడియా వంటి యువత మన పనికి బాగా పనికొస్తారని నా అభిప్రాయం" అని చెప్పాను. ఎలాగైతేనేం ఆయన ఒప్పుకున్నాడు.

రెండో ఆమె పేరు ఎకతెరీనా గ్రిగోర్యేవ్నా. ఆమె అనుభవంగల ఉపాధ్యాయురాలు. లిడియా కంటే ఆమె మరీ పెద్ద వయసుగల ఆమెకాదు. కానీ లిడియా ఆమె పెద్దరికాన్ని ఆమోదించింది. నిజం చెప్పాలంటే ఎకతెరీనాను ఆమె ఓ తల్లిగా భావించేది. ఎకతెరీనా ఆ పెద్దరికానికి తగిన వ్యక్తే. ఆలోచనాత్మకంగా, తీక్షణంగా చూసే కళ్ళు, చిక్కని దట్టమైన కనుబొమ్మలు, మచ్చ అనేది లేని అత్యంత పరిశుభ్రమైన దుస్తులతో హుందాగా, గంభీరంగా, అందంగా ఉండేది. ఈ రకంగా మా శిక్షణా కాలనీకి కావలసిన పరివారం సమకూరింది.

డిసెంబర్ నాలుగున మా శిక్షణా కేంద్రానికి పిల్లల తొలి బ్యాచ్ వచ్చింది మొత్తం ఆరుగురు. ప్రభుత్వ అధికారులు వేసిన లక్కసీళ్లు ఐదు ఉన్న పెద్ద కవర్‌ను వాళ్లు పట్టుకొచ్చారు. అందులో వారి రికార్డులు ఉన్నాయి. వాటి ప్రకారం ఆ ఆరుగురిలో నలుగురు పిల్లలు ఆయుధాలతో ఇళ్ల దోపిడీలకు పాల్పడినవారు. వారందరూ దాదాపు పద్దెనిమిదేళ్లవారు. మిగిలిన ఇద్దరూ చిల్లర

దొంగతనాలు చేసి దొరికిపోయినవారు. అందరూ పరమ స్టైల్‌గా బట్టలేసుకుని, కొత్త ఫ్యాషన్‌లో జుట్టు పెంచుకున్నవారే. జడరోవ్, బరున్, వొలొఖోవ్, బెండ్యూన్, టారానెట్స్, గడ్ – వాళ్ల పేర్లు. అదీ సంగతి.

వాళ్లని మేం అత్యంత మర్యాదగా, ఆప్యాయంగా ఆహ్వానించాం. రాత్రి భోజనానికి ఘనంగా ఏర్పాట్లు చేశాం. వంటావిడ హడావిడి పడింది. డార్మెటరీ[1]లో మంచాల మధ్యనే భోజనం బల్లలు పరిచాం. కాలనీ పెద్దలమైన మేం మా కొత్త అతిథుల గౌరవార్థం ఆ విందుకు హాజరయ్యాం. కలీనా ఇవానోవిచ్ ఆ సందర్భం కోసం ప్రత్యేకంగా ఆకుపచ్చని జాకెట్ ధరించాడు కూడా.

విందు ఆరంభానికి ముందు నేను అందరినీ ఉద్దేశించి మాట్లాడాను. శ్రమ సౌందర్యాన్ని అనుభవించగల కొత్త జీవితం గురించి, పాత జీవితాన్ని మర్చిపోవలసిన అవసరం గురించి వివరించాను. అయితే కొత్త పిల్లలు నా ప్రయాసని ఖాతరు చేస్తున్నట్లు లేదు. వాళ్లలో వారు గుసగుసలాడుతూ పక్కనున్న మంచాలని గమనిస్తూ, తలుపుల్నీ, కిటికీలనూ పరిశీలిస్తూ తమ అసహనాన్ని వ్యక్తం చేశారు. ఇకముందు ఏం చేయాలో, ఎలా పనిచేయాలో నేను వివరిస్తుంటే వారు మర్యాదపూర్వకమైన అసహనంతో నన్ను భరిస్తున్నట్లు కనిపించారు. ఈ గోల ఎప్పుడు ముగుస్తుందా అన్న ఆత్రం వారిలో స్పష్టంగా కనిపించింది.

మర్నాడు పొద్దున్నే మా యువటీచర్ లిడియా నా దగ్గరకొచ్చింది. ఈ పిల్లలతో తను వేగలేనని ఫిర్యాదు చేసింది. నిజానికి ఆరంభంలో ఈ యువ నేరస్థులు మా పట్ల కఠినంగా అమర్యాదగా ప్రవర్తించలేదు. వాళ్లసలు మమ్మల్ని లక్ష్యపెట్టలేదు అంతే. సాయంత్రాల వేళ వారంత నింపాదిగా నడుచుకుంటూ బయటికి పోయేవాళ్లు. పొద్దున్నే మళ్లీ ప్రత్యక్షమయ్యేవారు. నా విసుగునీ, గొణుగుడునీ పట్టించుకునే వారే కాదు. పైగా చిలిపి నవ్వులొకటి. అప్పుడు వారం రోజుల తర్వాత పోలీసులు పిల్లల్లో ఒకరైన బెండ్యూక్‌ని అరెస్టు చేశారు. ఆ ముందురోజు రాత్రి జరిగిన ఒక హత్య – దోపిడీలకు అతనే బాధ్యుడని ఆరోపణ. ఈ సమాచారం విని లిడియా పూర్తిగా బెదిరిపోయి, తన గదిలోకివెళ్లి భోరున ఏడ్చింది. బయటికి వచ్చి, "ఇదంతా ఏమిటి? నాకేం అర్థం కావడం లేదు. బెండ్యూక్ అలా బయటికి వెళ్లి "అంత తేలిగ్గా ఓ మనిషిని చంపేశాడా" అని ప్రశ్నించింది నివ్వెరపాటుతో. అక్కడే వున్న ఎకతెరీనా కలవరపాటుతో నవ్వింది. "నాకూ అర్థం కావడం లేదు అంటన్ సెమ్యొనోవిచ్. మనం ఏమీ చేయలేమేమో. ఇదంతా వదిలేసి పోతేనే మంచిది" అంది.

కాలనీ చుట్టూ ఆవరించిన ఒంటరి అడవి, మా ఖాళీ భవనాలు, అరడజను మడతమంచాలు, కాసిన్ని పారలూ, పలుగులూ, గొడ్డళ్ళు – మేం చెప్పదలచిన చదువునే కాక మొత్తం మానవ సంస్కృతినే నిరసించే ఆరుగురు విద్యార్థులూ... ఇదంతా చూస్తుంటే మా అధ్యాపక బృందం అసలేమైనా చేయగలమా అనిపించింది. ఇలాంటి అనుభవం మాలో ఎవరికీ లేదు.

కాలనీలో చలికాలం రాత్రుళ్లు వాతావరణం భయం గొలిపేదిగా ఉండేది. పిల్లలంతా పడుకునే హాల్లో (డార్మెటరీ), నా గదిలో మాత్రం చెరో లాంతరూ ఉండేవి. టీచర్లు, ఇవానోవిచ్ మన పూర్వీకుల పద్ధతిలో ఒక పళ్లెంలో వత్తివేసి వెలిగించుకునేవాళ్లు. ఆ ఏడాది శీతాకాలంలో ముందే మంచు కురవడం మొదలైంది. గడ్డకట్టిన మంచుతో దారులు మూసుకుపోయాయి. ఆ మంచును తుడిచేయమని పిల్లలకు చెప్పాను. వాళ్లేం పట్టించుకోలేదు. వాళ్ల తరఫున జడరోవ్ సమాధానం చెప్పాడు. "తుడవడం అతి సులభం" చిటికలోపని, కానీ శీతాకాలం చివరి వరకూ ఆగితే మంచిది

[1] డార్మెటరీ : ఎక్కువమంది పడుకునేందుకు వీలుగా వరుసగా మంచాలు వేసిన పెద్ద గది.

కదూ? మేం తుడవటం, మళ్లీ మంచు పడటం, మళ్లా తుడవటం... అంతా వృధాయేగా" అంటూ నా వంకచూసి తియ్యగా నవ్వాడు. తరువాత మిగిలిన పిల్లలతో కలిసి, నేను అక్కడ లేనట్టే పరిగణిస్తూ బయటికి వెళ్లాడు. జదరోవ్‌ని చూస్తే అతని తల్లిదండ్రులు విద్యాధికులై ఉంటారని తెలుస్తుంది. తను తప్పులేకుండా చక్కగా మాట్లాడతాడు. మంచి పెంపకంలో ఎదిగినట్టు అర్ధమవుతోంది. వొలోఖోవ్ తీరేవేరు. విశాలమైన నోరు, పెద్ద నుదురు, నిరంతరం చలించే కళ్లూ చూస్తేనే జులాయిగా, పొగరుబోతుగా తెలిసిపోతాడు. తను జదరోవ్‌కి వంతపాడాడు. నా మీదకి వచ్చి "అర్ధమైందా. మీకు మంచి సమాధానం ఇచ్చాడు తెల్సిందా" అని విసురుగా ప్రశ్నించాడు.

నాకు వళ్లు మండిపోయింది. డార్మెటరీలోంచి బయటికి నడిచాను. కోపంతో రగిలిపోయాను. కానీ మంచు కుప్పలను తొలగించనిదే దారి తెరుచుకోదు. కదలడం కష్టం. ఆ కోపాన్నంతా పని మీదకు మళ్లించాను.

కలీనా ఇవానోవిచ్‌ని పిలిచాను. "పదండి మంచుని తుడిచేద్దాం. దారి బాగుచేద్దాం" అని చెప్పాను. తనకి కొపమొచ్చినట్టుంది.

"నేను కూలిపని కోసం వచ్చానా? ఆ కుర్రకుంకలు ఏం చేస్తున్నారు?" అని ప్రశ్నించాడు.

"వాళ్లు పనిచేయరట" బదులిచ్చాను.

ఆగ్రహంతో పళ్లు నూరాడాయన. "పదండి" అన్నాడు.

ఇద్దరం కలిసి ఒక రోడ్డు శుభ్రం చేసేశాం. ఈలోగా రాత్రి బయట ఊరేగడానికి వొలొఖోవ్, టారానెట్స్‌లు అక్కడకు వచ్చారు. ఇవానోవిచ్ వాళ్లని చూసి కోపంతో విరుచుకుపడ్డాడు. "కుర్ర వెధవల్లారా. పని చెయ్యరా? మీ కోసం నేను పనిచేయాలా? నేను కష్టపడి దారి బాగుచేస్తే జులాయిగా నడిచిపోతారా. పొండి ఆ మంచు బురదలోంచే నడవండి. ఇటు వచ్చారా, ఈ పారతో బుర్ర బద్దలు కొట్టేస్తా" అని అరిచాడు.

వాళ్లపైకి తన పార ఎత్తి మీదమీద కెళ్లి కొట్టబోయాడు. మరుక్షణం తన చేతిలో పారదూరంగా మంచులోకి దూసుకువెళ్లింది. తన నోట్లో పైపు మరో దిశగా ప్రయాణించింది. నివ్వెరపోయిన ఇవానోవిచ్ అక్కణ్ణించి వెళ్లిపోతున్న ఇద్దరు కుర్రవాళ్లవంక మిర్రిమిర్రి చూస్తూండిపోయాడు. పోతున్న కుర్రవాళ్లు వెనక్కి తిరిగి చూసి నవ్వారు. 'ఫో. నీ పార నువ్వు తెచ్చుకో" అని అరిచారు. ఇవానోవిచ్ నావంక చూసి ఉగ్రంగా అన్నాడు. "నేను మానేస్తాను. ఇక పనిచేయను" అంటూ విసురుగా అక్కణ్ణించి వెళ్లిపోయాడు.

క్రమంగా కాలనీలో జీవితం విచారగ్రస్తంగా, భయానకంగానూ మారింది. రాత్రివేళల్లో ఖార్కోవ్ రోడ్డునుంచి "కాపాడండి, రక్షించండి" అంటూ గ్రామ ప్రజలు దీనాలాపనలు వినిపించేవి. దారి దోపిడీమూకల దాడులతో పరిసరాలు ఉద్రిక్తభరితంగా మారాయి. దీనివెనుక మా కుర్రవాళ్ల హస్తం ఉందని అనుమానం నాకు ఉంది. ఎందుకైనా మంచిదని భావించి విద్యాశాఖ చీఫ్‌ని కలిసి ఒక రివాల్వర్ సంపాదించి, రహస్యంగా దాచుకున్నాను. కుర్రవాళ్లని ఒక దారికి తెచ్చేందుకు వారిని క్రమశిక్షణతో తీర్చిదిద్దేందుకు మా అందరి ప్రయత్నాలు విఫలమవుతూనే ఉన్నాయి. ఇదే సమయంలో మేమంతా అందుకు తగిన విద్యాబోధన పద్ధతులపై అహోరాత్రాలు అధ్యయనం చేశాం. ఆ ఒక్క ఏడాది నేను చదివినన్ని పుస్తకాలు మరెప్పుడూ చదవలేదు. ఈ తరహా పిల్లలకు చదువు చెప్పేందుకు నిర్దిష్టమైన పద్ధతేమీ లేదనీ, పుస్తకాల్లో అదొక శాస్త్రంగా, సిద్ధాంతంగా పొందుపరచి లేదనీ ఈ అధ్యయనం తేల్చింది. పరిస్థితులను వేగంగా జీర్ణించుకుని, అప్పటికప్పుడు సరైన నిర్ణయాలు

తీసుకోవడం తప్ప దీనికి సంబంధించి ఒక అమూర్త సిద్ధాంతాన్ని తయారుచేయలేమని బోధపడింది.

నాకు పెద్ద వ్యవధి లేదని తెలుసు. కాలనీలో పరిస్థితులు శృతిమించుతున్నాయి. మాదొంగ దొంగల ముఠా స్థావరంగా మారిపోతున్నట్టుంది. పిల్లలు టీచర్లను గడ్డిపోచకంటే హీనంగా చూడటం, గట్టిగా ఎదిరించడం దినకృత్యమైంది. మా మహిళా టీచర్లు అక్కడ ఉండగానే బూతు కథలు చెప్పుకోవడం, తిండి పెట్టమని గద్దించి అడగడం వారికి అలవాటుగా మారింది. భోజనాల గదిలో అల్లరికి దిగడం, ప్లేట్లు విసిరివేయడం ఒక వినోదంగా మారింది. కత్తులతో ఆటలు, ఎదుటివారి వస్తువులను చూసి కొంటెగా నవ్వుతూ వ్యాఖ్యలు చేయడం మామూలైంది. ఎవరి వస్తువులకూ భద్రత ఉంటుందనే హామీ కరవైంది. కట్టెలు కొట్టమని ఆదేశిస్తే మూల గదికి గల కొయ్యపైకప్పుని ధ్వంసం చేసి విరిచి పోగులు పెట్టడం వారి దృష్టిలో వీరకృత్యంగా మారింది. ఇదంతా చూసి ఇవానోవిచ్ పూర్తి నిరాశకు లోనయ్యాడు. “ఈ దుర్మార్గులతో మాట్లాడి లాభం లేదు. వొట్టి జలగలు” అని నిస్పృహతో పొగాకు పైపు విదిలించాడు.

చివరికి ఆ రోజు రానే వచ్చింది. ఓ తుపానులా విరుచుకుపడింది. ఒక అధ్యాపకునికి ఉండవలసిన జాగ్రత్త, సంయమనం పూర్తిగా కోల్పోయిన నేనే ఈ తుపాను సృష్టించాను. నిగ్రహం కోల్పోయాను. ఆగ్రహంతో రగిలిపోయాను. ఆ రోజు మామూలుగానే జదరోవ్ అనే కుర్రవాణ్ణి పిలిచి వంటింటి పొయ్యి కోసం వంట చెరకు కొట్టి తీసుకురమ్మని చెప్పాను. వాడు అతి కులాసాగా నవ్వి, “మీరే తెచ్చుకోండి, చాలామందే ఉన్నారుగా, నేనెందుకు?” అని ఇకిలించాడు.

ఒక్కసారిగా కోపం కట్టలు తెంచుకుంది. అంతకుముందు రెండు నెలలనుంచి పేరుకొన్న చికాకూ, విసుగు, ఆగ్రహం ఇక అణగి ఉండలేదు. జదరోవ్ చెప్పినంత విసురుగా, అదేరకంగా ఇంతవరకూ నాకెవరూ సమాధానం చెప్పలేదు. విసురుగా చెయ్యి ఎత్తి జదరోవ్ మొహం మీద బలంగా చరిచాను. తను తూలి పొయ్యి ఎదురుగా పడిపోయాడు. కాలర్ పట్టుకుని మరో దెబ్బ వేశాను. విసురుగా లేపి నించోబెట్టి మూడో గుద్దు వేశాను.

నాకు ఆశ్చర్యం కలిగేంతగా అతను భయపడిపోయాడు. భయంతో తన మొహం పాలిపోయింది. వణుకుతున్న చేతులతో టోపీతీసి గుండెలకు ఆనించుకుని కంపిస్తున్న గొంతుతో అతను దీనంగా ప్రార్థించాడు. “క్షమించండి, ఆంటన్ సెమ్యోనోవిచ్” అంటూ ఆక్రందన చేశాడు. వాడు కనక అలా దారికి రాకపోయి ఉంటే ఏమై ఉండేదో తలచుకుంటేనే భయం వేస్తోంది. వాడు కనుక తిరగబడివుంటే వాడితోపాటు వాళ్లందరినీ చితక్కొట్టేందుకు బయలుదేరేవాడినేమో. అప్పుడే నా చేతికి అక్కడ ఒక ఇనపచువ్వకూడా దొరికిందేమో హద్దులు దాటివుంటే ఆరోజు రక్తం అక్కడ ప్రవహించేది. నా ధోరణికి విస్తుపోయిన ఆరుగురు భయంతో వణికిపోతూ ఓమూల గుంపుగా చేరి నిలబడ్డారు. బరున్ నావంక చూడకుండా అతి శ్రద్ధగా తన బట్టలు సవరించుకున్నాడు.

నేను చేతిలోని ఇనుపచువ్వని ఒక మంచం కాళ్లపై కొట్టి స్పష్టంగా చెప్పాను. “మీరంతా తక్షణం వెళ్లి అడవిలో చెట్లు నరికి కట్టెలు తేవాలి. లేదా ఇక్కడినుంచీ – కాలనీనుంచి వెళ్లిపోవాలి. మీతో ఇక చాలు. నా సహనం చచ్చిపోయింది” అన్నాను. వారి సమాధానం కోసం ఆగకుండా అక్కడనుంచి బయటికి వచ్చాను. బయట షెడ్‌లో పరికరాలు ఉన్న మూలకు వెళ్లి గొడ్డలి అందుకున్నాను. నా వెనకే బెరుకుబెరుగ్గా వచ్చిన ఆరుగురు కుర్రవాళ్ళూ కూడా గొడ్డళ్ళు, రంపాలు తీసుకుంటున్నారు. అటువంటి ఉద్రిక్తపూరితమైన రోజున వాళ్ల చేతుల్లో అటువంటి ప్రమాదకరమైన ఆయుధాలు ఉండటం ప్రమాదకరమని నాకు ఆ క్షణంలో తట్టలేదు. ప్రమాద తీవ్రత నాకు

అర్థమయ్యేసరికి సమయం మించిపోయింది. అందరూ ఆ 'ఆయుధాలు' అందిపుచ్చుకున్నారు. నేను సైతం భయపడలేదు. అంత తేలిగ్గా వారిని గెలవనివ్వను. పైగా నా దగ్గర తుపాకి ఒకటుంది.

ఈలోగా ఇవానోవిచ్ భయపడుతున్నాడు. ఏం జరిగింది? వాళ్లంతా ఇంత వినమ్రంగా ఎందుకు పనికి దిగారు? అన్న ప్రశ్నలతో గుసగుసలు ప్రారంభించాడు. నేను ఆయన వంక పిచ్చికళ్ళు పెట్టి చూశాను. "ఏం లేదు పెద్దాయనా. జీవితంలో చేయని పని చేశాను. తోటి మనుషుల్ని కొట్టాను" అని బదులిచ్చాను.

కానీ నాకే ఆశ్చర్యం కలిగింది. కుర్రవాళ్లు నిశ్శబ్దంగా, అలిగిన మొహాలతో నిర్విరామంగా పనిచేశారు. అడ్డదిడ్డంగా ఎదిగిన, ఎదగని పైన్ చెట్లని అడ్డంగా నరికారు. గొడ్డలి, రంపం శబ్దాలే వాతావరణాన్ని నింపాయి. మధ్యలో విరామం అని నేను ప్రకటించినప్పుడు అందరూ నిశ్శబ్దంగా నావద్ద ఉన్న మోటు పొగాకు పీలుస్తున్నారు. ఇంతలో జదరోవ్ పగలబడి నవ్వాడు. "ఇదే నాకు మందు" అని ఉత్సాహంగా ప్రకటించాడు.

సంతోషంతో, తృప్తితో గులాబీరంగుకు తిరిగిన అతని బుగ్గల్ని, మిలమిలా మెరుస్తున్న కళ్లనీ చూసి నాకూ ఆనందం కలిగింది.

"ఏమిటి? పని గురించా చెబుతున్నావు?" అని అడిగాను.

"పని బానే ఉంది. విషయం ఏంటంటే నన్ను మీరు లొంగదీసిన తీరు..." అని సమాధానం చెప్పాడు జడ్‌రోవ్.

అతనివంక మరోసారి చూశాను. అంతటి బలమైన కుర్రాణ్ణి కొట్టే ధైర్యం నాకెలా వచ్చిందనే ఆశ్చర్యం కలిగింది.

జదరోవ్ మరోసారి పెద్దగా నవ్వుతూ గొడ్డలి తీసుకుని ఇంకో చెట్టువైపు వెళ్లాడు.

ఆ రాత్రి అందరూ కలిసి భోజనం చేశారు. హాస్యపు కబుర్లు, నవ్వులతో ఆ పూట గడిచింది. జరిగిన సంఘటన గురించి నాకు ఎంత ఇబ్బంది ఉన్నా నేను బయటపడలేదు. స్థిరంగా ఏంచేయాలో ఆదేశాలు జారీచేశాను. నా మాట విని వోలోఖోవ్ నవ్వాడు. జదరోవ్ నా దగ్గరికి వచ్చి హామీ ఇచ్చాడు. "మేం మరీ అంత దుర్మార్గులం కాదండీ. అన్ని పనులూ సవ్యంగా సాగుతాయి. మాకు విషయం అర్థమైంది." అని చెప్పాడు.

3

మర్నాడు నేను ఆ పిల్లలకి చెప్పాను. "నిదురపోయే హాలు శుభ్రంగా ఉండాలి. మీ డార్మెటరీకి ఒక లీడర్‌ని ఏర్పాటుచేసుకోవాలి. మీరు పక్కన పట్టణంలోకి వెళ్లాలన్నా నా అనుమతి అత్యవసరం. ఎవరైనా అనుమతి లేకుండా బయటికి వెళ్తే తిరిగి రానవసరం లేదు" అని చెప్పాను.

"మరీ ఇంత కఠినమా" అని వోల్కోవ్ నిష్ఠూరమాడాడు.

నేనతనికి స్పష్టంగా చెప్పాను. "క్రమశిక్షణ అత్యవసరం. అది మీలో ఎవరికైనా నచ్చకపోతే హాయిగా బయటికి పొండి. ఇక్కడ ఉండదలచినవారు మాత్రం కొన్ని పద్ధతులకి కట్టుబడాల్సిందే. ఇక్కడ ఒక దొంగలముఠాని పెంచాలని మేం అనుకోవడం లేదు" అని ఖచ్చితంగా వివరించాను. నా ప్రసంగం విన్న వోలోఖోవ్‌కి ఓ అనుమానం కలిగింది. "స్కూల్‌కి రావడం తప్పనిసరా?" అని అడిగాడతను. తప్పదని చెప్పాను.

మొత్తానికి జడ్‌రోవ్‌తో కూడిన సంఘటన ఇక్కడ క్రమశిక్షణకు సంబంధించి గుణాత్మకమైన మార్పులకు దోహదం చేసింది. పిల్లల్ని కొట్టడం అనేది ఒక టీచర్‌గా చేయనేకూడని పని అని నా

ధృఢ విశ్వాసం. కానీ దాన్ని నేను మీరాను. అయితే విద్యాబోధనకు సంబంధించి ఒక అధ్యాపకునికి ఉండవలసిన పవిత్ర అంతరాత్మకంటే ఆయా సమయాల్లో వెంటాడే అవసరాలకు తగినట్టు ప్రవర్తించడం అత్యవసరమని నేను గ్రహించాను. మిగిలిన ఇతర పద్ధతులు విఫలమైతే ఒక నిరంకుశ చక్రవర్తిగా వ్యవహరించక తప్పదని నేను తేల్చుకున్నాను.

అలాంటి రోజునే ఓసారి వోలోఖొవ్ తనకు చెప్పిన పని చేయలేదు. పైగా అడిగితే "ఇందుకు నన్ను కొడతారు కదూ? కానీ అందుకు మీకు హక్కులేదు" అని హెచ్చరించాడు.

కానీ నేనతని చొక్కాకాలర్ గుంజి పట్టుకున్నాను. "కొట్టడం కాదు. ఇక బతుకులో ఇలాంటి తప్పు చేయలేనంతగా నీకు బుద్ధి చెబుతాను. వెళ్లు. దిక్కున్నచోట చెప్పుకో. జైలుకి వెళ్లాల్సి వచ్చినాసరే, నేను భయపడను" అని సమాధానం చెప్పాను. వోలోఖొవ్ నా పట్టు విడిపించుకున్నాడు. "ఇలాంటి చిన్న విషయాలకు జైలుకెళ్లక్కర్లేదు. మీరు చెప్పినట్టే గది తుడుస్తాను" అంటూ పెద్దగా నవ్వాడు. బలప్రయోగంతో వీళ్లని దారికితేవచ్చని నేను ఎన్నడూ అనుకోలేదు. పైగా ఆ సంఘటన జదరోవ్‌ని కలతపరిచిన దానికంటే నన్నే ఎక్కువ దివాలా తీయించింది. మహిళా టీచర్ లిడియా అయితే నామీద కన్నెర్ర చేసింది. "అంటే పిల్లల్ని చితక్కొట్టడం అనే పాత పద్ధతే మంచిదని తేల్చుకున్నట్టుంది మీరు" అంది.

నన్ను వదిలేయమని, వాదించవద్దని బతిమాలాను. ఆమె వదల్లేదు.

"అంటే మీలాగే మేమూ పిల్లల్ని కొట్టచ్చా, లేక అది మీకు ఒక్కరికే ఉన్న హక్కా?" అని అడిగింది.

ఈ విషయాన్ని మరో మహిళా టీచర్ ఎకతెరీనా కూడా తేలిగ్గా తీసుకోలేదు. ఆమె ఓ రోజు నన్నే తిన్నగా అడిగింది. "ఏంటది? పిల్లలు మీరంటే భయపడుతున్నారనేకంటే, మిమ్మల్ని ఆరాధిస్తున్నారనడం సరైనమాట. ఎందుకిలా? వారి బానిస మనస్తత్వమే కారణమా?" అని ప్రశ్నించింది.

నేను ఆ అభిప్రాయాన్ని తిరస్కరించాను. "అది పశుబలానికి సంబంధించి వ్యవహారం కాదు. ఆ మాటకొస్తే జదరోవ్ నాకంటే పెద్ద బలాఢ్యుడు. తలచుకుంటే నా కాలో చెయ్యో విరిచెయ్యగలడు. కానీ నేను అతన్ని కొట్టడానికి బలానికి సంబంధించిన సంగతిగా పరిగణించలేదు. నేను కొట్టిన సంగతిని వాళ్లు పట్టించుకోలేదు. ఎందుకుకొట్టానో, ఎంత పట్టించుకోబట్టే చేయి చేసుకున్నానో వాళ్లు అర్థం చేసుకున్నారు. సాటి మనిషి ఆగ్రహం వారికి గ్రహింపునకు వచ్చింది. తలచుకొంటే ఇక బాగుచేయడానికి పనికిరానంతగా పాడైపోయారని పేర్కొంటూ వారిని వెనక్కి జైలుకి పంపొచ్చు. నేను ఆ పని చెయ్యలేదు. దానికి బదులు వారిని దారిలో పెట్టేందుకు నాకే ప్రమాదం కలిగేలా వారిని కొట్టాను. కానీ అది మానవ సహజమైన స్పందన. ఒక అధికారిలా నేను వ్యవహరించలేదు. పైగా ఈ కాలనీని కాదంటే వారికి వేరే దిక్కులేదు. వారి కోసం మనం పడే కష్టం వారికి తెలుసు. దానికే వాళ్లు మనుషుల్లా స్పందించారు. ఎందుకంటే వాళ్లూ మనుషులు కాబట్టి ఇక్కడ అదే ముఖ్యమైన విషయం" అని ఓపికగా వివరించాను.

"బహుశా మీ ఆలోచన సరైనదేమో" అన్నది ఎకతెరీనా సాలోచనగా, కానీ తాత్విక చింతనకు ఇది సమయం కాదు. ఎందుకంటే వారం తిరక్కముందే – అంటే 1921 ఫిబ్రవరిలో నేను పట్టణానికి వెళ్లి దాదాపు పదిహేనుమంది అనాథల్ని కాలనీకి పట్టుకురావలసి వచ్చింది. వాళ్ల దురదలు, కురుపులు తగ్గించి, తగిన దుస్తులిచ్చి దారిలో పెట్టేందుకు చాలా చేయాల్సి వచ్చింది. వాళ్లని చూస్తే

చదువు, సంస్కారం నేర్పి, సమాజంలో అంతర్భాగం చేయగలమని ఏ కోశానా నమ్మకం కలుగలేదు ఆ సమయానికి మా కాలనీలో టీచర్ల సంఖ్య కూడా పెరిగింది. ఇవాన్ ఇవానోవిచ్, ఒసిపోరోవ్, ఆయన భార్య నటాల్యా మార్కోవ్నాలతోపాటు ఎంతో సంపదకూడా వచ్చి చేరింది. అనేక పడక కుర్చీలు, మామూలు కుర్చీలు, బీరువాలు, అల్మారాలు, వివిధ రకాల గిన్నెలూ, చెంబులూ వంట సామాగ్రి మా కాలనీకి వచ్చాయి. మా కుర్రవాళ్లు ఈ సామానంతా ఒసిపొరువ్‌ల నివాస స్థావరం ముందు పోగుపడటాన్ని అత్యంత ఆసక్తితో గమనించారు. ఈ సంపదనంతా వాళ్లు దోపిడీచేసి, అమ్ముకుపోతారేమోనని నాకు భయం కలిగింది.

ఈలోగా కాలనీ వ్యవహారాలు సరిదిద్దే ఆయా ఒకరు రంగ ప్రవేశం చేసింది. ఆమె తనతోపాటు కొంత సరకు పట్టుకొచ్చింది. పెద్దమొత్తంలో రొట్టెలపిండి, అనేక జాడీల్లో పచ్చళ్లు, ఇంకా అనేక తినుబండారాల డబ్బాలు తీసుకొచ్చింది. ఇదంతా మా కుర్రవాళ్లకు కనులవిందుగా తోచి ఉండవచ్చు. ఆమె వంటగదిలో ఆ సామగ్రినంతా బహు కుదురుగా సర్దింది. వచ్చీరాగానే మా కుర్రాళ్లందరితో ఆవిడకు మంచి దోస్తీ కుదిరింది. ఆ ముసలామె కోసం పిల్లవాళ్ళు బాగా శ్రమపడేవారు. కట్టెలు తెచ్చేవారు. పొయ్యి ముట్టించేవాళ్లు. దానికి ప్రతిగా ఆమె వాళ్లకి అప్పుడప్పుడు కాస్త టీ ఇచ్చేది. సలహాలు చెప్పేది. నిజానికి ఒక వంటమనిషి – ఆయాను భరించే ఆర్థికస్థోమత కాలనీకి లేదు.

మా సిబ్బంది ఉండే గదులు కాక కాలనీలో పిల్లలు పడుకునే డార్మెటరీని మాత్రం ఒకదారికి తేగలిగాం. అందులో రెండు నిలువుపాటి పొయ్యిలు అమర్చాం. ఆ డార్మెటరీలో ముప్పై మంచాలు, మూడు టేబుళ్లూ ఉండేవి. వాటివద్దే కుర్రవాళ్ళు భోజనం చేసేవాళ్లు, చదువుకునేవాళ్ళు, మరో పెద్ద డార్మెటరీ గది, భోజనాల గది, రెండు క్లాస్‌రూమ్‌లు, ఒక ఆఫీసుగది మరమ్మతుల కోసం పడిగాపులు కాస్తున్నాయి. పక్కబట్టలనుంచీ కుర్రవాళ్ల దుస్తులుదాకా మాకు అన్నీ కరవే. వాటి కోసం నిరంతరం విద్యాశాఖ అధికారుల చుట్టూ తిరిగేవాళ్లం. ఈ కాలనీ ఏర్పాటు అవసరం గురించి నాకు ఉపన్యాసాలిచ్చిన పెద్దమనిషికి బదిలీ కాగా, ఆయన స్థానంలో వచ్చిన మరో పెద్దాయనకి కాలనీకంటే ముఖ్యమైన పనులు అనేకం ఉండేవి. ఈ పరిస్థితుల్లో మా కాలనీ ఇప్పటికంటే బాగుపడే అవకాశాలే కనిపించేవి కావు. ఆ రోజుల్లో విద్యాశాఖ ప్రధాన కార్యాలయంలో అధ్యాపక బృందానికి అంత విలువుండేది కాదు. వారికన్నీ విరిగిపోయిన బల్లలూ, కుంటికుర్చీలూ కేటాయించారు. విద్యాశాఖలో ఏ అధికారీ ఎవరికీ ఎప్పుడూ సరైన సమాధానం ఇచ్చేవారు కాదు. గట్టిగా అడిగితే క్షణాల్లో అదృశ్యమయేవారు. ఈ నేపథ్యంలో మా కాలనీ ఎలా ఉండాలో అలానే ఉండేది. పిల్లలకి నిండుగా దుస్తులుండేవి కావు. మొదట్లో షోగ్గా బట్టలు ధరించి వచ్చిన పిల్లలు త్వరలోనే పీలికల మధ్య మిగిలారు. అడవిలో పని, పెరటిపని, వంటగదిలో విధులు, చదువు, వాటితో మొత్తానికి వాళ్ల దుస్తులు శిథిలమయ్యాయి. అతి కొద్ది మందికే బూట్లు ఉండేవి. ఎక్కువమంది మంచు, బురదనుంచి పాదాల్ని రక్షించుకునేందుకు వాటిచుట్టూ బట్ట చుట్టి తాడు కట్టుకునేవారు.

పిల్లలకి సరైన ఆహారానికీ కొరతే. ఆ రోజుల్లో ప్రభుత్వం రకరకాల ఆహారరేషన్లు ఇచ్చేది. మామూలుగా అందరికీ ఇచ్చే రేషన్లు, పెంచిన రేషన్, అనారోగ్యంగా ఉండేవారికి, దృఢకాయులకు, వైకల్యంగల పిల్లలకు, ఆసుపత్రులకు ఇలా ప్రత్యేకంగా వేర్వేరు రేషన్లు ఉండేవి. హుందాగా అడగడం, అవసరమైతే కాళ్లావేళ్లా పడటం, కొత్త రకాల వ్యూహాలు అమలుచేయడం, మా దరిద్రపుగొట్టు ఆకలి చూపులతో ప్రాధేయపడటం, తిండిలేకపోతే కాలనీలో కుర్రవాళ్ళు తిరగబడతారని హెచ్చరించడం... ఇలా ఏదో మార్గంలో చాలారకాల రేషన్లు సంపాదించేవాళ్లం. అతి తక్కువసార్లు

మాకు మాంసం, తెల్లరొట్టె, పాలు లభించేవి. ఒక్కోసారి మేం విద్యాశాఖ పరిధిని అధిగమించి ఇతర విభాగాలనూ సందర్శించేవాళ్లం. ఇలా ఇతర విభాగాలవద్దకు రేషన్ల కోసం వెళ్లినప్పుడు మాత్రం 'బాల నేరస్థుల కాలనీ సభ్యుల కోసం వంద పూడ్‌ల పిండి ఇవ్వాలని అర్థిస్తున్నాం' అనే లేఖ పట్టుకెళ్లేవాళ్లం. నిజానికి మా కాలనీలో ఎన్నడూ యువ నేరస్థులు అనే మాట వినిపించేది కాదు. నైతికలోపం ఉన్న పిల్లల కాలనీగా విద్యాశాఖలో మా పేరు నమోదై ఉండేది. కానీ ఈ మాట ఇతర విభాగాలవారికి అంత తేలికగా అర్థమయ్యేది కాదు. అటువంటి లేఖతో ఏదో ఒక ఆఫీసులోకి దూసుకెళ్లి అధికారి చేతిలో దాన్ని పెట్టేవాణ్ణి. విద్యాశాఖకూ – బాలనేరస్థులకూ మధ్య సంబంధం ఏమిటో ఆ రోజుల్లో చాలామందికి అర్థమయ్యేదికాదు. అసలు విద్యాశాఖకు సంబంధించిన మేం అక్కడికి ఎందుకు వచ్చామని కొందరు ప్రశ్నించేవారు. నా సమాధానాలు వారికి కొరుకునపడేవి కాదు. కానీ వారు బాగా ఆలోచించి నా దరఖాస్తుపై ఏదో గిలికి “వారం తర్వాత రండి” అనేవారు.

“అలా అయితే అంతదాకా ఓ ఇరవై పూడ్‌ల పిండి అయినా ఇప్పించండి” అని కోరేవాడిని. వాళ్లు చివరకు ఓ ఐదు పూడ్‌ల పిండి సప్లైకి అనుమతి ఇచ్చేవారు. అది మా అవసరాలకు ఎంతమాత్రం చాలేది కాదు. ఒక్కోసారి ఒక్కొక్క అధికారి మా దరఖాస్తు చదివి మారు మాట్లాడకుండా అనుమతి రాసి ఇచ్చేవారు. అలా జరిగినప్పుడు నేను హడావుడిగా, వేగంగా కాలనీకేసి పరిగెత్తుకొచ్చేవాడిని.

“కలీనా... కలీనా ఇవానోవిచ్. వంద పూడ్‌ల పిండి ఇదిగో ఆర్డర్. వెళ్లండి. నలుగుర్ని వెంట తీసుకెళ్లి పిండి తెచ్చేయండి. మళ్లీ ఎవరో అధికారి దానిపై విచారణ మొదలుపెట్టేలోగా వెళ్లి వచ్చేయాలి” అని కేకలు పెట్టేవాడిని. తిండి కోసం అంత కష్టపడాల్సి వచ్చేది ఆ రోజుల్లో. పిల్లలు ఎప్పుడూ అర్థాకలితో ఉండేవాళ్ళు. ఈ వాతావరణంలో వాళ్లకి విద్యాబుద్ధులు చెప్పి దారికి తేవడం అన్న పని అసలు సాధ్యమయేది కాదు. ఈలోగా కుర్రవాళ్ళు తమ స్వయంకృషితో కొంత తిండి సంపాదించే ప్రయత్నాలకు దిగేవారు.

స్వయంకృషి అంటే చేపల వేట.

చేపలు పట్టడం కోసం వాళ్లు అతిగా శ్రమించేవాళ్లేం కాదు.

పక్కనే ఉన్న వాగులో ప్రవహించే నీటిమధ్య గ్రామ ప్రజలు చదరంగా అమర్చిన చేపల వలలో చిక్కుకున్న చేపలు వాళ్లు అతి లాఘవంగా ఎత్తుకొచ్చేవారు. ఆ వలలు ఉంటే తప్ప చేపల్ని ఎత్తుకురావడం కుదరదని అర్థమై వాటిని మాత్రం అక్కడ ఉండనిచ్చేవారు. కానీ ఈ నియమంకూడా ఒకరోజు ఖచ్చితంగా అమలుకాలేదు. కారణం టారానెట్స్ అనే కుర్రవాడు. వాడికి పదహారేళ్లు. వాడు పుట్టిందే దొంగల కుటుంబంలో. సన్నగా, పొడవుగా, సరదాగా గడిపేసే టారానెట్స్ పెద్ద పనివాడే. వాడి బుర్రనిండా ఊహలే. కానీ అతనికి సమిష్టి ప్రయోజనాలంటే పెద్ద గౌరవం లేదు. వాడే వాగులో రైతులు అమర్చిన వలలు ఎత్తుకొచ్చాడు. అదో పెద్ద గొడవ అయింది. రైతులు అప్పటినుంచి తమ వలలను అతి జాగ్రత్తగా కాపలాకాయడం మొదలుపెట్టారు. చేపల దొంగతనం మావాళ్లకు అసాధ్యంగా మారింది. ఈలోగా టారానెట్స్ బృందం ఆ వలలను మా ముందు సగర్వంగా ప్రదర్శించి, “ పట్టణంలో ఒక మిత్రుడు” తమకు వాటిని బహుకరించాడని ప్రకటించారు. దీనితో ఈసారి వారే చేపల వేట ప్రారంభించారు. ఇలా పట్టిన చేపలు వాళ్లకే సరిపోయేవి. ఒకరోజు టారానెట్స్ ఒక పళ్లెంనిండా వేయించిన చేపలు తీసుకుని నా గదిలోకి వచ్చాడు. నాకు ఇవ్వబోయాడు.

నేను తిరస్కరించాను. కాలనీలో ప్రతి ఒక్కరికీ అందుబాటులో లేని ఆహారం నాకు వద్దన్నాను. టారానెట్స్ మొహం ఎర్రబారింది.

"నేను మిగిలిన వాళ్లకు ఎందుకు ఇవ్వాలి? వలలు తెచ్చేది, చేపలు పట్టేది నేను. నీళ్లలో రోజంతా నాని కష్టపడేది నేను. చేపలను మాత్రం అందరికీ పంచాలా" అని కోపంగా ప్రశ్నించాడు.

నేను సైతం కష్టపడటం లేదు కాబట్టి నాకు చేపలు అక్కర్లేదన్నాను.

బహుమతిగా స్వీకరించమన్నా వద్దన్నాను. "ఎత్తుకొచ్చిన వలల్లో పట్టిన చేపల్ని వండేందుకు వాడే సామగ్రి కాలనీదే. మొత్తం వంటపాత్రలు, నూనె, వంటచెరకు, స్టౌలు అన్నీ కాలనీవే. వాటి మాటేమిటి? అసలు ఆ వలలను ఊడలాక్కొని కాలనీకి స్వాధీనం చేస్తే తిక్క కుదురుతుంది. కానీ నీ అమిత్రవైఖరి అసహ్యం కలిగిస్తోంది. వలలు నీవైనంత మాత్రాన గొప్పేమిటి? చేపలు ఎవరైనా పట్టగలరు. ఎవరైనా ఆలోచించవలసింది మిత్రుల గురించి" అని దులిపేశాను.

చివరకు టారానెట్స్ దారికొచ్చాడు. "సరే మీరన్నట్లే కానివ్వండి. ఈ కూర తీసుకోండని అర్థించాడు.

నాటినుంచీ రోజుకు కొందరు చేపల వేటకు వెళ్లేవారు. పట్టిన చేపల్ని సరాసరి వంటగదికి పంపేవాళ్లం. అలా మాకందరికీ కొత్త ఆహారం లభించడం మొదలైంది.

అలాకాక ప్రతిరోజూ కలీనా ఇవానోవిచ్ మార్కెట్‌కి వెళ్లేవాడు. రోజు మా గుర్రం లాడీని బండికి పూన్చి ఇటు మార్కెట్‌కో, ఏవైనా ప్రభుత్వ విభాగాలకో, వేటకో బయలుదేరేవాడు. డాక్టర్ దగ్గరకో, మరో పనిమీదనో బయటికి వెళ్లవలసిన వాళ్లు ఇవానోవిచ్ వెంటపడేవారు. అలా వెళ్లగలిగిన అదృష్టవంతులు సాయంత్రం నిండిన పొట్టలతో తిరిగివచ్చేవాళ్ళు. మిత్రుల కోసం తినడానికి ఏదో ఒకటి తెచ్చేవాళ్ళు. ఎవరూ పారిపోయేందుకు ప్రయత్నించేవారు కాదు. పట్నంలో "మా అత్త ఇచ్చిందనో", "మిత్రుడు కలిశాడనో" చెప్పి వాళ్ళు తమవెంట ఏదో తిండి తెచ్చేవారు. నాకు విషయం అర్థమైనా ఏనాడూ వాళ్లని అనుమానంతో ప్రశ్నించి అవమానించలేదు. అనుమానించి మాత్రం ప్రయోజనం ఏమిటి? వాళ్లు ఆకలితో నకనకలాడే కుర్రవాళ్ళు. ఆ పరిస్థితుల్లో నైతిక విలువల, తప్పొప్పుల గురించి ప్రసంగించి లాభంలేదని నేను నిశ్చయించుకున్నాను. మొత్తానికి మా కాలనీ దారిద్ర్యం వల్ల ఒక మంచి జరిగింది. నేనూ, టీచర్లూ, పిల్లలు అనే తేడా లేకుండా అందరం నిరంతరం ఆకలితో ఉండేవారం. మాకు జీతాలు వచ్చినా అవి ఏమూలకూ చాలేవి కావు ఆరోజుల్లో. ఆ శీతాకాలం అయితే నా బూట్లకు అడుగు అనేది లేకుండా అరిగిపోయింది. చిరిగిన బూట్లనుంచి పాదాలకు చుట్టిన బట్ట బయటకు కనిపించేది. ఇంతటి దారిద్ర్యంలోనూ మా టీచర్ ఎకతెరీనా ఒక్కరే మడత నలగని దుస్తుల్లో, శుభ్రంగా కనిపించేది.

4

ఫిబ్రవరిలో ఓ రోజు నా ఆఫీసు మేజా సొరుగునుంచి నోట్లకట్ట ఒకటి మాయమైంది. అది నా ఆరునెలల జీతంతో సమానమైన మొత్తం. అప్పట్లో ఆ గదే నా ఆఫీసు, టీచర్ల గది, ఎకౌంటెంట్ ఆఫీసు, క్యాష్‌కౌంటర్‌కూడా, ఈ బాధ్యతలన్నీ నేనే చూసేవాడినిమరి. ఇంతకీ ఆ గదిలోని బల్ల సొరుగులోంచే నోట్లు అదృశ్యమయ్యాయి. వేసిన తాళం వేసినట్టే ఉంది!

ఆ సాయంత్రమే నేను కుర్రవాళ్లందరినీ పిలిచి విషయం తెలిపాను. మర్యాదగా ఆ డబ్బు వెనక్కి ఇచ్చేయాలని కోరాను. డబ్బు దొంగతనం జరిగిందని అనేందుకు నా వద్ద రుజువులు లేవని, పై అధికారులు ఆ డబ్బు నేనే మాయం చేశానని అన్నా దిక్కులేదని వాళ్లకి చెప్పాను. వాళ్లు

అత్యంత జాగ్రత్తగా, నిశ్శబ్దంగా నా మాటలు విన్నారు. అంతే నిశ్శబ్దంగా అక్కడినుంచి వెళ్లిపోయారు. ఆ తరువాత కొద్దిసేపటికి చీకట్లో పెరటిలో తిరుగుతున్న నన్ను ఇద్దరు పిల్లలు అటకాయించారు. ఒకరు టారానెట్స్, మరొకడు గడ్ అనే సన్నటి కుర్రవాడు.

"డబ్బు తీసిందెవరో మాకు తెలుసు. కావాలనే అందరిముందూ చెప్పలేదు. తీసిందెవరో తెల్సినా, ఎక్కడ దాచాడో తెలియదు. మనకి తెలిసినట్టు వాడికి అర్థమైతే డబ్బుతో సహా ఉడాయిస్తాడు. అందుకే..." అని టారానెట్స్ నాతో చిన్న గొంతుకతో చెప్పాడు.

"ఎవరు అతను" అని ప్రశ్నించాను.

టారానెట్స్ సమాధానం చెప్పేలోగా గడ్ అడ్డుపడ్డాడు.

ఎవరో చెబితే నేనే సరాసరి వాడిని అడుగుతానని వారికి సూచించాను.

టారానెట్స్ ఒప్పుకోలేదు.

"సరే మీ ఇష్టం" అంటూ వెళ్లి నిద్రకు ఉపక్రమించాను. మర్నాటి ఉదయం గుర్రపుశాలలో దాచివున్న నోట్లు గడ్ కంటపడ్డాయి. అతనే ఉత్సాహంగా ఆ నోట్లకట్లను నా వద్దకు తెచ్చాడు. వాడి ఉత్సాహం మొత్తం కాలనీకి పాకిపోయింది. కుర్రవాళ్లంతా హుషారుగా నా గదిలోకి వచ్చి నావంక చూడటం మొదలుపెట్టారు.

రెండు రోజుల తర్వాత ఎవరో కానీ నేలమాళిగ తాళాలు విరిచి కొన్ని పౌండ్ల పందికొవ్వును మాయం చేశారు. మావద్ద ఉన్న నూనె నిల్వ అంతా అదే. మరో రెండు రోజుల తర్వాత సామాను గది కిటికీ పెకలించి కొన్ని మిఠాయిలు, అక్కడేవున్న బండికందెన (గ్రీజు) ఎత్తుకుపోయారు. ఆ రోజుల్లో గ్రీజు అంటే బంగారమే.

ఈ సంఘటనలతో ఇవానోవిచ్ వెర్రెక్కిపోయాడు. పిల్లలమీద అరుపులు ప్రారంభించాడు. "జలగల్లారా...మీరు దొంగిలిస్తున్నది ఎవరి సొత్తు అనుకుంటున్నారు? మీదేరా. మిమల్ని మీరే దోచుకుంటున్నారు" అని కేకలు పెట్టాడు.

ఇంటి దొంగలెవరో తెలిసినా బయటపెట్టే ఉద్దేశం లేనట్టు టారానెట్స్ ప్రవర్తించాడు. మిగిలిన పిల్లలకు ఇదొక దొంగతనంలా కాక, వినోదంగా కనిపించడం మాకు ఆందోళన కలిగించింది. తమ సొత్తు తామే దొంగిలిస్తున్నామని వాళ్లకి అర్థం కావడం లేదు. నాకు కోపం ఆగలేదు. విసవిసా నడుస్తూ డార్మెటరీలోకి వెళ్లి బిగ్గరగా అరిచాను.

"ఏంటది? మీరసలు మనుషులా?..." అని ప్రశ్నించాను.

మూలనుంచి సన్నగా ఓ సమాధానం వినిపించింది. "మేం ఒక ముఠా. దొంగల ముఠా" పిల్లలంతా అందుకున్నారు. "అవును, దొంగలం" అని అరిచారు.

"కాదు. మీరు దొంగలు కారు. చిల్లర దొంగలు. ఒకరినొకరు మోసం చేసుకునే చిల్లర మనుషులు. చూడండి. ఇప్పుడు వంటకు నూనె లేదు. వచ్చే ఫిబ్రవరి వార్షికోత్సవాల్లో మిఠాయిలుండవు. మనకి ఇప్పుడు ఇక ఎవరూ ఇవ్వరు. మీరేమైనా నాకనవసరం" అని బదులిచ్చాను.

ఒక కుర్రవాడు ముందుకొచ్చాడు. "మీకేం తెలియదు ఆంటన్ సెమ్యోనోవిచ్‌గారూ. మేం ఏం చేయగలం?" అని అమాయకంగా ప్రశ్నించాడు.

నాకు ముందే తెలుసు. ఇదంతా కంఠశోష అని. పెద్ద పిల్లల్లో ఎవరో ఈ పని చేశారు. మిగిలినవారికి చెప్పడానికి భయం.

మర్నాడు నా వెంట ఇద్దరు కుర్రవాళ్లని తీసుకెళ్లి వివిధ విభాగాల్లో రేషన్‌కోసం ప్రయత్నించాను. అలా ప్రయత్నించగా కొద్దిరోజుల తరువాత మాకు కొంచెం కొవ్వునూనె, కాసిన్ని మిఠాయిలు లభించాయి. ఇచ్చిన వాటిని పొదుపుగా వాడుకోనందుకు అధికారుల శాపనార్థాలు తప్పలేదు. మేం కాలనీకి తిరిగివచ్చి ఈ కాస్త రేషన్‌కోసం ఎంత శ్రమపడ్డామో, ఎన్ని తిట్లు తిన్నామో అందరికీ సుదీర్ఘంగా వివరించాను. కొవ్వునూనెను నేలమాళిగలో భద్రపరిచాం. ప్రయోజనం శూన్యం. ఆ రాత్రే అది మాయమైంది.

అలా జరగడం మంచిదని నాకప్పుడు అనిపించింది. ఇప్పుడైనా ఈ శుంఠలకు సమిష్టి ప్రయోజనం అంటే బోధపడుతుందనీ, జరిగిన నష్టం అర్థమై దొంగలను పట్టుకునేందుకు వాళ్ళు సిద్ధపడతారనీ అంచనా వేశాను. కొంతవరకూ అదే జరిగింది. మళ్ళీ కొవ్వునూనె మాయమైందన్న సమాచారం విని కుర్రవాళ్ళు మొహాలు వేలాడేశారు. అయితే అది కొద్దిసేపే. నాది అత్యాశ అని వెంటనే తేలింది. కుర్రవాళ్లని మళ్లీ క్రీడోత్సాహం ఆవరించింది. అంత లాఘవంగా సామాను ఎత్తుకెళ్తున్నదెవరనే ఆరాధనతో కూడిన ఆసక్తి వారిలో కనిపించింది. నాలుగురోజులు తిరగకుండా గుర్రం మెడ పట్టీ అదృశ్యమైంది. దానితో సరకుల కోసం బండి కట్టడం కష్టమైంది. గుర్రం పట్టీ కోసం పొరుగువాళ్లందరినీ ప్రాధేయపడటం మొదలైంది.

దొంగతనాలు జోరందుకున్నాయి. ప్రతిరోజూ ఏదో ఒకటి – గొడ్డలి, ఒక రంపం, ఓ వంటపాత్ర, జీనుకువేసే బెల్టు... ఇలా ప్రతిరోజూ తెల్లవారేసరికి ఏదో ఒక వస్తువు దొంగతనం జరిగిందని బయటపడేది. ఇక నాకు నిద్రపట్టడం మానేసింది. రెండు మూడు రాత్రులు రివాల్వర్‌తో పెరట్లో పచార్లు చేశాను. ఇక నావల్లకాక తోటి టీచర్ ఒసిపోవ్‌ను ఓ రాత్రి గస్తీ తిరగమని అడిగాను. అతను బెదిరిపోయి తనవల్ల కాదన్నాడు. ఆ రాత్రి జదరోవ్ అనే కుర్రవాడు నా దగ్గరికి వచ్చాడు. దొంగలు అంటే భయపడవద్దని, అలా దొంగతనాలు చేయడం మంచిది కాదనీ అతనికి నచ్చ చెప్పేందుకు ప్రయత్నించాను. అతను పెద్దగా పట్టించుకోలేదు.

"వాళ్లు దోచుకుంటున్నది మీ అందరినీ, నిన్ను" అని నచ్చచెప్పబోయాను.

జదరోవ్ నవ్వాడు. "నా దగ్గరేముంది, దోచుకునేందుకు?" అని ప్రశ్నించాడు.

"పోతున్నవి మొత్తం కాలనీకి చెందిన వస్తువులు. నువ్వు ఈ కాలనీలోనే బతుకుతున్నావు" అని వివరించబోయాను.

"ఇది బతుకా?" ఎదురడిగాడు జద్‌రోవ్. "దీన్ని బతుకంటారా? మీ ఈ కాలనీలో సాధించేది శూన్యం. ఈ ప్రయత్నం వదిలేస్తేనే మంచిది. ఎత్తుకుపోయేందుకు పనికొచ్చే వస్తువులు అయిపోగానే వీళ్లంతా పారిపోతారు. అంతగా కావాలంటే రెండు భారీ తుపాకులతో వాచ్‌మెన్‌లను పెట్టుకోండి" అని ఉచిత సలహా ఇచ్చాడు.

అది కుదరదన్నాను. "మళ్లీ ఇద్దరు వాచ్‌మన్‌లను భరించగలిగే స్థితిలో కాలనీ లేద"ని చెప్పాను.

"అంతేకాదు. మీరే దీని యజమానులనే సంగతి మీకు అర్థం కావాలి కూడా" అని చెప్పాను.

కాలనీకి వచ్చిన రెండవ బృందంలో అందరికంటే చురుకైన బ్రాచెంకో కూడా నాకు ఇదే సలహా చెప్పాడు. వాచ్‌మెన్‌ని పెడితే అందరికీ బుద్ధి వస్తుందని అతని అభిప్రాయం. కోస్త్యా వెట్కోవ్‌స్కీ అనే కుర్రవాడు మాత్రం దీనితో విభేదించాడు. అందంగా ఉండే కోస్త్యా కథ వేరు. దొంగ వారెంట్లతో జనం ఇళ్లను సోదాచేసే ఒక ముఠాలో వాడు ఉండేవాడు. అయితే అసలు దొంగలు ఆ ముఠాతో ఉన్న పెద్ద కుర్రవాళ్ళు. కోస్త్యాకు దొంగతనాలంటే చిరాకు. అటువంటివాడు ఆ ముఠాలో

ఎందుకన్నాడో నాకు ఆశ్చర్యం కలిగేది. పట్టుబడి ఇక్కడకు చేరాడు. అతనికి రాజకీయ పరిజ్ఞానం కూడా ఉంది!

"వాచ్‌మెన్ అవసరమే లేదు. ఆంటన్ సెమ్యోనోవిచ్ చెప్పేది సరైనది. ఇప్పుడు మనకి అర్థం కావడం లేదు. కానీ కాలనీలో దొంగతనాలు జరిగితే మనకే నష్టమని ఓనాడు తెలిసివస్తుంది. ఇప్పటికే మనలో చాలామందికి అది బోధపడింది కూడా. త్వరలో మనమే కాపలా కాద్దాం. ఏమంటావ్ బరున్" అని పక్కనవాడిని అడిగాడు.

'తప్పకుండా' అన్నది బరున్ సమాధానం.

అదే నెలలో మా ఆయా ఉద్యోగం మానేసి ఆసుపత్రిలో చేరేందుకు సిద్ధమైంది. ఒక ఆదివారం మా గుర్రం లాడీని బండికి పూన్చి ఆమెను సామానుతో సహా సాగనంపేందుకు ఏర్పాట్లు చేశాం. అంతకాలం ఆవిడ ప్రేమగా ఇచ్చిన టీ తాగి, పెద్దరికంతో చెప్పే సలహాలు కోరిన కుర్రకారంతా బుద్ధిగా, వినయంగా ఆవిడకు గల సామగ్రి - అనేక మూటలూ, జాడీలు, డబ్బాలని శ్రద్ధగా బండిలో సర్దారు. బండి వెంట కొంత దూరం వెళ్లి ఆమెకు వీడ్కోలు చెప్పి తిరిగి వచ్చారు.

కానీ ఆ రాత్రే ఆమె బండితో తిరిగి వచ్చి గగ్గోలు ప్రారంభించింది. ఆ సామానును దారిలోనే మావాళ్ళు మాయం చేశారని ఆరోపణ. ఏం చేయాలి? ఆ నిలువుదోపిడీని ఎలా సహించగలను? ఆ క్షణమే నేను నిద్రలో వున్న ఇవానోవిచ్‌ను, జడరోవ్, టారానెట్స్‌లను నిద్రలేపి కాలనీ అంతా వెదికాను. అటువంటి సామగ్రిని, అంత హడావుడిలో కనుమరుగు చేయడం వాళ్లకి సాధ్యం కాలేదు. మొత్తానికి పోయిన వస్తువులన్నీ కాలనీలో, చుట్టుపక్కల పొదల్లో భద్రంగా ఉన్నాయి. వాటిలో కొన్ని మెట్ల కింద, వరండా మూలల్లో, అల్మారాల వెనక కూడా కనిపించాయి. చూస్తే ఆవిడ ఖరీదైన మనిషే. ఆమె వస్తువుల్లో డజను సరికొత్త టేబిల్ క్లాత్‌లు, ఓ తువాళ్ల కట్ట, కొన్ని వెండి చెంచాలు, ఒక బంగారు కంకణం, చెవి రింగులులాంటి వస్తువులు చాలా ఉన్నాయి. నేను ఆ కుర్రవాళ్లపై విరుచుకుపడ్డాను. మొదట అందరూ తమకే పాపం తెలియదని బుకాయించినా చివరకు తమ తప్పు ఒప్పుకున్నారు. అయితే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే వారిలో ఏ ఒక్కరూ ఆ పెద్దావిడ వద్దగల విలువైన వస్తువుల కోసం ఆ పని చేయలేదట. ఏదో ఒక తువ్వాలు, ఒక కప్పు మాత్రం ఆమె జ్ఞాపకార్థం అట్టిపెట్టుకోవడమే వారి ఉద్దేశమట. మరి అంత విరగబడి నిలువుదోపిడీకి దిగినదెవరు? దర్యాప్తు ప్రారంభించాం.

ఈ మొత్తం వ్యవహారానికి బరున్ బాధ్యుడని తేలింది. మిగిలిన వారి సంగతెలా ఉన్నా నేను మాత్రం నివ్వెరపోయాను. ఆదినుంచీ మిగిలిన అందరికంటే బరున్ మాత్రమే నాకు అత్యంత విశ్వసనీయుడుగా కనిపించాడు. గంభీరంగా, హుందాగా, అదే సమయంలో స్నేహంగా మెసిలేవాడు. చదువుల్లో శ్రద్ధగల వారందరిలోకీ అతనే మేధావిగా కనిపించేవాడు. అదంతా నాటకమేననీ, ముసలావిడ ఆస్తినంతా దోచుకునేందుకు ప్రయత్నించినది అతనేననీ రుజువవడంతో నేను తేరుకోలేకపోయాను. దీన్నిబట్టే కాలనీలో మునుపు జరిగిన దొంగతనాలకూ అతనే బాధ్యుడని నిశ్చయంగా తేలిపోయింది.

ఎట్టకేలకు ఇక్కడ జరిగే దొంగతనాలకు కారణం ఎవరో కనుక్కోగలిగాం. బరున్ వ్యవహారాన్ని 'ప్రజా న్యాయస్థానం' ముందుంచాను. మా కాలనీ చరిత్రలో అటువంటి కోర్టు జరగడం అదే తొలిసారి.

విచార వదనాలతో, పీలికలుగా ఉన్న దుస్తుల్లో మా కుర్రవాళ్ళు న్యాయనిర్ణేతల పాత్ర పోషించారు. ఆ పిల్లల మొహాల్లో ఉద్రిక్తత లాంతరు వెలుగులో రెట్టింపు అవుతోంది. ఆ వెలుగులో బలమైన మెడతో, నిర్లక్ష్యమైన కళ్లతో నిలబడిన బరున్ ఒక అమెరికన్ దొంగల ముఠాకోరుగా కనిపించాడు. దృఢమైన కంఠంతో బరున్ చేసిన నేరం ఏమిటో పిల్లలందరికీ వివరించాను. ఒక ముసలామెను దోచిన వైనాన్ని వివరించాను. పిల్లలందరినీ అంతగా ప్రేమించిన మనిషిపట్ల అతనెలా ప్రవర్తించాడో చెప్పాను. అనారోగ్యం పాలైన ఆ మనిషికి సాయం చేయవలసిన మనుషులు తమ మానవత్వాన్ని కోల్పోయి జంతువులకంటే హీనంగా ప్రవర్తించిన వైనాన్ని వివరించాను. మనిషికి ఆత్మగౌరవం ఉండాలన్నాను. దారీ దిక్కూ లేని ఒక ముసలి మహిళను దోచుకోవడం తప్పని చెప్పాను.

నా ఉపన్యాసం పనిచేసిందో, లేక జరిగింది అన్యాయమని వాళ్లకే తోచిందో ఏమో కానీ వారందరి తరఫున బ్రాచెంకో మాట్లాడాడు. బరున్ వైపు తిరిగి చేతులు జాపి అడిగాడు.

"సరే. ఏం చెప్పుకుంటావు? నిన్ను జైలుకు పంపాల్సిందే. నీకు ఆకలి వేసి ఉండవచ్చు. కానీ ఇదివరకు ఆంటన్ సెమ్యోనోవిచ్ డబ్బుని కొట్టేసింది నువ్వేగా" అని అడిగాడు.

బరున్ మెరుపులా స్పందించాడు.

"ఆంటన్ సెమ్యోనోవిచ్ డబ్బా? చేతనైతే రుజువు చెయ్యి" అని సవాలు చేశాడు.

"ఎవరు రుజువు చేయగలరు?" అని తల ఎగరేసి ప్రశ్నించాడు.

ఆ గుంపులో ఓ మూల నుంచి టారానెట్స్ మాట తూటాలా దూసుకొచ్చింది.

"నేను"

ఇది బరున్‌కు శరాఘాతమేనని తెలిసిపోయింది. అతని మొహం పాలిపోయింది. కొంత తేరుకుని బుకాయింపు మొదలుపెట్టాడు.

"సరే. నేనే. అయితే ఏం? ఆ డబ్బుని తిరిగి వెనక్కి ఇచ్చేశాగా" అని ప్రశ్నించాడు.

పిల్లలంతా ఘొల్లున నవ్వారు. ఇది నేను ఊహించని పరిణామం. వాళ్లు ఈ సంవాదాన్ని పెద్ద వినోదంగా పరిగణిస్తున్నారని తెలుస్తూనే ఉంది. టారానెట్స్ గంభీరంగా ముందుకు వచ్చాడు.

"బరున్ ఈ పనులన్నీ చేసి ఉండవచ్చు. అయినా తనని బహిష్కరించకూడదు. ఆ మాటకొస్తే మనమంతా తప్పులు చేశాం. చేయకూడని నేరాలెన్నో చేశాం. అలా అని బరున్‌ని క్షమించి వదిలేయాలనను. వాడి తాట వొలవాల్సిందే" అని తీర్పు చెప్పబోయాడు.

దానితో బరున్ మొహం కందిపోయింది. "అలాగా... నా తాట వొలుస్తావా? అదీ చూద్దాం. ఏం? ఈ కాలనీ డైరెక్టర్ అయిపోవాలని ప్రయత్నిస్తున్నావా? నీ జీవితంలో అది సాధ్యపడదు. అవసరమైతే ఆంటన్ సెమ్యోనోవిచ్ నా వీపు పగలగొడతారు. అంతే తప్ప ఈ వ్యవహారంతో నీకే సంబంధం లేదు" అన్నాడు.

ఈ మాటతో వెట్కోవ్‌స్కీకి కోపం వచ్చింది.

"ఓహో... మాకే సంబంధం లేదా? లేదంటావా... రేయ్ చెప్పండ్రా మనకి సంబంధం ఉందా? లేదా?" అని కుర్రవాళ్లకేసి తిరిగి ప్రశ్నించాడు.

పిల్లలంతా ముక్తకంఠంతో "ఉంది... ఉంది" అని కేకలతో బదులిచ్చారు. "బరున్‌గాణ్ణి మనమే బాగా చితగ్గొట్టగలం. ఆంటన్ గారికంటే వాడికి బాగా బుద్ధి చెప్పగలం" అంటూ వారిలో కొందరు బరున్ వైపు దూసుకొచ్చారు.

ఈలోగా జడరోవ్ నా పక్కకి వచ్చి చెవిలో గుసగుసగా చెపుతున్నాడు. "బరున్‌ని అవతలకి పంపించండి. లేదా వాళ్లు వాడిని చావగొట్టేస్తారు" అని.

వెంటనే రంగంలోకి దిగి బరున్‌కి అడ్డుగా నిలబడ్డాను. జడరోవ్ మిగిలినవాళ్లని వెనక్కి లాగాడు. అంతా సర్దుమణిగింది.

తలవంచుకుని నిలబడిన బరున్ మొహం ఎత్తకుండానే చెప్పాడు. "మీరంతా చెప్పింది సబబే. ఆంటన్ సెమ్యొనోవిచ్‌గార్ని నన్ను శిక్షించనివ్వండి. ఆయనకు తోచిన శిక్ష విధించమనండి."

అందరూ నిశ్శబ్దంగా తోవ ఇచ్చారు. నేను, బరున్ వారి మధ్య నుంచి నడిచి చీకటిగా ఉన్న పెరట్లోంచి నడిచి నా గదికి వెళ్లాం. బరున్‌ని చూస్తే అసహ్యం వేసింది. ఇటువంటి నీచుడిని ఏం చేయాలో అర్థం కాలేదు. ఒక దొంగల ముఠా సభ్యుడైన బరున్‌ని అధికారులు అరెస్టు చేసి కాలనీకి పంపారు. వాడి ముఠాలోని చాలామంది పోలీసు తూటాలకు మరణించారు. వీడి వయసు పదిహేడేళ్లు.

గదిలో తలుపు పక్కన తలవంచుకుని నుంచున్న బరున్ మౌనంగా ఉన్నాడు.

నా టేబుల్ మీద ఉన్న ఏదైనా బరువైన వస్తువుని వాడిపైకి విసిరి ఈ తతంగాన్ని ముగిద్దామన్నంత చికాకు కలుగుతోంది. వాడివంక తీక్షణంగా చూస్తున్నాను.

చివరికి బరున్ తలఎత్తి తదేకంగా నా వంక చూశాడు. తన కళ్లవెంట నీళ్ళు! తోసుకువస్తున్న వెక్కిళ్ళు దిగమింగుతూ అయినా... పొడిపొడిగా అయినా స్పష్టంగా చెప్పాడు. "నేనిక... దొంగతనం... చేయను."

నాకు అసహనం పెరిగింది. "ఇదే మాట కోర్టు కమిషన్‌కు చెప్పి ఇక్కడకు వచ్చావు. నువ్వు అబద్ధాలకోరువి" అన్నాను.

"అది కమిషన్. నేను ఇక్కడ మాట ఇస్తున్నది మీకు. మీరే శిక్ష విధించినా సిద్ధం. కానీ నన్ను బయటకు గెంటకండి" అని దీనంగా అన్నాడు.

"ఈ కాలనీలో నీకు అంత నచ్చినదేమిటి?" అని అడిగాడు.

"ఇక్కడ పాఠాలు నచ్చాయి. చదువుకుంటాను. దొంగతనం చేసిన మాట నిజమే. కారణం నాకు ఎప్పుడూ ఆకలి వేస్తూంటుంది."

"సరే. నిన్ను మూడురోజుల పాటు గదిలో ఖైదు చేసి ఉంచుతా. రొట్టె, నీళ్లు తప్ప ఏమీ ఇవ్వను. అలాగే... ఆ తరువాత టారానెట్స్ జోలికి నువ్వు పోకూడదు" అని నా షరతులు చెప్పాను.

"మీ ఇష్టం"

బరున్ మూడు రోజుల పాటు డార్మెటరీ పక్కన గల చిన్నగదిలో ఖైదీగా ఉన్నాడు.

ఆ గదికి నేను తాళం వేయలేదు. గదినుంచి కదలనని వాడు ఇచ్చిన మాటని నేను నమ్మాను. మొదటిరోజు నిజంగా రొట్టె, నీళ్ళు తప్ప అతనికి ఏమీ పంపలేదు. మర్నాడు నాకే జాలిగా అనిపించి పూర్తి భోజనం పంపమన్నాను. బరున్ ఆత్మగౌరవాన్ని ప్రదర్శించబోయాడు. తనకు భోజనం వద్దన్నాడు. నేను ఊరుకోలేదు.

"చాల్లే ఆ పొగరు తగ్గించుకో" అని అరిచాను.

బరున్ బలహీనంగా నవ్వాడు. భుజాలు ఎగరేసి మారు మాట్లాడకుండా భోజనం చేశాడు.

కానీ, చివరికి బరున్ తన మాట నిలుపుకున్నాడు. ఆ తరువాత ఎన్నడూ తను దొంగతనానికి పాల్పడలేదు.

5

ఈ సంఘటన ప్రభావం కాలనీ వాసులపై కొంతవరకూ పనిచేసింది. ఆ తరువాత వాళ్లెవరూ, ఏనాడూ కాలనీ సంపదపై కన్నేయలేదు. కానీ బయటి వ్యవహారాలు, పొరుగున జరిగే సంఘటనల ప్రభావం మాపై ఉండేది.

కాలనీ వెలుపల ఖార్కోవ్ రహదారిపై ప్రయాణికుల దోపిడీ జరగని రాత్రంటూ లేకపోయింది. ఆ రోడ్డుపై వెళ్ళే బళ్ల బృందాన్ని దొంగలముఠాలు ఆపివేసేవి. బారెల్ కోసిన రైఫిల్ నుంచి పేల్చిన తూటా శబ్దానికి అందరూ బళ్లునిలిపివేసేవారు. వెంటనే వారిపై ముఠా విరుచుకుపడి ముఖ్యంగా ఆడవారి లోదుస్తులు తడిమి అక్కడ వారు దాచిన డబ్బుని దోచుకునేవారు. అయితే ఈ సంఘటనల్లో ఏనాడూ రక్తపాతం ఉండేది కాదు. ఎందుకంటే భయంతో బిక్కచచ్చిన గ్రామీణుల నుంచి ప్రతిఘటనే ఉండేది కాదు కాబట్టి.

ఒక్కోసారి దొంగలు ఆ స్థలం నుంచి అదృశ్యమైన తరువాత ప్రయాణికులంతా కాలనీకి పరుగున వచ్చేవారు. జరిగిన వృత్తాంతాన్ని సవివరంగా చెప్పేవారు. సంగతి తెలియగానే నేను నలుగురినీ పోగుచేసి చెక్కబల్లేలు, నా తుపాకితో సహా ఆ ప్రాంతానికి వెళ్లేవాళ్లం. దోపిడీ జరిగిన స్థలం పరిసరాలు గాలించేవాళ్లం. ఎప్పుడూ ఏ ఆధారం దొరికేదికాదు. ఒక్కసారి మాత్రం మేం సఫలమయ్యాం. రోడ్డుకు అరకిలోమీటరు దూరంలో పరుగులు తీస్తున్న చిన్న ముఠా మాకు కనిపించింది. మా కుర్రవాళ్ల అరుపులకు వారు ఒక తూటాతో సమాధానమిచ్చి పారిపోయారు. వెంటపడిన మాకు మొత్తానికి వాళ్లలో ఒకడు దొరికిపోయాడు. వాణ్ణిమేం కాలనీకి తీసుకొచ్చాం. వాడి దగ్గర తుపాకీ కానీ, దోచుకున్న సొత్తు కానీ లేదు. నేను దొంగనే కాదని వాడు బుకాయించాడు. అయితే నేరవిచారణ విభాగానికి వాడిని అప్పగించిన తరువాత బయటపడిన సమాచారం ప్రకారం అతనొక పేరుమోసిన దోపిడీదొంగ. ఎలాగైతేనేం చివరకు ఆ మొత్తం ముఠా పట్టుబడింది. అందుకు ప్రభుత్వ ప్రతినిధులు 'గోర్కీ కాలనీ'కి కృతజ్ఞతలు చెప్పారు.

అయినా దారి దోపిడీ సంఘటనలు ఆగలేదు. ఈలోగా శవాలు బయటపడటం మొదలైంది. పైన్ వృక్షాల తోపు మధ్య మంచునుంచి ఒక చెయ్యి మాత్రం జెండా కొయ్యలా బయటకు పొడుచుకు వచ్చి కనిపించింది. తవ్వితే ఒక యవతి మృతదేహం. మరోసారి పొదల్లో బండితోలేవాడి దుస్తుల్లో ఉన్న పురుషుడి శవం. ఇంకోరోజు చెట్లకు వేలాడుతున్న రెండు మృతదేహాలు. ఈ సంఘటనలేవీ మా కుర్రవాళ్లని కించిత్ భయపెట్టలేదు సరికదా వసంతంలో మంచు కరగడం మొదలైన తరువాత వాళ్లు అస్తిపంజరం కోసం అన్వేషించేవాళ్లు. దొరికిన కపాలాలు కర్రలకి తగిలించి కాలనీలోకి వచ్చి తమ టీచర్ లిడియా పెట్రోవ్నాను హడలెత్తించేవారు. దీంతో ప్రమేయం లేకుండానే కాలనీ సిబ్బంది, టీచర్లు నిరంతరం భయంతో గడగడలాడుతుండేవారు. ఎప్పుడు ఏ ముఠా విరుచుకు పడుతుందోనని బెంగతో గడిపేవారు. టీచర్లందరిలోకి ధనికులుగా గుర్తింపు పొందిన ఒసిపోవ్ దంపతుల పరిస్థితి మరీ దయనీయంగా ఉండేది.

ఓ సాయంకాలం పట్టణం నుంచీ సామానుతో తిరిగివస్తున్న మా బండిని కాలనీ మలుపు అవతల దొంగలు నిలిపివేశారు. బండిమీద ధాన్యం, చక్కెర ఉన్నా వారికవి అంతగా నచ్చలేదు. బండిలో ఉన్న ఇవానోవిచ్ వద్ద పైప్ తప్ప మరేం లేదు. చికాకుపడిన ఆ ముఠాదొంగలు ఇవానోవిచ్‌ని నెత్తిమీద కొట్టి కిందపడేశారు. మా గుర్రం లాగే సంరక్షణ బాధ్యతను చూసే గడ్ ఈ సంఘటన

జరిగినంతసేపూ నిశ్శబ్దంగా నిలబడే వున్నాడు. మొత్తానికి వాళ్లు కాలనీకి తిరిగివచ్చి దీని గురించి మాకు చెప్పారు. ఇదంతా ఎంత నాటకీయంగా జరిగిందో ఇవానోవిచ్ వివరిస్తుంటే, ఇదెంత హాస్యాస్పదంగా జరిగిందో గడ్ మాకు చెప్పాడు. అయితే ఇకనుంచీ కాలనీకి సరకుతో తిరిగివచ్చే బండికి రక్షణ ఉండాలని అందరం నిర్ణయించాం.

దాదాపు పదిమందిమి ఈ ఎస్కార్ట్ బృందంలో ఉండేవాళ్లం. నేను నా రివాల్వర్‌తో సహా ఆ గస్తీ బృందంలో చేరేవాడిని. ఎప్పుడైనా నాకు వీలుకాకపోతే రివాల్వర్‌ను జదరోవ్‌కి ఇచ్చి పంపేవాడిని. అదే మహద్భాగ్యంగా ఆ కుర్రవాడు తన చింకి దుస్తులపై ఆ రివాల్వర్‌ను ధరించి గర్వంగా ముందు నడిచేవాడు. రోడ్డుపై ఈ ఎస్కార్ట్ తతంగం అత్యంత ఆసక్తికరంగా ఉండేది. బృందంలోని సభ్యులంతా నదిమీద వంతెన నుంచీ మా కాలనీ మలుపుదాకా దాదాపు కిలోన్నర పొడవైన రోడ్డుమీద దూరం దూరంగా తిరిగేవాళ్లం. చలి బాధను తట్టుకునేందుకు కుర్రవాళ్లు మంచుదిబ్బలపైనే పరుగులు పెట్టేవాళ్లు. ఒకరితో ఒకరు సంబంధం కోల్పోకుండా ఉండేందుకు వారు ఉన్నట్టుండి కేకలు పెట్టేవారు. వాళ్ల మధ్య సంబంధం సంగతి ఎలా ఉన్నా ఈ కేకలు ఆలస్యంగా ఇళ్లకు చేరుతున్న పరిసరాల గ్రామ ప్రజలను భయభ్రాంతులను చేసేవి. ప్రమాదకరంగా కనిపించే మా కుర్రవాళ్లు ఇలా రహదారిపై హంగామా చేయడం క్రమంగా గ్రామీణులకు అలవాటైంది. ఈలోగా రహదారి గస్తీ విధులు నిర్వర్తించే పహారా సిబ్బంది, అధికారులు మా కుర్రవాళ్ళని అనుమానంగా చూసుకుంటూ ముందుకు సాగేవారు. ఈ నెపంతో వారు తమ వద్దగల రైఫిళ్లు, తుపాకులను ప్రదర్శించేవారు.

నేనుకూడా ఉన్నప్పుడు కుర్రవాళ్లు ఇంత గోల చేసేవారు కాదు. కనీసం దారిపై ప్రయాణికులను భయపెట్టేవారు కాదు. దూరంగా మా బండి పట్టణం నుంచి తిరిగివస్తూ మలుపులో ప్రత్యక్షం కాగానే కుర్రవాళ్లు దాని ముందుకు పరుగెత్తేవారు. "ఆపండి.. చేతులు ఎత్తండి" అని అరిచేవాళ్లు. ముందు కూర్చున్న ఇవానోవిచ్ తృప్తిగా నవ్వేవాడు. చివరికి అందరు బండివెంట బారుతీరి నడుస్తూ కాలనీకి చేరేవారు.

ఆ శీతాకాలంలోనే మాకు మా కాలనీ ప్రభుత్వానికి అతి ముఖ్యమైన పని ఒకటి తగిలింది. దేశ ప్రయోజనానికి చెందిన బాధ్యత అది. చట్టవిరుద్ధంగా అడవిలో చెట్లు నరుకుతున్న సంఘటనలు ఇటీవల బాగా పెరిగాయని, ఈ దొంగతనాలను అరికట్టడంలో సహకరించాలని కోరుతూ ఫారెస్టు గార్డులు ఒక సాయంత్రం మా కాలనీకి వచ్చారు. ఎంత ముఖ్యమైన బాధ్యత! అదీ ప్రభుత్వానికి సంబంధించిన వ్యవహారం! ఈ కొత్త బాధ్యత వల్ల మా దృష్టిలో మా హోదా, ప్రాముఖ్యం పెరిగిపోయాయి. మాకు ఆసక్తికరమైన పని లభించడమే కాక, చివరకు అది లాభదాయకంగా కూడా మారింది.

ఒకరోజు తెల్లవారుజాము సమయంలో, ఇంకా బాగా చీకటిగా ఉన్న సమయంలోనే నా గది కిటికీని ఎవరో తడుతున్న శబ్దం విని నిదురలేచాను. కిటికీ అద్దాన్ని ఆనుకొని ఉన్న చప్పిడి ముక్కు, ఓ తల కనిపించాయి.

"ఏమైంది?" అని అడుగుతూ మంచం దిగాను.

"ఆంటన్ సెమ్యోనోవిచ్, ఎవరో చెట్లు కొడుతున్నారు అక్కడ అడవిలో" అన్న సమాధానం వచ్చింది.

గబగబా దీపం వెలగించి, దుస్తులు ధరించి, రివాల్వర్ తీసుకుని బయటకొచ్చాను. నిశాచరుల్లా తిరగడం అంటే ఇష్టపడే బరున్‌తో పాటు షెలాపుటిన్ అనే ఓ మందబుద్ధి గల కుర్రవాడు నా కోసం ఎదురుచూస్తున్నారు. ముగ్గురం కలిసి అడవిలోకి వెళ్లాం.

"వాళ్లెక్కడ" అని అడిగాను.

చెట్టు కొడుతున్న శబ్దం వినిపించింది. ఎవరో కానీ చీకట్లో నెమ్మదిగా పని పూర్తి చేసు కొంటున్నారు. అయినా ఆగి ఆగి చెట్టుని నరుకుతూ జాగ్రత్త పడుతున్నారు. ఆ శబ్దాన్ని అనుసరించి చివరకు అక్కడకు చేరాం. ఒక పెద్ద పైన్ వృక్షం మాటున దాగి ఎదురుగా దృశ్యాన్ని చూశాం. పొడవైన ఒక చెట్టు మొదట్లో ఒకడు నిలబడి గొడ్డలితో నరుకుతున్నాడు. మధ్యలో ఆగి చుట్టూ పరికిస్తున్నాడు. నా ఆదేశం అందుకున్న బరున్ చెట్టులోకి తూటా పేల్చాడు. ఆ నిశ్శబ్ద వాతావరణంలో అది పిడుగులా శబ్దం చేసింది. తక్షణం ఆ మనిషి గొడ్డలిని వదిలేసి నేలమీదకు జారిపోయాడు. షెలాపుటిన్ పాములా ముందుకు సాగి గొడ్డలిని చేజిక్కించుకున్నాడు. ఈలోగా బరున్ ఆ దొంగని గుర్తుపట్టి ఆప్యాయంగా పలకరించాడు. "ఓహో మౌసీ కార్పోవిచ్‌గారా? శుభోదయం" అని యికిలించాడు.

కార్పోవిచ్ బదులివ్వకుండా, వణికిపోతూ తన కాళ్లు చేతులకు అంటిన మంచు దులుపు కున్నాడు.

"నీ గుర్రం ఎక్కడ" అని కార్పోవిచ్‌ని ప్రశ్నించాను. ఈలోగానే బరున్ ఆ పక్కన చెట్లచాటున ఉన్న బండిని గుర్తించాడు.

"రండి కార్పోవిచ్‌గారు వాహనం ఎక్కండి" అంటూ హేళన చేస్తూ అతన్ని నడిపించాడు.

చివరకు కార్పోవిచ్ తన మౌనాన్ని వీడి "భగవంతుడా... హరి... భగవంతుడా" అంటూ గొణగడం ప్రారంభించాడు.

కార్పోవిచ్ కొడుకే ఆ బండి సారథి. పద్నాలుగేళ్ల ఆ పిల్లవాడిని ముందుగా ఇంటికి పొమ్మని చెప్పి కార్పోవిచ్‌ని తీసుకుని కాలనీకి బయలుదేరాం. అతను భయంతో వణికిపోతున్నాడు. "వదిలేయండి. ఇలా చేయడం ఇదే మొదటిసారి. ఇంట్లో వంటచెరకు నిండుకొంది... అందుకే.. దయచేసి వదిలేయండి" అని ప్రాధేయపడుతున్నాడు. "కుదరద"ని నేను కచ్చితంగా చెప్పాను. "ఇది ప్రభుత్వానికి సంబంధించిన వ్యవహారం. దీనిపై రిపోర్టు రాయాల్సిందేపద" అని ముందుకు నడిచాను. ఇదంతా చూసి భయపడిన కార్పోవిచ్ కొడుకు బండి దూకి పరుగు అందుకున్నాడు.

కాలనీ ద్వారంలో మా కుర్రవాళ్లు మాకు స్వాగతం చెప్పారు. "వచ్చేశారా? ఇంకా మీరంతా హత్యకు గురయ్యారేమోనని, వచ్చి మిమ్మల్ని కాపాడదామనీ అనుకొంటున్నాం" అంటూ వేళాకోళం మొదలుపెట్టారు.

"అబ్బే అదేం లేదు. మా పని విజయవంతంగా ముగిసింది" అని బరున్ నవ్వుతూ బదులిచ్చాడు.

అందరం నా గదిలోకి చేరాం. పూర్తి నిరాశలో కూరుకుపోయినట్టు కనిపించిన కార్పోవిచ్ నా ఎదురుగా ఒక కుర్చీలో కూర్చున్నాడు. బరున్ తుపాకి వదిలిపెట్టకుండా అలానే వెళ్లి కిటికీ అంచుపై కూర్చున్నాడు. షెలాపుటిన్ అడవిలో మా అనుభవాన్ని మిగిలిన కుర్రవాళ్లకి గుసగుసగా చెబుతున్నాడు. రిపోర్టు రాసే తతంగాన్ని అందరూ ఆసక్తితో చూస్తున్నారు.

నేను విచారణ ప్రారంభించాను. "నీకు ముప్పై ఎకరాలకు పైగా భూమి ఉందికదా?" అని అడిగాను "మూడు గుర్రాలు కూడా ఉన్నాయిగా?"

"గుర్రాలా" అని నిర్ఘాంతపోయాడు కార్పోవిచ్. "అదో గుర్రమా నిండా రెండేళ్ల వయసు లేదు" అని ప్రతిఘటించబోయాడు.

"దీనికి మూడేళ్ల వయసుంది" అని బరున్ అడ్డుపడ్డాడు.

"ఆ చెట్టుని అలా ఆరు అంగుళాల లోతున నరికావు కదా?" అని ప్రశ్నిస్తూ నేను నివేదిక రాయడం కొనసాగించాను. రాయడం పూర్తయింది. బరున్ గంభీరంగా కార్పోవిచ్‌కి వీడ్కోలు చెప్పాడు. హటాత్తుగా బరున్‌కి ఓ అనుమానం వచ్చింది.

"చెట్టు సంగతి ఏంటి?" అని నన్ను ఆదుర్దాగా ప్రశ్నించాడు.

నిజమే. మేం ఆలోచించలేదు. కార్పోవిచ్ ఆ చెట్టు మొదలుని లోతుగా నరికాడు. దాన్ని అలాగే వదిలేస్తే ఇవాళో, రేపో ఎవరో ఒకరు వచ్చి మిగిలిన పని పూర్తిచేసి కలపని ఎత్తుకు పోవడం ఖాయం. నేను ఆలోచించి చెప్పేలోగా బరున్ ఒక నిర్ణయానికి వచ్చేశాడు. గదిలోంచి బయటకు నడుస్తూ తనతోపాటు మరో ఆరుగురు కుర్రవాళ్లని రమ్మని అడిగాడు. "బండిలో తాడు ఉందా" అని కార్పోవిచ్‌ని అడిగాడు. "బెంగపడద్దు మీ బండి, గుర్రం మీకు తిరిగి వస్తాయి" అని హామీ ఇస్తూ వెళ్లిపోయాడు.

గంట తరువాత కుర్రవాళ్లు పొడవైన పైన్ వృక్షం మానుతో కాలనీకి తిరిగి వచ్చారు. ఇది ఆశించని వరం మాకు. దానితో పాటు కార్పోవిచ్ గొడ్డలి కూడా కాలనీ వశమైంది. ఆ తరువాత రోజుల్లో ఎప్పుడైనా పనిముట్లు తనిఖీ చేసేటప్పుడు "కార్పోవిచ్ గొడ్డలి ఉందా?" అని అడగడం అందరికీ అలవాటు అయింది.

ఇటువంటి వారి కృత్యాలు క్రమంగా మాలో సమిష్టి భావనను పెంపొందించాయి. ప్రత్యర్థులతో సాగించే ఈ తరహా పోరాటాలు మా కుర్రవాళ్ల మధ్య బలీయమైన బంధాన్ని పెంపొందించాయి. జరుగుతున్న సంఘటలను పదేపదే తలచుకుంటూ, సాయంత్రాలు కబుర్లతో గడిచేవి. ఈ అనుభవాలు మా మధ్య అవగాహనను, సాన్నిహిత్యాన్ని పెంచాయి. క్రమంగా ఈ బృందం గోర్కీ కాలనీలో కీలకమైన అంతర్భాగంగా అవతరించింది.

6

కలిసొచ్చిన కాలం

ఈ సమయంలోనూ మా కాలనీ తన మనుగడను క్రమంగా పటిష్టం చేసుకొంటోంది. నిరంతర దారిద్ర్యం, ఆకలి, పీలికలైన దుస్తులూ, బూట్లు లేకపోవడం వలన మంచు తాకిడికి బద్దలైన అరిపాదాలూ వంటి సమస్యలు ఎన్ని ఉన్నా ఆనందమయమైన భవిత గురించి కలలుకనే శక్తిని అవి హరించలేకపోయాయి. వయసు పైబడిన మా గుర్రం లాడీ కాని, పురాతన కాలానికి చెందిన విత్తుల యంత్రం గానీ వ్యవసాయానికి సంబంధించి మా ఆశలపై నీళ్లు చల్లలేకపోయాయి. అప్పటికవి కలలు మాత్రమే. మా గుర్రం లాడీకి నాగలి కడితే పని జరుగుతుందని ఊహించడమే అసాధ్యం. ఎందుకంటే అందరిలానే దానిదీ ఎప్పుడూ అర్ధాకలితో ఉండే కడుపే మరి. దానికి పెట్టేందుకు గడ్డి తప్ప మా వద్ద మరేమీ ఉండేది కాదు. అదీకాక మా కాలనీ ఉన్న నేల వ్యవసాయానికి ఏ మాత్రం అనువైన భూమి కాదు. దాదాపు ఇసుక మెట్టగా ఉన్న ఆ ప్రాంతంలో కొద్ది గాలివీస్తే దుమ్ము సుడులు తిరిగేది. అసలు అటువంటి పరిస్థితుల్లో అక్కడ వ్యవసాయం చేయవచ్చని ఎలా తలంచానన్నది నేటికీ ఆశ్చర్యం కలిగిస్తోంది. కానీ, ఈలోపే పరిస్థితి మారింది. అకస్మాత్తుగా అదృష్టదేవత మా వైపు దృష్టి సారించింది. అడవిలో నరికిన కలపని రవాణా చేసే పని మాకు

లభించింది. ఆ అడవి నిజానికి మా కాలనీ ఉన్న గ్రామం సరిహద్దులోనే ఉన్నప్పటికీ ఆ అటవీ ప్రాంతం దిశగా మేం ఎప్పుడూ వెళ్లలేదు.

దొరికిన ఆ పని పూర్తిచేసేందుకు మేం పొరుగున గల రైతుల సాయం తీసుకొన్నాం. వాళ్ల బళ్ళు, గుర్రాలతో అడవికి వెళ్లాం. కుర్రవాళ్లు అంతకుముందే నరికి ఉన్న కలప దుంగలను బళ్లలోకి ఎత్తేపనిలో ఉండగా, బండివాళ్లు వాటిని పడిపోకుండా ఎలా రవాణా చేయవచ్చో వాదించు కుంటున్నారు. వాళ్లని అలా వదిలి కలీనా ఇవానోవిచ్‌తో కలిసి ముందుకు నడిచాను. చలికి గడ్డకట్టిన వాగును కమ్మిన పొడవాటి పోప్లార్ వృక్షాల వైపు వెళ్లాం. మంచుదిబ్బలను దాటి, చిన్నపాటి కొండను ఎక్కి ఎదురుగా కనిపించిన దిగ్భ్రాంతికొలిపే దృశ్యాన్ని చూశాం. మా ఎదురుగా విశాలమైన మైదానంలో పరచుకుని ఉన్న మృత సామ్రాజ్యం చూసి నోట మాటరాలేదు. మా కళ్ల ఎదుట శిథిలావస్థలో ఉన్న దాదాపు డజను భవనాలు, ఇళ్లు, షెడ్‌లు, అవుట్‌హౌస్‌లు ఇంకా కొన్ని గుడిసెలు. అన్నింటి పరిస్థితి ఒక్కలానే ఉంది. ముందుకు నడిచాం. ఒకప్పుడు చలికాగే భారీ పొయ్యిలు ఉన్నచోట ప్రస్తుతం ఇటుక, మట్టికుప్పలు మిగిలాయి. వాటిపై దట్టంగా పరుచుకొన్న మంచు. ఆ భవనాల్లో నేల, తలుపులు, కిటకీలు, మెట్లు అన్నీ అదృశ్యమైపోయాయి. పై కప్పులన్నీ బీటలు వారాయి. కొన్ని చోట్ల గోడలు, వాటి పునాదులను కూడా ఎవరో పెకలించుకుపోయారు.

సువిశాలమైన గుర్రపుశాలల్లో మిగిలిందల్లా ఎత్తైన గోడలు. అయితే ఆ గోడలపై అత్యంత ఆశ్చర్యకరంగా ఇటీవలే రంగువేసినట్టున్న ఒక పెద్ద ఇనుప ట్యాంక్ ఉండటం మాకు ఆశ్చర్యం కలిగించింది. మృత్యువు తాండవిస్తున్న ఆ వాతావరణంలో ఆ ట్యాంక్ మాత్రం ఇంకా జీవన చైతన్యానికి గుర్తుగా మిగిలినట్టు కనిపించింది.

ఆ పక్కనే సరికొత్త రెండు అంతస్తుల భవనం ఒకటి ఉంది. ప్లాస్టింగ్ చేయని గోడలే అయినా దాని నిర్మాణంలో ఒక నిర్దిష్టమైన హుందాతనం ఉంది. విశాలమైన గదులు, పెద్ద కిటికీలు, మొత్తం మీద అక్కడి భవనాలన్నీ ఏదో స్థాయిలో శిథిలావస్థలో ఉన్నప్పటికీ పైపై మెరుగులు వంటివి దెబ్బతిన్నాయే తప్ప ఖరీదైన ప్రధాన కట్టడం ఏ మాత్రం చెక్కుచెదరలేదు. అతిపెద్ద బలమైన కలప దుంగలు, బలంగా, ఠీవిగా ఉన్న ఇంటి పైకప్పువాసాలు, దృఢంగా ఉన్న గోడలు వాటి మౌలిక స్వరూపాన్ని కోల్పోలేదు. అంతటి సంపదను చూసి ఇవానోవిచ్ బాధతో మూలిగాడు.

“చూడండి ఆ వాగు, తోట, నది పక్కనే గల సారవంతమైన భూమి....” అంటూ గుటకలు మింగాడు.

సువిశాలమైన ఆ ప్రాంగణం మూడువైపులా నది ప్రవహిస్తోంది. కొండపై నుంచీ ఏటవాలుగా కిందకి దిగిన నేలలో మూడు స్థాయిల్లో భూమిని సాగుచేసి పెంచిన తోటలు కనువిందుగా ఉన్నాయి. మొదటి రెండు స్థాయిల్లో చెర్రీ వృక్షాలు, ఏపిల్ చెట్లూ ఠీవిగా నిలిచి ఉన్నాయి. అట్టడుగున గల భూమిలో మాత్రం ఏ పంటా లేదు. పిచ్చి పొదలు పెరిగి ఉన్నాయి. ప్రధాన భవంతికి ఆవల వైపున సువిశాలమైన ఐదంతస్తులున్న మిల్లు ఒకటి పనిచేస్తోంది. ఈ ఎస్టేటంతా ట్రెప్కే సోదరులదని, అంతర్యుద్ధ సమయంలో వారు డెనికెన్‌ల సైన్యంతో కలసి తరలిపోయారనీ మిల్లు కార్మికులు చెప్పారు. ఆ తరువాత కథ మామూలే. ఇరుగుపొరుగు గ్రామస్థులు ఆ భవనాల్లోని సంపదను దోచుకున్నారు.

ఇదంతా చూసి ఇవానోవిచ్ ఆవేదన చెందాడు. “మూర్ఖులు. ఇంతటి సందపను సద్వినియోగం చేసుకోకుండా, ఇక్కడే ఉండి దీనిని అభివృద్ధి చేయకుండా ఎలా నాశనం చేశారో చూడండి” అని

మూలిగాడు. అతని దృష్టి పైన ఉన్న నీటి ట్యాంకుపైనే ఉంది. దానిని ఎలా అక్కడనుంచీ తీసి మా కాలనీకి పట్టికెళదామా అన్నదే అతని ఏకైక ఆలోచన అయింది. ప్రస్తుతానికి ఆ ఎస్టేట్ ఆ గ్రామ సోవియట్ ఆధీనంలో ఉంది. కాబట్టి ఆ ట్యాంకును తీసికెళ్లాలంటే వారి అనుమతి పొందాలి. అటువంటి ట్యాంక్ కాలనీలో ఉంటే పిల్లలకూ, మాకూ ఆవిరి స్నానం ఏర్పాటు చేయవచ్చన్న ఆలోచన ఇవానోవిచ్ బుర్రను తొలిచివేసింది.

కాలనీకి తిరిగివచ్చిన తరువాత మర్నాడు ఉదయం ఇవానోవిచ్ నా దగ్గరకి వచ్చాడు. ఆ ట్యాంక్ అక్కడి వారెవరికీ పనికిరాదని ఇక్కడికి తెస్తే మా అందరికీ ఆవిరిస్నానం అందుబాటులోకి వస్తుందనీ వివరించి గ్రామ సోవియట్‌కు ఒక లేఖ రాసి ఇమ్మని నన్ను బతిమాలాడు. తన మాట కాదనలేక నేను ఆ ఉత్తరం రాసి ఇచ్చాను. దయచేసి ఆ ట్యాంక్‌ను మా కాలనీకి ఇవ్వాలని అందులో కోరాను. దాన్ని పట్టుకువెళ్లిన ఇవానోవిచ్ సాయంత్రానికి ధుమధుమలాడుతూ తిరిగి వచ్చాడు. ఆ ట్యాంక్ ప్రభుత్వ ఆస్తి అట. దానిపై గ్రామ సోవియట్‌కు హక్కులేదట. జిల్లా అధికారులను కలవమని చెప్పారట. అదీ ఇవానోవిచ్ కోపం.

జిల్లా కేంద్రానికి 20 మైళ్లు వెళ్లడం కష్టమనీ, వెళ్లినా వారు అనుమతి ఇచ్చినా ఆ పెద్ద ట్యాంకును ఇక్కడకు రవాణా చేయడం అసాధ్యమని చెప్పి చూశాను. అతను వినలేదు, పైగా కాలనీ వాసులకు కూడా ఆవిరిస్నానం ఆలోచన అద్భుతంగా అనిపించింది. చేసేదిలేక జిల్లా అధికారులకు మరో వినతిపత్రం రాసి అతనికి ఇచ్చాను. అక్కడ అనుమతి లభించలేదు. ఇవానోవిచ్ ఆగ్రహం రెట్టింపు అవుతోంది. పై అధికారులకు మరో వినతిపత్రం రాసిమ్మని నా నెత్తిమీద కూర్చుని సాధించాడు. ఇవ్వక తప్పలేదు. అక్కడా తిరస్కారం తప్పలేదు. అన్ని ప్రయత్నాలు విఫలమై అతను పూర్తిగా దిగాలుపడిపోయాడు.

ఆ మరుసటి ఆదివారం నేను పిల్లలతో కలిసి ట్రెప్కే ఎస్టేట్‌కు షికారు బయలదేరాను. విశాలమైన ఆ ఎస్టేట్ చూస్తుంటే నా బుర్రలో తటాలున ఓ ఆలోచన మెదిలింది.

“ఒక్క ట్యాంకు కోసం తాపత్రయపడకపోతే, మనమంతా ఇక్కడకే వచ్చేయవచ్చుగా” – నా మనసులోని మాటని పైకే అనేశాను.

ఈ మాటలు విన్న కుర్రవాళ్లు మొదట్లో వేళాకోళంగా భావించారు. ఉన్న కాలనీనే మరమ్మతు చేసుకోలేకపోతున్న మేం ఇక్కడికి వచ్చి, ఇన్ని భవనాలను బాగుచేసి ఉండగలమా, అది సాధ్యమవుతుందా అని ప్రశ్నించారు.

“ఒకవేళ సాధ్యమైతేనో?” అని ప్రశ్నించాను. అందరూ ఆలోచనలో పడ్డారు. కాలనీకి తిరిగివచ్చిన కుర్రవాళ్లు దీని గురించి మాట్లాడడం మానలేదు. చర్చలు సాగుతున్నాయి. డార్మెటరీల్లో పిల్లలు ఇదే మాట్లాడుతున్నారు. చివరికి చీకటిపడుతూండగా మా టీచర్ ఎకతెరీనా డార్మెటరీ వద్దకు వచ్చింది.

“చూడండి పిల్లలూ ఏమిటీ ఆలోచనలు? ఎందుకు పగటికలలు? ఇలా కలలు కనడం బోల్షివిక్ స్ఫూర్తేనా?” అని నిలదీసింది. నాకు పట్టుదల హెచ్చింది. చేత్తో బల్లపై చరిచి గంభీరంగా ఒక ప్రకటన చేశాను. “చూడండి ఒక నెలరోజుల్లోగా ఆ ఎస్టేట్ మనదవుతుంది. సరేనా? అదైనా బోల్షివిక్ స్ఫూర్తికి తగిన మాటేనా” అని ఆమెని ఎదురు ప్రశ్నించాను. పిల్లలంతా ఉత్సాహంగా నవ్వుతూ కేకలు పెట్టారు. ఎకతెరీనా సైతం వారితో జత కలిపింది.

ఆ రాత్రంతా కూర్చుని మా కాలనీని ట్రెప్కే ఎస్టేట్‌కి తరలించడం గురించి వివరిస్తూ ప్రభుత్వ అధికారులకు ఒక నివేదిక రూపొందించాను. వారం తిరక్కముందే విద్యాశాఖ ప్రధాన అధికారి నన్ను పిలిచి మాట్లాడారు. "మంచి ఆలోచనే. చూద్దాం మొదట ఆ ఎస్టేట్‌ని ఒకసారి పరిశీలిద్దాం" అన్నారు. మరోవారం తరువాత జిల్లా కార్యనిర్వాహకవర్గం సమావేశంలో ఈ ప్రతిపాదన చర్చకు వచ్చింది. నేనుకూడా హాజరై ప్రస్తుతం ఆ ఎస్టేట్ పరిస్థితిని వివరించాను. అంత విలువైన సంపద వృధాగా నాశనమైపోతున్న సంగతీ, మాకు అది లభిస్తే ఎంత ఉపయోగం మొదలైన విషయాలు కమిటీకి విశదపరచాను. చివరికి కార్యనిర్వాహక అధ్యక్షుడు తన నిర్ణయం ప్రకటించారు.

"ఆ ఎస్టేట్‌ని ఎవరైనా పట్టించుకొని బాగు చేయాలి. వీళ్లకి ఆ స్థలం కావాలి. పైగా వాళ్లు పని చేస్తామంటున్నారు కూడా. వాళ్లకే ఆ పని అప్పచెబితే మంచిది" అని ఆయన తీర్పు చెప్పాడు.

అంతే, ట్రెప్కే ఎస్టేట్ మా కాలనీ సొంతమైంది. దాదాపు 170 ఎకరాల సారవంతమైన నేల, డజను భవంతులు, గుర్రపు శాలలూ, చుట్టూ నది... ట్రెప్కే ఎస్టేట్‌ను మాకు స్వాధీనపరుస్తూ ఇచ్చిన లేఖను తీసుకుని డార్మెటరీలో పిల్లలకు చదివి వినిపిస్తుంటే వారు ఆనందంతో గంతులు వేశారు. ఆ లేఖను ఒక్కసారి చూడనివ్వమని, పట్టుకోనివ్వమని నన్ను బతిమాలారు. ఈలోగా ఎకతెరీనా అక్కడికి వచ్చింది. పిల్లలందరూ ఆమెను చుట్టుముట్టి విజయోత్సాహంతో కేరింతలు పెట్టారు "ఇది బోల్షివిక్ మార్గమేనా" అంటూ ఆమెను ఉక్కిరిబిక్కిరి చేశారు.

7

వాస్క అదృశ్యం

కాలనీలో కోలాహలం ఎస్టేట్ మాకు ఇస్తున్నట్టు నిర్ణయమైనా మేం అక్కడకు చేరడానికి చాలా రోజులు పట్టింది. కొత్త కాలనీ రిపేర్లకు కావలసిన సామగ్రీ, డబ్బూ అందేసరికి ఆలస్యమైంది. కొత్త ఎస్టేట్‌కు తరలివెళ్లేందుకు మాకు మరో ప్రధాన ప్రతిబంధకం వాగే దానిపేరు కొలోమాక్. మా కాలనీకి ఎస్టేట్‌కు మధ్య ప్రవహించే ఈ వాగు బహు చిలిపిది. కొద్ది వర్షానికే సుడులు తిరిగి ప్రవహిస్తూ అక్కడంతా మెత్తటి బురద మట్టిని పేర్చేది. మనిషి కాదుకదా చివరికి పశువులు కూడా ఆ బురద కూపంలో అడుగు తీసి అడుగు వేయడం అసాధ్యంగా మారింది. చేసే పని లేక, కొత్త ఎస్టేటుకు వెళ్లేందుకు అవకాశం లేక చలిబాధ నుంచీ తట్టుకొనేందుకు పిల్లలు పగలంతా ఎండలో తిరిగేవారు.

ఈలోగా ఏప్రిల్ ఆరంభంలో మా కాలనీ కుర్రవాడు వాస్క పొలెష్చుక్ చెప్పా పెట్టకుండా పారిపోయాడు. మా దృష్టిలో వాస్క పెద్ద పనికిమాలినవాడు. అసలువాడు డిసెంబర్‌లో విద్యాశాఖాధికారి ఆఫీసులో నాకు తగిలాడు. ఎక్కడో అధికారులకు దొరికిన ఆ పిల్లవాడి మతి సరిగ్గా లేదని నిర్ధారించి, వాడిని అటువంటి పిల్లల కాలనీకి పంపాలని ప్రయత్నిస్తున్నారు. దాన్ని వాడు ప్రతిఘటిస్తూ ఏడుస్తున్నాడు. అదీ సంగతి. వాణ్ణి నేను నా వెంట కాలనీకి తీసుకొచ్చాను. వాడి మొహం చూస్తే పెద్ద తెలివితేటలు ఉన్న సూచనలు కనిపించవు. కానీ చురుకైన ఆ కళ్లు చూస్తే మాత్రం వీడికి మంచి శక్తి, ఉషారు ఉన్నాయనిపించిది. కాలనీకి వచ్చిన మొదటిరోజు వాస్క నోరు విప్పలేదు. వాడి మౌనం మిగిలిన పిల్లలకు విసుగు తెప్పించింది కూడా. "ఏమిటి వాడు మాట్లాడడు? నాలుగు తగిలించమంటారా?" అని కొందరు పిల్లలు నన్ను అడిగారు. వద్దన్నాను.

ఉన్నట్టుండి వాస్క వాగుడు మొదలైంది. పెద్దగా నవ్వుతూ, తుళ్ళుతూ ఒక ప్రవాహంలా వాడు మాట్లాడడం ప్రారంభించాడు. రెడార్మీలో కమాండర్ జుబాటా గొప్పదనం, అతని అందం, పరాక్రమం,

తనంటే ఆయనకు గల ఆదరం గురించి అందర్నీ రోజుల తరబడి ఊదరగొట్టాడు. "కొంపతీసి మళ్లీ జుబాటా దగ్గరికి పారిపోతావా?" అని పిల్లలు వాడిని ఆరా తీశారు. వాడు సమాధానం చెప్పలేదు.

కానీ, ఒకరోజు ఉదయం షెలాపుటిన్ నా దగ్గరికి హడావుడిగా వచ్చి, వాస్క పరారైన సంగతి చెప్పాడు. దీనిపై నేనెలా స్పందిస్తానో చూద్దామని కుర్రవాళ్లు నన్ను ఆసక్తిగా గమనించడం మొదలైంది. చెప్పొద్దూ, ఈ సంఘటన నన్ను కలిచివేసింది. వాణ్ణి అంత ప్రేమగా తీసుకొచ్చి, ఆదరిస్తే దాన్ని వాడు ఇలా తిరస్కరించడం, పారిపోవడం నాకు బాధ కలిగించింది. మా కాలనీ కంటే మంచి చోటుని వెతుక్కుంటూ వాస్క వెళ్లిపోయాడు. అంటే మా దారిద్ర్యం మా మధ్య బంధాన్ని నిలప లేకపోతోంది. 'పోతేపోనీ' అనుకుని చేయవలసిన పనిపై దృష్టి సారించాను.

ఏప్రిల్‌లో హటాత్తుగా నాకు వ్యవసాయాన్ని ఆరంభించే అనుకోని అవకాశం లభించింది. ఇది అనూహ్యమైన పరిణామాల వల్ల సాధ్యమైంది. గుర్రాలు దొంగిలించే ఒక పిల్లవాణ్ణి పట్టుకొన్న అధికారులు వాణ్ణి ఏదో కాలనీకి పంపారు. కాని వాడితో దొరికిన గుర్రాన్ని ఏమి చేయాలో, దాన్ని ఎలా సాకాలో తెలియక గందరగోళపడుతున్నారు. ఈ సంగతి తెలిసిన కలీనా ఇవానోవిచ్ తక్షణం విద్యాశాఖా కార్యాలయానికి వెళ్లి ఆ గుర్రాన్ని మా కాలనీకి తెచ్చాడు. అధికారులు పెద్ద భారం తొలగినట్టు సంతోషించారు. మా కుర్రవాళ్లు కూడా కొత్త గుర్రానికి కేరింతలతో స్వాగతం చెప్పారు. గడ్ అనే కుర్రవాడు సంతోషంతో వణుకుతున్న చేతులతో ఇవానోవిచ్ నుంచి ఈ గుర్రపుతాళ్లను అందుకున్నాడు. "దాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని, పిచ్చివేషాలు వేయవద్దనీ" ఇవానోవిచ్ గంభీరంగా పిల్లలను హెచ్చరించాడు.

బాదంకాయ రంగులో ఉన్న ఆ చిన్న గుర్రం ఆరోగ్యంగా మెరిసిపోతోంది. ఇవానోవిచ్ గర్వంగా పైప్ పీలుస్తూ తన ఉపన్యాసం కొనసాగించాడు. ఆ తరువాత ఇవానోవిచ్‌తో కలిసి కుర్రవాళ్లు వర్క్‌షాప్‌లో కొద్దిరోజులు శ్రమించి ఉన్న కాసిన్ని పరికరాలతోనే, అక్కడ లభించిన చెత్త సామగ్రీ అంతా పోగుచేసి ఒక మాదిరి నాగలిని తయారుచేశారు. చివరకు ఆ రోజు రానే వచ్చింది.

ఇవానోవిచ్ నేతృత్వంలో బరున్, జదరోవ్‌లు నాగలిని గుర్రానికి అమర్చి పొలం దున్నడం ప్రారంభించారు.

అదోపెద్ద తతంగం. ఈ కుర్రకుంకలకు పొలం దున్నడం తెలియదని ఇవానోవిచ్ హేళన... మీకు తెలిస్తే అదేదో చూపించండని పిల్లల సవాళ్ల మధ్య కోలాహలంగా ఆ పని మొదలైంది. పొలం కంటే గుర్రమే గడ్ దృష్టిలో విలువైంది. అతను అంతసేపూ గుర్రాన్ని ఇతర కుర్రవాళ్లు ఇబ్బంది పెడుతున్నారేమో అన్నట్టు దానిపై నుంచి దృష్టి మరల్చకుండా అక్కడే చతికిలబడ్డాడు. ఆ గుర్రానికి మేం ముద్దుగా ఎర్రనిచుక్క (రెడ్) అని పేరు పెట్టాం. దాని బాగోగులు చూసే బాధ్యతను గడ్‌తో పాటు బ్రాచెంకో కూడా స్వీకరించాడు.

కాలనీ వెలుపల ప్రధాన రహదారి పక్కనే కాపురం ఉంటున్న సోఫ్రాన్‌గొలోవాన్ అనే కమ్మరిని ఇవానోవిచ్ మా కాలనీకి ఆహ్వానించాడు. గొలోవాన్ చిత్రమైన మనిషి. సృష్టిలోని ప్రతి విషయం గురించి సొంత అభిప్రాయాలు అతనికి ఉన్నాయి. అతనికి రెండు గుడిసెలు, మూడు గుర్రాలు, రెండు ఆవులతో పాటు సొంత కమ్మరి కొలిమి ఉంది. అక్కడినుంచి కొన్ని పరికరాలతో కాలనీ చేరిన గొలోవాన్ ఆ కుర్రవాళ్లకు కమ్మరిపనిలో తర్ఫీదు ఇచ్చేందుకు సిద్ధమయాడు. సొంత ఖర్చుతో మా కొలిమిని బాగు చేస్తానన్నాడు. ఇంత ఉత్సాహం ఎందుకో ఇవానోవిచ్ రహస్యంగా నాకు చెప్పాడు.

గొలోవాన్‌కి పార్టీ సారధ్యంలోని రైతులంటే భయం. వారు వచ్చి తన కొలిమిని స్వాధీనం చేసుకొంటారని అనుమానం. ఇక్కడ కాలనీలో పనిచేస్తే సోవియట్ల కోసం పనిచేస్తున్నాననే వంకతో తప్పించుకోవచ్చని అతని యోచన. అదీ సంగతి. వాడి సంగతి మనకెందుకు. వాడితో మనకి పని ఉంది. ఆ తరువాత వాడేమైతే మనకెందుకు, ఇక్కడ పనిచేయనిద్దాం అన్న ఇవానోవిచ్ అభిప్రాయాన్ని నేను వ్యతిరేకించలేదు. కమ్మరి శిక్షణా కేంద్రంలో పని ఊపందుకుంది.

ఈలోగా పై అధికారుల నుంచి మాకు కొన్ని నిధులు అందాయి. దీనితో మేం కమ్మరిశాలతో పాటు, వడ్రంగం పనికి కూడా కావలసిన ముఖ్యమైన పనిముట్లు సంపాదించాం. వడ్రంగం పని నేర్పేందుకు మాకు మరో నిపుణుడు దొరికాడు. పిల్లలంతా ఈ రెండు వర్క్‌షాప్‌ల్లో ఉత్సాహంగా పని చేసేవారు. పట్టణం నుంచి వచ్చిన చెక్కమొద్దులు, పలకలు కోసి కొత్త కాలనీలో కిటికీల కోసం ఫ్రేములు, తలుపులు చేయడం మొదలుపెట్టారు. వారి కొత్త శిక్షకుడి నైపుణ్యం సంగతెలా ఉన్న పిల్లల పని స్థాయి అంతంత మాత్రంగానే ఉండేది. మరోవైపు కమ్మరి మాస్టారు గొలోవాన్ కూడా సోవియట్ వ్యవస్థ నిర్మాణం పట్ల అంత శ్రద్ధకనబరిచేవాడు కాదు. నింపాదిగా పనిచేసేవాడు. పిల్లలు మాత్రం ఉషారుగా కొత్త పనిముట్లు, వాటితో చేసే పని గురించి కబుర్లు చెప్పుకొనేవారు. ఉత్సాహంగా పనిపై దృష్టి సారించేవారు.

ఉదయం ఎనిమిది గంటలకు గంట మోగగానే కుర్రవాళ్లు వర్క్‌షాప్‌లకు పరుగులు పెట్టేవారు. అరుపులు, కేకలతో ఆవరణ కోలాహలంగా మారేది. కొలిమి బయట గ్రామానికి చెందిన పేదరైతులు నలుగురైదుగురు జమ అయ్యేవారు. వ్యవసాయం పనులు, విత్తులు నాటడం మొదలైన సంగతులు మాట్లాడేవారు. మేం వారి పనిముట్లు మరమ్మతు చేసి ఇవ్వడం ప్రారంభించాం. బండి చక్రాలకు ఇనుప చక్రాలు బిగించడం, నాగళ్లు బాగు చేయడం లాంటి పనులు చేసేవాళ్లం. పేదరైతుల నుంచీ సగం చార్జీలే వసూలు చేసేవాళ్లం. కాలనీకి ఒక ఒంటి గుర్రం బండిని తయారుచేసి ఇస్తానన్న కమ్మరి మాస్టారు చివరికి నానా ప్రయాసపడి ఆ పని పూర్తిచేశాడు.

ఈలోగా ఒకరోజు కమ్మరి గొలోవాన్ తనవెంట ఒక విచిత్రమైన మనిషిని తీసుకొచ్చాడు. తనపేరు కోజిర్. బండి చక్రాలు తయారు చేయడంలో దిట్ట. ఈ మధ్యే పిచ్చాసుపత్రి నుంచీ బయటపడ్డాడు. తనకి ఎలాంటి పిచ్చి లేకున్నా డాక్టర్లని కూడా పక్కదారి పట్టించి పిచ్చాసుపత్రికి పంపిన భార్యఅంటే అతనికి వణుకు. క్షణానికోసారి అతను గాలిలో శిలువ గుర్తు వేసి భగవంతుడిని ధ్యానిస్తాడు. మాకు నాలుగు చక్రాలు చేసిమ్మని అడగ్గానే అతను ఉత్సాహంగా అంగీకరించాడు. నెమ్మదిగా నా దగ్గరికొచ్చి, "కామ్రేడ్‌గారూ! నేను ఇక్కడే మీతోపాటు ఉంటాను మీకు బరువుకాను" అని అర్థించాడు. 'సరే' నన్నాను.

అతను పిల్లలతో క్షణాల్లో కలసిపోయాడు. వాళ్ల డార్మెటరీ పక్కనున్న చెక్కషెడ్‌లో స్థిరపడ్డాడు. అక్కడైతేనే తన భార్యనుంచీ రక్షణ లభిస్తుందని అతను గ్రహించాడు. పిల్లలు కూడా అతన్ని గయ్యాళి భార్య శాపనార్థాలనుంచి కాపాడేందుకు సరదాగా సిద్ధపడ్డారు. ఉన్నట్టుండి కాలనీలోకి దూసుకొచ్చే అతని భార్య గుండెలు బాదుకుంటూ కేకలు పెట్టేది. తన భర్త కోజిర్‌ను తిరిగి ఇంటికి పంపమని అరిచేది. అతన్ని కమ్మరి గొలోవాన్ పాడుచేస్తున్నాడని తిట్టేది. సోవియట్ ప్రభుత్వాన్ని ఆమె శాపనార్థాలు పెట్టేది. ఇంతసేపూ కోజిర్ తన చెక్కగదిలో ఒకమూల గుండెలు అరచేతిలో పెట్టుకుని నక్కి దాగునేవాడు.

ఎమైతేనేం ఎన్ని అవాంతరాలు ఎదురు అయితేనేం ఆ చక్రాల వ్యాపారం క్రమంగా లాభదాయకంగా కనిపించింది. అప్పటికే జిల్లా వ్యాప్తంగా మంచి పనివాడు అనే గుర్తింపు పొందిన కోజిర్ మా సాయం, ప్రమేయం లేకుండా క్షణాల్లో చక్రాలు చేసి దొర్లించేవాడు. రైతులు వాటిని ఉత్సాహంగా కొనుగోలు చేసేవారు కూడా.

మరోవైపు మా వ్యవసాయనిపుణుడు ఇవానోవిచ్ విశ్రాంతి లేకుండా పనిచేస్తూ, కుర్రవాళ్ల చేత పనిచేయించాడు. చిట్టచివరకు అతని సారధ్యంలో మా కాలనీ తొలిపంట వేయగలిగింది. దాదాపు పదిహేను ఎకరాల్లో వాళ్లు ఓట్ ధాన్యాన్ని నాటారు. గుర్రపు శాలలో మా గుర్రం ఎర్రటిచుక్క కులాసాగా సకిలించేది. మరోవైపు చెక్క జట్కాబండి తయారై సిద్ధంగా ఉంది. మా పనులు ఎంతగా పెరిగిపోయాయంటే ఆ మనుషులు ఎంత ప్రతిభావంతులో సంగతి మాకు అనుభవంలోకి వచ్చింది.

సరిగ్గా ఈ సమయానికి బయటి ప్రపంచంలో మార్పులు జరుగుతున్నాయి. అటామెన్ల ప్రతిఘటన క్రమంగా అదృశ్యమైంది. వారి నాయకులంతా సైన్యం చేతిలో హతమవుతున్నారు. అటామోన్ల వద్ద సహాయకులుగా, వంట కుర్రవాళ్లుగా పనిచేసిన వారందర్నీ అరెస్టు చేసిన అధికారులు వారిని వివిధ సంస్కరణ కాలనీలకు పంపటం మొదలైంది. అలా మా కాలనీకి కొత్తగా వచ్చి చేరిన కుర్రవాళ్లలో కరబనోవ్, ప్రికోడ్కా, గోలోస్, సొరోకా, వెర్షనెవ్, మిత్యాగిన్ వంటివాళ్లు ఉన్నారు.

8

కొత్తపిల్లలతో సరికొత్త సమస్యలు

అప్పుడప్పుడే కుదుటపడుతున్న కాలనీ వాతావరణం కొత్తవారి రాకతో అతలాకుతలమైంది. కొత్తగా మొదలైన సమిష్టి కృషి విధానం పునాదులే కదిలిపోవడం మొదలైంది. నిజానికి మా తొలిబ్యాచ్ కుర్రవాళ్లకి ఇప్పటికీ క్రమశిక్షణ అంటే పూర్తిగా తెలియదు. కొత్త కుర్రవాళ్లకి ఒక పద్ధతిలో ఉండడం, క్రమశిక్షణతో మెలగడం అసలే తెలియదు. దీనితో కొంత కష్టం ఫలితంగా దారిలో కొస్తున్న మా కాలనీలో అలజడి మొదలైంది. అయితే కొత్త కుర్రవాళ్లు గతంలోలా మాపై బహిరంగ తిరుగుబాటుకు ధైర్యం చేయలేదు. బయటపడి టీచర్లను ధిక్కరించలేదు. దీనికి కారణం మా పాత పిల్లలే. వాళ్లు నెమ్మదిగా తమ తొలినాళ్ల అనుభవాలను కొత్తవారికి వివరించి ఉండాలి. దీనితో పాత బ్యాచ్‌తో పాటు, కొత్త బృందం కూడా ఇక్కడి అధ్యాపక బృందం తమ శత్రువర్గం కాదని నమ్మినట్టుంది. ఇందుకు మా అధ్యాపక బృందం పడిన కష్టం కూడ తక్కువ కాదు. పిల్లల బాగుకోసం, వారి మంచి కోసం మా టీచర్లు స్వార్ధరహితంగా, కష్టపడి పనిచేయడం పిల్లల్లో వారిపట్ల మర్యాద భావం కలిగించింది. ఫలితంగా దాదాపుగా పిల్లలంతా మాతో బాగానే ఉండేవారు. ఒకటి రెండు సందర్భాల్లో తప్ప ఎప్పుడూ వారు పనిచేసేందుకు, స్కూల్లో పాఠాలు చదివేందుకు సిద్ధపడ్డారు. ఇలా నడుచుకుంటేనే తమకూ అధ్యాపక బృందానికీ కూడా శ్రేయస్కరమని వారు గుర్తించినట్టుంది. అయితే కొత్తవారి వలన కుర్రవాళ్ల మౌలిక ఆలోచనాధోరణి, సంస్కారంలో పెద్ద మార్పు రాలేదని, వారు ప్రదర్శించే క్రమశిక్షణ అంతా పైపై మెరుగు మాత్రమేనని మాకు తెలుసు.

అసలు ఈ పిల్లలు ఇంతటి దరిద్రంలో, ఇంత కష్టపడి పనిచేస్తూ కాలనీలో ఉండేందుకు సిద్ధపడుతున్నారంటే కారణం ఉంది. ఆ రోజుల్లో, 1921లో, బయట వీధుల్లో జీవితం ఇంతకంటే కనాకష్టంగా ఉండేది. మాది కరవు జిల్లా కానప్పటికీ పరిస్థితులు అంత దుర్భరంగానూ ఉండేవి. పైగా మా కుర్రవాళ్లలో అత్యధికులు పూర్తిగా, నిజంగా అనాధలు కారు. ఈ మధ్యకాలంలోనే తమ

ఇళ్లలో సంబంధాలు తెంచుకుని బయటపడినవారే. ఇకవారి సాంస్కృతిక స్థాయి గురించి మాట్లాడక పోవడం ఉత్తమం. వారిలో అత్యధికులు అక్షరజ్ఞానం లేనివారో, లేదా అతికొద్దిగా ఆ జ్ఞానం గలవారో ఉండేవారు. వీధి బతుకులు వారిలో సంస్కారాన్ని దాదాపుగా తుడిచిపెట్టి, వాళ్లలో ద్వేషాన్ని, అసంతృప్తిని రగిల్చాయి. ఆ వాతావరణం నుంచి వచ్చిన పిల్లలు పరస్పరం అనుమానించుకుంటూ, నిరంతరం ఆత్మరక్షణ ధ్యేయంతో దుందుడుకుపోకడలకు దిగేవారు. అనవసరపు ధీరోధాత్తతను ప్రదర్శించేవారు.

అయితే తొలి బ్యాచ్‌లోని జడ్‌రోవ్, బరున్, వెట్కోవ్‌స్కీ, బ్రాచెంకో అలాగే రెండవ బృందంలోని కరబనోవ్, మిత్యాగిన్ తదితరులు మిగిలిన వారికంటే ఎక్కువ తెలివితో, వారికి భిన్నంగా నిలిచేవారు. వారందరిని ముందు మామూలు మనుషులుగా తీర్చిదిద్దడమే కష్టం. అందుకు మా కాలనీ దారిద్ర్యం ప్రధాన ప్రతిబంధకంగా నిలిచేది.

ఆ తొలి ఏడాది మా అధ్యాపక బృందాన్ని పరీక్షలకు గురిచేసినది పిల్లల మధ్య నిరంతరం సాగే తగవులే. సమిష్టిగా కృషిచేయవలసిన కాలనీలో మనుషుల మధ్య ఉండవలసిన అవగాహన, స్నేహబంధం తరచు అదృశ్యమవుతూండటం మాకు ఎదురైన ప్రధాన సమస్య. పిల్లల మధ్య శాశ్వత శత్రుత్వం అనేది లేకున్నా, పనికిమాలిన తగవులే ఎక్కువ ఉండేవి.

మొత్తంగా వాతావరణం విచారగ్రస్తంగా ఉన్నప్పటికీ సమిష్టి జీవన భావనకు సంబంధించి అప్పుడప్పుడు ప్రోత్సాహకరమైన పరిణామాలు జరిగేవి. తొలి శీతాకాలంలో మొదటి బ్యాచ్ కుర్రవాళ్ల మధ్య క్రమంగా ఏర్పడిన సదవగాహన వంటిది మళ్లీ మొగ్గ తొడగడం మాకు ఎంతో ఆనందాన్నిచ్చింది. ఆ వాతావరణాన్ని అతి భద్రంగా పరిరక్షించాలనేదే నా తాపత్రయం. పైగా నేను నిరంతర ఆశావాదిని. ఎప్పుడూ విజయానికి అతికొద్ది దూరంలోనే ఉన్నానని నమ్మేవాడిని. ఆ రోజుల్లో ప్రతిక్షణం ఆశ నిరాశల సమ్మేళనంలా గడిచింది. అయితే ఆశావాదమే చివరకు గెలిచింది. క్రమంగా కాలనీలో వాతావరణం కుదుటపడడం మొదలైంది.

ఇందుకు టీచర్లు పడిన శ్రమని వర్ణించడం కష్టం. పిల్లలకు పాఠాలు చదివి వినిపించి, వాళ్లతో కబుర్లు చెప్పి, వారితో కులాసాగా గడిపి, భోజనాల అనంతరం వారికి గుడ్‌నైట్ చెప్పి డార్మెటరీకి పంపేవారు. పిల్లలు కూడా రోజంతా చేసిన పనితో, చదువుతో అలిసి, కడుపునిండిన సంతృప్తితో, ప్రశాంతంగా నిద్రకు వొరిగేవారు.

అలాంటి ఒకరాత్రి ఇవానోవిచ్ నా గదిలో కూర్చుని ఏదో మాట్లాడుతున్నాడు. గది బయట మా గుర్రపుశాల నిర్వాహకులైన గడ్, బ్రాచెంకోలు గుర్రపుదాణా గురించి మాట్లాడాలని ఎదురు చూస్తున్నారు. ఇంతలో హటాత్తుగా కేకలు వినిపించాయి.

"బాబోయ్, కత్తులతో పొడుచుకొంటున్నారు" అని ఎవరోగాని కేకలు పెడుతున్నారు. నేను వెంటనే డార్మెటరీ వద్దకు పరుగులు తీశాను. అక్కడ దృశ్యం బీభత్సంగా ఉంది. పిల్లలు రెండు బృందాలుగా చీలిపోయి యుద్ధం సాగిస్తున్నారు. ఒకరిద్దరు అరుస్తూ కత్తులు ఝుళిపిస్తున్నారు. ఎవరో పిల్లవాడు మరొకడి చెవిపై గుద్దుతున్నాడు. ఒక కుర్రవాడి చేతినుంచి కత్తిని స్వాధీనం చేసుకునేందుకు బరున్ తంటాలు పడుతున్నాడు. ఈలోగా ఇవానోవిచ్ నా పక్కన చేరి "ఏదో ఒకటి చేయండి అంటన్ సెమ్యోనోవిచ్, వాళ్లు ఒకరినొకరు నరికేసుకుంటారు" అని ఆందోళనతో గుసగుసలాడాడు.

నేను కదలలేదు. ఇటువంటప్పుడు మధ్యలో జోక్యం చేసుకోకూడదని, అరుపులు, కేకలతో పరిస్థితిని చక్కదిద్దకూడదని నేనొక నిబంధన విధించుకున్నాను. అందుకే మౌనంగా, అక్కడ నిలబడి పిల్లలందరి వంకా తీక్షణంగా చూస్తున్నాను. క్రమంగా వారు నేను అక్కడున్న సంగతి గమనించారు. ఎవరికివారు వెనక్కి తగ్గి, మౌనంగా నిలబడ్డారు. క్షణాల్లో అలుముకున్న నిశ్శబ్దం మిగిలిన అందరిలో ఉద్రేకాన్ని చల్లార్చినట్టుంది. నాలో ఎంతటి ఆగ్రహం రగులుతున్నా నేను మౌనాన్ని కొనసాగించాను. అక్కడి పరిస్థితిపై, వాతావరణంపై నాకు క్రోధం, అసహ్యం పెరిగి పోతున్నాయి. అది అసమర్థుని ఆగ్రహం. ఇవ్వాళ నా జోక్యం వల్ల ఏదో జరగవచ్చు. అది క్షణికమే. మళ్లీ ఇటువంటి సంఘటనలు తిరిగి జరగవన్న నమ్మకం లేదు. నా మౌనం అలానే కొనసాగింది. ఆ నిశ్శబ్దాన్ని భగ్నం చేయడం కూడా ప్రమాదకరమని అనుమానించిన కుర్రవాళ్లు ఊపిరి తీసుకునే చప్పుడు కూడా తగ్గించారు. చివరికి పెడబొబ్బ పెట్టాను. "అందరూ కత్తులను టేబిల్‌పై పెట్టండి. త్వరగా" అని హూంకరించాను. ఆ క్షణంలో అదే సరైన పని అని నాకు తోచింది.

క్షణాల్లో అనేక కత్తులు, బాకులు టేబిల్‌పై పోగుపడ్డాయి. ఆ టేబుల్ పక్కన నిలబడిన బరున్ నా వంక అభినందనపూర్వకంగా నవ్వుతున్నాడు. ఆ గుంపులో తను ఒక్కడే నాకు ఆత్మీయునిలా తోచాడు. అందర్నీ మంచాలపైకి వెళ్లమని ఆదేశించి, అంతా ఆ పనిచేసేదాకా అక్కడే నిలబడ్డాను.

మర్నాడు పిల్లలెవరూ రాత్రి జరిగిన గొడవ గురించి ప్రస్తావించలేదు. నేనూ ఆ సంగతి గుర్తులేనట్టే వ్యవహరించాను. క్రమంగా రెండు నెలలు గడిచాయి. ఈలోపు పిల్లల మధ్య ఒకటి రెండు తగవులు, ఘర్షణలుగా మారినా మిగిలినవారు పరిస్థితిని అదుపులోకి తెచ్చేవారు. అయినా ఒక్కొక్కసారి ఆ గొడవలు మితిమీరి కత్తులు ఝుళిపించుకొనేదాకా పోయేవి. అటువంటి యుద్ధం ముగిసిన ఒకరాత్రి కత్తి తిప్పడంలో మొనగాడైన చోబట్ అనే కుర్రవాణ్ణి నా గదిలోకి పదమని ఆదేశించాను, వాడు సాధు జంతువులా నెమ్మదిగా నడుస్తూ నా గదిలోకి వెళ్లాడు. నేను అనుసరించాను. లోపలికి వెళ్లిన తరువాత వాడికి చెప్పేశాను. "నువ్వు తక్షణం కాలనీ నుంచి బయటికి పో" అని.

"ఎక్కడికి పోవాలి"

"నీ ఇష్టం వచ్చిన చోటికి వెళ్లు. కత్తులతో కబుర్లు చెప్పేందుకు వీలైన చోటికి పో. భోజనాల గదిలో నువ్వు అడిగిన కుర్చీ ఇవ్వనందుకు నీతోటి కామ్రేడ్‌పై కత్తి దూశావు. సరే. కత్తులతోనే అన్ని సమస్యలూ పరిష్కారం కాగల చోటు ఉంటే అక్కడికి వెళ్లు" అని చెప్పాను.

"ఎప్పుడు వెళ్లాలి?"

"రేపు ఉదయం."

మర్నాటి ఉదయం పలహార సమయంలో పిల్లలంతా కట్టకట్టుకుని నా వద్దకు వచ్చారు. చోబట్‌ని ఉండనివ్వమని అర్థించారు. వాడి తరుపున తాము బాధ్యత వహిస్తామన్నారు.

"మళ్లీ వాడు కత్తి దూస్తే, ఎవరినైనా పొడిస్తే ఏంచేయాలి?" అని వారిని అడిగాను.

"కావలిస్తే అప్పుడు వాడిని గెంటేయండి?" అని వారు బదులు చెప్పారు.

"అంటే మీరు ఎలాంటి హామీ ఇవ్వలేరు. అంతేగా. అయితే వాణ్ణి తక్షణం పొమ్మనండి" అన్నాను.

ఉదయం పలహారాల తరువాత చోబట్ నా దగ్గరికి వచ్చి సెలవు తీసుకున్నాడు. "వెళ్తాను. ఆంటన్ సెమ్యోనోవిచ్. నాకు మంచి పాఠం నేర్పారు" అన్నాడు.

"సెలవు. కానీ కోపాలు వద్దు. బయట బతకడం కష్టంగా తోస్తే వెనక్కి రా. కానీ రెండు వారాలలోపు రావద్దు" అని అతన్ని పంపేశాను.

నెల తరువాత వాడు తిరిగివచ్చాడు. చిక్కిపోయి, పాలిపోయి ఉన్నాడు.

"వెనక్కి వచ్చేశాను మీరు చెప్పినట్టే" అన్నాడు.

"అంటే నీకు తగిన చోటు దొరకలేదుగా" అని ప్రశ్నించాను.

బలహీనంగా నవ్వాడు. "ఇక్కడే ఉంటాను. ఇక కత్తుల జోలికిపోను" అన్నాడు.

పిల్లలంతా ఆనందంగా కేరింతలు కొట్టారు. "మీరువాడిని క్షమించారు. మాకు తెలుసు మీరు క్షమిస్తారని".

9

ఒక ఆదివారంనాడు పూర్తిగా తాగివున్న ఒసాడ్చీని నా దగ్గరకు తెచ్చారు. డార్మెటరీలో తాగి గోల చేస్తున్నాడట. నేనువాణ్ణి మారుమాట్లాడకుండా పడుకోమన్నాను. అతను అలాగే పడుకుండి పోయాడు. తరువాత డార్మెటరీలోకి వెళ్లిన నాకు గుప్పుమని సారా వాసన ఆవరించింది. తాగిఉన్న కుర్రవాళ్లు నన్ను తప్పించుకునిపోయే ప్రయత్నం మొదలుపెట్టారు. నేను దోషులని ఎత్తి చూప దలచలేదు. నెమ్మదిగా అన్నాను.

"ఒసాడ్చీ మాత్రమే కాదు. ఇంకా మీలో చాలామంది తాగారు" అని. ఈ సంఘటన తరువాత కొంతకాలం మామూలుగానే గడిచినా, మళ్లీ కాలనీలో తాగుబోతుతనం ప్రత్యక్షమైంది. చాలా మంది తాగివచ్చినా మెదలకుండా ఉండేవారు, కొందరు మాత్రం తాగి నా దగ్గరకొచ్చి తమ ప్రేమకథలు చెప్పేవారు, వారు పక్కన్ను వ్యవసాయ క్షేత్రాల్లోకి, గ్రామంలోకి షికారుకెళ్తున్న విషయాన్ని దాచే ప్రయత్నం చేయలేదు.

ఆ సాయంత్రం డార్మెటరీలోకి వెళ్లి తాగుడువల్ల నష్టాలేమిటో వారికి వివరించాను. కొందరు లేచి నిలబడి ఇక తాగబోమని వొట్టుపెట్టుకొన్నారు. నేను నమ్మినట్టు నటించాను. తాగుడు విషయానికి సంబంధించి నాకో విషయం తెలుసు. దోషులని అంటే తాగుబోతులని శిక్షించి లాభంలేదు. అందుకు కారకులైన వారి పని పట్టాలి. వాళ్లెవరో తెలుసుకోవడం కష్టం కాదు.

మా కాలనీ చుట్టూ పల్లెల్లో దొంగసారా బట్టీలకు కొదవలేదు. రోజు పూటుగా తాగిన రైతులు, కూలీలు కాలనీకి రావడం మామూలే. కాలనీ పిల్లలను సారాబట్టీలకు పంపుతున్నది కమ్మరి గొలోవన్ అని మాత్రం అప్పుడే తెలిసింది. ఏమిటిదని ప్రశ్నిస్తే, అందులో తప్పేమిటని అతను ఎదురు అడిగాడు. సోవియట్ ప్రభుత్వం ముందు తాగుడు ఆపాలని సూచించాడు. నాకు తిక్కరేగింది.

"ప్రభుత్వం ఏం చేసింద"ని ప్రశ్నించాను. సారాబట్టీలు ఎక్కడ ఉంటాయని అడిగాను.

"ఎందుకు వాటిని స్వాధీనం చేసుకుంటారా? మిలీషియాకే అది సాధ్యంకాలేదు" అని గొలోవాన్ నవ్వాడు.

కలీనా ఇవానోవిచ్ కూడ అంత ప్రోత్సాహకరంగా మాట్లాడలేదు. గ్రామ సోవియట్ అధ్యక్షుడు గ్రెచానీతో సహా అందరూ దొంగసారా తయరాచేస్తున్నారని వాళ్లని మనం ఏం చేయలేమని నాకు నచ్చచెప్పబోయాడు.

ఆ సాయంత్రం డార్మెటరీకి వెళ్లి పిల్లలకు చెప్పాను. "నేను మిమ్మల్ని తాగనివ్వను. దొంగసారా బట్టీల పనిపడతాను. ఎవరు నాకు సాయం వస్తారు?" అని అడిగాను. మొదట అందరూ జంకారు. కాని చివరకు కరబనోవ్, జడరోవ్, వోలోఖొవ్, టారానెట్స్‌లు నాతో చేతులు కలిపారు. రాత్రి మేం

కూర్చొని మా పథకం గురించి ఆలోచించాం. టూరానెట్స్ మా పని ఎంత కష్టమైందో వివరించాడు. దాదాపు ప్రతిఇంట్లోనూ సారాబట్టీలు ఉన్నాయి. ఒక గుడిసెపై దాడిచేస్తే మిగిలిన చోట్ల జనం బట్టీలను దాచేస్తారు. దీన్ని ఆపాలంటే మనం నలుగురం చాలం. ఇంకొంతమంది ఉండాలి అని చెప్పాడు.

వోలోఖొవ్ ఈ వాదనతో విభేదించాడు. గ్రామంలో జనానికి కాలనీవాసులంటే భయమని తెల్పాడు "ఈ పనికి మీరు ఒక్క కరబనోవ్‌ని తీసుకువెళ్తే చాలు" అని చెప్పాడు. నేను జదరోవ్ వంక చూశాను. అతను నిశ్శబ్దంగా, ధీమాగా ఉన్నాడు. అతని తీరే అంత. తన శక్తిని వృథా చేసుకోడు. అనవసరమైన ఉత్సాహం కనబరచడు. కానీ పనిలోకి దిగాడా, అతని ధీమా చూడాల్సిందే. అతను టూరానెట్స్ మాటలను ఖండించాడు. "టూరానెట్స్ ఇన్ని మాటలు వద్దు. చెప్పు ఏ గుడిసెపై దాడిచేద్దాం? వోలోఖొవ్ చెప్పినట్టు కరబనోవ్‌ని తీసుకెళదాం. అతనికి ఈ భూస్వాములతో ఎలా వ్యవహరించాలో తెలుసు. ఇక వృథా చర్చలు వద్దు. పడుకుందాం. పొద్దున్నే లేచి పని మొదలు పెడదాం" అని తేల్చేశాడు. ఆ ముందురోజే నేను పట్టణానికి వెళ్లి అక్రమసారా బట్టీలను ధ్వంసం చేసేందుకు, స్వాధీనం చేసుకునేందుకు అధికారం ఇచ్చే పత్రాన్ని తీసుకువచ్చాను.

మర్నాటి ఉదయం మేం ఐదుగురం ఏడుగంటలకల్లా గ్రామంలోకి వెళ్లాం. మొదట పొరుగున ఉన్న ఆంద్రీ గ్రిచెంకో అనే ఆసామి ఇంటి తలుపు తట్టాం. ఐదు నిమిషాల అనంతరం తలుపు తెరుచుకుని ఆంద్రీ బయటకు వచ్చాడు. "మీ ఇంట్లోని దొంగసారాబట్టీని ధ్వంసం చేసేందుకు వచ్చాం" అని వెళ్లిన పనేమిటో వివరించాం.

"నా ఇంట్లోనా?.. సారాబట్టీలా..." అని నివ్వెరపోయినట్టు ప్రశ్నించాడు ఆంద్రీ.

ఈలోగా ఆవరణలోని కుక్కలు ఒక్కసారిగా మొరగడం మొదలుపెట్టాయి. కరబనోవ్ తన చేతిలోని కర్రతో ఎదురుగా ఉన్న కుక్కను కొట్టి నోరు మూయించాడు. అందరం ఒక్కసారిగా ఇంటి ఆవరణలోకి దూసుకెళ్తుంటే కుక్కలు భయంతో చెల్లాచెదురయ్యాయి. అప్పటికే గుడిసె లోపలికి వెళ్లిన కరబనోవ్ అక్కడ ఉన్న సారాబట్టీని మాకు చూపించాడు. ఈలోగా టూరానెట్స్ అక్కడి ఒక బల్ల కిందనుంచి సారాతో నిండిన ఒక గ్యాలన్ సీసాను బయటకు తీశాడు.

అంతవరకూ నిస్తేజంగా ఉన్న ఇంటి యజమాని ఒక్కసారి టూరానెట్స్ వైపు దూకాడు. కానీ టూరానెట్స్ ఏమాత్రం కంగారుపడకుండా, తాపీగా తన చేతిలోని సీసాను జదరోవ్‌కి అందించాడు. దీనితో గ్రిచెంకో ఉగ్రరూపం ధరించాడు. "మీరు సిగ్గుపడాలి" ఇల్లిల్లూ తిరిగి దోచుకుంటున్నారు. మీతోపాటు మీ దొంగలముఠాని తోలుకొచ్చారు. జనాన్ని ప్రశాంతంగా బతకనివ్వరా?" అని పెడబొబ్బలు పెట్టాడు.

ఈలోగా టూరానెట్స్ పొయ్యిపై గల అటకనుంచీ మరో గ్యాలన్ సీసా బయటికి తీసి జెండాలా గాలిలో ఊపాడు. ఇక చేసేదిలేక గ్రిచెంకో మొహం వేలాడేశాడు. మాతోపాటు వచ్చిన టీచర్ లిడియా తీరికగా బెంచిమీద కూర్చొని, ఆంద్రీకి పాఠాలు చెబుతోంది. "చూడండి పెద్దమనిషీ, ఇలా సారా తయారుచేయడం చట్టవిరుద్ధం. అదీకాక జొన్నలు వృథాపోతాయి. తిండి లేక చాలామంది ఆకలితో పడుకుంటున్నారు" అని నచ్చచెబుతోంది.

నా ఆదేశాల మేరకు కుర్రవాళ్లు సారా సీసాలను, సారాబట్టీని రోడ్డుపై ధ్వంసం చేస్తున్నారు. కుర్రవాళ్ల సలహా విని లిడియా తన నీతిచంద్రికని ఆపి బయటకు పరుగెత్తుకువచ్చింది. ఆ తరువాత మేం లూకాసెమ్యొనోవిచ్ ఇంటిపై దాడిచేశాం. ఆయన సగౌరవంగా మమ్మల్ని ఆహ్వానించి భోజనానికి

పిలిచాడు. మాకు ఆదరంగా, ఆప్యాయంగా ఖరీదైన రొట్టె, కేకులు తినిపించాడు. సారా కాచడం వంటి దరిద్రపుగొట్టు పనిని తాను చేయనని ఓపికగా వివరించాడు. ఆయన భార్య కూడా ప్రశాంతంగా మాకు ఆహారం వడ్డించింది.

ఎప్పుడు అక్కడినుంచి జారుకున్నాడో మా టారానెట్స్! గుమ్మంలో నిలిచి బిగ్గరగా నవ్వుతున్నాడు అతని చేతిలో సారాబట్టీ సామగ్రి!! అతని వెనకే భయంతో కంపిస్తున్న ఆ గృహస్థు భార్య. "అటక మీద ఉంది. ఇంకా వెచ్చగా ఉంది" అని టారానెట్స్ ఇకిలించాడు. అక్కడకూడా ధ్వంసరచన కొనసాగించాం. యజమానురాలి శాపనార్థాల నడుమ వాటిని బద్దలుకొట్టాం.

అలా ఆ రోజు మేం మొత్తం ఆరు దొంగసారా బట్టీల అంతు చూశాం. ఈ దాడుల్లో మాలో ఎవరికి దెబ్బలు తగల్లేదు. చివరి గుడిసెనుంచి కాలనీకి తిరిగి వెళుతుండగా గ్రామ సోవియట్ అధ్యక్షుడు సెర్జీ పెట్రోవిచ్ గ్రిచానీ మాకు ఎదురుపడ్డాడు. యవ్వనంలో ఉన్న ఆ మనిషి గింగరాలు తిరిగిన తన గడ్డాన్ని సవరించుకుంటూ ఠీవిగా ప్రశ్నించాడు. "అభినందనలు. కానీ మీరిలా విధ్వంసం సృషించేందుకు అవసరమైన అధికార పత్రాలు మీదగ్గరున్నాయా" అని ఆయన ప్రశ్నించాడు. నేను మౌనంగా పట్టణం నుంచి తెచ్చిన అధికార పత్రాల్ని అతనికి ఇచ్చాను.

అతను ఆ లేఖ చదివి నాకు తిరిగి ఇచ్చాడు. "అనుమతి మీకు ఉండవచ్చు. కానీ ఇలాగే కొనసాగితే పరిస్థితి ఎలా ఉంటుంది? ఇటువంటి ప్రతి కాలనీ ఇలా తెగబడితే ఎలా? నేనుకూడా అక్రమసారా బట్టీలను నిరోధించేందుకు ప్రయత్నిస్తున్నాను నాకు కొంత వ్యవధి ఇవ్వండి" అన్నాడు.

"అందుకేనేమో మీకు ఒక సొంత సారాబట్టీ ఉన్నది" అన్నాడు టారానెట్స్ నింపాదిగా. దీనితో గ్రామ సోవియట్ అధ్యక్షుని క్రోధం రెట్టింపయింది. "అది నీ కనవసరం" అని అరిచాడాయన. "నీలాంటి ప్రతివాడూ స్థానిక అధికారులను సవాలు చేయడం ఏమిటో నేను చూస్తాను. ఎంత పైస్థాయికైనా వెళ్తాను" అని హెచ్చరించాడు. ఇక అతనితో అనవసరమనిపించి మా దారిన మేం పోయాం.

ఈ సంఘటన మా కాలనీపై అద్భుతమైన ప్రభావం చూపింది. ఆ మర్నాడు జడరోవ్ కమ్మరి కొలిమి దగ్గరున్న నా వద్దకు వచ్చి "ఈ ఆదివారం ఇంకా బాగా చేద్దాం. మొత్తం కాలనీ, ఏభైమంది మనవెంట వస్తారు" అని చెప్పాడు.

క్రమంగా గ్రామీణులు కూడా మాతో ఏకీభవించారు. "అవును జొన్నలను ఇలా వృథా చేయడం నిషేధమే" అంటున్నారు. మొత్తానికి కాలనీలో, పరిసరాల్లో తాగుడు అదృశ్యమైంది.

హాయిగా నిట్టూర్చేలోగా జూదం కాలనీని చుట్టుముట్టింది. చాలామంది పిల్లలు తమ వాటా రొట్టెను తినకుండా బయటికి తీసికెళ్లడం, ఒకరి డ్యూటీను మరొకరు చేయడం మా దృష్టికి వచ్చింది. పిల్లలు జూదానికి అలవాటుపడి తమ ఆహారాన్ని మరొకరికి పందెంలో ఓడిపోతున్నారు. మరొకరి పనులను తమనెత్తికెత్తుకొంటున్నారు. అంతలో ఓ రోజు ఓచరెంకో అనే పిల్లవాడు కాలనీ నుంచి పారిపోయాడు. అయితే మర్నాడు పట్టణంలో వీధిలో నాకు ఎదురుపడ్డాడు. నెమ్మదిగా అడిగితే తెలిసిన విషయం ఏమంటే, వాడు జూదంలో చాలా బాకీపడ్డాడు. తీర్చలేక పారిపోయి ఇలా వచ్చాడు.

ఆ రాత్రి డార్మెటరీని సోదా చేశాను. దిళ్ల క్రింద, పరుపుల కింద, వాళ్ల పెట్టెల్లో, కొందరి జేబుల్లో కుప్పలుకుప్పలుగా చక్కెర దొరికింది. బరున్ పెట్టెలోనైతే ఏకంగా 30 పౌండ్ల చక్కెర ఉంది. మిత్యాగిన్ దిండు కింద చిల్లరచిల్లరగా ఏభై రూబుళ్లు బైటపడ్డాయి. చివరకు ఆడపిల్లల గదుల్లోనూ బోలెడంత లెక్కచెప్పలేని సామగ్రి దొరికింది.

కాలనీలో అప్పటికే ముగ్గురు బాలికలు ఉన్నారు. అపార్ట్‌మెంట్‌లలో దొంగతనాలకు పాల్పడుతున్నవారిని అధికారులు అరెస్టు చేసి కాలనీకి పంపారు. ఓల్యా, మరూస్యా, రైసాలు ముగ్గురూ భిన్నతరహా వ్యక్తులు. వాళ్ల గదిలోనే పేకాట నడిచేదని బయటపడింది. బొద్దుగా, బద్ధకంగా ఉండే రైసా హైస్కూలు వరకూ చదివింది. ఆమెను ఎలాగైనా చదివించి రబ్‌ఫాక్*కు పంపాలన్నది మా టీచర్ల యత్నం. ఆమె తండ్రి రెండేళ్ల క్రితం తాగుబోతుల కొట్లాటలో మరణించాడు. తల్లికూడ తాగుడే ప్రపంచం చేసుకుని ముష్టి ఎత్తుకుంటూ బతికేది.

నిజానికి కాలనీలోకి మిత్యాగిన్ వచ్చి చేరిన తరువాత ఇక్కడ ముఠాకోరుతత్వం పరిఢవిల్లింది. అతను అనుభవజ్ఞుడైనదొంగ, సొంత పద్ధతులలో అత్యంత సాహసంతో అతను చేసే ప్రతి "మహత్కార్యం" విజయవంతమయింది. దొంగతనం తప్ప మరో వ్యాపకం ఉందని అతనెప్పుడూ నమ్మేవాడుకాదు. వచ్చినరోజే వాడు నాతో తన సంగతి మాట్లాడాడు.

తాను ఎక్కువ కాలం కాలనీలో ఉండననీ, దొంగగా కొనసాగడమే తన లక్ష్యమనీ వివరించాడు. దొంగతనాలు మానుకోవలసిన అంత అవసరం ఏమిటని నన్ను ప్రశ్నించాడు. దొంగతనం గొప్ప సరదా అయిన విషయమనీ చెప్పబోయాడు.

దోపిడీకి గురైన వాడికంటే దొంగే నిజంగా నష్టపోయేవాడని అతనికి చెప్పబోయాను. పనికి అలవాటు పడకుండా దొంగతనాలపైనే ఆధారపడితే చివరకు పతనం తప్పదని అంతిమంగా చేరేది జైలుకేనని చెప్పాను. పెద్దగా నన్ను విశ్వసించలేదతను.

ఇప్పుడు కాలనీలో జూదం వ్యవహారం బయటపడిన తరువాత కూడా తన టోపీలో దొరికిన డబ్బు ఎక్కడినుంచి వచ్చిందో చెప్పడానికి అతను సిద్ధపడలేదు. మిగిలిన వారందరినీ సమావేశపరచి స్పష్టంగా చెప్పాను. జూదం ఆడటం అంటే బలహీనులను దోచుకోవడమని, బుద్ధిహీనుల జేబులు కొట్టడమని చెప్పాను. వాళ్లు బుద్ధిహీనులు కాబట్టే డబ్బు పోతున్నా ఆడుతున్నారని వివరించాను. కాబట్టి కాలనీలో చాలామంది తిండిని కూడా జూదంలో పోగొట్టుకొంటున్న సంగతిని వారి దృష్టికి తెచ్చాను. దీనికి బలైన ఓచరెంకో మళ్లీ అనాథగా రోడ్డుమీద పడటంలోని అన్యాయం ఏమిటో వారికి అర్థం చేయబోయాను.

ఈ విషయంలో మిత్యాగిన్ కూడా స్పందించాడు. ఓచరెంకో పరిస్థితి నిజంగా విషాదమేనని ఒప్పుకొన్నాడు.

బలహీనులను కాపాడే ఉద్దేశం కాలనీలో ఎవరికీ లేకపోతే ఆ బాధ్యత నేనే తీసుకుంటానని పేకాట ఇక సాగనివ్వనని కచ్చితంగా చెప్పాను. పిల్లలంతా మౌనంగా విన్నారు. ఈలోగా కరబనోవ్ ముందుకు వచ్చాడు. పిల్లలందరిని ఉద్దేశించి స్థిరంగా చెప్పాడు. ఇలా మనతోటివాళ్లని పేకాటపేరుతో దోచుకోవడాన్ని సహించకూడదు. మీ సంగతెలా ఉన్న నేను సహించను. అంటే పేకాడుతూ ఎవరైనా కనిపిస్తే నేనే వాళ్ల పని పడతాను. ఓచరెంకో ఇక్కడినుంచి వెళ్లిపోయిన తీరుచూశాను. ఒక మనిషిని సజీవంగా సమాధి చేయడం లాంటిదది. దీన్ని నేను ఒప్పుకోను. ఓచరెంకోను నిలువునా దోచుకుని వీధుల్లోకి నెట్టింది బరున్, లైసా. అందుచేత వాళ్లే వెళ్లి వాడిని వెదికి వెనక్కు తీసుకురావాలి అని ప్రకటించాడు. వెంటనే అందరూ ఎక్కడెక్కడో దాచిన పేక దస్తాలు తెచ్చి అందరి ముందు కుప్పపోశారు. తన వెంట రైసా రావలసిన అవసరంలేదనీ తానే వెళ్లి ఓచరెంకోను తీసుకువస్తాననీ

*రబ్‌ఫాక్ – జిల్లా కేంద్రంలోని సాంకేతిక శిక్షణ సంస్థ

బరున్ ప్రకటించాడు. నిజంగానే మర్నాటి సాయంత్రానికల్లా అతను ఓచరెంకోను కాలనీకి తీసుకువచ్చాడు.

10
మేం హీరోలం కాము

ఆ రోజుల్లో మమ్మల్ని 'సామాజిక విద్యారంగ హీరో'లుగా అభివర్ణించేవారు. నిజానికి మేము ఏనాడూ ఉదాత్త కథానాయకులుగా భ్రమపడలేదు. ఎందుకంటే నిజం మాకు తెలుసు. ఆ రోజుల్లో సోవియట్ జీవనవిధానం ఫలితంగా అప్పుడే విజయవంతమైన విప్లవోద్యమాల కారణంగా ప్రతి కొత్త రంగంలో సాధించే విజయాల్లో ధీరోదాత్తతను చూడడం అందరికీ అలవాటైంది. అయితే మా పరిస్థితిపై మాకు అంచనా ఉంది. మేం ఎంతటి సాధారణమైన మనుషులమో, మాలోని లోపాలు ఏమిటో కూడా మాకు తెలుసు. మా రోజువారీ విధుల్లో మేం చేసే పొరపాట్లు, గందరగోళం, మారిన పరిస్థితుల్లో, ఈ విలక్షణ వాతావరణంలో అధ్యాపకులుగా మా భవిష్యత్ కార్యాచరణపై అలముకొన్న అయోమయం మాకు స్పష్టంగా తెలుసు. ఎన్ని విమర్శలు వచ్చినా, కొన్నిసార్లు ఎంతో నిరాశకు గురైనా ప్రారంభించిన పని పూర్తి చేయాలనే స్పృహ మాత్రం మా ఐదుగురు టీచర్లకూ ఉంది.

ఒసిపోవ్ దంపతులు టీచర్లుగా కాలనీకి వచ్చిన తొలిదినాల్లో పిల్లల అశుభ్రతచూసి కంపరం తెచ్చుకొనేవారు. మా కాలనీ నిబంధనల ప్రకారం డ్యూటీలో ఉన్న టీచర్ పిల్లలతో కలిసే భోజనం చేయాలి, సాయంత్రం డ్యూటీ సమయాన్ని పిల్లలతోనే వారి డార్మెటరీలో గడపాలి. కానీ ఒసిపోవ్ దంపతులకు పిల్లలన్నా వారిపై పేరుకున్న మురికి అన్నా అసహ్యం. వారి పక్కబట్టలపై పేరుకొన్న క్రిమికీటకాలంటే భయం. అందుకే మొదటి రెండు నెలల పాటు వారు పిల్లలను ముట్టుకొనేందుకు జంకేవారు. కానీ అంతలోనే వారి ధోరణిలో మార్పు కనిపించింది. పిల్లలతో కలిసిపోవడం మొదలైంది. వారి ప్లేట్లలోనే, వారితో కలసి భోజనం చేయడం ప్రారంభించారు. రాత్రివేళల్లో పిల్లలతో వారి డార్మెటరీలో, వాళ్ల మంచాలపైనే జారగిలబడి కథలు చెప్పడం, వారితో కలసి కూర్చుని ఆడుకునే ఆటలు ఆడడం కూడా మొదలుపెట్టారు. అయితే పిల్లలతో గడిపి తిరిగి తమ గదికి వెళ్లేప్పుడు తాము వెంట కొన్ని పేలను, ఇతర క్రిములను మోసుకువెళ్తున్నామని ఒసిపోవ్ దంపతులు నాకు తరచు ఫిర్యాదు చేసేవారు.

"అలా అయితే డార్మెటరీని శుభ్రం చేయడమే పరిష్కారమ"ని నేను వారికి చెప్పాను. మొత్తానికి ఒకమేరకు మేం దీన్ని సాధించాం. పిల్లలకోసం చిరిగి, అతుకులు వేసిన రెండేసి జతల బట్టలూ, పక్కల కోసం రెండేసి దుప్పట్లూ కష్టపడి పోగుచేశాం. అయితే ఎప్పుడూ కొత్త కుర్రాళ్లు వచ్చి చేరుతూండడంతో మొత్తం శుభ్రంగా అయేందుకు ఎక్కువ వ్యవధి కావలసి వచ్చింది.

మా సిబ్బంది విధులు మూడు రకాలు. ఒకటి ప్రధాన డ్యూటి. రెండోది శారీరకశ్రమకు సంబంధించిన వర్క్ డ్యూటీ, మూడోది సాయంత్రం డ్యూటీ. ఇవికాక ప్రతి టీచర్ ఉదయం వేళల్లో పిల్లలకు పాఠాలు చెప్పాలి. ఇందులో ప్రధాన డ్యూటీ మిగిలిన వాటికంటే కష్టమైనది. ఈ డ్యూటీలో ఉన్న టీచర్ ఉదయం ఐదుగంటల నుంచి సాయంత్రం నిదుర సమయం దాకా పిల్లలతో గడపాలి. అంటే రోజంతా శ్రమించాలి. వీరు ఆ రోజంతా పిల్లలకు, స్టోర్‌రూంకు, సప్లైలకు బాధ్యులు. అంటే వంటగదికి కావలసిన సామగ్రి, సరంజామా అంతా సరిగ్గా ఉందో లేదో చూడడం, పిల్లల మధ్య తగవులు వస్తే పరిష్కరించడం, సర్దిచెప్పడం, కలీనా ఇవానోవిచ్ తెచ్చే సప్లైలను స్టోర్‌రూంలో భద్రపరచడం నుంచి పిల్లల దుస్తులు అమర్చడం, పక్కబట్టలు సరిచూడడం దాకా అన్ని పనులూ

కనిపెట్టాలి. ఈ డ్యూటీలో పనిభారం ఎంతో ఎక్కువ. అందుకే మొదటి ఏడాది గడిచేసరికి పిల్లల్లోనే సీనియర్లు ఈ విధి నిర్వర్తించి టీచర్‌కు సాయపడడం అవసరమైంది. ఈ పెద్ద పిల్లల చొక్కా భుజాలపైన గుర్తింపుకోసం ఎర్ర రిబ్బన్ అమర్చేవాళ్లం.

ఇక వర్క్ డ్యూటీ పర్యవేక్షించే టీచర్ పని ఆ రోజుకోసం నిర్దేశించిన పని సవ్యంగా పూర్తయేలా చూడడం. ఇక్కడి వర్క్‌షాప్‌లో, అడవిలో, పొలంలో, తోటలో ఎక్కడ ఏ పని అనుకొన్నా దానిని పిల్లలు సరిగ్గా చేసేలా చూడడం ఈ టీచర్ బాధ్యత. సాయంత్రం డ్యూటీ అనేది నిజానికి ఒక డ్యూటీలా ఉండేదికాదు. ఎందుకంటే ఆ సమయానికి ఆ డ్యూటీలో ఉన్న టీచర్‌తో పాటు ఖాళీగా ఉన్న టీచర్లంతా డార్మెటరీలకు చేరే పిల్లలతోనే పొద్దు పుచ్చేవారం. ఇదేదో త్యాగం కాదు. అలా పిల్లలతో గడపడం తప్ప మాకు గత్యంతరం ఉండేదికాదు. అదీకాక పిల్లలంతా అలసిపోయినా, మెరిసిపోయే కళ్లతో మా కోసంఎదురుచూస్తారనే సంగతి మాకు తెలుసు. వాళ్లందరి బుర్రల్లో ఎన్ని వేల కథలు, జ్ఞాపకాలు, ఆలోచనలూ, అనుభవాలు నిక్షిప్తమై ఉన్నాయో గమనిస్తే ఆశ్చర్యం కలిగేది. పైగా వాళ్లకి పుట్టెడు అనుమానాలు, అనేక సందేహాలు, వందలకొద్దీ ప్రశ్నలూను. అక్కడే వాళ్లతో కూర్చుని కథలు చెబుతూ, వింటూ వాళ్ల ప్రశ్నలకి బదులిస్తూ టీచర్లం పొద్దు పుచ్చేవాళ్లం. అక్కడే మా రేపటి కార్యక్రమాలు, గ్రామంలో ఉన్న సమస్యల గురించి మాట్లాడుకునేవాళ్లం.

ఈ పిల్లల్లో మిత్యాగిన్ ఓ చిన్నహీరో. వాడు ఎప్పటికప్పుడు కల్పించి చెప్పే అద్భుతమైన కథల కోసం చిన్న పిల్లలు ఎదురుచూసేవాళ్లు. వాడు కథ చెప్పడం అంటే మామూలు విషయం కాదు. కథని కళ్లముందు ప్రదర్శిస్తాడు. గొంతులు అనుకరించడంలో అపార నైపుణ్యం, హావభావాల ప్రదర్శనలో నేర్పు వాడి కథను రక్తికట్టిస్తాయి. ఆ రోజుల్లో సాయంత్రాలు పిల్లల కోసం పుస్తకాలు చదివి వినిపించే కార్యక్రమం ప్రారంభించాం. నిజానికి మొదటిరోజునుంచే ఒక మంచి లైబ్రరీ ఏర్పాటు కోసం ప్రయత్నించాను. వీలైనన్ని పుస్తకాలు కొనడం, ఇక్కడి గ్రామంలో, పట్టణానికి వెళ్లినప్పుడూ కనిపించిన వారందరినీ ఏదైనా పుస్తకం ఇమ్మని అడగడంలాంటివి చేశాను. దానితో శీతాకాలం గడిచేసరికల్లా మా కాలనీ లైబ్రరీలో దాదాపు అన్ని క్లాసిక్స్, రాజకీయాలపై, వ్యవసాయం గురించి వచ్చిన అనేక గ్రంథాలు పోగుపడ్డాయి. దీనితోపాటు విద్యాశాఖ నుంచీ కూడా విజ్ఞానశాస్త్రంపై అనేక పుస్తకాలు సంపాదించగలిగాను. మా పిల్లల్లో ఎక్కువమందికి పుస్తకాలంటే ఆసక్తి, అభిమానం కలిగాయి. కాని వారిలో అత్యధికులు చదవనైనాలేరు, లేదా చదివినది పూర్తిగా అర్థం చేసుకోలేరు. అందుకే మేం పుస్తకాలను చదివి వినిపించే పని మొదలుపెట్టాం. సాధారణంగా నేనే చదివేవాడిని. నేను కాకపోతే జడరోవ్ ఆ పనికి దిగేవాడు. మొదటి ఏడాదే ఇలా మేం పుష్కిన్, కొరొలెంకో, మామిన్-సిబిర్యాక్, వెరెసయేవ్‌ల పుస్తకాలన్నీ చదివేశాం. అయితే ఈ రచయితలందరికంటే గోర్కికి మేం ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాం.

ఒక పాటలా, ఒక కలలా అందంగా ఆద్యంతం సాగిపోయే గోర్కీ శైలి అంటే పిల్లల్లో అందరికీ ప్రేమే. గోర్కీ కథలూ, గాథలూ ఎవరైన పైకి చదువుతుంటే పిల్లలు కళ్లు పెద్దవి చేసుకొని, పెదాలు బిగించి, తదేకంగా మా వంకే చూస్తూ చివరివరకు వినేవారు. "మకార్‌చుద్ర" "ఆ ముగ్గురూ" వంటి కథలైతే వాళ్లు కనురెప్ప కూడా కదిల్చేవారు కాదు. అంత శ్రద్ధగా వినేవారు. ఆ కథలో నాయకుల ధీరోదాత్తత, త్యాగనిరతి లాంటి విషయాలపై వాదోపవాదాలు సాగేవి. మిత్యాగిన్, జడరోవ్, బరున్ లాంటి వాళ్లు మిగిలిన పిల్లలని సరదాగా వేళాకోళం చేసేవారు, "ఆ కథలో నాయకుడు అలా చనిపోవడం పెద్ద గొప్పా?" అని అడిగేవారు.

గోర్కీ రచనలు అన్నింటిలోనూ "నా బాల్యం", "నా బాల్యసేవ" ఇక్కడి పిల్లలందరినీ ముగ్ధుల్ని చేశాయి. వాళ్ల వింటున్నది గోర్కీ సొంత కథేనని మొదట్లో వాళ్లకి నమ్మకం చిక్కలేదు. గోర్కీ సైతం తమలానే చిన్నప్పుడు అన్ని కష్టాలు పడ్డాడని, దిమ్మరిలా బతికాడనీ నేను చెప్పింది విని వాళ్లు చివరకు నమ్మారు. ఇకవారి ఆలోచనలన్నీ గోర్కీ చుట్టూ పరిభ్రమించడం మొదలైంది. ఆయన ఆత్మకథలోని వివిధ సంఘటనలను గుర్తు తెచ్చుకుంటూ, మా రోజువారీ అనుభవాలతో వాటిని పోల్చుకోవడం ఆరంభమైంది. ఆయన పుస్తకాల్లోని చిలిపి కబుర్లు, కొంటె చేష్టలు, వేళాకోళానికి పెట్టే అల్లరి పేర్లు మా అందరి జీవితంలో అంతర్భాగంగా మారాయి. గోర్కీ మా పిల్లలకు మానసికంగా ఎంత దగ్గరయారో చెప్పడం కష్టం.

మా కాలనీకి మూడు కిలోమీటర్ల దూరంలో కొరెలెంకో పేరిట పిల్లల కాలనీ మరొకటి ఏర్పడిందని తెలిసిన రోజున మా వాళ్లు పెదవి చప్పరించేశారు.

"పాపం వాళ్లు కేవలం కొరెలెంకో కాలనీ పిల్లలు. మనం మాత్రం గోర్కీవాసులం" అని సగర్వంగా వాళ్లలో వాళ్లు చెప్పుకొన్నారు.

నిజానికి మా కాలనీకి గోర్కీ కాలనీ అని ఎవరూ అధికారికంగా పేరు ఇవ్వలేదు. పట్టణంలో విద్యాశాఖా అధికారులు ఈ విషయం పట్టించుకోలేదు. కానీ, క్రమంగా మమ్మల్ని గోర్కీవాసులుగా చెప్పుకోవడం మొదలుపెట్టిన తరువాత అధికారులు కూడా అలవాటు పడిపోయారు. దీంతో ఈ పేరుతోనే మేం కాలనీ కోసం రబ్బరు స్టాంపులు తయారుచేయించినా అభ్యంతరాలు ఎదురుకాలేదు.

పిల్లలందరికీ గోర్కీ అంటే ఇంతటి ప్రేమాభిమానాలున్నా దురదృష్టవశాత్తూ 1925 దాకా మేం ఆ విఖ్యాత రచయితతో ఎలాంటి సంబంధాలూ పెట్టుకోలేకపోయాం. గోర్కీ చిరునామా ఏమిటో తెలియరాలేదు. అయితే ఆ ఏడాది ఒక పత్రికలో గోర్కీపై వ్యాసం వచ్చింది. ఇటలీలో గోర్కీ జీవితంపై వ్యాసం అది. అందులో గోర్కీ పేరును ఇటాలియన్ యాసలో 'మసిసమోగోర్కీ' అని రాశారు. ఆ వ్యాసం చూసిన వెంటనే మేం విచిత్రమైన అసంపూర్ణ చిరునామాను ఊహించి గోర్కీకి ఒక లేఖ రాశాం. మస్సిమోగోర్కీ, సోరెంటో, ఇటలీ అనేది ఆ చిరునామా. ఆయనకు ఆ లేఖ అందుతుందనీ కానీ, బదులు వస్తుందని కానీ నేను ఆశించలేదు.

కాలనీలోని సీనియర్లతో పాటు, కొత్త పిల్లలకు కూడా గోర్కీ కథలంటే అపరిమితమైన ఆసక్తి ఉండేది. పిల్లల్లో పన్నెండుమంది జూనియర్లు ఉండేవాళ్లు. ఈ కొత్త పిల్లలు ఎప్పుడూ జబ్బులతో, దెబ్బలతో, నీరసంగా, బక్కచిక్కి దయనీయమైన స్థితిలో వచ్చేవారు. టీచర్లలో ఒకరైన ఎకతెరీనా వారిని దగ్గరికి తీసేది. ఆమె మా కాలనీలో పెద్ద డాక్టర్‌కూడా. ఆమె ఎంత కఠినంగా ఉన్నట్టు కనిపించినా కొత్తపిల్లలు ఆమె వద్దకే చేరేవారు. ఒక తల్లిలా వాళ్లని ఎలా కసురుకోవచ్చు గ్రిగోర్యేవ్నాకు బాగా తెలుసు. ఆ పిల్లల బలహీనతలు ఏమిటో ఆమెకు తెలిసినంతగా మరెవరికీ అర్థం కావేమో. ఇంత ఆప్యాయంగా ఉన్నా ఆ పిల్లలు చెప్పే ఏ ఒక్క విషయాన్నీ ఆమె నమ్మేదికాదు.(ఈ విద్య నాకు పట్టుబడలేదు). చిన్న తప్పునైనా వదిలేదికాదు. క్రమశిక్షణ మీరితే వాళ్లని కచ్చితంగా తిట్టిపోసేది. అయితే ఆ పిల్లలతో అంత ఆత్మీయంగా, వారి గుండె లోతులను స్పృశిస్తూ ఆమె వ్యవహరించే తీరు మాత్రం అద్భుతంగా ఉండేది. ఆ పిల్లవాడి బతుకుగురించి, దూరమైన అమ్మగురించి, బతుకుపై వాడి కలల గురించి, ఆశలు, ఆకాంక్షల గురించి ఆమె తరచి తరచి ప్రశ్నించేది. ఆ పిల్లల పొట్టనింపి ఆకలి తీర్చేందుకు అవసరమైన సరంజామా సంపాదించేందుకు ఆమె నిరంతరం మా

సప్లైల మానేజర్ ఇవానోవిచ్‌తో గొడవకు సిద్ధపడేది. ఈ వ్యవహారాన్ని అర్థం చేసుకొన్న పెద్ద కుర్రవాళ్లు గ్రిగోర్యేవ్నాకు పూర్తిగా సహకరించేవారు. పిల్లలకు స్నానాలు చేయించడం, వాళ్లు పొగ తాగకుండా ఒక కన్నేసి ఉంచడం, బట్టలు పాడు చేసుకోకుండా చూడడం లాంటి పనులు చేసేవాళ్లు. కాలనీలో సీనియర్లకు కొత్తగా వస్తున్న పిల్లలపై ఇంతటి ప్రేమాభిమానాలు కలగడానికి కారణం ఎకతెరీనా అన్న విషయాన్ని నేను ఇక్కడ చెప్పితీరాలి.

11

భూమికోసం యుద్ధం

వ్యవసాయం చేసేందుకు కావలసిన సాధన సంపత్తి మాకు లేదని రోజురోజుకూ అర్థం అవుతోంది. దానితో కొలోమాక్ నదీతీరంలోని మా భవిష్యత్తు కాలనీ వైపు మా దృష్టి సారించేవారం. అక్కడ వసంత గాలులలకు తలలు ఊపే పళ్లతోటలు, సుసంపన్నంగా మెరిసే సారవంతమైన భూమి చూసి నిట్టూర్చేవాళ్లం. కానీ కొత్త కాలనీలో మరమ్మతుల పని నత్తనడక నడుస్తోంది. మాకు దొరికిన వడ్రంగులు అంత నేర్పరులు కారు. వారికి దుంగలతో ఇళ్లు నిర్మించడం మినహా కాస్త కష్టమైన డిజైన్‌తో కట్టిన ఇంటికోసం పనిచేయడం పెద్దగా తెలియదు. ఎంత డబ్బు పెట్టినా అద్దాలు దొరికేవికావు. మా దగ్గర డబ్బుకూడ అంతంతమాత్రంగానే ఉండేది. మొత్తానికి వేసవి ముగిసేసరికి రెండు, మూడు భవంతుల్లో పని పూర్తయినా కిటికీలకు అద్దాలు లభించలేదు. పూర్తిగా వెచ్చగా ఉన్న ఆరేడుగదులు ఉన్నప్పటికీ అవి ఈ వడ్రంగులు, తాపీ పనివారు, స్టౌ పనివారికే చాలేవికావు. అదీకాక చేసేందుకు పనంటూలేని, వర్క్‌షాప్‌లు సిద్ధంకాని స్థితిలో పిల్లలని అక్కడికి తరలించడం దండగ. అయితే పిల్లలు మాత్రం రోజంతా కొత్త కాలనీలో కాలం గడుపుతూ అన్ని పనుల్లో సాయపడేవారు. అక్కడి పండ్లతోటల్లో దాదాపు పదిమంది కుర్రవాళ్లు ఉంటూ రోజూ మా కాలనీకి ఏపిల్ బుట్టలు పంపేవారు. వారి పుణ్యమా అని అక్కడి పళ్లతోటలు కాస్త శుభ్రపడి, కంటికినదురుగా కనిపించడం మొదలైంది.

ఇదిలా ఉంటే ట్రెప్కే ఎస్టేట్ శిథిలాల పొరుగున ఉన్న గాంచరోవ్కా గ్రామస్థులకు మాత్రం ఈ పిల్లల వ్యవహారం మింగుడుపడలేదు. ఎస్టేట్ కొత్త యజమానులు మాజీ నేరస్థులని తెలిసినతరువాత, వారి చిరిగిన దుస్తులు, ఆకలి మొహాలు గమనించాక గ్రామస్థులకు వారంటే అయిష్టం పెరిగింది. ఇదంతా ఒక ఎత్తు అయితే ఆ ఎస్టేట్ కింద దాదాపు 160 ఎకరాల భూమి ఉందని ఆశించిన నాకు నిరాశే మిగిలింది. ఎందుకంటే ఆ భూమి అంటూ ఉన్నది కేవలం కాయితం మీదే. కాస్త సాగుచేసేందుకు వీలున్న భూమిని అంతకుముందే స్థానిక రైతులు సొంతం చేసుకొన్నారు.

ఆ గ్రామ సోవియట్ అధ్యక్షుడు సెర్గీ పెట్రోవిచ్ గ్రెచానీకి సమస్యని వివరించాను. ఆ భూమి మాదని, రైతులు ఆక్రమించుకున్నారనీ చెప్పాను. కానీ ఆయన అడ్డంగా తల ఊపాడు. "నిరుపేద రైతులు నాలుగేళ్లనుంచీ ఆ భూమిని సాగు చేస్తున్నారు. పైనుంచి ఆర్డర్లు పంపేవారికి ఆ సంగతులు తెలియదు. వాళ్లు కష్టజీవి కడుపుకొడుతున్నారు" అని ఉపన్యసించాడు. ఏం చేయాలో అర్థం కాలేదు.

రోజూ కొత్త కాలనీకి రావాలంటే, ఆ గ్రామం మధ్య నుంచి నడిచి, కొలోమాక్ నదిని దాటేందుకు మేం తయారుచేసుకున్న చిన్న పడవని ఉపయోగించుకొనేవాళ్లం. చింకిపాతల్లో ఉన్న మా పిల్లల్ని చూసి గ్రామంలోని కుర్రవాళ్లు గేలి చేసేవారు. "పోండి చిరుగుబట్టల ముష్టి వెధవల్లారా మీరు

మోసుకొచ్చే పురుగులతో మా ఊరిని పాడు చేయద్దు. మీరు ఎస్టేట్‌లో ఉండలేరు. ఉండనివ్వం" అని కేకలు పెట్టేవారు. ఆ రోజుల్లో కనుక మేం గట్టిగా నిలబడి మా హక్కుల కోసం పోరాడకపోతే గ్రామప్రజలు ఖాయంగా మమ్మల్ని తరిమేసేవారు.

దున్నుకుంటున్న భూమిపై హక్కుల కోసం పోరాడవలసింది ఆ పొలంలోనే తప్ప కాయితాల మీద కాదని రైతులకు తెలుసు. చాలాకాలంగా సాగుచేసుకొంటున్న రైతులను అక్కడినుంచి బయటకు పంపలేనని గ్రామ సోవియట్ అధ్యక్షుడు తెగేసి చెప్పేశాడు.

ఇక పోరు తప్పదని గ్రహించాను. ఆ పొలాల్లోనే నోటీసులు పెట్టించాను. పొలం దున్నినవారికి కాలనీ ఎలాంటి ప్రతిఫలం ఇవ్వదని ఆ నోటీసుల సారాంశం. దీనివల్ల లాభం ఉంటుందన్న ఆశ నాకు లేదు. అదీకాక కష్టపడి సాగుచేస్తున్న రైతులనుంచి ఆ భూమిని స్వాధీనం చేసుకొనేందుకు నాకు మనసు రాలేదు కూడా.

ఇలా మధనపడుతూ కొద్దిరోజులు గడిపాను. ఓ రోజు సాయత్రం జదరోవ్, కరబనోవ్‌లు తమవెంట ఒక కొత్తమనిషితో నా వద్దకు వచ్చారు. ఆ వచ్చిన కుర్రవాడు గాంచరోవ్కా గ్రామ కొమ్సొమోల్ సభ్యుడు. తమ యువ కమ్యూనిస్టు యూనిట్‌లో ముగ్గురే సభ్యులని అతను తెలిపాడు. తన కష్టాల చిట్టా విప్పాడు.

గ్రామం ఇప్పటికీ భూస్వాముల గుప్పెటలోనే ఉంది. వాళ్లని ఎదిరించడం యువ కమ్యూనిస్టులకు అసాధ్యంగా మారింది. అందుకు సాధ్యమైనంత త్వరలో మా కాలనీని ట్రెప్కే ఎస్టేట్‌కి మార్చమని అడిగేందుకు వచ్చాడతను.

నేను మా భూమి సమస్యని వివరించాను. "ఆ భూమి విద్యాశాఖ మాకు కేటాయించింది. కాని ఇంతకుముందునుంచే పేద రైతులు అక్కడ వ్యవసాయం చేస్తున్నారు. అటువంటప్పుడు మేం ఏం చేయగలం" అని ప్రశ్నించాను.

"ఎవరు పేదరైతులు?" ఆశ్చర్యంతో అడిగాడతను. మాటల్లో అతనిపేరు స్పిరిడాన్ అని తెల్సింది.

ఆ భూమి పేదరైతుల ఆధీనంలో లేదని భూస్వాములే దాన్ని సాగుచేసుకుంటున్నారని తెలియచెప్పి నా కళ్లు తెరిపించాడు స్పిరిడాన్.

"గ్రామ సోవియట్ పెద్దరైతుల గుప్పెటలో ఉంది. అందుకే వాళ్లు ఎస్టేట్‌భూమిని వాళ్లలో వాళ్లు పంచుకొన్నారు" అని వివరించాడతను.

అంతా విని కరబనోవ్ గట్టిగా అన్నాడు.

"విన్నారుగా, వాళ్లేం చేశారో" అంటూ హూంకరించాడు.

సెప్టెంబర్ మొదట్లో ఒకరోజు నేనూ, ఆంటన్ బ్రాచెంకో పట్టణం వెళ్లి మా బండిలో తిరిగివస్తున్నాం. బ్రాచెంకో మా కొత్తగుర్రం రెడ్ చేసే అల్లరి గురించి మురిపెంగా ఏదో చెబుతున్నాడు. నేను ఏదో ఆలోచిస్తూ ఆ సంగీతం వింటున్నాను. ఉన్నట్టుండి అతను నిశ్శబ్దమైపోయాడు. బండి మెల్లగా సాగుతోంది. బ్రాచెంకో రోడ్డు చివరికి దీక్షగా చూస్తున్నాడు. అతను హటాత్తుగా బండిలో లేచి నిలబడి గట్టిగా అరుస్తూ గుర్రాన్ని బాదడం ప్రారంభించాడు. అది వెర్రి పరుగులు మొదలుపెట్టింది. నెమ్మదిగా వాడి కేకలు అర్థం అవుతున్నాయి.

"మనవాళ్ళే... వాళ్ల దగ్గర విత్తులు నాటే యంత్రం ఉంది" అంటున్నాడు. కాలనీ దగ్గర మలుపు తిరుగుతుండగా రెండు గుర్రాలకు పూన్చిన విత్తుల యంత్రం శరవేగంతో కాలనీ వైపు దూసుకు వెళ్లడం కనిపించింది. ఈ దృశ్యం చూడగానే బ్రాచెంకో బండి పగ్గాలు నాచేతికిచ్చి, బండిలోంచి

కిందికి దూకి ఆ దిశగా పరుగుపెట్టాడు. ఆ విత్తుల యంత్రాన్ని నడిపిస్తున్నది మా కరబనోవ్, ప్రిఖోడ్కొలే. బ్రాంచెకో అతి కష్టంమీద ముందుకు వెళ్లి ఆ బండిని ఆపాడు. రొప్పుతూ, రోజుతూ కరబనోవ్ జరిగినది వివరించాడు.

వాళ్లు పెరట్లో పనిచేస్తూండగా ఐదుగురు రైతులు ఈ యంత్రం పూన్చిన గుర్రాలతో పొలాల్లోకి ప్రవేశించారట. వీళ్లు నలుగురు కుర్రవాళ్లు వాళ్లని అడ్డుకొని మర్యాదగా పొలం నుంచి బయటకు పొమ్మని హెచ్చరించగానే రైతుల్లో ఒకరైన నల్లటి జిప్సీవంటి మనిషి చెయ్యి చేసుకొన్నాట్ట. కుర్రవాళ్లలో ముందు నిలబడి ఉన్న చాబోట్‌ని తన కొరడాతో కొట్టాడట. దీంతో అక్కడ చిన్నపాటి యుద్ధమే జరిగింది. ఈలోగా కరబనోవ్ విత్తుల యంత్రానికి ఉన్న గుర్రాల తాళ్లు అందుకొని కాలనీ దిశగా వేగంగా తిరిగివస్తున్నాడు. అదీ సంగతి.

ఈ విజయంతో కరబనోవ్ తబ్బిబ్బవుతున్నాడు. ఆనందంతో ఇకిలిస్తున్నాడు. మరోపక్క ప్రిఖోడ్కో సన్నగా నవ్వుతూ సిగరెట్ చుట్టుకోవడం మొదలుపెట్టాడు.

ఆ తరువాత జరగబోయే దర్యాప్తు, విచారణ, అల్లరీ నా కళ్లముందు మెదిలాయి.

"గొప్ప పనిచేశారు. మీరంతా కల్సి మళ్లీ పెద్ద గందరగోళం సృష్టించారు" అని వాళ్లని కసురుకున్నాను.

దీంతో కరబనోవ్ నొచ్చుకున్నాడు. "అదికాదండీ గొడవ మొదలుపెట్టింది వాళ్లే..." అంటూ సమర్థించుకోబోయాడు.

"చాల్లే, లోపలకి పదండి. అక్కడ మాట్లాడుకొందాం" అంటూ లోపలికి దారితీసాను. బరున్ మాకు ఎదురయాడు. అతని నుదుటిపై దెబ్బ స్పష్టంగా కనిపిస్తోంది. పిల్లల మధ్య నిలబడి ఉషారుగా నవ్వుతున్నాడు. ఈ యుద్ధంలో పాల్గొన్న మరో ఇద్దరు యోధులు చాట్, సొరోకవ్ నీటి తొట్టి దగ్గర నిలబడి వంటికి అంటిన బురద కడుక్కొంటున్నారు.

కరబనోవ్ ముందుకు వెళ్లి బరున్ భుజం తట్టాడు. "తప్పించుకున్నావా" అని ప్రశ్నించాడు.

సమాధానంగా బరున్ మళ్లీ ఇకిలించాడు. "వాళ్లు మొదట మీ గుర్రం వెంట పడ్డారు. మీరు అందరని అర్థమై మావైపు తిరిగారు. మేం పిచ్చివాళ్లమా? అప్పటికే పరుగు అందుకున్నాం" అని ఆనందంగా వివరించాడు.

గంట తరువాత గ్రామ సోవియట్ అధ్యక్షుడు లూకా సెమ్యోనోవిచ్ మరో ఇద్దరితో కలిసి కాలనీకి వచ్చాడు. పిల్లలు వారిని మర్యాదగా పలకరించారు. "రండి. మీ విత్తుల యంత్రం కోసమేగా వచ్చారు" అంటూ ఆహ్వానించాను. ఈ నాటకం చూసేందుకు గుమిగూడిన పిల్లలతో గదిలో కదలడమే కష్టమైంది. నా ఎదురుగా కూర్చున్న లూకా సెమ్యోనోవిచ్ ముందు గొంతు విప్పాడు.

"నన్ను నా మిత్రులనూ కొట్టిన కుర్రవాళ్లని పిలిపించండి" అని డిమాండ్ చేశాడు. నేను స్థిరంగా తిరస్కరించాను. "చూడండి. మిమ్మల్ని మావాళ్లు కొడితే మీకు తోచినచోట ఫిర్యాదు చేసుకోండి, నేను మాత్రం వాళ్లని ఇప్పుడు పిలిచేదిలేదు."

"పిలవరన్నమాట. ఇంకోచోట ఫిర్యాదు చేసుకోవాలన్నమాట. సరే మా విత్తుల యంత్రాన్ని ఎవరు తిరిగి ఇస్తారు?"

"ఆ యంత్రాన్ని ఎవరికి ఇవ్వాలి?"

లూకా తన వెంట వచ్చిన వారిలో ఒకరిని చూపిస్తూ "ఆ యంత్రం ఆయనదే" అన్నాడు.

"మీదేనా?" అడిగాను.

"అవును."

"సరే, అయితే దానిని నేను జిల్లా పోలీసులకు పంపిస్తాను. మా పొలంలో అక్రమంగా పనిచేసేందుకు వచ్చిన కారణంగా దాన్ని స్వాధీనపరుస్తున్నట్టు వారికి తెలియచేస్తాను. ఇంతకీ మీపేరేంటి?"

"నా పేరు ఒనోప్రిగ్రోబానీ. ఇతరుల పొలం అంటే మీ ఉద్దేశం ఏమిటి? అది నా పొలం" "సరే ఆ సంగతి ఇప్పుడు మాట్లాడవద్దు. మీరు ఇతరుల భూమిలోకి అక్రమంగా ప్రవేశించి, అక్కడ పనిచేస్తున్న కాలనీవాసులపై చెయ్యి చేసుకున్నారు. ముందు ఆ సంగతి తేలాలి" అన్నాను. ఇంతలో బరున్ ముందుకు వచ్చి "ఇదిగో ఇతను నన్ను దాదాపు చంపినంత పనిచేశాడు" అని ఫిర్యాదు చేశాడు.

"నిన్నా? చంపడమా? నీకు అంత స్థాయిలేదులే" అని హూంకరించాడు ఒనోప్రీ. ఇలా వాదోపవాదాలు కొనసాగాయి. భోజనాల సంగతి మరచిపోయాం. పగలు గడిచిపోయింది. రాత్రి భోజనాల సమయం కూడ దాటింది. మా మధ్య తగవు అనంతంగా సాగుతోంది.

నేను నా పట్టుదలను సడలించలేదు. ఎట్టి పరిస్థితుల్లో విత్తుల యంత్రాన్ని ఇచ్చేదిలేదనే వాదించాను. మా పొలంలోకి వచ్చి మమ్మల్ని కొట్టినవారిపై ఫిర్యాదు చేయక తప్పదన్నాను. అదృష్టవశాత్తు పొలంలో జరిగిన కొట్లాట గుర్తులు మా వాళ్ల శరీరాలపై కనిపించినట్టు అవతలిపక్షం వారిపై లేవు. అందువల్ల శిక్షపడితే తమకే అనే భయంవారిలో కనిపించింది. చివరకు జదరోవ్ గట్టిగా బల్లను చరిచి వాళ్లతో నిక్కచ్చిగా చెప్పేశాడు. "ఇక ఈ గోల చాలు. ఆ పొలం మాది. మీరు అందులో కాలు పెడితే సహించం. మేం ఏభైమంది కుర్రవాళ్లం ఇక మీ ఇష్టం" అని కుండబద్దలు కొట్టాడు.

భూమిని మాకు స్వాధీనం చేస్తూ పత్రంపైన సంతకం చేస్తే తప్ప విత్తుల యంత్రాన్ని కూడా తిరిగి ఇవ్వబోమని నేను స్పష్టం చేశాను. చివరికి లూకా సెమ్యోనోవిచ్ దారికి వచ్చాడు. ఇక చెప్పేదేముంది. ఆ గ్రీష్మంలోనే మేం తొలిసారి మా పొలంలో రైధాన్యం వేశాం. వ్యవసాయంలో మాకు మేమే నిపుణులం కదా. కలీనా ఇవానోవిచ్‌కి కూడ వ్యవసాయం గురించి తెలిసినది స్వల్పం. అయితే ప్రతి ఒక్కరూ పొలంలో పనిచేయాలని, విత్తనాలు నాటాలనీ ఉబలాటపడ్డారు. ఒక్క బ్రాచెంకో మాత్రం వ్యవసాయంలాంటి తుచ్ఛమైన పనికి తన ప్రియనేస్తమైన గుర్రాన్ని వాడుకోవడంపై చిర్రుబుర్రులాడాడు. అక్టోబర్ నాటికి దాదాపు ఇరవై ఎకరాల భూమిలో మొలకలు ప్రత్యక్షమయ్యాయి. ఆ పచ్చటి తివాచీ వంక ఇవానోవిచ్ సగర్వంగా చూసేవాడు. చేతిలోని కర్రతో ఎటో చూపిస్తూ "అక్కడ మనం ఉర్లగడ్డలు వేయాలి" అనేవాడు.

మా రెండు గుర్రాలు రెడ్, బాండిట్ పగలంతా పనిచేసేవి వసంతంలో మొక్కజొన్న పంట వేసేందుకు వీలుగా జదరోవ్ బృందం ఆ గుర్రాలకే నాగలికట్టి కొంత పొలాన్ని దున్నింది. పని సగంలో ఉండగా మంచు కురవడం మొదలైంది. చచ్చిచెడీ పని ప్రారంభిస్తే ఇటువంటి అవరోధం ఎదురవడం దురదృష్టమేగా.

12

జిల్లా కమిస్సార్‌తో బ్రాచెంకో రగడ

అయితే అన్నిచోట్లా పరిస్థితి ఇలా మారలేదు. అనుకోని రీతిలో మా వ్యవసాయ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. ఓ రోజు కలీనా ఇవానోవిచ్ ఎక్కడినుంచో ఒక ముసలి ఆవును లాక్కొచ్చాడు.

ఈలోగా అంతే అనూహ్యంగా వ్యవసాయశాఖ నుంచి మాకు నల్లటి ముసలి గుర్రం కూడా అందింది. కొన్ని ఎద్దుబళ్లు, పొలంపనికి ఉపయోగపడే బళ్లు మా సంపదలో చేరాయి.

బ్రాచెంకో గుర్రపుశాలకు సర్వాధికారి అయాడంటే కారణం అంతవరకూ ఆ బాధ్యత చూసే గడ్ చెప్పుల వర్క్‌షాప్ వైపు ఆకర్షితుడు కావడం. ఆదినుంచీ మాతోనే ఉన్న పొడవుకాళ్ల గుర్రం రెడ్‌కు తోడుగా వచ్చిచేరిన నల్లటి ముసలిగుర్రం (దీనికే బ్రాచెంకో దోపిడీదొంగ అని పేరుపెట్టాడు) మా రవాణాకు ప్రధాన ఆధారం. ఈ రెండు గుర్రాలను బండికి కట్టి నడపడం నిజంగానే నరకం. ముసలిగుర్రం బ్యాండిట్ ఎక్కడపడితే అక్కడ చతికిలపడేది. పట్టణం వెళ్లినప్పుడు పక్క బళ్లవాళ్లు మమ్మల్ని చూసి ఎగతాళి చేస్తుంటే బ్రాచెంకో ఆగ్రహంతో రగిలిపోయేవాడు. బ్రాచెంకో మిగిలినవారిలా అనాధ కాదు. పట్టణంలో అతని తండ్రికి రొట్టెల బేకరీ ఉంది. తల్లి కూడా సజీవంగానే ఉంది. కానీవాడికి చిన్నతనంనుంచే ఇల్లంటే రోత. పగలంతా వీధుల్లో అనాధపిల్లలతో చేరిగోలచేసి రాత్రికి ఇంటిదగ్గర పడుకొనేవాడు. వాడి ముఠాలో చిల్లర దొంగలకు కొరతలేదు. దీనివల్లే వాడు కొన్నిసార్లు జైలుకి కూడా వెళ్లవలసి వచ్చేది. అలా తిరిగితిరిగి చివరకు మా కాలనీకి చేరాడు. వాడి వయసు పదిహేనేళ్లే. ముచ్చటగా ఉంటాడు. ఉంగరాల జట్టు, నీలికళ్లు, చువ్వ లాంటి శరీరంతో అందంగా కనిపించేవాడు. ఎలాగోకానీ చదవనూ, రాయనూ నేర్చడంతో చాలా పుస్తకాలు చదివేశాడు. వాడి బుర్రనిండా కథలే. అయితే పాఠ్య పుస్తకాలు చదవడం అంటే బ్రాచెంకోకు రోత. వాడిని క్లాస్‌రూంలో కూర్చోబెట్టడమే గగనంగా ఉండేది. మొదట్లో వాడు తరచు కాలనీ నుంచి రెండేసి రోజులు మాయమయ్యేవాడు. మళ్లీ ఉల్లాసంగా తిరిగివచ్చేవాడు. తన తిరుగుబోతు తనం గురించి బ్రాచెంకోకు చాలా బెంగట. తరచు నాతో అనేవాడు, “ఆంటన్ సెమ్యోనోవిచ్‌గారూ నాతో మీరు కఠినంగా ఉండండి లేకుంటే దిమ్మరిగా మారిపోతానేమో” అని చెప్పేవాడు.

అయితే కాలనీలో బ్రాచెంకో ఏనాడూ దొంగతనాలకు పాల్పడలేదు అలాగే ఏనాడూ అబద్ధాలు చెప్పలేదు. ఒక్క క్రమశిక్షణ అంటేనే వాడికిఅర్థమయేదికాదు. సమయానికి, సందర్భానికి ఎలా ప్రవర్తిస్తే బావుంటుందో వాడికి ఒకఆలోచన ఉండేది. అంతవరకే క్రమశిక్షణను సహించేవాడు. కాలనీ నియమ నిబంధనలంటే తనకు లెక్కలేదనే సంగతిని వాడు దాచలేదు. నేనంటే ఒకవిధమైన గౌరవం ఉన్నా, ఎప్పుడైనా నేను గనుక మందలించడం మొదలుపెడితే మధ్యలోనే నన్ను అడ్డుకునేవాడు. ఉద్రేకపూరితంగా ఓ ఉపన్యాసం ఇచ్చేవాడు. తాను చేసిన తప్పుకి ఏవేవో కారణాలు చెప్పేవాడు. కనిపించని శత్రువులను తన చేతిలోని కమ్చీతో కొట్టేవాడు. చివరకు నెమ్మదిగా నా గదిలోంచి నిష్క్రమించేవాడు. టీచర్లతో కూడా వాడి ప్రవర్తన భరించలేనంత దూకుడుగా ఉండేది. అయినా అందులోనూ ఓ అందం ఉండబట్టి టీచర్లు వాడి మాటలని పెద్దగా పట్టించుకునేవారు కాదు. బ్రాచెంకో ఏనాడూ తన స్వలాభం కోసం, స్వప్రయోజనం కోసం ఎవరితో జగడం పెట్టుకోవడం నేను చూడలేదు.

బ్రాచెంకోకు గుర్రాలంటే అంత వెర్రిప్రేమ ఏమిటో నాకు అర్థమయ్యేది కాదు. కాలనీలో అందరికంటే తెలివిగా వుండే ఈ కుర్రవాడు నాగరికమైన రష్యన్‌లోనే మాట్లాడేవాడు. ఎప్పుడూ శుభ్రంగా ఉండేందుకు ప్రయత్నిస్తూ, పుస్తకాలు తెగ చదివేవాడు. ఇన్ని పనులున్నా ఎప్పుడూ గుర్రాలశాలలోనే మసిలేవాడు. వాటికి మాలిష్ చేయడం, శుభ్రం చేయడం, చివరికి అవి విసర్జించిన పేడను కూడ తానే ఎత్తి పారవేయడంలాంటి పనుల్లో నిమగ్నమయ్యేవాడు. బయటకు బండిమీద

ఎవరు, ఎక్కడికి వెళ్లాలన్నా తానే బండి తోలేవాడు. దానివల్ల చాలాసార్లు భోజనానికి ఆలస్యం అయి తన వాటా ఆహారం మిగలకపోయినా నోరెత్తేవాడు కాదు. అయితే బండికైనా సరే గుర్రాలని కట్టాలంటే వాడితో పెద్ద వాదన అవసరమయేది. కలీనా ఇవానోవిచ్, మా కమ్మరి పనివారు, స్టోర్‌రూం బాధ్యులు అనేక పనులపై బయటికి వెళ్లాల్సి వచ్చేది. ఎవరైనా సరే వాడితో పెద్ద యుద్ధం చేస్తే తప్ప గుర్రాలని బయటికి తెచ్చేవాడు కాదు. ఎవరికీ గుర్రాలంటే ఇసుమంత దయలేదనీ, బయటికి తీసుకెళ్లి వాటిని బాధపెడుతున్నారని వాదనకు దిగేవాడు. వాడి వెనక ఎప్పుడూ ఇద్దరు, ముగ్గురు జూనియర్ కుర్రవాళ్లు గుర్రపుశాలలో తిరుగుతూ దానిని అమిత శుభ్రంగా ఉంచేవారు.

ఓ రోజు కాలనీ కమ్మరి కోజిర్‌కు ప్రాణం మీదకు వచ్చింది. అతనికి గుండెపోటు వచ్చిందనీ, పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నదనీ ఎకతెరీనా స్వయంగా చెప్పింది. వెంటనే డాక్టర్ కోసం పట్టణం వెళ్లేందుకు బండి సిద్ధం చేయమని బ్రాచెంకోను ఆదేశించాను. వాడు మొరాయించాడు. తన గుర్రం రెడ్ పరిస్థితి ఆందోళనకరంగానే ఉందని వాడు చెప్పాడు. ఒక గుర్రం చావుబతుకుల్లో ఉన్నా లక్ష్యపెట్టని వారు ఓ మనిషికి కొంచెంనెప్పి వస్తే హడావుడి చేస్తున్నారని నిందించాడు. బండగా, మొండిగా వాదనకు దిగాడు. నాకు ఆగ్రహం కట్టలు తెంచుకుంది. వాణ్ణి ఆ క్షణమే గుర్రపుశాల బాధ్యతల నుంచి తప్పిస్తున్నట్టు ప్రకటించాను.

అయినావాడు దారికి రాలేదు. "నన్నుకాదని గుర్రపుశాల బాధ్యత మరెవరికైనా ఇవ్వండి ఎలా చేస్తాడో చూద్దాం" అన్నాడు.

నేను గట్టిగా అరిచాను. "నీకు అనవసరం. ఇక గుర్రపుశాలకూ నీకూ సంబంధం లేదు" అని.

వాడు విసురుగా బదులిచ్చాడు. "సరే అయితే ఇక నేను ఒక్క క్షణం కూడ కాలనీలో ఉండను" అని బెదిరించాడు.

"నీ ఇష్టం నిన్నెవరూ ఆపరు" అని సమాధానం చెప్పాల్సి వచ్చింది.

బ్రాచెంకో కళ్లలో నీళ్లు తిరిగాయి. జేబులు తడిమి ఒక తాళాల గుత్తి తీసి నా బల్లపై పెట్టాడు. నా ఆదేశాల ప్రకారం బ్రాచెంకోకు ఇంతవరకూ సహాయకునిగా పనిచేసిన ఒడ్రిష్కో ఆ తాళాలు తీసుకున్నాడు. నీళ్లు నిండిన కళ్లతో అతనివంక తిరస్కారంగా చూసిన బ్రాచెంకో ఏదో అనబోయి, ఊరుకుని నిశ్శబ్దంగా గదిలోంచి వెళ్లిపోయాడు.

ఆ సాయంత్రమే బ్రాచెంకో కాలనీ నుంచి వెళ్లిపోయాడు. ఏదో పనిమీద పట్టణానికి వెళ్లిన కుర్రవాళ్లకి వాడు కనిపించాడట. రెండు రోజుల తరువాత, సాయంత్రం సమయాన ఒడ్రిష్కో రక్తంవోడుతున్న మొహంతో, పెద్దగా ఏడుస్తూ నా గదిలోకి వచ్చాడు. ఏం జరిగిందని నేను అడిగేలోపు టీచర్ లిడియా పరుగున వచ్చింది.

"ఆంటన్ సెమ్యోనోవిచ్ త్వరగా గుర్రపుశాలకు వెళ్లండి. బ్రాచెంకో వచ్చాడు. పెద్ద కొట్లాటకు దిగాడు" అని చెప్పింది.

గుర్రపుశాలలో బ్రాచెంకో ఇద్దరు కుర్రవాళ్లతో ప్రశాంతంగా పనిచేస్తున్నాడు. నన్ను చూసి చిరునవ్వు నవ్వాడు. ఈలోగా నా వెనక ఉన్న ఒడ్రిష్కోను చూసి ఒక్కసారిగా వాడిపైకి దూకాడు. వాడితో కలబడుతూ అరుపులు మొదలుపెట్టాడు. "నువ్వు పో, ఇక్కడినుంచి". అంటూ వాణ్ణి వదిలి పక్కనే ఉన్న దీపం పట్టుకుని నన్ను ఈడ్చుకుంటూ మా గుర్రం 'రెడ్' దగ్గరికి తీసుకెళ్లాడు. "చూడండి ఎలా బాదాడో" అంటూ గుర్రాన్ని చూపించాడు. దాని మూపురం నుంచీ రక్తం కారిన గుర్తులు కనిపిస్తున్నాయి. నాకు బాధగా అనిపించింది. అయినా బ్రాచెంకోని నిలదీశాను.

"నిన్ను ఎవరు రమ్మన్నారు. వచ్చినా అందర్నీ కొట్టే అధికారం నీకెవరిచ్చారు" అని ప్రశ్నించాను.

"నేను వాణ్ణి కొట్టడమా? ఇంకా అది పూర్తవలేదు. మరోసారి గుర్రాల జోలికి వచ్చాడా వాణ్ణి చంపేస్తాను" అని బ్రాచెంకో బదులిచ్చాడు.

గుర్రాలని అంతగా హింసించిన ఓప్రిష్కోను వాడు కొట్టినందుకు నాకు కోపం రాలేదు. అయినా క్రమశిక్షణ మీరాదు అందుకే ఆదేశించాను. "ఇక్కడినుంచీ పో, సాయంత్రం వరకూ అరెస్టులో ఉండు" అన్నాను.

వాడు ఆ సాయంత్రం వరకూ గొణుక్కుంటూ, ఓ పుస్తకం చదువుకుంటూ నా గదిలోనే "బందీ"గా ఉన్నాడు.

ఆ ఏడాది శీతాకాలంలో నిజమైన సమస్య ఎదురైంది. ఎలాంటి ఎరువూ లేకుండా ఇవానోవిచ్ వేసిన గుగ్గిళ్లు మా పొలంలో పండలేదు. కనీసం గుర్రాలకు గడ్డికూడా లేని దుస్థితి. జనవరి నాటికి గుర్రాలు ఆకలితో మగ్గిపోవలసిన పరిస్థితి వచ్చింది. పట్టణంలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో, గ్రామంలో తోటి రైతుల వద్ద ముష్టెత్తికొని రోజులు గడిపాం.

చివరికి అసలైన ఉపద్రవం రానే వచ్చింది. బ్రాచెంకో నీళ్లు నిండిన కళ్లతో నా వద్దకు వచ్చి గుర్రాలకు రెండు రోజులుగా దాణా లేదని చెప్పాడు.

పట్టణానికి వెళ్లి వచ్చిన ఇవానోవిచ్ ప్రభుత్వాన్ని శాపనార్థాలు పెట్టాడు. దాణా ఇవ్వలేదని అతను చెబుతున్నపుడు బ్రాచెంకో తలుపు పక్కన నిలబడి నిశ్శబ్దంగా విన్నాడు. అంత నిశ్శబ్దంగా కాలనీ నుంచీ అదృశ్యమయాడు. ఆ మరునాడు ఒక బండి నిండా గడ్డితో ఒక రైతును వెంటపెట్టుకొని తిరిగివచ్చాడు.

ఆ రైతు మొదట ఇవానోవిచ్‌ని చూసి పై అధికారిగా భావించాడు. నమస్కారం పెట్టి, "పంట పన్నుపై పన్ను ఇక్కడ కట్టవచ్చుని, డబ్బు రూపంలో లేకున్నా ఫరవాలేదనీ ఆ కుర్రవాడు చెప్పాడు. అందుకే దాణా పట్టుకొచ్చాను" అని చెప్పాడు.

ఇవానోవిచ్ నోట మాట రాలేదు. దూరంగా గుర్రపుశాల గుమ్మం దగ్గర నుంచున్న బ్రాచెంకో నాకేవో సైగలు చేస్తున్నాడు.

ఇవానోవిచ్ చిరునవ్వులు చిందిస్తూ నన్ను పక్కకి లాగి రహస్యంగా చెప్పాడు.

"ఏం చేస్తాం. తీసుకోండి. తరువాత ఆలోచిద్దాం" అన్నాడు.

నిజంగానే చేసేదేమీ లేదు. నేను ఆ రైతుతో అన్నాను. "ఆ గడ్డిని దింపి, తరువాత ఆఫీసుకి రా. రసీదు ఇస్తాను".

ఆఫీసు గదిలో అన్యమనస్కంగా రసీదు రాసి ఇచ్చాను. పదిహేడు పూడ్‌ల గడ్డిని పన్ను రూపంలో వసూలు చేసినట్టు రాసి ఇస్తున్నప్పుడు నేరం చేస్తున్నట్టు నా చేతులు వణికాయి. కానీ ఆ రైతు మాత్రం ఆనందంగా రసీదు అందుకుని సలాంపెట్టి నిష్క్రమించాడు. బయట బ్రాచెంకో ఆనందంతో గంతులు వేస్తూ పాటలు అందుకున్నాడు. నన్ను చూడగానే నృత్యం ఆపి "ఏం చేయగలం? గుర్రాలని ఆకలితో చంపలేం కదా" అన్నాడు అనునయంగా.

నాకు రైతు సంగతే అర్థం కాలేదు. పన్ను కట్టమనగానే అంత ఆనందంగా గడ్డి ఇచ్చేసి ఎందుకు వెళ్లిపోయినట్టు? ఆ సంగతే బ్రాచెంకోని అడిగాను. వాడు ఓపికగా వివరించాడు.

"ఎందుకు కట్టడు? ఇదే పన్ను మామూలుగా అయితే ఆ కొండ దాటి, రహదారిలో పది మైళ్లు ప్రయాణించి, పట్టణం వెళ్లాలి. అక్కడ పొడవాటి లైన్‌లో నిలబడి పన్ను కట్టాలి. అదీకాక వాడు

తెచ్చిన గడ్డి బరువు పదిహేడు పూడ్‌లు అన్నాడు. మనం తూకం వేయలేదు. అదే పట్టణంలో అలా కుదరదు. అదీ సంగతి" నేనేం మాట్లాడలేదు.

రెండు రోజుల తరువాత మరో రైతు తన బండిలో గడ్డి తీసుకొచ్చాడు. తన స్నేహితుడు చెప్పాడట. పన్ను ఇక్కడా కట్టవచ్చని!

ఏమనాలో తెలియలేదు. ఇవానోవిచ్‌ని పిలిచి హడావుడిగా గుసగుసలాడాను.

"తీసుకోండి ఆంటన్ సెమ్యోనోవిచ్. తరువాత ఆలోచిద్దాం" అని ఆయన సలహా ఇచ్చాడు. తీసుకోవడం తప్పనిపించింది. కాదంటే ఆ రైతు నిలదీయవచ్చు, ఒకరిదగ్గర పన్ను ఇక్కడ తీసుకుని తనను పట్టణం వెళ్లమంటారేంటని ప్రశ్నించవచ్చు.

తప్పదు. "పన్ను" వసూలు చేసి రశీదు ఇచ్చాను. అలాగా మరో ఇద్దరు రైతులు వచ్చి ఆనందంగా గడ్డిమోపులు ఇచ్చేసి వెళ్లారు. నాకు తెలుసు ఇదో గొడవ అవుతుందని. అధికారులు సహించరని. ఏం చేయగలను? జరగవలసినదే జరుగుతుందని ఊరుకున్నాను. ఈలోగా బ్రాచెంకో నా వంక సాలోచనగా చూస్తూ, ఏదో గొణుక్కుని నవ్వుకొనేవాడు. చివరికి జిల్లా అధికారుల నుంచీ తాఖీదు రానే వచ్చింది.

ఏ అధికారంతో మీ కాలనీ గ్రామస్థుల నుంచి పన్ను వసూలు చేస్తున్నదో దయచేసి వివరించండి.

– జిల్లా కమిస్సార్

– అని

నేను ఈ సంగతి ఎవరికీ చెప్పలేదు. సమాధానం కూడా ఇవ్వలేదు.

ఏప్రిల్‌లో రెండు నల్ల గుర్రాలు పూన్చిన బండి కాలనీ ఆవరణలోకి దూసుకువచ్చింది. బ్రాచెంకో బెదురుగా పరుగుపరుగున నా గదిలోకి వచ్చాడు.

"వాళ్లు వచ్చారు" అని చెప్పాడు.

"ఎవరు"

"వాళ్లే, బహుశా గడ్డి సంగతి కావచ్చు. బాగా కోపంగా కనిపిస్తున్నారు" అని చెప్పాడు. ఈలోగా జిల్లా కమిస్సార్ నా గదిలోకి రానే వచ్చాడు. నిజంగా పెద్ద అధికారిలానే ఉంది రూపం. సొగసైనతోలు జాకెట్, దానికో రివాల్వర్, సన్నగా, పొడవుగా, ఠీవిగా ఉన్నాడు.

"మీరేనా డైరెక్టర్?" ప్రశ్నించాడాయన.

అవునని బదులిచ్చాను.

"నేను రాసిన లేఖ అందిందా?" అడిగాడాయన.

"అందింద"ని చెప్పేను.

"మరి బదులు ఎందుకివ్వలేదు? ఏమిటిదంతా? పన్ను వసూలు – అదీ గడ్డి రూపంలో చేసే అధికారం మీకు ఎవరిచ్చారసలు?" గద్దించాడు కమిస్సార్.

"మేం ఏ అధికారం లేకుండానే గడ్డిని పన్నుగా వసూలు చేశాం" ఒప్పుకున్నాను.

జిల్లా కమిస్సార్ ఒక్కసారిగా ఆగ్రహంతో ఎగిరిపడ్డాడు.

"మీ ఉద్దేశమేంటి? అనుమతి లేకుండా వసూలు చేయడమేంటి? ఇదెంత పెద్ద నేరమో తెలుసా? దీనికి మిమ్మల్ని అరెస్టు చేయవచ్చు" అన్నాడాయన. నేను నేరం ఒప్పుకొన్నాను.

"తప్పని తెలుసు. నన్ను నేను సమర్థించుకోను. కానీ, అరవకండి, మీకు తోచింది చెయ్యండి" అన్నాను.

జిల్లా కమిస్సార్ అయోమయంగా గదిలో పచార్లు ప్రారంభించాడు.

ఈలోగా బ్రాచెంకో గదిలోకి వచ్చాడు. ఉన్నట్టుండి వాదన ఆరంభించాడు.

"పన్ను అనేది ఏ రూపంలో అయితే మాత్రం తేడా ఏమిటి? గుర్రాలకు నాలుగు రోజుల నుంచి దాణా లేదు. మీ బండికి కట్టిన నల్ల గుర్రాలే తిండి లేకుండా నాలుగు రోజుల పాటు పేపర్లు చదువుకుంటూ ఉండిపోతాయా? అలా అయితే వాటిని బండికి కట్టి ఉరుకు పరుగులమీద మీరు ఇక్కడికి రాగలరా?" అని కమిస్సార్‌ని అడిగాడు. కమిస్సార్ నివ్వెరపోయి పచార్లు ఆపాడు.

"నువ్వెవరు? ఇక్కడేం చేస్తున్నావ్?" అని ప్రశ్నించాడు.

నేను బ్రాచెంకోను పరిచయం చేశాను. "వాడు మా గుర్రపుశాల అధిపతి. ఈ గొడవతో వాడికీ ఎంతో కొంత సంబంధం ఉంది" అని చెప్పాను.

జిల్లా అధికారి మౌనంగా మళ్లీ పచార్లు మొదలుపెట్టాడు. కొన్ని నిమిషాలపాటు గదిలో నిశ్శబ్దం. హఠాత్తుగా ఆయన ఆగి నా వంక తిరిగాడు.

"వసూలు చేసిన పన్ను వివరాలు కనీసం నమోదు చేశారా?" అని అడిగాడు.

దీంతో బ్రాచెంకో నా వైపు "నమోదు చేశాం కదండీ. మనం అన్ని వివరాలు రాశాం కదండీ" అని ఆత్రంగా అడిగాడు.

నాకు నవ్వు ఆగలేదు. జిల్లా కమిస్సార్ నాతో జత కలిపాడు.

నవ్వులు ఆగిన తరువాత ఆయన నన్ను ప్రశ్నించాడు.

"ఇలాంటి అద్భుతమైన కుర్రవాడు మీకు ఎక్కడ దొరికాడు?" అని.

"మేమే వాళ్లని తయారుచేస్తాం" అని గర్వంగా సమాధానమిచ్చాను.

ఇంతలో బ్రాచెంకో జిల్లా కమిస్సార్ ఎదుటికి వచ్చి వినయంగా వంగి, "మీ గుర్రాలకు దాణా వెయ్యనా?" అని అడిగాడు.

ఆయన నవ్వి "వెళ్లు వాటికి తిండి పెట్టు" అన్నాడు.

13

యూదు వ్యతిరేకత

1922 శీతాకాలంలో గోర్కీ కాలనీలో పెను తుపానులు సంభవించాయి. వరసగా విరుచుకుపడిన ఆ విషాద ఉదంతాలు ఊపిరి సలపనివ్వలేదు. అయితే అవి విషాదకరమైన రోజులు అయినప్పటికీ ఆ సమయంలో మా కాలనీ వస్తుపరంగానే కాక నైతికంగా కూడా ఎంతో ఎదిగింది. అటు విషాదం ఇటు అభివృద్ధి ఒకే సమయంలో ఎలా సాధ్యపడ్డాయో ఇప్పుడు నేను వివరించలేను. ఆ రోజుల్లో కాలనీలో సమయం అద్భుతంగా గడిచేది. రోజంతా పని, కాలనీ వాసులందరిమధ్యా నెలకొన్న సహృద్భావం, పరస్పరవిశ్వాసం ఆ రోజుల్ని అందంగా మలిచాయి. పిల్లలంతా ఎప్పుడూ నవ్వుతూ తుళ్లుతూ కేరింతలతో ఉత్సాహంగా ఉండేవారు. అంతలోనే ఉన్నట్టుండి ఓ రోజు మొత్తం కాలనీ జీవితాన్నే కుదిపివేసే భయానక విషాద సంఘటనలు జరిగేవి. దాంతో మేమంతా మతులు పోగొట్టుకొని రోగిష్టి మనుషుల్లా తయారయ్యేవాళ్లం. దీనంతటికి కారణం యూదు వ్యతిరేకత.

అప్పటివరకూ కాలనీలో యూదులెవరూ లేదు. గ్రీష్మంలో వారి రాక ప్రారంభమయింది. వారిలో ఒక యువకుడు నేర పరిశోధనా విభాగంలో పనిచేశాడు. కాలనీలోని పూర్వ నేరస్థులంతా అతనిపై తన ఆగ్రహాన్ని వెళ్లగ్రక్కేరు. తప్పెవరిదో తేల్చడం నాకు అసాధ్యమయింది. యూదు వ్యతిరేకత కాకపోయినా కొందరు కుర్రవాళ్లు తమ ఆగ్రహాన్ని, అసంతృప్తిని తీర్చుకునేందుకు యూదు

పిల్లలను లక్ష్యంగా ఎంచుకున్నారు. కాలనీకి వచ్చిన తొలి యూదు సభ్యుడు ఆస్ట్రో ముఖోవ్. వాణ్ణి కాలనీలోని సీనియర్లు అకారణంగా చితక్కొట్టేవారు. అనుక్షణం వేధించేవారు. వాణ్ణే కాదు యూదులైన పిల్లలందర్నీ మిగిలినవారు రకరకాలుగా హింసించేవారు. వాళ్ల వస్తువులను దొంగిలించేవారు. తిండి కాజేసేవారు. వెర్రిమొర్రి పేర్లతో పిలిచి వేధించేవాళ్లు. ఒక్కమాటలో చెప్పాలంటే వారిని అనుక్షణం భయంతో, బెంగతో కృసించి పోయేలా చేసేవారు. ఆ హింసను ఎలా ఆపాలో మాకు తెలిసేది కాదు. ఎందుకంటే ఈ హింస అతిరహస్యంగా, పకడ్బందీగా మా టీచర్లెవరికీ తెలియని విధంగా సాగిపోయేది. బాధితులెవరూ తమకు కలిగిన కష్టాన్ని, బాధనుపైకి చెప్పుకునేందుకు సాహసించేవారే కాదు.

ఓ పిల్లవాడి బెదురు చూపులను బట్టో, నిరంతర నిశ్శబ్దాన్ని బట్టో, లేక వాళ్ల ఒంటిపై కనిపించే దెబ్బల చిహ్నాలబట్టో జరిగిందేమిటో అర్థం చేసుకునేందుకు ప్రయత్నించేవాళ్లం. అయితే ఇది ఎంతో కాలం రహస్యంగా సాగలేదు. వాళ్లని అంత ఘోరంగా హింసిస్తున్నది బరున్, మిత్యాగిన్, వోల్కోవ్, ప్రిఖాడ్కో, ఒసాడ్చీ, టారానెట్స్ అని తేలిపోయింది.

వీళ్లలో టారానెట్స్ మొదట్నుంచీ పిల్లలందరి దృష్టిలో ఓ హీరో. కానీ, తర్వాత కాలంలో తనకంటే వయసులో పెద్దవాళ్లు రావడంతో అతను ఇబ్బందిగా మసిలాడు. ఆ కోపాన్ని యూదు పిల్లలపై చూపించడం మొదలుపెట్టాడు. ఒసాడ్చీ సంగతి వేరు. వాడి వయస్సు పదహారు. వాడికి తన గతం అంటే ఎంతో ప్రేమ. దాని గురించి గర్వం కూడా. నిజానికి తన గత జీవితంలో గుర్తుపెట్టుకో తగ్గది కాని, గర్వపడవలసినది కాని ఏమీ లేదు. అయినా తన గతం తనకే స్వంతం. అదీ వాడి అహం.

ఒసాడ్చీకి కులాసాగా బతకడమెలాగో తెలుసు. ఐతే వాడి సరదాల గురించి గొప్పగా చెప్పుకునేందుకేమీ లేదు. పట్టణం పక్కనే వున్న పిరోగోవ్కా గ్రామంలో ఉన్న భూస్వాములతో, వ్యాపారులతో తిరగటం వాడి వ్యాపకం. ఆ రోజుల్లో ఆ గ్రామం అందమైన పడుచులకు, దొంగసారాయికి ప్రసిద్ధి. ఇవే ఒసాడ్చీ సరదాలు కూడా. కాలనీలోని మరో కుర్రాడు గలటెంకో వీడికి ఆప్తమిత్రుడు. పిరోగోవ్కా గ్రామానికి వెళ్లవద్దని ఒసాడ్చీని ఆపే ప్రయత్నం చేయలేదు. కాని కాలనీ పనుల్లో మరింతగా పాలుపంచుకోవాలని అడిగేను. వీడు యూదు పిల్లల పాలిట యముడుగా తయారయ్యాడు. వాళ్ల నిస్సహాయత వీడికి ఒక వినోదంగా మారింది. పైగా వాళ్లని ఎంత హింసిస్తే అంతగా మిగిలిన పిల్లల దృష్టిలో తన ఖ్యాతి పెరుగుతుందని వాడికి నమ్మకం.

విషయం అంతా మా దృష్టికి వచ్చినా దానిని అరికట్టడానికి తగిన వ్యూహం గురించి కాలనీ పెద్దలం అదే పనిగా ఆలోచించాం. విషయం మాకు తెలిసినట్లు ప్రకటించి బెదిరింపులతో చిన్నపాటి దండనలతో దీన్ని అణచి వేసేందుకు ప్రయత్నిస్తే అది యూదు పిల్లలకు ప్రమాదంగా మారుతుందని మాకు తెలుసు. అందుకే ముందు కాలనీలో నాకు విశ్వాసపాత్రులైన కుర్రవాళ్లని పిలిపించాను. ఎలాగైనా యూదు పిల్లలను కాపాడమని అడిగేను. వాళ్లు నన్ను తిరిగి ప్రశ్నించారు. "ఎవర్నించి రక్షించాలి – మొత్తం కాలనీ నుంచా?" అనడిగారు. నేను సహనంతో సమాధానమిచ్చాను "నేనేమంటున్నానో మీకు తెలుసు".

"సరే కాపాడ్డమంటే ఏమిటండీ! యూదు పిల్లల్ని నాతో కట్టుకు తిరగలేను గదా. ఎప్పుడో ఒకప్పుడు వాళ్లు నేను లేకుండా దొరుకుతారు. మిగిలినవాళ్లు చితగ్గొట్టేస్తారు. నేనేం చేయగలను?" అమాయకంగా ప్రశ్నించాడు టారానెట్స్. మిత్యాగిన్ మాత్రం సూటిగా చెప్పాడు.

"ఈ విషయంలో నేనేం చేయలేను. నా మటుకు నేను వాళ్ల జోలికిపోను. మిగతా వారిసంగతి నాకు తెలీదు" అన్నాడు.

జడరోవ్ ఒక్కడే నాకు మద్దతిచ్చాడు. అయితే ఈ విషయంలో మిగిలిన వారందరితో తనొక్కడే తలపడలేనని నిస్సహాయత వ్యక్తం చేశాడు.

"ఏదో ఒకటి గట్టిగా చేయాలి. అదేమిటో నాకు తెలియదు. ఎందుకంటే నా ఎదురుగా వాళ్లెప్పుడు ఎవరినీ హింసించలేదు!" అన్నాడు జడరోవ్.

ఈలోగా పరిస్థితి చెయ్యి దాటిపోతోంది. రోజూ యూదు పిల్లలు దెబ్బలతో దర్శనమిస్తున్నారు. కొట్టినదెవరో బయటపెట్టరు. ఒసాడ్చీ ధిక్కారంగా మా అందరివైపు చూస్తూ నిర్భయంగా తిరుగుతున్నాడు.

లాభంలేదు. రంగంలోకి దిగాలని భావించాను. ఒసాడ్చీని నా గదికి పిలిపించాను. అయితే తానెప్పుడూ ఎవర్నీ కొట్టలేదని, బాధపెట్టలేదని వాడు అడ్డంగా అబద్ధమాడేశాడు. కాలనీ నుంచి బయటికి పంపేస్తానని బెదిరించాను.

"మీ ఇష్టం" అని పొగరుగా తల ఎగరేశాడు.

కాలనీ నుంచి ఒకరిని బహిష్కరించడమంటే అదెంత కష్టమైన పనో, అందుకు ఎన్ని ధరఖాస్తులు పెట్టాలో, ఎంత తతంగం నడపాలో వాడికీ తెలుసు. అదీగాక వాడిని ఒక్కడినే గెంటేస్తే సమస్య పరిష్కారం కాదు కూడా. కాలనీలో అత్యధికులు యూదు వ్యతిరేకతను ప్రదర్శిస్తున్నందున ఒసాడ్చీని బహిష్కరిస్తే వాళ్ల దృష్టిలో వీడు హీరో అయిపోతాడు. అంతెందుకు టారానెట్స్ కూడా తక్కువ వాడేంకాదు. రాత్రిళ్లు నిద్ర సమయంలో యూదు పిల్లల కాలి వేళ్ల మధ్య కాగితాలు పెట్టి అగ్గిపుల్లలు గీయడం, ఎవరినో ప్రోత్సహించి నిద్రపోతున్న పిల్లల జుట్టు కత్తిరించేలా చేయడం వాడి సరదాలు.

ఓ రోజు ఇవానోవిచ్ రక్తం కారుతున్న మొహాలతో వున్న ఇద్దరు పిల్లలను నా గదికి తీసుకొచ్చాడు.

"ఒసాడ్చీయేనా?" అనడిగేను.

భోజనాల గదిలో ఒసాడ్చీ యూదు పిల్లలతో తగువు పెట్టుకొన్నాడని షినిడర్‌ను మొహంపై కొట్టాడని ఆయన వివరించాడు. వెంటనే ఆస్ట్రోముఖోవ్ అనే మరో యూదు కుర్రవాడు ఉన్నట్టుండి ఒసాడ్చీ పైకి లంఘించాడట!

ఇది నిజంగా ఆశ్చర్యకరం. ఎందుకంటే ఆస్ట్రోముఖోవ్ యూదు పిల్లలందరిలోనూ భీరువు. ఒసాడ్చీ దీనిని సహించలేక గదిలోనే మా టీచర్ ఇవానోవిచ్ ఎదుటే ఆస్ట్రోముఖోవ్‌ను చితకబాదేడట.

ఆ యిద్దరు యూదు పిల్లలు రక్తమోడుతున్న మొహాలతో నా యెదుట నిశ్శబ్దంగా నిలబడివున్నారు. ఏడుపులు, మూలుగులు ఏవీలేవు. తమకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం వారిలో ఏమాత్రం లేదు. వారి కళ్లల్లో రేపటిపై విశ్వాసం లేదు. నా హృదయం ద్రవించిపోయింది. భోజనాల గదిలో అందరి ఎదుట ఓ పెద్ద కుర్రవాడు ఇద్దరు పిల్లలను గొడ్డులను బాదినట్టు బాదుతుంటే జడరోవ్‌తో సహా అందరూ మౌన ప్రేక్షకుల్లా మిగిలిపోయారన్న వాస్తవం నా రక్తాన్ని మరిగించింది. ఒక్కసారిగా నిస్పృహ ఆవరించింది. నేను ఒంటరివాణ్ణని తోచింది. కాలనీ ప్రారంభించిన తొలి దినాలలో నిజంగా నేను ఒంటరివాణ్ణే. ఆనాడు నాకెవరూ తోడులేరు. కేవలం నిబ్బరంతో నెగ్గుకొచ్చాను. ఈ యేడాదిన్నర కాలంలో కొందరు సహకరించడం వల్ల పనులు సాఫీగా సాగిపోయాయి. అందుకే నాలో ఆత్మస్థైర్యం సన్నగిల్లిందేమో కూడా. లాభం లేదు. క్షణాల్లో నిర్ణయానికొచ్చాను. అప్పటికే గదిలో కొందరు పిల్లలు మూగారు.

"ఒసాడ్చీని పిలవండి" ఆదేశించాను.

కానీ! వాడు వస్తాడనే నమ్మకం నాకు లేదు. అవసరమైతే రివాల్వర్‌తో బెదిరించైనా వాడిని యీడ్చుకురావాలని నిర్ణయించుకున్నాను. కానీ ఒసాడ్చీ దుమారంలా దూసుకొచ్చాడు. అడ్డొచ్చిన కుర్చీని తన్నుకుంటూ తన కోటును చేతిపైన వేసుకొని నిర్లక్ష్యంగా తల ఎగురవేస్తూ "ఎంటీ పిలిచారట?" అనడిగాడు.

రక్తాలు కారుతున్న ఇద్దరు పిల్లల్ని చూపించి "ఇది నీ పనేనా?" అనడిగాను.

"అందుకా? ఇద్దరు తుక్కు వెధవలు. ఇందుకా పిలిచింది? ఇంకా పెద్ద పనేదో ఉందనుకున్నాను."

ఆ క్షణంలో నాకేమైందో నేను వివరించలేను. విద్యాబోధనా పథకాల కోసం సంపాదించిన శిక్షణ, పొందిన అనుభవం ఏమయ్యాయో మరి! నా లోపల ఏదో పేలుడు సంభవించిందని పించింది. కట్టలు తెంచుకున్న ఆగ్రహంలో పక్కనవున్న కుర్చీని పెకెత్తి ఒసాడ్చీ వైపు దూసుకెళ్లాను. వాడు బిత్తరపోయ భయంతో గడగడలాడుతూ పారిపోబోయాడు. అయితే! చేతిలో ఉన్న కోటు కిందపడి అందులో కాళ్లు చిక్కుకుని తలుపుదగ్గరే తూలి పడ్డాడు.

హఠాత్తుగా స్పృహలోకి వచ్చాను. నా భుజం పట్టుకు ఆపుతున్న జడరోవ్ వంక చూశాను. తను ప్రశాంతంగా నవ్వుతున్నాడు.

"ఆ పంది వెధవ మీ దెబ్బలు తినేందుకు కూడా అర్హుడు కాదు" అని నన్ను శాంతపర్చబోయాడు.

యీలోగా ఒసాడ్చీ లేచాడు. వాడి బుగ్గలపై ఓ కన్నీటి చుక్క. నా వైపు నిశ్శబ్దంగా చూశాడు.

"నువ్వు నాలుగు రోజుల పాటు నిర్బంధంలో వుండాలి. అదీ కేవలం రొట్టె, నీళ్లతో మాత్రమే!" శిక్ష ఏమిటో ప్రకటించాను. నాలుగు రోజుల తర్వాత ఒసాడ్చీ నా దగ్గరకొచ్చి దిగులుగా అన్నాడు.

"నేను వెళ్లిపోతాను"

"సరే నీ ఇష్టం"

"అయితే నా పత్రాలు నా కివ్వండి"

"నీకివ్వాల్సిన పత్రాలేమీ లేవు"

"సరే, అయితే సెలవు"

"సెలవు"

14

తప్పిన పెనుప్రమాదం

ఆ తరువాత పిల్లలు కొన్నిరోజుల పాటు ఒసాడ్చీ ఎక్కడికి వెళ్లాడో నాకు తెలుసేమోనని పదే పదే ప్రశ్నించారు.

వాడు ఎక్కడికిపోయాడో నాకు తెలిదు. కానీ వాడిని గెంటేసిన ఉదంతం నన్ను బాగా కలతపరిచింది. పిల్లలపై చెయ్యి చేసుకోవడం ఒక టీచర్‌గా నేను చేయకూడని పని. నా సంస్కారం, నా శిక్షణ, నేను నమ్మిన సిద్ధాంతాలు అన్నీ గాలికి వదిలి అలా ప్రవర్తించినందుకు సిగ్గుపడ్డాను. ఆ స్థితిలో పిల్లలు వెళ్లిపోయిన ఒసాడ్చీ గురించి ప్రశ్నిస్తుంటే చిర్రెత్తుకొచ్చింది.

"ఆ సంగతి మీకెందుకు?" అని వారిని నిలదీశాను.

కరబనోవ్ నా వంక అదోమాదిరి చూశాడు. "ఒసాడ్చీ తిరిగివస్తే మీ మనసుకు కాస్త ఊరటగా ఉంటుందని...." అన్నాడు.

"ఆహాఁ! అలాగేం? నా మనశ్శాంతి గురించి బెంగగా ఉందేం తమరికి?!" అని ఈసడించుకున్నాను.

కరబనోవ్ నిశ్శబ్దంగా నిష్క్రమించాడు.

ఈలోపు కాలనీలో పిల్లల ప్రవర్తనలో ఎంతో మార్పు కనబడింది. ప్రతి వాళ్ళూ నన్ను సంతోష పెట్టడానికి ప్రయత్నిస్తున్నట్లు కనిపించింది. పిల్లలంతా ఉత్సాహంగా పనిపాటల్లో పాల్గొంటున్నారు. తగవులు జరుగుతున్న జాడే లేదు. ఎకతెరీనా ఓ రోజు నా దగ్గరకొచ్చింది. రోగిష్టిని ఊరడిస్తున్న ఒక నర్సులా ప్రవర్తించింది.

"అలా కుమిలిపోకండి సెమ్యోనోవిచ్. క్రమంగా మర్చిపోండి" అంది.

"నేనేం బాధపడ్డం లేదు. కాలనీ పరిస్థితేమిటి?" అని ప్రశ్నించాను.

"కాలనీకేం అద్భుతంగా వుంది. మన యూదు పిల్లలు నెమ్మదిగా కోలుకుంటున్నారు. కొంచెం బిడియంగా అయినా అన్ని పనుల్లో పాల్గొంటున్నారు. ఇక మిగిలిన వాళ్ల సంగతంటారా నేను చెప్పినా నమ్మరేమో! వాళ్లు యీ యూదు పిల్లల్ని ఎంతగా లాలిస్తున్నారో! మిత్యాగిన్ ఐతే మరీను. వాడొక రోజు ఓ పిల్లవాడికి ఏకంగా స్నానమే చేయించాడు. వాడి జుట్టు చక్కగా కత్తిరించాడు. అంతలా అందరూ కలిసిపోయారు."

అంతా బాగానే వుంది. కానీ నేను చేసిన పనేమిటి? ఒక టీచర్ చేయాల్సిన పనా? విద్యాబోధనకు సంబంధించి నాకున్న నైపుణ్యం ఏమయింది. అసలు విద్యాబోధన అనేది ఒక శాస్త్రమేనా అన్న అనుమానం కూడా కలిగింది. ఎందరో మహానుభావులు వందల ఏళ్లుగా శోధించి సాధించినదేమీ లేదనిపించింది. ఎన్ని సిద్ధాంతాలు, శాస్త్రాలు చివరికి ఒక పిల్లగూండాని దారికి తేడానికి ఉపయోగ పడలేదేం. అంతేనా లేక నేనే సరైన టీచర్‌ని కాదా? ఇటువంటి అనుమానాలు నన్ను తొలిచేస్తున్నాయి.

ఒసాడ్చీ ఏమైపోయాడన్న బెంగ నాకు లేదు. వాడొక పనికిరాని కుర్రకుంక అని నేను తేల్చుకున్నాను. అలాగే వాడంత నాటకీయంగా నిష్క్రమించడం సైతం నాకు చిరాకనిపించింది. అదీగాక వాడు వెళ్లినంత వేగంగానే కాలనీకి తిరిగి వచ్చేశాడు.

దీనివల్లే మరో పెద్ద ప్రమాదం విరుచుకుపడింది.

ఓ రాత్రి ఒసాడ్చీతో సహా గోర్కీ కాలనీ పిల్లలు పిరోగోవ్కా గ్రామ యువకులతో కొట్లాడారు. మావాళ్లు చాకులు ఉపయోగిస్తే అవతలివాళ్లు తుపాకులు యదేచ్ఛగా వాడారు. చివరకు మావాళ్లే గెలిచారు. గ్రామానికి చెందిన కుర్రవాళ్లు ప్రధాన వీధినుంచి పారిపోయి గ్రామ సోవియట్ కార్యాలయం భవనంలోకి దూరేరు. వాళ్లను తరుముతూ వెళ్లిన మా పిల్లలు ఆ ఆఫీసు కిటికీలు బద్దలుకొట్టి, తలుపులు విరగ్గొట్టి ఆ కుర్రవాళ్లని తరిమికొట్టారు ఈ వ్యవహారంతో గ్రామ సోవియట్ ఆఫీసు కూడా తల్లకిందులైంది. అక్కడి బల్లలు, కుర్చీలు సైతం ధ్వంసం అయ్యాయి. పేపర్లన్నీ చిందరవందరయ్యాయి. సిరాబుడ్లు బద్దలయ్యాయి. ఇదంతా నాకు తెలీనే తెలీదు. మా కుర్ర గూండాలంతా అందరూ ఏమీ తెలీని అమాయకుల్లా నిద్రలేచి పనిలోకి వెళ్లిపోయారు. ఆ మధ్యాహ్నం గ్రామ సోవియట్ అధ్యక్షుడు నా దగ్గరకొచ్చి జరిగింది ఏకరువు పెట్టాడు.

నేను నివ్వెరపోయాను. ఆయన నా దగ్గరకెందుకొచ్చాడో అర్థం కాలేదు. మిలీషియాకు ఫిర్యాదు చేసి మా గూండాలతో పాటు నన్ను కూడా జైల్లో పెట్టించవచ్చు. కానీ ఆయనకు కోపం కంటే

ఎక్కువ విచారం, ఆందోళన వున్నట్టు కనిపించింది. దాంతో పాటు కాలనీ కుర్రాళ్లతోనే విరిగిపోయిన తమ బల్లలు, కుర్చీలు, తలుపులు కిటికీలు బాగు చేయించుకోవాలనే ఆతురత కనబరిచేరు. చివరిగా కాలనీ తనకు కాసిన్ని సిరాబుడ్లు యివ్వగలదా అని వినయ పూర్వకంగా అడిగాడు.

సిరాబుడ్డి? ఆశ్చర్యంతో నోట మాట రాలేదు. గ్రామ సోవియట్ అధ్యక్షుడైవుండి వారి ఆఫీసునే ధ్వంసం చేసిన కుర్రవాళ్లని ఎందుకొదిలేస్తున్నారో నాకు అర్థం కాలేదు.

కానీ నేను అవకాశాన్ని వదలదల్చుకోలేదు. "అలాగే అలాగేనండి. పాడైపోయిన ప్రతి వస్తువునీ బాగు చేయిస్తాం. అలాగే సిరాబుడ్లు అడిగేరుగా తీసుకోండి" అంటూ ఆయన చేతిలో పెట్టాను.

"అన్నీ మేమే బాగుచేసి యిస్తాం. కిటికీ అద్దాలు మాత్రం పట్టణం నుంచి తెప్పించాలి. రేపు తెప్పిస్తాను. వెంటనే పని ప్రారంభిస్తా. సరేనా" అడిగాను.

"అలాగే," అన్నాడే గాని ఆయన అక్కడ్నుంచి కదల్లేదు.

"సరే వెళ్తాను. పోతే, చూడండీ... నిన్న మీ పిల్లలు... మా వాళ్ల దగ్గర్నుంచి. చిన్న పిల్లలు కదా... వాటిని తీసుకొచ్చారట" అంటూ నాకు అర్థం కాని విషయం ఏదో ప్రారంభించాడు.

"వేటిని?"

"అవే తుపాకులు"

"ఏ తుపాకులు?"

"అదే పిల్లలు కదా మీకు తెలీనిదేముంది. మావాళ్లు ఏదో సరదాగా నాలుగు తుపాకులు పట్టుకు తిరుగుతున్నారు. నిషాలో కూడా ఉన్నారేమో కొంచెం హడావుడి జరిగింది."

"నిషాలో వున్నదెవరు?"

"నేనక్కడలేనుగా నాకు తెలీదండీ. మా వాళ్లనడం కాలనీ కుర్రాళ్లే... "కొంచం.." అంటూ నీళ్లు నమిలాడు.

"ఇంతకీ ఏమంటారు?" అని ప్రశ్నించాను.

"ఏముందండీ పిల్లలు గదా పైగా పెద్ద ప్రమాదం కూడా జరగలేదు. అందుచేత ఏదో సర్దుకుపోదాం" అన్నాడాయన.

పెద్దభారం తొలిగినట్లే అయింది. గదిలోంచి బయటకు వచ్చి రాత్రి పిరోగోవ్కా గ్రామానికి వెళ్లిన వాళ్లంతా నా దగ్గరకు రావాలని ఆదేశించాను. ఒసాడ్చీ వాడి వెనక ఇంకొందరు పిల్లలు నా ఎదుటికి వచ్చారు. ఒసాడ్చీ ముఖంలో ఎటువంటి బెదురు, ఆందోళన కనిపించలేద. ప్రశాంతంగా వున్నాడు. బయటి వారి ముందు పాత గొడవలు తవ్వడం ఎందుకని భావించి తీక్షణంగా అడిగాను.

"నిన్న రాత్రి మీరు పిరోగోవ్కా గ్రామానికి వెళ్ళారు. తెగతిరిగారు. అల్లరి చేశారు. ఆపడానికి ప్రయత్నించి అక్కడి కుర్రవాళ్లని కొట్టారు. గ్రామసోవియట్ ఆఫీసుని ధ్వంసంచేశారు నిజమేనా?"

"పూర్తిగా నిజం కాదండి" అంటూ ఒసాడ్చీ ముందుకొచ్చాడు.

"మేము పిరోగోవ్కా వెళ్లడం నిజం. అందరం తాగడం మాత్రం అబద్ధం. అయితే మనవాడు సరోకా మాత్రం గ్రామంలోని ఇంకో కుర్రాడితో కలిసి తాగినమాట నిజం. అలాగే మన గోలోస్ కూడా కొంచెం తాగాడు. మిగిలినవాళ్లం ఎవ్వరం చుక్క కూడా ముట్టుకోలేదు. మా అంతట మేం ఎవ్వరితోనూ గొడవ పెట్టుకోలేదు. మేం వస్తుంటే ఆ వూరి కుర్రాడొకడు నా పైకి తుపాకీ గురిపెట్టి చేతులెత్తమని ఆదేశించాడు. లాగిపెట్టి కొట్టాను. దాంతో గొడవ మొదలైంది. ఊరికుర్రాళ్లిద్దరు మా పైకి తుపాకులు పేల్చారు. దాంతో మేం వాటిని లాక్కొని వారిని తరిమి కొట్టాం."

"సరే ఆ తుపాకులేవి"

వాళ్లు రెండు తుపాకులు తెచ్చి నా ముందు పెట్టారు. గ్రామ సోవియట్ అధ్యక్షుడు వాటివంక చూస్తూ నేను వాటిని తీసుకోవచ్చా అనడిగాడు.

"లేదు కుదరదు. మీ కుర్రాళ్లకైనా తుపాకులతో తిరిగే హక్కు లేదు" అన్నాను.

"సరే అలాగే కానివ్వండి. నాకు మాత్రం దేనికి? మీ దగ్గరుంటే అడవుల్లో కెళ్లినప్పుడు, దొంగల్ని భయపెట్టడానికి ఉపయోగపడతాయి"

"అంటే దీని గురించి నేను ఫిర్యాదేమీ చేయక్కర్లేదా?"

"అబ్బే దేనికండీ ఏదో పిల్లలు పోనివ్వండి" అంటూ నా వంక చూసి నవ్వాడాయన. నేనూ పెద్దగా నవ్వి "అవున్లెండి ఇది పిల్లల తగవు. అదీగాక మనం ఇరుగు పొరుగు కూడా" అన్నాను. దానికాయన ఆశ్చర్యంతో కూడిన ఆనందం వ్యక్తంచేస్తూ నా దగ్గర శెలవు తీసుకొన్నాడు.

నేను హాయిగా వూపిరి పీల్చుకున్నాను. పిల్లలు కూడా పెద్ద రగడ జరగనందుకు సంతోషించారు. ఈసారి నేను ఎవరినీ శిక్షించదలచలేదు. నా అనుమతి లేకుండా మళ్లీ గ్రామంలోకి వెళ్లబోమని పిల్లల నుంచి వాగ్దానం తీసుకున్నాను. అలాగే గ్రామంలో కుర్రవాళ్లతో స్నేహం కలుపుకోమని సలహా చెప్పాను.

15
రైసాతో ఉపద్రవం

ఆ ఏడాది శీతాకాలం నాటికి కాలనీలో ఆడపిల్లల సంఖ్య ఆరుకి చేరింది. వీళ్లలో ఓల్యా ఒరనోవా చక్కటి అందమైన యవతిగా రూపుదిద్దుకుంటోంది. కుర్రవాళ్లు ఆమెవంక ఎటువంటి దురుద్దేశం లేకపోయినాఆసక్తితో చూడ్డం మొదలైంది. ఓల్యా వాళ్లతో సజావుగానే మెలిగినా బరున్ తప్ప మరెవర్నీ అంతగా దగ్గరకు రానివ్వలేదు. బరున్ కూడా ఆమెతో ఒక మంచి స్నేహితుడిగా వ్యవహరించేవాడు.

నాస్త్యానొచావ్నాయ, మరో అమ్మాయి. ఆమె చరిత్ర చాలా పెద్దది. దొంగతనాలు చేసేదని, దొంగిలించిన వస్తువులు దాచేదని, దొంగల ముఠాలకు ఆశ్రయమిచ్చేదని ఆమె గతాన్ని బట్టి తెలుస్తుంది. అయితే కాలనీలో మాత్రం ఆమెనంతా అబ్బురంగా చూసేవారు. పదిహేనేళ్లు కూడా లేని ఆ పిల్ల మంచిరంగులో మెరిసిపోతూ ఠీవిగా తల ఎత్తుకొని నడిచేది. ఆడపిల్లలెవరైనా ఏ తప్పయినా చేస్తే వారిని చిన్న స్వరంతో కఠినంగా మందలించేది. ఎప్పటికైనా పట్టణంలోని హైస్కూలులో చదవాలని ఆమె ఆశయం. తనతో పాటు ఖరబనోవ్, వెర్షనోవ్, జదరోవ్, వెట్కోవ్స్కీలు కూడా పట్టణంలో స్కూలు కోసం కష్టపడి చదువుతున్నారు. అయితే వీళ్లందరికీ లెక్కలు, సాంఘిక శాస్త్రాలు మాత్రం కొరుకుడుపడటం లేదు. మరోపిల్ల రైసాసొకొలోవా మాత్రం చదువులో అందరికంటే మెరుగ్గా ఉండేది. మా మహిళా టీచర్లకు యీ పిల్లపైనే ఆశలు. ఎలాగైనా రైసాను పెద్ద స్కూలుకు పంపాలని వాళ్ల తాపత్రయం. ఐతే ఎంత తెలివైనదైనా ఆ పిల్లకు చదువంటే లక్ష్యం లేదు. ఐనా ఆమెను పై స్కూలుకు పంపేందుకు మా ముగ్గురు మహిళా టీచర్లు చేసే ప్రయత్నాలు చూసి జదరోవ్, వెర్షనోవ్, కరబనోవ్ గొణుక్కునేవారు. వీళ్లలో వెర్షనోవ్‌కి చదువంటే పిచ్చి. రాత్రింబవళ్లు చదివేందుకే ప్రయత్నించేవాడు.

"రైసా ఎప్పటికీ చదవలేదు. ఏదో ఒకనాటికి ఆమె వెళ్లేది జైలుకే" అన్నాడు వెర్షనేవ్ నాతో ఒకసారి.

చెప్పకపోవడమేం నా ఉద్దేశం కూడా అదే. ఇప్పటికీ రైసాకు బయటినుంచి రహస్య వర్తమానాలు వస్తూ వుంటాయి. తరుచు ఆమె కాలనీ నుంచి బయటకి వెళ్లేది. అక్కడ కొర్నెయెవ్ అనే కుర్రవాణ్ణి కలుసుకునేదని మాకు తెలుసు. కొర్నెయెవ్ ముందు యేడాది కాలనీలో మూడు వారాలు ఉన్నాడు. ఆ కాస్త వ్యవధిలోనే వాడు కాలనీని దోచుకునేందుకు ప్రయత్నించాడు. ఆ తర్వాత బయట ఒక దోపిడీకి పాల్పడ్డాడు కదా.

మొత్తానికి రైసా పట్టణంలో హైస్కూలు ప్రవేశ పరీక్ష ఉత్తీర్ణురాలైంది. కీవ్ నగరంలో చేరేందుకు పోయింది. వారం తిరక్కుండానే కొర్నెయెవ్ కూడా ఆ నగరానికి వెళ్లినట్టు సమాచారం అందింది.

శీతాకాలం గడిచిపోయింది. నెలనెలా స్కూలులో ఉపకారవేతనం అందుతున్నా తరచు ఏదో కారణంతో డబ్బు పంపమని ఉత్తరాలు రాసేది. జనవరిలో ఊహించని విధంగా రైసా కాలనీకి వచ్చింది. తమకు శెలవులని చెప్పింది. అయితే స్కూలుకు నిజంగానే శెలవులు ఇచ్చారా అన్నది ధృవపడలేదు. ఈలోగా కీవ్ నగరంలో స్కూలు నుంచి ఉత్తరం రానే వచ్చింది. ఆమె ఏనాడో స్కూలు మానేసిందట. అదీ సంగతి.

ఈ విషయాన్ని మిగిలిన పిల్లలు పెద్దగా పట్టించుకోలేదు. ఎవరూ రైసాను వేళాకోళం చేయలేదు. రైసా ఇలా తిరిగిరావటం మా టీచర్ ఎకతెరీనాను మాత్రం బాగా నిరాశపర్చింది. రోజులు గడుస్తున్నాయి. మార్చిలో ఒకరోజు నటాల్య టీచర్ నా దగ్గరకొచ్చింది. రైసా గర్భవతి అనే అనుమానం కలుగుతోందని చెప్పింది ఒక్కసారి నా రక్తం చల్లబడింది.

మా కాలనీలో ఒక బాలిక గర్భవతి కావడం? ఇది బయటికి తెలిస్తే అందరూ ఎలాంటి సూటిపోటి మాటలంటారో ఊహించడమే భయం కలిగించింది. అవకాశం కోసం ఎదురు చూస్తున్న విద్యాశాఖ అధికార్లు నన్ను ఎలాంటి మాటలు అంటారో ఊహించడం కష్టం కాదు. బాల నేరస్థుల కాలనీలో బాలికలు కూడా వుండటం, అందులో ఒక బాలిక గర్భవతి కావడం చిన్న సంగతి కాదు. నటాల్యాను పిలిచి ఎలాగైనా రైసాతో మాట్లాడి విషయం తెలుసుకోమన్నాను.

అయితే రైసా తను గర్భవతిని కానని బండగా వాదించింది. పైగా అనుమానంతో తనను అవమానించారని రుసరుసలాడింది.

రైసా బొద్దుగా ఉంటుంది. కొంచెం కొవ్వు పట్టడం వల్ల మాకు ఆ అనుమానం కలిగిందేమోనని సమాధానపడ్డాం. నటాల్యా మాత్రం తప్పు చేసినట్టు బాధపడింది.

కానీ వారం తరువాత ఒకరోజు జదరోవ్ నన్ను పక్కకి పిలిచి, "రైసా గర్భవతి అని మీకు తెలుసా?" అని అడిగాడు.

"నీకెలా తెలుసు?"

"భలేవారండీ. ఆ మాత్రం తెలియదా? అందరికీ తెలుసు" అన్నాడు.

క్రమంగా మా టీచర్లలో ఆందోళన పెరుగుతోంది. నేను వారిని సముదాయించాను. "ఎందుకు కంగారుపడతారు. గర్భవతి అన్న సంగతిని దాచగలదేమో కానీ, రేపు పురుడు వచ్చాక రహస్యం ఏముంటుంది? కానివ్వండి" అన్నాను.

తరువాత రైసాను పిలిచి నెమ్మదిగా అడిగితే కన్నీళ్లు పెట్టుకుంది. ప్రతివారూ తనను అనుమానిస్తున్నారని ఏడుపు ప్రారంభించింది.

"చూడు రైసా అబద్ధం దేనికి. విషయం చెప్పు. నిజమైతే మేమంతా సాయం చేస్తాం. నీకు

ఏదైనా తేలిక పని అప్పచెబుతాం. పిల్లవాడు పుడితే వాడికి దుస్తులూ అవీ అమర్చుకోవాలి. కావాలంటే డబ్బుకూడా తీసుకో" అని అనునయించాను.

కాలనీలో టీచర్లమంతా ఈ విషయం గురించి చర్చించాం. రైసాను డాక్టర్‌కు చూపిద్దామనే ప్రతిపాదన వచ్చింది. కానీ కొందరు ఆ పని వద్దన్నారు. పరీక్ష చేయిస్తే రైసా బాగా నొచ్చుకుంటుందని ఇవాళ కాకపోతే రెండు నెలల తరువాతైనా గర్భం సంగతి స్పష్టంకాకపోదని కొందరు అభిప్రాయ పడ్డారు. ఆలోగా రైసా కూడా విషయాన్ని అర్థం చేసుకుని సాయం కోరవచ్చని వాళ్ల ఉద్దేశం. దాంతో ఇక ఊరుకున్నాం.

ఏప్రిల్ 15న పట్టణంలో జిల్లాలోని టీచర్ల మహాసభ జరిగింది. ప్రారంభ సమావేశంలో నేను పిల్లల క్రమశిక్షణ గురించి ప్రసంగించాను. నా ఉపన్యాసంలో చేసిన కొన్ని ప్రతిపాదనలు, సూత్రీకరణలపై టీచర్లకు, విద్యాశాఖ అధికారులకు అమిత ఆసక్తి కలిగింది. వాటిపై సుదీర్ఘ చర్చ ప్రారంభించారు. చర్చ మర్నాటికి వాయిదా పడింది. ఆ రోజు మీటింగ్ హాల్ జనంతో నిండిపోయింది. అప్పటికే మా కాలనీ పేరు ప్రఖ్యాతులు జిల్లా పరిధులు దాటాయి. అందరూ మా గురించి ఆసక్తిగా మాట్లాడుకొంటున్నారు. ప్రధాన చర్చనీయాంశం కో ఎడ్యుకేషన్. బాల బాలికలను ఇటువంటి యువ నేరస్థుల కేంద్రాల్లో కలిపి ఉంచడంపై ఆ రోజుల్లో నిషేధం ఉండేది. దేశం మొత్తం మీదా మా ఒక్క కాలనీలోనే బాల బాలికలు కలిసి ఉన్నారు. దీనిపై సభలో ప్రతినిధులు అనేక సందేహాలు లేవనెత్తారు. వాటికి సమాధానం చెబుతున్నంత సేపూ రైసా సంగతి నాకు గుర్తు వచ్చింది. అయినా ధీమాగా సమాధానాలు ఇచ్చాను. బాల బాలికలు కలిసి ఒక కాలనీలో ఉంటే ప్రమాదం లేదని హామీ ఇచ్చాను. మా కాలనీలో పరిస్థితి బానే ఉందని ప్రకటించాను.

మధ్యాహ్నం భోజన విరామ సమయంలో బ్రాచెంకో హడావుడిగా నా వద్దకు వచ్చి చాటుకి తీసుకెళ్లాడు. "కాలనీలో పరిస్థితి బాగోలేదు సెమ్యోనోవిచ్. బాలికల డార్మెటరీలో ఒక పసిబిడ్డ శవం కనిపించింది" అని చెప్పాడు.

"శవమా?" దిగ్భ్రాంతితో ప్రశ్నించాను.

"అవునండీ. రైసా కట్టుకునే రుమాలులో చుట్టి ఉంది. మన లెంకా డార్మెటరీ కడుగుతుంటే బయటపడింది" అని వివరించాడు.

అప్పటి నా మానసిక పరిస్థితి ఎలా ఉందో వివరించలేను. జీవితంలో అంత భయం నాకు ఎన్నడూ కలగలేదు. సంగతి తెలిసిన మహిళా టీచర్ల మొహాలు పాలిపోయాయి. వాళ్లు ఎలాగో మీటింగ్ హాలు నుంచి బయటపడి బండిలో కాలనీకి తిరిగివెళ్లారు. మీటింగ్‌లో ఉన్న నేను కదిలే పరిస్థితి లేదు.

"ఆ బిడ్డ ఎక్కడుంది ఇప్పుడు?" బ్రాచెంకోను అడిగాను.

"ఇవాన్ ఇవానోవిచ్ దానిని డార్మెటరీలో ఉంచి తాళం పెట్టాడు"

"రైసా ఎక్కడుంది?"

"ఆమె మీ ఆఫీసు గదిలో కూర్చుని ఉంది. మనవాళ్లు కాపలా కాస్తున్నారు."

జరిగిన విషయం వివరంగా ఒక రిపోర్టు రాసి దానిని బ్రాచెంకోకు ఇచ్చి పోలీసుల వద్దకు పంపాను. క్రమశిక్షణపై చర్చను కొనసాగించేందుకు నేను అక్కడే ఉండిపోయాను. సాయంత్రానికి కాలనీకి తిరిగివచ్చాను.

రైసా నా గదిలో తలవంచుకుని కూర్చొని ఉంది. వెనక మరో బెంచీపై వెర్షనోవ్ కూర్చుని దీక్షగా ఏదో పుస్తకాలు తిరగేస్తున్నాడు. నేను డార్మెటరీ తెరిపించి బిడ్డ మృతదేహాన్ని మరో గదిలోకి మార్పించాను. ఆ రాత్రి రైసాను అనునయంగా అడిగాను. ఎందుకిలా చేశావని.

తను సమాధానంగా ఏడుపు ప్రారంభించింది. ఆమెను అలానే నా గదిలో, వెర్షనోవ్ కాపలాలో వదిలి వచ్చేశాను.

మర్నాటి ఉదయం దర్యాప్తు అధికారి ఒకరు కాలనీకి వచ్చాడు. కానీ ఆయన దర్యాప్తు త్వరగానే ముగిసింది. రైసా ఆ ముందు రాత్రి జరిగినదంతా సూటిగా వివరించింది. ఆమె కథనం ప్రకారం ఆ రాత్రే ఆమెకు పురుడు వచ్చింది. అదే గదిలో ఐదుగురు అమ్మాయిలున్నా ఎవ్వరూ నిద్రలేవలేదు. కారణం తను మూలగకుండా ఉండేందుకు విశ్వయత్నం చేసిందట. బిడ్డ పుట్టినతరువాత తన శాలువతో ఉరి బిగించి చంపేసింది. అయితే పథకం ప్రకారం తాను హత్య చేయలేదని, బిడ్డ ఏడుస్తుంటే భయమేసి శాలువాతో గట్టిగా నొక్కానని చెప్పింది.

బిడ్డ చనిపోయిన తరువాత ఆమె దాన్ని ఒక రుమాల్లో చుట్టి దాచింది. తరువాత వీలైనప్పుడు ఎవరూ చూడకుండా అడవిలో పారేస్తే ఏ నక్కలో తినేస్తాయని, విషయం ఎవరికీ తెలీదని ఆమె అనుకుందట. కానీ అనుకోకుండా శవం బయటపడింది. దర్యాప్తు అధికారి ఆమెను ప్రశ్నించిన తరువాత తనతో పాటు తీసుకువెళ్ళాడు. బిడ్డ శవాన్ని పరీక్ష కోసం ఆసుపత్రికి పంపమని మమ్మల్ని ఆదేశించాడు.

ఈ ఉదంతం మా టీచర్లను మానసికంగా గట్టి దెబ్బే తీసింది. ఇక కాలనీ పని ఐపోయిందని వాళ్ళు భావించారు. మగపిల్లలు మాత్రం ఈ సంఘటనతో కొంత కలత చెందితే ఆడపిల్లలు భయంతో వొణికిపోయారు. వాళ్ళు కుర్రవాళ్ల తోడు లేకుండా డార్మెటరీలోకి వెళ్లేందుకే సాహసించలేదు. జదరోవ్, కరబనోవ్‌లు అనేకరాత్రులు ఆ పిల్లలకు ధైర్యం చెబుతూ కాపలా కాశారు. మిగిలిన కుర్రాళ్ళు మాత్రం అమ్మాయిలను భయపెట్టడం మొదలుపెట్టారు.

రైసా ఎందుకలా హత్య చేసింది అనే విషయంపై చాలారోజులుపాటు వాదోపవాదాలు సాగాయి. మూడోరోజు కరబనోవ్ బిడ్డ మృతదేహాన్ని తీసుకొని ఆసుపత్రి కెళ్ళాడు. ఎంతో హుషారుగా తిరిగి వచ్చాడు. తాను చూసింది వివరించాడు. “అబ్బా ఎంత భయంకరం, అక్కడ ఆసుపత్రిలో యిరవై ముప్పై గాజు జాడీలలో వికృతంగా వున్న పసిబిడ్డల శవాలు. కొన్ని అద్ద తలకాయలు, ఇంకొన్ని డొప్ప చెవులు. ఒక బిడ్డకైతే ఏకంగా నాలుగు కాళ్లు వున్నాయి. అది మనిషో కప్పో కూడా చెప్పడం కష్టం. వాటన్నిట్లోకి మన బిడ్డ శవమే అందంగా వుంది”.

ఈ మాటలు విన్న మా టీచర్ ఎకతెరీనా విసుగ్గా నొసలు చిట్లించింది “ఏం మాటలవి. బుద్ధి లేదూ” అని వాడ్ని మందలించింది.

మూడు నెలల తర్వాత రైసా కేసు విచారణకొచ్చింది. మా కాలనీ టీచర్లందర్నీ సాక్షులుగా పిలిచారు. విచారణ సమయంలో పిల్లలకు అనువైన వాతావరణం సృష్టించి సరైన దృక్పథం అలవర్చడంలో విఫలమైనందుకు న్యాయమూర్తి మా టీచర్లను గట్టిగా మందలించారు. తర్వాత ఆయన నన్ను తన వద్దకు పిలిపించుకున్నాడు. రైసాను మళ్లీ కాలనీలోకి తీసుకుంటారా అని నన్ను ప్రశ్నించాడు. నేనందుకు సిద్ధంగానే వున్నాను. కోర్టు రైసాకు ప్రొబేషన్‌పై ఎనిమిది సంవత్సరాల శిక్ష విధించింది. ఆమె బాధ్యతలు మళ్లీ మాకే అప్పజెప్పారు.

కాలనీకి తిరిగొచ్చిన రైసా అసలేం జరగనట్టుగా వ్యవహరించింది. ఉన్న మంచి దుస్తులు

ధరించి గ్రామంలో నృత్యోత్సవాలకు, పార్టీలకు వెళ్లేది. కాలనీలో మిగిలిన అమ్మాయిలకు రైసా అంటే విముఖత పెరుగుతోందని గ్రహించి ఆమెకు దగ్గరలో వున్న నూలు మిల్లులో ఉద్యోగం ఇప్పించాను. అప్పుడప్పుడు పట్టణంలో ఆమె తారసపడేది. తర్వాత ఐదారేళ్లకు పందొమ్మిది వందల యిరవై ఎనిమిదిలో ఆమెను ఒక హోటల్ కౌంటర్ వెనక చూశాను. మరింత బొద్దుగా తయారైంది.

"ఎలా వున్నావ్" అని అడిగాను.

"బానే వున్నాను. ఇక్కడ పనిచేస్తున్నాను. ఇద్దరు పిల్లలు ఒక మంచి మొగుడూను"

"కోర్నెయేవేనా?"

సమాధానంగా నవ్వి అడ్డంగా తలూపింది.

"ఆ కథ ఎప్పుడో అయిపోయింది. అతడ్ని చాలా కాలం క్రితమే కొట్లాటలో కొట్టి చంపేశారు. అయితే సెమ్యోనోవిచ్‌గారు–"

"ఏమిటి?"

"నేను పూర్తిగా మునిగిపోకుండా కాపాడినందుకు కృతజ్ఞతలు."

16

జబ్బు చేసినా మా వాళ్లు హీరోలే

వసంతకాలంలో ఉన్నట్లుండి కమ్ముకొన్న మచ్చల టైఫస్ జ్వరం కాలనీని కుదిపి వేసింది. సాధారణంగా మా పిల్లలెవరూ చిన్న చిన్నజ్వరాలకి, జబ్బులకి భయపడే రకం కాదు. ఎకతెరీనా పిల్లలకు అవసరమైన్పుడు ఏదన్నా వైద్యం చేయబోయినా పిల్లలు మొండిగా తిరస్కరించేవారు. ఇప్పుడు కూడా టైఫస్ జ్వరానికి ఎటువంటి మందూ తీసుకొనేందుకు సిద్ధపడలేదు. వారిని బలవంతంగా బండిలో ఆసుపత్రికి తరలించవలసి వచ్చింది. అప్పటికే పరిసర గ్రామాల్లో వ్యాధి వ్యాపించినందున అక్కడ రోగులసంఖ్య అమితంగా ఉంది. మా పిల్లలను తీసుకెళ్లి వారికి వెంటనే చికిత్స చేయమని ఎంత వేడుకొన్నా పట్టించుకోడానికి అక్కడ సిబ్బంది లేకపోయింది. దానితో ఒక నర్సును పట్టుకొని, "మా పిల్లలకు ప్రాధాన్యం ఇచ్చి చికిత్స చేస్తే అడిగినంత గోధుమ పిండి ఇస్తాన"ని చెప్పి చూశాను.

లంచం ఇవ్వజూపినందుకు ఆమె మొదట కోపగించుకున్నా మొత్తానికి మా వాళ్లందరినీ తన వార్డులోనే చేర్చుకొని మందులు ఇప్పించింది. ఒకరి తర్వాత ఒకరుగా మొత్తం తొమ్మిది మంది కుర్రవాళ్లు అలా ఆసుపత్రిలో చేరి చివరికి క్షేమంగా బయటపడ్డారు.

కానీ, యీ క్రమంలో నేను పడిన ఆందోళన అంతా యింతా కాదు. మా టీచర్ ఎకతెరీనా కూడా పిల్లలకు ఏ ప్రమాదం జరుగుతుందేమోనని హడలిపోయింది. ఐతే ఆ వారం పదిరోజుల్లో పిల్లలు చూపిన నిబ్బరం, వారిలో కనిపించిన మనోస్థైర్యం చూసి నేను అబ్బురపడ్డాను. వచ్చినది అంటువ్యాధి అని తెలిసినా జబ్బుపడిన తమ మిత్రులను ఒంటరిగా వదిలి వెళ్లేందుకు మిగిలిన పిల్లలు సిద్ధపడలేదు. మంచాన పడిన స్నేహితులకు వినోదం కలిగించేందుకు, వారిని సంతోషంగా వుంచేందుకు పిల్లలు చేయని యత్నం లేదు. తనకు వచ్చిన జబ్బుపై కూడా వుల్లాసంగా చతురోక్తులు చెప్పగల బెలూఖిన్ ఆ రోజుల్లో కూడా ఏమాత్రం అధైర్యపడకుండా తాను నవ్వుతూ అందర్నీ నవ్విస్తూ కులాసాగా గడిపేయగలగడం విశేషం. మొత్తానికి పిల్లలంతా ఆరోగ్యంగానే కాలనీకి చేరారు. వాగ్దానం చేసినట్లే మా బ్రాచెంకో తన బండిపై ఒక బస్తా గోధుమపిండిని ఆ నర్సు ఇంటికి తీసుకెళ్లి ఇచ్చాడు.

17
తోక ముడిచిన షరీన్

రైసా ఉదంతం, టైఫస్ వ్యాధితో పాటు ఆ శీతాకాలంలో పాదాలను గడ్డ కట్టించిన చలి వంటి అనేక సమస్యల్ని క్రమంగా మర్చిపోతున్నాం. ఐతే ఈలోగా విద్యాశాఖ అధికార్లనుంచి నాపై కొత్త యుద్ధం మొదలైంది. క్రమశిక్షణ పేరిట పిల్లలను కఠినంగా దండిస్తున్నానని, ఆ పద్ధతికి స్వస్తి చెప్పాలని నాకు హెచ్చరికలు అందసాగినయ్. మనం సామాజిక విద్యా వ్యవస్థను సృష్టించుకోవాలే తప్ప విద్య పేరిట పిల్లలకు కొత్త జైళ్లను తయారుచేయకూడదని నాకు హెచ్చరికలందాయి. గతంలో టీచర్ల మహాసభలో పిల్లల క్రమశిక్షణపై ప్రసంగించినప్పుడు పిల్లలను ఏ విధంగానూ దండించరాదన్న నాటి సరికొత్త నినాదం ఔచిత్యంపై అనుమానాలు ప్రకటించాను. పిల్లల్ని ఏ రకంగానూ భయపెట్ట కూడదని, వారి సృజనశీలతకు పూర్తి అవకాశం ఇవ్వాలని అప్పట్లో విద్యా బోధనా నిపుణులు వాదించేవారు. పిల్లలు వారంతట వారుగా క్రమశిక్షణతో మెలిగేలా చూడాలే తప్ప దండన, భయంతో క్రమశిక్షణను నేర్పలేమన్నది వారి అభిప్రాయం. ఐతే సమిష్టి భావన రూపుదిద్దుకోనిదే, సమిష్టి జీవనానికి సంబంధించిన ఉపాంగాలు ఏర్పడకుండానే పిల్లలతో ఈ విధంగా వ్యవహరించలేం అని నా అభిప్రాయం. శ్రమ, సాంస్కృతిక పరమైన విషయాలకు సంబంధించి ప్రాథమిక సూత్రాలు కూడా తెలియని విద్యార్థులను ఒకదారికి తేవాలంటే ఉపాధ్యాయుడు వారిపై ఏదో ఒక విధమైన ఒత్తిడి తేకతప్పదని నా ఉద్దేశం. కేవలం పిల్లల ఆసక్తులు, అభిరుచులను బట్టే వారికి చదువు చెప్పడం పూర్తిగా సాధ్యం కాదని నేను వాదించాను. సమిష్టి ప్రయోజనాలకు అనుగుణంగా అందుకు ఇష్టపడకున్నా పిల్లలు సిద్ధపడాలని దీన్ని సాధించేందుకు అవసరమైతే కఠిన నియమావళి అమలు చేయాల్సిందేనని నేను చెప్పాను. ఐతే నన్ను తోటి టీచర్లు కాని, విద్యాశాఖ పెద్దలు కాని సరిగా అర్థం చేసుకోలేదు. అందుకే యీ బెదిరింపులు, హెచ్చరికలూను.

ఏమయితేనేం మహా అయితే నన్ను పదవి నుంచి తొలగిస్తారు. అంతేకదా అనుకున్నాను. అందుకే తక్షణ సమస్యలపై దృష్టి సారించాను. పొలాల్లో విత్తులు నాటడం, కొత్త కాలనీలో అవిశ్రాంతంగా సాగుతున్న మరమ్మతులతో నాకు విద్యాశాఖ విమర్శలను పట్టించుకునే తీరిక కూడా లేకపోయింది.

అసలు విద్యాశాఖ కార్యాలయానికి వెళ్లడమే మానుకున్నాను. ఎందుకంటే అక్కడకు వెళ్లినప్పుడల్లా అధికార్లు నాతో వ్యవహరిస్తున్న తీరు, మాట్లాడే పద్ధతి నాకు విసుగు కలిగించాయి. శతృభావం కాకున్నా వారి తిరస్కార వైఖరి నాకు చికాకు కలిగించేది. యీ అధికారుల్లో షరీన్ అనే యువ ఆఫీసర్ ఒకరు. విప్లవానంతరం విద్యాశాఖలో చేరిన యీ పెద్దమనిషి ప్రపంచంలో అన్ని సంగతులు తనకు తెలుసనుకుంటాడు. విద్యాబోధనకు సంబంధించిన సరికొత్త సిద్ధాంతాలను వల్లించే ఈ అధికారికి కొన్ని సొగసైన పడికట్టు పదాలు కూడా తెలుసు.

ఒకరోజు నా కాలనీకి వచ్చి నా టేబుల్ మీదనున్న బారోమీటర్ చూసి అది దేనికి అనడిగాడు. అది ఉష్ణోగ్రతను కొలిచే సాధనమని దానిని బట్టి వాతావరణంపై ఒక అంచనాకు రావచ్చని చెప్పాను. దానికాయన మొహం చిట్లించి "అది సరే అది ఇక్కడ ఈ గదిలో ఎందుకుంది? వాతావరణ ఉష్ణోగ్రత ఉండేది ఆరుబయట కదా!" అని తన జ్ఞానాన్ని ప్రదర్శించాడు. నేను నా నవ్వును ఆపుకోలేకపోయాను. విరగబడి నవ్వాను.

దీంతో ఆయన రెచ్చిపోయాడు. "ఎందుకా నవ్వు? పైగా మీరొక టీచర్‌నని చెప్పుకుంటారు. ఇలాగే పిల్లలతో కూడా వ్యవహరిస్తారా? నాకర్థం కాకపోతే వివరించాలే తప్ప నవ్వకూడదు" అని ధుమధుమలాడాడు.

నాకు మాత్రం నవ్వాగలేదు. విద్యాశాఖకు చెందిన ఒక ఇన్‌స్పెక్టర్ పరిజ్ఞానం ఈ స్థాయిలో వుండటం నన్ను కడుపుబ్బ నవ్వించింది.

ఆయన విసురుగా వెళ్లిపోయాడు.

ఆ తర్వాత జరిగిన టీచర్ల మహాసభలో క్రమశిక్షణ గురించి నేను మాట్లాడిన తర్వాత జరిగిన చర్చలో షరీన్ కూడా పాల్గొన్నాడు. నన్ను, నా అభిప్రాయాలను ఘాటుగా విమర్శిస్తూ సంక్లిష్టమైన పదజాలంతో రెండు గంటలసేపు అనర్గళంగా ప్రసంగించాడు.

ఆ షరీనే ఇప్పుడు కొత్త సమస్య సృష్టించాడు.

ఫస్ట్ రిజర్వు ఆర్మీకి చెందిన స్పెషల్ డిపార్టుమెంటు వారు కాలనీకి ఒక కుర్రవాణ్ణి పంపారు. వాణ్ణి తక్షణం చేర్చుకోవాలని ఆదేశించారు. స్పెషల్ డిపార్టుమెంటుతో పాటు రహస్య పోలీసు విభాగం 'చెకా' ఇలా పిల్లల్ని పంపడం మామూలే. గతంలోనూ వారు పంపిన పిల్లల్ని కాలనీలో చేర్చుకొన్నాం. ఇప్పుడు యీ కొత్త కుర్రవాడిని చేర్చుకున్న రెండురోజులకు విద్యాశాఖనుంచి నాకు కబురొచ్చింది. వెళ్ళాను. షరీన్ నాతో మాట్లాడాడు. "యెవ్‌జెన్యావ్‌ను కాలనీలో చేర్చుకొన్నారా?"

"అవును"

"మా అనుమతి లేకుండా ఏ అధికారంతో మీరా పనిచేశారు?"

"వాణ్ణి పంపింది ఫస్ట్ రిజర్వు ఆర్మీ తాలూకు ప్రత్యేక విభాగం"

"ఆ విభాగానికి, నాకు సంబంధమేమిటి? నా అనుమతి లేకుండా మీరు ఎవర్నీ చేర్చు కోకూడదు కదా?"

"స్పెషల్ డిపార్టుమెంటు ఆదేశాలను నేను కాదనలేను. ఇలా పిల్లల్ని పంపే అధికారం వారికి లేదని మీరు భావిస్తే, అది మీరూ మీరూ తేల్చుకోవాల్సిన వ్యవహారం. అంతే తప్ప నేను మీ మధ్య వాదోపవాదాలను నడపాల్సిన అవసరం లేదు."

"సరే అయితే ఆ కుర్రవాడిని వెంటనే బయటకు పంపేయండి."

"అలాగే ఆ మేరకు ఆదేశాలు జారీ చేయండి"

"ఇంకేం ఆదేశాలు, నేను చెప్తున్నాగా అది చాలు"

"ఆ మాటే రాసివ్వండి"

"నేను మీ పై అధికారిని. నా మౌఖిక ఆదేశాలను పాటించనందుకు మిమ్మల్ని వారంరోజుల పాటు నిర్బంధంలో ఉంచగలను"

"అలాగే కానివ్వండి" అంటూ నేను సిద్ధపడ్డాను. ఎందుకంటే నన్ను ఏదోరీతిలో ఇబ్బంది పెట్టి అరెస్టు చేయించాలని ఆయన ఉబలాటపడుతున్నాడని తెలుస్తూనే వుంది. ఇక వాదన దేనికి?

"అంతే తప్ప ఆ పిల్లవాడిని వెనక్కు పంపనంటారు?"

"లిఖిత పూర్వక ఆదేశాలు యివ్వనిదే నేను ఆ పని చేయను."

ఎందుకంటే నన్ను స్పెషల్ డిపార్టుమెంటువారు అరెస్టు చేయడంకంటే విద్యాశాఖకు చెందిన కామ్రేడ్ షరీన్ అరెస్టు చేయడమే ఉత్తమం"

"అలా అయితే మీరిప్పుడు నిర్బంధంలో వున్నారు" అంటూ ఫోన్ తీసి పోలీసులతో మాట్లాడాడు వెంటనే ఒక మిలీషియా అధికారిని పంపండి. ఇక్కడ గోర్కీ కాలనీ డైరెక్టర్ నా యెదుట వున్నారు. ఆయన్ను వారం రోజుల పాటు నిర్బంధంలో వుంచుతున్నాను" అంటూ ఫోన్ పెట్టేశాడు.

"నేనేం చేయాలి ఇక్కడే కూర్చోనా" అని ప్రశ్నించాను.

"ఔను. ఇక్కడే వుండండి" అంటూ ఆయన తన ఆకుపచ్చ టోపీ తీసుకొని గబగబా బయటకు వెళ్లిపోయాడు. నేను వెంటనే ఫోన్ తీసి జిల్లా కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షునితో మాట్లాడాను. ఆయన నేను చెప్పినదంతా ఓపికగా విన్నాడు.

"చూడు మిత్రమా కలవరపడకండి. ప్రశాంతంగా వెళ్లిపోండి. లేదా ఆ పోలీసు అధికారి వస్తే నాతో ఫోన్లో మాట్లాడించండి" అని చెప్పాడాయన.

మిలీషియా అధికారి రానేవచ్చాడు. మీరేనా గోర్కీ కాలనీ డైరెక్టరు అని అడిగి నన్ను తన వెంట రమ్మన్నాడు.

జిల్లా అధ్యక్షుడు నాకిచ్చిన ఆదేశాలను ఆ అధికారికి వివరించి, ఆయన మిమ్మల్ని ఫోన్ చేయమన్నాడని చెప్పాను. ఐతే తనెవరికీ ఫోన్ చేసేదిలేదంటూ నన్ను బయటకు నడిపించాడు. బయట బండి దగ్గర నా కోసం ఎదురుచూస్తున్న బ్రాచెంకో ఒక పోలీసు అధికారి నన్ను అలా తీసుకెళ్లడం చూసి ఆశ్చర్యంతో నోరు వెళ్లబెట్టాడు.

"ఇక్కడే వుండు. ఇప్పుడే వచ్చేస్తా" అన్నాను వాడితో. వాడింకా ఆశ్చర్యపోయినట్టు కనిపించాడు. "అప్పుడే వచ్చేస్తారా? మీరు అరెస్టు అయ్యారని, మీ కోసం నేను వేచి ఉండక్కర్లేదని ఇప్పుడే ఇటు వెళ్లిన ఎవరో ఆఫీసర్ చెప్పాడే?" అని బ్రాచెంకో అడిగాడు.

"అదేం లేదులే ఉండు వచ్చేస్తా".

ఆ సాయంత్రం నాలుగ్గంటలకల్లా పోలీసులు నన్ను వదిలేశారు. నేనూ, బ్రాచెంకో బండిలో తిరుగుముఖం పట్టేం. విధి ఆడించే వింత నాటకాల గురించి నేను అంతర్మధనం సాగిస్తుంటే బ్రాచెంకో బహుశా తన గుర్రాల దాణా గురించి ఆలోచిస్తున్నాడు. మా ప్రయాణం నెమ్మదిగా సాగుతోంది. ప్రధాన రహదారి ఖార్కోవ్ రోడ్డు నుంచి కాలనీ వైపు మలుపు తిరుగుతూ మా గుర్రం లాడీ ఒక్కసారిగా ఉలిక్కిపడి సకిలించి బెదురుతూ ముందుకాళ్లు పైకెత్తబోయింది. కాలనీ వైపు నుంచి మా దిశగా పెద్ద శబ్దాలతో అదేపనిగా హారన్ మోగిస్తూ, చిక్కటి పొగలు వదుల్తూ దుమ్ము రేపుకుంటే ఒకకారు దూసుకొస్తుంది. ఆ కారులో భయంతో గడగడలాడుతున్న ముఖంతో ఇనస్పెక్టర్ షరీన్, కార్మికుల, రైతుల తనిఖీ విభాగం అధ్యక్షుడు చెర్నెంకో ఉన్నారు.

ఇదేమిటా? అని ఆలోచించే వ్యవధి కూడా మాకు లేకపోయింది. కారు మా బండి పక్కనుంచే దూసుకుపోతుంటే దూరంగా రోడ్డుపై మరో విచిత్ర దృశ్యం కనిపించింది. కాలనీలోని మిగిలిన రెండు గుర్రాలను కట్టిన ఒక పొలం బండిలో కాలనీ కుర్రాళ్లు వేగంగా మా వైపు పరుగున వస్తున్నారు. వారు ముందున్న మోటారుకారును వెంటాడుతున్నారని తెలుస్తునే ఉంది. ఆ బండి సారధి కరబనోవ్. అతను ఉగ్రంగా అరుస్తూ, గుర్రాలను కమ్చీతో బాదుతూ బండి వేగాన్ని పెంచేందుకు కుస్తీ పడుతున్నాడు. కారు మా బండి పక్కనుంచే ప్రధాన రహదారికి పోతుంటే ఎదుటి బండిలో కుర్రవాళ్లు గోలగోలగా అరుస్తూ బండిలోంచి కిందకిదూకుతున్నారు. అపరిమితమైన వేగంతో ప్రయాణిస్తున్నందున బండిని ఆపడం కరబనోవ్ వల్ల కావడం లేదు. మొత్తానికి అది

ఆగింది. పిల్లలంతా మా బండిని చుట్టుముట్టి కోలాహలంగా అరుస్తున్నారు. చివరికి కరబనోవ్ మమ్మల్ని చూసి ఎవరినో శాపనార్థాలు పెడుతూ తన గుర్రాలను అతి కష్టమ్మీద వెనక్కి మళ్లించాడు. మేం అనుసరించాం. కాలనీ చేరుకొన్నాం. "ఏం జరిగింద"ని పిల్లల్ని అడిగాను.

వాళ్లు అరుపులతో, కేకలు పెడుతూ చెప్పిన విషయం ఇదీ –

ఉన్నట్టుండి, షరీన్ బృందం కాలనీకి చేరింది. పిల్లలు వర్క్‌షాపుల్లో, పొలంలో పనిలో ఉన్నారు. పట్టణం నుంచి వచ్చిన అధికారులు తిన్నగా నా ఆఫీసు గదిలోకి వెళ్లారు. వాళ్లు నా మేజా సొరుగులు తీసి వెదకడం మొదలుపెట్టారు. పిల్లలకు ఏం జరుగుతుందో అర్థం కాలేదు. ఆ అధికారులు ఇవానోవిచ్‌తో ఇలా అన్నారు. "ఇక నువ్వే డైరెక్టర్‌వి, బాధ్యతలు తీసుకో" అని. ఈ మాటలు విన్న పిల్లల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. అందరూ అరుపులు మొదలుపెట్టారు. కొందరు పిల్లలు షరీన్ కోటు పట్టుకుగుంజారు. బరున్ వల్లమాలిన కోపంతో నా గురించి అధికారులను ప్రశ్నించాడు. "ఆంటన్ సెమ్యోనోవిచ్ ఏరీ? ఆయనకు ఏమైంది?" అని.

పిల్లల కోపానికి, వారి దూకుడుతనానికి షరీన్ బాగా బెదిరిపోయాడు. వాళ్లని తప్పించుకొని బయటకు పరుగులు తీసి కారు ఎక్కేశాడు. అదే సమయంలో కరబనోవ్ తన బండిలో పొలం నుంచి కాలనీకి వస్తున్నాడు. ఇక చెప్పేదేముంది? అందరూ ఆ బండిలో దూకి షరీన్ బృందం కారు వెంటపడ్డారు. ఈలోగా మేం ఎదురుపడ్డాం. జరిగింది అదీ.

కాస్త సమయానికి కరబనోవ్ శాంతించాడు. బండి నుంచి గుర్రాలను విప్పడం మొదలు పెట్టాడు. బ్రాచెంకో గుర్రాలని పరిశీలించి ఒక్కసారిగా కరబనోవ్‌పై విరుచుకుపడ్డాడు.

"గుర్రాలంటే కార్లు అనుకున్నావా? నీ ఇష్టమొచ్చినంత వేగంగా తోలచ్చు అనుకున్నావా? చూడు, ఎంత చెమటలు పట్టాయో? ఎలా అలిసిపోయాయో!" అంటూ తన ధోరణిలో ప్రసంగించాడు.

"చూడు బ్రాచెంకో, ఆ నిమిషంలో మేం గుర్రాలను గురించి ఆలోచించే వ్యవధి ఏదీ? సెమ్యోనోవిచ్‌కి ఏం జరిగిందనే ఆందోళనలో ఆ కారు వెంటపడ్డాం. అంతే అర్థం చేసుకోవేం" అని కరబనోవ్ విసుక్కున్నాడు.

లోపల మా టీచర్లు భయంతో బిర్రబిగుసుకొని ఉన్నారు. తర్వాత ఇవానోవిచ్ నాకు చెప్పాడు "ఆ సమయంలో కుర్రవాళ్ళని చూస్తే నాకు భయమేసింది. ఎంత ఉగ్రంగా మారారని? మరు నిమిషంలో వాళ్లు అధికారులపై కత్తులతో దాడి చేసేవారు. సమయానికి జదరోవ్ రాబట్టి పరిస్థితి అదుపులోకి వచ్చింది. అయినా పారిపోతున్న అధికారులను వాళ్లు వేటకుక్కల్లా తరిమారు."

ఈ విషయంలో పిల్లలను నేను ఏమీ ప్రశ్నించలేదు. అసలేమీ జరగనట్టే ప్రవర్తించాను. విద్యాశాఖ నుంచి దీని గురించి నాకు వర్తమానం ఏదీ రాలేదు. కొద్ది రోజుల తరువాత కార్మికులు, రైతుల తనిఖీ విభాగం అధ్యక్షుడు చెర్నెంకో పట్టణంలో నాకు తారసపడి నన్ను చూసి చిరునవ్వుతో పలకరించాడు.

నన్ను తన ఆఫీసు గదికి తీసుకువెళ్లి కూర్చోబెట్టాడు.

"ఎలా ఉన్నారు మీ పిల్ల రాక్షసులు?" అని ఆప్యాయంగా ప్రశ్నించాడు. "భలే కుర్రాళ్లు కాలనీలో స్థితి దయనీయంగా ఉంటుందని, పీలికలైన బట్టల్లో పిల్లలు దీనంగా ఉంటారనీ ఊహించాను. కానీ బాబోయ్! ఎలా ఉన్నారు? మమ్మల్ని చుట్టుముట్టినప్పుడు భలే భయం కలిగింది. మా వెంట ఎలా పడ్డారు? కారులో షరీన్ భయంతో వణికిపోయాడు. కారు ఆగిపోతే తన పని ఖతం అని

గొణుగుతూ కూర్చున్నాడు. ఎంతకాలం అయిందో అటువంటి ఉత్కంఠ భరితమైన డ్రామా చూసి!" అంటూ పకపకా నవ్వుతూ నా భుజాలు పట్టుకు ఊపేశాడాయన.

చెర్నెంకోతో నా స్నేహం అలా మొదలైంది

18

ఆవేశంలో ఒళ్లు మరచిన క్షణం

ట్రెప్కే ఎస్టేట్‌లో మరమ్మతుల వ్యవహారం అత్యంత సంక్లిష్టమైన వ్యవహారంగా మారింది. నిర్మాణ సామాగ్రితో పాటు డబ్బు కొరత మమ్మల్ని బాధించింది. మాకు కావాల్సిన సామాగ్రిలో పదిశాతం భాగం కూడా ప్రభుత్వ విభాగాల నుంచి మాకు అందడం లేదు. డబ్బు కొరతవల్ల పనికి కూలీలను తెచ్చుకోవడం కష్టమైంది. ఈలోగా ఇవానోవిచ్‌కే ఒక ఆలోచన వచ్చింది ఎస్టేట్ అసలు యజమానులు అప్పట్లో తమ గుర్రాల కోసం విశాలమైన అశ్వశాలలు నిర్మించుకున్నారు. వాటి మరమ్మతు అసాధ్యమని పైగా మనకున్న మూడు గుర్రాల కోసం అన్ని అశ్వశాలలు అవసరం లేదని ఇవానోవిచ్ చెప్పాడు. ఆయన ఆలోచనల ప్రకారం మా కొలిమిలోనే తయారైన పనిముట్లతో అశ్వశాల భవనాలను తొలగించడం ప్రారంభించాం. మా పిల్లలే అతి జాగ్రత్తగా పనిచేస్తూ అక్కడి ఇటుకలను పెళ్లగించడం మొదలుపెట్టారు. అప్పట్లో భవన నిర్మాణ సామాగ్రి కొరత తీవ్రంగా ఉండటంతో ధనికులైన మాజీ భూస్వాములు వాటిని ఎగబడి కొనుక్కున్నారు. అలా మాకు అవసరమైన నిధుల్లో కొంత భాగం సమకూడింది.

కొత్త కాలనీలో పనిచేస్తేనే చదువు కొనసాగించాల్సి రావడంతో పిల్లల సమయాన్ని రెండు షిఫ్టులుగా విడగొట్టాం. సగం రోజు పనిచేసిన పిల్లలు మిగతా సగం రోజు చదువుకునే వారు. దీంతో కొత్తకాలనీలో కుర్రవాళ్లు రెండు షిఫ్టుల్లో పనిచేసేవాళ్లు. కొత్త – పాత కాలనీల మధ్య పిల్లల రాకపోకలు పెరిగేయి. వాళ్లు ఎంత గంభీరంగా వెనుక్కు ముందుకు ప్రయాణం సాగించినప్పటికీ దారితప్పిన ఏ కోడిపెట్టో వాళ్లనాకర్షించేది. అలా దొరకు పుచ్చుకున్న కోడిపెట్టను పూర్తిగా జీర్ణం చేసుకోవడం వాళ్లకు కొంత కష్టమయ్యేది. ముందు ఈ వ్యవహారం బయటపడకూడదు. రహస్యంగా సాగాలి. గుర్తులేమి మిగలకూడదు. అదీగాక నాగరికత విషయంలో ఎంత వెనకబడివున్నా నిప్పు సాయం లేకుండా కోడిని హరాయించుకోడం కష్టమే మరి. మొత్తానికి యీ ప్రయాణాల ఫలితంగా కుర్రవాళ్లకి పరిసరాల రైతులతో ఏదో ఒక రకమైన సంబంధం ఏర్పడింది. మా వాళ్లు ముందు ఆ రైతుల ఆర్థిక పునాదికే ప్రాధాన్యత నిచ్చేరు. అంటే పెద్ద శాస్త్ర పరిజ్ఞానంతో మాత్రం కాదు. కాస్త పచ్చగావుండే రైతుల గోదాములపై వీళ్లు కన్నేశారు. కాస్త చీకటి పడి జనం నిద్రలోకి జారుకుంటేచాలు మా కుర్రవాళ్లు రెచ్చిపోయేవాళ్లు. రైతుల గోదాములు, నేల మాళిగలు సందర్శించి అక్కడున్న పాలు, పెరుగు, పందికొవ్వు లాంటి పదార్థాలను మాయం చేసేవారు.

కరబనోవ్, టారానెట్స్, వొలొఖోవ్, ఒసాడ్చీ, మిత్యాగిన్ వంటి పెద్ద కుర్రవాళ్లు యీ పనిలోకి దిగితే నాకు పెద్ద యిబ్బంది అనిపించేది కాదు. యీ పనుల్లో అపారమైన అనుభవం, నైపుణ్యం గల కుర్రవాళ్లు రాత్రి వేటకు వెళ్లి వస్తే ఆ విషయం ఎవరికీ తెలిసేది కాదు. రైతులు ఉదయమే తమ నేలమాళిగలు చూసుకున్నప్పుడు కొన్ని వస్తువులు మాయమైనట్లు గమనించేవారు. కానీ వేసిన తాళాలు వేసినట్లే వుండేవి. ఏ కిటికీని గాని తలుపును గాని బలవంతాన తెరిచిన చిహ్నాలు కనిపించేవి కావు. అలాగే రాత్రి తమ ఇంటి కుక్కలు అరిచినట్లు ఆ రైతులకు జ్ఞాపకమే వుండేది కాదు. దాంతో వారు విషయం అర్థం కాకుండా కలిగిన నష్టాన్ని మౌనంగా సహించేవారు.

కానీ పెద్ద కుర్రాళ్లను చూసి ఉత్సాహం తెచ్చుకున్న జూనియర్లు రంగంలోకి దిగినతర్వాత పరిస్థితి మారింది. వీళ్ల అనుభవరాహిత్య ఫలితంగా రైతులకు అసలు దొంగల ఆచూకీ తెలిసిపోయింది. రైతులు కాలనీకి వచ్చి నన్ను నిలదీయడం మొదలైంది. అయినా వాళ్లకి మావాళ్లే దొంగలని తేల్చేందుకు ఆధారాలు దొరికేవికావు.

ఇదే సమయంలో రహదారిపై దారి దోపిడీ సంఘటనలు పెరిగిపోయాయి. ఇది కూడా మా వాళ్ల నిర్వాకమేనని రైతులు ఆరోపించినా నేను వారిని పెద్దగా లెక్క చేయలేదు. ఎందుకంటే దీని గురించి అప్పటికే నేను మా వాళ్లతో మాట్లాడేను. అయితే వాళ్లు నాకు ఖచ్చితమైన హామీ నిచ్చారు. తమలో కొందరు ఏదో సరదాగానో, కక్కుర్తిగానో రైతుల గోదాములపై హస్తలాఘవం చూపిన మాట నిజమేనని, అంతే తప్ప రహదారిపై దోపిడీలకు పాల్పడేంత దుర్మార్గులెవరూ తమలో లేరని వాళ్లు ఇచ్చిన హామీని నేను విశ్వసించాను.

ఈ సమయంలో ఓ రోజు సాయంత్రం ఒక ప్లటూన్ అశ్విక పోలీసు బృందం కాలనీపై పడింది. అన్ని డార్మెటరీల, ప్రవేశ ద్వారాల వద్ద మిలీషియా సిబ్బంది కాపలాగా నిలబడింది. ఆ పోలీసులు నన్ను నా గదిలోనే నిర్బంధంలో పెట్టారు. దీంతో ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చింది. పిల్లలు డార్మెటరీల కిటికీలలోంచి బయటికి దూకి మిలిషీయాతో తలపడ్డారు. చీకటి మాటున దాటి రాళ్ల వర్షం కురిపించారు. కారిడార్లలో ముందు, ప్రహరీ లోపల, వెనక పెరట్లోను అనేక చోట్ల మిలీషియా సిబ్బందితో కుర్రవాళ్లు ముష్టి యుద్ధానికి దిగారు. ఈ లోపు కరబనోవ్ నా గదిలోకి వచ్చి నన్ను బయటికి తీసుకెళ్లాడు. బయట పిల్లలు ఒక్కసారిగా నన్ను చుట్టుముట్టారు. ఓ మూల జడరోవ్ గట్టిగా కేకలు పెడుతున్నాడు. "ఏమిటిదంతా మమ్మల్ని అనుమానించి అవమానించడం మానుకోరా! ఇదంతా రోత కలిగిస్తుంది. నేను దొంగనా?.. ఖైదీనా? వీళ్లు దేనికి సోదా చేస్తున్నారు?" అంటూ అరుస్తున్నాడు.

పూర్తిగా బెదిరిపోయిన ప్లటూన్ కమాండర్ నన్ను చూసి కొంత ధైర్యం తెచ్చుకున్నాడు. "పిల్లలందర్నీ డార్మెటరీలోకి వెళ్లమని చెప్పండి. వెళ్లి తమ తమ మంచాల పక్క నిలబడమని చెప్పండి" అని నన్ను ఆయన ఆదేశించాడు.

ఏ ఆధారంతో మీరు సోదా జరుపుతున్నారని నేను ప్రశ్నించినప్పుడు అది నాకనవసరమని ఆయన తలబిరుసుగా బదులిచ్చాడు.

దానితో నేను నిగ్రహం కోల్పోయాను. విద్యాశాఖ ప్రధానాధికారి అనుమతి లేకుండా సోదా జరిపితే వూర్కోనని హెచ్చరించాను. బలప్రయోగంతోనైనా సోదాను అడ్డుకుంటానని స్పష్టంగా చెప్పాను.

దీంతో కమాండరు నిస్సహాయుడై పోయాడు. ఆవరణలో తలో మూలవున్న తన సహచరులను దగ్గరకు పిలుచుకున్నాడు. జరిగిన గొడవలతో బెదిరి పారిపోయిన మిలీషియా సిబ్బంది గుర్రాలను వెదకడంలో మా పిల్లలూ సహకరించారు. చివరకు మిలిషియా సిబ్బంది అక్కడ నుంచి నిష్క్రమించింది. ఈ ఉదంతం తర్వాత గ్రామస్తులకు మా శక్తి ఏమిటో అవగతమైనా జరుగుతున్న నష్టాన్ని వారు సహించలేకపోయేవారు. మా పిల్లలపై తరచు ఫిర్యాదులు రావడం మొదలైంది. ఇదంతా అవమానంగా భావించిన నేను మౌనంగా ఆ ఫిర్యాదులు వినేవాడిని. క్రమంగా పిల్లలకు కూడా నా ఆందోళన, బాధ అర్థమైనట్టుంది. రైతుల ఇళ్లపై మా వాళ్ల దాడులు నిలిచిపోయాయి. పెద్ద పిల్లలు తమంత తాముగా రాత్రి వేళల్లో పిల్లలెవరూ రాత్రివేళ కాలనీ వొదిలి వెళ్లకుండా బాధ్యత తీసుకున్నారు.

పరిస్థితులు కాస్త కుదుటపడుతున్నాయనుకుంటున్న సమయంలో ఓ సాయంత్రం పిల్లలు గుంపుగా నా గదిలోకి జొరబడ్డారు. వాళ్ల మధ్య ప్రిఖోడ్కో గింజుకుంటున్నాడు. కరబనోవ్ వాణ్ణి నా ముందుకు తోశాడు."

"ఏమిటి మళ్లీ కత్తులు తీశాడా?" అడిగాను నిర్లిప్తంగా. "అదికాదండీ వాడు రహదారిపై దోపిడీలకు దిగాడు".

మిన్ను విరిగి మీదపడినట్లనిపించింది. నా ఆశాసౌధం కుప్పకూలుతున్న అనుభూతి. ఒక్కసారిగా నిస్పృహ ఆవరించింది. వణికిపోతూ మౌనంగా నించున్న ప్రిఖోడ్కోను యాంత్రికంగా అడిగాను.

"నిజమేనా?"

వినీ వినపడనంత మెల్లగా బదులిచ్చాడతను "ఔను.

క్షణంలో ప్రపంచం తలక్రిందులైనట్లనిపించింది. హఠాత్తుగా నా చేతిలో రివాల్వర్ ప్రత్యక్షమయింది "ఛీ ఛీ మీతో విసిగిపోయాను..." అంటూ రివాల్వర్‌ను నా కణతలకు ఆనించుకునేలోపే పిల్లలంతా అరుస్తూ, ఏడుస్తూ నా మీదకు వచ్చిపడ్డారు.

నాకు స్పృహ వచ్చి కళ్లు తెరిచేటప్పటికి ప్రక్కనే ఎకతెరీనా, జదరోవ్, బరున్‌లు వున్నారు. నా తలను ఒళ్లో పెట్టుకుని కూర్చున్న జదరోవ్ నేను కళ్లు తెరవడం చూసి ఓసారి నిట్టూర్చి మా టీచర్ ఎకతెరీనాతో అన్నాడు. "ఇక కదలండి. వెళ్లి ప్రిఖోడ్కో సంగతి చూడండి. లేకపోతే వాళ్లు వాడ్ని చంపేస్తారు..." అంటున్నాడు. నేను ఒక్క ఉదుటున లేచి పెరట్లోకి పరుగెత్తాను. అప్పటికే ప్రిఖోడ్కో స్పృహ కోల్పోయాడు. రక్తపు మడుగులో పడివున్నాడు.

19

వేసవి మొదలవుతోంది. ప్రిఖోడ్కో చేసిన నేరం గురించి ఎవరూ మాట్లాడ్డం లేదు. మిగిలిన పిల్లల చేతులలో చావుదెబ్బలు తిన్న ఆ కుర్రవాడు చాలా కాలం మంచం మీద వున్నాడు. ఎవరూ అతడ్ని జరిగిన దాని గురించి ప్రశ్నించనే లేదు. అయితే జరిగిన సంఘటన వాడిపై మాత్రం పెద్ద ప్రభావం చూపినట్లు లేదు. మిగిలిన పిల్లలు మాత్రం నాటి ఉద్రిక్తపూరిత సంఘటనకు రైతులే కారణమైనట్లు ప్రవర్తించసాగారు. రైతులంతా ఆశపోతులని, స్వార్థపరులని తమ ధాన్యం నిల్వలు నాశనమైనా వూరుకుంటారేతప్ప పిల్లికి బిచ్చం వెయ్యని దుర్మార్గులని మా కుర్రవాళ్లు సూత్రీకరించారు. రైతులతో మా వాళ్ల నిరంతర జగడాలు నన్ను అశాంతికి గురిచేశాయి. యీ కొట్లాటల వల్ల గ్రామంలో అధికారగణం కూడా మమ్మల్ని శత్రువులుగానే పరిగణిస్తోంది. అతి బలవంతాన ఎంతో అయిష్టంతో ఎస్టేటు భూమిని మాకు స్వాధీనం చేసిన లూకా సెమ్యోనోవిచ్ ఎలాగైనా మమ్మల్ని గెంటేయాలని ప్రయత్నాలు కొనసాగించాడు. ఎస్టేట్‌ను, అక్కడ మిల్లును గ్రామ సోవియట్‌కు అప్పజెప్పాలని, అక్కడ ఒక స్కూలును నడుపుతామని అధికార్లకు ఎన్నెన్నో మహజర్లు పంపుకున్నాడు. పట్టణంలో అధికార గణంలో ఉన్న తన బంధువులను, మిత్రులను పట్టుకుని కొత్త కాలనీలోని కొన్ని భవనాలను గ్రామ సోవియట్‌కు బదిలీ చేసేలా ఆదేశాలు సంపాదించాడు. వాటిని రద్దు చేయించేందుకు మేము బ్రహ్మయత్నమే చేయాల్సి వచ్చింది. కొన్ని భవనాలతో గ్రామ సోవియట్‌కు పనిలేదని లూకా అతని బంధువులు అక్కడి కలపను వంట చెరకుగా వాడుకునేందుకే యీ ఎత్తుగడవేశారని రుజువు చేయడానికి చాలా శ్రమ పడ్డాం. ఇది లూకా బృందం ఆగ్రహాన్ని రెట్టింపు

చేసింది. వాళ్లు అదే పనిగా పంపిన ఫిర్యాదుల ఫలితంగానే మిలీషియా సిబ్బంది కాలనీని సోదా చేసేందుకు వచ్చారని తర్వాత తేలింది.

యీ సమయంలో జూన్‌లో ఓ మధ్యాహ్నం దూరంగా ఓ గుంపు కాలనీ వైపు వస్తూ కనిపించింది, దూరం నుంచీ కూడా వాళ్ల మధ్య బందీలుగా వున్న మా ఇద్దరు కుర్రాళ్లను గుర్తు పట్టగలిగాను. ఒప్రిష్కో, సొరోకాల చేతులు కట్టేసి వున్నాయి. ఇద్దరు రైతులు వాళ్ల భుజాలు పట్టుకు నడిపిస్తున్నారు. వెనక రైతులు గుంపుగా వస్తున్నారు. ఒప్రిష్కో చాలా మొండిమనిషి. తెలివైనవాడు. మంచి పనివాడు కూడా. సొరోకా మాత్రం ఉత్తబడుద్ధాయి. వాడి ఖర్మేమిటో కాని ఏ పని మొదలెట్టినా తలకిందులయ్యేది. ఆ గుంపు కాలనీలోకి మా దగ్గరకి వచ్చింది. అందరికంటే ముందు మౌసీ కార్పోవిచ్ తమ కేదో పెద్ద ఘోరం జరిగినట్టు మొహం పెట్టుకున్నాడు. పక్కనే లూకా సెమ్యోనోవిచ్ ఎనలేని గాంభీర్యాన్ని ఒలక బోస్తున్నాడు. అతను నా వద్దకు వచ్చి సూటిగా ప్రశ్నించాడు.

“ఇదేనా పిల్లల్ని పెంచే పద్ధతి?” అడిగాడాయన.

“ఏమయింది?”

“చెప్తా వినండి. యీ కుర్రకుంకల వలన జనానికి శాంతి లేకుండా పోయింది. ఉత్త దొంగలు వీళ్లు” అని ఛీత్కరించేడు.

ఇంతలో పిల్లలగుంపులోంచి అరుపులు వినిపించాయి “ఏం తాతా వాళ్లనెందుకు కట్టేశారు?”

“ఇంకా మీ రాజ్యమే సాగుతుందనుకుంటున్నారా?”

“ముందు వాణ్ణి రెండు వేయండి”.

నేను వారిని గట్టిగా వారించాను. నిశ్శబ్దంగా వుండండని అరిచాను. తర్వాత గ్రామీణుల వైపు తిరిగి ఏం జరిగిందని ప్రశ్నించాను.

“మా ముసలావిడ అప్పుడే బట్టలు ఆరేసింది. అప్పుడే వీళ్లిద్దరూ అటుగా వెళ్ళారు. మరుక్షణంలో తాడుమీద బట్టలు మాయమయ్యాయి. నేను వీళ్ల వెంట పడ్డాను. వాళ్లు పరుగు అందుకున్నారు. ఈలోగా ఎదురొచ్చిన జనం వాళ్లని పట్టుకున్నారు.”

“ఇక్కడ చర్చలు అనవసరం. రండి వాంగ్మూలం తీసుకుందాం” అన్నాడు గ్రామ సోవియట్ అధ్యక్షుడు లూకా సెమ్యోనోవిచ్.

“వాళ్లు తీసుకున్న వస్తువులు తిరిగి ఇచ్చేశారుగా. ఇంకాదానిపై వాంగ్మూలాలు దేనికి?” అంటూ అడ్డుకోబోయాను.

“తిరిగి ఇస్తే మాత్రం? ఫిర్యాదు చేయాల్సిందే కదా” గ్రామ సోవియట్ అధ్యక్షుడు లూకా సమాధానమిచ్చాడు.

ఏదేమైనా మా అంతు తేల్చాలని లూకా కృతనిశ్చయుడై వున్నట్టు కనిపిస్తూనేవుంది. ఫిర్యాదు అంటూ చేస్తే ఆ పిల్లలకు జైలు తప్పదు. కాలనీ పరువు నాశనమౌతుంది. అందుకే వాళ్లను అర్థించాను. “పిల్లలు ఏదో తప్పు చేశారు. పట్టుబడ్డం ఇదే మొదటిసారి. తొలి తప్పుగా పరిగణించి మన్నించి వదిలేయండి” అని ప్రాధేయపడ్డాను. “అదేం కుదరదు. క్షమాపణ ప్రశ్నే లేదు. వాంగ్మూలాలు తీసుకోవాల్సిందే అన్నాడు లూకా.

మౌసీ పాత గాయాల్ని మరచిపోలేదు. అతను నావంక కసిగా చూస్తూ “మరి ఆ రాత్రి మీరేం చేశారు. ఏదో నాలుగు కట్టెల కోసం అడవికి వస్తే నన్ను నిర్బంధించారు. నా గొడ్డలి కూడా లాక్కోలేదూ?”

నా దగ్గర సమాధానం లేదు. చేసేది లేక వారి వెంట నా ఆఫీసు గదిలోకి నడిచాను. అక్కడ రెండు గంటలసేపు గ్రామపెద్దల కాళ్లావేళ్లా పడ్డాను. జరిగింది తప్పేనని ఒప్పుకున్నాను. అలాంటి పొరపాట్లు మళ్లీ జరగవని హామీ యిచ్చాను. గ్రామసోవియట్ కోసం ఒక జత బండిచక్రాలు, సరికొత్త యిరుసు అతి తక్కువ ధరకు చేసి యివ్వగలమని ఆశ చూపాను. చిట్టచివరికి గ్రామసోవియట్ అధ్యక్షుడు లూకా అతి గంభీరంగా ఒక షరతు విధించాడు. "మీరే కాదు మీ పిల్లలంతా తలలు వంచి నన్ను క్షమాపణ కోరాలి".

ఆ రెండుగంటల్లో లూకా అంటే జీవితానికి సరిపడా అసహ్యం నాలో పెరిగింది. ఇప్పుడు ఇంతగా బెట్టుచేస్తున్న ఈ మనిషే గనుక రేపు ఏ చీకటి మాటునో పిల్లలకు దొరికితే ఏమవుతుందో నాకు తడుతూనే వుంది. కానీ ప్రస్తుతానికి చేయగలిగిందేమీ లేదు. గది బయటకు వచ్చి పిల్లలందర్నీ వరుసగా నిలబడమన్నాను. నేను చెప్పినట్టు ప్రమాణం చేయమని ఆదేశించాను. నేను వారి ఎదుట నిలబడి తలవంచుకొని లూకా చెప్పినట్టే చేశాను. నా సహచర క్రామేడ్ల వల్ల జరిగిన పొరపాటుకు చింతిస్తున్నామని ఈ సారికి మమ్మల్ని క్షమించాలని, ఈ తప్పులు పునరావృతం కావని ప్రమాణం చేశాను, నాతో పాటే పిల్లలు కూడా. ప్రతిగా లూకా గంభీరంగా ప్రసంగించాడు.

"ఇటువంటి తప్పులకు చట్ట ప్రకారం కఠినంగా శిక్షించవలసిందే. గ్రామ ప్రజలు కష్టజీవులు. వాళ్లు బయట ఆరేసుకొన్న బట్టల్ని, మీరు ఎత్తుకు పోయారంటే, మీరు ప్రజలకు, శ్రామికవర్గానికి కూడా శత్రువులన్నమాట. గ్రామ సోవియట్ అధ్యక్షుడిగా నా పరిధిలో ఇటువంటి చట్ట ఉల్లంఘనను చూసి సహించలేను. ఎవరుపడితే వాళ్లు తమకు అందిన వాటిని ఎత్తుకుపోతుంటే నేను వొప్పుకోను. కానీ మీరు తప్పు వొప్పుకున్నారు. పైగా ఇక ముందు అలా చేయమంటున్నారు. మీరు మాట నిలుపుకుంటారో, లేదో ఆ దేవుడికే తెలియాలి. కానీ మీరంతా తలలు వంచి క్షమాపణ కోసం అర్థిస్తున్నారు. కాబట్టి, మీ డైరెక్టర్ కూడా మిమ్మల్ని నిజాయితీపరులైన పౌరులుగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు కాబట్టి, మిమ్మల్ని బేషరతుగా క్షమిస్తున్నాను."

ఈ ప్రసంగం సాగుతున్నంత సేపు అవమానంతో నేను దహించుకుపోయాను. దొంగలుగా పట్టుబడిన ఒప్రిష్కో, సొరొకా మిగిలిన పిల్లలతో పాటు వరుసలో నుంచున్నారు.

తరువాత లూకా, మౌసీలు నాకు షేక్‌హ్యాండ్ ఇచ్చి, బోలెడంత ఉదారంగా నాలుగుమాటలు చెప్పి మిగిలినవారితో కలిసి నిష్క్రమించారు.

పైన సూర్యుడు కాలనీపై తన తీక్షణ కిరణాలు ప్రసరిస్తున్నాడు. కదలికలేని గాలి నీలిముసుగులా అడవిని కమ్ముకొంది. చుట్టూ చూశాను. అదే కాలనీ, అవే భవనాలు, గోడలు, మళ్లీ తెల్లవారుతోంది- బట్టల దొంగలు, లూకా, మౌసీ, సామాగ్రికోసం, ఆహారం కోసం, డబ్బు కోసం పాట్లు. ఎగుడుదిగుడు రహదారిలో పట్టణానికి సుదీర్ఘయాత్రలు. నా ఎదురుగా డార్మెటరీల్లో రంగువేయని మంచాలు, బల్లలూ... "ఏం చేయాలి? ఏం చేయగలను?" నిస్పృహ అవరించింది. నెమ్మదిగా అడవిలోకి నడిచాను. ఆ మిట్ట మధ్యాహ్నం వేళలో ఏ పైన్ వృక్షం కిందా నీడన్నది లేదు. ఆ వృక్షాల తలలు నిటారుగా ఆకాశంలోకి చూస్తున్నాయి. అడవిలోనే ఉంటున్నప్పటికీ ఇంతకాలంలో ఒక్కసారైనా నేను ఇలా లోపలికి నడిచిరాలేదు. ఎంతసేపు పనులు...పనులు... పనులలో నిమగ్నమయ్యాను. ఆలోచిస్తూ నడుస్తుంటే ఉన్నట్టుండి నా వెనుక అలికిడి, ఒక ఎండుకొమ్మ పుటుక్కున విరిగిన శబ్దం. గిరుక్కున వెనుదిరిగి చూశాను. ఆశ్చర్యంతో నోట మాటరాలేదు. మొత్తం కాలనీ జనమంతా నా వెనుక చెట్లమాటున నక్కినక్కి నడుస్తున్నారు.

నేను చూడగానే ఎక్కడివాళ్లు అక్కడే బిగిసిపోయారు.

"ఏం చేస్తున్నారు? ఎందుకు నా వెంటపడ్డారు?" అని వారిని గట్టిగా అడిగాను.

నాకు దగ్గరగా ఉన్న జడరోవ్ నన్ను సమీపించాడు. "కాలనీకి వెళ్దాం రండి" అన్నాడు.

ఒక్కసారి గుండె జారిపోయింది. "ఏమైంది?" అనిఅడిగాను ఆందోళనతో.

"ఏం లేదు. వెళ్దాం రండి" అన్నాడు.

"ఏమైందంటే చెప్పరేం. ఎందుకు రమ్మంటున్నావ్?" అంటూ జడరోవ్ వైపు వేగంగా అడుగులు వేశాను.

జడరోవ్ దాదాపు గుసగుసలాడాడు. "ఏం జరగలేదు. పోనీ వెళ్లండి. కానీ ఒక సాయం చేయండి" అన్నాడు.

"ఏమిటది?"

"మీ రివాల్వర్ ఇలా ఇవ్వండి."

"రివాల్వర్?" నిర్ఘాంతపోయాను. మరుక్షణమే పిల్లలు ఏమనుకుంటున్నారో అర్థమై ఉప్పెనలా నవ్వొచ్చింది. "ఇదిగో రివాల్వర్ తీసుకో. కానీ నేను చావదలిస్తే, ఏ చెట్టుకో ఉరి పోసుకోగలను. లేదా నదిలో దూకి చావగలను" అన్నాను.

జడరోవ్ అర్థంపర్థం లేకుండా గొణిగాడు "అలా నడుద్దామని వచ్చారా? మేమంతా భయపడ్డాం... ఏంలేదు లెండి... సరే వెళ్తాం" అంటూ వెనుదిరిగాడు. అసలేం జరిగిందో తరువాత తెలిసింది.

నేను ఇలా అడవివైపు అడుగువేయగానే సొరోకా డార్మెటరీలోకి పరుగులు తీశాడు. "అరేయ్ రండి.... ఆంటన్ సెమ్యోనోవిచ్ అడవిలోకి వెళ్లారు. రివాల్వర్‌తో కాల్చుకోబోతున్నారు" అని కేకలు పెట్టాడు. వాడి మాటలు పూర్తవకుండానే కాలనీ మొత్తం అడవివైపు కదిలింది. పిల్లలు నా వెంటపడ్డారు. అదీ సంగతి.

20

వసంతంలో గుర్రాల కొరత మాకొక నిజమైన సమస్యగా మారింది. మా గుర్రాలు లాడీ, బ్యాండిట్‌లు ఇక ఏమాత్రం కదల్లేని స్థితిలో పడ్డాయి. గుర్రాలను ఇంకా అలా హింసించడంపై బ్రాచెంకో తన మాములు ధోరణిలోనే శాపనార్థాలు పెడుతుండగా, కలీనా ఇవానోవిచ్‌కు కూడా ఈ విషయంలో ప్రభుత్వంపై ఎందుకో కోపం వచ్చింది. నోరులేని జీవాల పట్ల ఇంత క్రూరంగా వ్యవహరించవలసి వస్తోందంటే కారణం ప్రభుత్వ ధోరణేనని ఉపన్యాసాలు మొదలుపెట్టాడు. దీంతో బ్రాచెంకో మరీ మొండిగా తయారై, గుర్రాలను పొలం పనికి పంపేందుకు నిరాకరిస్తున్నాడు.

ఒక రోజు నేను చెర్నెంకోను కలిసి మా సమస్య వివరించాను. ఉన్న పనిముట్లతో ఎలాగోలా సర్దుకోగలం కానీ గుర్రాల సంగతేంటి? ఒకటా? రెండా? దాదాపు 160 ఎకరాల భూమి ఎలా దున్నగలం? అని ప్రశ్నించాను. వ్యవసాయం చేయనిదే ఆ పొలం స్వాధీనం చేసుకున్నందుకు గ్రామస్థులు మమ్మల్ని క్షమిస్తారా? అని అడిగాను.

ఆయన కొద్ది క్షణాలు ఆలోచించి, ఉన్నట్టుండి ఆనందంగా నవ్వాడు. "అరే! నా బుర్ర పనిచేయలేదేంటి? మాకొక సప్లైల విభాగం వుంది. ఈ సీజన్‌లో మాకు గుర్రాల అవసరం లేదు. ఓ పని చేద్దాం. నేను తాత్కాలికంగా మీకు మూడు గుర్రాలు ఇప్పిస్తాను. మాకు దాణా కలిసి వస్తుంది. మీరు మా సప్లైల మేనేజర్‌తో మట్లాడండి" అని నన్ను పంపాడు.

కార్మికుల, రైతుల తనిఖీ విభాగం సప్లైల మేనేజర్ చాలా కచ్చితమైన మనిషిలా కనిపించాడు.

తను గుఱ్ఱాలను నేను ఎత్తుకుపోతున్నట్టు నిష్ఠూరమాడాడు. మూడు గుఱ్ఱాలను ఆరు వారాలు మాకు ఇచ్చేందుకు కష్టం మీద ఒప్పుకున్నాడు. వాటి అద్దెగా నాలుగు ఐదేసి ఫూడ్‌ల గోధుమలు చెల్లించాలని షరతు పెట్టాడు. అదికాక వాళ్ల బండికి చక్కటి చక్రాల జత చేసి ఇవ్వాలన్నాడు. అన్నిటికీ తల ఊపాను. ఆయన కేవలం మాటలతో వ్యవహారాన్ని ఖరారు చేయలేదు. కొరుకుడు పడని భాషలో ఒక ఒప్పందపత్రాన్ని తయారు చేశాడు. అనుకొన్న కాలానికి, అనుకున్న అద్దె కట్టి గుఱ్ఱాలను యథాతథ స్థితిలో తిరిగి అప్పగించకుంటే చెల్లించవలసిన అపరాధ రుసుము వివరాలు కూడా ఆ పత్రంలో ఉన్నాయి. నేను అన్నింటికీ అంగీకరించాను.

మర్నాడు కలీనా ఇవానోవిచ్, బ్రాచెంకోలు విజయగర్వంతో కాలనీకి తిరిగివచ్చారు. చిన్న పిల్లలంతా రాబోయే కొత్త గుఱ్ఱాల కోసం బయట నిలబడి ఎదురుచూశారు. బండిలోంచి ఇవానోవిచ్ హుందాగా దిగాడు. బండి వెనక కట్టి ఉన్న మూడు గుఱ్ఱాలకేసి చెయ్యి చూపుతో బ్రాచెంకోతో గంభీరంగా చెప్పాడు.

"గుఱ్ఱాలు జాగ్రత్త. అవి మామూలు గుఱ్ఱాలు కాదు!"

బ్రాచెంకో ఆ మాటలు వినలేదు. హడావుడిగా తన సహాయకులకు ఆదేశాలు జారీచేశాడు. అంతవరకు మా కాలనీని ఆదుకున్న పాతగుఱ్ఱాలను అశ్వశాలలో వెనక్కి పంపాడు. లయన్, ఫాల్కన్, మేరీ అనే ఈ మూడు కొత్త గుఱ్ఱాలు నల్లగా నిగనిగలాడుతూ, ఆరోగ్యంగా పుష్టిగా మెరిసిపోతున్నాయి.

వీటిల్లో లయన్ మమ్మల్ని నిరాశ పరచింది. పొలం పనికి అది పనికిరాదు. అలవాటు లేదు. ఫాల్కన్, మేరీ మాత్రం వ్యవసాయానికి ఉపయోగపడే అద్భుతమైన గుఱ్ఱాలు వాటితో పని మొదలు పెట్టాం. రోజూ సాగుతున్న పనిని చూసి ఇవానోవిచ్ సంతృప్తిగా గొణుక్కునేవాడు.

కొత్త కాలనీలో కలకలం మొదలైంది. జీవం తొణికిసలాడింది. మరమ్మతులు పూర్తయి, సిద్ధంగా ఉన్న ఒక భవనంలోకి మా కాలనీలోంచి ఆరుగురు కుఱ్రవాళ్లు అక్కడికి తరలివెళ్లారు. చిన్న పొయ్యిమీద, చేతనైన విధంగా వంట చేసుకుంటూ రాత్రింబగళ్లు పొలానికి కాపలా ఉండేందుకు, రెండు కాలనీల మధ్య పారే కొలోమాక్ నదిలో అటూ ఇటూ పడవ నడిపేందుకు, గుఱ్రపుశాలలో పని చేసేందుకు వాళ్ళు సిద్ధపడ్డారు. బ్రాచెంకో ప్రతినిధిగా ఒప్రిష్కో క్రొత్త కాలనీలో గుఱ్రపుశాల బాధ్యత తీసుకున్నాడు. అయితే రోజూ బ్రాచెంకో కొత్త కాలనీకివెళ్లి గుఱ్రాల విషయంలో అక్కడి వారందర్నీ తిట్టి పోసేవాడు. వాటిని మరింత జాగ్రత్తగా చూసుకోమని ఆదేశాలు ఇచ్చేవాడు.

మొత్తానికి కొత్తకాలనీలో పని ఊపందుకొంది. మొత్తం భూమిని దున్ని విత్తులు నాటడం పూర్తయింది. అందులో పెద్ద నైపుణ్యం లేకపోయినా, మాకు కావలసిన ఆహారధ్యానాలు పండించేందుకు సన్నాహాలు పూర్తి చేశాం. కొంత భాగంలో బంగాళదుంప, తీపిదుంప నాటాం. ఇంత పనీ సవ్యంగా చేస్తున్నది కాలనీలో ఉన్న అరవైమంది పిల్లలే. రెండు కాలనీల మధ్య రాకపోకలు పెరిగాయి. కొత్త కాలనీకి పనికి వెళ్లిన వారు సాయంత్రం తిరిగి వస్తుంటే, రాత్రి మరో బృందం వారికి ఎదురుపడేది. మా బళ్లు అన్నింటినీ పశుగ్రాసం రవాణాకు వాడేవాళ్లం. మరమ్మత్తు సామాగ్రి కోసం బాడుగబళ్లు తీసుకున్నాం.

ఆదివారాలు టీచర్లు, పిల్లలూ అందరూ కొలమాక్ ప్రవాహంలో స్నానానికి వెళ్లేవారు. క్రమంగా గ్రామంలో కుఱ్రకారు కూడా అక్కడకు చేరడం మొదలైంది. మా వడ్రంగులు నది ఆ ఒడ్డున పడవ కోసం చిన్న రేవు తయారుచేశారు. దానిపై జి.సి. (గోర్కీ కాలనీ) అన్న అక్షరాలతో ఓ పతాకం

రెపరెపలాడేది. నదిలో పగలంతా అటువంటి జెండానే ఉన్న అకుపచ్చపడవ అటూఇటూ తిరిగేది. మెట్కా, విట్కాలు అ పడవ సరంగులు. వారికోసం మా ఆడపిల్లలు రంగురంగుల పీలికలతో ఆకర్షణీయమైన దుస్తులు కూడా రూపొందించారు.

కాలనీలో పగలూ రాత్రి పని సాగిపోయేది. గ్రామస్థులు మా కొలిమిలో తన పనిముట్లు మరమ్మత్తుల కోసం వచ్చిపోయేవారు. వ్యవసాయం ఎలా చేయాలో ఇవానోవిచ్ పెద్ద గొంతుకతో అందరికీ వివరిస్తూండేవాడు. ఎటు చూసినా కరబనోవ్, జడరోవ్, బెలూఖిన్ వంటి కుర్రవాళ్లు చేసే గమ్మత్తులపై చెలరేగే నవ్వులు మార్మోగేవి. అవతలి పైన్ వృక్షాలు గాలికి తలలూపుతూ వినిపించే సంగీతం దీనికి తోడయ్యేది.

అప్పటికే మురికి క్రిముల గతాన్ని మేం దాటిపోయాం. పిల్లల్లో ఎవరూ దురదలు, కురుపులతో బాధపడడంలేదిప్పుడు. కాలనీ మొత్తం శుభ్రంగా తళతళలాడుతుండేది. పిల్లలందరికీ చిరుగులు పడి అతుకులు వేసినవైనప్పటికీ, శుభ్రమైన దుస్తులు అమరాయి. డార్మెటరీల్లో ఉన్నవి పాత మంచాలే అయినా వాటిపై చక్కగా ఉతికిన దుప్పట్లు కనిపించేవి. ఇప్పుడు పగటివేళ ఎవ్వరూ వాటిపై కూర్చోరాదని నిబంధన అమలు చేస్తున్నాం. పిల్లలు కూర్చునేందుకు చెక్కబల్లలు ఏర్పాటయ్యాయి.

ఈ సరికి మా కొలిమిలో కొన్ని మార్పులు వచ్చాయి. తాగుబోతు అయిన పాత కమ్మరి గాలోవన్‌ను బహిష్కరించాం. కొత్తగా సెమ్యూన్ బొగ్గానెంకో అనే కమ్మరి బాధ్యతలు చేపట్టాడు. కమ్మరుల కుటుంబానికే చెందిన సెమ్యూన్ వర్క్‌షాప్‌లో సైనిక క్రమశిక్షణ అమలు చేసేవాడు. ఎక్కడా మురికి అన్నది లేకుండా వర్క్‌షాప్ తళతళలాడేది. అన్ని పనిముట్లూ ఎల్లప్పుడూ నిర్దేశిత స్థానాల్లోనే ఉండి తీరాలి. కొలిమి పక్కన నేలపై బొగ్గు ధూళి కూడ కనిపించకూడదు. ఇదీ అతని తీరు. గ్రామం నుంచి పనిముట్ల తయారీ, మరమ్మత్తుల కోసం వచ్చేవారితో కూడా అతను క్లుప్తంగా, అవసరమైనంత మేరకే మాట్లాడేవాడు. అనవసరబేరాలని నిరుత్సాహపరచేవాడు.

“ఇదేమీ చర్చి కాదు. ధర్మశాల కాదు. పిచ్చి బేరాలు చేయద్దు” అంటూ కటువుగా అనేవాడు.

ఆ వర్క్‌షాపు అవతల మా చక్రాల తయారీ కార్ఖానా ఉండేది. అక్కడ కోజిర్ నేతృత్వంలో పని ముమ్మరంగా సాగేది. చక్రాల కోసం అప్పట్లో చాలా మంది రైతులు ప్రయాసపడేవారు. కోజిర్ అనుభవజ్ఞుడైన పనివాడు కావడంతో ఆ గిరాకిని మేం తట్టుకోగలిగాం. కానీ అతనికి కొత్త సమస్య ఒకటి ఎదురైంది. మేం తీసుకున్న గుర్రాలకు గాను పట్టణంలో ఇస్తామని వొప్పుకున్న చక్రాల తయారీకి సంబంధించి సాంకేతిక సమస్య అది. దానిని అతనెలా సాధించాడన్నది పెద్ద ప్రహసనం.

21

వేసవి సాయంకాలం

వేసవి సాయంత్రాలు కాలనీలో అద్భుతంగా గడిచేవి. నీలిరంగు ఆకాశం, తేలికైన మబ్బులకు కనువిందైన నేపథ్యాన్ని సమకూర్చేది. అడవి ఆవల దిగ్మండలంలో మలిసంధ్య కాంతులు విరజిమ్మేవి. తోట అంచునగల సూర్యకాంతపుష్పాలు పగటివేడికి అలిసిపోయి తలలు వాల్చినట్టు అగుపించేది. సరస్సు వొడ్డున ఉన్న ఏటవాలు గట్టు కమ్ముకొంటున్న చిరుచీకట్లలో అదృశ్యమయేది. ఏ మూలనో చల్లగాలికి కూర్చున్న జనం లోగొంతుకులతో చేసే శబ్దాలు కలగాపులగంగా వినిపించేవి. వాళ్లెవరో, ఎంతమందో ఎంతకీ తెలిసేదేకాదు.

ఆ సమయంలో కాలనీ నిర్మానుష్యంగా ఉండేది. పిల్లలంతా ఏమయ్యారని ఆశ్చర్యం కలిగేది. నెమ్మదిగా కాలనీ ఆవరణ అంతా కలియదిరిగితే వాళ్లంతా అక్కడే ఉన్నారని అర్థమయ్యేది.

గుర్రపుశాలలో ఓ మూల ఐదుగురు కూర్చొని ఏదో మాట్లాడుకొనేవారు. అరగంటలో సిద్ధమయ్యే రొట్టెముక్కల కోసం ఎదురుచూస్తూ మరో గుంపు బేకరీలో కనిపించేది. నుయ్యి గట్టువైపు వెళితే ఎవరో నీటి కోసం వస్తూ ఉండేవారు. మరెవరో అటుగా నడుస్తూ ఉండేవారు. నీటికోసం వచ్చిన వారిని ఇంకెవరో ఆపేవారు. ఇద్దరూ నీళ్ళసంగతే మరిచి ఇంకేదో మాట్లాడుకునేవారు. ఈ కమ్మటి ఎండాకాలం సాయం సమయాన ఏది మాత్రం అముఖ్యమైనది! ఆవరణలో ఆ మూల సరస్సు గట్టు ఎటవాలుగా పైకిలేచే చోట కొందరు పిల్లలు ఎండిన చెట్టు కొమ్మపై కూర్చొని, మిత్యాగిన్ చెప్పే అద్భుతమైన కథలను నోరు వెళ్ళబెట్టుకొని, కళ్లు పెద్దవి చేసి వింటూ ఉండేవారు. "...అప్పుడో రోజు పొద్దున్న చర్చికి వచ్చిన జనానికి ఒక్క మతాచార్యుడు కనిపించలేదు! ఏమయ్యారు? అందరూ ఎక్కడికి అదృశ్యమయారు. కాపలావాడిని అడిగితే "ఏమో రాత్రి ఏ దయ్యమో వచ్చి వాళ్లని ఎత్తుకుపోయి ఉండాలి" అని సమాధానం. జనం భయంతో నోళ్లు తెరిచేవారు...." ఇలా మిత్యాగిన్ కథనం సాగిపోయేది. పిల్లలంతా ఆ కథలో లీనమై, తామూ అందులో పాత్రలై వాటి కష్టసుఖాలను తాము అనుభవించేవారు.

దూరంగా ఉన్న పొదల నుంచి పెద్ద పెట్టున ఆడపిల్లల నవ్వులు వినిపించేవి. బరున్ తనను వేళాకోళం చేస్తున్న ఆ పిల్లల్ని తప్పించుకుంటూ బైటికి ఉరికేవాడు.

కమ్మటి సంగీతంలా గడిచిపోయే ఈ సాయంత్రాలకు, కాలనీలో-పరిసరాల్లో జరిగే సంగతులకు పొంతన ఉండేది కాదు. కాలనీ సామాన్ల గది నుంచీ, పొరుగున గల రైతుల గోదాముల నుంచీ రోజూ ఎంతోకొంత దొంగతనం జరిగేది. మా పాత పిల్లలు దొంగతనాలకు స్వస్తి చెప్పినా ఎప్పటికప్పుడు వచ్చి చేరే కొత్త పిల్లలు మొదట్లో హస్తలాఘవం చూపేవారు. అయితే అతి త్వరలోనే వాడికి ఓ విషయం అర్థమయ్యేది. దొంగతనంచేసి పట్టుబడితే శిక్షించేది డైరెక్టర్ ఒక్కరే కాదని, మొత్తం కాలనీలోని పిల్లలంతా ఈ విషయాన్ని తీవ్రంగా పట్టించుకుంటారనీ తెలిసి వచ్చి వెంటనే ఆ పనులు మానేవారు. పట్టుబడిన దొంగల విషయంలో కాలనీ పిల్లలు అత్యంత కఠినంగా, క్రూరంగా ప్రవర్తించేవారు. అటువంటివారిని దారుణంగా కొట్టేవారు.

ఆ వేసవిలో కుజ్మాలెషీ అనే కొత్త కుర్రాడు వచ్చి చేరాడు. సగం జిప్సీలా ఉండే ఈ కుర్రవాడి కళ్లు అనుక్షణం చలిస్తూ పరిసరాలను గాలిస్తూ ఉండేవి. దొంగిలించేందుకు వీలుగా, కాస్త నదరుగా కనిపించే ఏ వస్తువునైనా మాయం చేసేందుకు వాడి చేతులు చురుకుగా కదిలేవి. అసలు వాడి చేతులు, వాడి మెదడు ఆజ్ఞానుసారం కాక, కళ్లు చెప్పినట్టు మాత్రమే పనిచేస్తాయని అందరూ వేళాకోళం చేసేవారు. వాడి తీరు కూడా అందరికి, వినోదంగానూ, బాధాకరంగానూ మారింది. ఏదో ఒక సమస్యలో ఇరుక్కోకుండా వాడి రోజు గడిచేది కాదు. బేకరీలో అక్కడి బాధ్యుల కళ్ల ఎదుటే రొట్టె కాజేసే ప్రయత్నం చేసేవాడు. స్టోర్ కీపర్ పక్కన ఉండగానే గుప్పెడు పంచదారను మాయం చేయబోయేవాడు. ఏ ప్రయత్నం చేసినా దొరికి పోయేవాడు. పెద్ద పిల్లలు కొట్టబోతే కుజ్మా వారివంక చూసి అమాయకంగా ఇకిలించేవాడు. "నన్ను కొట్టి ప్రయోజనం ఏమిటి? అసలు ఇలా ఎందుకు జరిగిందో నాకు తెలియదు. నా స్థానంలో ఉంటే మీరేం చేసేవారో తెలుసుకోవాలనుంది" అని నవ్వేవాడు.

కుజ్మాకు పదహారేళ్లు. ఆ చిన్న వయస్సులోనే వాడు అపారమైన అనుభవం గడించాడు. ఎంతెంతో దూరాలు ప్రయాణించాడు. అనేక జైళ్లలో కాలం గడిపాడు. వాడికి చదవడం, రాయడం వచ్చు. ఎప్పుడూ చిరునవ్వుతో కనిపించే ఈ కుర్రవాడు రివటలా ఉండి చురుకుగా కదిలేవాడు. భయం

అన్నా, సిగ్గు అన్నా వాడికి తెలియనే తెలియదు. వాడి ఈ లక్షణాలు చూసిన మిగిలిన పిల్లలు వాడి దొంగతనాలను క్షమించారు. కానీ రోజురోజుకు వాడి వ్యవహారం శృతి మించింది. వాడి ప్రతి పనీ అందరికీ ఆందోళన కలిగించేది. చివరికి ఒక రోజు వాడు మామూలుగా, తనదైన శైలిలో మూర్ఖంగా వ్యవహరించి తీవ్రంగా గాయపడి చాలాకాలం మంచాన పడ్డాడు.

వాడొక రాత్రి మా బేకరీలో దొంగతనానికి ప్రయత్నించాడు. అప్పటికే తరచు మాయమయ్యే రొట్టె విషయంలో ఆగ్రహంతో ఉన్న మా బేకర్ కోస్త్యావెట్కోవ్‌స్కీ తరచు ఇవానోవిచ్‌తో చివాట్లు తినేవాడు. ఈ బాధ భరించలేక వాడు బేకరీలో పడే దొంగలకోసం ఒక ఉచ్చు బిగించాడు. ఇది తెలియని కుజ్మా ఓ రాత్రి సరాసరి వెళ్ళి దాని బారిన పడ్డాడు. కోస్త్యా అమర్చిన ఆ ఉచ్చు అద్భుతంగా పని చేసింది. కుజ్మా కాలు దాదాపుగా విరిగిపోయింది. ఉదయమే వాడు అతి కష్టం మీద ఎకతెరీనా వద్దకు వచ్చి దెబ్బకు కట్టు కట్టించుకున్నాడు. చెట్టుపై నుంచీ పడటంతో దెబ్బ తగిలిందని ఓ కథ అల్లి చెప్పాడు. దెబ్బ తీవ్రత గమనించిన ఎకతెరీనా కట్టుకథను నమ్మలేదు. అయితే ఆమె పైకి ఏమీ అనలేదు. విషయం అర్థమైన కోస్త్యా సైతం అసలు సంగతి ఏమిటో తగిన సమయం వచ్చే వరకు ఎవరికీ చెప్పలేదు. పైగా తన ఖాళీ సమయం అంతా కుజ్మా మంచం పక్కనే గడుపుతూ వాడికి 'టామ్ సాయార్ సాహసాలు' చదివి వినిపించేవాడు.

పూర్తిగా కోలుకున్న తర్వాత కుజ్మాయే స్వయంగా జరిగిందేమిటో అందరికీ చెప్పాడు.

అంతా విన్న కరబనోవ్ పెద్ద మనిషి తరహాలో కుజ్మాకు ఓ సలహా చెప్పాడు "చూడు బాబూ నేను కూడా నీ అంత దురదృష్టవంతుడినై, ఇన్ని ఆపదలు వచ్చి ఉంటే ఈ సరికి దొంగతనాల జోలికి పోయేవాడ్ని కాదు" అన్నాడు.

కుజ్మా తన పరిస్థితిని వివరించాడు "నేనింత దురదృష్టవంతుడిని ఏమిటి? అన్న ఆశ్చర్యం నాకు కలుగుతుంది. బహుశా నేను నిజమైన దొంగను కాదేమో? అయినా చివరగా మరొకొన్ని ప్రయత్నాలు చేస్తాను. ఇంకా దురదృష్టం వెంటాడితే దొంగతనాలు మానేస్తాను" అని ఆగి నా వంక తిరిగి అడిగాడు "ఏమంటారు ఆంటన్ సెమ్యోనోవిచ్" అని.

"ఇంకొన్ని ప్రయత్నాలు చేస్తావా? అయితే ఈ రోజే ప్రయత్నించు. ఏమన్నా లాభం ఉంటుందేమో చూడు. ప్చ్. ఉండదు. ఎందుకంటే అటువంటి వ్యవహారాలకు నువ్వు తగవు" అని వాడికి నచ్చచెప్పాను.

"నిజంగా ప్రయత్నం వృథా అంటారా?" దిగులుగా అడిగాడు కుజ్మా.

"అవును. ఉత్త వృథా. ఆ సంగతి వదిలై. నువ్వు మంచి కమ్మరివి కాగలవని సెమ్యోనో పెట్రోవిచ్ చెప్పాడు."

"నిజంగా?"

"అవును, నిజం. కాకపోతే ఇందాకే నువ్వు వాడి వర్క్‌షాపులోకి వెళ్ళి రెండు పంపు తలకాయలు ఎత్తుకొచ్చావట. అవి బహుశా నీ జేబుల్లోనే ఉండి ఉంటాయి" అన్నాను.

వాడు సిగ్గుతో ఎర్రబారిన మొహంతో ముందుకువచ్చాడు. కరబనోవ్ వాడి జేబులు వెదికి వాటిని బయటకు లాగాడు.

కాలనీకి సంబంధించి ఇంతకంటే పెద్ద ప్రమాదం జరగకున్నా, పరిసరాల రైతులకు మాత్రం ప్రతిరోజు ఏదో స్థాయిలో నష్టం తప్పడంలేదు. అయితే గతంలోలా ఆ కుర్రవాళ్ళ దొంగతనాలు బయట పడటంలేదు. దానికి కారణం వాళ్ళు ఇప్పుడు మునుపటి కంటే పకడ్బందీగా, ఒక వ్యూహం ప్రకారం తమ కార్యకలాపాలు సాగించడమే. నాకు తెలిసి ప్రస్తుతం బాగా అనుభవజ్ఞులైన సీనియర్లే

దొంగతనాలకు పాల్పడుతున్నారు. దారి తప్పి చిన్నపిల్లల్లో ఎవరైనా అందుకు ప్రయత్నించినా పెద్ద కుర్రవాళ్ళు వాళ్ళని నిరోధిస్తున్నారు. వాళ్ళను దొంగలుగా ప్రకటించి కఠినంగా శిక్షిస్తున్నారు. దీనితో దొంగతనాలు యథేచ్ఛగా సాగుతున్నా ఎవరూ పట్టుబడటంలేదు. సొత్తు పోగొట్టుకుంటున్న రైతులక్కూడా ఇదివరలోలా కాలనీ పిల్లలపై ఫిర్యాదు చేసేందుకు ఎటువంటి ఆధారాలూ ఉండడంలేదు. ఈ మొత్తం తతంగాన్ని నడిపిస్తోన్నది, పర్యవేక్షిస్తున్నదీ మిత్యాగిన్ అని నాకు స్పష్టంగా తెలుసు.

మిత్యాగిన్ బాల్యం నుండే ఆరితేరిన దొంగ. వాడు కాలనీ సంపద జోలికి రావడం లేదంటే దానికి కారణం వారికి కాలనీ వాసులంటే ఉన్న ప్రేమాభిమానాలే. కాలనీలో దొంగతనానికి పాల్పడడం అంటే సహచరులకు నష్టం కలిగించడమని అర్థం కావడమే. అయితే రైతుల ఇళ్లను దోచుకోవడంలో, పట్టణంలో మార్కెట్లలో తన చేతివాటాన్ని ప్రదర్శించడంలో వాడికి ఇటువంటి అభ్యంతరాలు లేవు. వాడికి ఇంకా నేనంటే అభిమానమే. కాని వాడి దొంగబుద్ధి గురించి నేను ఏనాడూ వాణ్ణి మందలించలేదు. ఎందుకంటే వాడితో పోట్లాడినా ప్రయోజనం ఉండదు కనుక. అయితే వాడి వ్యవహారం నాకు బాగా ఆందోళన కలిగిస్తోంది. వాడు బాగా తెలివైనవాడు. దాని వల్ల కాలనీలో పిల్లలంతా వాడిని గొప్పగా చూసేవారు. తన దొంగతనాలను సాహసకృత్యాలుగా అభివర్ణించి ఆ పనిలో ఉండే సరదాను వాడు పిల్లలందరికీ వివరిస్తుంటే వాళ్ళకి దొంగతనం ఎంతో ఆకర్షణీయమైన వ్యవహారంగా కనిపించసాగింది. అందుకే ఎప్పుడూ వాడిచుట్టూ పిల్లలు గుమిగూడి కనిపించేవారు. వాళ్లందరితో మిత్యాగిన్ ఏం మాట్లాడుతున్నాడో, అందరూ కలిసి ఆ రాత్రి ఏం చేయబోతున్నారో అని నిరంతరం ఆందోళన చెందేవాడిని.

వీలైనంత త్వరలో మిత్యాగిన్‌ను కాలనీ నుంచీ పంపకపోతే మొత్తం వాతావరణం నాశనమవుతుందని నాకు అర్థం అవుతూనే ఉంది. ఈ విషయంలో నా నిస్సహాయత చూసి నాకు కోపం వచ్చేది. ఇక కాలనీలో ఉండడం ఎవరికీ శ్రేయస్కరంకాదని మిత్యాగిన్‌కు కూడా తెలిసే ఉండాలి. అయినా మిత్రబృందం కోసమే వాడు కొనసాగుతున్నాడనిపించింది. కాలనీలో చిన్న పిల్లలంతా అనుక్షణం వాడిని వెన్నంటే ఉండేవారు మరి. నన్ను మరింత బాధించిన విషయం ఏంటంటే మా కాలనీలో నేను కాస్త ఆధారపడదగిన కుర్రవాళ్ళు అయిన కరబనోవ్, వెర్షనోవ్, వోలోఖోవ్ సైతం వాడి ఆలోచనాధోరణికి ప్రభావితులు అవడం. అందరిలోనూ మిత్యాగిన్‌ను గట్టిగా వ్యతిరేకిస్తున్నది బెలూఖిన్ ఒక్కడే.

వేసవి అంతానికి మిత్యాగిన్ ముఠా కార్యకలాపాలు మరింత శృతిమించాయి. పొరుగున గల పుచ్చకాయపొలాల్లో వీళ్ల స్వైరవిహారం మొదలైంది. నిజానికి ఈ పొలాల్లో చిన్న చిన్న దొంగతనాలు ఊళ్లో మామూలే. అయితే రైతులు దాన్ని పట్టించుకొనేవారు కాదు. రెండున్నర ఎకరాల పొలంలో ఒక్కోసారి దాదాపు 20 వేల పుచ్చకాయలు పండేవి. అందులోంచి కుర్రవాళ్లు ఓ వందో, రెండు వందల కాయలో ఎత్తుకుపోయినా రైతులు చూసీచూడనట్టు ఉండేవారు. అయితే ఈ పొలాల మధ్య ఎత్తులో ఒక పాకవేసి అందులో పేరుకి ఒక కాపలాదారుని ఉంచేవారు. సాధారణంగా ఈ పాకలో కునికిపాట్లు పడే వృద్ధులు పరిసరాలని పెద్దగా పట్టించుకునేవారు కాదు.

కాని ఓసారి మాత్రం ఇటువంటి వృద్ధ కాపలాదారు ఒకరు నా వద్దకు వచ్చాడు. “మళ్ళీ నిన్న మీ పిల్లలు మా పొలంపై దాడిచేశారు. ఎందుకీ దొంగతనం? వాళ్లని నా దగ్గరకి రమ్మనండి. ఉన్నవాటిల్లో బాగా పండిన పెద్ద పుచ్చకాయలు నేనే స్వయంగా ఇస్తాను” అని ప్రతిపాదించాడు.

అదే విషయాన్ని నేను పిల్లలకు చెప్పాను. దీని ద్వారా అయినా వాళ్లు దొంగదాడులు

మానతారేమోననే చిరు ఆశతో. నిజంగానే వాళ్లు ఉత్సాహం చూపారు. అలాగే చేస్తామన్నారు. అందరూ కలిసి దొంగతనాలను గట్టిగా వ్యతిరేకించే బెలూఖిన్‌ను ఆ సాయంత్రం ఆ వృద్ధుడి పాకకు పంపారు. వాడు పెద్దమనిషి తరహాలో అక్కడకు వెళ్ళి రైతు ఇచ్చిన పుచ్చకాయ తింటూ వ్యవసాయం గురించి, నిరుడు పంటకీ, ఈసారి పంటకీ ఉన్న తేడా గురించి, మొత్తం మీద మార్కెట్టులో డిమాండ్ గురించి హుందాగా మాట్లాడి తిరిగివచ్చాడు. రైతు తననెలా ఆదరించాడో అందరికీ ఆనందంగా వివరించాడు. మర్నాడు కూడా వాడినే వెళ్లమని మిగిలిన వాళ్లు బలవంతం చేశారు. వాడు వెళ్ళాడు కూడా. ఈసారి వృద్ధుడు బెలూఖిన్‌ను చూడగానే తుపాకి తీశాడు. దొంగవేషాలు వేయడానికి మళ్లీ వచ్చావా? అని వాడిని నిలదీశాడు. బెలూఖిన్ నిర్ఘాంతపోయాడు.

"నువ్వు నా ఎదుట కూర్చొని దొంగకబుర్లు చెబుతూంటే మిగిలిన కుర్రవాళ్లు పొలంలోపడి సగంకాయలు ఎత్తుకుపోయారు. ఇంత మోసం ఎలా చేశావ్? ఈసారి కనిపిస్తే కాల్చివేస్తాను" అంటూ ఆగ్రహంతో ఊగిపోయాడు.

వాడు వెర్రిమోహంతో కాలనీకి తిరిగివచ్చి, తననూ, ఆ వృద్ధుడినీ మోసం చేసినందుకు మిగిలినవాళ్లని కోపంతో దూషించడం మొదలుపెట్టాడు. మిగిలిన కుర్రవాళ్లు మాత్రం గట్టిగా పగలబడి నవ్వుతూ వాడిని వేళాకోళం చేశారు.

"నువ్వు దొంగతనం చేయలేదు. పైగా పొలంలో ఉన్న అతి పెద్ద పుచ్చపండు కడుపారా తిన్నావు. అంతా చట్టబద్ధంగానే చేశావు. ఇంకా గొడవ చేస్తావెందుకు?" అని హేళన చేశారు.

ఆ తరువాత ఆ వృద్ధుడు మళ్ళీ నా దగ్గరకు రాలేదు. కానీ రాత్రిళ్ళు పుచ్చకాయల దొంగతనం నిరాటంకంగా సాగిపోతోందని స్పష్టంగా తెలుస్తూనే ఉంది. ఓ రోజు ఉదయం లేచేసరికి డార్మెటరీ నేలనిండా పుచ్చకాయల తొక్కులు కనిపించాయి. నేను పిల్లలందరికీ గట్టి హెచ్చరిక చేశాను. మరోసారి ఇలాంటిది జరిగితే సహించనని. ఆ తరువాత పుచ్చకాయల తొక్కులు మళ్ళీ అలా నేలమీద కనిపించలేదు. కాని నెమ్మదిగా విషయం తెలిసింది. పిల్లలు రాత్రంతా తాము తినిపారేసిన పుచ్చకాయల తొక్కును ప్రొద్దున్నే మా గుర్రాలకు, ముసలి ఆవుకు మేతగా వేస్తున్నారని.

ఈలోగా కుర్రవాళ్ల దృష్టి పక్కన ఉన్న పొలాన్ని దాటి, ఆవతల ఉన్న మరో పొలంపై పడింది. వాళ్ళు రాత్రిళ్లేకాక, పట్టపగలు కూడా పొలాలపై పడి నిజమైన దోపిడి దొంగల్లా వ్యవహరిస్తున్నారని బయటపడింది. రెండు రోజుల తరువాత నిజమైన ప్రమాదం ఎదురైంది. పక్క పొలంలోని వృద్ధుడు తనకు తోడుగా మరో ఇద్దరు యువకులను కాపలాకు తెచ్చుకొన్నాడు. వాళ్ల దగ్గర తుపాకులు కూడా ఉన్నాయి. ఇది కాలనీవాళ్లకు పెద్ద సవాలుగా కనిపించింది. ఇకనేం ఆ రాత్రే వాళ్లు నిజమైన యుద్ధానికి సిద్ధమయ్యారు. దాదాపు 30-40 మంది కుర్రవాళ్లు ఆ రాత్రి పొలం సరిహద్దులను సమీపించి సుశిక్షితులైన సైనికుల్లా నేలమీద పడుకొని తగిన సమయం కోసం ఎదురుచూశారు. దీనిని పసిగట్టిన కాపలాదార్లు గాలిలోకి తూటాలు పేల్చగానే, వాళ్లంతా కేకలు పెడుతూ వారిపై దాడి ప్రారంభించారు. వెంటనే కాపలాదార్లు తుపాకులు కూడా వదిలి అడవిలోకి పారిపోయారు. ఎవరు చేశారో తెలియదుకానీ కుర్రవాళ్ళలో ఎవరో ఆ పాకకు నిప్పంటించారు.

22

బహిష్కరణ

ఇంకా ఆలోచిస్తూ సమయం గడిపితే మరింత ప్రమాదం తప్పదని తేల్చుకొన్నాను. మిత్యాగిన్‌ను తక్షణం సాగనంపాలి. ఇప్పటికే నేను చేసిన ఆలస్యం కాలనీ వాతావరణాన్ని ఎంతగా ధ్వంసంచేసిందో

అర్థమైంది. నిరంతరం చిల్లర దొంగతనాల గురించి ఆలోచిస్తూ, ఉత్సాహంగా చర్చలు జరుపుతూ, దీనినే సాహసకృత్యంగా భావిస్తున్న పిల్లల్లో నైతిక పతనం ప్రారంభమైందని చూడగలిగే కళ్ళకు అర్థం అవుతుంది. పిల్లల్లో మునుపటి హుందాతనం, గాంభీర్యం క్రమంగా అదృశ్యమవు తున్నాయి. వారి మాటల్లో, చేతల్లో, పనితీరులో ఒక రకమైన వెకిలితనం కనిపిస్తోంది. ఇతర విషయాలపై ఆసక్తి కొరవడడం, పనిపై శ్రద్ధ తగ్గడం కళ్లెదుట స్పష్టంగా తెలుస్తోంది. నిన్న మొన్నటి వరకూ ఈ చిల్లర దొంగతనాలను వ్యతిరేకించిన బెలూఖిన్, జదరోవ్ వంటి కుర్రవాళ్లు సైతం ఈ కార్యకలాపాలను మౌనంగా ఆమోదిస్తున్నారు. వారంత వారు స్వయంగా ఈ కార్యకలాపాల్లో పాల్గొనకపోయినా ఈ ధోరణి వారి వ్యక్తిత్వాలను ప్రభావితం చేస్తోంది. పిల్లలందరిలో చదువుపై, సాహిత్యంపై శ్రద్ధ పూర్తిగా తగ్గిపోయింది. ఎప్పుడూ చవకబారు సాహసకృత్యాల గురించే వాళ్లు చర్చించేవారు. దీనంతటి ప్రభావం కుర్రవాళ్ల నడతపై, వారు దుస్తులు ధరించే తీరుపై కూడా ప్రస్ఫుటమైంది.

నేను మిత్యాగిన్‌ను సాగనంపేందుకు అవసరమైన పత్రాలు సిద్ధం చేశాను. వాడిని పిలిచి ఆ పత్రాలతోపాటు దారి ఖర్చుల కోసం ఐదు రూబుళ్లు ఇచ్చాను. తాను ఒడెస్సా పట్టణానికి వెళ్తానని మిత్యాగిన్ చెప్పాడు. మిత్రులను చివరిసారిగా కలుసుకుంటానన్నాడు. అందరూ వాడికి ఎలా వీడ్కోలు చెప్పారో నాకు తెలియలేదు. కానీ చాలామంది వాడు అలా దూరం కావడంతో నిస్పృహ చెందారని తెలుస్తూనే ఉంది.

రెండు రోజుల తర్వాత ఓ రాత్రి బాగా ఆలస్యంగా నా పని పూర్తయ్యింది. నిదురకు సిద్ధమవుతూ కిటికీలోంచి బయటకు చూస్తూ అశ్వశాలలో దీపం వెలుగుతూ కనిపించింది. నేను బ్రాచెంకోను పిలిచి అక్కడ ఎవరున్నారని అడిగాను.

"మిత్యాగిన్" అని వాడు బదులిచ్చాడు.

నేను అక్కడికి వెళ్లాను. అక్కడ మిత్యాగిన్‌తోపాటు కరబనోవ్, వోలోఖోవ్, కుజ్మా, ప్రిఖోడ్కో ఒసాడ్చీలు ఉన్నారు. అందర్నీ ఆఫీసు గదికి రమ్మని ఆదేశించాను.

కరబనోవ్ అభ్యంతరం వ్యక్తం చేశాడు "నేనూ, మిత్యాగిన్ వస్తే చాలు" అన్నాడు.

సరేనన్నాను.

వారిద్దరే నా గదికి వచ్చారు.

కరబనోవ్ నా ఎదురుగా కూర్చొన్నాడు. మిత్యాగిన్ దూరంగా నిలబడ్డాడు.

"కాలనీకి మళ్లీ ఎందుకు వచ్చావ్?" అని మిత్యాగిన్‌ను ప్రశ్నించాను.

"ఏదో... పనుంది" అన్నాడు వాడు.

"ఏం పని?"

హటాత్తుగా కరబనోవ్ బల్లపై చరిచి; "అదంతా అనవసరం. నేనూ మిత్యాగిన్‌తో వెళ్లిపోతాను" అని గట్టిగా అరచి చెప్పాడు. వాడి కళ్లు వింతగా మెరుస్తున్నాయి. ఇటువంటి నాటకీయత అంటే కరబనోవ్‌కి చాలా ఇష్టం. నేనేదో తమకి అన్యాయం చేసినట్టు వాడు మొహం పెట్టాడు. నొచ్చుకొన్న వాడి మొహం చూసి నా తప్పుని గ్రహించి, మిత్యాగిన్‌ను కాలనీలోనే ఉండనిస్తాననీ వాడి అంచనా.

నేను లేచి వాళ్లని సమీపించాను.

"మీ దగ్గర రివాల్వర్ ఉందా?" అని ప్రశ్నించాను.

లేదు. ఇద్దరూ ముక్తకంఠంతో చెప్పారు.

జేబులు చూపండని ఆదేశించాను. "సోదా చేస్తారా?" అని కరబనోవ్ సవాలు చేశాడు.

"జేబులు చూపించండి" కటువుగా అన్నాను.

"చూస్కోండి" అని అరుస్తూ కరబనోవ్ తన ప్యాంటు జేబుల్ని బయటకు లాగాడు. కొన్ని రొట్టె తుంపులు నేల మీదకు రాలాయి. వాణ్ణి వదలి మిత్యాగిన్ దగ్గరికెళ్లాను. వాడూ తన జేబులు చూపించి ఒక పర్సు, కొన్ని తాళాలు బయటకు తీసి, "ఇవే ఉన్నాయి" అన్నాడు.

నేను మాట్లాకుండా వాడి ప్యాంటు బెల్టు తడిమి చిన్న బ్రౌనింగ్ రివాల్వర్ బయటకులాగాను. "ఎవరిది ఇది?" అని ప్రశ్నించాను.

"నాదే ఆ రివాల్వర్" అన్నాడు కరబనోవ్.

"మరి అబద్ధం ఎందుకు చెప్పావ్. సరే, కాలనీ నుంచీ నువ్వు పోతానంటావు. అంతేగా, నీ యిష్టం" అంటూ బల్ల ఎదుట కూర్చుని కరబనోవ్‌ని కూడా విడుదల చేస్తూ పత్రాలు తయారుచేశాను. వాడు చెయ్యిజాపి నాకు షేక్‌హ్యాండ్ ఇచ్చాడు. నా చేతిని గట్టిగా నలిపివేస్తూ బలంగా ఊపాడు. "వెళ్తాం. సెలవ్" అంటూ బయటికి వెళ్లి, చీకట్లో కలిసిపోయాడు. మిత్యాగిన్ మౌనంగా గదిలోంచి బయటకు నడిచాడు.

తర్వాత కొద్ది రోజులకే వాళ్లిద్దరూ పెద్ద దూరం వెళ్లలేదనీ, పైగా రహదారిపై దోపిడీలు సాగిస్తున్నారని తెలిసింది.

23

కారుచీకట్లో కాంతిరేఖలు

కాలనీ చరిత్రలోనే అత్యంత నిరాశాజనకమైన రోజులవి. కరబనోవ్, మిత్యాగిన్‌లను బయటకు గెంటాలనేది నిజంగానే బాధాకరమైన నిర్ణయం. కాలనీ మొత్తం మీద అందరికంటే చురుకైన పిల్లల్ని సాగనంపవలసి వచ్చింది. మొత్తం పిల్లలందరినీ ప్రభావితం చేయగల ఆ ఇద్దరూ దూరం కావడం మిగిలిన వారందరినీ పూర్తి విషాదంలో ముంచింది. వాళ్లిద్దరూ అద్భుతమైన పనివాళ్లు కూడా. శరీరాన్ని దాచకుండా, నిజాయితీగా శ్రమపడడం కరబనోవ్ పద్ధతి. పనిపై వాడికి గల ప్రేమ, శ్రద్ధ ఒక అంటువ్యాధిలా పరిసరాలకు వ్యాపించేది. వాడి పనితీరు మిగిలిన అందరిలో కొత్త స్ఫూర్తినీ, ఉత్సాహాన్ని కలిగించేది. ఈ విషయంలో మిత్యాగిన్ కూడా తక్కువేం కాదు. ఏ పనైనా అతి సులభంగా, లాఘవంగా, వేగంగా పూర్తి చేసేవాడు. ఈ ఇద్దరు కాలనీ ప్రతి అవసరాన్ని పట్టించుకొని, తక్షణం స్పందించేవారు. రోజువారీ తతంగంలో ఎక్కడ ఏ ఇబ్బంది ఎదురైనా వెంటనే అక్కడ ప్రత్యక్షమయ్యేవారు.

వారి నిష్క్రమణతో కాలనీలో పెద్ద శూన్యం ఏర్పడింది. బతుకు నిస్సారంగా, నిస్తేజంగా మారింది. అసలే పుస్తకాల పురుగైన వెర్షనోవ్ మరింత లోతుగా పుస్తక ప్రపంచంలో కూరుకు పోయాడు. అప్పటివరకూ సరసమైన ఛలోక్తులతో అందరినీ నవ్వించి, కవ్వించిన బెలూఖిన్‌లో నిర్లిప్తత, నిరాశావాదం చోటుచేసుకున్నాయి. వాడు తన చతురతను వ్యంగ్యాస్త్రలు విసిరేందుకు, హేళనగా మాట్లాడేందుకు ఉపయోగిస్తున్నాడు ఇప్పుడు. వోలోఖోవ్, ప్రిఖోద్కో ఒసాద్చీ వంటి పిల్లలు ముఖాలు ముడుచుకొని, అందరితో తగుమాత్రం మాట్లాడుతూ, మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తున్నారు. చిన్నపిల్లలైతే ఎప్పుడూ విసుగుతో, నిర్లిప్తంగా కాలం గడుపుతున్నారు. మొత్తం మీద కాలనీలో జీవం అదృశ్యమైంది. పిల్లల్లో మునుపటి ఉత్సాహం నశించింది. ఆ అరుపులూ, కేరింతలూ, అమాయకపు నవ్వులు ఇక వినిపించడం లేదు. సాయంవేళల్లో కాస్త నలుగురునీ పోగుచేసి సరదాగా

కాలం గడిపే వాతావరణం లేదు. ఎవరికివారు దీర్ఘాలోచనలో తమ పనుల్లో నిమగ్నమై ఉండేవారు. ఒక్క జడరోవ్ మాత్రం తన ధోరణిని మార్చుకోకుండా హాయిగా నవ్వుతూ కనిపించేవాడు. కానీ ఏం లాభం! మరెవ్వరూ అతని చిరుదరహాసాన్ని పంచుకొనేవారు కాదు. దాంతో వాడు కూడా అందరితో కలవడం మాని తన ఒంటరితనంలోనే నవ్వులు చిందిస్తూ పొద్దుపుచ్చేవాడు.

ఈ వాతావరణానికి తోడు వ్యవసాయానికి సంబంధించిన వైఫల్యాలు కూడా తోడవడం మరింత విషాదాన్ని జతచేసింది. మా పొలాన్ని గ్రామస్థుల నుంచి స్వాధీనం చేసుకొనే నాటికే దాని నిండా కలుపు మొక్కలు విచ్చలవిడిగా పెరిగి ఉన్నాయి. వాటిని తొలగించేందుకు మా పిల్లలు నిరంతరం శ్రమించినా పెద్ద ప్రయోజనం లేకపోయింది. శీతాకాలం పంట పొలాల్లో అసలు పంటకంటే ఈ కలుపే ఎక్కువైంది. మొక్క జొన్న పరిస్థితి మరింత అధ్వాన్నం. బంగాళా దుంపల సంగతి చెప్పనే అక్కర్లేదు. ఈ నిరాశామయ వాతావరణమే మా టీచర్ల విభాగాన్ని ఆవరించింది.

బహుశా మేమంతా బాగా డస్సిపోయామేమో! కాలనీ ప్రారంభించిన నాటి నుంచీ నేటి వరకూ మాలో ఎవరమూ సెలవనేది తీసుకోలేదు. అయినా టీచర్లెవరూ తాము అలసిపోయామని ఫిర్యాదు చేయలేదు. కానీ, మేం చేస్తున్న పనివల్ల నిజంగా ఏమైనా ఉపయోగం ఉందా అన్న అనుమానం వాళ్లలో మళ్ళీ తలెత్తింది. 'ఇటువంటి' పిల్లలకు సామాజిక విద్యను అందించడం సాధ్యమేనా అన్న అనుమానం మళ్లీ నిదురలేచింది.

"లాభం లేదు. ఈ ప్రయత్నం అనవసరం" అని ఇవానోవిచ్ అనేవాడు. "మనమంతా కరబనోవ్‌ను చూసి గర్వపడేవాళ్లం. చివరికి ఏమైంది. వాణ్ణి బయటకు గెంటవలసి వచ్చింది. అటువంటప్పుడు మిగిలినవారి గురించి కొత్త ఆశలు పెంచుకోవడం; శ్రమపడటం అనవసరం" అని తేల్చేవాడు.

చివరకు ఎకతెరీనా సైతం పూర్తి నిరాశకు గురైంది. అసలామెకు తను చేస్తున్న పనిమీద అవిశ్వాసం మొదలైంది.

"చూడండి! మనమంతా పెద్ద తప్పు చేస్తున్నామేమో. అసలు సమిష్టి భావనే పొరపాటేమో. మనమంతా సమిష్టి గురించి మాట్లాడతాం. కలలు కంటాం. మన కలలను సాకారం చేసుకోగలమని మనల్ని మనం నమ్మించుకుంటున్నాం" అన్నదావిడ.

నేను ఆమె ఆలోచనాసరళిని మార్చేందుకు ఒక ప్రయత్నం చేశాను. "సరే. సమూహం, సమిష్టి అన్న భావనలే అబద్ధమనుకొందాం. మరి ఇదంతా ఏమిటి? ఇక్కడ అరవై మంది పిల్లలు కలిసి బతుకుతున్నారు. ఉమ్మడిగా కృషి సాగిస్తున్నారు. వారి మధ్య స్నేహబంధం ఉంది. మరి ఇదంతా అవాస్తవమేనంటారా?" అని ప్రశ్నించాను.

"అర్థం కావడంలేదా? మీకు. ఇదంతా పెద్ద నాటకం. ఒక ఆట. మనమంతా దానిలో నిమగ్నమయ్యాం. పిల్లలు కూడా ఉత్సాహంతో అందులో భాగస్వాములయ్యారు. కానీ ఇదంతా తాత్కాలికమే. మనమంతా ఈ ఆటలో కలిసిపోయాం. అందరికీ విసుగు కలుగుతోంది. రేపు పిల్లలకీ ఆ విసుగు తప్పదు. దీంతో అందరూ కలల నుంచీ మేలుకుంటారు. ఇది అతి సాధారణమైన పిల్లల వసతి గృహంలా మిగిలిపోతుంది" అంది ఎకతెరీనా.

"ఒక ఆట విసుగుపుడితే; మరో ఆట మొదలు పెట్టవచ్చు" అంటూ మా టీచర్ లిడియా కొంత ప్రోత్సహించే ప్రయత్నం చేసింది.

మేమంతా విచారంగా నవ్వుకొన్నాం. అయితే ఏమైనా సరే ఈ ప్రయత్నాన్ని మధ్యలో విరమించే ఉద్దేశం నాకు ఏ కోశానా లేదు.

మళ్లీ ప్రయత్నించాను "ఇదంతా వెన్నెముకలేని మేధోచింతనేమో ఆలోచించండి" అని ఎకతెరీనాతో అన్నాను. మన మానసిక స్థితి, విషాదం, సంతోషం, ఆనందం, దుఃఖం వచ్చిపోయే దశలు అంతే. దాన్ని బట్టి మనం కొన్ని నిర్ధారణలకు రావడం తప్పు కాదా? మీరు కరబనోవ్, మిత్యాగిన్‌లను ప్రభావితం చేయగలమనుకొన్నారు. అంతా అనుకున్న విధంగా రూపుదిద్దు కోవాలని, లక్ష్యాలు సాధించాలని పెద్ద ఆశలు పెంచుకొన్నప్పుడు చివరికి మిగిలేది ఇదే. నిరాశ, నిస్పృహ, అపనమ్మకం... అంతే కదా!" అన్నాను.

మిగిలిన వారిని ఆ నిరాశ నుంచీ గట్టెక్కించేందుకు ప్రయత్నిస్తున్నానే కానీ, నా మీద నాకు మునుపటి విశ్వాసం లేదేమో అనిపించింది. ఒక జదరోవ్ కోసం, మరో బెలూఖిన్ కోసం ఇంత శ్రమపడడం, ఇన్ని త్యాగాలకు సిద్ధపడడం నిజంగా అవసరమా? అన్న అనుమానం నాకూ ఉంది. అయితే ఎంతటి విపత్కర పరిస్థితుల్లోనూ సహనాన్ని కోల్పోకుండా నిలబడి ఉండే పాత అలవాటు నన్ను ఆదుకొంది. అందుకే కాలనీవాలసుల, టీచర్ల ఎదుట నేనింకా ఉత్సాహంగా, పూర్తి నమ్మకంతో ఉన్నట్టు కనిపించేందుకు ప్రయత్నించే వాడిని. ఇవన్నీ తాత్కాలిక సమస్యలేననీ, త్వరలోనే అందరం వీటినుంచి బయటపడగలమని వారిని నమ్మించేందుకు కృషి చేసేవాడిని. వాళ్లు నన్ను ఎంతవరకు నమ్మారో తెలియదుకానీ, ఆ నిరాశను, కష్టాలను మౌనంగా సహించి నా వెంట నిలిచారు. అందుకు నేటికీ నేను ఆ అధ్యాపకబృందానికి తలవంచి నమస్కరిస్తాను.

పరిస్థితులు ఇలా ఉన్నా, కాలనీలో సమయపాలన, క్రమశిక్షణ ఏ మాత్రం దెబ్బతినలేదు. టీచర్లంతా ఎవరిపనులకు వారు ఖచ్చితంగా హాజరయ్యేవారు.

పిల్లల్లో ఉత్సాహం, నాటి ఉద్రేకం అదృశ్యమైనా పనులు మాత్రం అనుకున్న విధంగా జరిగిపోయేవి. మంచి స్థితిలో ఉన్న యంత్రం పనిచేసినట్టు పిల్లలు తమ విధులను ఎలాంటి లోపంలేకుండా నిర్వర్తించేవారు. కాలనీలో అందరికీ ప్రీతిపాత్రులైన, సీనియర్లు ఇద్దరిని క్రమశిక్షణ ఉల్లంఘించినందుకు బయటకు పంపడం పిల్లలపై ఎంతో కొంత ప్రభావాన్ని చూపింది. ఆ సంఘటన తరువాత కాలనీ పిల్లలు పొరుగున గల పొలాలపై దాడులు పూర్తిగా నిలిపివేశారు. రైతుల గోదాముల నుంచి దొంగతనాలు అన్నది గతంలో భాగమైంది. పిల్లల్లో ఉత్సాహం అదృశ్యమైన విషయాన్ని నేనసలు గుర్తించనట్టే వ్యవహరించాను. పైగా ఈ కొత్త క్రమశిక్షణే నేను కోరుకుంటున్నదనీ, పొరుగున ఉన్న రైతులతో వ్యవహరించవలసిన తీరు ఇదేననీ నేను భావిస్తున్నట్టు ప్రవర్తించాను. వ్యవహారాలన్నీ సజావుగా, సక్రమంగా సాగుతున్నట్టే నేనూ పరిగణిస్తున్నానని పిల్లలు అనుకునేలా సంతోషంగా కనిపించేవాడిని.

ఈలోగా అనేక ముఖ్యమైన పనులు పూర్తిచేయాల్సి వచ్చింది. కొత్త కాలనీలో మేం ఒక 'ఔట్‌హౌస్' నిర్మాణం ప్రారంభించాం. పాత ఎస్టేట్ శిథిలాలను తొలగించిన తరువాత ఆవరణను అంతా సమంచేయడం, దారులవీ వేయడం, కంచెలు ఏర్పాటు చేయడం వంటి పనులు చేపట్టాం. కొలోమాక్ నదిపై అది సన్నగా ప్రవహించే చోట ఒక వంతెన నిర్మాణం సాగుతోంది. కమ్మరి వర్క్‌షాప్‌లో కూడా పని ఉధృతంగా సాగుతోంది. మా వ్యవసాయపనిముట్లు మరమ్మతులు పూర్తయ్యాయి. ఎస్టేట్‌లోని ఇళ్ల మరమ్మతులు కూడా పూర్తి కావడంతో వాటికి తుది మెరుగులు దిద్దే కార్యక్రమం వేగంగా సాగుతోంది. పిల్లల్లో ఎంతటి విచారం గూడు కొట్టుకొని ఉన్నా వారిని అందులోంచి బయటకు తెచ్చేందుకు, ఆలోచించే వ్యవధి కూడా మిగలకుండా ఉండేందుకు నేను వారిపై పనిభారం పెంచాను. దాని వల్ల కాలనీ పనిపాటల్లో మళ్లీ మునుపటి వేగం, క్రమబద్ధత పెరగాలని నా ఉద్దేశం.

పిల్లల శారీరిక ధారుఢ్యాన్ని పెంచేందుకు వారు మరింత క్రమశిక్షణతో మెలిగేందుకు వారికి సైనిక శిక్షణ అవసరమని ఎందుకో నాకు తట్టింది. అందుకు వారిచే రోజూ మిలిటరీ డ్రిల్ చేయించేవాడిని. అంతకుముందు ఎన్నడూ నాకు అటువంటి అనుభవం లేదు. పిల్లలచే సరైన వ్యాయామం చేయించేందుకు శిక్షణ పొందిన ఉపాధ్యాయుడిని నియమించేందుకు మాకు వనరులు లేవు. ఈ కొత్త వ్యాపకాన్ని పిల్లలు సంతోషంగా ఆమోదించారు. పని తరువాత కాలనీలోని పిల్లలంతా మా డ్రిల్ గ్రౌండ్‌కు వచ్చేవారు. రోజు రెండు గంటలసేపు వారు వ్యాయామం, మిలటరీ డ్రిల్‌లో పాల్గొనేవారు. ఇదంతా పిల్లలకు పెద్ద వినోదంగా ఉండేది. వారు ఇష్టపూర్వకంగా ఇందులో పాల్గొనేవారు. త్వరలోనే నాకు నిజమైన మిలిటరీ శిక్షణ కూడా అందుబాటులోకి వచ్చింది. సాధారణ సైనిక శిక్షణా విభాగం మా పిల్లల నేరమయ గతాన్ని విస్మరించి వారందరినీ తన శ్రేణుల్లో చేర్చుకొనేందుకు సిద్ధపడింది.

ఆ రోజుల్లో నేను నిజమైన కమాండర్‌లానే వ్యవహరించేవాడిని. కఠిన క్రమశిక్షణ అమలు జరిగేది. అలసత్వాన్ని సహించేవాడిని కాదు. పిల్లలంతా దీనిని మనస్ఫూర్తిగా ఆమోదించారు. అలా మేం ఒక కొత్త 'ఆట' ప్రారంభించాం. తరువాత రోజుల్లో అదే మా జీవన శైలిని నిర్దేశించే అంశంగా మారింది.

ఈ శిక్షణ వల్ల కాలనీ వాతావరణంలో, పిల్లల్లో వస్తున్న మార్పును నేను స్పష్టంగా గుర్తించ గలిగాను. పిల్లల ప్రవర్తనలో వారి బాహ్యరూపాల్లో, అనూహ్యమైన మార్పు వచ్చింది. వారు ఆరోగ్యంగా, చక్కటి శరీర సౌష్టవంతో చురుకుగా వ్యవహరించడం మొదలైంది. ఇదివరకులాగా నిలబడినప్పుడు ఏదో బల్లను ఆనుకోవడం, మరో గోడకి చేరగిలబడటం ఇప్పుడు లేదు. వాళ్లు నిటారుగా నిలిచి, తలలుపైకెత్తి హుందాగా మెదులుతున్నారు. కొత్త ఆరోగ్యంతో, సరికొత్త ఉత్సాహంతో చకచక తిరిగే పిల్లలతో కాలనీకి కొత్త కళ చేకూరింది. ఈ సమయంలోనే కాలనీలో ఒక కొత్త నిబంధన అమలుచేశాం. టీచర్ల ఏ ఆదేశాలనైనా పిల్లలు వెంటనే ఎటువంటి సంకోచం లేకుండా మన్నించాలి. క్లుప్తంగా "అలాగే...మంచిదండీ" అని బదులివ్వాలి. ఇదీ ఆ నిబంధన. అప్పుడే కాలనీలో ఇంతవరకు కొనసాగిన గంటస్థానంలో కొమ్ముబూరను వాయించే కొత్తపద్ధతిని ప్రవేశపెట్టాం.

కొందరు పిల్లలు రోజూ పట్టణం వెళ్లి అక్కడ నిపుణుల వద్ద వాటిని ఊదడం నేర్చుకోవడం మొదలుపెట్టారు. ఏ సంకేతానికి ఏ పని చేయాలనేది ఖచ్చితంగా నిర్ణయించాం. శీతాకాలం వచ్చేసరికి కాలనీలో గంట మోగించే పద్ధతికి స్వస్తి చెప్పాం. ఇప్పుడు ప్రతి ఉదయం పిల్లలు నా ఇంటి పై మిద్దె మీదనుంచి శ్రావ్యంగా ప్రభాతభేరి మోగిస్తున్నారు. ఆ ప్రశాంత వాతావరణంలో కమ్మటి సంగీతం పొలాల మీదుగ, నదిని దాటి, పొరుగున గల వ్యవసాయక్షేత్రాల్లో మార్మోగేది. డార్మెటరీ కిటికీలోంచి తొంగిచూసే ఒక కుర్రవాడు ఆ సంగీతాన్ని విని, ఆనందంగా నవ్వి కులాసాగా వొళ్లు విరుచుకొనేవాడు. మరెవరో అదే సంగీతాన్ని పియానోపై ఆలపించేవారు. ఉత్సాహంగా రోజు మొదలయ్యేది.

కాలనీలో కొత్తగా వ్యాపించిన సైనిక సంస్కృతి గురించి విని విద్యాశాఖలో కొందరు నొసలు చిట్లించారు. ఆ డైరక్టర్ కాలనీని నిజంగా మిలిటరీ బ్యారెక్స్‌గా మార్చేస్తున్నాడని వాళ్లు విమర్శలు మొదలుపెట్టారు. అయితే నాకు వాటిని పట్టించుకొనే వ్యవధి లేదు.

ఆగస్టులో నేను కాలనీకి రెండు పంది పిల్లల్ని తీసుకొచ్చాను. అవి ఇంగ్లీషుజాతివి. బహుశా అందుకేనేమో దారిపొడవునా అవి తమ 'వలస'ను ప్రతిఘటిస్తూ బండిలోంచి దూకుతూనే ఉన్నాయి.

కాలనీలో అవి వెర్రి ఆగ్రహంతో ఘూర్ణింపులు మొదలుపెట్టాయి. అదివిన్న బ్రాచెంకో తెగ చిరాకు పడ్డాడు. "ఉన్న సమస్యలు చాలనట్టు యీ పందులొకటి" అని ధుమధుమలాడాడు.

అయితే ఈ పంది కూనల్ని పెంచేందుకు, వాటి బాధ్యత చేపట్టేందుకు కాలనీలోని చిన్నపిల్లలు ఉత్సాహంగా ముందుకొచ్చారు. కొత్త కాలనీలో ఆ సమయానికి ఇరవైమంది పిల్లలుండేవారు. రోడించిక్ అనే టీచర్ వాళ్లని చూసుకొనేవాడు. అప్పటికీ మరమ్మతులు పూర్తయిన పెద్ద భవనానికి మేం 'ఎ' సెక్షన్ అని నామకరణం చేశాం. దానిని వర్క్‌షాపులకు, తరగతి గదులకు వినియోగించాలని నిర్ణయించాం. కాని పాత కాలనీ నుంచి అందరం ఇక్కడికి పూర్తిగా మారనందున ప్రస్తుతానికి ఇక్కడున్న పిల్లలంతా అందులోనే వుంటున్నారు. ఇంకా చేయాల్సిన మరమ్మతులు చాలా వున్నాయి. ఎస్టేట్ ఆవరణలో ఠీవీగా నిలిచిన రెండంతస్తుల భవనానికి ఇంకా చాలా పని వుంది. అందులోనే పిల్లల కోసం డార్మెటరీని ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. పని చురుగ్గానే సాగుతూ వుంది. రోజూ కొత్త చెక్కలు తీసుకొచ్చి అక్కడున్న అనేక పాకలు, షెడ్లు, అశ్వశాలలు ఇంకా మిగిలిన గదులలో అవసరమైన చోట్ల అమరుస్తున్నారు. తలుపులు, కిటికీలు బిగిస్తున్నారు.

ఈ లోగా మా వ్యవసాయ కార్యకలాపాలకు మంచి మార్గదర్శి దొరికాడు. వ్యవసాయశాస్త్రంలో నిపుణుడైన ఎడ్వర్డు నికొలాయెవిచ్ షెరీ కాలనీలో పని చేసేందుకొచ్చాడు. మొదట్లో అతని ధోరణి మా పిల్లలకు అంతుబట్టలేదు. అతను మాత్రం అదేం పట్టించుకోకుండా ఆవరణలోని పొలాల్లో పచార్లు చేస్తూ పరిస్థితిని శ్రద్ధగా గమనించాడు. మునుపటి మా వ్యవసాయ 'నిపుణుడు' ఇవానోవిచ్‌కి, ఇతనికి పనితీరులోనూ ఎంతో భేదం వుంది. షెరీ ఎన్నడూ అత్యుత్సాహాన్నిగాని, అసంతృప్తినిగాని ప్రదర్శించేవాడు కాదు. అతని ధోరణిలో హాస్యం ప్రస్ఫుటమయ్యేది. ఎవరినైనా అతను "ఏవయ్యా" అని సంబోధించేవాడు. గొంతుస్థాయి పెంచేవాడు కాదు. ఎవరితోనూ అవసరానికి మించి చనువుగా, స్నేహంగా వుండేవాడు కాదు. వచ్చిన కొత్తలోనే ప్రిఖోడ్కో ఒకసారి షెరీ చెప్పిన పనిని తిరస్కరించాడు. "ఆ పొదలా! నేను వాటి జోలికి పోనేపోను" అని తూష్ణీకారంగా అన్నాడు. అది విన్నా షెరీ మొహంలో చిరునవ్వు చెరగలేదు. నొచ్చుకున్నట్టు కనిపించలేదు. కొద్దిపాటి ఆశ్చర్యం మాత్రం ప్రకటించి "అలాగా, నీకది ఇష్టం లేదన్నమాట! సరే నీ పేరేమిటో చెప్పు. గుర్తు పెట్టుకుంటాను. ఇకపై నీకే పనీ అప్పజెప్పను" అన్నాడు. "పని చేయననలేదు. ఆ పొదలు కొట్టడం తప్ప మరే పనైనా ఇవ్వండి. సిద్ధమే" అన్నాడు ప్రిఖోడ్కో.

"ఫర్వాలేదులే నువ్వు లేకపోయినా యీ పని జరుగుతుంది. నువ్వు మరెక్కడైనా పని చూసుకో" అన్నాడు షెరీ.

"అదేమిటి?"

"ఇదంతా దేనికి? నీ పేరేమిటో చెప్పు. యీ పనికిమాలిన సంభాషణకు నాకు వ్యవధి లేదు"

ప్రిఖోడ్కో మొఖంలో పొగరుతో కూడిన నవ్వు మాయమయింది. తిరస్కారంగా భుజాలెగరేసి షెరీ చెప్పినట్టే ఆ పొదలవైపు కదిలాడు.

నిజానికి షెరీ వయస్సు మరీ అంత ఎక్కువేం కాదు. ఐతే ఎవరిపైనా ఆధారపడని మనస్తత్వంతో ఎంతటి పనికైనా సిద్ధపడగల ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శిస్తూ అతను పిల్లలను దిగ్భ్రాంతిపర్చాడు. అతను ఎప్పుడూ వెళ్లి విశ్రాంతిగా పడుకోవడాన్ని పిల్లలు చూడలేదు. పిల్లలంతా ఉదయం నిదురలేచి కళ్లు నులుపుకునే సమయానికే షెరీ పొలంలో పచార్లు చేస్తూ వుండేవాడు. రాత్రి అలిసిపోయిన

పిల్లలు నిద్రకు సిద్ధమవుతున్న సమయానికి షెరీ పందుల కొట్టంలో వడ్రంగులతో ఏదో చర్చలో మునిగి తేలుతూ కనిపించేవాడు. పగటిపూట షెరీ విశ్వరూపం కనిపించేది. ఒకేసారి పదిచోట్ల వున్నట్టుగా పనిచేసేవాడు. అశ్వశాలలో, ఔట్‌హౌస్ నిర్మితమవుతున్న స్థలంలో, పట్టణంకు వెళ్లే రహదారిపై, అలాగే పొలాల్లో ఎరువులు జల్లిస్తూ అంతటా తానే అయి కనిపించేవాడు. ఒకచోటు నుంచి మరోచోటుకు మెరుపువేగంతో కదులుతూ అన్ని పనులూ పర్యవేక్షించేవాడు. ఆదేశాలు జారీ చేసేవాడు.

షెరీ వచ్చిన రెండో రోజున అతనికి బ్రాచెంకోకు గొడవైంది. గుర్రాల పోషణ విషయంలో ఇంతటి లెక్కలు ఏమిటి అని బ్రాచెంకో చిరచిరలాడేడు.

“అతని బుర్రలో ఏముంది? తూకమా! గుర్రాల దాణాను ఎవరైనా తూకంతో వేస్తారా? గుర్రాలకు రేషన్ నిర్ణయిస్తాడు. అంతకంటే ఎక్కువగాని, తక్కువగాని పెట్టవద్దంటాడు. ఐనా అదేం రేషనండీ? అంత తక్కువా? గుర్రాలు గనక ఆకలితో ఛస్తే ఆ బాధ్యత నాదిగాదు. పైగా పని విషయంలో ఇంకో కొత్త పద్ధతి. పుస్తకంలో రాయాలట. రోజుకు ఎన్ని గంటలు ఏం పని చేశానో వివరంగా రాసి వుంచాలట. ఇదేం వెర్రి?” అని బ్రాచెంకో విరుచుకుపడ్డాడు.

షెరీ ఏ మాత్రం బెసగలేదు. తన మామూలు పద్ధతిలోనే బ్రాచెంకో కేకల్ని నిర్లక్ష్యం చేశాడు. పట్టించుకోలేదు. నల్లగుర్రం ఫాల్కన్‌ను ఇచ్చేది లేదని, దాంతో ఎల్లుండి ఒక ముఖ్యమైన పని చేయించాల్సివున్నందున దానికి విశ్రాంతి అవసరమని బ్రాచెంకో చేస్తున్న వాదనని షెరీ అసలు వినలేదు. అతను తిన్నగా అశ్వశాలలోకి వెళ్లి ఫాల్కన్‌కు కళ్లెం వేసి కనీసం వెనుదిరిగి చూడకుండా బయటకు వెళ్లిపోయాడు. బ్రాచెంకోకు ఇంతటి అవమానం ఎన్నడూ జరగలేదు. వాడు కోపంగా హూంకరిస్తూ చేతిలోని చెర్నకోలను ఓ మూలకు విసిరి బయటకు వెళ్లిపోయాడు. ఆ సాయంత్రం అశ్వశాలలోకి తొంగిచూసిన బ్రాచెంకోకు గుండెలు జారిపోయాయి. అక్కడ మరో ఇద్దరు పిల్లలు పనిలో హడావుడిగా వున్నాడు. ఇది బ్రాచెంకోకు శరాఘాతమే. వాడు దీనంగా నా దగ్గరగా వచ్చి అశ్వశాల బాధ్యునిగా తన పదవికి రాజీనామా యివ్వదలచినట్టు నాతో చెప్పాడు. ఈలోగానే షెరీ అక్కడికి హడావుడిగా వచ్చాడు. అతని చేతిలో ఏదో పేపరు వుంది. బ్రాంచెంకో మొహంలో దైన్యాన్ని, విషాదాన్ని అతనేం పట్టించుకోలేదు.

“ఏమయ్యా నీ పేరు బ్రాచెంకో కదూ. నువ్వు అశ్వశాల బాధ్యుడివి కదూ. ఇదిగో ఈ కాగితంలో ఈ వారమంతా నువ్వేం చేయాలో వివరంగా వుంది. ఏ గుర్రాన్ని ఏ రోజు – ఏ పనికి ఉపయోగ పెట్టాలో, ఎప్పుడు వాటిని బయటికి తీసుకెళ్లాలో, వేటికి ఎంతెంత దాణా పెట్టాలో అన్నీ వివరంగా వున్నాయి. నువ్వొకసారి చూడు. ఏవైనా మార్పులు వుంటే రేపు నాకు చెప్పు సరేనా!'

ఆశ్చర్యంతో నోటమాటరాని బ్రాచెంకో ఆ కాగితం పట్టుకొని మౌనంగా అశ్వశాలకు తిరిగి వెళ్లాడు.

మర్నాడు సాయంత్రం చూద్దును కదా! బ్రాచెంకో, షెరీలు ఒక బల్లకు అటుఇటు కూర్చొని ఓ కాగితంలోకి తొంగి చూస్తూ పరిసరాల్ని పట్టించుకోకుండా సుదీర్ఘ సంభాషణలో మునిగివున్నారు.

“అవును. అదీ నిజమే బుధవారాలు మన రెడ్, బ్యాండిట్‌లను పొలం పనికి తోల్దాం.”

“కానీ లాడీ బీట్‌రూట్ తినలేదు. దాని పళ్లు...”

“అదేం పర్వాలేదు. చిన్న ముక్కలుగా తరిగి పెడితే శుభ్రంగా తింటుంది.”

“మరెవరైనా పట్నానికెళ్లేందుకు గుర్రాలనడిగితేనో?”

"మనకు సంబంధం లేదు. నడిచిపోతారు. లేకపోతే వూళ్లోంచి గుర్రాలు అద్దెకు తెచ్చుకుంటారు."

"భేష్ అదీ పద్ధతంటే" అన్నాడు బ్రాచెంకో తృప్తిగా తలూపుతూ.

నిజానికి షెర్రీ నిర్దేశించినట్టు రవాణా పనులకి రోజుకు ఒకటే గుర్రం అంటే మాకందరికీ చాలా కష్టమే. కానీ ఇవానోవిచ్ వాదన షెర్రీ ముందు సాగలేదు.

"మీ రవాణా అవసరాలతో నాకు సంబంధంలేదు. కావాల్సిన సరుకునెలా తెచ్చుకుంటారో నాకనవసరం. కావాలిస్తే ఇంకో గుర్రం కొనుక్కుంటారు. లేదా మానుకుంటారు. నేను ఇక్కడ నూటయాభై ఎకరాలకు పైగా భూమిని సాగుచేయాలి. మరోసారి యీ విషయంపై వాదనకు దిగకుండా వుండటమే మీరు నాకు చేసే ఉపకారం" అని షెర్రీ నిష్కర్షగా చెప్పాడు.

ఇవానోవిచ్‌కి కోపం కట్టలు తెంచుకుంది. "నాకు గుర్రం అవసరమైతే నేనే వెళ్లి తీసుకుంటాను. తెలిసిందా" అని బల్లపై గట్టిగా చరిచాడు.

షెర్రీ ఆయన్ను పట్టించుకోకుండా తన వద్ద నున్న చిన్న పుస్తకంలో ఏదో రాసుకున్నాడు. ఆయన వంక కన్నెత్తయినా చూడలేదు. ఒక గంట తర్వాత ఆఫీసులోంచి బయటకు వెళ్తూ నా దగ్గరకొచ్చి మెల్లగా, స్ఫుటంగా "నేను తయారు చేసిన రోజువారీ కార్యక్రమంలో మార్పులు వచ్చి, నా అనుమతి లేకుండా ఎవరైనా గుర్రాలను వాడే ప్రయత్నం చేసిన మరుక్షణం కాలనీ నుంచి వెళ్లిపోతాను" అని హెచ్చరించాడు. చెప్పకపోవడమేం షెర్రీ అలాంటి వాడుకూడా. నేను కంగారుగా ఇవానోవిచ్‌ని పిలిపించాను.

"అయ్యా మీరతని జోలికి పోకండి. అతన్ని మనమేం చేయలేం" అన్నాను.

"మరలా అయితే ఒక గుర్రంతో నేనెలా చచ్చేది. పట్టణానికెళ్లాలి; ఇక్కడికి సరుకులు తేవాలి; నీళ్లు మోసుకురావాలి, అడవి నుంచి కట్టెలు తెచ్చుకోవాలి; పైగా కొత్త కాలనీకి సామాన్లు పంపాలి. ఎలా?

"ఏదో ఒకటి చేద్దాంలే".

ఈ కొద్ది నెలల్లోనే కాలనీలో గుణాత్మకమైన మార్పు కనబడింది. కొత్త కాలనీకి వెళ్తామన్న ఉత్సాహం, కొత్తగా వచ్చి చేరిన మనుషులు చేస్తున్న పని మరింత అర్థవంతంగా కనిపించడం, పెరిగిన పనిభారం, క్రమశిక్షణా, క్రమంగా ఆ అంతులేని దారిద్ర్యం నుంచి బయటపడడం వంటి పరిణామాలు పిల్లలపై ప్రభావాన్ని చూపాయి. మళ్లీ పిల్లల మధ్య పూర్వపు వాతావరణం నెలకొంది. ఆటపాటలు, కేరింతల సందడి వినవస్తోంది. మళ్లీ పిల్లలు సాయంవేళల్లో కథలు, ఆటపాటలతో పొద్దు గడుపుతున్నారు. అయితే అప్పటికీ, ఇప్పటికీ తేడా ఏమిటంటే మునుపు లేని క్రమశిక్షణ ఇప్పుడు కనిపిస్తోంది. పిల్లల పనితీరులో, వ్యవహారశైలిలో, ప్రవర్తనలో ఒక క్రమం, పొందిక ఏర్పడ్డాయి.

చివరకు ఇవానోవిచ్ సమస్యకూడా పరిష్కారం దొరికింది. ఆయన బండికి ఒక ఎద్దు అమరింది. ఇప్పుడాయన ఆ ఎద్దుబండిలోనే తన సామాన్ల రవాణా సాగిస్తున్నాడు.

24

షెర్రీ తన పనులన్నింటికి ఒక క్రమాన్ని రూపొందించాడు. వసంత కాలపు నాట్ల కోసం ఒక కొత్త విధానాన్ని ప్రవేశపెట్టాడు. అతను ఎక్కడుంటే అక్కడ-పొలాల్లో, అశ్వశాలలో, ఆఫీసుల్లో, డార్మెటరీల్లో, రోడ్డు మీద, చివరికి పడవలో నదిని దాటుతున్నప్పుడు కూడా పిల్లలు షెర్రీతో

యీ కొత్త పద్ధతుల గురించే మాట్లాడుతూ వుండేవారు. షెర్రీ ఇచ్చిన ప్రతి ఆదేశాన్ని పిల్లలు ఎదురు ప్రశ్న వేయకుండా అమలు చేశారని కాదు. ఒక్కోసారి పిల్లలు ఎందుకిలా చేయడమని షెర్రీని అడిగేవారు. అతను వాళ్ల అభ్యంతరాలను ప్రశాంతంగా విని తలూపేవాడు. "సరే, అలాగే నేను చెప్పినట్టే చేయండి" అనేవాడు చివరికి.

అలసట అనేది లేకుండా హడావుడికి చోటివ్వకుండా రాత్రింబవళ్లు పనిచేసే షెర్రీతో పోటీపడటం ఎవరికైనా కష్టమే అనిపించేది. అనేక గంటలసేపు పొలంలో నిలబడి పనిచేయిస్తూ, ఐదారు గంటలపాటు విత్తనాల యంత్రంతో పనిచేసి కూడా, పందుల కొట్టం పరిస్థితిని గమనిస్తూ వుండేవాడు అతను. అక్కడకు వెళ్లి పిల్లల్ని మర్యాదగానే అయినా సూటైన ప్రశ్నలతో నిలదీసేవాడు.

"పందులకి మేతెప్పుడు పెట్టారు? ఏ వేళకు పెట్టారో పుస్తకంలో రాశారా? వాటికి స్నానాలు చేయించేందుకు సన్నాహాలు చేశారా?" అనడిగేవాడు.

క్రమంగా షెర్రీ అంటే పిల్లల్లో గౌరవం, ఆరాధన పెరిగాయి. వాళ్లు తమ మాటల్లో అతన్ని 'మన షెర్రీ' అని ప్రస్తావించేవారు. వాళ్లు అతని అధికారాన్ని సంపూర్ణంగా ఆమోదించారు. అతని పరిజ్ఞానం, నైపుణ్యం, ఓపిక ఇవన్నీ వాళ్లకు చర్చనీయాంశాలు. తమను గుడ్డిగా ప్రేమించి లాలించే వారిని మాత్రమే పిల్లలు ఆరాధిస్తారన్న వాదనతో నేనెప్పుడూ విభేదిస్తాను. పిల్లలు ఎదుటివారి ప్రేమతోపాటు వారి అర్హతలను, ఆత్మస్థైర్యాన్ని, పరిజ్ఞానాన్ని, శక్తి సామర్థ్యాన్ని, నేర్పును కూడా పరిగణనలోకి తీసుకుంటారు. యీ అర్హతలన్ని వున్న వాళ్లని వాళ్లు మరింత గాఢంగా ప్రేమిస్తారు. అటువంటి వాళ్లు పిల్లల్తో కఠినంగా వ్యవహరించినా, పట్టించుకోకుండా వున్నా పెద్ద తేడారాదు. నీ పనిపై, నీ జ్ఞానంపై వాళ్లకి నమ్మకం చిక్కి నువ్వు విజయం సాధించగలవని పిల్లలు భావించాలే కాని నువ్వు వాళ్ల గురించి బెంగపడక్కర్లేదు. మొదట్నుంచీ ఇదే నా నమ్మకం. షెర్రీ విషయంలో నా నమ్మకం మరోసారి రుజువైంది. అందుకే అతని సారధ్యంలో పని శరవేగంగా సక్రమంగా సాగిపోతుంది. షెర్రీకు ఇంకొన్ని విద్యలు కూడా తెలుసు. ఎవరికీ చెందని ఆస్తుల్ని గుర్తించడం, పరికరాల కొనుగోలులో పిసినారిగా బేరసారాలు సాగించడం, అప్పు సంపాదించడంలాంటి విద్యలన్నీ తెలుసు. దానితో వ్యవసాయానికి అనేక కొత్త పరికరాలు కూడా సమకూరాయి. వాటితో పాటే మూడు ఆవులు కూడా!

మొత్తానికి వ్యవసాయమంటే పిల్లల్లో ఆసక్తి, అనురక్తి పెరిగాయి. అప్పటికే కార్ఖానాల్లో కొంత నైపుణ్యం సంపాదించిన కుర్రవాళ్లు తప్ప మిగిలిన వాళ్లంతా పొలం పనులకే ఎగబడ్డారు. ఇలా వ్యవసాయం పనులు ముమ్మరంగా సాగుతున్న రోజుల్లో, ఫిబ్రవరిలో ఉన్నట్టుండి ఓ రోజు కరబనోవ్ కాలనీలోకి వచ్చాడు. పిల్లలంతా వాడ్ని కౌగిలింతలు, ముద్దులతో చుట్టుముట్టారు. అతి కష్టం మీద వాళ్లను వొదిలించుకొని నా గదిలోనికొచ్చాడు. "మీరంతా ఎలా వున్నారో చూద్దామని వచ్చాను." కరబనోవ్ ఆ రోజంతా పిల్లలతో గడిపాడు. కొత్తకాలనీకి వెళ్లి అక్కడి సందడినంతా స్వయంగా చూశాడు. సాయంత్రం కుంచించుకున్న భుజాలతో ముఖం వేలాడేసుకొని నా గది కొచ్చాడు. ఎలా వున్నావని ప్రశ్నించాను.

తండ్రితో కలిసి వుంటున్నాడు. తనతోపాటు వెళ్లిన మిత్యాగిన్ బహుశా ఇప్పుడు మాస్కోలో వున్నాడు. తండ్రి ఆరోగ్యంగానే వున్నాడట. అన్నయ్య ఒక వీధి కొట్లాటలో మరణించాడట. "సరే ఏం చేద్దామనుకుంటున్నావ్. నాన్నగారి దగ్గరే వుంటావా?" అని అడిగాను.

"ఊహు! ఆయన దగ్గర వుండటం నాకిష్టం లేదు. ఏం చేయాలో తెలీదం లేదు..." వాడు కుర్చీలో యిబ్బందిగా కదిలి నా వైపుకు వొరిగాడు.

"ఆంటన్‌సెమ్యోనోవిచ్! నేను ఇక్కడే మీతో యీ కాలనీలో వుండొచ్చా?"

వాడు నా వంక తదేకంగా చూసి తలవంచుకొన్నాడు. "ఎందుకుండకూడదు?" అన్నాను తేలిగ్గా "హాయిగా వుండు మాకది సంతోషంగా కూడా"

కరబనోవ్ చివ్వున కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు. అంతవరకు అణచిపెట్టుకున్న ఉద్వేగం ఉద్రేకం అతన్ని ఊపివేశాయి.

"నేను తట్టుకోలేను" అంటూ బావురుమన్నాడు. "నేనిక తట్టుకోలేను... నేనిక తట్టుకోలేను. మొదట్లో బాగానే వుండేది. ఏదో ఒక పని చేయడం, తిండి తినడం, పొద్దు పుచ్చటం. నాకు గట్టిగా ఏడవాలనిపిస్తుంది. మీకో విషయం తెలుసా. నాకీ కాలనీ అంటే ఇష్టం. ఇంత ఇష్టమని నేనూ అనుకోలేదు. మరిచిపోతానులే అనుకున్నాను. పోనీ ఒకసారి వచ్చి చూచి పోదామనుకున్నాను. చూశాను. ఎంత అద్భుతంగా వున్నారు మీరంతా! పైగా మీ షెరీ వున్నాడే..." వొణుకుతున్న గొంతుతో వాడు చేస్తున్న శబ్దాలను అడ్డుకున్నాను.

"ఎందుకలా మధనపడతావ్. నీకు బయట బాగా అనిపించనప్పుడే హాయిగా వెనక్కు వచ్చేయవలసింది. ఎందుకంత యాతన పడ్డావ్?"

25

డిటాచ్‌మెంట్‌ల ఏర్పాటు

1923 శీతాకాలంలో అనేక కొత్త పరిణామాలు సంభవించాయి. ఆ రోజుల్లో పనులు సక్రమంగా, సజావుగా సాగేందుకు మేం కనిపెట్టిన కొన్ని పద్ధతులు ఆ తరువాతి కాలంలో సంచలనాలు సృష్టించినా, క్రమంగా దేశవ్యాప్తంగా ఉన్న అనేకమైన ఇటువంటి కాలనీల్లో ఆ పద్ధతులకే ఆదరణ లభించింది. వీటిల్లో అతి ప్రధానమైనది డిటాచ్‌మెంట్‌ల ఏర్పాటు ఒకటి. అప్పట్లో మేం రూపొందించిన డిటాచ్‌మెంట్‌లకీ ఇప్పటి డిటాచ్‌మెంట్‌లకు కొంత బేధం ఉంది. అయినా ఈ తరహా పని పద్ధతికి పునాది పడింది మాతోనే అని సగర్వంగా చెప్పగలను. అయితే మొదట్లో మా కాలనీలు ఇలా డిటాచ్‌మెంట్లు ఏర్పాటైన సంగతి వినగానే విద్యాబోధనా రంగంలో దుమారమే జరిగింది. అప్పటికే మా కాలనీలో మేం మిలటరీ క్రమశిక్షణను అమలు చేస్తున్నందుకు విమర్శలు కురిపించిన వారికి మా కొత్త ఏర్పాటు మరిన్ని దాడులకు అవకాశం ఇచ్చింది. నిజానికి 1923 నాటికి ఈ డిటాచ్‌మెంట్‌ల వ్యవస్థ ప్రాముఖ్యం అందరికీ సరిగా అర్థం కాలేదు.

దీనంతటికీ మూలం, నిజంగా చెప్పాలంటే మా అవసరాలే.

మా కాలనీకి గల వనరుల గురించి తెలిసిన ఉన్నతాధికారాలు ఎప్పటిలానే ఆ శీతాకాలానికి వంటచెరకు సరఫరా చేయలేదు. దానితో ఎప్పటిలానే వేసవిలో మేం పోగుచేసిన ఎండు కలపంతా నవంబర్‌నాటికే ఖర్చయిపోయింది. అసలు మా కాలనీ కుర్రవాళ్లకి అడవిలో తిరిగి ఎండుకొమ్మలు పోగుచేయడమంటే అప్పటికే తగని చిరాకు వచ్చింది. మైళ్లకొద్దీ తిరిగి కీకారణ్యంలోకి చొచ్చుకుపోయి సాయంత్రానికి సేకరించగలిగేదల్లా క్షణాల్లో బూడిదయ్యే ఎండుకొమ్మల్లే. శీతాకాలంలో ఆ పని చెయ్యడం మరింత అసాధ్యం. అప్పటికే, కురిసి గడ్డకట్టిన మంచులో చితుకుల కోసం అన్వేషించడం అనవసర ప్రయాస. పైగా అలా సేకరించిన కలపను కాలనీకి తరల్చేందుకు కావలసిన గుర్రాలు

మా వద్ద లేవు. ఈ సమస్య నుంచి బయటపడాలంటే అడవిలో ఎండిపోయిన వృక్షాలను పెకలించుకు రావలసిందే. అందుకు బలమైన కుర్రవాళ్లు అవసరం.

ఇదే విషయాన్ని ఒకసారి సర్వసభ్య సమావేశంలో పెట్టి, అతి కష్టం మీద షెర్రీని ఒకటి రెండు సూచనలకు వొప్పించగలిగాం. ప్రస్తుతానికి ఎరువులు చల్లే కార్యక్రమాన్ని ఆపి, బలిష్ఠులైన కుర్రవాళ్లని అడవికి పంపమని అడిగాం, అలాగే సాయంత్రం వేళల్లో వంట చెరకు రవాణాకు గుర్రాలను కేటాయించేందుకు కూడా వొప్పించాం. ఫలితంగా ఇరవైమంది కుర్రవాళ్లతో ప్రత్యేక బృందం ఒకటి ఏర్పాటైంది. ఈ బృందంలో అప్పటికే కాలనీలో సీనియర్లయిన బరున్, బెలూఖిన్, వెర్షనోవ్, వోలోఖోవ్, ఒసాడ్చీ, చోబట్ వంటి వాళ్లంతా వున్నారు. వాళ్లంతా ఉదయమే జేబులనిండా రొట్టెలు నింపుకొని అడవికి బయలుదేరేవారు. సాయంత్రానికి పది, పన్నెండు బళ్ళ కలప సిద్ధమయ్యేది. బ్రాచెంకో అందరిపై ధుమధుమలాడుతూ ఆ కలపను బండిలో రవాణా చేసేవాడు. పిల్లలంతా **ఆటపాటలతో** కాలనీకి చేరుకునేవాళ్లు.

కాలనీకి వచ్చిన తరువాత కూడా వాళ్ల ఆటలు కొనసాగాలి. బేకరిలో వాళ్లు ఆ రోజు చేసిన పని ఎంతో సగర్వంగా ప్రకటించేవారు. "మా డిటాచ్‌మెంట్ ఇవ్వాళ పన్నెండుబళ్ల వంటచెరకు తెచ్చింది. చెప్పాగా క్రిస్మస్‌నాటికి వెయ్యిఫూడ్‌ల వంటచెరకు సిద్ధమవుతోంది" అని చెప్పేవాడు.

'డిటాచ్‌మెంట్' అనే ఆ మాట కార్మికవిప్లవం మహోద్ధృతంగా సాగిన కాలంనాటిది. అప్పటికి ఆ మాటను సాధారణ పౌరజీవితంలోని ఇతర రంగాల్లో వాడటం మొదలుకాలేదు. ఉక్రైన్‌లో ఆ కాలంలో సాగిన గెరిల్లా యుద్ధం పూర్తిగా డిటాచ్‌మెంట్‌ల ఆధ్వర్యంలోనే జరిగింది. ఈ మాటకు నిర్దిష్టమైన అర్థం లేదు. డిటాచ్‌మెంట్ అంటే ఎందరు సైనికులన్న ఖచ్చితమైన లెక్క ఏమీ ఉండేది కాదు.

ముందే మా కాలనీ పిల్లలకు విప్లవ పోరాటం వంటి గెరిల్లా యుద్ధవ్యూహాలంటే అనురక్తి ఉండేది. వర్గ శత్రువుల దాడుల ఫలితంగా అనాథలుగా మిగిలి, కాలనీకి చేరిన పిల్లలు సహజంగానే గెరిల్లా యుద్ధవ్యూహాలకు సంబంధించిన పదజాలాన్ని ఇష్టపడేవారు.

అలా గొడ్డళ్లు, రంపాల వంటి ఆయుధాలతో అడవిలోకి వెళ్లే మా కుర్రవాళ్లు మరోసారి నాటి పోరాటస్ఫూర్తిని గుర్తు తెచ్చారు. విప్లవ పోరాటానికి సంబంధించి కాలనీ కుర్రవాళ్ల అర్థజ్ఞానాన్ని నేను ప్రశ్నించదలచలేదు. ఆ పోరాటాన్ని వారు చూడకపోయినా, పూర్తి వివరాలు తెలియకున్నా వ్యాప్తిలోకి వచ్చిన కథలూ, గాథల ద్వారా వారు ఈ అంశంపై అభిమానాన్ని పెంచుకున్నారు. మా కాలనీలో మిలిటరీ పద్ధతులను విమర్శించేవారికి ఈ విషయాన్ని అర్థం చేయగలనన్న నమ్మకం నాకు లేదు. వాళ్ల ఇష్టానిష్టాలతో సంబంధం లేకుండానే మా కాలనీలో తొలి డిటాచ్‌మెంట్ ఏర్పడింది.

అడవికి వెళ్లే బృందానికి బరున్ సహజంగానే నాయకుడు. ఈ విషయంలో ఎవరికీ పేచీ లేదు. దానితో అతిసహజంగా ఆ డిటాచ్‌మెంట్‌కు అతనే 'కమాండర్' అయ్యాడు. మొత్తానికి అడవిలో కలప కొట్టడం పూర్తయింది. జనవరి నాటికి నిజంగానే మేం వెయ్యి ఫూడ్‌ల కలప సేకరించగలిగాం.

ఒకరోజు జదరోవ్ నన్ను అడిగాడు "బరున్ డిటాచ్‌మెంట్ అక్కడ అడవిలో పనిచేస్తుంది. మరి ఇక్కడ కాలనీలో పనిచేసే పిల్లల సంగతేమిటి" అని ఆ విషయంగా పెద్దగా ఆలోచించలేదు. అప్పట్లో ప్రతిరోజూ ఎవరూ ఏం చేయాలో క్రమం తప్పకుండా ఆదేశాలు జారీ చేసేవాళ్లం. అందులో భాగంగానే మర్నాడు జదరోవ్ నాయకత్వాన రెండవ డిటాచ్‌మెంట్ ఏర్పాటు చేసి వారికి ఖార్ఖానాల బాధ్యత అప్పగించాం. ఈ డిటాచ్‌మెంట్‌లో నైపుణ్యం గలిగిన బెలూఖిన్, వెర్షనోవ్ తదితరులు చేరారు.

ఇక ఆ తరువాత క్రమంగా అనేక డిటాచ్‌మెంట్‌ల ఏర్పాటు వేగంగా సాగిపోయింది. వివిధ వర్క్‌షాపులకు వేర్వేరు డిటాచ్‌మెంట్‌లు తయారయ్యాయి. అశ్వశాలకు, పందుల కొట్టం బాధ్యత చూసేందుకు ప్రత్యేక డిటాచ్‌మెంట్‌లు సిద్ధమయ్యాయి. క్రమంగా నేను రోజువారీ వ్యవహారాల్లో ప్రత్యేకంగా జోక్యం చేసుకోవడం మాని, ఈ డిటాచ్‌మెంట్‌ల కమాండర్‌లతో సమాలోచనలు ప్రారంభించాను. కొద్ది కాలానికి ఇదే పద్ధతిగా మారింది. ఒక దశకు వచ్చేసరికి ఈ కమాండర్‌ల వివరణ లేకుండా నాకు ఒక్కో విషయం అర్థమయ్యేది కాదు. ఇలా కమాండర్లతో జరిపే సమావేశాలకు కుర్రవాళ్లు గొప్పగా కమాండర్ల కౌన్సిల్ అని నామకరణం చేశారు. ఆ తరువాత కమాండర్ల నియామకం బాధ్యతను డిటాచ్‌మెంట్‌కే వదిలేశాం. దీనితో ఒక్కో బృందం సభ్యుల మధ్య అవగాహన, సహకారం ఇనుమడించాయి. పూర్తి ప్రజాస్వామ్య పద్ధతుల్లో కమాండర్ల ఎన్నిక జరిగేది. నా దృష్టిలో ఆ తరహా ప్రజాస్వామ్యం స్వేచ్ఛ పెద్ద విజయమేం కానప్పటికీ నేను జోక్యం చేసుకోలేదు. అయితే మా వాళ్లు కమాండర్ ఎన్నికకు ప్రజాస్వామ్య పద్ధతులే పాటించినా, దానికి ముందు నాయకత్వ స్థానాన్ని ఎవరికి ఇవ్వాలనే దానిపై సుదీర్ఘ చర్చ జరిగేది. దానివల్ల ఎప్పుడూ మాకు మంచి కమాండర్లే వుండేవారు. నాటికీ, నేటికీ కూడా అమల్లో ఉన్న కచ్చితమైన నిబంధన ఒకటుంది. వాళ్లు సైతం మిగిలిన వారందరిలానే పనిచేసి తీరాలి కూడా. ఏడాది తిరిగే సరికి ఈ డిటాచ్‌మెంట్‌లనే మరింత అభివృద్ధి చేసి మిశ్రమ డిటాచ్‌మెంట్‌లనే మరో కొత్త వ్యవస్థను రూపొందించాం. డిటాచ్‌మెంట్‌ల విధానాన్నే విమర్శించిన పెద్దలకు ఈ మిశ్రమ డిటాచ్‌మెంట్‌ల పేరే తెలియదు.

ఈ కొత్త వ్యవస్థ అమల్లోకి రావడానికి కారణం ఉంది. మాకు గల నూటయాభై ఎకరాలకు పైగా భూమిని సాగుచేసేందుకు ఎంతోమంది మనుషులు అవసరమయ్యేవారు. కాలనీలో ప్రతి ఒక్కరి సేవలూ అవసరమేనని షెరీ డిమాండ్ చేశాడు. అయితే అప్పటికే ఏర్పడిన డిటాచ్‌మెంట్‌లకు వేర్వేరు విధులున్నాయి. వివిధ పనుల్లో నైపుణ్యం సంపాదిస్తారు. వ్యవసాయం కోసం ఒక్కసారి తమతమ వర్క్‌షాపులతో సంబంధాలు తెంచుకోవడం పిల్లలకు ఇష్టం లేకపోయింది. అలా అని జీవనాధారమైన వ్యవసాయం అంటే వారికి చిన్న చూపేంలేదు. శీతాకాలం వచ్చేసరికి మరింతమంది సేవల కోసం షెరీ వత్తిడి చేయడం ప్రారంభించాడు.

పొలంలో పనితీరు, చేయాల్సిన స్థలం తరచూ మారిపోయేవి. వివిధ రంగాల్లో అంతో ఇంతో నైపుణ్యం సంపాదించినా వేర్వేరు రకాల పనివాళ్లు ఒకేసారి ఈ పనులకు అవసరమయ్యే వాళ్లు. దీనితోనే షెరీ డిమాండ్ తీర్చడం కోసం మిశ్రమ డిటాచ్‌మెంట్‌లను తొలిసారిగా ఏర్పాటు చేశాం. ఈ మిశ్రమ డిటాచ్‌మెంట్‌లు తాత్కాలిక ఏర్పాటే. నిర్దిష్ట లక్ష్యం పూర్తికాగానే ఇవి రద్దయ్యేవి. ఇందులోని సభ్యులు మళ్లీ తమ తమ పూర్వ డిటాచ్‌మెంట్‌లకు వెళ్లిపోయేవారు. ఈ ఏర్పాటు ఆ తరువాతి రోజుల్లో ఎన్నో సంక్లిష్ట లక్ష్యాల సాధనకు బాగా ఉపయోగపడింది.

26

కొత్త కాలనీలో కొత్త సమస్యలు

త్రెప్కే ఎస్టేట్‌లో కొత్త కాలనీ మరమ్మతులు ప్రారంభించి రెండేళ్లు పూర్తి కావచ్చింది. 1923 వసంతకాలం నాటికి అక్కడ పని చాలావరకు పూర్తి అయినట్టు కనిపించింది. ఈ కొత్త కాలనీ మాకు సంబంధించి అతి కీలకపాత్ర నిర్వహిస్తోంది. అక్కడే షెరీ ప్రధాన కార్యకలాపాలు సాగుతున్నాయి. ఆవుల కొట్టాలు, అశ్వశాలలు, పందుల కొట్టాలు అన్నీ అక్కడే ఉన్నాయి. ఎప్పటిలా కాక ఈసారి వేసవి మా కుర్రవాళ్ల పని పెంచింది. రోజంతా మా కుర్రవాళ్లు రెండు కాలనీల మధ్య

అదేపనిగా తిరిగేవారు. కొత్త కాలనీ నుంచీ కొలోమాక్ నది వద్దకు వచ్చి అక్కడ నుంచి పడవలో పాత కాలనీ చేరాలి. ట్రెప్కే ఎస్టేట్ నుంచి నదిని చేరాలంటే పొరుగున ఉన్న పొలాలను చుట్టి రావాలి. దీనివల్ల అనవసర శ్రమే కాక, సమయం కూడా వృధా అవుతోంది. తిన్నగా, పొడవుగా ఉండే ఒక మార్గంలో నడవడం ప్రారంభించారు. అంటే పొలాల సరిహద్దుల వెంట వున్న కాలిబాటలను నిర్లక్ష్యం చేసి కొత్త కాలిబాటను ఏర్పరిచారు. ఇదేదో యధాలాపంగా జరగలేదు. మా కుర్రవాళ్లు నిజంగానే పట్టుదలతో నడిచిన దారినే నడుస్తూ సరికొత్త కాలిబాటను ఏర్పరిచారు. ఇందుకు వారు అనేక కంచెలను, ఇంటి ప్రహారీలను, గేటులను దాటవలసి వచ్చేది. అదీగాక రైతుల కుక్కలు మొదట్లో వాళ్లను అడ్డగించేవి. మా దగ్గర పుష్కలంగా రొట్టె వుండేది కాబట్టి త్వరలోనే కుక్కల ఇబ్బందిని అధిగమించగలిగాం. పొలాలలోంచి, ఇళ్ల ప్రహారీలగుండా, కంచెలను దాటి మా వాళ్లు అదే పనిగా అటు ఇటు తిరగడాన్ని ఆదిలో రైతులు ప్రతిఘటించబోయారు. మా వాళ్లు లెక్కచేయలేదు. క్రమంగా మా కుర్రవాళ్లకు రైతుల పిల్లలు స్నేహితులయ్యారు. ఒక పద్ధతి ప్రకారం పనిచేస్తూ క్రమశిక్షణతో సైనికుల్లా సాగిపోయే కాలనీ పిల్లలు గ్రామంలోని పిల్లలకు ఆకర్షణగా మారారు. క్రమంగా వాళ్లు కూడా కాలనీకి వచ్చి మా పనులను గమనించడం మొదలైంది. నెమ్మదిగా మా డిటాచ్‌మెంట్‌లలో గ్రామానికి చెందిన ఒక కుర్రవాడైనా కనిపించడం మొదలైంది. అలా మొదలైన అనుబంధం కొన్నాళ్లకి రైతుల పిల్లలు సాయంవేళల్లో పాత కాలనీకి వచ్చి మా కుర్రవాళ్లతో సరదాగా కాలం గడపడం వరకు వచ్చింది. వాళ్లందరికీ కాలనీలో చేరిపోవాలనే తహతహ ఉన్నట్టు వాళ్ళ కళ్ళు చూస్తే అర్థమయ్యేది. ఆ తరువాతి కాలంలో వేర్వేరు కారణాలవల్ల ఇళ్లకు దూరమైన పిల్లలు నిజంగానే కాలనీ సభ్యులయ్యారు కూడా.

తర్వాత మా కాలనీ గ్రామంలోని పడుచులను సైతం ఆకర్షించగలిగింది. బలంగా, దృఢంగా వుంటూ ఒక పద్ధతి ప్రకారం పని చేసుకుపోయే కుర్రవాళ్లతో పోటీపడగల మొగవాడెవరూ గ్రామంలో ఉండరన్నది స్పష్టమే. పైగా ఆడపిల్లలు ఎంత ఆసక్తితో గమనిస్తున్నా మా కుర్రవాళ్లు వెకిలివేషాలు వేసేవారు కాదు. పట్టణంలో ఉన్నత విద్యకోసం వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న పెద్ద కుర్రవాళ్లయితే గ్రామానికి చెందిన బాలికలతో మరింత హుందాగా, సంస్కారయుతంగా ప్రవర్తించేవారు. దీనితో వాళ్లు కూడా క్రమంగా కాలనీలోకి వచ్చి బెంచీలపై, తోటలో కూర్చోవడం మొదలైంది. ఈ బాలికలకు మా కుర్రవాళ్లేకాక, కాలనీలోని ఆడపిల్లలు కూడా అతి త్వరలోనే సన్నిహితం అయ్యారు. ఇలా మా కాలనీ కార్యకలాపాలు, పిల్లల క్రమశిక్షణ, పనితీరు క్రమంగా గ్రామ ప్రజలని ఆకట్టుకున్నాయి. రైతులు కూడా నెమ్మదిగా మాకు దగ్గరయ్యారంటే దానికి కారణం షెరీ. అతను అమలు చేసే ఆధునిక వ్యవసాయపద్ధతులు గ్రామీణ రైతాంగాన్ని విశేషంగా ఆకర్షించాయి.

ఈ సమయంలో మాకు ఎదురైన ప్రధాన సమస్య కొత్తకాలనీలో పిల్లలు. అక్కడ టీచర్ రోడించిక్ అసమర్థత కారణంగా పిల్లల్లో క్రమశిక్షణ అన్నది ఏర్పడలేదు. పనిచేసేందుకు తగిన స్ఫూర్తి లభించక పోవడంతో వాళ్లు బద్ధకస్తులుగా, సోమరులుగా తయారయ్యారు. షెరీ అక్కడ ఉన్నప్పటికీ అతని ప్రధాన వ్యాపకం వ్యవసాయం కావడం, ఆ పనుల్లో పాతకాలనీలో ఉన్న కుర్రవాళ్లే పాల్గొవడంతో, కొత్త కాలనీలో ఉంటున్న పిల్లలకు తగిన శిక్షణ, స్ఫూర్తి లభ్యంకాలేదు. దానితో వారు పాతకాలనీ వంక అసహనం పెంచుకున్నారు. అక్కడి వంటగదుల్లో మంచి భోజనం తయారవుతోందని, తమకు మాత్రం ఏదో చెత్త వండి పంపిస్తారనీ కొత్త కాలనీలో పుకార్లు కూడా వినిపించేవి.

ఈ పరిస్థితిని మార్చేందుకు అయినా మా పాతకాలనీని మొత్తంగా ట్రెప్కే ఎస్టేట్‌కు మారుద్దామంటే

అందుకు అనేక అవాంతరాలు ఎదురవుతున్నాయి. అక్కడ అనేక భవనాల గోడలు బీటలువారి ఉండడంతో చలిగాలుల బాధ భయపెట్టేది. అలాగే డార్మెటరీలు ఉన్నప్పటికీ వంటగదులు ఇంకా పూర్తి కాలేదు. వంటగదులు సిద్ధమైనచోట స్టోర్‌రూమ్‌లు అందుబాటులో లేవు. దీంతో కాలనీ పిల్లలు ఎస్టేట్‌ను దారికి తెద్దామని ఎంత కష్టపడుతున్నా అక్కడికి మారేందుకు మాత్రం సిద్ధంగా లేరు. వారిని బలవంతపెట్టి అక్కడికి తరలించి ఇబ్బందుల పాలవడం అనవసరమని నా అభిప్రాయం.

అయితే మేం కొత్త కాలనీకి వెళ్లడం ఆలస్యమైన కొద్దీ అక్కడి పిల్లల ధోరణి మరింత నిరాశాజనకంగా తయారవుతోంది. దీనంతటికీ కారణం అక్కడి టీచర్లే. అధ్యాపకుల విషయంలో ఎంపికకు మాకు అవకాశం లేదు. ఈ కాలనీలో పనిచేసేందుకు అసలు టీచర్లెవరూ లభ్యంకాని స్థితిలో మా దృష్టిలో మంచి అధ్యాపకులను ఎంపిక చేసుకునే వీలే లేకపోయింది. ఎవరు దొరికితే వారినే మేం తీసుకోవలసి వచ్చింది. అలా దొరికినవారే రోడించిక్, దోర్యుచెంకో. ఈ ఇద్దరు టీచర్లు ఇక్కడకు తమ సంసారాలతో సహా వచ్చి చేరి అక్కడ గల మంచి గదులను ముందే ఆక్రమించేశారు. వీరిలో దోర్యుచెంకోకు ఇటువంటి కాలనీలే అనవసరమని దృఢాప్రాయం వుంది. అతనికి తెలిసిందల్లా ఉక్రైన్ పాటలు పాడటమే. రెండో ఆయన రోడించిక్ వ్యవహారం ఆదినుంచీ పిల్లలకు రోత కలిగించింది. ఆయన అంతకుముందు నేరపరిశోధక విభాగం, సహకారసంఘాలు, రైల్వేలలాంటి అన్ని విభాగాల్లో కొంత కొంతకాలం పనిచేశాడు. చివరకు విద్యాబోధనారంగంలోకి వచ్చిపడ్డాడు. భార్యాబిడ్డలతో సహా వచ్చి కాలనీలో చేరిన తరువాత ఆయన ఒక వారం రోజుల పాటు అటూ ఇటూ తిరిగాడు. తరువాత తానొక అతిముఖ్యమైన పనిమీద వెళ్తున్నాని చెప్పి మూడురోజులు అదృశ్యమయ్యాడు. ఒక బండిలో తిరిగి వచ్చాడు. దానికి ఒక ఆవుకూడా కట్టి వుంది. ఆయన ఆ ఆవుని కాలనీ పశువుల కొట్టంలో పెట్టాడు. కాలనీ ఆవులతో తన ఆవునీ పిల్లలే చూడాలని కోరాడు. ఏం జరిగిందో తెలియదు. నాలుగురోజుల తరువాత రోడించిక్ నా దగ్గరకొచ్చాడు.

"ఏంటండీ ఇది. ఇక్కడ ఉద్యోగులను ఇంత చులకన చేస్తారా? ఏదో నా పిల్లలకు పాలు ఉంటాయి కదా అని ఒక ఆవును కొనుక్కొచ్చాను. దాని కోసం ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టలేదు. నాకొచ్చే కొద్ది ఆదాయం నుంచే దాన్ని సంపాదించాను. కాలనీలో కుర్రవాళ్లు కొన్ని ఆవులను సంరక్షిస్తున్నారు. వాటితోపాటే దీన్ని కూడా చూడమన్నాను. కాలనీకి తక్కువ ధరకే దాణా దొరుకుతుంది కదా నా ఆవుకీ వెయ్యమన్నాను. కానీ ఆ కుర్రవాళ్లు నా మాట వినడంలేదు. నా ఆవు ఆకలితో నకనకలాడుతోంది. దానికి స్నానం చేయించి ఐదురోజులైంది. నాలుగు గడ్డిపరకలు దానికి వేసి, మిగిలిన ఆవులతో పాటే దాన్నీ కడగమంటే కుర్రవాళ్లు వినరేం?" అని చిరాకుపడ్డాడు.

అతని ధోరణి ఆశ్చర్యం కలిగించింది. "చూడండి. మీరు తెచ్చిన ఆవు మీ సొంతం. అంటే వ్యక్తిగత ఆస్తి. దాని నిర్వహణా బాధ్యతను సమిష్టి పశుశాల ఎందుకు చేపట్టాలి. పైగా మీరొక అధ్యాపకులు. ఇటువంటి చిన్న చిన్న విషయాల్లో గొడవపడితే పిల్లల దృష్టిలో పలుచనైపోరా?" అని అడిగాను. "మీరీ విషయాన్ని షెరీతో తేల్చుకోండి" అని పంపేశాను.

ఆసరికి రోడించిక్ ధోరణిని అర్థం చేసుకొన్న షెరీ ఆయన ఆవును ఉమ్మడి పశువుల కొట్టంనుంచి బయటకు పంపేశాడు. కొద్ది రోజుల తరువాత అది అదృశ్యమైంది. రోడించిక్ దాన్ని అమ్మేసి ఉండాలి. అలాగే ఆయన తన కుటుంబం కోసం ఉమ్మడి వ్యవసాయ క్షేత్రంలోని బంగాళదుంపలు తెచ్చుకోవడం ప్రారంభించాడు. ఇది కూడా పిల్లలకు అసంతృప్తి కలిగించింది. ఉమ్మడి వంటశాల ఉన్నప్పుడు ఇలా ఎవరికి వారు సమిష్టి క్షేత్రంపై దాడి చేస్తే ఎలా అని వారి చిరాకు.

ఇవన్నీ ఒక ఎత్తు అయితే టీచర్‌గా రోడించిక్ వ్యవహారశైలిపైనే పిల్లలు విరుచుకుపడ్డారు. “ఆయన టీచర్. కాని ఏం జరుగుతుందో చూడండి. కొత్త కాలనీలో పిల్లల సంగతి ఆయన పట్టించుకోడు. మేం అక్కడికి వెళ్లి పనిచేసి రిపోర్టుమీద సంతకం తీసుకోవాలన్నా ఆయన కనిపించడు. ఎంతసేపు బయట గ్రామంలో ఏ సరుకు తక్కువ ధరకు, ఉచితంగా దొరుకుతుందా అన్న యావే. ఎప్పుడూ కాలనీలో ఉండడు. ఉన్నా నిద్రలో ఉంటాడు. దీంతో అక్కడి పిల్లలు దరిద్రంగా తయారవుతున్నారు. మురికిగా, అల్లరిగా, పనీపాట లేకుండా ఉన్నారు. ఏమిటిదంతా?” అని సీనియర్ కుర్రవాళ్లు నన్ను అడిగారు.

ఇంకా ఊరుకుంటే మొత్తం అధ్యాపకబృందం అంటేనే వారికి చులకన ఏర్పడుతుందనే ఆందోళన కలిగింది. రోడించిక్‌ను పిలిచి మర్యాదగా దయచేయండని కోరాను. అతను వినలేదు. ఈ వ్యవహారాన్ని అంత తేలిగ్గా వదలను అని బెదిరించబోయాడు. లాభం లేదని ఆయన్ని ఉద్యోగం నుంచి సాగనంపుతూ లేఖ అందచేశాను. మూడురోజుల్లో ఆయన నిష్క్రమించాడు.

మా కాలనీలో కొమ్సొమోల్ శాఖను ఏర్పాటు చేయాలనే ఉద్దేశం మాకున్నప్పటికీ అనేక కారణాల వల్ల అది సాధ్యం కాలేదు. 1923లో మాకు సమీపంలోని రైల్వేస్టేషన్‌కు దగ్గరలోనే గల ఇంజన్ వర్క్‌షాప్‌లు మా కుర్రవాళ్ల దృష్టిలో పడ్డాయి. ఆ వర్క్‌షాప్ అన్నా, అక్కడి కార్మికులన్నా తొలి పరిచయంలోనే మా వాళ్లకి చెప్పలేనంత ఆసక్తి, గౌరవం ఏర్పడ్డాయి. ఈ వర్క్‌షాప్‌లకు మహోజ్వలమైన విప్లవాత్మక చరిత్ర ఉంది. ఇక్కడ బలమైన పార్టీశాఖ ఉండేది. పిల్లల దృష్టిలో ఈ వర్క్‌షాప్‌లో ప్రతి భాగమూ ఒక అద్భుతమే. ఇక్కడి సంక్లిష్టమైన యంత్ర పరికరాలు వారిని అబ్బురపరచాయి. రాక్షసిబలంతో పనిచేసే భారీక్రేన్లు, స్టీమ్ హేమర్లు, లేత్ మిషన్లు చూసి వారు దిగ్భ్రాంతికి లోనయ్యారు. సొంత మెదడు ఉన్నట్టే పనిచేసే ఈ యంత్రపరికరాలను పూర్తిగా అదుపులో పెట్టుకొని పనులుచేసే కార్మికులు వాళ్ల కళ్లకు అద్భుతమైన వ్యక్తుల్లా కనిపించారు. కుదురైన వస్త్రధారణ, చెరగని చిరునవ్వు, అక్కడి పని కారణంగా మొహాలకు అంటిన మెరిసిపోయే కందెన నూనె, అక్కడి ప్రతి యంత్రాన్ని పనిముట్లనీ ఉపయోగించగలిగే, ముట్టుకోగలిగే హక్కు ఉండటం ఇవన్నీ చూసి మా కుర్రవాళ్లు ఆ కార్మికులను ప్రత్యేక జనంగా గుర్తించారు. రోజూ గ్రామంలో ఎదురయ్యే ఎర్రగడ్డాలవారు, బిరుసైన, మోటు మొహాల వాళ్ళు ఇక్కడ లేరు. వాళ్ల ముఖ కవళికలు తెలివితేటలతో ప్రకాశిస్తూ, జ్ఞానం, శక్తి సమకూర్చే ఆత్మస్థైర్యంతో కళకళలాడుతూండేవి. వీళ్లలో చాలమంది కొమ్సొమోల్ సభ్యులుండేవారు.

ఈ ఇంజన్ వర్క్‌షాప్‌లు మా కుర్రవాళ్ల కలలు, ఆకాంక్షలకు సరైన ప్రతినిధిగా కనిపించాయి. అప్పట్లో వివిధ నగరాల్లో ఉన్న భారీ కర్మాగారాల గురించి, అక్కడి యంత్రపరికరాల గురించి మా వాళ్లు విని ఉన్నారు. అయినా మా కళ్లెదుట ఉన్న ఇంజన్ వర్క్‌షాప్ కార్మికులు క్రమంగా మాకు సన్నిహితులయ్యారు. ఒక రోజు కార్మికుల్లో కొందరు మా కాలనీకి వచ్చారు.

కరబనోవ్ నా గదికి పరిగెత్తుకు వచ్చాడు. “ఇంజన్ వర్క్‌షాప్‌లోని కొమ్సొమోల్ సభ్యులు వచ్చారు” అని వగరుస్తూ చెప్పాడు.

ఆ కొమ్సొమోల్ సభ్యులు మా కాలనీ గురించి అంతకుముందే చాలా విని ఉన్నారు. అందుకే మాతో పరిచయం కోసం వచ్చారు. మొత్తం ఏడుగురు. మా పిల్లలు వాళ్లని ఆప్యాయంగా ఆహ్వానించారు. వారి చుట్టూ మూగారు. ఆ ఏడుగురు సాయంత్రం వరకూ మాతోనే ఉన్నారు. కాలనీలో ప్రతి భాగాన్ని ఆసక్తిగా చూశారు. ఎటువంటి పటాటోపం లేకుండా మా వాళ్లతో కలిసిపోయారు. పైగా మా కాలనీ తీరును చూసి ముగ్ధులైనట్టు కనిపించారు కూడా.

వాళ్లు పట్టణానికి తిరిగి వెళ్లే ముందు నా గదికి వచ్చి నాతో మాట్లాడారు. కాలనీలో కొమ్సొమోల్ శాఖ ఎందుకు లేదని నన్నడిగారు. ఈ అంశానికి సంబంధించి మమ్మల్ని వెన్నాడుతున్న విషాదాన్ని వారికి వివరించాను. 1922 నుంచీ ఇక్కడ కొమ్సొమోల్ ఏర్పాటు చేయాలని మేం ప్రయత్నిస్తున్నాం. అయితే స్థానిక కొమ్సొమోల్ శాఖ ఎప్పటికప్పుడు మా ప్రయత్నాలను అడ్డుకొంది. కాలనీలో ఉన్నవారు మాజీ నేరస్థులు. వాళ్లు కాలనీలోనే ఉండాలి. వాళ్లు పూర్తిగా సంస్కరింపబడ్డారని ధృవీకరించేవరకు కొమ్సొమోల్ సభ్యత్వం ఎలా ఇవ్వగలం? అన్నది స్థానికుల అభ్యంతరం.

ఇంజన్ వర్క్‌షాప్ కార్మికులు మా సమస్యను సానుభూతితో విన్నారు. పట్టణంలో కొమ్సొమోల్ సంస్థతో మాట్లాడి మాకు ఎదురవుతున్న అవరోధాలను తొలగించేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ఆ మరుసటి ఆదివారమే వారు మళ్ళీ వచ్చారు చెడ్డవార్తతో. మా కాలనీలో ఉన్న వారిలో అత్యధికులు విప్లవ ప్రతిఘాతశక్తులతో కలిసి పనిచేసినవారూ, నేరస్థులూ అయినందున వారిని పార్టీ యువజన సభ్యులుగా ఎలా తీసుకోగలమని పట్టణంలోని అధికారులు ప్రశ్నించారట.

మా కాలనీలో విప్లవ ప్రతిఘాత శక్తులతో చేతులు కలిపిన వారి సంఖ్య అతి స్వల్పమనీ, ఒకరిద్దరున్నా అప్పటి వారి వయసు దృష్ట్యా వారి నేరాన్ని తీవ్రంగా పరిగణించనవసరంలేదనీ చెప్పాను. పైగా ఈ పిల్లలను సంస్కరించడం ఒక్కటే మా బాధ్యత కాదని, కొత్త పద్ధతుల్లో వాళ్లని మేం నూతన మానవులుగా తయారు చేసేందుకు ప్రయత్నిస్తున్నామనీ వివరించాను. కాలనీ నుంచి బయటపడే వ్యక్తి సమాజానికి హాని చేయకపోవడమేకాక, నవసమాజ నిర్మాణంలో చురుకైన పాత్ర నిర్వహించేలా వారి వ్యక్తిత్వాలు తీర్చిదిద్దేలా విద్యా బోధన కొనసాగుతోందని చెప్పాను. అటువంటి కుర్రవాళ్లను కొమ్సొమోల్ సభ్యులు అయ్యే అవకాశం ఇవ్వకపోతే ఎలా? అని ప్రశ్నించాను. వాళ్లు ఎప్పుడో గతంలో చేసిన నేరాలను ఇప్పుడు చర్చనీయాంశాలుగా మార్చడంలో ఔచిత్యం ఏమిటని అడిగాను. ఆ కార్మికులు నాతో కొన్ని అంశాల్లో ఏకీభవించారు. మరికొన్ని చోట్ల విభేదించారు. అయితే మాజీ నేరస్థుడు పూర్తిగా మారాడా, లేదా అని నిర్ణయించే ఒక మార్గం ఉండాలని, దాన్ని నిర్ణయించడం కష్టమనీ వాళ్లు అన్నారు. ఎప్పుడు వీరిలో ఒకరికి కొమ్సొమోల్ సభ్యత్వం ఇవ్వచ్చు? ఎప్పుడు ఇవ్వకూడదు? దీన్ని నిర్ణయించేదెవరు?

ఆ తరువాత కూడ ఇంజన్ వర్క్‌షాప్ కొమ్సొమోల్ సభ్యులు మా కాలనీకి వచ్చేవారు. అయితే మాపై వారి ఆసక్తి అంత ఆరోగ్య కరమైనదికాదని నేను చివరికి గుర్తించగలిగాను. వాళ్లకి మా కుర్రవాళ్లంటే నేరస్థులనే అభిప్రాయం మారలేదు. వాళ్లు ఇక్కడికి వస్తున్నది పిల్లల గతాన్ని తవ్వడానికి. వాళ్ల పాత కథల గురించి తెలుసుకోడానికి. ఆ కుర్రవాళ్ల 'సంస్కరణ' విషయంలో కాలనీ విజయం సాధించిందని వారు ఆమోదిస్తున్నారు. అయినా మా కుర్రవాళ్లు సాధారణమైన పిల్లలు మాత్రం కాదు. ఇదీ వారి అభిప్రాయం. ఆ కార్మికులకు ఈ విషయానికి సంబంధించి నా వైఖరిని వివరించేందుకు ప్రయత్నించాను.

కాలనీని ప్రారంభించిన తొలి నాళ్లనుంచీ ఈ విషయంపై మా అధ్యాపక బృందం వైఖరిలో మార్పులేదు. ఒక బాలనేరస్థుడిని సమూలంగా సంస్కరించి, నూతన సమాజపు అవసరాలకు తగ్గట్టు తీర్చిదిద్దాలంటే ముందు అతని గతం గురించి అధ్యాపకబృందానికి కూడా తెలియరాదన్నది నా అభిప్రాయం. అయితే దీనిని ఆచరణలో పెట్టడం నాకు పూర్తిగా సాధ్యం కాలేదు. మానవ సహజమైన ఆసక్తి ఆయా పిల్లల గత చరిత్ర తెలుసుకోవాలనే ఉత్సుకతను నాకూ కలిగించేది. ఒక కుర్రవాడిని అసలు కాలనీకి ఎందుకు పంపారు. వాడు చేసిన నేరం ఏమిటి తెలుసుకోవాలని

నాకు అనిపించేది. రోగకారకాలు తెలిస్తే తప్ప చికిత్స సాధ్యం కాదన్న పూర్వపు బోధనా శాస్త్రానికి సంబంధించిన సిద్ధాంతం నాకు కొంతవరకు వంటబట్టడం బహుశా దీనికి కారణం.

నా తోటి టీచర్లు కూడా కొంతవరకు ఈ సిద్ధాంతాన్ని నమ్మేవారు. దీనికి తోడు కాలనీకి కొత్తపిల్లలను పంపేటప్పుడు కోర్టు కమిషన్ వారితోపాటు వారి రికార్డులు కూడా పంపేది. ఆ రికార్డుల్లో పిల్లవాడు గతంలో చేసిన నేరాలు, పడిన శిక్షల వివరాలు ఉండేవి. ఎంత వద్దనుకున్నా ఒక్కొక్కసారి ఆ రికార్డులు తిరగేసేవాళ్లం. దీనివల్ల పిల్లవాడి గురించి ముందే ఒక అభిప్రాయానికి వచ్చే ప్రమాదం ఉన్నదని నాకు తెలుసు. పిల్లవాడితో వ్యవహరించేటప్పుడు ఈ అనవసర పరిజ్ఞానం ప్రభావం మాపై ఉంటుందని నాకు తెలుసు. అందువల్ల సాధ్యమైనంత వరకు ఆ పాత రికార్డులు తిరగేయడం మానుకున్నాం. కానీ ఆచరణలో అది పూర్తిగా సాధ్యపడేదికాదు.

ఇక లాభం లేదని తేల్చుకొని మా అధ్యాపకబృందాన్ని ఒప్పించి ఇక కొత్తగా పంపే పిల్లల పాత రికార్డులు మాకు పంపవద్దని కమిషన్‌ను కోరాం. దీనితో పిల్లవాడి గతం గురించి మాకు అనవసరమైన సమాచారం అందేది కాదు. ఫలితంగా కాలనీలో చేరే పిల్లల గత చరిత్రను ప్రస్తావించే పాత అలవాటు క్రమంగా తెరమరుగైంది. దీనితో పిల్లలు కూడా అతి తేలికగా తమ గతాన్ని వెనక్కి వదిలి ముందుకు సాగేవారు. కొత్తగా వచ్చే పిల్లలు సైతం ఇది వరలో తాము చేసిన ఘనకార్యాల గురించి మాట్లాడడానికి జంకేవారు.

ఈ నేపథ్యంలో కొమ్సొమోల్ ఏర్పాటు చేయాలనే తహతహ కారణగా వాళ్లు ఇక్కడి పిల్లల గతంపై చర్చ జరపవలసిన అవసరం ఏర్పడుతున్నట్టు కనిపించింది. కానీ, దీనిని మా పిల్లలు ఒక సవాలుగా తీసుకొన్నారు. కొమ్సొమోల్ సభ్యత్వం పొందేందుకు ఆటంకాలు ఎదురయ్యేకొద్దీ పిల్లల్లో ఆ లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదల పెరుగుతోంది. అందుకోసం పోరుకు కూడా కొందరు సిద్ధమయ్యారు. అయితే ఎలాగోలా అనుకున్నది సాధించేందుకు అనవసరమైన ఘర్షణ ఎందుకు అని ఆలోచించిన టారానెట్స్‌వంటి వారు మాత్రం "పోనీ వాళ్లు అడిగినట్టు, మేం సంస్కరింప బడినట్టు ఆ ధృవీకరణ పత్రాలు ఏవో తీసుకొందాం" అని రాజీ మార్గం ప్రతిపాదించారు.

జదరోవ్ ఈ ప్రతిపాదనకు గట్టిగా ప్రతిఘటించాడు. "అదేం కుదరదు. మనం ఎవరికీ లొంగక్కర్లేదు. మందు మన కాలనీలో మన సొంత కొమ్సొమోల్ కమిటీని ఏర్పాటు చేద్దాం. సభ్యత్వానికి, ఎవరు అర్హులో, ఎవరుకారో ఆ కమిటీయే నిర్ధారిస్తుంది" అని తేల్చాడు. దాని కోసం పిల్లలు తరచు పట్టణం వెళ్లి అక్కడి కొమ్సొమోల్ బృందాలను కలిసి తమ ఆకాంక్షను తెలియచేసేవారు. కానీ ప్రయోజనం ఉండేది కాదు.

ఇలాంటి రోజుల్లో 1923 శీతాకాలంలో అనుకోకుండా ఒక కొత్త కొమ్సొమోల్ బృందాన్ని కలుసుకున్నాం. అది అనుకోకుండా జరిగింది.

బ్రాచెంకో, నేనూ ఓ రోజు బండిమీద పట్టణం నుంచి వెనక్కి వస్తున్నాం. సరిగ్గా కొండవాలు దిగుతున్నప్పుడు అనూహ్యమైన రీతిలో రోడ్డు మీద మాకు ఒక ఒంటె ఎదురుపడింది. ఎన్నడూ చూడని ఆ వింత జంతువుని చూసి మా గుర్రం మేరీ బెదిరిపోయింది. ఒక్కసారిగా సకిలించి ముందుకెళ్లి పైకెత్తి ముందుకు దూకింది. శరవేగంగా పరుగు అందుకుంది. దాన్ని అదుపులోకి తెచ్చేందుకు బ్రాచెంకో విశ్వప్రయత్నాలు చేశాడు. లాభం లేకపోయింది. నేను సైతం బ్రాచెంకోకు సాయంగా కళ్లేలు అందుకొని వెనక్కి గుంజాను. గుర్రం మరింత బెదిరి, ఇంకొంత బలంగా బండిని ముందుకు ఈడ్చుకుపోతోంది. నేను రోడ్డుపైకి ముందుకి చూశాను. జరగబోయే ప్రమాదం

అర్థమైంది. దూరంగా మలుపులో కొందరు రైతులు తమ బళ్లని ఆపి గుంపుగా నిలబడి తమ గుర్రాలకు నీళ్లు పట్టే సన్నాహాల్లో ఉన్నారు. మా బండి కనుక ఇదే దిశలో, ఇదే వేగంతో దూసుకువెళితే మేం సూటిగా వెళ్లి ఆ గుంపులో జొరబడడం ఖాయం. ఏం చేయగలను? అని ఆలోచించే లోపే మా గుర్రం ఒక్కసారిగా పక్కకు గెంతి జనాన్ని తప్పించుకుంటూ నీళ్లతొట్టికీ–ఆగి ఉన్న బళ్లకీ మధ్య నుంచి దూసుకెళ్లింది. జనానికి ప్రమాదం జరగలేదు. కానీ మా బండి ఆ పక్కనే ఉన్న బళ్లను గుద్దుకుంటూ ముందుకు సాగింది. చెక్కలు విరిగిన చప్పుడు స్పష్టంగా వినిపించింది. వెనక్కి చూసే ధైర్యం లేకపోయింది. 'బ్రాచెంకో మనం ఎవరి బళ్లనో ధ్వసం చేశాం' అన్నాను ఆందోళనగా.

వాడు మాట్లాడకుండా గుర్రాన్ని అదేపనిగా బాదడం మొదలుపెట్టాడు. వాడి ఉద్దేశం అర్థమైంది. జనం తేరుకొని మమ్మల్ని వెంటాడేలోగా అక్కడి నుంచీ ఉడాయిద్దామని వాడి ప్రయత్నం.

నేను వాడిని వారించాను "ప్రయోజనం లేదు. గుర్రాన్ని అదుపు చెయ్యి" అన్నాను. ఎందుకంటే అప్పటికే వెనక్కు చూసిన నాకు ఒక రౌతు బలమైన గుర్రం మీద మమల్ని వెంటాడ్డం కనిపించింది. బ్రాచెంకోకు అర్థమై గుర్రాన్ని ఆపాడు. ఇంతలో వెనక నుంచీ ఆ రౌతు మమ్మల్ని సమీపించాడు. అతని దుస్తులు చూస్తే మిలటరీ మనిషని తెలిసిపోతోంది. అతను మమ్మల్ని చూసి, "వెనక్కి తిరగండి, నాతో రండి" అని కోపంగా ఆదేశించాడు. ఏం చేస్తాం. అతన్ని అనుసరించాం. అంతా కలిసి వెనక్కి వెళ్లి, స్థానిక మిలిటరీ శిబిరం వద్ద ఆగాం. దాన్ని చూసి బ్రాచెంకో కొంత కలవరపడ్డాడు. ఈలోగా మరికొందరు మిలిటరీ అధికారులు మమ్మల్ని చుట్టుముట్టారు. వారిలో ఒకరు కోపంతో అరుస్తున్నారు.

"చూడండి. చిన్న కుర్రవాడు బండి తోలుతున్నాడు. గుర్రం అదుపు తప్పిందంటే తప్పదా మరి?" అంటూ నా వంక చూశాడు. "ఏమయ్యా పెద్దమనిషి మీరే దీనికి బాధ్యత వహించాలి" అన్నాడు.

బ్రాచెంకో బెదిరిపోయాడు. వాడి కళ్లలో నీళ్లు తిరిగాయి. బాధగా తలవిదిల్చాడు. "చిన్న కుర్రవాడినా. సరే. కానీ మీ తప్పులేదా? రోడ్ల మీదకి అలా ఒంటెలని రానివ్వచ్చా? గుర్రాలు బెదిరిపోవా? అలాంటి జంతువుల్ని ఇటువంటి చోట్ల విహారానికి వదలవచ్చా?" అని అడిగాడు.

ఆ అధికారి ఆశ్చర్యపోయాడు. "ఎలాంటి జంతువులు?" అని అడిగాడు.

"అవే, ఒంటెలు" అని బ్రాచెంకో బదులిచ్చాడు.

మిలిటరీ అధికారులంతా ఘొల్లున నవ్వారు.

"మీరెక్కడి నుంచి వస్తున్నారు?" ఒక అధికారి ప్రశ్నించాడు. నేను చెప్పాను.

"ఓహో. మీరా? గోర్కీ వాసులన్నమాట. అయితే మీరూ?...బహుశా డైరెక్టర్ కాబోలు" అంటూ పెద్దగా నవ్వి, సహచరులను దగ్గరికి పిలచి మా గురించి చెప్పాడు. వాళ్ల మొహాలు చూస్తే మా రాకకు వారు సంతోషిస్తున్నట్టే కనిపించింది.

మిలిటరీ సిబ్బంది మా చుట్టూ చేరి దెబ్బతిన్న బండి యజమానిని గేలిచేశారు. కాలనీ గురించి బ్రాచెంకోను ప్రశ్నలతో ముంచెత్తారు.

తరువాత వాళ్లు మాతో చెప్పారు. చాలా కాలంగా మా కాలనీకి వద్దామని అనుకుంటున్నారట. మా గురించి వాళ్లు విన్నారట. వచ్చే ఆదివారం తప్పక వస్తామని చెప్పారు.

ఈలోగా ఆ మిలిటరీ విభాగం సప్లైల మేనేజర్ వచ్చి ధ్వంసమైన బండి గురించి, జరిగిన నష్టం

గురించి కోపంగా కేకలు పెట్టాడు. అప్పటికప్పుడు వాంగ్మూలాలు నమోదు చేయాల్సిందేనన్నాడు. కానీ మిగిలినవాళ్లు అతన్ని వారించారు.

"చాల్చాలు ఊరుకోవయ్యా. ఏంటి నువ్వు రికార్డు చేసే ఫిర్యాదు? చాల్లే ఊరుకో. మన బండి పాడైంది. అంతే కదా! వాళ్లు దాన్ని బాగుచేసి ఇస్తారు కదా?" అంటూ మా వైపు తిరిగి "ఏమండి, ఆ బండిని బాగుచేస్తారు కదా!" అని అడిగారు.

నేను దానికి ఒప్పుకున్నాను. ఈలోగా కావాలంటే మా కాలనీలో అదనంగా ఉన్న మరో బండిని ఇస్తామని కూడా వాగ్దానం చేశాను. సప్లైల మేనేజర్ గొణుక్కుంటూ వెళ్లిపోయాడు. ఆ మిలటరీ సిబ్బంది బ్రాచెంకో చుట్టూచేరి ప్రశ్నలు మొదలుపెట్టారు. "బాబూ, మీ కాలనీ గురించి చెప్పు. మీ దగ్గర ఒక జైలు గది కూడా ఉందట! నిజమేనా?" అని అడిగారు.

బ్రాచెంకోకు కోపం వచ్చినట్టుంది. "మా కాలనీలో సరే, మీ బెటాలియన్ ఆఫీసులో అలాంటి జైలుగది ఉందా?" అని ఎదురు ప్రశ్న వేశాడు.

దీంతో అందరూ పగలబడినవ్వారు. వచ్చే ఆదివారం కాలనీలో కలుద్దాం అని వారు వీడ్కోలు చెప్పారు.

✤ ✤ ✤

ఆ ఆదివారం నిజంగానే వాళ్లు మా కాలనీకి వచ్చారు. వారిలో కొమ్సొమోల్ సభ్యులు కూడా ఉన్నారు. వాళ్లు మా కాలనీ అంతా తిరిగి దాని తీరుతెన్నులను చూసి ముచ్చటపడ్డారు. చివరిలో కొమ్సొమోల్ గురించి చర్చ రానే వచ్చింది. ఇంత పెద్ద కాలనీలో, ఇందరు యువకులు ఉండగా కొమ్సొమోల్ శాఖ లేకపోవడం ఏమిటని వారికి అనుమానం వచ్చింది. నేను ఓపికగా జరిగినదంతా వివరించాను. వాళ్లు ఆశ్చర్యపోయారు. "ఎవరు అభ్యంతరపెడుతున్నది? వాళ్ల ఉద్దేశ్యమేమిటి? వీళ్లు నేరస్థులా? ఎంత చెత్త ఆరోపణ! అటువంటి పనికిమాలిన ఆరోపణ చేస్తున్నందుకు వాళ్లు సిగ్గుపడాలి. చూద్దాం. దీని సంగతి తేలుద్దాం. ఇక్కడ ఈ సమస్య తేలకుంటే ఖార్కోవ్ వరకైనా వెళదాం" అని మమ్మల్ని ఊరడించారు.

ఖార్కోవ్‌లో పార్టీ పెద్దలు కొమ్సొమోల్ ఏర్పాటు విషయంలో మాకు ఎదురైన కష్టాలు, అవమానాల గురించి తెలుసుకొని ఆశ్చర్యపోయారు. అసలు ఇంతకాలం కొమ్సొమోల్ లేకుండా పనిచేస్తున్నందుకు ఆశ్చర్యం ప్రకటించారు. కొత్త మిత్రుల సాయం, ఖార్కోవ్ అధికారుల సానుభూతి, పట్టణంలో మా శ్రేయోభిలాషుల మద్దతు వల్ల రెండురోజులు తిరగకుండా కాలనీలో కొమ్సొమోల్‌శాఖ ఏర్పాటుకు అనుమతి లభించింది. ఉక్రైన్ కేంద్ర కొమ్సొమోల్ కమిటీ మాకు పచ్చజెండా ఊపింది.

టెఖోన్ నెస్త్రోవిచ్ కోవల్ మా కాలనీకి రాజకీయ బోధకునిగా నియమితులయ్యారు. ఈ పెద్దమనిషి గతపాతికేళ్లలో ఎన్నో అనుభవాలు సంపాదించాడు. గ్రామాల్లో రైతాంగాన్ని సమీకరించి పోరాటాలు నడిపాడు. స్వతహాగా రైతు అయిన కోవల్ ఈ క్రమంలో అపరిమిత సైద్ధాంతిక పరిజ్ఞానాన్ని కూడా సంపాదించాడు. తెలివితేటలతోపాటు మంచితనం కూడా ఉన్న కోవల్ మొదటి క్షణం నుంచే కాలనీ పిల్లలను తనతో సమానులుగా చూశాడు. వారిని కామ్రేడ్ అని సంబోధించాడు. అతని సారథ్యంలో కాలనీలో మొదటి కొమ్సొమోల్ బృందం తొమ్మిదిమంది సభ్యులతో ఏర్పడింది.

28

కొత్త కాలనీ నుంచి రోడించిక్ టీచర్ నిష్క్రమణ తరువాత మిగిలిన ఏకైక అధ్యాపకుడు దెర్యుచెంకో తనకు ఉక్రైన్ తప్ప రష్యన్ మాట్లాడ్డం రాదనేవాడు. అలాంటిది ఆయన ఉన్నట్టుండి రష్యన్‌లో

మాట్లాడాడు. ఇదో పెద్ద కథ. అతనికి సంబంధించి వరసగా అనేక విషాదఘటనలు జరిగిన తరువాత ఈ పరిణామం సంభవించింది. కాలనీలో ఉన్న దెర్యుచెంకో భార్య గర్భవతి. ఇది జరిగేనాటికి ఆమె తనకు పురుడు రాబోతోందని తేల్చుకుంది. తనకి వారసుడు పుట్టబోతున్నాడని తన ఉక్రైన్ కొస్సవ్ వంశానికి కొనసాగింపు ఉండబోతోందని దెర్యుచెంకో ఆనందంతో తలకిందులయ్యాడు.

అతను బ్రాచెంకో వద్దకు వచ్చి పట్టణం నుంచి మంత్రసానిని తెచ్చేందుకు గుర్రబ్బండి ఏర్పాటు చేయాలని (ఉక్రైన్ భాషలోనే) అడిగాడు. ఎప్పట్లానే బ్రాచెంకో అతని కోరికను మొండిగా తిరస్కరించాడు. “మంత్రసాని ఉన్నా, లేకున్నా ఒక్కటే” అని తేల్చిచెప్పాడు. అయినా చివరికి దెర్యుచెంకో కోరిన విధంగా బండికి గుర్రాలను ఇచ్చాడు. అయితే కాబోయే తల్లిని పట్టణానికి తీసుకువెళ్లవలసిన అవసరం కనిపించింది. దాంతో బ్రాచెంకో కోపంతో ఎగిరిపడ్డాడు. ఏమైనా సరే ఈసారి గుర్రాలను ఇచ్చేదిలేదని భీష్మించుకున్నాడు.

కానీ నేనూ, షెర్రీ, కాలనీలో ఇతర పెద్దలూ జోక్యం చేసుకొని బ్రాచెంకోను గట్టిగా మందలించాం. దాంతో వాడు దారికి వచ్చినట్టు కనిపించినా, తన అసంతృప్తిని దాచుకోలేదు. మా దగ్గరున్న అతి నాసి గుర్రాలను, ఒక పనికిరాని బండిని దెర్యుచెంకో దంపతులకు ఏర్పాటు చేశాడు. కానీ దెర్యుచెంకోకు చివరకు నిరాశే మిగిలింది. పట్టణంలో ఆసుపత్రిలో అతని భార్య ఒక మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ దంపతులు ఆ బిడ్డకు టారస్ అని పేరుపెట్టారు. కానీ వారం తిరక్కుండానే ఆ పసివాడు ఆసుపత్రిలోనే ప్రాణం విడిచాడు. ఆ దంపతులు కాలనీకి తిరిగివచ్చారు. దెర్యుచెంకో కొద్దిరోజులపాటు విచారగ్రస్తమైన మొహంతో కనిపించాడు. అతని విషాదం అంతటితో ముగియలేదు.

కాలనీ టీచర్లు సైతం ఉమ్మడి వంటశాలలో తయారైన ఆహారమే తీసుకొనేవారు. అయితే కాలనీలో కొన్ని కుటుంబాలు కూడా నివసిస్తూండడంతో వారి కోసం, వారు కోరినట్లయితే వంటకు అవసరమైన రేషన్‌ను ఎప్పటికప్పుడు అందించాలని అంతకుముందే నిర్ణయించాం. దెర్యుచెంకో కుటుంబం కూడా అలా వంటకు రేషన్ సామాగ్రి తీసుకొన్నది. ఇంతవరకు అంతా సజావుగానే సాగింది. ఒకసారి పట్టణంలో నాకు అనుకోకుండా కొద్ది మొత్తంలో వెన్న కూడా లభించింది. చాలా కొద్ది మొత్తం. ఉమ్మడి వంటశాలలో వినియోగిస్తే అది నాలుగురోజులక్కూడా చాలదు. అంతకొంచెం అన్నమాట. అందువల్ల కుటుంబాలకు అందచేసే వంటరేషన్ సరుకుల్లో ఆ వెన్నను కూడా చేర్చాలనే ఆలోచన ఎవరికీ రాలేదు.

కానీ ఉమ్మడి వంటశాలలో ఇలా వెన్న ఉందనీ, కాలనీ భోజనశాలలో అందరికీ అది లభిస్తోందనీ తెలిసిన దెర్యుచెంకో తనకు అన్యాయం జరుగుతోందని భావించాడు. దాంతో అతను తమకు విడిగా వంటరేషన్ అవసరంలేదని, తన కుటుంబంకూడా, అందరితో కలిసి భోజనం చేస్తుందనీ పేర్కొంటూ నాకు ఒక లేఖ పంపాడు. నాకు అభ్యంతరం ఏమిటి? అనుమతి ఇచ్చాను. కానీ, దురదృష్టవశాత్తు దెర్యుచెంకో దంపతులు ఉమ్మడి భోజనశాలకు వచ్చేనాటికే స్టోర్ గదిలో వెన్న అయిపోయింది. ఇది చూసి దెర్యుచెంకో ఆగ్రహంతో రగిలిపోయాడు. నా వద్దకు వచ్చి ఇది అన్యాయమని ఆక్రోశించాడు.

మేం తనని వెర్రివెంగళప్ప కింద చూస్తున్నామని, వెన్న లేకుండా చేశామనీ ఆరోపించాడు. నేను ఆశ్చర్యపోయాను. “వెన్న ఎక్కడిది? కొంచెం ఉండేది. అయిపోయింది” అని చెప్పాను.

దెర్యుచెంకో నిస్పృహ చెందాడు. మళ్లీ తనకు వంట రేషన్ విడిగా ఇప్పించమని కోరుతూ దరఖాస్తు పెట్టుకొన్నాడు. అనుమతి ఇచ్చాను. అయితే అతను ఎంత దురదృష్టవంతుడంటే మళ్లీ

ఈసారి మాకు కొంచెం వెన్న లభ్యమైంది. తిరిగి పాతకథే పునరావృతమైంది. ఈలోగా ఆహార రేషన్ పెరిగిన దృష్ట్యా గత పదిహేనురోజుల నుంచీ కోటా పెంచేందుకు మాకు పై నుంచి అనుమతి లభించింది. మిగిలిన వారికి ఇది వర్తించకున్నా వంటరేషన్ విడిగా తీసుకొనేవారు ఇవానోవిచ్ వద్దకు వచ్చి గడచిన పదిహేను రోజులకు చెందిన అదనపువాటాను తీసుకెళ్లారు. ఇందులో పేచీ లేదు. గొడవంతా మళ్లీ డెర్యుచెంకో నుంచే వచ్చింది.

గడచిన పదిహేను రోజుల్లో తన కుటుంబంలో టారస్ అనే కొత్త సభ్యుడు కూడా ఉన్నందున వాడికి రావలసిన అదనపు కోటా కూడా తనకు జారీ చేయాలని డెర్యుచెంకో గొడవ పెట్టుకున్నాడు.

ఈ ధోరణి ఇవానోవిచ్‌కి అర్థం కాలేదు.

"కోటా పెరిగిన మాట నిజం. అది తీసుకునే హక్కు మీకు ఉంది. కాదనను. కానీ, పుట్టిన వారంరోజులకే కన్నుమూసిన బిడ్డ పేరిట అదనపు కోటా ఇమ్మంటే ఎలా?" అని డెర్యుచెంకోను ప్రశ్నించాడు.

డెర్యుచెంకో ఆగ్రహించాడు. అందరూ కలిసి తనను అన్యాయం చేస్తున్నారన్నాడు. గత పదిహేను రోజుల్లో తన కుటుంబంలో కొత్త సభ్యుడు ఒకరు వచ్చి చేరినట్టు అసుపత్రి నుంచి ధృవీకరణపత్రం సమర్పించాననీ, అందువల్ల ఆ సభ్యుడి పేరిట కూడా అదనపు కోటా ఇవ్వాలనే పట్టుపట్టాడు.

మరణించిన పసిబిడ్డ పేరిట అదనపు కోటా కోరడం మూర్ఖత్వమనీ, అంతగా కావాలంటే ఆ బిడ్డ అంత్యక్రియలకు కాస్తంత సాంబ్రాణి ఇవ్వగలననీ ఇవానోవిచ్ స్పష్టం చేశాడు.

దీంతో డెర్యుచెంకో పూర్తిగా అదుపుతప్పాడు. అడ్డదిడ్డంగా పోట్లాడడం మొదలుపెట్టాడు. చివరికి పట్టణం వెళ్లి మా మీద విద్యాశాఖ ఉన్నతాధికారికి ఫిర్యాదు చేశాడు. ఆయనకి ఇదేం అర్థం కాలేదు. నాకు కబురు పంపాడు.

"మీ దగ్గర పని చేసే టీచర్‌ట, ఒకాయన వచ్చాడు. ఏమిటో వెన్న అంటాడు. అదనపు కోటా అంటాడు. అన్యాయం జరిగిందంటాడు. ఏమిటిదంతా? అసలు అటువంటి విడ్డూరమైన మనిషిని ఎలా భరిస్తున్నారు? అతన్ని ఎందుకు కొనసాగిస్తున్నారు?" అని నన్ను విసుగ్గా ప్రశ్నించాడు.

"ఆయన్ని మాకు పంపినది మీరేనండీ" అని తెలియజెప్పాను.

"నేనా? సరే... సరే....అతన్ని పంపేయండి" అన్నాడాయన విసుగుతో నాలుగు రోజుల తరువాత డెర్యుచెంకో దంపతులు కాలనీని వదిలి వెళ్లిపోయారు.

✣ ✣ ✣

డెర్యుచెంకో నిష్క్రమణ మంచి పరిణామమే అయినా అతని స్థానంలో మరో టీచర్ ఎక్కడ నుంచి వస్తాడన్న సమస్య నాకు ఆందోళన కలిగించింది. ఎందుకంటే అప్పటికే రోడించిక్ కూడా కొత్త కాలనీ నుంచి వెళ్లిపోయినందున అక్కడ అధ్యాపక బాధ్యతలు నిర్వహించేందుకు ఒక్కరు కూడా మిగల్లేదు. అయితే ఈ విషయంలో గోర్కీ కాలనీని ఎప్పటిలానే అదృష్టం వరించింది. అనూహ్యమైన రీతిలో ఒక కొత్త టీచర్ మాకు తారసపడ్డాడు.

ఆ రోజు మామూలుగా పట్టణం వెళ్లి మా కాలనీకి కావలసిన సరుకులు సంపాదించాం. విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఆ సామాగ్రిని నేను బ్రాచెంకో బండిపైకి ఎక్కిస్తున్నాం. ఆ క్రమంలో బ్రాచెంకో రోడ్డు మీది ఒక గుంటలో కాలేసి బోర్లాపడ్డాడు. అంతకు ముందు నుంచీ ఆ కార్యాలయం బయట కిటికీని ఆనుకొని నిలబడిన ఒక వ్యక్తిని నేను గమనిస్తున్నాను. బ్రాచెంకో కింద పడగానే ఆ వ్యక్తి పరుగున వచ్చి అతనికి సాయపడడమే కాక, ఆ తరువాత ఇంకా మిగిలిన సామాగ్రిని

బండిలోకి ఎత్తేందుకు నాకు సాయపడ్డాడు. పని పూర్తియిన తరువాత అతనికి కృతజ్ఞతలు తెలిపాను. తెలివితేటలతో మిలమిలలాడుతున్న మొహం, సన్నగా, ఆరోగ్యంగా ఉన్న శరీరం, నేను కృతజ్ఞతలు తెలిపినప్పుడు హుందాగా నవ్విన తీరు నాకు నచ్చాయి. అతని తలపై నుంచీ తెల్లటి కొస్సాక్ టోపీ తొంగి చూస్తోంది. చూస్తుంటే మిలిటరీ నుంచి వచ్చినట్టు అర్థమవుతోంది.

"ఎవరండీ మీరు. మిలిటరీ నుంచి వచ్చారా?" అనడిగాను. అవునన్నాడు. ఎందుకు ఇక్కడ నిలబడ్డారని అడిగాను. విద్యాశాఖ ఉన్నతాధికారి కోసం ఎదురుచూస్తున్నాని చెప్పాడు.

'ఎందుక'ని అడిగాను.

'పని కోసం' అని చెప్పాడు.

'ముందు నాతో మాట్లాడండ'ని అడిగాను.

ఇద్దరం మాట్లాడుకున్నాం. తరువాత అతను కూడా మాతో బండిలో కాలనీకొచ్చాడు. అతనికి కాలనీ అంతా చూపించాను. ఎంతో ముచ్చటపడ్డాడు. ఆ సాయంత్రానికల్లా అతన్ని మా కాలనీలో కొత్త టీచర్‌గా నియమించే పత్రాలని తెప్పించగలిగాను.

అతనిపేరు ప్యోటోర్ ఇవానోవిచ్. వ్యాయామ విషయాల్లో నిపుణుడైన అతను ఇక్కడ డ్రిల్ టీచర్‌గా నియమించాను. అతను మా కాలనీ పురోభివృద్ధికి అవసరమైన ఎన్నో అర్హతలు కలిగి ఉన్నాడు. యవ్వనం, ఆరోగ్యం, అపరిమితమైన సహనం, చెరగని చిరునవ్వు, స్నేహంగా కలిసిపోగల గుణం అతని సంపద. పైగా కాలనీ అభివృద్ధికి సంబంధించి నా సిద్ధాంతాలను ఆది నుంచీ తుదికంటా అతను ఆమోదించాడు. తనొక టీచర్‌ననే ఆధిక్యతా భావాన్ని పిల్లలముందు అతను ప్రదర్శించలేదు. అలా అని తన గౌరవాన్ని కోల్పోయే ఎటువంటి పనులూ చేయలేదు. అతనికి స్వార్థమన్నది లేదని త్వరలో బోధపడింది. శరీరం అలిసిపోతుందేమోనన్న భయం కూడా ప్యోటోర్‌కు లేదు. అతనికి మిలటరీ శిక్షణ అంటే అపారమైన ఇష్టం. అన్నిటికీ తోడు పియానో వాయించగలడు, అంతో ఇంతో కవితాత్మ కూడా ఉంది. అతను మాతో వచ్చి చేరిన మర్నాడే కొత్త కాలనీలో ఒక సరికొత్త క్రమశిక్షణ కనిపించింది. నవ్వుతూ, తుళ్ళుతూ, చతురోక్తులు విసురుతూ, ఉత్సాహంగా పనిచేస్తూ కొద్ది గంటల్లో ప్యోటోర్ కొత్తకాలనీ పిల్లల వ్యవహారశైలిని మార్చేశాడు. ముందే చెప్పినట్టు పిల్లల శిక్షణకు సంబంధించి నా అభిప్రాయాలతో అతను పూర్తిగా ఏకీభవించాడు. నాటి నుంచీ చివరి వరకూ అతని నిబద్ధతలో మార్పులేదు. దీనివల్ల ప్రతికొత్త అధ్యాపకునితో గంటల తరబడి నా విధానాల గురించి వివరించి, ఒప్పించే శ్రమ ఈ సారి తప్పింది.

నాటి నుంచి రెండు కాలనీల్లో పిల్లల కార్యక్రమాలు ఒక పద్ధతిలో క్రమశిక్షణతో ముందుకు సాగాయి. నా సిబ్బంది పై నేను పూర్తిగా ఆధారపడగలనని ఆందోళన అవసరంలేదని అతి త్వరలోనే రుజువైంది. రాజకీయ సలహాదారు, అధ్యాపకుడు కోవల్, వ్యవసాయ నిపుణుడు షెరీ, కొత్త డ్రిల్ మాస్టారు ప్యోటోర్‌లు మా పాత టీచర్లపంథాలోనే నిబద్ధతో, నిజాయితీగా పని చేయడంతో ఇక సమస్యలనేవి ఎదురుకావన్న నమ్మకం కూడా నాకు కలిగింది.

నాటికి కాలనీలో ఎనభైమంది పిల్లలు ఉన్నారు. 1920-21 నాటి తొలి బృందం తమ సీనియారిటీ వల్లనైతేనేమి, అనుభవం నేర్పిన పాఠాలవల్లనైతేనేమి సహజంగానే నాయకత్వ స్థానంలో ఉన్నారు. కాలనీకి వచ్చే కొత్త పిల్లలకు ముందు వాళ్లే ఎదురుపడేవారు. వచ్చిన వారు వాళ్లని చూసి ఇక్కడ కాలనీలు ఇలానే ఉండాలి అని అర్థం చేసుకునేవారు. కొత్తగా వచ్చిన వారిలో ఒకరిద్దరు తమ సొంత పద్ధతిలో ఇక్కడి క్రమశిక్షణను ఉల్లంఘించబోయినా అతి త్వరలోనే వారు దారికొచ్చేవారు.

ఇక్కడి పని పద్ధతిలో ప్రస్ఫుటమయ్యే క్రమం, నిరాడంబరత, ఎంతటి కష్టానైనా సిద్ధపడే పెద్ద పిల్లల సంసిద్ధత కొత్తవారిని సైతం ఆకర్షించేవి. అప్పటికే కాలనీలో రోజువారీ జీవితానికి సంబంధించి కొన్ని పద్ధతులు, కొన్ని సంప్రదాయాలు ఏర్పడ్డాయి. బహుశా ఈ సంగతి మా సీనియర్ కుర్రవాళ్లు సైతం గమనించి ఉండరు. కాలనీలోని ప్రతిసభ్యుడి రోజువారీ కార్యక్రమం ఖచ్చితంగా ముందే నిర్ణయమైపోయేది. ఎవ్వరూ, ఆ నిర్ణీత కార్యక్రమాన్ని అడ్డుకునేందుకుగానీ, నియమాలను ఉల్లంఘించేందుకుగానీ ప్రయత్నించేవారు కాదు.

అప్పట్లో కాలనీ పిల్లల అందరి లక్ష్యం కొత్త కాలనీని నివాసయోగ్యంగా మార్చడం. అక్కడ మరమ్మతులు పూర్తిచేయడం. కొత్త కాలనీలో ఊపందుకుంటున్న ఆర్థిక కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం. ఇవన్నీ బాధ్యతలన్న సంగతి కాలనీ కుర్రవాళ్లందరికీ తెలుసు. ఈ విషయంలో వాదోపవాదాలకు, చర్చలకు తావుండదు. దాని కోసం అందరం ఎటువంటి త్యాగాలకైనా సిద్ధపడేవాళ్లం, ఎలాంటి ఇబ్బందులనైనా సహించేవారం. మా సర్వసభ్య సమావేశాల్లో ఎవరైనా పిల్లవాడు అందరికీ మరో జత దుస్తులు ఉండవలసిన అవసరం గురించి ప్రస్తావించేవాడు. దీనికి నేను ప్రశాంతంగా, సరదాగా బదులిచ్చేవాడిని.

“మొదట కొత్త కాలనీ పని పూర్తి కానివ్వండి. అక్కడి వివిధ ఆర్థిక కార్యక్రమాల ద్వారా మన ఆదాయాన్ని, సంపదను పెంచుకుందాం. అప్పుడు కాలనీ పిల్లలందరికీ కొత్త దుస్తులు వస్తాయి. మగపిల్లలకు ఊదారంగు జాకెట్లు తీసుకుందాం. వాటికి వెండిరంగు అంచులుంటాయి. మన ఆడపిల్లలకు చక్కటి సిల్కు దుస్తులు తీసుకుందాం. వాటితో పాటే నదరైన తోలుబూట్లు కూడా సమకూరుస్తాం. అలాగే ప్రతి డిటాచ్‌మెంట్‌కు ఒక్కొక్క కారు, కాలనీ సభ్యులందరికీ తలొక సైకిలు కూడా అమరుద్దాం. కాలనీలోనే వేలాది గులాబీ పొదలు పెంచుదాం. అర్థమైందా? ఈలోగా దుస్తుల కోసం ఉన్న మూడొందల రూబుళ్లను ఒక మంచి ఆవును కొనేందుకు ఉపయోగిద్దాం” అని చెప్పేవాడ్ని.

దాంతో పిల్లలు ఘొల్లున నవ్వేవారు. ఆ తరువాత వాళ్ల దుస్తులపై అతుకులు వారికి పెద్ద ఇబ్బందిగా అనిపించేవి కావు. చమురు మరకలతో జిడ్డోడుతున్న బూడిదరంగు చొక్కాలు వారికి చిరాకు కలిగించేవి కావు.

కాలనీలో అప్పటికే పెద్దలుగా గుర్తింపు పొందిన కుర్రవాళ్లు కూడా ఒక్కొక్కసారి విధి నిర్వహణలో పొరపాట్లు చేసి విమర్శలకు గురయ్యేవారు. అయితే దానికి ఎవరూ నొచ్చుకునేవారు కాదు. అయితే వారి నేతృత్వంలో కాలనీ వ్యవహారాలు ఎంతో సజావుగా, సక్రమంగా సాగిపోతుండేవి. ఇంతకీ కాలనీ ‘పెద్దలు’గా గుర్తింపు పొందిన ఈ కుర్రవాళ్లకి ఆ పదవులు ఎవరూ కట్టబెట్టలేదు. కేవలం లక్ష్యసాధన పట్ల నిజాయితీ, నిబద్ధతల కారణంగా వారికి ఆ హోదా లభించింది.

ఈ ‘పెద్ద’ల్లో అందరూ నా పాత మిత్రులే ఉన్నారు. వారికి ఒకరిద్దరు కొత్త కుర్రవాళ్లు కూడా జత చేరారు. కరబనోవ్, జదరోవ్, వెర్షనోవ్, బ్రాచెంకో, వోల్కోవ్, వెట్కోవ్‌స్కీ, టారానెట్స్, బరున్, గడ్, ఒసాడ్చీ, నాస్త్యా వాళ్లు. ఇటీవలికాలంలో ఒప్రిష్కో, జార్జివ్‌స్కీ, జోర్కవోల్కోవ్, అల్యోషావోల్కోవ్‌లు కూడా ఈ జాబితాలో చేరారు.

బ్రాచెంకో సహాయకునిగా తన బాధ్యతల స్వీకరించిన ఒప్రిష్కో క్రమంగా తన గురువు లక్షణాలన్నీ పుణికి పుచ్చుకున్నాడు. గుర్రాలంటే అమిత ప్రేమ, పనిపట్ల అపారమైన శ్రద్ధ అతని లక్షణాలుగా

మారాయి. ఒప్రిష్కోకు అంత సృజనశీలత, తెలివి లేకున్నా పనిపట్ల గల శ్రద్ధ అతన్ని నాయకత్వ స్థానానికి పెంచింది. జిప్సీలా కనిపించే జుర్కెవ్ స్కీని మొదట ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. నల్లటి కళ్లు, మబ్బు పట్టినట్టుండే శరీరఛాయ, బద్ధకంగా నవ్వే తీరు, సొంత ఆస్తిని కలిగి ఉండాలనే తపన ఈ లక్షణాలను చూసి అతన్ని మా వాళ్లు అపార్థం చేసుకున్నారు. అయితే అతని మాటతీరు, వ్యవహారశైలి చూస్తే విద్యాధికులైన తల్లిదండ్రుల వద్ద పెరిగాడని అనిపించేది. అతను అప్పటికే బాగా చదువుకున్నవాడు. అందంగా, షోగ్గా ఉండేవాడు. అతని తీరులో, నడతలో ఒక ఠీవీ కనిపించేది. జార్జివ్‌స్కీ ధోరణి చూసిన మిగతా పిల్లలు వాడు మాజీ గవర్నర్ పుత్రుడని తేల్చారు. దీన్ని వాడు ఖండించాడు. నిజానికి వాడి రికార్డులు చూసినా వాడిపై ఇంతటి ఆరోపణ చేసేందుకు అవకాశం కనిపించలేదు. జార్జివ్ స్కీ కొత్త కాలనీకి ఒక కమాండర్ హోదాలో వెళ్లాడు. త్వరలోనే మిగతా కమాండర్ల కంటే భిన్నమైనవాడినని రుజువు చేసుకొన్నాడు. వాడు తన డిటాచ్‌మెంట్‌లో పిల్లలందరి గురించి జాగ్రత్తగా పట్టించుకునే వాడు. వాళ్ల శుభ్రత తలకట్టు, దుస్తుల శుభ్రత వంటి చిన్న చిన్న అంశాలను సైతం వదిలేవాడుకాదు. తన డిటాచ్‌మెంట్‌లోని పిల్లలకు ఎప్పుడూ ఏదో ఒకటి చదివి వినిపించేవాడు. వాళ్ల అనుమానాలు తీర్చేవాడు. కొత్తగా వచ్చిన పిల్లల్లో ఎంత మొండివాడిని వాడికి అప్పగించినా వారంరోజుల్లో దారికి తెచ్చేవాడు. ఓపికగా అనునయించడం, క్రమశిక్షణ అవసరం గురించి, శుభ్రంగా ఉండవలసిన అవసరం గురించి వివరించడం జార్జివ్ స్కీకి తెలిసినంతగా మరెవరికీ తెలియదు.

కాలనీలో ఇద్దరు వోల్కోవ్‌లు ఉండేవారు. జోర్క, అల్యోషా అనే ఇద్దరూ అన్నదమ్ములు. వాళ్లలో జోర్క అతి బద్ధకస్తుడు. జబ్బు మొహంతో కనిపించేవాడు. ఎప్పుడూ నవ్వేవాడు కాదు. ఎవరితో మాట్లాడేవాడు కాదు. కాస్త కదిలిస్తే కయ్యానికి సిద్ధమయ్యేవాడు. వాడు ఎప్పటికైనా మాలో ఒకరిగా కలిసిపోగలడా అని నేను ఆందోళన పడేవాడిని. ఒకసారి కమాండర్ల మండలిలో ఈ విషయం చర్చకు వచ్చింది. వీణ్ణేం చేయాలో బోధపడడంలేదని నా బాధని అందరికీ వివరించాను. అనుకోకుండా ఓ విచిత్రమైన ప్రతిపాదన వచ్చింది. కాలనీలో వాణ్ణి మించిన బద్ధకస్తుడు, మొద్దవతారం మరొకడు ఉన్నాడు. వాడు గలటెంకో. వాళ్లిద్దర్నీ కలిపి ఒక మిశ్రమ డిటాచ్‌మెంట్ ఏర్పాటు చేయాలని, వాళ్లకి ఆవరణలో మంచుగోతులు తవ్వే పని అప్పగించాలని ఆ సమావేశంలో నిర్ణయించాం. వారిద్దరి మిశ్రమ డిటాచ్‌మెంట్‌కి జోర్కనే కమాండర్‌గా నియమించాం. జోర్కని పిలిచి ఈ విషయం తెలియచేశాం. గలటెంకో బద్ధకస్తుడని, వాడిచే పని చేయించడం కష్టమని చెప్పాం. జోర్క ఒక్క క్షణం ఆలోచించాడు. "ఆ సంగతి నాకు వదిలేయండి" అన్నాడు. అందరం ఆశ్చర్యపోయాం. మర్నాడు నిజంగానే వారిద్దరి డిటాచ్‌మెంట్ మంచుగోతులు తవ్వే పనిని చేపట్టింది. మధ్యాహ్నం ఒక పర్యవేక్షకుడు ఉత్సాహంగా నా గదికి పరుగున వచ్చాడు. "సెమ్యొనోవిచ్ ఒక్కసారి రండి. వాళ్లిద్దరూ మంచుగోతులు తవ్వుతున్నారు. నెమ్మదిగా వెళ్లి వద్దాం. చప్పుడు చేయొద్దండీ. వాళ్లకి తెలియనివ్వకూడదు" అని జాగ్రత్తలు చెప్పి నన్ను అక్కడికి తీసుకెళ్లాడు.

మేం పొదల మాటునుంచీ వాళ్ల పనిని గమనించాం. జోర్క అప్పటికే తన వాటా పనిలో సగం పూర్తి చేశాడు. అప్పటికే వాడు కొన్ని చదరపు మీటర్ల పొడవునా మంచు గొయ్యి తవ్వాడు. మరో చివర గలటెంకో బద్ధకంగా అమరిస్తూ, గడబిడపడుతూ తన పారతో మంచుని తవ్వేందుకు ప్రయత్నిస్తున్నాడు. అంటే నిజమైన ప్రయత్నం కాదు. పారను పైకెత్తడం, వెనక్కి చూడడం జోర్క

చూస్తున్నాడనిపిస్తే మంచుపై ఒక దెబ్బ వేయడం. వాడు గమనించడం లేదనుకుంటే ఆగి, విశ్రాంతి తీసుకోవడం ఇదీవాడి పనితీరు. ఈ వ్యవహారాన్ని జోర్క చూడడం లేదని గలటెంకో అభిప్రాయం. కానీ కాసేపటికి జోర్క వాడి దగ్గరికి వచ్చాడు.

"ఏమిటీ నాటకం? పని చెయ్యమని నిన్ను బతిమాలతాననుకున్నావా?" అని వాణ్ణి నిలదీశాడు.

"నా సంగతి సరే నువ్వేందుకంత కష్టపడతావ్?" అని గలటెంకో వాణ్ణి నిష్ఠూరమాడాడు. దీనికి జోర్కకి కోపం వచ్చినట్టుంది.

"నీతో నేను మాట్లాడేది లేదు. నీ వాటా భాగం తవ్వకపోతే రాత్రి నీ ఆహారాన్ని చెత్తకుప్పలోకి విసిరేస్తా తెల్సిందా?" అని గద్దించాడు.

"నా ఆహారాన్ని పారేస్తావా? మాష్టారు ఊరుకుంటారనుకున్నావా?" అని గలటెంకో గొణిగాడు.

"ఆయన ఏమన్నా సరే. నీ రాత్రి భోజనాన్ని నేను చెత్తకుప్పలోకి విసరడం ఖాయం" అన్నాడు. జోర్క ఖచ్చితంగా.

దాంతో గలటెంకో విసురుగా పారని మంచులోకి దించుతూ పనిలోకి దిగాడు. ఆ సాయంత్రం నాకు అందిన నివేదికలో వాళ్లిద్దరూ అప్పచెప్పిన పనిని పూర్తి చేశారని ఉంది. కరబనోవ్ వచ్చి జోర్క భుజం తట్టి "నీలాంటి కమాండర్ ఖాయంగా గుర్తింపు పొందుతాడు" అని అభినందించాడు.

తలుపు వెనక నిలబడిన గలటెంకో సిగ్గుగా నవ్వి "ఇవ్వాళ మేం అద్భుతంగా పనిచేశాం" అన్నాడు.

నాటి నుంచీ జోర్క తీరులో అనూహ్యమైన మార్పు వచ్చింది. రెండునెలల్లో వాణ్ణి కొత్త కాలనీలో సోమరిపోతులచే పనిచేయించే కమాండర్గా ప్రత్యేక బాధ్యతలు అప్పచెప్పి అక్కడకు పంపించాం. మిగిలిన వారిలో అలోష్య, కుడాల్టీ, స్టుపెట్సిన్, తదితరులు ఎవరికి వారు విలక్షణమైన వ్యక్తిత్వం గలవారు. ఎవరి పద్ధతిలో వారు పనికి సంబంధించి నిష్ణాతులు. వాళ్లంతా నాయకత్వ లక్షణాలు గలవారైతే ప్రిఖోడ్కో, చోబట్, సొరొక, లెషీ, గ్లాసర్, షినాదర్, ఓవర్చెంకో, కోరిటో, ఫ్రెడరెంకో వంటివారికి ఈ అర్హతలు లేకున్నా చెప్పిన పనిని తూచ తప్పకుండా చేయగల సమర్థులు. మిగిలిన వారిలో చిన్నపిల్లలు ఉన్నారు. వారి శక్తిసామర్థ్యాలు, సత్తాలను అప్పుడే అంచనా వేయడం కష్టమైనా భవిష్యత్తులో ఎవరెవరు ఎలా తయారవుతారు అని నేను జాగ్రత్తగా గమనించేవాడిని. ఈ సీనియర్లు నాయకత్వ స్థానంలో ఉన్నందున వీరి ప్రతిభాపాటవాలు, నిజనైజాలు అప్పుడే బయటపడడం కూడా కష్టం అని నాకుతెలుసు. అయితే తమ సీనియర్లకంటే చిన్న వయసు నుంచే కాలనీ జీవితాన్ని రుచిచూడడం, సీనియర్ల అనుభవాలని గమనించడం, వారి కంటే ఎక్కువ కాలం కాలనీలో ఉండే అవకాశం ఉండటం తదితర కారణాల వల్ల భవిష్యత్తులో వారు మరింతమంచి నాయకులుగా రూపుదిద్దుకొనే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. కొన్నేళ్లు గడిచేసరికి వారికి ఇక్కడి పద్ధతులు, నియమనిబంధనలు, క్రమశిక్షణలతో మరింత పరిచయం అవుతుంది. పైగా సీనియర్లకంటే ఈ పిల్లలే ఎక్కువగా చదివే అవకాశం ఉంది. వాళ్లందరూ కాక దాదాపు డజనుమంది పసిపిల్లలు మా వద్ద ఉన్నారు. ప్రస్తుతం వాళ్లు ముక్కు తుడుచుకోవడం నేర్చుకుంటున్నారు. ఆటపాటలతో, మంచు మీద స్కేటింగ్, పడవ షికార్లు, చేపలు పట్టడం లాంటి అత్యంత ముఖ్యమైన పనుల్లో తలమునకలై ఉన్నారు.

ఇక గలటెంకో, ప్రెపెల్యాచెంకో, ఎవగ్నెయవ్, గుస్తోయ్‌వాన్‌లాంటి వారిపై మాకు పెద్ద ఆశలు లేవు. గలటెంకో పని దొంగ అయితే, ఎవగ్నెయెవ్ పచ్చి అబద్ధాలకోరు, ప్రెపెల్యాచెంకో ఎప్పుడూ

గొణుగుతూ, అసంతృప్తి వ్యక్తంచేసేవాడు. గుస్టోయ్‌వాన్ మందమతి, ఎప్పుడూ దైవప్రార్థనలో గడుపుతూ, ఎప్పటికైనా దైవసాన్నిధ్యం చేరాలని తపన పడేవాడు. వాళ్లని కూడా దారిలో పెట్టవచ్చేమో కానీ అందాక తగిన సమయం రావాలి.

1923వ సంవత్సరాంతానికి మా కాలనీ పరిస్థితి ఇది. కాలనీ పిల్లలంతా క్రమశిక్షణతో మెలుగుతూ, తమ తమ సామర్థ్యాన్ని బట్టి కష్టించిపనిచేస్తూ, చదువుకొంటూ భవితవైపు ముందుకు సాగేవారు. మాకు ఒక బాండు వాయిద్యబృందం, ఉక్రైన్ రాష్ట్ర విద్యాశాఖ బహుకరించిన ఒక సిల్కు బ్యానర్ ఉండేవి.

కార్మిక దినోత్సవాల్లో కాలనీ పిల్లలు బ్యాండు వాయిద్యానికి అనుగుణంగా క్రమశిక్షణతో పట్టణ వీధుల్లో కవాతు చేసేవారు. పట్టణంలోని కార్మికులంతా చేరే ప్రధాన కూడలి వద్దకు మేం అందరికంటే చివరగా చేరుకునేవాళ్లం. అక్కడ గుమిగూడిన కార్మికులకు కాలనీ వాసులంతా గౌరవ వందనం చేసేవారు. ఈ సందర్భాల్లో మాకున్న ఆర్థిక పరిమితులను మేం లక్ష్యపెట్టేవాళ్లం కాదు. తోలు బూట్లు మాకు ఉండేవి కావు. దాన్ని మేం పట్టించుకునేవారం కాదు. ఇటువంటి బూట్లు ఆ రోజుల్లో ప్రతి పిల్లల సంరక్షణ కేంద్రాల్లో సాధారణంగా ఉండేవి. అయితే మా పిల్లలు అంతకంటే ఆకర్షణీయమైన పరిశుభ్రమైన తెల్లటి చొక్కాలు, నల్లటి ప్యాంట్లూ ధరించేవారు మాకు సరైన బూట్లు కూడా లేనందున ప్యాంట్లను ముడుకుల దాకా మడిచి నగ్నమైన పాదాలతోనే కవాతు చేసేవారం. 1923 అక్టోబర్ 3న ఇలాగే మా కాలనీ పిల్లల కవాతు చేసుకుంటూ డ్రిల్‌గ్రౌండ్‌కు చేరుకున్నారు. అప్పటికి మూడురోజులుగా చర్చించి కాలనీ వాసులం ఒక తీర్మానం చేశాం. అధ్యాపకమండలి-కమాండర్ల మండలి కలిసి ఈ తీర్మానం చేశారు. ఇప్పటి మా కాలనీని విద్యాశాఖకు అప్పగించి అందరం ట్రెప్కే ఎస్టేట్‌లోని కొత్తకాలనీకి తరలివెళ్లాలని నిర్ణయించాం. అక్టోబర్ 3 నాటికి మా పాతకాలనీలో సామాగ్రినంతా కొత్త కాలనీకి తరలించాం. వర్క్‌షాప్‌లు, అశ్వశాలలు, స్టోర్‌రూమ్స్, భోజనాలగది, వంటగదితో పాటు అధ్యాపక బృందానికి చెందిన సామగ్రి అంతా తరలివెళ్లింది. ఆ రోజు ఉదయానికి ఏభైమంది పిల్లలు, నేనూ, మా బ్యానర్ మాత్రం పాతకాలనీలో మిగిలాం. విద్యాశాఖ అధికారి ఒకరు వచ్చి ట్రెప్కే ఎస్టేట్‌ను గోర్కీ కాలనీకి అప్పగిస్తున్నట్టు చెప్పే పత్రాలను మాకు అప్పగించాడు.

ఒక్కసారిగా మా మిలిటరీ బ్యాండు మేళం మోగింది. పిల్లలు క్రమశిక్షణతో సెల్యూట్ చేశారు. పాతకాలనీ అంటే మాకు ఇసుమంత శత్రుభావం లేకున్నా మేం లాంఛనప్రాయమైన వీడ్కోలు ఏమీ చెప్పలేదు. కనీసం వెనక్కి తిరిగి చూడలేదు. అందరూ కవాతు చేసుకుంటూ కొలోమాక్ తీరంలోని పచ్చికబయళ్ల గుండా నడిచాం. మేమే నిర్మించిన కొత్త వంతెన మీదుగా, మా వాళ్లు ఏర్పరిచిన కాలిబాటపై నడుస్తూ కొత్త కాలనీ ఆవరణకి చేరుకున్నాం.

మా అధ్యాపక సిబ్బంది, కొత్తకాలనీలో అప్పటికే స్థిరపడిన పిల్లలు, అనేక మంది గ్రామీణులు మాకు అక్కడ స్వాగతం చెప్పారు. గోర్కీ బ్యానర్‌తో మా బృందం కొత్త కాలనీలోకి, సరికొత్త శకంలోకి కాలు పెట్టింది.

❖ ❖ ❖

రెండవ భాగం

1

ఆ అందగత్తె మంత్రగత్తె

కొత్త కాలనీలో అద్భుతమైన వాతావరణం మధ్య మా సరికొత్త జీవితం మొదలైంది. గొంచరోవ్కా గ్రామానికి వెళ్లేందుకు సన్ననిదారి మినహా కాలనీ చుట్టూ ప్రవహించే కొలోమాక్ నది. పచ్చటి పచ్చికబయళ్లు, దూరంగా ఆకాశాన్ని అందుకునే ప్రయత్నం చేస్తున్నట్టు కనిపించే పొడవాటి పోప్లార్ వృక్షాలు, ప్రధాన భవంతుల వెలుపల చుట్టూ ఆవరించిన పొలాలు.. ఇటువంటి వాతావరణంలో రోజులు హడావుడి లేకుండా ప్రశాంతంగా గడుస్తున్నాయి. దూరాన ఉన్న సువిశాలమైన పచ్చిక బయళ్లలో ఇవానోవిచ్ పైపు కాలుస్తూ పచార్లు చేసేవాడు. అప్పుడప్పుడు నన్ను కూడా ఈ షికారుకు పిలిచేవాడు. నేను పక్కన ఉన్న సంగతి పూర్తిగా మరిచిపోయి తనలో తాను ఏదో గొణుక్కుంటూ పచార్లు ప్రారంభించేవాడాయన. క్రమంగా వృద్ధాప్యం ఆయనని ఆవరిస్తోందని అర్థమయేది. పిల్లలు కూడా ఆయన్ని సాధ్యమైనంత ప్రశాంతంగా ఉంచేందుకు ప్రయత్నించేవారు. ప్రస్తుతం మా వ్యవసాయ కార్యకలాపాలన్నీ పూర్తిగా షెరీ చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఇవానోవిచ్ ఎప్పుడో ఒకసారి షెరీపై విరుచుకుపడేవాడు. అతని పనిని తప్పు పట్టేవాడు. షెరీ కోపగించుకోకుండా హాస్యంగా ఏదో మాట్లాడి తప్పించుకొనేవాడు. ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి ఏవో సలహాలు ఇవ్వడం మాత్రం ఆయన మానలేదు. మేం ఆయన మాటలను శ్రద్ధగా విని, తరువాత మాకు తోచిన నిర్ణయం తీసుకునేవాళ్లం. అందుకు ఇవానోవిచ్ ఏనాడూ నొచ్చుకోలేదు.

ఇప్పటికీ ఇవానోవిచ్ మా సప్లైల మేనేజర్. పట్టణం వెళ్లి సప్లైలు తేవాలంటే ఆయన కదలాల్సిందే. అయితే ప్రస్తుతం ఆయన ప్రయాణాలు ఇదివరకులా కాక ఒక ఉత్సవంలా మారాయి. మా పాత బండిలోనే గడ్డిని సరిచేసి, ఇవానోవిచ్ కోసం పిల్లలు ఆ గడ్డిపై మెత్తటి బట్ట పరిచేవారు. బండికి మంచి గుర్రాన్ని పూన్చి ఇవానోవిచ్ గది బయట సిద్ధంగా ఉంచేవారు. సప్లైల విభాగం సహాయ మేనేజర్ బాధ్యతలు నిర్వర్తించే డెనిస్ కుద్లాటీ అప్పటికే అవసరమైన సామాగ్రి జాబితా రూపొందించే వాడు. అతని సహచరులు అల్యోష, వోలోఖోవా, స్టోర్ కీపర్‌లు పట్టణంలో సంపాదించే సరకులను ప్యాక్ చేసేందుకు అవసరమైన పెట్టెలు, తాడు వగైరా సిద్ధం చేసేవారు. ఇలా బండిని తన గది బయట కొద్దిసేపు నిలిపివుండనిచ్చి ఇవానోవిచ్ తీరికగా బయలుదేరేవాడు. బండి ఎక్కేముందు కుద్లాటీ వంక ఓసారి చూసి "ఆ టోపీ ఏంటి? పట్టణం వెళ్లేప్పుడైనా కాస్త మర్యాదపూర్వకమైన వేషం వేయొచ్చుగా" అని నిరసనగా అనేవాడు. వారి యాత్ర మొదలయేది.

పట్టణంలో వివిధ సరకుల కోసం వేర్వేరు విభాగాలను వాళ్లు తిరిగేవారు. ఆ ఆఫీసుల్లో ఇవానోవిచ్ అక్కడున్న పెద్ద అధికారి గదిలో కూర్చుని రాజకీయాలనుంచీ ఆర్థిక వ్యవహారాల వరకూ అనేక అంశాలపై తన విలువైన అభిప్రాయాలు ప్రకటించేవాడు. ఈలోగా కుద్లాటీ వివిధ విభాగాలు తిరుగుతూ తన చేతిలోని జాబితాలో గల సామాగ్రి అంతా వచ్చిందా లేదా అని సరిచూసుకునేవాడు. చివరికి పని పూర్తయిందని తేల్చుకున్న తరువాత, ఇవానోవిచ్ వద్దకు వెళ్లి "రండి ఇంక వెళ్దాం" అనేవాడు. అప్పటికే పూర్తిగా అలసిపోయిన ఇవానోవిచ్ కాలనీకి రాగానే మంచంపై వాలిపోయేవాడు. కుద్లాటీ హడావుడిగా అప్పటికే చల్లారిపోయిన తిండి తింటూ బండిలోంచి సరుకులు దింపించేవాడు.

ఎవరైనా దేన్నైనా వృథా చేస్తుంటే కుద్లాటీ భరించలేకపోయేవాడు. ఈ విషయంలో ఎప్పుడూ అందరికీ పాఠాలు చెప్పేవాడు. అయితే మా ఆర్థిక పరిస్థితి దృష్ట్యా కుద్లాటీ వంటి మనిషి అవసరం

ఎంతైనా ఉంది. కుర్రవాళ్లు చెట్లు ఎక్కి బట్టలు మాపుకున్నా, ఎవరైనా కాస్త గడ్డిని వృథాగా కింద పడవేసినా కుడ్లాటీ ఏ మూలనుంచో రంగప్రవేశం చేసేవాడు. కఠినంగా విమర్శించేవాడు. అతను ఎంత గట్టిగా కసురుకున్నా కుర్రవాళ్లు నొచ్చుకునేవారు కాదంటే దానికి అతని సహృదయతే కారణం. వేసవికాలంలో కాళ్లకు బూట్లు అవసరం లేదని, వాటిని సామాన్ల గదిలో భద్రపరిస్తే శీతాకాలం పనికి వస్తాయని కుడ్లాటీ తీర్మానం చేసినప్పుడు కుర్రవాళ్లు మారుమాట్లాడకుండా బూట్లు విప్పి అతనికి అప్పచెప్పారు.

మరమ్మతులు పూర్తయిన భవంతుల్లోకి ప్రవేశించగానే కుర్రవాళ్లు పనిలో పడ్డారు. అప్పటికే ఏర్పడిన పది డిటాచ్‌మెంటులూ వివిధ బాధ్యతలు స్వీకరించాయి. అన్నిటికంటే పెద్ద భవంతిని మేం శ్వేతభవనం అని పిలిచేవాళ్లం. అందులోనే పిల్లలు నిదురించే డార్మెటరీలు, తరగతి గదులూ ఏర్పాటు చేశాం. చివరన గల పెద్ద హాల్‌ను వడ్రంగం కార్ఖానాగా మార్చాం. రెండవ భవంతిలో భోజనాలగది ఏర్పాటైంది. పక్కనే సిబ్బంది గదులు, అపార్ట్‌మెంట్‌లు ఏర్పరిచాం. దూరంగా పళ్లతోటల మధ్యనగల సువిశాలమైన భవంతి మరమ్మతులు ఇంకా పూర్తికానందున ఇక్కడ అందరికీ ఇరుకుగానే ఉండేది. ఆ భవనాన్ని బాగుచేయాలంటే అవసరమైన ఆరువేల రూబుళ్లు మా వద్ద ఉండేవి కావు. లభ్యమైన డబ్బునంతా పరికరాలు, యంత్ర సామాగ్రి కొనుగోలుకే వినియోగించడంతో మేమూ, మా చిరుగుపాతలూ అలాగే మిగిలాం. అప్పట్లో మా గోర్కీ కాలనీ విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉండేది. ఆ అధికారులే మా అవసరాలను అంచనావేసి కొద్ది నిధులు కేటాయించేవారు. పిల్లలకు ఏడాదికి సరిపడా దుస్తుల కోసం ఇరవై ఎనిమిది రూబుళ్లు కేటాయించేవారంటే, అక్కడి అధికారులు ఎంత సవ్యంగా ఆలోచిస్తారో అర్థం అవుతుంది. ఇటువంటి నిర్ణయాలు తీసుకునే పెద్దమనుషుల మొహం ఒకసారి చూడాలని వుంది అని ఇవానోవిచ్ కోపంగా అనేవాడు. నేనూ ఆ తరహా అధికారులను ఇంతవరకూ కలుసుకోలేదు. ఇంతకీ విషయం ఏమిటంటే తప్పు అధికారులది కాదు. ఉన్న నిధులను మొత్తం కుర్రవాళ్లందరికీ సరిపోయేలా పంచవలసి రావడమే ఈ తరహా నిర్ణయాలకు కారణం.

ఆర్థిక పరిస్థితి ఇంత దయనీయంగా ఉన్న పిల్లలు మాత్రం ఏనాడు కుంగిపోకపోవడం విశేషం. వాళ్లు ఎప్పుడూ నవ్వుతూ, తుళ్లుతూ, కష్టపడి పనిచేస్తూ ఉషారుగానే ఉండేవారు. ఇలా రోజులు గడుస్తూండగా ఒకసారి పట్టణం నుంచి టెలిగ్రాం వచ్చింది. ఉక్రైన్ పిల్లల సంక్షేమ విభాగం నుంచి బొకోవా అనే ఇన్‌స్పెక్టర్ కాలనీని తనిఖీ చేసేందుకు వస్తారని, ఆమె కోసం ఖార్కోవ్ రైలు స్టేషన్‌కు బండి పంపాలనీ దాని సారాంశం. దీంతో కుర్రవాళ్లకి ఉషారు పెరిగింది. వచ్చే ముసలావిడ మన భవనం మరమ్మతుకు ఆరువేల రూబుళ్లు ఇస్తుందంటావా? అని వాళ్లలో వాళ్లు మాట్లాడుకున్నారు. అయితే ఇవానోవిచ్‌కు మాత్రం వచ్చే ఆవిడ మాకు డబ్బు ఇస్తుందనే నమ్మకం అసలు లేదు.

ఇంతకూ ఆవిడ రావాల్సిన రోజు రానే వచ్చింది. బ్రాచెంకో మా గుర్రబ్బండిని శుభ్రంగా కడిగి గుర్రాలను బాగా మాలిష్ చేసి ప్రయాణానికి సిద్ధమయ్యాడు. రాజధాని నుంచి వస్తున్న అతిథిని తోడ్కొని వచ్చేందుకు నేనూ స్టేషనుకు బయల్దేరాను. ఇద్దరం బయట నిలిచి కాలనీకి రాబోయే వృద్ధ మహిళా అధికారి ఎవరై వుంటారా అని అందర్నీ పరిశీలనగా చూస్తూ వున్నాం. ఇంతలో మా వెనకగా మాటలు వినిపించాయి.

"ఈ బండి ఎక్కడినుంచి వచ్చింది?"

"మేం వేరే పనిమీద వచ్చాం. మీకు బళ్లు ఆ మూల దొరుకుతాయి వెళ్లండి" అన్నాడు బ్రాచెంకో కటువుగా.

"మీరు గోర్కీ కాలనీ నుంచి రాలేదా?"

బ్రాచెంకో గిరుక్కున వెనుదిరిగి చూశాడు. నేను కూడా నివ్వెరపోయాను. పరిశుభ్రమైన లేత బూడిదరంగు కోటులో, నాజూకుగా, పొడవుగా నిలిచివున్న ఆమె రూపం దిగ్భ్రాంతి కలిగించింది. ఆరోగ్యంతో తళతళలాడుతున్న గులాబీరంగు ముఖం, బుగ్గలో సొట్టలు, మెరిసిపోతున్న కళ్లు సన్నగా, పొడవుగా దిద్దిన కనుబొమలు తలకు కట్టుకున్న రుమాలు కిందనుంచి బయటకు తొంగి చూస్తున్న బంగారు వన్నె వుంగరాల జుట్టు.. ఆమె వెనక స్టేషన్ కూలీ తేలికైన పెట్టెను మోస్తున్నాడు.

"మీరు కామ్రేడ్ బొకోవా గారేనా?" అడిగేను.

"చూశారా నేనే ముందు మిమ్మల్ని గుర్తు పట్టేను" అని నవ్విందామె.

అప్పటికి బ్రాచెంకో సర్దుకున్నాడు. తేలికగా ఎగిరి బండిలోకి దూకాడు. నేను ఒక మూల సర్దుకు కూర్చున్నాను. కామ్రేడ్ బొకోవా దారంతా గలగలా మాట్లాడుతూనే వుంది. గోర్కీ కాలనీ గురించి ఆమె చాలా విన్నదట. "కామ్రేడ్ మకరెంకో, ఈ పిల్లలతో చాలా కష్టం కదా! వీళ్లను చూస్తే ఎంత జాలేస్తుందో. వాళ్లకి చేయగలిగిన సాయమంతా చేయాలనిపిస్తుంది. ఇంతకీ ఈ కుర్రవాడు కాలనీ వాసేనా? ఎంత బావున్నాడో. అవునూ ఇక్కడ మీకు విసుగ్గా లేదూ? ఇంకో విషయమేమంటే మీకు ఇష్టం వుండదట కదా?"

"ఎవరంటే?"

"మేమంటే. సామాజిక విద్యారంగంలో పనిచేస్తున్న మహిళలంటే".

పకాలున నవ్వేను. అదేం లేదని చెప్పాను. బ్రాచెంకో ఉండి ఉండి వెనక్కు చూస్తున్నాడు. దీనిని ఆమె గమనించింది. కుర్రవాడు అలా మిర్రిమిర్రి చూస్తాడేం? అని నవ్వింది బొకోవా. బ్రాచెంకో ముఖం సిగ్గుతో కందిపోయింది. మొత్తానికి కాలనీకి చేరుకున్నాం. అక్కడ అందరూ మా కోసం ఎదురు చూస్తున్నారు. బొకోవా ఇంత చిన్నపిల్ల అని, ఇంత అందంగా వుంటుందని ఊహించని పిల్లలు మొదట కొంత ఇబ్బంది పడినా తర్వాత ఆమెను వెంటబెట్టుకొని కాలనీ అంతా చూపించడం ప్రారంభించారు. ఇవానోవిచ్ కంగారుగా నన్నొక పక్కకు పిలిచాడు. "ఆవిడకి మనం ఏం పెడదాం? బహుశా చాలా పాలు తాగుతుందేమో."

"ఉత్త పాలేనా? తిండేం పెట్టరా?" అడిగేను.

"ఏం చేద్దాం. పోనీ ఒక పందిని కోద్దామా" ఇవానోవిచ్ ఆ హడావుడిలో పడిపోయాడు. నేను బొకోవా, పిల్లలు ఉన్న చోటుకి వెళ్లాను. అప్పటికే ఆమె వాళ్లతో బాగా కలిసిపోయింది. మేము ఆమెకు ఇంకా మరమ్మతులు పూర్తికాని భవనాన్ని చూపించాం. "ఈ భవనాన్నిలా వదిలేశారేం?"

"ఆరువేల రూబుళ్లు కావాలి" అన్నాడు జదరోవ్.

"ఏం డబ్బుల్లేవా?" అడిగిందామె.

"లేవు మీరిస్తారా?" అడిగాడు కరబనోవ్.

బొకోవా అక్కడే ఆ భవనం ఎదుట పచ్చికలో చతికిలబడింది. పిల్లలు ఆమె చుట్టూ కూర్చుని ప్రస్తుతం మేమంతా ఎటువంటి ఇరుకైన గదుల్లో వుంటున్నామో కథలు కథలుగా చెప్పారు. ఈ రెడ్‌హౌస్ మరమ్మతులు పూర్తి అయి మేం గనక అందులోకి మారితే వ్యవసాయం పనులు మరెంత బాగా చేసుకోగలమని దాంతో మా ఆదాయం కూడా పెరుగుతుందని చెప్పుకొచ్చారు.

ఈలోగా ఇవానోవిచ్ తనతో వోలియా వొరనోవాను వెంటబెట్టుకొని అక్కడకు వచ్చాడు. వోలియా చేతిలో ఒక పెద్ద పాలజాడీ రెండు కప్పులు తెల్లటి రొట్టె వున్నాయి. ఇవానోవిచ్‌ని చూసి బొకోవా

సంతోషంగా పలకరించింది. "ఎంత బాగున్నాడో ఈ పెద్దాయన" అని మురిపెంగా నవ్వింది. ఇవానోవిచ్ ఎంతో గొప్పగా పొంగిపోతూ ఆమె చేతికి పాలజాడీని అందించాడు. "ఈ పాలు తాగండి. తేనెకంటే మధురంగా వుంటాయి. ఇంత చల్లటి తియ్యటి పాలు మీరంతవరకూ తాగివుండరు." బొకోవా పాల కప్పు అందుకుంది. సరిగ్గా అప్పుడే వాడి బుర్రలో ఏం మెరుపు మెరిసిందో కాని జదరోవ్ హఠాత్తుగా అన్నాడు. "మీ దగ్గర ఆరువేల రూబుళ్లు మూల్గుతున్నాయ్. ఆ డబ్బులేక ఈ భవనాన్నిలా ఒదిలేసి మేం ఇరుకు ఇరుకుగా బతుకుతున్నాం. ఇదేమైనా న్యాయంగా వుందా?" అన్నాడు. బొకోవా అప్పటికే పాల కప్పు నోటిదగ్గర ఉంచుకుంది.

"నిజంగానే ఎంతో బాగున్నాయి. ఈ పాలు" అని నోటితో చిత్రమైన చప్పుడు చేసింది.

"సరే కాని ఆరువేల సంగతి ఏమిటి?" అంటూ జదరోవ్ ఆమెను నిలదీశాడు.

"ఏం పిల్లాడివిరా బాబు! మరీ అంత మంకుపట్టేమిటి? సరే మీకు ఆరువేలు ఇస్తాను. నాకేంటి లాభం." జదరోవ్ వద్ద సమాధానం లేదు.

"మీకు బోలెడన్ని పాలు ఇస్తాం" అన్నాడు కరబనోవ్. ఇది విన్న బొకోవా పగలబడి నవ్వింది. "కాసిని పాలు ఇచ్చి ఆరువేలు కొట్టేద్దామనుకుంటున్నారా? అదేం కుదరదు. మీకు ఆరువేలూ ఇస్తాను. అయితే మీరు మా నుంచి నలభైమంది పిల్లలను కూడా తీసుకోవాలి".

దీనికి వోల్యా ఠక్కున సమాధానమిచ్చింది. "పంపండి నలభైమందిపిల్లల్ని మేం తీసు కుంటాం" దీనితో బొకోవా సంతృప్తిగా తల పంకించింది. ఆమె మొత్తంమ్మీద మూడు రోజులు మా కాలనీలో వుంది. పిల్లలందరకూ దగ్గరైంది. రాత్రి పొద్దుపోయేవరకూ మా పళ్లతోటలో పిల్లలతో కబుర్లు చెప్పింది. పడవలో షికార్లు వెళ్లారు. చివరిరోజు ఆమె మాతో ఒప్పందం పత్రాల మీద సంతకాలు చేసింది. ముందు అనుకున్నదే. ఉక్రెయిన్ పిల్లల సంక్షేమ విభాగం మాకు ఆరువేల రూబుళ్లు ఇచ్చేట్టు, అందుకు ప్రతిగా మేం నలభైమంది పిల్లలను కాలనీలో చేర్చుకునేట్టు ఆ ఒప్పందంలో రాసుకున్నాం. చివరకు ఆమె వెళ్లిపోవాల్సిన రోజు వచ్చింది. ఈసారి వీడ్కోలు చెప్పేందుకు నేను స్టేషనుకు వెళ్లలేదు. బ్రాచెంకోకు బదులు కరబనోవ్ బండి పగ్గాలు పట్టాడు. జదరోవ్ ఆమె చేతిని పట్టుకొని "మళ్లీ వేసవిలో వస్తారుగా" అని అడిగాడు.

స్టేషన్నుంచి తిరిగివచ్చిన కరబనోవ్ విచారంగా కనిపించాడు. వాడు బండి నుంచి గుర్రాలను విప్పుతుంటే జదరోవ్ పక్కనే నిలిచి వాడితో మాట్లాడుతున్నాడు. నేనూ ఆ సంభాషణ విన్నాను.

"నేను చెప్పానా, ఏదో ఒకరోజు ఒక మంత్రగత్తె వచ్చి మనకు సహాయం చేస్తుందని?"

"బొకోవా మంత్రగత్తేం కాదు"

"సర్లే మంత్రగత్తెలంతా బూజు కర్రలతోనే తిరుగుతారనుకుంటున్నావా? నిజమైన మంత్రగత్తెలు అందంగా వుంటారు తెలుసా?"

2

చదువుల సందడి

మాట ఇచ్చినట్టే వారం రోజుల్లోనే బొకోవా మాకు ఆరువేలూ పంపింది. దాంతో మేం రెడ్‌హౌస్ మరమ్మతులు ప్రారంభించాం. అది చిన్న పనేం కాదు. అడ్డదిడ్డంగా పెరిగిన చెట్లు, గతుకులతో నిండిన దారులు, భవన నిర్మాణ సమయంలోనే ఇంటిచుట్టూ పేరుకున్న సున్నం కుప్పలు వీటన్నింటినీ శుభ్రం చేసి పని ప్రారంభించేసరికి తలప్రాణం తోకకొచ్చింది. ఈ పనికి కావాల్సిన కుర్రవాళ్లను పొలం పనినుంచి తప్పించేందుకు ఆదివారం కమాండర్ల మండలి సమావేశం చాలా తంటాలు

పడింది. ఒక కుర్రవాడిని కూడా మరమ్మతుల పనికి కేటాయించ లేననీ, ఇప్పటికే పనిలో చాల వెనుకబడివున్నామని షెర్రీ వాదించాడు. పొలం పనుల ప్రాధాన్యం పిల్లలకు తెలుసు.

అప్పటికే షెర్రీ మా పొలాల్లో ఆరుపంటల మార్పిడి పద్ధతిని ప్రవేశపెట్టాడు. ఈసరికే పొలం పనుల విలువేమిటో అందరికీ అర్థమౌతోంది. పిల్లల్లో కొందరు వ్యవసాయంలోనే స్థిరపడాలని నిర్ణయించుకున్నారు కూడా. వోల్యా, కరబనోవ్, వోలోఖోవ్, బరున్, ఒసాడ్చీ తదితరులు పొలం పనిపై అపరిమితమైన ఇష్టాన్ని పెంచుకున్నారు. శ్రమలోనే వారు ఆనందాన్ని వెతుక్కుంటున్నారు. రేపటిపై పరిపూర్ణ విశ్వాసంతో వొళ్లు వంచి పనిచేస్తున్నారు. వీళ్లలో కొందరు పట్టణంలో రబ్‌ఫాక్ (సాంకేతిక శిక్షణ సంస్థ) ప్రవేశ పరీక్షకు తయారవుతున్నారు కూడా. వొప్రిష్కో, ఫెదరెంకో లాంటి పిల్లలకు మాత్రం పెద్దగా చదివి వూళ్లేలాలనే కోర్కె లేదు. ఏదో పొలం పని చేసుకుంటూ ఓ గుడిసెలో ప్రశాంతంగా బతికేయాలని వుంది. ఎండాకాలమంతా పనిచేసి శీతాకాలం హాయిగా కడుపులో చల్లకదలకుండా గడిపేయాలనే వాళ్ల ఉద్దేశం.

దాదాపు నూటయాభై ఎకరాల భూమిలో పనిచేస్తున్న షెర్రీ బృందానికి భవితపై పెద్ద ఆశలే వున్నాయి. ఎప్పటికైనా ఒక ట్రాక్టరును సంపాదించగలమని, పెద్ద ఎత్తున వ్యవసాయం చేస్తామని అతని నమ్మకం. షెర్రీ చెప్పే ఈ కబుర్లు వినేందుకు కుర్రాళ్ల బృందం ఎప్పుడూ సిద్ధంగా వుండేది. గ్రామంలోని కోమ్సొమోల్‌కు చెందిన పావెల్, స్పిరిడాన్‌లు తరుచు యీ బృందంలో చేరేవారు. పావెల్ వయస్సు యిరవై ఆరేళ్లు. గ్రామస్థుల లెక్కలో వయసు మీరిన బ్రహ్మచారి. అతని తండ్రి మా కళ్లముందే ఓ చిన్న భూస్వామిగా మారేడు. ఎక్కడెక్కడనుంచో అనాధపిల్లల్ని తెచ్చి పొలం పనికి వాడుకునేవాడు. పైకి మాత్రం పేదరైతులా బీద అరుపులు అరిచేవాడు. బహుశా పావెల్ తండ్రి మీద విముఖత పెంచుకునే ఎప్పుడూ కాలనీలో గడిపేవాడు. పావెల్ అప్పటికే అనుభవజ్ఞుడైన రైతు కూడా. షెర్రీ అతనికి బాధ్యతాయుతమైన పనులు అప్పజెప్పేవాడు. బాగా చదువుకున్న పావెల్ రేపు పెరగబోయే మా వ్యవసాయం గురించి చెబుతుంటే పిల్లలంతా శ్రద్ధగా వినేవారు. వోల్యా అతనివంకే కన్నార్పకుండా చూసేది. వ్యవసాయాన్నే తమ భవిష్యత్తుగా నిర్ధారించుకొని కుర్రవాళ్లు కాలనీలో వొళ్లువంచి పనిచేస్తుంటే వ్యవసాయమే బతుకైన గ్రామస్థులు శ్రమను ద్వేషించడంపై వాళ్ల మధ్య చర్చలు నడిచేవి.

కాలనీలోకి కొత్తగా వచ్చిన కుర్రవాళ్లలో సిలాంటి ఒకడు. వాడు ఎక్కడినుంచి వచ్చాడో ఎవరికీ తెలియదు. ఉన్నట్లుండి ఓ రోజు మా కుర్రవాళ్లు వాడిని నా గదికి తీసుకొచ్చారు. తాను ఇక్కడ పనిచేయడం కోసం వచ్చానని, పని ఇస్తే చేస్తానని ఏ పనికైనా సిద్ధమేనని చెప్పాడు. పొలం పనులు చాతనవునన్నాడు. గుర్రాలు, ఆవులు వేటినైనా సాకగలనన్నాడు. వడ్రంగం, కమ్మరం స్టవ్ తయారీతో సహా అన్ని పనులూ చాతనవునన్నాడు. ఇళ్లకు రంగు వేయడం, అవసరమైతే ఒక గుడిసె నిర్మించడం నుంచి బూట్లు బాగుచేయడం వరకు ఏ పనైనా అవలీలగా చేయగలనన్నాడు. గుర్తింపు పత్రాలేమైనా వున్నాయా? అనడిగాను.

"నా దగ్గర ఒకటుండేది. కొంతకాలం క్రితం వరకూ కూడా వుంది. కాని చూశారూ! నా చొక్కాకి జేబులేదు. దాంతోటి ఆ కాగితం కాస్తా పోయింది. అయినా కాగితాలతో పనేముందండి. స్వయంగా నేనే వచ్చి ఇంత పొడుగ్గా మీ ముందు నిల్చున్నాను గదా!

"నువ్వు ఇంతకు ముందు ఎక్కడ పనిచేశావో చెప్పడం లేదు. నిజం చెప్పు దొంగతనాలు చేశావా?" సూటిగా అడిగాను.

"నిజం చెప్పమంటారా సత్యప్రమాణంగా చెబుతున్నాను. నేను దొంగను కాదు." అలా సిలాంటి కాలనీలో స్థిరపడ్డాడు. వాణ్ణి షెర్రీ ఆధ్వర్యంలో పశువులను చూసుకునే పనిలో వుంచాలని ప్రయత్నించాం. అయితే వాడొక పద్ధతికి లొంగే మనిషి కాదు. పనికి పరిమితులు వుంటాయన్న సంగతి వాడికి జన్మలో అర్థం కాదు. తాను ఈ పనే ఎందుకు చేయాలి మరోపని ఎందుకు ముట్టుకోకూడదు అన్న సంగతి వాడికి కొరుకుడు పడలేదు. అందుకే వాడు తనకు ఎప్పుడు ఏ పనిచేయాలనిపిస్తే ఆ పని చేసేవాడు. ఎవరి ఆదేశాలనూ పట్టించుకునేవాడు కాదు. తెల్లవారిందంటే చాలు పొలంలో, అశ్వశాలలో, ఔట్‌హౌస్‌లో, కమ్మరి కార్ఖానాల్లో ఒకచోట ఒక పని అని కాకుండా అన్నిటిలోనూ తిరిగేవాడు. చదువులోనూ వాడికి ఆసక్తి వుంది. కమాండర్ల మండలి సమావేశాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. ఎవరి ఆదేశాలనూ పట్టించుకోకపోయే పని వుందంటే చాలు చేసేందుకు సిద్ధపడేవాడు. పొరపాటున ఎప్పుడైనా ఏదైనా పని పాడుచేస్తే ఆ విషయాన్ని స్వయంగా ఒప్పుకునేవాడు. వచ్చిన రోజునుంచే కొమ్సొమోల్ సమావేశాలకు తనను రానివ్వకపోవడంపై అలిగాడు. నా దగ్గరకొచ్చి ఫిర్యాదు చేశాడు. "చూడండి వాళ్లు నన్ను సమావేశానికి రానివ్వడం లేదు. నన్ను ఇలా దూరం పెడితే జీవితాంతం మందమతిగానే వుండిపోతానని చెప్పి చూశాను. ఎవర్నించి ఏ రహస్యాలు దాస్తున్నారని అడిగాను. గ్రామంలోని పెద్ద రైతుల్ని మీటింగుకి రానివ్వకండి. నన్ను అడ్డుకుంటారేమిటి? అనడిగాను. వాళ్లు నన్ను పట్టించుకోవడం లేదు. కాస్త మీరైనా చెప్పండి" అన్నాడు.

కొమ్సొమోల్ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు, మా బడిని సక్రమంగా క్రమబద్ధంగా నడిపించేందుకు కూడా సిలాంటి నడుం బిగించాడు. అప్పటివరకూ అడ్డదిడ్డంగా సాగిన స్కూలును ఒక దారికి తెచ్చేందుకు కొమ్సొమోల్ సభ్యులందరూ కృషి చేశారు. కాలనీ ప్రారంభించిన కొత్తలో అంతవరకూ అనాథలుగా వున్న పిల్లలు చదువును అంత శ్రద్ధగా పట్టించుకోకపోవడం నిజం. వాళ్లంతా వడ్రంగులు గానో, కమ్మర్లుగానో స్థిరపడితే చాలని అనుకున్నారు. అయితే మా సమిష్టి కృషి అందిస్తున్న విజయాలు వారి ఆత్మస్థైర్యాన్ని పెంచాయి. వాళ్లిప్పుడు చదువుపై దృష్టి సారిస్తున్నారు.

అప్పట్లో పట్టణంలోని రబ్‌ఫాక్‌లో చేరడంపై పిల్లలకు పెద్ద ఆశలుండేవి. పిల్లల్లో చాలామంది రెండో ఏడాది గడిచేసరికే పట్టణం వెళ్లి పెద్ద చదువులు చదవాలనే ఉబలాటం మొదలైంది. ఇంజన్ వర్క్‌షాపు నుంచి వచ్చే రబ్‌ఫాక్ విద్యార్థులు తమ అనుభవాలను వివరిస్తుంటే మా కుర్రవాళ్లు నోరు వెళ్లబెట్టుకొని శ్రద్ధగా వినేవారు. మా ఆధ్యాపక సిబ్బంది కూడా పిల్లలకు పట్టణం వెళ్లి పెద్ద స్కూల్లో చేరడం ఎంత మంచి పనో వివరిస్తూ వుండేవాళ్లం. అయితే రబ్‌ఫాక్‌లో చేరాలంటే పరీక్షలో విజయం సాధించాలి. అందరికీ ఈ పరీక్షంటే భయమే. మరో ఏడాది కాలనీలో వుండి పరీక్షకు తయారవ్వాలని కుర్రవాళ్లు నిర్ణయించుకున్నారు. వాళ్లలో బరున్‌ని చూసి మేం ముగ్ధులయ్యేవాళ్లం. కొరుకుడుపడని గణితం, వ్యాకరణం లాంటి అంశాలను బుర్రకు ఎక్కించుకునేందుకు బరున్ చాలా కష్టపడేవాడు. జడరోవ్ నిర్ణీత సమయం కంటే ఒక్క క్షణం కూడా పుస్తకాల ఎదుట కూర్చునేవాడే కాదు. వీళ్లలో మరూస్యా అనే పిల్ల అందరికీ తలనొప్పిగానే వుండేది. ఎప్పుడూ వెర్రిగా అరుస్తూ అందరితో కొట్లాడుతూ, మాటిమాటికీ ఏడుస్తూ నానా బీభత్సం చేసేది. అయితే ఆమెకు అపరిమితమైన జ్ఞాపకశక్తి. అసాధారణమైన తెలివితేటలు కూడా ఉన్నాయి. కానీ తన మీద తనకే నమ్మకం లేదు. ఈ చదువులు తనకు పనికిరావని ఆ కష్టమేదో బరున్‌తోనే పడితే ఏమైనా ఉపయోగకరమని మాకే సలహా చెప్పేది. చివరకు ఆ పిల్లను ఎకతెరీనాకు అప్పగించాను. మూడురోజుల్లో ఎకతెరీనా తన

విద్యార్థినిని వెంటబెట్టుకొని నా దగ్గరకొచ్చింది. "ఆంటన్ సెమ్యోనోవిచ్ ఇదిగోండి మరూస్యా. తాను చదవలేదట. మిల్లులో పనిచేస్తానంటూంది. మీ ఇష్టం. అయితే నేనొక విషయం హామీ ఇవ్వగలను. ఈ ఏడాది ముగిసేనాటికి తనని రబ్‌ఫాక్ ప్రవేశపరీక్షకు సిద్ధం చేయగలను. తను చదవగలదు కూడా ఏం చేయమంటారు?"

మరూస్యా, ఎకతెరీనా వంక కోపంతో చూస్తూ వుంది. మా టీచర్ తన ప్రసంగాన్ని కొన సాగించింది. "నేనామెకు చదువు చెప్పగలను. కానీ! ఆమె నన్ను దెయ్యం అని, మందమతినని తిడితే సహించను. ఆమెకు ఎదుటివారిని గౌరవించడం చాతకాదు."

"ఎందుకు చాతకాదు. నేను గౌరవిస్తాను." అంది మరూస్యా.

"లేదు మరూస్యా నీకు అది చాతకాదు. అయినా ఎకతెరీనా మీరు పెద్దవారు. అనుభవజ్ఞులు, తెలివైనవారు మరూస్యా లాంటి ఒక మూర్ఖురాలు, చిన్నపిల్ల మాటలకు నొచ్చుకుంటే ఎలాగ? ఆమె మిమ్మల్ని ఏమన్నా అననివ్వండి. మీకేం నష్టం?"

ఎకతెరీనా నాతో ఏకీభవించింది. "ఔను మూర్ఖురాలే దాని మాటలెందుకు పట్టించు కోవడం" అంది. ఈ మాటలు విన మరూస్యా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఆమె నా వంక తీక్షణంగా చూసింది. హఠాత్తుగా చేత్తో ముఖం కప్పుకుని ఏడుస్తూ గదిలోంచి బయటకు పరుగెత్తింది.

వారం తర్వాత ఎకతెరీనాను అడిగాను. మరూస్యా ఎలా వుందని. ఇప్పుడు బావుందట. నోరు అదుపులో వుంచుకుంటుందట. నామీద మాత్రం చిర్రుబుర్రులాడుతుందట. వారం రోజుల తర్వాత మరూస్యా నా దగ్గరకొచ్చి చెప్పింది. తను ఇప్పుడు టీచర్‌ను చెడ్డమాటలనడం లేదట. నేనే అనవసరంగా తనని మూర్ఖురాలని తిట్టానట.

నాదే పొరపాటని ఒప్పుకున్నాను. దాంతో నాతో రాజీకొచ్చింది.

3

శీతాకాలం సందడి

రెడ్‌హౌస్ మరమ్మతులు మొదలుపెట్టి కిటికీలు బిగించేలోపే శీతాకాలం వచ్చింది. ఈసారి చలికాలం మరీ బాధపెట్టడం లేదు. మంచు దుమారాలు లేవు. కుద్లాటీ పిల్లలందరికీ బూట్లు అందించాడు. ఆ రోజుల్లో పిల్లలకు చలిని తట్టుకోగల దుస్తులు ఉండేవి కావు. ఎండాకాలం వేసుకునే నూలు దుస్తులే శీతాకాలం కూడా ధరించేవారు. సాయంత్రం ఐదు గంటలకల్లా పనులు ముగించుకునేవారు. చీకటి పడుతూండగా అందరూ హాల్లో చేరి నెగడు వెలిగించేవారు. చుట్టూ కూర్చుని కథలతో, కబుర్లతో పొద్దుపుచ్చేవారు. ఆ రోజుల్లోనే మా అమ్మగారు నా దగ్గరికి వచ్చి, కాలనీలోనే స్థిరపడింది. పిల్లలు ఆమెను బామ్మగారూ అని సంబోధిస్తూ, సాయంత్రాలు ఆమెతో కబుర్లు చెప్పేవారు. మరికొందరుపిల్లలు చక్రాల కార్ఖానాలో దూరి అక్కడ ముసలాయన కోజిర్‌ను ఏడిపించేవారు. ఇవానోవిచ్ వెళ్లి వాళ్లని అదిలించి కోజిర్‌కు సాయపడేవాడు.

ఇప్పుడు పిల్లలకు విశాలమైన నిదురించే గది లేదు. ఆరేడుగురు కుర్రవాళ్లు చిన్న చిన్న గదుల్లో పడుకునేవారు. దీంతో పిల్లలమధ్య, సాన్నిహిత్యం, సమన్వయం పెరిగింది. ఒక్కొక్క బృందం ఒక్కొక్క విశిష్టమైన పద్ధతిలో వ్యవహరించేది. ఇప్పటికీ పిల్లల్లో పసివారిని జార్జివ్‌స్కీయే బాధ్యతగా చూసుకుంటున్నాడు. ఆ పిల్లలతో అతను పదకొండవ డిటాచ్‌మెంట్ ఏర్పరిచాడు. ఈలోగా కాలనీకి కొత్త టీచర్లు కూడా వచ్చారు. దొరికినంతలో మంచి టీచర్లు ఉండేలా నేను ఎప్పటిలానే జాగ్రత్త పడుతున్నాను. అలా దొరికినవాడే పావెల్ ఇవానోవిచ్ జర్బిన్. బాగా చదువుకున్న, క్రమశిక్షణ గల

వ్యక్తి జర్బిన్. అతను పిల్లలందర్ని ఒక గుంపులా కాకుండా వ్యక్తిత్వం గల వేర్వేరు మనుషులుగా పరిగణించి, వారితో దయగా వ్యవహరించేవాడు.

ఇరవై ఏడేళ్ల జనోవి ఇవానోవిచ్ బుస్తాయ్ మరో కొత్త టీచర్. అతనొక చిత్రకారుడు కూడా. నవంబర్ చివరిలో కాలనీలో చేరిన బుస్తాయ్ వచ్చినరోజు నుంచే పిల్లలను ఆశ్చర్యపరిచాడు. పొద్దునే అతను నగ్నంగా కొలోమాక్ వొడ్డుకు వెళ్లి, చేతిలో కోటును గట్టుమీదే ఉంచి, నీళ్లలోకి దిగేవాడని పిల్లలు చెప్పారు. అప్పటికే కొలోమాక్ నీరు గడ్డకట్టడం మొదలైంది. అలా గడ్డకట్టిన మంచుని పిల్లల సాయంతో తవ్వి అంత చలిలో ఆ నీళ్లలోకి దిగేవాడు. అక్కడ గంటల తరబడి నానేవాడు. దీనితో అతనికి డిసెంబర్‌లో గట్టి జబ్బు చేసింది. ఆయాసం కూడా వచ్చేది. నేను అతన్ని మందలించాను. ఎందుకల్లా నిన్ను నువ్వు హింసించుకుంటావని ప్రశ్నించాను. తనకి తరచు జబ్బు చేస్తుందట. శారీరకంగా అత్యంత బలహీనుడట. దానితో అతి తేలికగా వ్యాధులు అంటుకుంటాయట. ఇలా వ్యాధులతో గడపడంకంటే శరీరాన్ని గట్టిపరచుకోవడం మంచిదని, అంతగా అయితే ప్రాణాలు పోతాయనీ అన్నాడు. పిల్లలు మొదట్లో అతన్ని వేళాకోళం చేసినా క్రమంతా అతని పట్టుదల చూసి గౌరవించడం మొదలుపెట్టారు. అనారోగ్యంతో మంచం పడితే అతన్ని ఆప్యాయంగా చూసుకోవడం ప్రారంభించారు.

ఇలా పిల్లలతో కలిసిపోయిన బుస్తాయ్ మెల్లగా తన శిష్య బృందాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. మిద్దె మీద తన స్టూడియో ఏర్పాటు చేసుకున్నాడు. ఈలోగా మరో ఇద్దరు అధ్యాపక కళాశాలకు చెందిన విద్యార్థినులు మా కాలనీతో పరిచయం ఏర్పరుచుకునేందుకు వచ్చారు. వాళ్లు కూడా మా పిల్లలకు త్వరలోనే చేరువయ్యారు.

4
కాలనీవాసుల కళాసేవ

ఈ శీతాకాలంలోనే మా థియేటర్ కార్యకలాపాల గురించి ప్రత్యేకంగా వివరించాలి. కొత్త కాలనీలో మాకు నిజమైన నాటకశాల అందుబాటులోకి వచ్చింది. దాదాపు ఆరువందలమంది ప్రేక్షకులు కూర్చునేందుకు వీలైన విశాలమైన మిల్లు షెడ్ మా థియేటర్. ఇక్కడ మేం నాటకాలు వేయడం అనేది ఒక సరదాగా, కాలక్షేపంగా మొదలైనా ఒక దశకు చేరేసరికి మా అందరి ఖాళీ సమయం పూర్తిగా దానికే అంకితమైంది. రాజధాని నగరంలో పెద్ద పెద్ద బృందాలు వేసే నాటకాలనే మేము ఇక్కడ ఆడేవాళ్లం. థియేటర్‌కు పై కప్పు అంటూ సరైనదేమీ లేదు. పైనగల ఇనపరేకు సాయంత్రం అయేసరికి చల్లబడిపోయి, లోపల అంతా చలిగా ఉండేది. అందుకే ప్రేక్షకులకోసం అందులో ఇనుప స్టవ్వులు వెలిగించేవాళ్లం. అయితే ఈ పొయ్యిలనుంచీ వెలువడే వేడి హాల్లో సమంగా వ్యాపించేదికాదు. మంటలు పైకి లేచి వేడి అంతా పైకే పోయేది. దీనితో వేదికపైన నటీనటులు చలిలో వణుకుతూనే నాటకం సాగించేవారు.

ఇక్కడ మా వేదిక నిజంగానే నాటకాలకు పనికివచ్చే వేదిక. ఎత్తుగా, విశాలంగా ఉండే వేదికపై తగినన్ని వింగ్‌లు ఉండేవి. ఈ వేదికపైనే ఒక మూల కొంతభాగంలో కర్టెన్లు కట్టి చిన్న గది ఒకటి తయారుచేశాం. నటీనటులు నాటకం మధ్యలో ఈ గదిలోపలికి వచ్చి చలికాగేవారు, దుస్తులు మార్చుకోవడం, మేకప్పులాంటి పనులకు కూడా ఇది ఉపయోగపడేది. కాలక్షేపం కోసం, ప్రారంభించిన ఆ వ్యవహారం అతి త్వరలోనే సమీప గ్రామాల ప్రజలందరినీ ఆకర్షించే పరిశ్రమగా మారింది. ఆ శీతాకాలంలోనే మేం నలభై నాటకాలు వేశామంటే ప్రేక్షకుల్లో మా నాటకాలకు

ఎంతటి ఆదరణ ఉండేదో అర్థం అవుతుంది. మా నాటకాలేవి ఉబుసుపోని క్లబ్బులు ఆడే నాటకాల్లాంటివి కాదు. మంచి స్థాయిగల పెద్ద నాటకాలే వేసేవాళ్లం.

మేం మూడో నాటకం ఆడేనాటికే కాలనీ పేరు ప్రఖ్యాతులు పరిసర గ్రామాల్లో మార్మోగాయి. ఒక్క గోంచరోవ్కా గ్రామం నుంచే కాక దాదాపు పది, పన్నెండు గ్రామాల నుంచి ప్రతి శనివారం వందలాదిజనం బళ్లుకట్టించుకుని మా నాటకాలు చూసేందుకు వచ్చేవారు. త్వరలోనే పట్టణం నుంచి కూడా జనం రావడం మొదలైంది. శనివారం రాగానే సాయంత్రం భోజనాల వేళనుంచే జనం తాకిడి మొదలయేది. బళ్లల్లో దూర ప్రాంతాలనుంచి వచ్చే రైతులు, వారి కుటుంబాల వారు శరీరాన్ని వేడిగా ఉంచుకునేందుకు చాలా తంటాలు పడేవారు. మా నాటకాలకు రైతులే కాక, పట్టణ శివారు ప్రాంతాలనుంచి కార్మికులు, రైల్వే కార్మికులు, ఇంజన్ వర్క్‌షాప్ సిబ్బంది, టీచర్లు, విద్యాశాఖ పెద్దలు, సైనిక జవాన్లు, ప్రభుత్వ ఉద్యోగులు, సహకార సంఘాల సిబ్బంది, సప్లైల పనివారు, అనేకమంది యువతీ యువకులు తరలివచ్చేవారు. రాత్రివేళకు థియేటర్ చేరే బళ్లు దిగిన మహిళలు చలికి బిగుసుకున్న పాదాలను దారికి తెచ్చేందుకు అక్కడే గంతులు వేసేవాళ్లు. తరువాత వాళ్లు మా కాలనీలోకి వచ్చి ఆడపిల్లల డార్మెటరీలోకి వెళ్లి స్టవ్వుల వద్ద చలికాగేవాళ్లు. వారు తమతో సంచుల్లో రకరకాల కేక్‌లు, బిస్కట్‌లు ఇతర తినుబండారాలు తెచ్చేవారు. మా పిల్లలకు ఇచ్చేవాళ్లు. కానీ కొంతకాలం తరువాత కాలనీలోని కొమ్సొమోల్ ఈ తరహా బహుమతులు స్వీకరించరాదని నిషేధం విధించింది. శనివారం మధ్యాహ్నం రెండు గంటలకే థియేటర్‌లో పొయ్యిలు వెలిగించేవారం. అప్పటికే కాలనీ పిల్లలతో, సిబ్బందితో బాగా పరిచయం అయిన ప్రేక్షకులు సరాసరి కాలనీలోకి వచ్చి అందరిలో ముచ్చట్లకు దిగేవారు. కొందరైతే భోజనాల గదిలో చేరి కబుర్లు మొదలుపెట్టేవారు.

అంతా బానే ఉందనుకున్నా నాటకాలకు అయ్యే ఖర్చు ఒకరకంగా కాలనీకి భారంగా మారింది. ఎంత జాగ్రత్తపడినా ఒక్కొక్క నాటకానికి నలభై, ఏభై రూబుళ్లు అయేది. రంగస్థల అలంకరణ, వేషాలకు అవసరమైన మీసాలు, విగ్గులు, గడ్డాల కోసం ఖర్చు చేయాల్సి వచ్చేది. ఇలా కాలనీకి నెలకు రెండు వందల రూబుళ్లు ఖర్చయేది. ఎంత ఖర్చయినా మేమే భరించాలి తప్ప ప్రేక్షకులనుంచి పైసా కూడా వసూలు చేయకూడదని గట్టిగా నిర్ణయించుకున్నాం. ఎందుకంటే మా నాటకాలు ప్రధానంగా యువతీ యవకుల కోసం. వారి వద్ద జేబు ఖర్చుకు కూడా డబ్బు ఉండేది కాదు. డబ్బు కోసం కాకపోయినా, మా నాటకాలకు పెరిగిపోయిన ఆదరణ దృష్ట్యా, చివరకు టికెట్టు ప్రవేశపెట్టక తప్పలేదు. అంటే నాటకాన్ని బట్టి, ముందే ఊరికి ఇన్ని టికెట్లు అని నిర్ణయించి వారికి ఉచితంగానే అందచేసేవాళ్లం. దీనిపై రోజు ఏదో ఒక గొడవ జరిగేది. తమ ఊరికి మొన్నటిదాకా ఏభై టికెట్లు ఇచ్చేవారని, ఇప్పుడు ముప్పయ్యే ఇస్తున్నారని ఒక గ్రామ సోవియట్ కార్యదర్శి మాతో దెబ్బలాటకు దిగేవాడు. తమ కొమ్సొమోల్ ఏభైమంది సభ్యులుండగా పాతిక టిక్కెట్లే ఇచ్చారేమని మరోపెద్దాయన నిలదీసేవాడు. గతవారం నాటకానికి పదిహేనుమందే ఆ వూరు నుంచీ వచ్చారనీ, వాళ్లలో నలుగురు తప్ప అందరూ తాగి కంపుకొడతున్నారని మా టికెట్లు జారీ బాధ్యుడు గొడవకు దిగేవాడు.

క్రమంగా నాటకాలు వేయడం కేవలం సరదా విషయం కాదని, ఇది బాధ్యతతో కూడినదని మాకు బోధపడింది. ప్రతి శనివారం కొత్త నాటకం వేయడం తప్పనిసరి అయేది. ఒకసారి వేసిన నాటకాన్ని మళ్లీ వారం వేయడం అంటే కాలనీకే అది అవమానవని మా నాటకాల బృందం

భావించేది. అదీకాక ప్రతి నాటకానికి వచ్చే సమీప గ్రామస్థులు ఇలా ఒకేనాటకాన్ని మళ్లా వేస్తే నిరాశపడతారనే విషయం కూడా మాకు తెలుసు. దీనితో ప్రతివారం కొత్త నాటకం కోసం పిల్లలు చాలా కష్టపడవలసి వచ్చేది. వారమంతా అర్థరాత్రి వరకూ కొత్త నాటకం రిహార్సల్స్‌లో గడిపేవారు. ఉన్నట్టుండి కరబనోవ్ గొణిగేవాడు. "గతవారం మతాధికారి వేషం వేయించారు. అంతకుముందు సైనిక జనరల్ వేషం కట్టాను. ఇప్పుడు గెరిల్లా యోధుడు పాత్ర ఇచ్చారు. ఇలా అయితే ఎలాగండీ, నేనూ మనిషినే" అని విసుక్కునేవాడు. చివరకు కాలనీ సభ్యులంతా ఈ సాంస్కృతిక కార్యక్రమలో పాల్గోవాలనీ, భారం అంతా కొందరిపైనే నెట్టకూడదని మా కమాండర్ల మండలి నిర్ణయించింది.

దీంతో నాటకాలు వేయడం అనేది ఒక కళకు సంబంధించిన పనిగా కాక, పొలంలో కలుపుతీసే పనిని పంచుకున్నట్టే అందరూ బాధ్యతలు పంచుకున్నారు. అయితే దీనివల్ల నాటకాల నాణ్యత మాత్రం దెబ్బతినలేదు. పిల్లలందరినీ ఈ పనికోసమే ప్రత్యేకంగా మళ్లా డిటాచ్‌మెంట్‌లుగా విభజించాం. వెర్షనెవ్ సారధ్యంలో ఇరవై ఎనిమిదిమంది కుర్రవాళ్లు ఒక బృందంగా ఏర్పడ్డారు. వీళ్లంతా నటులు. ఈ బృందంలోని కుర్రవాళ్లు క్రమశిక్షణ, సమయపాలనకు కట్టుబడేవారు. ఎవరైనా దీనిని ఉల్లంఘిస్తే ఆ సంగతి సాయంత్రం నివేదికలో నమోదయేది. వెంటనే వారిపై తగిన చర్య తీసుకునేవాళ్లం.

అంతవరకూ నాటకాలు వేయడం అనేది అభిరుచికి సంబంధించిన విషయంగా చెలామణీ కావడంతో వారు కొంచెం ఎక్కువ ప్రజాస్వామ్యయుతంగా ఉండేవారు. ఇప్పుడది బాధ్యతగా మారి అందరిపైనా పడడంతో అందరి తీరూ మారింది. గతంలో ఏ నాటకం వేయాలి, ఏ పాత్రను ఎవరికివ్వాలి అనే అంశాలపై రచ్చ జరిగేది. ఇప్పుడు అన్ని విషయాలూ కమాండర్ల మండలే నిర్ణయించడం వల్ల ఆ అనవసరపు గొడవలు సద్దుమణిగాయి. వచ్చే శనివారం ఏ నాటకం వేయాలి అన్న విషయాన్ని ఆదివారం జరిగే కమాండర్ల మండలి సమావేశంలో నేనే ప్రకటించేవాడిని. దీనివల్ల అనవసరమైన చర్చలకు తావుండేది కాదు. అలాగే ఏ పాత్రను ఎవరు వేయాలనేది కూడా ఆ సమావేశంలోనే నిర్ణయించేవాళ్లం. ఒకసారి నటీనటులు నిర్ధారణ జరిగిన తరువాత వారందరినీ ఒక ప్రత్యేక డిటాచ్‌మెంట్‌గా ఏర్పరిచి, ఒక కమాండర్‌ను నియమించేవాళ్లం.

ప్రేక్షకుల సంగతి చూడడం, నటీనటులకు దుస్తులు, మేకప్ సామగ్రి అన్వేషించడం, థియేటర్‌ను వేడిగా ఉంచడం, వేదిక అలంకరణ, లైట్లు, స్టేజ్ మీద ప్రత్యేక ఏర్పాట్లు, శుభ్రత, తెరల నిర్వహణ ఇలా ప్రతిపనికీ ఒక ప్రత్యేక బృందం ఉండేది. కాలనీలో ఉన్నది ఎనభైమంది పిల్లలేకావడంతో అందరిపై పనిభారం గట్టిగానే ఉండేది. ఏదైనా చారిత్రాత్మక నాటకం వేస్తే నటీనటులకే కొరత ఏర్పడేది. దీంతో ఎవరో ఒకరు అసంతృప్తితో గొణిగేవారు. "నన్ను నటుల్లో చేర్చారేంటి? ఇంతవరకు నేను నటించినవాణ్ణే కాదు" అనేవాడు. వెంటనే కమాండర్ల మండలి ఆ అసంతృప్తి జీవిని గట్టిగా మందలించేది.

"ఎప్పుడో ఒకసారి మొదటిసారి అంటూ ఉంటుందిగా. అదే ఇది సరేనా" అని గద్దించేవారు.

ఒకసారి నాటకం, పాత్రలూ నిర్ణయమైపోయాక పిల్లలందరిపై ముఖ్యంగా కమాండర్లపై పనిభారం విపరీతంగా పడేది. వారంరోజులూ వాళ్లు విశ్రాంతి అనేది లేకుండానే పనిచేసేవారు. ఎవరికి అప్పగించిన బాధ్యతలను వారు సక్రమంగా నిర్వర్తించేవారు. నిజమైన కారణమే ఉన్నా, నిజంగా అవరోధం వచ్చినా ఎవరు ఏ పనీ పూర్తిచేయలేకపోవడం అనేదే ఉండేదికాదు. పట్టణంలో మా నాటకాల కుర్రవాళ్లకు పెద్ద సంఖ్యలో అభిమానులు, మిత్రులు ఉండేవారు. ఎప్పుడు ఏ నాటకం

వేసినా అందుకు ఎటువంటి దుస్తులు, పరికరాలు కావలసి వచ్చినా పట్టణంలో మా కది తేలికగా దొరికేవి. చరిత్రాత్మక నాటకాలు వేసినా మాకు ఎటువంటి దుస్తులూ, ఆహార్యం అవసరమైనా సంబంధిత డిటాచ్‌మెంట్ కాలనీలో అందుబాటులో ఉన్న పరికరాలతోనే వాటిని తయారు చేయగలిగేవాళ్లం. అధ్యాపక సిబ్బంది, సొంత వస్తువులు కూడా చాలాసార్లు మా నాటకాలకు అవసరమైతే, వాటిని నిరభ్యంతరంగా వినియోగించుకునేవాళ్లం. అవసరాలు పెరుగుతున్న కొద్దీ మా నాటకాలకు అవసరమైన శాశ్వత సామగ్రి కూడా క్రమంగా పోగుపడడం మొదలైంది. మా నాటకాల్లో యుద్ధాలు, సైనికులకు సంబంధించిన కథాంశాలు ఉండడంతో అందుకు కావలసిన యూనిఫారాలు, ఆయుధాలు కూడా మావాళ్లు సంపాదించారు. దుస్తులపై ఉండే పతకాలూ, నక్షత్రాలూ, తుపాకులు పేల్చినప్పుడు రావలసిన శబ్దాన్ని తెప్పించేందుకు అవసరమైన పరికరాలూ సమకూరాయి.

మొదట్లో నాటకం నిర్ధారించగానే, పాత్రధారులు తమతమ సంభాషణలను ఎవరికి వారు విడివిడిగా రాసుకుని కంఠస్థం చేసేవారు. క్రమంగా ఇదంతా అనవసర ప్రయాసగా తోచింది. అదీకాక రోజువారీ పని చేస్తూ, ఇంత యాతనపడటం అసాధ్యంగా పరిణమించింది. దీంతో నటీనటులు ముందే నాటకం క్రమాన్ని బాగా అర్థం చేసుకొనేవారు. ఎవరికివారు సుమారుగా తమతమ సంభాషణలను వీలైనంత మేర జ్ఞాపకం పెట్టుకొనేవారు. పైగా అక్షరం పొల్లుపోకుండా సంభాషణ సాగించాలన్న నియమం లేకపోవడంతో సందర్భానుసారం కొద్దిమాటలు అటూ ఇటూ మార్చి కథ నడిపించేవారు. వీటిన్నిటితోపాటు తెరవెనక నేనే ఉండి సంభాషణలు ముందుకు సాగనప్పుడు మాట అందించేవాడిని. ఈ ప్రాంప్టింగ్ కూడా తోడవడంతో నాటకం అభాసు కాకుండా పూర్తయేది. నాటకానికి దర్శకత్వం వహించడం అంటే ఇలా తెర వెనక నిలబడి సంభాషణలు అందిచే బాధ్యత, కథను నడిపించవలసి బాధ్యత కూడా నాపై పడేది.

కాలనీలో మంచి నటులకు కొరత ఉండేది కాదు. ప్యోటోర్, కరబనోవ్, వెట్కోవ్‌స్కీ, బుస్త్రాయ్, వెర్షనోవ్, జడరోవ్, మరూస్యా, కుద్లాటీ, కోవిల్, లాపోట్ వంటి వారంతా ఏ పాత్రనైనా సమర్థంగా పోషించేవారు. చాలామందికి నటించాలనే సరదా ఉండటంతో ఎక్కువ పాత్రలు ఉండే నాటకాలే ప్రధానంగా ఎంపిక చేసేవాడిని. రంగస్థలంపై పెద్ద శిక్షణ లేకున్నా సహజంగా నటించగలవారిని తయారు చేసేందుకు మేం ప్రయత్నించేవాళ్లం. నాటకాల పుణ్యమా అని కాలనీ కుర్రవాళ్లలో క్రమశిక్షణ పెరగడమే కాక, వారి హావభావాలు, భాష కూడా బాగుపడ్డాయి. మా నాటకాలకు ఎందరు నటులున్నా స్త్రీ పాత్రలు ధరించేందుకు ఎక్కువమంది దొరికేవారు కాదు. మరూస్యా, నాపాల్యలతోపాటు మా టీచర్ లిడియా కూడా కొన్ని పాత్రలు ధరించి మెప్పించగలిగింది. అయితే వీళ్లందరికీ అపరిమితమైన బిడియం, కథను బట్టి నాటకంలో కౌగిలింతలు, ముద్దుల వంటి సన్నివేశాలు ఉంటే వారసలు పాత్ర ధరించేందుకు సిద్ధపడేవారు కారు. దీంతో మా వద్ద అప్రెంటిస్‌షిప్ కోసం వచ్చిన అధ్యాపక కళాశాల విద్యార్థినులు కూడా నాటకంలో పాత్రలుగా మారారు. ఒకసారి అనుకోకుండా మా నాటకం ప్రేక్షకుల్లో ఒకరైన ఒక యువతి మా నాటకంలో పాత్ర ధరించవలసి వచ్చింది. అనుకోనిరీతిలో ఆమె ఒక అద్భుతమైన నటిగా మారింది. ఆమె అందం, చురుకుదనం, చొరవ చూసి మేం ఆనందంతో తబ్బిబ్బయ్యాం. నాటకం తొలిప్రదర్శన విరామ సమయంలో రైల్వే ఉద్యోగి అయిన ఆ యువతి భర్త తెర వెనక్కి వచ్చి ఆమెను నాటకంలో కొనసాగనివ్వనన్నాడు.

నా భార్యను వేదికపై ప్రతి కుర్రవెధవ ముట్టుకోవడం, దగ్గరికి లాక్కోవడం సహించనని

హూంకరించాడు. ఆమెను ఇప్పటికి మొదటి ఘట్టంలోనే పురుష పాత్రధారి పదిసార్లు ముద్దు పెట్టుకున్నాడని, దీన్ని తాను సహించనని అరిచాడు.

అతనికి సర్ది చెప్పే ప్రయత్నం చేశాం. "చూడండి కామ్రేడ్, రంగస్థలంపై కథను బట్టి ఇలా ముద్దు పెట్టుకున్నా తప్పేం ఉండదు" అన్నాడు కరబనోవ్. అతను ఊరుకోలేదు. గొడవ కొనసాగించాడు. ఇక లాభం లేదని లాపోట్‌కు అతని బాధ్యత అప్పజెప్పాను. లాపోట్ ఆయనను భుజం పట్టుకుని వెనక బెంచీల్లోకి తీసుకెళ్లాడు.

"చూడు మిత్రమా, నాటకం అనే ఒక మంచి పనిలో భాగంగా, నీ భార్యని ముద్దుపెట్టుకున్నా తప్పులేదు. మీరిలా ఈర్ష్యపడకూడదు" అని వివరించాడు.

"ఎవరికి మంచి పని? నాకు కాదు" అని మొండికేశాడు ఆయన.

"ఇది నాటకం. అందరికీ మంచిని ప్రబోధించే మంచి పనే" అని లాపోట్ కొనసాగించాడు.

"అంటే ఈ వంకతో నా భార్యని ఎవరైనా ముద్దాడవచ్చా" అని అతను కోపంగా అడిగాడు.

"అది కాదు మిత్రమా ఆమె దొంగతనంగా, ఎవరినో ముద్దు పెట్టుకోనివ్వడంలేదు కదా. చేసేదేదో అందరి ఎదురుగా, బహిరంగంగానే చేస్తున్నారుగా. అదేఆమె ఏ చీకటిమాటునో ఎవరినో ముద్దాడితే నువ్వేం చేయగలవు?"

"ఆమె అలాగేం చేయదు"

"చేయదా? నీకు తెలుసా. ఆమె ఎంత గొప్పగా ముద్దు పెడుతుందో తెలుసా? అంతటి నైపుణ్యం కలిగి ఉండి దాన్ని వృథా పోనిస్తుందంటావా?"

ఈ వాదనకు తిరుగులేకపోయింది. ఆయన వెనక బెంచిలో కూర్చునేందుకు సమ్మతించాడు. అయితే నాటకంలో అవసరం ఉన్నా లేకపోయినా ముద్దు సన్నివేశాలు ఉండకూడదని, ఆ ముద్దులు కూడ నటనే తప్ప నిజమైనవి కాకూడదని షరతు విధించాడు.

మా నాటకాల్లో దృశ్యాలను రక్తి కట్టించడానికి కుర్రవాళ్లు చాలా శ్రమపడేవారు. ఏదైనా ఘట్టం కోసం ఒక ప్రత్యేక వస్తువు కావాలంటే ఎక్కడినుంచైనా సరే సంపాదించేవారు. నాటకంలో భాగంగా పాత్రలు కలసికూర్చుని భోజనం చేసే సన్నివేశం ఉంటే ఉత్తుత్తి భోజనాలతో కథ నడపడం కాలనీకి అవమానవని అందరూ భరించేవారు. దానితో మా వంటశాలలో గంటల తరబడి శ్రమపడి నాటకంలో విందు కోసం అనేక పదార్థాలు సిద్ధం చేయించేవాళ్లం. అయితే ఆయా సన్నివేశాలప్పుడు మాత్రం తెర వెనక ప్రాంప్టింగ్‌లో ఉన్న నాకు చిర్రెత్తుకొచ్చేది. ఆ దృశ్యంలో పాత్రధారులంతా పూర్తిగా లీనమయేవారు. తీరికగా భోజనం చేస్తూ, పదార్థాలన్నీ ఖాళీ చేసేవారు. నేను ఎంత త్వరగా ఆ సన్నివేశాన్ని పూర్తి చేయిద్దామన్న వాళ్లు నా మాట వినేవారు కాదు.

"చాలు, ఆ తిండి చాలు, ఇక ముగించండి? అని గుసగుసలతో అరిచేవాడిని. వాళ్లు హడావుడిగా తిండి ముగించేవారు. కానీ విరామ సమయంలో వాళ్లు నన్ను పెద్దమనిషి తరహాలో మందలించేవారు. "ఏంటండి? మీరు మరీను, అంత చక్కటి బాతు వేపుడు రోజూ తింటామా? హాయిగా తింటుంటే మీరు అంత గొడవ చేస్తారేం?" అని నన్ను నిలదీసేవారు.

అయితే కుర్రవాళ్లు రంగస్థలం మీద ఎక్కువ సేపు ఉండటానికి వీలైనంత వరకూ ఇష్టపడేవారు కాదు. చలిలో ఎక్కువసేపు నిలవడం అక్కడ కష్టమే., ఫిబ్రవరిలో ఉష్ణోగ్రత మైనస్ ముప్పై డిగ్రీలు ఉన్నప్పుడు ఒకసారి కరబనోవ్ అదేపనిగా గంటసేపు వేదికపై నిలబడవలసిన అవసరం ఏర్పడింది. అదీ పలుచటి వస్త్రం మాత్రం కప్పుకుని. మా టీచర్ ఎకతెరీనా దీనికి వప్పుకోలేదు. చలిలో వాడు

గడ్డకట్టి పోతాడని నాటకాన్ని రద్దు చేయాలని ఆమె కోరింది. కానీ కరబనోవ్ మొండిగా వాదించి ఆ నాటకంలో ఆ పాత్ర ధరించాడు. పెద్ద ప్రమాదం ఏమీ జరగలేదు.

మరోసారి నాటకంలో ఒక శిలావిగ్రహం అవసరమైంది. కుర్రవాళ్లు పట్టణం అంతా గాలించినా వారికి అది దొరకలేదు. దానితో ఆ విగ్రహం లేకుండానే నాటకం సాగిద్దామని నిర్ణయించాం. తీరా నాటకం మొదలై తెరపైకి లేచినపుడు నేను నివ్వెరపోయాను. వేదికపై శిలావిగ్రహం ఉంది? పరీక్షగా చూద్దును కదా మా కుర్రవాడు షెలాపుటిన్ శిలా విగ్రహంలా నిలబడి ఉన్నాడు. వాడి వళ్లంతా దట్టంగా పిండి పట్టించి ఉంది. నేను వెంటనే తెర దింపించి ఆ విగ్రహాన్ని కిందకి తరిమేశాను.

ఒకసారి 'అజెఫ్' అనే నాటకంలో నేనే ప్లెహ్వే పాత్ర పోషించాను. అందులో ప్రత్యర్థి నాపై బాంబు విసిరే ఘట్టం ఉంది. అదెలా సాధించగలం అని ఆలోచిస్తుంటే ఒసాడ్చీ ధీమాగా హామీ ఇచ్చాడు. "ఫరవాలేదు. నిజమైన పేలుడు ఏర్పాటు చేద్దాం" అన్నాడు.

"నిజమైన' అంటే ఏమిటీ?" అని ఆందోళనగా అడిగాను.

"థియేటర్ అదిరిపోవాలి ప్రేక్షకులు దంగైపోవాలి" అన్నాడు ఒసాడ్చీ. "మీకు ఏం కాదు లెండి" అని హామి కూడా ఇచ్చాడు.

నాటకం ముందురోజు వాడు పేలుడు కోసం చేసిన ఏర్పాట్లు చూపించాడు. పక్కతెరల వెనుక కొందరు పిల్లలు నాటకం తుపాకులతో సిద్ధంగా ఉంటారు. మరో పక్క స్టేజి వెనుక పగిలిన అద్దం ముక్కలను నేలమీద దట్టంగా పరిచారు. మరో కుర్రవాడు పెద్ద రాయిని పట్టుకుని అక్కడ నిడబడతాడు. మూడోవైపు అరడజనుమంది చిన్నపిల్లలు వెలిగించిన కొవ్వొత్తులతో నిలిచి ఉంటారు. వారి వద్ద చేతుల్లో ఏదో ద్రవంతో నిండిన సీసాలు ఉన్నాయి.

ఇదంతా ఏమిటని ఒసాడ్చీని అడిగాను.

"అది పెరాఫిన్. పేలుడు జరగాల్సిన సమయానికి వీళ్లు నీటిలో పెరాఫిన్ నింపుకొని కొవ్వొత్తుల మీద నుంచి రంగస్థలం మధ్యకు దాన్ని ఉమ్ముతారు. ఇదీ పథకం.

"కొంపతీసి మంటలు పెద్దవైతే ఎలా?"

"ఏం ఫరవాలేదు. తెరవెనుక కుర్రవాళ్లు నీళ్ల డబ్బాలతో సిద్ధంగా ఉంటారు" వాడికేం చెప్పాలి?

"నీళ్లతో పెరాఫిన్ మంటలను ఆర్పగలమా?" అని అడిగాను.

వాడు అన్నింటికి సిద్ధపడే నా మీద ఈ ప్రయోగం తలపెట్టాడు.

"పెరాఫిన్‌ను కొవ్వొత్తులపైకి ఊదగానే, అది వాయువుగా మారుతుంది. అందువల్ల దాన్ని ప్రత్యేకంగా ఆర్పవలసిన అవసరం ఉండదు. మిగిలిన చోట్ల మంటలని ఆర్పితే చాలు" అని వివరించాడు.

"మిగిలిన మంటలంటే... ఉదాహరణకు నేనా?" అని ప్రశ్నించాను.

"ప్రమాదం అంటూ జరిగితే మొదట ఆర్పేది మీపై ఉండే మంటలనే" అని వాడు ధైర్యం చెప్పాడు.

చేసేదిలేక విధి చేతిలో బందీగా మిగిలాను. నేను మంటల్లో తగలబడకపోవచ్చు. కానీ మైనస్ ఇరవై డిగ్రీల ఉష్ణోగ్రతలో చల్లటి నీళ్లలో నిలువునా తడవవలసి రావచ్చు. ఆ ఆలోచనే వణుకు పుట్టించింది. కానీ పిల్లల ఎదుట వెనక్కి తగ్గితే బావుంటుందా? అదీకాక కుర్రవాళ్లు ఒక భారీ ప్రయోగం చేద్దామని ముచ్చట పడుతుంటే నేనెలా నిరుత్సాహపరచగలను?

నాటకంలో ఆ ఘట్టం మొదలైంది. ప్రత్యర్థి నాపై బాంబు విసిరాడు. వెంటనే పక్కన ఉన్న పిల్లలు ఖాళీ నీటి తొట్టెలోకి తుపాకీలు పేల్చారు. అవి భయంకరమైన శబ్దం చేశాయి. మరోపక్క పిల్లలు రాళ్లతో అద్దాలు బద్దలుకొట్టి విచిత్ర శబ్దాలు సృష్టించారు. వెనకవున్న పిల్లలు తమ నోటి నిండా పెరాఫిన్ నింపి శక్తి కొద్దీ దానిని కొవ్వొత్తుల మీదుగా రంగస్థలం మధ్యకు వచ్చేలా పుక్కిలించి ఉమ్మేశారు. ఒక్కసారిగా వేదికపై మంటలు లేచాయి. కళ్లు మిరుమిట్లు కొల్పాయి. నా నిజమైన చావైన అంత బాగా చచ్చిపోవడం కుదరలేమో. నేను స్పృహ తప్పాను. ప్రేక్షకులు హర్షధ్వానాలు చేస్తుండగా తెర కిందికి దిగింది.

ఒసాడ్చీ నన్ను లేపి నిలబెట్టి "ప్రమాదం లేదుగా" అన్నాడు.

చెప్పుకుంటూపోతే ఇలాంటి అనుభవాలు ఎన్నో!

5

ఇవానోవిచ్ పెద్ద మనసు

మార్చి 26న మేం గోర్కి జన్మదినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నాం. ఇటువంటి సంబరాలకు జనం బాగా వచ్చేలా జాగ్రత్తపడేవాళ్లం. అందరికీ సమృద్ధిగా భోజనాలు ఏర్పాటు చేసేవాళ్లం. పిల్లలు ఉత్సాహంగా ఈ ఏర్పాట్లలో తలమునకలయేవారు. మిగిలిన ఉత్సవాల సంగతెలా ఉన్నా గోర్కీ జన్మదిన వేడుకలను మాత్రం మరింత ఘనంగా నిర్వహించేవాళ్లం. ఒక్కోసారి కుర్రవాళ్లు ఈ విందు భోజనాన్ని ఆరుబయట ఏర్పాటు చేసేవాళ్లు. అటువంటప్పుడు ఉన్నట్టుండి మబ్బులు తరుముకొచ్చి గట్టి జల్లు పడేది. అందరం తడిసి ముద్దయ్యేవాళ్లం. గౌరవ వందనం కోసం ఆర్భాటంగా సిద్ధం చేసుకొన్న డప్పులు తడిసిపోయేవి. ఈ ఉత్సవాలకు బయటనుంచి అతిథులను ఆహ్వానించేవారం కాదు. ఎందుకంటే ఈ వేడుకలను మేం మా కుటుంబ వ్యవహారంగా పరిగణించేవాళ్లం. ఆ రోజు వేడుకలను కవాతుతో ప్రారంభించేవాళ్లం. అందులో మా కాలనీ బ్యానర్ ముందు ఉండేదని వేరే చెప్పనవసరం లేదు. ఉపన్యాసాలు ఇచ్చేవాళ్లం. తరువాత గోర్కీ చిత్రపటం ముందునుంచి మార్చ్‌ఫాస్ట్ సాగేది. గోర్కీ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ తాగుడు లేకపోయినా శుభ్రంగా కడుపారా భోజనం చేసేవాళ్లం. భోజనాల తరువాత ఏ కరబనోవో లేచి హుందాగా చిన్న ఉపన్యాసం ఇచ్చేవాడు.

"ఇటువంటి అద్భుతమైన భోజనం చేసిన తరువాత ఏ జంతువూ అడుగు కదపలేదు. మనం బూర్జువాలను అనవసరంగా విమర్శిస్తాం" అనేవాడు. భోజనంలో పసందైన మాంసం పులుసు, క్యాబేజి, అన్నం, వెన్నవోడుతున్న కేకులు, ఉడికించిన బంగాళాదుంపలు, రకరకాల ధాన్యాలతో వండిన వంటకాలూ ఉండేవి. తరువాత బాగా కొవ్వుపట్టిన పందిమాంసం వేపుడు వడ్డించేవాళ్లు. అది మా కాలనీలోని పందుల కొట్టంలోనిదే. పిల్లలందరికీ పందుల పోషణ అంటే చాలా ఇష్టం. కానీ వాటిని విందుకోసం చంపడం అంటే మాత్రం ఎవరూ సిద్ధపడేవారు కాదు. ఈ పంది మాంసం తినేసరికి మాకు కడుపులు బరువెక్కి కళ్లు మూతలుపడేవి ఇంతలో గిన్నెల నిండా గట్టి క్రీము సిద్ధమయేది. ఆ తరువాత పళ్లరసం కూడా వచ్చిన అనంతరమే, భోజనం పూర్తయేది. ఆసారి అలాగా భోజనాలు పూర్తి చేసిన తరువాత పిల్లలంతా ఆ వారం చేయబోయే నాటకం ఏర్పాట్లలో పడ్డారు.

ఈసారి గోర్కీ జన్మదిన వేడుకల ప్రత్యేకత ఏమిటంటే అంతకుముందు జరిగిన కొమ్సొమోల్ సమావేశం 'కాలనిస్ట్' అనే బిరుదునొకదాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. కాలనీని నిజంగా గౌరవించి, నియమ నిబంధనలకు కట్టుబడి, మొత్తం అందరి అభివృద్ధి కోసం కష్టించి పనిచేసేవారికి

మాత్రమే ఈ బిరుదు ఇవ్వాలని నిర్ణయమైంది. పనికి భయపడి, ఎప్పుడూ గొడవలకు దిగే అల్లరి పిల్లలకు ఈ బిరుదు దక్కదు. కాలనీలో ఉత్తమ ఉపాధ్యాయులకు కూడా ఈ గౌరవ నామం ఇవ్వాలని నిర్ణయించారు. సిబ్బందిలో ఎవరైనా స్వయంకృషితో ఇక్కడ చేరిన ఏడాదిలోగా ఈ గౌరవ నామాన్ని సాధించలేకపోతే వారిని కాలనీ నుంచి పంపివేయాలని కూడ ఆ సమావేశం నిర్ణయించింది. ఖార్కోవ్‌లోని ఒక ఫ్యాక్టరీలో 'కాలనిస్టు' సత్కారం పొందిన వారి కోసం ప్రత్యేక బ్యాడ్జీలు తయారు చేయించాం. ఈరోజు ఇవానోవిచ్‌కి ఆ గౌరవం దక్కింది. దానితో పెద్దాయన మురిసిపోయాడు.

"జార్ చక్రవర్తి వద్ద అన్నేళ్లు పనిచేసినా ఇటువంటి బ్యాడ్జి ఒక్కటైనా దక్కలేదు. ఈ కుర్రకుంకలు నా ప్రజ్ఞను గుర్తించి గౌరవించారు" అని గొప్పలు చెప్పుకున్నాడు. ఆ రోజు వేడుకలకు బొకోవా అనుకోకుండా హాజరవడం కొందరికి ఇబ్బంది అనిపించింది. ఆమెను నెలరోజుల క్రితమే మా విద్యాశాఖకు బదిలీ చేశారు. ఆమె మా పై అధికారి కానప్పటికీ మమ్మల్ని జాగ్రత్తగా గమనిస్తుండేది.

ఆ రోజు బొకోవా అద్దె బండిలో కాలనీ ముందు దిగి, లోపల మా వేడుకల వాతావరణం చూసి ఆశ్చర్యపోయింది. వచ్చి నన్ను అడిగింది.

"ఏమిటీ ఉత్సవం?"

"గోర్కీ పుట్టినరోజు వేడుకలు" అని బదులిచ్చాను.

తననెందుకు పిలవలేదని ప్రశ్నించింది. సాధారణంగా ఈ పండుగకు బయటివారిని ఎవరినీ ఆహ్వానించే అలవాటు లేదని వివరించాను.

"ఏడీ ఆ పెద్దాయన? ఇవానోవిచ్... నన్ను చూడగానే అదృశ్యమయ్యాడే. పిలిపించండి" అందామె. సాధ్యమైనంత కోపంగా కనిపించే ప్రయత్నం చేస్తోందామె.

ఇవానోవిచ్ వచ్చాడు. వచ్చి ఆమెకు వందనం చేశాడు.

"నా దగ్గరకు రాకండి. అక్కడే నిలవండి. ఏం చేశారు మీరు? ఎంత సిగ్గుచేటైన సంగతి" అంటూ బొకోవా రుసరుసలాడబోయి నవ్వేసింది.

"మనం ఓ మంచిపని చేసినందుకు సంతోషించాలి" అంటూ ఇవానోవిచ్ ఆమె పక్కన బెంచిపై కూర్చున్నాడు.

ఆ ముందువారం ఇవానోవిచ్ చేసిన పాపం ఏమిటో నాకు తెలుసు. నా ఎదుటే జరిగింది ఆ సంఘటన. వారం క్రితం నేనూ, ఇవానోవిచ్ పట్టణం వెళ్లి, బొకోవాను విద్యాశాఖలో ఆమె ఆఫీసు గదిలో కలిశాం. బొకోవా అతిపెద్ద గదిలో కొంతమందితో కూర్చుని ఉంది. గదినిండా ఏదో ప్రత్యేకమైన కలపతో తయారుచేసిన కుర్చీలు, బల్లలూ లెక్కకు మించి ఉన్నాయి. ఆమె చుట్టూ విద్యాశాఖ అధికారులు కూర్చుని తమ పనులు చేసుకుంటున్నారు. బొకోవా అందరితో మాట్లాడుతూ హడావుడిగా ఉంది. ఒక కాయితంపై సంతకం చేయడం, ఎవరికో ఏదో ఆదేశాలు జారీచేయడం, ఇంతలో ఏదో ఫైల్ తీసి చదవడం లాంటి పనుల్లో క్షణం తీరిక లేకుండా ఉంది.

నేనూ, ఇవానోవిచ్ దూరంగా ఒక సోఫాలో కూర్చుని ఏదో మాట్లాడుతున్నాం. ఇంతలో సన్నగా, పొడవుగా ఉన్న ఒకామె గదిలోకి దూసుకొచ్చి పెద్ద గొంతుకతో ఏదేదో మాట్లాడడం మొదలుపెట్టింది. ఆమె ఒక చిన్నపిల్లల కేంద్రం నుంచి వచ్చిందని, అక్కడ చాలామంది పిల్లలున్నా, వారికి తగినన్ని బల్లలు,కుర్చీలు లేవని ఆమె చెబుతున్నట్టు కష్టంమీద గ్రహించాం. ఈ సమస్యతో ఆమె అధికారులను కలవడం ఇదే తొలిసారి కాదట. ఎన్నిసార్లు తిరిగినా ప్రయోజనం ఉండటంలేదట.

"కిండర్ గార్టెన్లు ఏర్పాటు చేయమంటారు. తీరా ఆ పనిచేస్తే పిల్లలకు కావలసిన సామగ్రి ఇవ్వరు. పిల్లలు ఎక్కడ కూర్చోవాలి? ఇవ్వాళ రమ్మన్నారు. పిల్లల్ని తీసుకుని అంత దూరం నుంచి వచ్చాను. ఇక్కడ నాకు సమాధానం చెప్పే దిక్కేలేదు. ఏమిటిది?" అని ఆగ్రహంతో అరుస్తోందామె. "పైగా ఈ గదిలో చూడండి ఎన్ని బల్లలూ, కుర్చీలూ కుప్పలు పోసిఉన్నాయి" అని విరుచుకుపడింది.

ఆమె ఎంత కేకలు పెట్టినా, బొకోవా గానీ, ఆమె చుట్టూ ఉన్న సిబ్బందికానీ ఆమెవైపే కన్నెత్తి చూడలేదు. అసలు పట్టించుకోలేదు. ఉన్నట్టుండి ఇవానోవిచ్ సోఫాలోంచి లేచాడు. ఆమెతో అన్నాడు. "ఈ బల్లలూ, సోఫాలు, బెంచీలు మీకు సరిపోతాయా?" అని.

"ఇవా? వీటికేం! అద్భుతంగా సరిపోతాయి" అందామె ఆనందంగా.

"మరింకేంటి సమస్య? వీటిని పట్టుకెళ్లండి" అన్నాడు.

ఆమె ఇవానోవిచ్ వంక దీక్షగా చూసింది. "ఎలా పట్టుకెళ్లడం" అనడిగింది.

"ఏముందీ ఈ దారిగుండా వీటిని మోసుకెళ్లి మీ బండిలో వేసి తీసుకుపోండి"

"ఆ తరువాత?"

"ఇంకేంటి.. వీటి రవాణాకు అనుమతి పత్రాలా? అటువంటి చెత్త కాయితాలు ఎన్ని కావాలంటే అన్ని దొరుకుతాయి. ఫర్వాలేదు. సామాను తీసుకెళ్లండి" అన్నాడు.

ఆమె ఉత్సాహంగా బయటికివెళ్లి పిల్లలను వెంట పెట్టుకుచ్చింది. ఆ పిల్లలు అక్కడి కుర్చీలు, బెంచీలు, సోఫాలు బయటికి మోసుకుపోయారు. గదంతా ఆ చప్పుళ్లతో నిండిపోయింది. అప్పటిక్కానీ బొకోవాకు జరుగుతుననదేమిటో అర్థంకాలేదు. "ఏంటీ చప్పుళ్లు" అందామె. కాస్త నిశ్శబ్దంగా పని చేసుకోలేరూ!" అని విసుక్కుంది. నేను ఇదంతా చూసి లోపల తెగ సంతోషిస్తున్నాను. పిల్ల రాక్షసులు అంత ఫర్నిచర్‌నీ అంత సులభంగా ఎత్తుకుపోవడం చూసి నాకు ఆనందం కలిగింది. వాళ్లు మేం కూర్చున్న సోఫాను కూడా మర్యాదగా అడిగి, మమ్మల్ని నించోబెట్టి తమవెంట తీసుకుపోయారు.

కిండర్ గార్టెన్ నుంచి వచ్చినావిడ ఇవానోవిచ్ చేతిని స్నేహంగా నొక్కి కృతజ్ఞతలు తెలిపింది.

"సరే సరే మీరు త్వరగా ఆ సామానుతో ఉడాయించండి. వాళ్లు ఎవరైనా ఆపుతారు" అంటూ ఆమెను తొందరపెట్టాడు ఇవానోవిచ్.

కొద్దిసేపటికి బొకోవా చుట్టూ ఉన్న అధికారులు వెళ్లిపోయారు. ఆమె మాతో మాట్లాడుతూ పరధ్యానంగా గదిని కలియచూసింది. "ఆ కుర్చీలు, బెంచీలను ఎక్కడికి పట్టుకెళ్లారు" అంటోంది. మేం మాట్లాడలేదు.

రెండు రోజుల తరువాత ఆమె గదిలో సామానును ఎత్తుకెళ్లేందుకు అనుమతి జారీచేసింది ఇవానోవిచ్ అని బయటపడింది. వెంటనే విద్యాశాఖ నుంచి కబురు వచ్చింది. అయినా మేం హడావుడిగా బయలుదేరలేదు.

"ఇప్పుడు బొకోవా ఆ విషయాన్నే ఎత్తింది, అలా కుర్చీలు ఎత్తుకెళ్లేందుకు అనుమతి ఇచ్చే అధికారం మీకులేదు. నేను ఇప్పుడు ఇక్కడ మీ కాలనీలో సామగ్రిని అలాగే ఎత్తుకుపోయేందుకు ఎవరికైనా అనుమతి ఇవ్వచ్చా?" అని ఆమె అడిగింది. మాటామాటా పెరుగుతోంది. కుర్రవాళ్లు ఆమెను రెచ్చగొడుతూ కోపాన్ని పెంచుతున్నారు. ఆమె కాలనీలో మా పెంపకాన్ని, మేం చెప్పే చదువులనీ కూడా ఘాటుగా విమర్శించింది. ఇక్కడంతా దోపిడీ ముఠాలని తయారుచేస్తున్నామనీ, భూస్వామ్య సంస్కృతిని మప్పుతున్నామని తిట్టిపోసింది. దీంతో ఇవానోవిచ్ పూర్తిస్థాయిలో ప్రసంగించాడు.

"పిల్లలకు బల్లలు లేవంటే తీసుకువెళ్లమన్నాను. వాళ్లు అలా తీసుకెళ్తున్నప్పుడు, ఆ సామాన్ల యజమాని అక్కడే ఉంది. ఆమె కళ్లెదుటి నుంచే రాజమార్గంలో పిల్లలు ఆ సామాను మోసుకెళ్లారు. యజమాని నిద్రపోతోందో ఏమో! ఇప్పుడు వచ్చి మమ్మల్ని విమర్శిస్తోంది." అని విసుక్కున్నాడు. దీనితో బొకోవా కొంత శాంతించింది. ఈలోగా కరబనోవ్ ఒక కర్రకు తెల్ల రుమాలు కట్టి ఆమె చేతికిచ్చాడు. "మీరు గెలవలేరు. తెల్ల జెండా చూపించేయండి" అన్నాడు. ఆమె నవ్వేసింది. పరిస్థితి చక్కబడింది. ఆ సాయంత్రం నాటక ప్రదర్శన కూడా ఊహించనంత చక్కగా రక్తి కట్టింది.

6

మన్మథ బాణాలు

క్రమం తప్పకుండా ప్రతి వారాంతం మేం నాటకాలు వేయడం వలన బయటి ప్రపంచంతో మా సంబంధాలు బలపడ్డాయి. వసంతకాలంలో మన్మథుడు కాలనీపై తన ప్రభావాన్ని చూపడం మొదలుపెట్టాడు. మిగిలిన కుర్రవాళ్ల సంగతెలావున్నా, ప్రేక్షకులను థియేటర్‌లోపలికి తోడ్కొనివచ్చి, వారికి కుర్చీలు చూపించే బాధ్యత నిర్వర్తించే కుర్రవాళ్లు దీనికి తొలి బాధితులయ్యారు. ప్రజలతో సంబంధాలు కలిగి ఉండే పిల్లలనే ఉద్దేశంతో వారికి ఉన్నంతలో మంచి బట్టలు ఇచ్చి, షోగ్గా తయారుచేసి థియేటర్‌లో గేట్‌లవద్ద నిలబెట్టేవాళ్లం. చక్కగా స్నానం చేసి శుభ్రంగా ఉన్న మొహాలతో, అందంగా కళకళలాడుతూ, నున్నగా దువ్విన తలతో, జాకెట్ జేబుల్లోంచి పైకి కనిపించే తెల్లటి రుమాళ్లతో వారు నాటకం చూడవచ్చే ప్రేక్షకులను సగౌరవంగా లోపలికి తీసుకొచ్చి కూర్చోబెట్టేవారు. వారి రూపం, ఠీవి, సత్ప్రవర్తన చూసి పరిసరాల గ్రామాల యువతులు ముగ్ధులయ్యేవారు. ఇలా పదేపదే థియేటర్‌కు వచ్చే యువతులు క్రమంగా మా కుర్రవాళ్లకి సన్నిహితం కావడంలో వింతేముంది. వాళ్ల వయసు అటువంటిది మరి! చూడ చక్కని ఆ యువతులు కూడా సాయంత్రం థియేటర కోసం అతిశ్రద్ధగా అలంకరించుకొని వచ్చేవారు. చెప్పేదేముంది. కొంతకాలం తరువాత ప్రేక్షకుల్లో డ్యూటీలో ఉన్న కుర్రవాడొకడు నాదగ్గరకొచ్చి "ఆంటన్ సెమ్యోనోవిచ్ పిరోగోవ్కా గ్రామ యువతులు ఇళ్లకు తిరిగివెళ్లడానికి భయపడుతున్నారు. తోడు వెళ్లిరానా?" అని వినయంగా అనుమతి కోరేవాడు. ఇదంతా పచ్చి అబద్ధమని నాకు తెలిసిపోయేది. ఆ గ్రామాల యువతులకు ఇళ్లకు తిరిగివెళ్లడానికి ఎలాంటి భయం ఉండదని మాకు తెలుసు. అలాగే యువతులు అనే బహువచనం కూడ శుద్ధ అబద్ధమని, ఎవరో అమ్మాయిని ఇంటిదగ్గర దింపే వంకతో వాడు బయలుదేరాడనీ స్పష్టం. అయినా కుర్రవాళ్లు బయటికి వెళ్లదలిస్తే నా అనుమతి అంత అవసరం కాదు. అందువల్ల నేను వారు కోరినట్టు అనుమతి ఇచ్చి పరువు దక్కించుకునేవాడిని.

సాధారణంగా విద్యాబోధన బాధ్యతలు నిర్వర్తించేవారికి తమ విద్యార్థులు ఇలా బయటిశక్తుల ప్రభావానికి లోనవడం ఇష్టం ఉండదు. సరిగా చదువుసాగకపోవడం వల్లనే పిల్లలు ఇలా పక్కదారులు పడుతున్నారని, మేం టీచర్లం అనుమానిస్తాం. నిజానికి అన్ని కాలాల్లోనూ, అధ్యాపకులందరూ ఈ ప్రేమ వ్యవహారాలని వ్యతిరేకించేవారనుకుంటాను. ప్రేమవ్యాధి సోకిన కుర్రవాళ్లు కొమ్సొమోల్ సమావేశాలకు రాకపోవడం, చదువుపై ఆసక్తి చూపకపోవడం జరిగేవి. సమిష్టి భావనను సైతం నిర్లక్ష్యం చేసేవారు. తనపై కొత్తగా ఆధిపత్యం సంపాదించిన యువతి అధికారాన్ని తప్ప మరే అధికారాన్నీ లెక్క చేసేవాడు కాదు. కాలనీలోని నా సహ అధ్యాపకులు, విద్యాశాఖ అధికారులు మాత్రం పిల్లల ప్రేమాయణంపై చిరచిరలాడేవారు. ఈ ధోరణులను తుదికంటా నిరుత్సాహపరచ వలసిందేనని స్పష్టంగా చెప్పేవారు. ఈ తరహా చర్చలు నిజంగానే ఉపయోగకరంగా ఉండేవి.

ఒకళ్ల అభిప్రాయాన్ని మరొకరు తెలుసుకునేందుకు ఉపకరించేవి. కుర్రవాళ్ల ప్రేమకథలపై చర్చల్లో ఎవరే అభిప్రాయం వ్యక్తం చేసినా, నా అభిప్రాయాలేవో నాకు ఉన్నాయి. మేమే కనుక ధనికులం అయి ఉంటే నేనే ఈ పిల్లలకు స్వయంగా వివాహాలూ, కాలనీ పరిసరాల్లోనే వారికి నివాసాలూ ఏర్పాటు చేసేవాడిని. అందులో తప్పేమీలేదని నా ఉద్దేశం. కానీ అందుకు చాలా సమయం ఉంది. అందుకే కుర్రవాళ్లతో ఏనాడూ చదువును అడ్డం పెట్టుకునో, మరో వంకతోనో వారి ప్రేమ వ్యవహారాల గురించి మాట్లాడే ప్రయత్నం నేను ఏనాడూ చేయలేదు. వాళ్లు కూడా ఏనాడూ హద్దులు మీరి ప్రవర్తించలేదు. ఒకరోజు ఒప్రిష్కో నాకు ఒక పిల్ల ఫోటో చూపించాడు. ఆమె పేరు మరూస్యా (కాలనీ అమ్మాయి కాదు) ఆ ఫోటోలో ఏ ప్రత్యేకతా లేదు. చప్పిడి ముక్కుతో ఆ పిల్ల ఫోటోలోంచి నా వంక చూస్తోంది. ఫోటో వెనుక ఒప్రిష్కోను ఉద్దేశించి ఒక సందేశం ఉంది. "దీన్ని చూసినప్పుడల్లా నన్ను గుర్తుకు తెచ్చుకో" అన్నది ఆ సందేశం.

ఒప్రిష్కో నా ఎదుట వెర్రి మొహం వేసుకు కూర్చున్నాడు. వాడివంక చూస్తేనే గుండెను పారేసుకున్నాడని బోధపడుతుంది. ఎప్పుడూ నుదుటిపై పడే వాడి ఉంగరాల జుట్టు కూడా ఈ రోజు నున్నగా దువ్వి అణిగి ఉంది. నవ్వుతూ కళకళలాడే మొహం దిగాలుగా కనిపించింది. వాడి వంక చూస్తూ అడిగాను. "ఏం చేద్దామని నీ ఉద్దేశం?"

ఒప్రిష్కో కలలో ఉన్నట్టుగా నవ్వాడు.

"మీ సాయం లేకుండా కష్టం. మేం ఇంకా మరూస్యా నాన్నకి ఈ విషయం చెప్పలేదు. ఆమె భయపడుతోంది. ఆయనకి మాత్రం నేనంటే ఎంతో కొంత అభిమానమే" అని చెప్పాడు.

"సరే. కొంతకాలం ఆగు" అని సలహా చెప్పాను.

వాడు తృప్తిగా వెళ్లిపోయాడు.

కుర్రవాళ్లలో చోబట్ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఈ కుర్రవాడు ఎప్పుడూ మందకొడిగా, వంటరిగా ఉండేవాడు. వాడిలో ఏ ప్రత్యేకతా లేదు. కత్తులు దూసి కొట్లాటలకు దిగిన కారణాన పోలీసులు అతన్ని అరెస్టు చేసి, ఈ కాలనీకి పంపారు. ఒకసారి కాలనీకి వచ్చిన తరువాత మాత్రం వాడిలో ఆ దుందుడుకుతనం అదృశ్యమైంది. క్రమంగా ఇక్కడి క్రమశిక్షణను వాడు ఆమోదించాడు. అయితే కాలనీలో సందడిగా ఉన్నచోట్ల వాడెప్పుడూ కనిపించేవాడు కాదు. వాడి మోహంలో ఎప్పుడూ ఏ భావం కనిపించేది కాదు. తప్పనిసరై స్కూలుకి వచ్చేవాడు తప్ప వాడికి చదువంటే అసలు ఆసక్తి లేదు. నానా తంటాలు పడి చదవడం మాత్రం నేర్చాడు. మా కొమ్సొమోల్ తొలి బృందంలో వాడు ఉన్నాడు.

చోబట్ కొద్దికాలంగా నటాషా పెట్రెంకో అనే పిల్లతో గాఢమైన ప్రేమలో పడ్డాడని కాలనీలోని అందరికీ తెలుసు. నటాషా గ్రామంలో మోసీ కార్పోవిచ్ ఇంట ఉండేది. ఆయన ఈ పిల్లను తన మేనకోడలని చెప్పేవాడు. కానీ అది నిజం కాదని ఇంటి పనుల కోసం ఆయన నటాషాను తన ఇంట ఉండనిస్తున్నాడనీ అందరికీ తెలుసు. మోసీ ఆమెను మా నాటకాలు చూసేందుకు వెళ్లనిచ్చేవాడు. ఆమె దుస్తులు దయనీయంగా ఉండేవి. రంగు వెలిసిన గౌను, ఆమె పాదాలకంటే పెద్దవైన బూట్లు, అతుకులు పడిన జాకెట్టుతో చూడగానే జాలిగొల్పేలా ఉండేది. అయితే ఈ దుస్తుల మూలంగానే ఆమె ఎంత ఆకర్షణీయమైన యువతో బయటపడింది. ఇంత సాదా వేషంలోనే ఆమె అందంగా మెరిసిపోయేది. నటాషా ఎప్పుడూ మరికొందరు యువతులతో కలిసి థియేటర్‌కు వచ్చేది. ఉత్సాహంగా, గందరగోళంగా ఉన్న ఆ వాతావరణంలో మౌనంగా, చిరునవ్వులు చిందిస్తూ ఒక

చోట కూర్చునేది. చోబట్ ఆమెను చూడగానే వెళ్లి పక్కనే కూర్చునేవాడు. ఎప్పుడూ కనీసం ఆమె చెయ్యి పట్టుకునేందుకు కూడా వాడు ప్రయత్నించేవాడు కాదు. నటాషాలాంటి నెమ్మదైన పిల్ల చోబట్ వంటి వాడిని నిజంగా ప్రేమిస్తోందా? అనే అనుమానం నాకు కలిగింది.

కానీ చోబట్ కోసం ఆమె నిప్పుల్లో దూకవలసి వచ్చినా సంకోచించదు అని మిగిలినపిల్లలు నాకు చెప్పారు.

నిజానికి ఆ రోజుల్లో, ఈ ప్రేమ వ్యవహారాల గురించి ఆలోచించేందుకు కానీ, సమయాన్ని వెచ్చించడానికి కానీ మాకు అవకాశం లేదు. రోజుకు పద్దెనిమిది గంటలపాటు తీక్షణంగా వెలిగిపోయే సూర్యుడు, మమ్మల్ని పొలం పనులకు తరిమేవాడు. షెరీ కూడా ఆ సూర్యుడిని అనుకరిస్తున్నట్టు మమ్మల్ని రోజంతా పనితో వేధించేవాడు. మాకు కనీసం మాట్లాడేందుకు కూడా వ్యవధి, ఓపిక మిగిలేవి కావు. లెక్క ప్రకారం షెరీ మా పొలంలో ఆరు పంటలు వేసి ఉండాలి. కానీ వాస్తవానికి అతని వ్యవసాయం మరింత సంక్లిష్టమైన వ్యవహారం. అతను పొలంలో పెద్దగా ధాన్యం ఏమీ పండించడం లేదు. ఏడు హెక్టార్ల భూమిలో శీతాకాలం గోధుమపంట మాత్రం నాటాడు. కొద్ది పొలంలో ఓట్స్ వేశాడు. ఒక మూల కొంత భాగాన్ని తన ప్రయోగాల కోసం కేటాయించాడు. అందులో తను వేసిన కొత్తరకం రై పైరును చూసి గ్రామంలో రైతులు ఆశ్చర్యపోకతప్పదని అనేవాడు. మిగిలిన పొలంలో బంగాళాదుంప, బీట్‌రూట్, క్యాబేజి, కర్బూజకాయలు పండించేవాడు.

షెరీ తన పొలంలో విప్లవ ప్రతిఘాత శక్తులను వ్యాపింప చేస్తున్నాడనీ పిల్లలు వేళాకోళం చేసేవారు. పొలం నిండా రాజులు, చక్రవర్తులు, జార్‌లు, రాణులను పండిస్తున్నాడని కుర్రవాళ్ల వేళాకోళం. అంటే ఆ రోజుల్లో ఆ పేర్లతో ఉండే వివిధ వంగడాలను షెరీ పొలంలో వేశాడు. వాటిపేర్లు తెలియడం కోసం అట్టలపై రాసి పొలంలో అక్కడక్కడ అమర్చాడు. ఈ వంగడాలకే రాజు, రాణి అని రకరకాల పేర్లు ఉండేవి.

అన్నిటికంటే బీట్‌రూట్ చేనులో కలుపు తీయడం అంటే కుర్రవాళ్లకు చెడ్డ చికాకుగా ఉండేది. ఆ పని ఎంతకీ తెమిలేది కాదు. పైగా బీట్‌రూట్ మొలక ఏదో, కలుపు మొక్క ఏదో ఎంతకీ అర్థమయేది కాదు. అందుకే అక్కడ కలుపుతీసేందుకు సీనియర్లు కావాలని షెరీ కమాండర్ల మండల కార్యదర్శి వెర్షనెవ్‌కు దరఖాస్తు చేసుకున్నప్పుడు పెద్ద గొడవ జరిగేది.

"నేను సీనియర్లను ఇవ్వలేను" అనేవాడు వెర్షనోవ్.

"చిన్న కుర్రవాళ్లు ఆ పని చేయలేరు. సీనియర్లు కావాలి. నలభైమంది" అనేవాడు షెరీ. దీంతో వెర్షనోవ్‌కి ఆగ్రహం కలిగేది.

"నలభైమందా? గతవారం కూడా నలభైమందినే అడిగారు. పొరపాటున పాత దరఖాస్తు మళ్లీ ఇచ్చారా?" అని ప్రశ్నించేవాడు.

అప్పటికి ఇంకా సెలవులో ఉన్న బొకోవా కాలనీ దగ్గర ఒక పూరింట్లో నివాసం ఉండేది. ఆమె ఈ దెబ్బలాటలని చూసి నవ్వేది. షెరీకి మద్దతు ఇచ్చేది.

"ఏం పిల్లలు మీరు! ఎంత సోమరిపోతులు! ఏం పులుసులో బీట్‌రూట్ వేస్తే ఉషారుగా లాగించరూ?" అని వెర్షనోవ్‌ని అడిగేది.

దీంతో అతనికి కోపం పెరిగేది. "చూడండి. అది పశువులకోసం వేసిన బీట్‌రూట్. అదీకాక పనిపై అంత శ్రద్ధ వుంటే తమరువచ్చి ఒకరోజు ఆ కలుపు తీయండి. కావాలంటే ఆ తరువాత ఆ పనికి నేనొక డిటాచ్‌మెంట్‌ని కేటాయిస్తాను" అనేవాడు.

బొకోవా సెలవులో ఉండటం వల్ల పగలంతా కాలనీలో గడిపేది. కానీ ఆ సమయంలో కుర్రవాళ్లు ఎడతెగని పనిలో తలమునకలై ఉండేవారు. శరీరమంతా చెమట, దుమ్ము, గడ్డిపరకలతో బీభత్సంగా కనిపించేది. సాయంత్రం మళ్లా మా సహాయ సప్లై మేనేజర్ కుడ్లాటీ వద్దకు వచ్చి, పనిముట్లన్నీ అక్కడ పారేసి, కొలోమాక్ నీటిలో జలకాలకు బయలుదేరేవారు. పొదలమాటున అవకాశం కోసం వేచిఉన్న బాలికలు "ఇంక ఎంతసేపు బాబు రండి. మేంకూడా స్నానాలు చేయాలి" అని విసుగుతో కేకలు పెట్టేవారు. వీళ్ల కోసం బొకోవా కాలనీలో ఎదురుచూసేది. వారందరి మధ్యలో ఆమె రూపం కొట్టొచ్చినట్టు కనిపించేది. తెల్లగా మెరిసిపోతూ, సహజమైన రంగులో తళతళలాడే జుట్టుతో, పరిశుభ్రమైన దుస్తుల్లో ప్రత్యేకంగా కనిపించేది. ఆమెని చూసి ఇవానోవిచ్ నాతో అనేవాడు.

"ఎంత చక్కటి రూపం? ఇక్కడ ఆమె అందమంతా వృథా అయిపోతోంది. ఆంటన్ సెమ్యోనోవిచ్, మీరు ఆమెను ఒక యువతిగా పరిశీలించండి. ఆమె మిమ్మల్ని సాటిమనిషిగా గుర్తిస్తోంది. మీరసలు ఆ సంగతి పట్టించుకోరు. ఉత్త మోటుమనిషిలా ఉన్నారు" అని విసుక్కునేవాడు.

"చాల్లెండి సిగ్గులేకపోతేసరి. ఈ కాలనీలో ప్రేమ వ్యవహారం ఒక్కటే నాకు తక్కువ" అని అతని మాటల్ని కొట్టిపడేసేవాడిని.

"సరే, మీ ఇష్టం. నేనేం చెప్పగలను. మీరిలాగే ఉండండి. చివరికి దిక్కుమొక్కులేని మోడులా మిగిలిపోతారు" అని ఆయన నన్ను దీవించేవాడు.

నిజంగానే బొకోవా ఎంత అందమైన, విశిష్టమైన వ్యక్తి అయినా నాకు ఆమెను పట్టించుకునే తీరిక లేదు. బహుశా అందుకేనేమో ఆమె పదేపదే తన ఇంటికి టీకి ఆహ్వానించేది. నాకు వ్యవధి లేదంటే కోపం తెచ్చుకునేది. నేను మర్యాదగా ఆమె ఆహ్వానాన్ని తిరస్కరించేవాడిని, "నేను టీ తాగనండీ" అని చెప్పేవాడిని.

ఒక రోజు భోజనాల అనంతరం ఆమె, నేనూ నా గదిలో కూర్చుని ఉన్నాం. పిల్లలంతా పనిలోకి వెళ్లిపోయారు. ఆమె స్నేహపూర్వకంగా నాతో అంది.

"ఇవాళ సాయంత్రం కనుక మీరు నా ఇంటికి రాకుంటే, మీరు బండమనుషులని తీర్మానించుకుంటాను."

ఆమెను మరీ నొప్పిస్తున్నానేమో అనిపించింది. "సరే వస్తాను. ఏం ఇస్తారు. టీనా?" అని అడిగాను.

"టీ కాదు, ఐస్‌క్రీం. మీ కోసం ప్రత్యేకంగా తయారుచేస్తాను" అందామె.

"సరే తొమ్మిది గంటలకు వస్తాను" అని మాట ఇచ్చాను.

తొమ్మిదిగంటలకు ఆఫీసు గదిలో కూర్చొని ఇప్పుడు ఐస్‌క్రీమ్ కోసం అక్కడకు వెళ్లాలా? అని ఆలోచిస్తుంటే మిట్కా పరుగుపరుగున నా గదికి వచ్చాడు.

"ఆంటన్ సెమ్యోనోవిచ్, త్వరగా రండి" అన్నాడు.

"ఏమైంది?"

"మన కుర్రవాళ్లు చోబట్, నటాషాలను తీసుకొచ్చారు. మౌసీ కార్పోవిచ్ ఉన్నాడు..." అంటూ రొప్పుతున్నాడు.

వాళ్లు తోటలో ఉన్నారని తెలుసుకుని అక్కడికి చేరుకున్నాను. అక్కడ తోటలో పూల మొక్కల మధ్యన గల బెంచిపై నటాషా కూర్చుని ఉంది. ఆమె మొహం భయంతో పాలిపోయి ఉంది. ఆమె చుట్టు కాలనీ బాలికలు కూర్చుని ఉన్నారు. కుర్రవాళ్లు తోటలో గుంపులు గుంపులుగా నిలబడి మాట్లాడుకుంటున్నారు. కరబనోవ్ గట్టిగా అరుస్తున్నాడు.

"అవును ఆ పందివెధవను చంపకుండా వదలడం తప్పు" అని.

ఏడుస్తూ వణికిపోతున్న చోబట్‌ను జదరోవ్ సముదాయిస్తున్నాడు.

నన్ను చూడగానే జదరోవ్ అన్నాడు "ఇదిగో ఆంటన్ వచ్చారు. ఆయన అన్ని విషయాలు సరిచేస్తారు" పిల్లలంతా ఎగబడుతూ, ఒకరికొకరు అడ్డం వస్తూ సంగతంతా నాకు చెప్పారు.

ఇంట్లో ఏదో పనిలో పొరపాటు జరిగిందని మౌసీ కార్పోవిచ్ చెర్నకోలాతో నటాషాను కొడుతున్నప్పుడే చోబట్ వారి ఇంటికి వెళ్లాడు. సరిగ్గా అప్పుడేం జరిగిందన్నది ఎవరికీ కచ్చితంగా తెలిసినట్టులేదు. కానీ పొరుగున ఉన్న పొలాల రైతులు మౌసీ ఇంటిలో గొడవ ఏదో జరుగుతోందని గ్రహించి అక్కడికి వెళ్లేసరికి మౌసీ రక్తం కారుతున్న మొహంతో ఇంట్లో ఒక మూల వణుకుతూ నిలబడి ఉన్నాడు. ఆయన కొడుకు కూడా అదే స్థితిలో కనిపించాడు. గదిలో చోబట్ ఆగ్రహంతో కేకలు పెడుతున్నాడు. నటాషా అప్పటికే పొరుగింటికి పారిపోయింది.

సంగతి తెలిసిన కాలనీ కుర్రవాళ్లు మౌసీ ఇంటికి వెళ్లి చోబట్, నటాషాలను ఇక్కడికి తీసుకొచ్చారు. ఈలోగా రైతులకు, కుర్రవాళ్లకు పెద్ద గొడవ జరిగింది కూడా. నేను పిల్లలందరినీ నా గదికి పిలుచుకువెళ్లాను. నటాషా ఆ కొత్త వాతావరణాన్ని భయం భయంగా చూస్తూ నిలబడింది. ఆమె పెదవులు వణుకుతున్నాయి. కరబనోవ్ ప్రారంభించాడు.

"ఏం చేద్దాం? ఈ వ్యవహారం ఇంతటితో తేలిపోవాల్సిందే" అన్నాడు.

"సరే తీర్చేద్దాం" అన్నాను.

"వాళ్లకి పెళ్లి చేద్దాం" అని బరున్ ప్రతిపాదన.

"దానికి ఇంకా చాలా వ్యవధి ఉంది. అదికాదు ఇప్పుడు చేయాల్సింది. నటాషాను కాలనీలోకి తీసుకునే హక్కు మనకుంది. ఎవరికైనా అభ్యంతరమా? అరవద్దు. మెల్లగా చెప్పండి. ఆడపిల్లల గదిలో ఖాళీ ఉంది. కొల్యా, నటాషా కాలనీలో ఉంటుంది. రేపు ఆమెను ఐదవ డిటాచ్‌మెంట్‌లో చేర్చు" అని తీర్పు చెప్పాను.

"అలాగేండీ" అన్నాడు కోల్యా.

నటాషా ఒక్క ఉదుటున తన శాలువాను విదిలించుకుని నా దగ్గరకు దూసుకువచ్చింది. ఆమె కళ్లు ఆనందంతో వెలిగిపోతున్నాయి. పసిపిల్ల నవ్వినట్టు అమాయకంగా నవ్వుతోంది.

"నిజంగానా? కాలనీలో ఉండనిస్తారా? కృతజ్ఞతలండీ" అంది. పిల్లలంతా తమ ఉద్వేగాన్ని పెద్ద నవ్వులతో కప్పిపెట్టారు. కరబనోవ్ గట్టిగా కాలిని నేలకు తాటించి

"అరే ఎంత తేలికగా పరిష్కారమైంది! అవును. నటాషా మన కాలనీలో.. అదే మంచిది. రమ్మనండిఎవరోస్తారో. కాలనీవాసుల జోలికి ఎవరొస్తారో చూద్దాం" అన్నాడు.

మా బాలికలు నటాషాను దాదాపు చేతులపై మోసుకుంటూ తమ గదికి తీసుకెళ్లారు. చోబట్ నా ఎదురుగా కూర్చుని కృతజ్ఞతలు తెలిపే ప్రయత్నం చేశాడు.

"కృతజ్ఞతలండీ. నేను నమ్మలేకపోతున్నాను. అంత దుర్బలురాలైన మనిషికి మీరిలా సాయపడడం నిజంగా అద్భుతం. పెళ్లంటారా? దానికి మీరన్నట్టు చాలా వ్యవధి ఉంది" అన్నాడు.

ఆ రాత్రి పొద్దుపోయే వరకూ మేం ఇదే విషయం మాట్లాడుకున్నాం. మధ్యలో పిల్లలు కాలనీ యూనిఫారం ధరించిన నటాషాను తీసుకొచ్చి నాకు చూపించారు. చివరికి ఇవానోవిచ్ రంగప్రవేశం చేసి చోబట్‌కి ధైర్యం చెప్పాడు.

"జరిగిన దాని గురించి గందరగోళం అనవసరం. నువ్వొకమనిషి తల నరికివేస్తే తప్ప పెద్ద

గొడవపడటం దండగ. మోసీ బతికే ఉన్నాడు. అంతా బానే ఉంది. జరిగిన సంఘటన ఆ భూస్వామ్య గణాన్ని భయపెడుతుంది. వాళ్లు మరింకే ధైర్యం చెయ్యరు. అందరూ ఇక పడుకోండి పదండి" అన్నాడు.

అర్ధరాత్రి దాటిన తరువాత నేనూ, ఇవానోవిచ్ అలా పచ్చికబయళ్లలోకి నడిచాం. ఆ వెచ్చటి రాత్రి చీకటి ఇవానోవిచ్ మాటలను వింటున్నట్టు తోచింది. ట్రెప్కే ఎస్టేట్ చుట్టూ రక్షణగా ఉండవలసిన తాము గోర్కీ కాలనీ వ్యవహారాలకు సాక్షులుగా మారడం చూసి పొడవాటి పోప్లార్ వృక్షాలు ఆశ్చర్యపడుతున్నట్టు కనిపించాయి.

ఆ పోప్లార్ చెట్ల మధ్యనుంచి, దూరంగా బొకోవా ఇల్లు మాకు ఎదురుగా ఉంది. ఆమె నన్ను ఐస్‌క్రీంకు ఆహ్వానించిన సంగతి గుర్తుకొచ్చింది. ఇంతలో ఉన్నట్టుండి ఆ ఇంటి కిటికీ ఒకటి తెరుచుకుంది. ఒక ఆకారం అందులోంచి కిందకి దూకి కొద్ది క్షణాలసేపు మా దిశగా నడిచి రావడం గమనించాను. అతను మమ్మల్ని గమనించి, ఒక్క క్షణం ఆగి, పక్కకు తిరిగి చెట్లలో కలిసిపోయాడు. 1918నాటి సంఘటనలను వివరిస్తున్న ఇవానోవిచ్ తన మాటలు ఆపేశాడు.

చెట్లలో కలిసిపోతున్న ఆ వ్యక్తిని పరీక్షగా చూసి మెల్లగా అన్నాడు. "వాడు కరబనోవ్. చూడండి వాడు సమయాన్ని వృథా చేయడు. వాడికేం కావాలో స్పష్టంగా తెలుసు. మీరూ ఉన్నారు దేనికి? సిద్ధాంతాలతో కుస్తీ పట్టండి. చివరికి చెప్పాగా దిక్కూమొక్కూ లేక మోడులా మిగిలిపోతారు."

7

గుర్రం కోసం వేట!

ఆ రోజుల్లో కాలనీ మొత్తం కొత్త గుర్రాల అవసరం గురించి బెంగపడేది. అప్పటికే ప్రఖ్యాతిగాంచిన మా గుర్రాలు ముసలివైపోతున్నాయి. మా గుర్రం రెడ్‌కు గడ్డం మొలుస్తోంది. అంతకుముందే ల్యాడీని రిటైర్ చేయాలని కమాండర్ల మండలి నిర్ణయించి, దానికి అశ్వశాలలో ఒక స్థానాన్ని, రోజువారీ ఆహార రేషన్‌ని ఏర్పాటు చేసింది. బ్యాండిట్, మేరీ, ఫాల్కన్‌లు మాత్రం పొలం పనికి అంతంతమాత్రంగా పనికొచ్చేవి. షెరీ ఈ పరిస్థితిపై అసంతృప్తి వ్యక్తం చేసేవాడు.

"మంచి వ్యవసాయ క్షేత్రం కావాలంటే మంచి గుర్రాలు ఉండాలి" అనేవాడు. తాను పోషించే గుర్రాలంటే ఎంతో మక్కువ ప్రదర్శించే బ్రాచెంకో సైతం ఇటీవల తన గుర్రాల పరిస్థితిని చూసి ఆందోళన చెందుతున్నాడు. షెరీ ప్రభావంతో ఎప్పుడో మాకు సమకూరబోయే గుర్రాల మంద గురించి కలలు కనేవాడు. షెరీ, ఇవానోవిచ్, బ్రాచెంకో, నేనూ కలిసి గుర్రాలు కొనుగోలు చేసే ఉద్దేశంతో చాలా సంతలు తిరిగాం. వందలాది గుర్రాలు చూశాం. అన్నీ వయసుమీరినవో, జబ్బుపడినవో, లోపాలున్నవో కనిపించేవి. మంచి గుర్రం పొరపాటున కనిపిస్తే దాని ధర మాకు అందుబాటులో ఉండేదికాదు. యుద్ధం, విప్లవం మూలంగా దేశంలోని మంచి గుర్రాలన్నీ అదృశ్యమైనట్టు అనిపించేది. బ్రాచెంకో ఈ పరిస్థితిపై విసుగుదల ప్రదర్శించేవాడు.

"గుర్రాలన్నీ ఏమైపోయాయి? మంచి గుర్రం కావాలంటే దొరకదేం? అని విస్మయం వ్యక్తం చేసేవాడు. చివరికి ఇవానోవిచ్ గ్రామంలో తనకు గల సంబంధాల మూలంగా మంచి గుర్రాలు అమ్మకానికి ఎక్కడ దొరుకుతాయో "కనిపెట్టాడు" అవతలి గ్రామాల్లో పెద్ద రైతుల వద్ద మంచి గుర్రాలు ఉన్నాయట. లూకా, మౌసీలు అంటున్నారు" అని చెప్పి ఒకరోజు మమ్మల్ని బయలు దేరదీశాడు. ఎప్పటిలానే బ్రాచెంకో బండి పగ్గాలు అందుకున్నాడు. నేనూ, షెరీ, ఇవానోవిచ్ బయలుదేరాం.

గాంచరోవ్కా గ్రామాన్ని దాటి, ఖార్కోవ్ రహదారి మీదుగా పొరుగు గ్రామాలను కలిపే మట్టి రోడ్డుపై మా ప్రయాణం సాగింది. అంతవరకూ వెళ్లని ఒక కొత్త గ్రామానికి మేం వెళ్లాం. ఆశ్చర్యంతో మా నోళ్లు తెరుచుకున్నాయి. అక్కడ మా కళ్లెదుట దిగంతాల వరకూ వ్యాపించిన వ్యవసాయ క్షేత్రాలున్నాయి. ఎక్కువగా జొన్నపొలాలు, సూర్యకాంతితో ధగధగలాడే మొక్కజొన్న కంకులు బంగారు వన్నెలో తలలూపుతున్నాయి. అక్కడక్కడ పచ్చగా, మరోచోట గోధుమ వర్ణంలో పొలం నిండుగా గాలికి కదులుతున్న ఆ కంకుల్ని చూడడం అపూర్వ అనుభవం. పొలం మధ్యలో అక్కడక్కడ తెల్లటి చిన్న చిన్నపాకలు పరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. అనుభవం గల చిత్రకారునికైనా అంత నైపుణ్యంతో రంగులు వినియోగించడం రాదేమోనన్నంత అందంగా ఉంది మొత్తం దృశ్యం. అంతా చూపి ఇవానోవిచ్ అన్నాడు. "చూడండి భూస్వాములు ఎలా బతుకుతున్నారో. ఎంత సంపన్నంగా, పరిశుభ్రంగా, పద్ధతిగా ఉన్నారో" అన్నాడు.

అయిష్టంగానే షెర్రీ ఆయనతో ఏకీభవించాడు.

మా బండి పొలం మధ్యగా ఉన్న డొంకదారి పట్టింది. అందరం వెళ్లి ఒక ఇంటి ముందు బండిని ఆపాం. ఇంటి ఆవరణలో కుక్క ఒకటి మమ్మల్ని చూసి బద్ధకంగా మొరిగింది. ఆ అలికిడి విన్న ఇంటి యజమాని తలుపు తీసి మా వంక అనుమానంగా చూశాడు.

ఇవానోవిచ్ అతన్ని స్నేహంగా పలకరించాడు. "శుభోదయం! యజమానిగారూ ఇప్పుడే చర్చినుంచి వస్తున్నారా?" అని

"నేనా, చర్చికి పెద్దగా వెళ్లను. మా ఇంటావిడ వెళ్తుంది. ఇంతకీ తమరు ఎక్కడినుంచి వస్తున్నారు?" అని ప్రశ్నించాడు.

"మేం ఒక పనిమీద వచ్చాం. మీ దగ్గర మంచి గుర్రాలు అమ్మకానికి ఉన్నాయని తెలిసింది.

ఆ ఇంటి యజమాని మా వంక, మా బండి వంక అనుమానంగా చూశాడు. బండికి కట్టి ఉన్న గుర్రాలు చూసిన తరువాత ఆయనకు కొంత నమ్మకం చిక్కినట్టుంది.

"నా దగ్గర మంచి గుర్రాలు ఎందుకుంటాయి? ఒకటి, అదీ మూడేళ్ల వయసుది ఉంది చూస్తారా?" అన్నాడు.

అందరం వెనకనగల గుర్రపుశాలలోకి వెళ్లాం. అక్కడ ఒక మూలన నిలబడి ఉన్న మూడేళ్ల గర్రాన్ని చూశాం. అది పుష్టిగా, బలంగా ఉంది.

"దానికి ఎప్పుడైనా జీను వేశారా?" అని అడిగాడు షెర్రీ.

"లేదు, దాన్ని ఇంతవరకూ పెద్దగా పనికి ఉపయోగించలేదు. కొద్ది దూరం కోసం బండికి కట్టాం అంతే."

"అది పనికి రాదు. మరీ చిన్నది. మాకు పనిచేయగల గుర్రం కావాలి."

"అవును అది చిన్న గుర్రమే కాని పెంచితే బాగా ఎదుగుతుంది. నేను దాన్ని బాగా పెంచాను. చూడండి."

నిజంగానే ఆ గుర్రం ఆరోగ్యంగా, శుభ్రంగా ఉంది.

"సరే, దాని ధర ఎంత?" అడిగాడు ఇవానోవిచ్.

"ఆరువందల రూబుళ్లు"

"ఇంతోటి గుర్రానికి ఆరువందలా? మతిపోయిందా?" అన్నాడు ఇవానోవిచ్.

"మీ ఇష్టమండీ దాని ధర అది" అన్నాడాయన క్లుప్తంగా.

షెర్రీ నిశ్శబ్దంగా నవ్వాడు. అందరం వెనక్కి తిరిగి బండి ఎక్కాం. ఆవరణలో కుక్క మరోసారి మాపై గౌరవాన్ని ప్రకటించింది. ఇంటాయన అయితే వెనక్కి కూడ తిరిగిచూడకుండా లోపలికి వెళ్లిపోయాడు.

ఆరోజు సాయంత్రం వరకూ మేం డజను వ్యవసాయ క్షేత్రాలు దర్శించాము. దాదాపు ప్రతిచోటా అమ్మకానికి ఒక గుర్రం ఉంది. కానీ ధరల మూలంగా మేం ఖాళీ చేతులతో తిరుగుముఖం పట్టాం... ఇవానోవిచ్ పైపు ముట్టించి సణుగుడు ప్రారంభించాడు.

“ఎలాంటి మనుషులో చూడండి. ఉత్త జలగలు. దూరం నుంచి వచ్చాం. గుర్రాలు అమ్మితే అమ్ముతారు. లేకుంటే లేదు. కానీ కనీస మర్యాద అయినా తెలియని మనుషులు. పందులు, పొద్దున్నుంచి అదే పనిగా తిరుగుతున్నామని చూస్తే తెలియదా? ఒక్కళ్లంటే ఒక్కరైనా తినడానికేమైనా పెట్టారా? మాంసం పులుసు లేకపోవచ్చు. కనీసం బంగాళాదుంప పులుసుకైనా నోచుకోలేదా?” అని చిరచిరలాడాడు.

“ఆ పొలాల్లో ఉన్న కూలీలను గమనించారా?” అని నన్ను ప్రశ్నించాడు.

నేను గమనించాను. పట్టణం నుంచి వచ్చినట్టున్న మా రూపురేఖలను వారు భయంతో, అనుమానంతో చూస్తూ నిలబడడం నా కంట పడింది. ఒకటి రెండు చోట్ల అశ్వశాలల నుంచి గుర్రాలను వాళ్లే తెచ్చి యజమాని ముందుంచారు కూడా.

చివరికి చీకటిపడే వేళకు కాలనీకి తిరిగివచ్చాం.

కాలనీలో లూకా, మోసీలు మా కోసం ఎదురు చూస్తున్నారు. ఎక్కడా కొనేందుకు ఒక గుర్రం కూడా దొరకలేదంటే లూకా ఆశ్చర్యపోయాడు. “అదెలా? ఎందుకు దొరకలేదు? సరే, ఈ గుర్రాల సంగతి చెప్పినది నేనే కాబట్టి ఈ వ్యవహారం నేనే సరిచేస్తాను. ఇవానోవిచ్ మీరేం బెంగపడకండి. వచ్చేవారం నేను కూడా మీతో వస్తాను. మనతో ఆంటన్ సెమ్యోనోవిచ్ వద్దు. ఆయన్ని చూస్తే రైతులు భయపడతారు” అన్నాడు.

ఆపై ఆదివారం ఇవానోవిచ్, లూకా ఇద్దరూ గుర్రాల కొనుగోలుకు బయలుదేరారు. వాళ్లని జాగ్రత్తగా గమనిస్తున్న బ్రాచెంకో అన్నాడు.

“ఈసారి జాగ్రత్తపడండి. కాస్త రొట్టె తీసుకెళ్లండి. లేకపోతే క్రితంసారిలా ఆకలితో మాడతారు” అని హెచ్చరించాడు.

లూకా ఆ మాటలకు నవ్వాడు. “భలేవాడివి కామ్రేడ్ బ్రాచెంకో, మేం వెళుతున్నది రైతుల ఇళ్లకు. మాతో రొట్టె తీసుకెళ్లమంటావా? చూస్తూండు ఇవ్వాళ మంచి మాంసం పులుసుతో భోజనం చేసి వస్తాం. ఎవరో ఒకరు కొంచెం మద్యంకూడా ఇవ్వకపోరు” అన్నాడు. తనవంకే ఆసక్తిగా చేస్తున్న ఇవానోవిచ్ కేసి తిరిగి కన్ను కొట్టి, బండి పగ్గాలు అందుకున్నాడు.

సాయంత్రం వాళ్లు తిరిగి వచ్చేసరికి మొత్తం కాలనీ ఎదురుచూస్తోంది. అద్భుతం ఏదో జరగనున్నట్టు వాతావరణం ఉత్కంఠ భరితంగా ఉంది. ఎట్టకేలకు వాళ్లు తిరిగివచ్చారు. ఇవానోవిచ్ విజయదరహాసం చేశాడు. ఉదయం బండికి పూన్చిన లూకా గుర్రం ప్రస్తుతం బండి వెనక కట్టి ఉంది. ఇప్పుడు బండికి రెండు కమ్మీల మధ్య, అందమైన, అతిపెద్ద ఆడ గుర్రం పూన్చి ఉంది. కొనుగోలుదారులిద్దరికీ అక్కడ రైతులెవరో మంచి ఆతిధ్యం ఇచ్చినట్టు వాళ్ల మొహాలు చూస్తేనే అర్థమవుతోంది. ఇవానోవిచ్ అయితే బండి దిగడమే కష్టమైంది. అయినా పిల్లలముందు ఆయన తన తొట్రుపాటు కనిపించనివ్వలేదు. కరబనోవ్ సాయంతో ఆయన బండి దిగాడు. బండికి కట్టి

ఉన్న గుర్రాన్ని ఆప్యాయంగా తట్టాడు. షెరీ ఆ గుర్రాన్ని చాలాసేపు పరీక్షించాడు. చివరికి తృప్తిగా తలపంకించాడు.

పిల్లలందరికీ ఈ గుర్రం ఎంతగానో నచ్చింది. బరున్ దాన్ని పరీక్షగా చూస్తూ చుట్టూ ఒకసారి ప్రదక్షిణ చేశాడు. "మొత్తానికి మన కాలనీకి ఇన్నాళ్లకి నిజమైన గుర్రం లభించింది" అన్నాడు. కరబనోవ్ కూడా సంతోషంగా ఇకిలించాడు. "అవును ఇది పనిచేయగల గుర్రం." అని వ్యాఖ్యానించాడు. "ఇలాంటివి ఓ డజను గుర్రాలుంటే వ్యవసాయాలంటే ఏమిటో అందరికీ చెప్పగలం" అన్నాడు.

బ్రాచెంకో ఆ గుర్రాన్ని ఆప్యాయంగా అందిపుచుకున్నాడు. దాని చుట్టూ తిరుగుతూ ఆనందంతో గంతులేశాడు. నోటితో చప్పుళ్లు చేశాడు. ప్రశాంతంగా, ధీమాగా, బలంగా ఉన్న ఆ గుర్రాన్ని తడుతూ అన్నాడు. "ఇప్పుడు మనకి మంచి మగ గర్రం కూడా దొరికితేనా, మనకి త్వరలోనే ఓ గుర్రాల మంద తయారవుతుంది" అన్నాడు.

షెరీ అతని వంక సాలోచనగా చూశాడు. "అవును నేనొక మగ గుర్రాన్ని చూశాను. అది మనకి ఉపయోగపడుతుంది. గోధుమపంట చేతికి అందనివ్వండి. ఆ గుర్రాన్ని తీసుకొద్దాం" అన్నాడు.

ఈ సమయంలో కాలనీలో పొలం పనులు ప్రశాంతంగా సాగిపోయేవి. షెరీ నిర్ణయించిన కార్యక్రమం ప్రకారం కుర్రవాళ్లు రోజుకు పదిహేడు గంటలు శ్రమపడేవారు. చిన్న పెద్ద డిటాచ్‌మెంట్‌లలో పిల్లలు ఉదయం వివిధ పరికరాలతో పొలంచేరేవారు. నవ్వుతూ, తుళ్లుతూ అన్ని పనులూ చేసేవారు. ఒక బృందం తరువాత మరొక బృందం నిర్ణీత కార్యక్రమం ప్రకారం కచ్చితమైన సమయానికి పొలం చేరేది. అందరికీ తమ తమ పనులు బాగా తెలిసి ఉన్నందున అందరూ పూర్తి విశ్వాసంతో, ధీమాగా శ్రమించేవారు. అప్పుడప్పుడు మా వ్యవసాయ విభాగంలో షెరీకి సహాయకురాలిగా ఉన్న ఓల్యా హడావుడిగా కాలనీకి తిరిగివచ్చేది.

"వెంటనే ఐదవ డిటాచ్‌మెంట్‌కి సాయంగా కొందర్ని పంపాలి, వాళ్లు పనిలో కొంత వెనుక బడ్డారు." అని చెప్పేది.

డ్యూటీలో ఉన్న పర్యవేక్షకుడు ఆమె కోరిన విధంగా మా రిజర్వుల నుంచి ఐదుగురు కుర్రవాళ్లని అక్కడికి పంపేవాడు. ఆదేశాలు రాగానే ఎక్కడెక్కడో తిరుగుతున్న పిల్లలంతా క్షణాల్లో పోగై పొలానికి బయలుదేరేవారు.

అప్పటికే బొకోవా చెప్పినట్టుగా మేం నలభైమంది కొత్త పిల్లలకు కాలనీలో చోటిచ్చాం. ఒక ఆదివారమంతా కాలనీలో పాత కుర్రవాళ్లు ఈ కొత్త పిల్లల వ్యవహారాన్ని పట్టించుకున్నారు. వాళ్లకి స్నానాలు చేయించి, దుస్తులు వేసి, తిండిపెట్టి సిద్ధం చేశారు. కొత్త పిల్లలు వచ్చినంత మాత్రాన కాలనీలో డిటాచ్‌మెంట్‌ల సంఖ్య పెంచరాదని నిర్ణయించాం. ఈ పిల్లలని ఉన్న డిటాచ్‌మెంట్‌లలోనే సర్దాం. ఉన్న పాత కుర్రవాళ్లందరినీ మరమ్మతులుపూర్తయిన మా రెండంతస్తుల రెడ్‌హౌస్‌కు మార్చాం. దాంతో కొత్త కుర్రవాళ్లు సీనియర్లతో బాగా కలిసిపోయారు. కొద్దికాలంలోనే తాము సైతం గోర్కీవాసులం అని సగర్వంగా ప్రకటించడం ప్రారంభించారు. వారికి కవాతు చేయడం పూర్తిగా పట్టుబడకున్నా అందరితో కలిసి నడిచేవాడు. "వాళ్లు ఇంకా తప్పటడుగులు వేసే పసికుంకలే" అని కరబనోవ్ అనేవాడు. నిజంగానే వారంతా పదమూడేళ్ల లోపు పిల్లలు.

ఎప్పటిలానే బెలూఖిన్ ఆ పిల్లలను పట్టించుకొని శ్రద్ధగా తయారుచేశాడు. వాళ్ల జుట్టు అడ్డదిడ్డంగా కత్తిరించి ఉండటాన్ని నాకు చూపి "ఈ రాత్రి క్షురకుడు వస్తాడు. అందరికీ శుభ్రంగా క్షౌరం

చేస్తాడు" అని చెప్పాడు. ఈ కొత్త కుర్రవాళ్లు మొదటి రోజంతా కాలనీ మొత్తం తిరుగుతూ ప్రతి అంశాన్నీ ఆశ్చర్యంతో బహు జాగ్రత్తగా గమనించారు. ఈ పిల్లల్లో ఎవరినీ గుర్రపుశాలలోకి పంపవద్దని బ్రాచెంకో నిర్మొహమాటంగా చెప్పాడు.

"వెళ్లండి మీకు ఇక్కడేం పని. మీరు ఉండాల్సింది భోజనాల గదిలో" అని వారిని మర్యాదగా కసురుకున్నాడు.

"భోజనాల గదిలోనే ఎందుకుండాలి?"

"అంతకంటే మరేం చేయగలరు. పొండి, వెళ్లి శుభ్రంగా తినండి" అన్నాడు బ్రాచెంకో.

అయితే మొదటిరోజు గడిచేసరికే బ్రాచెంకోకు ఆ పిల్లల ముఠాలో పనికివచ్చేవాళ్లు దొరికారు. తన పద్ధతి ప్రకారం గుర్రాలను సాకడానికి పనికివచ్చే కుర్రవాళ్లని అతను ఎంపిక చేసుకున్నాడు. రోజు గడిచేసరికి కొత్త పిల్లలు వివిధ డిటాచ్‌మెంట్‌లలో కలిసి పనిలో పడ్డారు. తెలియని, అలవాటు లేని పనులు కావడం వల్ల త్రొటుపడేవారు, సీనియర్ల కాళ్లకి అడ్డం పడేవారు. పిల్లలంతా బంగాళదుంపల చేనులో పనిలో పడ్డారు. సీనియర్లు అలవాటు ప్రకారం ఒక్కొక్కరు ఒక్కక్క వరస దుంపల్ని పెకలిస్తుంటే, కొత్త పిల్లలకు మాత్రం ఇద్దరిద్దరికి ఒక వరస చొప్పున అప్పచెప్పాం.

కొద్దిరోజుల్లోనే గోధుమ కోతలు పూర్తి కావచ్చాయి.

మర్నాడు తాను గ్రామానికి వెళ్లి మా ఆడ గుర్రానికి తోడుగా ఒక పోతు గుర్రాన్ని తెస్తానని షెరీ ప్రకటించాడు.

"అది మంచి గుర్రమేనా?" అని అడిగాడు బ్రాచెంకో అనుమానంగా.

"పర్వాలేద"ని షెరీ బదులిచ్చాడు.

"ఎక్కడ కొన్నారు. సోవోఖోజ్‌లోనా?"

"అవును"

"ఎంతైంది?"

"మూడు వందలు"

"తక్కువేనే?"

"అవును"

సాయంత్రం పిల్లలంతా స్నానాలు చేసి గులాబీ పొదల మధ్య తిరుగుతుంటే ఉన్నట్టుండి, దూరంగా మిల్లు వెనక ధూళి మేఘాలు లేచాయి. కరబనోవ్ శరవేగంగా ఒక గుర్రాన్ని స్వారీ చేసుకుంటూ మా దిశగా వచ్చాడు. అందరం నిశ్శబ్దంగా ఆ అపూర్వ దృశ్యాన్ని చూస్తు నుంచున్నాం. అటువంటి దృశ్యాన్ని ఇంతకు ముందు చిత్రపటాల్లో మాత్రం చూశాం. కరబనోవ్ అనుభవజ్ఞుడైన అశ్వకునిలా ఆ గుర్రాన్ని అధిరోహించి పరుగులు పెట్టిస్తున్న తీరు మనోహరంగా అనిపించింది. ఆ గుర్రం బలంగా, ఆరోగ్యంగా, ఎత్తుగా, అందంగా ఉంది. దట్టమైన కుచ్చుతోకను కదిలిస్తూ అది మాముందు ఆగింది. బలమైన దాని మెడ చిక్కటి నలుపురంగు కనుగుడ్లూ, గోధుమ వర్ణంలో ఉన్న ఆ గుర్రం వీపుపై బంగారు వన్నెలో జూలు మెరిసిపోతోంది. సన్నటి, బలమైన కాళ్లతో అది మా ముందు ఆగింది. గుర్రపుశాలనుంచీ బ్రాచెంకో పరుగున వచ్చి, ఆ గుర్రాన్ని కళ్లు ఆర్పకుండా చూశాడు.

"ఇది మన గుర్రమేనా? ఇదేనా నువ్వు తెస్తానన్న మగ గుర్రం?" అనడిగాడు.

"అవున'ని కరబనోవ్ గర్వంగా ప్రకటించాడు.

ఒక్కసారి బ్రాచెంకోకు కోపం వచ్చింది. "ముందు గుర్రం దిగు. ఎంతసేపు అలా కూర్చుంటావ్? కూర్చునది చాలదా? చూడు దానికి ఎలా చెమటలు పట్టించావో" అని కరబనోవ్‌ను కసురుకున్నాడు. కరబనోవ్ ఠీవీగా గుర్రం దిగి, "ఇంతకు ముందు ఇటువంటి గుర్రం ఎవరికైనా ఉండి ఉంటే, ఒక్క నెపోలియన్‌కు మాత్రం ఉండేదేమో" అన్నాడు.

బ్రాచెంకో ఆ గుర్రాన్ని అతి మర్యాదగా గుర్రపుశాలలోకి తీసుకెళ్లాడు. వాడి కళ్లమ్మట నీళ్లు తిరగడం అందరం చూశాం. పిల్లలంతా నవ్వారు. ఇవానోవిచ్ ఆదరంగా అన్నాడు. "నిజంగానే అది అద్భుతమైన గుర్రం కాదనలేం. కాకపోతే అది మన దగ్గర పనిచేయలేదు. దాన్ని మనం చంపేస్తాం" అన్నాడు.

బ్రాచెంకో చప్పున వెనుదిరిగాడు. "ఎవరు చంపేది?" అని అరిచాడు. పిల్లల వంక తిరిగి హెచ్చరించాడు. "ఎవరైనా సరే దాన్ని ముట్టుకుంటే చంపేస్తా జాగ్రత్త. గునపంతో బుర్రలు బద్దలు కొట్టేస్తా" అని గాండ్రించాడు. ఆ గుర్రానికి మేం "మెలోడెట్స్" అని పేరు పెట్టాం.

8

పెరిగిన ఆదాయం

ఎస్టేట్ పొరుగున గల మిల్లును అద్దెకు తీసుకునేందుకు చాలా కాలంగా మేం చేసిన ప్రయత్నం చివరికి జూలైలో ఫలించింది. ఆ మిల్లును తామే అద్దెకు తీసుకోవాలని గ్రామ సోవియట్ కూడ ప్రయత్నించింది. కానీ అధికారులు కాలనీకే మూడేళ్లపాటు అద్దెకు ఇవ్వాలని నిర్ణయించారు. దీనితో గ్రామ సోవియట్‌కు, మాకు మధ్య సంబంధాలు మళ్లీ బెడిసికొట్టాయి. అత్యంత ఆశ్చర్యకరంగా మిల్లు మాకు అందుబాటులోకి వచ్చిన స్వల్పకాలంలోనే కాలనీ దశ తిరిగింది. అనూహ్యమైన రీతిలో మాకు ఆదాయం వచ్చిపడడం మొదలైంది. మిల్లు ప్రధాన ఆదాయ వనరుగా మారింది. కొద్దిరోజుల క్రితం రెండు గుర్రాలు కొనాలంటే నిధుల్లేక విలవిల లాడిన మేం వేసవి నాటికి మేలు రకం ఆవులను కొనగలిగాం. కొన్ని గుర్రాలు, కొత్త ఫర్నిచర్ సమకూర్చుకోగలిగాం. ఈలోపే షెర్రీ నిశ్శబ్దంగా పశువుల కొట్టాన్ని ఒకదాన్ని నిర్మించడం ప్రారంభించాడు. మా నిధులపై వత్తిడి తేకుండానే అతను తనకు లభించిన వనరులనే వెచ్చించి, కాలనీలో ఒక పక్కగా అందమైన పశువుల కొట్టం నిర్మింపచేశాడు. ఆ భవనం చూసేందుకు ఠీవిగా, పటిష్టంగా ఉండేది. దాని ముందు షెర్రీ బృందం అందమైన పూలతోటను కూడ పెంచింది. ఆ కొట్టంలో ఐదు మేలుజాతి ఆవులు, ఒక ఎద్దు ఉండేవి. దీనినే మా పశుసంపదను పెంచుకొనేందుకు విత్తుల కోసం ఉపయోగించేవారం. దీనితో పాటు మా మగ గుర్రం "మెలోడెట్స్", ఇంగ్లీషు పంది వాసిలీలకు పశు సంపదను అభివృద్ధి చేసేందుకు అవసరమైన వైద్య సర్టిఫికేట్‌లు సంపాదించాం.

ఈలోగా కాలనీలో పందుల కొట్టం వేగంగా అభివృద్ధి చెందింది. మా కుర్రవాడు స్టుపిట్సిన్ సారథ్యంలో పదవ డిటాచ్‌మెంట్ పిల్లలు ఈ కొట్టం బాధ్యతను నిర్వర్తించేవారు. ఈ కొట్టంలో మేలుజాతి పందుల అభివృద్ధికి కృషి చేసేది. ఈ కొట్టం మా కాలనీ ఆవరణ మధ్యలో ఉండేది. ఎప్పుడూ పరిశుభ్రంగా ఉండే ఈ పందుల కొట్టంలోకి అతికొద్ది కాలనీవాసులకే ప్రవేశ అర్హత ఉండేది. కొత్త సభ్యులను ఎప్పుడైనా అక్కడి పనితీరును గమనించేందుకు అక్కడకు రానిచ్చేవారు. ఎవరైనా అందులోకి వెళ్లాలంటే నేనైనా, షెర్రీ అయినా పాస్ రాసి ఇవ్వాల్సి వచ్చేది. దీంతో పదవ డిటాచ్‌మెంట్ చేస్తున్న పనికి ఒక గౌరవం, ప్రతిష్ట ఏర్పడ్డాయి. ఆ కొట్టం మొదటిగదిలోకి వెళ్లేందుకు మాత్రం పదవ డిటాచ్‌మెంట్ కమాండర్ స్టుపిట్సిన్ అనుమతి ఉంటేచాలు. ఈ గదిలోనే అమ్మకానికి

పంది పిల్లలను ప్రదర్శనగా ఉంచేవారు. గ్రామస్థులు తమ ఆడపందులకు విత్తులు వేయించేందుకు ఈ గదిలోకి తీసుకొచ్చేవారు. మా వద్ద గల ఆరోగ్యవంతమైన, మగ పందుల సేవలను గ్రామస్థులకు అందించేవారం. అందుకు మూడేసి రూబుళ్లు రుసుం వసూలు చేసేవారం. దీనికి అక్కడి క్యాషియర్ రసీదు ఇచ్చేవాడు. అక్కడే పందులను బరువు తూచి కిలోకు ఇంత చొప్పున ధర నిర్ణయించి అమ్మేవాళ్లు.

పందుల కొట్టం మొదటి గది ఎప్పుడూ రైతులతో కిక్కిరిసి ఉండేది. స్టుపిట్సిన్ పంది పిల్లలను రైతులకు అప్పజెప్పి, వాటికి ఒక రబ్బరు తొట్టెలో ఎప్పుడెప్పుడు ఎంత ఆహారం ఇవ్వాలో సూచనలు ఇచ్చేవాడు. పంది పిల్లలను ఎలా కడగాలో, వాటికి ఎంత పరిణామంలో పాలు ఇవ్వాలో, ఎప్పుడూ ఘనాహారం ఇవ్వవచ్చో వివరించేవాడు.

మొత్తానికి ఆరోగ్యవంతమైన ఈ పంది పిల్లల పంపిణీ, అమ్మకాల వల్ల మా కాలనీ పేరు జిల్లా అంతటా వ్యాపించింది. దీంతో పరిసర గ్రామాల ప్రజలు గుంపులు గుంపులుగా వచ్చి మా నుంచి పంది పిల్లలు కొనుక్కుని వెళ్లేవారు. కొద్ది కాలానికే జిల్లాలో చాలా గ్రామాల్లో మేం సరఫరా చేసిన ఇంగ్లీషు జాతి పందుల పెంపకం ముమ్మరమైంది. ఈ పందులు అతి వేగంగా, కండపట్టి బాగా బరువు తూగుతాయి.

మా పందుల కొట్టంలోనే నర్సరీ విభాగం అతి ముఖ్యమైనది. ఇక్కడ పనిచేసే వారిని షెర్రీ శ్రద్ధగా ఎంపిక చేసేవాడు. ఇందులో వందలాది పంది పిల్లలు ఉండేవి. వాటి ఎదుగుదలను శ్రద్ధగా గమనిస్తూ, శ్రద్ధగా పనిచేయగలిగినవారినే షెర్రీ ఈ విభాగంలోకి అనుమతించేవాడు.

కొట్టంలో మరో విభాగంలో మా కాలనీ అవసరాలకు కావలసిన పందులను మేపేవారు. నెలరోజుల్లోపే ఒక పందిని విపరీతంగా మేపి అది కదల్లేని స్థితికి తెచ్చిన తరువాత దానిని ఇవానోవిచ్‌కి అప్పగించేవారు. సిలాంటి దాన్ని పాత పార్కు వద్ద ఏటవాలు గట్టు దగ్గరికి తీసుకెళ్లి గంటలో దాన్ని మాంసంగా మార్చేవాడు. దాని కొవ్వును భద్రపరిచేందుకు స్టోర్‌రూం నుంచి ఒక చిన్నపీపాను తీసుకెళ్లేవాడు.

ఈ కార్యకలాపాల వల్ల కూడా కాలనీకి మంచి ఆదాయం వచ్చేది. మరోవైపు షెర్రీ సారథ్యంలో పంటలు ఏపుగా ఎదిగాయి. పశువులకు కావలసిన దాణా కూడా సమృద్ధిగా లభ్యమైంది. దీంతోపాటే కాలనీకి అవసరమైన బీట్‌రూట్, బంగాళాదుంప, గుమ్మడి, మొక్కజొన్న నిల్వలు పేరుకున్నాయి.

మేం సంపాదించిన మిల్లు వల్ల కూడా మాకు అపరితమైన ఆదాయం వచ్చేదని ముందే చెప్పాను. ధాన్యం మరపట్టినందుకు డబ్బులు రావడంతో పాటు, పశువుల దాణాకు పనికొచ్చే తవుడు కూడా ఇక్కడినుంచే అందేది. అన్నిటినీమించి ఈ మిల్లు పరిసర గ్రామాలతో మా సంబంధాలను పటిష్టం చేసే కేంద్రంగా అవతరించింది. దీనివల్ల ఎప్పటికప్పుడు మారుతుండే రైతల స్థితిగతులతో, వారి అవసరాలతో కాలనీకి సన్నిహిత పరిచయం అనివార్యం అయింది. ప్రతి గ్రామంలోనూ పేద రైతుల కమిటీ ఒకటి ఉండేది. వారు క్రమశిక్షణతో, ఒక కట్టుబాటు కలిగి ఉండేవారు. మధ్యతరగతి రైతులు ఎవరితోనూ అంతగా కలిసేవారు కారు. పెద్ద రైతులు పొగరుగా, దుందుడుకుగా ప్రవర్తించేవారు. విప్లవానంతరం మారిన తమ ఆర్థిక పరిస్థితి పట్ల వారికి అసంతృప్తి, బోల్షివిక్‌లమైన మాపై కొంత ఆగ్రహం వారికుండేవి.

మిల్లు మా చేతికి వచ్చిననాడే, మేం సమిష్టి వ్యవసాయ క్షేత్రాలకే ప్రాధాన్యం ఇస్తామని అధికారికంగా ప్రకటించాం. పేదరైతులు అతి సులభంగా సమిష్టి క్షేత్రాలుగా ఏర్పడేవారు. చెప్పిన

సమయానికి కచ్చితంగా మిల్లు వద్దకు వచ్చి పని చూసుకుని నిశ్శబ్దంగా నిష్క్రమించేవారు. పెద్దరైతులు కూడా తమ సమీప బంధువులు, ఆప్తులతో కలిసి సమూహాలుగా ఏర్పడ్డారు. వాళ్లతోనూ ఎలాంటి ఇబ్బందీ ఉండేదికాదు.

సమస్యంతా మధ్య తరగతి రైతులతోనే ఎదురయేది. వాళ్లు ఎవరికివారుగా మిల్లుకు వచ్చేవారు. ఎవరినో చూపి తమ ప్రతినిధిగా పరిచయం చేసేవారు. ఆ ప్రతినిధులందరికీ న్యాయం చేయడానికి బదులు ముందు తన ధాన్యం సంగతి చూడమనేవాడు. దీంతో వారి మధ్య గొడవలు తలెత్తేవి. ఈ రైతులు మిల్లుకు వచ్చేదారిలో కాస్త చుక్క కూడా వేసేవారేమో, తమ మధ్య అభిప్రాయబేధాలను ఆ మత్తులోనే తేల్చుకునేందుకు నడుం బిగించేవారు. పనిలో పనిగా మిల్లు బాధ్యత నిర్వహించే తొమ్మిదవ డిటాచ్‌మెంట్‌తో ఘర్షణకు దిగేవారు. మిల్లు మేనేజర్ బాధ్యతలు చూసే కుద్లాటీకి ఇలా తగవులకు దిగే రైతులను దారికి తేవడం బాగా తెలుసు. ఈ క్రమంలో అతను పరిసర గ్రామాల్లో ఎంతో గౌరవనీయునిగా గుర్తింపు పొందాడు కూడా.

గొడవలకు దిగే రైతులను అతను మందలించేవాడు కాదు, చెయ్యి చేసుకునేవాడుకాదు. బాగా తాగిన ఆ రైతులను తన సహచరులతో బలవంతాన కొలోమాక్ నది వొడ్డుకు తరలించేవాడు. అక్కడ వారికి 'జలచికిత్స' జరిపించేవాడు. అంతే తాగినమత్తు దిగేదాకా వారిపై అతి చల్లటి నీళ్లు గుమ్మరించమనేవాడు. ఈ దృశ్యాన్ని మిగలిన గ్రామస్థులు పగలబడి నవ్వుతూ పరికించేవారు. మత్తు దిగిన రైతులు, చలికి వణుకుతూ, సిగ్గుతో తలవంచుకుని తమ పని పూర్తి చేయించుకుని గ్రామాలకు తిరిగి వెళ్లిపోయేవారు. ఈ 'జలచికిత్స'తో కుద్లాటీ ప్రొఫెసర్ అనే బిరుదు సంపాదించగలిగాడు.

మిల్లు వద్ద కుద్లాటీ సహాయకుడైన లాపోట్ ఈ 'జలచికిత్స'ను అతి శ్రద్ధగా నిర్వహించేవాడు. తాగి అల్లరి చేస్తున్న రైతును కొలోమాక్ వద్దకు తరలించిన తరువాత తన సహచరులకు పరిస్థితిని బట్టి ఆదేశాలు జారీచేసేవాడు. "ఈ రోగి పరిస్థితి అంత బాలేదు. ఈయనకి ఆరు బకెట్లు పొయ్యండి" అనేవాడు.

ఆ రైతు కాస్త మత్తు దిగి, జరిగింది గమనించి "ఇలా నీళ్లు పోసే అధికారాన్ని మీకెవరిచ్చారు?" అని ఆగ్రహంతో ప్రశ్నించేవారు.

"అలాగేం అయితే మరో మూడు బకెట్లు పొయ్యండి" అనేవాడు లాపోట్, గ్రామస్థులు ఈ వ్యవహారాన్ని, వినోదంగా, ఆశ్చర్యంగా చూసేవాళ్లు.

ఈ 'జలచికిత్స' గురించి విన్న దూర ప్రాంతాల వాళ్లు లాపోట్‌ను కలుసుకొనేందుకు వచ్చేవారు. అతను వినయంగా "నేను సీనియర్ అసిస్టెంట్‌ని మాత్రమే. ఆయన అసలైన ప్రొఫెసర్" అంటూ కుద్లాటీ వంక చూపేవాడు.

గ్రామల్లో కూడా 'జలచికిత్స' అందరికీ ఊతపదంగా మారింది. ఎవరైనా తాగి గొడవ ప్రారంభిస్తే వాళ్లు అతన్ని అడిగేవారు. "నీటి డాక్టర్‌ని పిలవమంటావా? ఆయన ఈ మధ్య ఇళ్లకు కూడా వచ్చి చికిత్స చేస్తున్నారు." అని వేళాకోళం చేసేవారు. క్రమంగా మిల్లులో మాదంటూ ఒక ప్రత్యేక వాతావరణం ఏర్పడింది, అక్కడ మా కుర్రవాళ్లు ఎప్పుడూ ఉషారుగా, క్రమశిక్షణతో పనిచేసి గ్రామ ప్రజలకు అభిమానపాత్రులయారు.

జూలైలో గ్రామ సోవియట్ ఎన్నికలు నిర్వహించాం. పాత నాయకత్వం, లూకా బృందం పెద్ద నిరసనలు లేకుండానే మాకు తలవంచింది. గ్రామానికి చెందిన యువకుడు పావెల్ నికోలయెంకో అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు. కాలనీ వాసి కుద్లాటీ సోవియట్ సభ్యునిగా ఎన్నికయ్యాడు.

9 & 10

ఒక ఆదివారం గ్రామ సోవియట్ కొత్త అధ్యక్షుడు పావెల్ తల్లితండ్రులు మా కాలనీకి పెళ్లి పెద్దలను పంపారు. వచ్చిన పెద్దలు ఇద్దరు మాకు పూర్వ పరిచయస్థులే. ఒకరు కుజ్మాపెట్రోవిచ్, మరొకరు ఒసిపిఇవానోవిచ్. వీరిలో కుజ్మా బద్ధకస్తుడైన రైతు. కలుపు మొక్కలతో నిండిన ఇసుకమేటల పొలం అతనిది. ఆ పొలంలో ఏవేవో పండేవి. అందులో చాలా భాగం వాటంతట అవిగా పెరిగినవే. ఆ పొలం గుండా రహదారులు ఉండేవి. కాపలా కాసే శ్రద్ధ కుజ్మాకు లేనందున ఎవరికివారు తమ గమ్యస్థానాలకు ఆ పొలంగుండా ఈ దారులు ఏర్పరిచారు. కుజ్మా తల, మొహం కూడా అతని పొలంలానే చిందరవందరగా, గజిబిజిగా ఉండేవి. రెండవ పెళ్లి పెద్ద ఒసిప్ మాత్రం గౌరవనీయంగా ఉండేవాడు. పరిశుభ్రమైన దుస్తులు ధరించేవాడు.

గ్రామంలో పెద్ద రైతుల్లో చాలామంది అతని బంధువులే అయినా ఇతనికి మాత్రం సొంత పొలం ఉండేదికాదు. ఊరినే వెలివేసినట్టుగా ఒక చివర అతను గుడిసె వేసుకుని నివసించేవాడు. ఈ అతిథులు వస్తారని ముందే మాకు తెలిసినా మేం ఎందుకోగాని సిద్ధంగా లేము. వారు వచ్చేసరికి నా గదిలో నేనూ, ఇవానోవిచ్ మాత్రం ఉన్నాం. వాళ్లు లోపలకి వచ్చి మాతో కరచాలనం చేశారు. వచ్చి సోఫాలో ఆసీనులయ్యారు. విషయం ఎలా కదపాలో నాకు తెలియలేదు. చివరకు ఒసిప్ తాను వచ్చిన పని గురించి వివరించడం ప్రారంభించాడు.

"మామూలుగా ఇదివరలో ఇటువంటి సందర్భాల్లో పెళ్లిపెద్దలు ఒక గాథను ప్రారంభించేవారు. వేటగాళ్లు అడవికి వెళ్లారని, అక్కడ వారికి ఒక తోడేలు కన్య కనిపించిందని చెప్పేవారు. నా మటుకు నేను స్వయంగా వేటగాణ్ణే అయినా, అదంతా ఇప్పుడు అనవసరమనుకుంటాను?

"అవును, అనవసరమే" అంటూ నేను ఏకీభవించాను.

"అదంతా చెత్త. పనికిమాలిన ఆచారాలు" అన్నాడు కుజ్మా.

ఈలోగా ఇవానోవిచ్ జోక్యం చేసుకున్నాడు "అంత చెత్తేం కాదు రోజులు మారాయి అంతే. అప్పట్లో ప్రజలు అజ్ఞానంలో ఉండేవారు. వాళ్లకి ఏమన్నా భయంగా ఉండేది. గాలి అన్నా, ధూళి అన్నా, మెరుపులన్నా, పిడుగులన్నా దేన్నిచూసినా భయపడేవారు. అందుకేవాళ్లు అటువంటి కథలు చెప్పి కీడును తొలగించామనుకునేవారు. కానీ రోజులు మారాయి. మనకి ఇప్పుడు సోవియట్ ప్రభుత్వం ఉంది. మనకి ఎవరన్నా, ఏమన్నా భయం అవసరం లేదు." అంటూ రాజకీయ, సామాజిక, తాత్విక అంశాలపై సుదీర్ఘ ప్రసంగం ప్రారంభించాడు. కాని ఒసిప్ ఆయన్ని అడ్డుకున్నాడు.

"మేం వచ్చిన పని తెలుసుగా. గ్రామ సోవియట్ నూతన అధ్యక్షుడు పావెల్ తల్లితండ్రులు మమ్మల్ని పంపారు. వారి అబ్బాయికి, మీ అమ్మాయి.. అదే మీరే ఆమెకు తండ్రిగారు.. కాలనీ పెద్ద కదా.. మీ అమ్మాయి ఓల్యా వొరనోవాను ఇచ్చి వివాహం చేయమని అడగడానికి వచ్చాం" అన్నాడు. నేను బదులు ఇచ్చేలోపు కుజ్మా జోక్యం చేసుకున్నాడు. "మీరు కనుక వొప్పుకుంటే మనం తువ్వాళ్లు, రొట్టె మార్పిడి చేసుకుందాం. కాదంటే మేం వెళ్లిపోతాం. ఇబ్బంది పెట్టం" అన్నాడు కంగారుగా.

ఒసిప్ మళ్లా ప్రారంభించాడు "చెప్పండి ఏమంటారు?" అన్ని ప్రశ్నించాడు.

"ఈ గౌరవానికి కృతజ్ఞతలు. కానీ నిర్ణయం తీసుకోవలసింది నేను కాదు. మీరు ఈ విషయాన్ని ఓల్యానే అడగాలి. ఆమె వొప్పుకుంటే మిగిలిన సంగతులు తర్వాత మాట్లాడుదాం" అన్నాను.

వెంటనే కమాండర్ల మండలి సమావేశం ఏర్పాటు చేశాను.

ఈలోగా మా ఆడపిల్లలు నా దగ్గరికి వచ్చి పెళ్లి సంబంధం కుదిరితే చేయాల్సిన ఏర్పాట్లు ఏమిటని ఆందోళనగా అడిగారు.

దానికి అప్పుడే కంగారు లేదని కమాండర్ల మండలి సమావేశం ప్రారంభించాను.

మా పదకొండుమంది కమాండర్లతో పాటు, కాలనీలోని సీనియర్లు, సిబ్బంది అందరూ సమావేశానికి హాజరయారు. 'పెళ్లిపెద్దలు' ఆ గదిలోనే సోఫాలో కూర్చున్నారు.

ఓల్యాను వివాహం చేసుకుంటానని పావెల్ పెళ్లిపెద్దల్ని పంపినట్టు సమావేశానికి తెలిపాను.

అయితే ఈ సంగతి ముందే తెలిసిన కమాండర్లు ఎవరూ ఆశ్చర్యపోలేదు. అప్పటికే పావెల్, ఓల్యా స్నేహం గురించి కాలనీ అందరికీ తెలుసు. అయినా పద్ధతి ప్రకారం వెర్షనోవ్ వెనక బెంచీలో ఉన్న ఓల్యాని ప్రశ్నించాడు.

"పావెల్‌ను పెళ్లాడడం ఇష్టమేనా?"

ఓల్యా సిగ్గుతో నవ్వి "అవును. ఇష్టమే" అంది.

లాపోట్‌కు ఇది నచ్చలేదు. "ఇలా వెంటనే ఇష్టం అని చెప్పకూడదు. ఇష్టంలేదనాలి. అప్పుడు మేమంతా నిన్ను బతిమాలాలి" అన్నాడు.

ఇవానోవిచ్ అతన్ని అడ్డుకున్నాడు. "సరే ఆ తతంగం అవసరం లేదు" అంటూ పెళ్లిపెద్దలను అడిగాడు "ఆస్తిపాస్తుల సంగతి ఏం చేస్తారు?" అని.

"ఏముందీ? మీరు వివాహానికి ఆమోదిస్తే పెళ్లి విందు ఖర్చు అంతా మాదే. నవ దంపతులు ముసలివాళ్లతో అదే ఇంట్లో ఉంటారు. అంతా కలిసే ఉంటారు కాబట్టి ఆస్తి పంపకాల అవసరం ఉండదు" అని ఒసిప్ బదులిచ్చాడు.

"అయితే వాళ్లు కొత్త ఇల్లు కట్టింది ఎవరికోసం?" అని కరబనోవ్ నిలదీశాడు.

"అది మైఖేల్ కోసం" అని ఒసిప్ సమాధానం చెప్పాడు.

"అదేంటి, మైఖేల్ కంటే పావెల్ పెద్ద కదా!"

"నిజమే. కానీ ఆ ఇంటిని మైఖేల్‌కి కేటాయించాలని పెద్దాయన నిర్ణయించాడు. ఎందుకంటే పావెల్ వివాహమాడుతున్నది కాలనీకి చెందిన యువతిని కదా? ఒసిప్ వివరించాడు.

దాంతో కోవల్‌కి కోపం వచ్చింది. "కాలనీ అమ్మాయి అయితే తేడా ఏమిటి?"

ఒసిప్‌కు ఏం సమాధానం చెప్పాలో మొదట అర్థంఅలేదు. ఆయన నెమ్మదిగా పరిస్థితి వివరించాడు.

"అమ్మాయి ఎప్పుడూ భర్త వెంట అతని ఇంటికి వెళ్లాలి. మైఖేల్ విషయం వేరు. అతను పొరుగు గ్రామం యువతిని పెళ్లాడబోతున్నాడు. ఆమెకు తల్లితండ్రులున్నారు. ఆమె కట్నం కూడా తెస్తోంది. మీ అమ్మాయి పేద యువతి కదా!" అని.

దీనితో ఇవానోవిచ్ ఆగ్రహోదగ్రుడయాడు. "ఏంటి కూస్తున్నావ్? ఎవరితను మన దగ్గరకొచ్చి ఏదో లక్షాధికారిలా గీర్వాణం పోతున్నాడు. నీ పావెల్ కుటుంబానికి ఒక మట్టికొంప ఉంది కదాని అతనేదో లక్షాధికారి అనుకుంటూన్నారా? ఒక బల్ల, ఒక కుర్చీ, వేసుకొనేందుకు ఓ తోలుకోటు ఉన్నంతమాత్రాన అంత పొగరా?" అని కేకలు ప్రారంభించాడు.

దాంతో కుజ్మా బెదిరిపోయాడు. "మేం పొగరుగా మాట్లాడలేదు. కట్నం గురించి అడిగాం." అన్నాడు.

ఇక ఇవానోవిచ్‌ని పట్టలేకపోయాం. "ఏంటీ కట్నమా? ఎక్కడ మాట్లాడుతున్నారో మరచి

పోయారా? ఈ విషయం ప్రభుత్వానికి తెలిస్తే నీకూ, నీ తాతకి కూడా సరిపడ కట్నం ఇస్తుంది. జలగల్లారా" అని ఈసడించుకున్నాడు.

పిల్లలంతా గోలగోలగా నవ్వారు. ఇవానోవిచ్ శాంతించాడు.

"సరే, కట్నం కదా సరే. కమాండర్ల మండలి ఆ విషయం నిర్ణయిస్తుంది. చూడండి వీళ్లు పెళ్లిపెద్దలుగా మన వద్దకు వచ్చారు. అయితే పావెల్ వంటి బికారికి మన అమ్మాయి ఓల్యాను ఇవ్వగలమా? అన్నది ఆలోచించాలి. పాపం ఆ కుర్రవాడు జీవితంలో మంచి భోజనం కూడా చేయలేదు, ఏవో బంగాళాదుంపలు, ఉల్లిపాయల తప్ప మరోసంగతి తెలియదు. కానీ మనం ధనికులం. మన అమ్మాయిని ఆ ఇంటికి పంపేటపుడు అన్నీ ఆలోచించాలి" అన్నాడు.

కమాండర్ల మండలి సభ్యుల మొహాలు పరికిస్తే కట్నం పెద్ద సమస్యగా నిలిచేలా కనిపించలేదు. అందరూ ఉత్సాహంగా ఉన్నారు. పెళ్లి పెద్దల్ని అవతలిగదిలోకి పంపాం.

ఏదేమైనా సరే ఓల్యాకు ఏ రకం చూసినా మంచి కట్నం ఇచ్చి వివాహం జరపాలని కమాండర్లు నిశ్చయించారు. షెరీకి కబురు చేశాం. అతను ఏదైనా అభ్యంతర పెడతాడేమోనని భయపడ్డాం. ఆనీ సమావేశానికి వచ్చిన షెరీ మేం చెప్పింది విని తల పంకించాడు. "అవునవును. మన కెంత కష్టమైనా సహిద్దాం. ఓల్యాను అతి సంపన్నమైన వధువుగా పంపిద్దాం. ఆ భూస్వాముల కళ్లు తెరిపిద్దాం" అన్నాడు.

దానితో కట్నం గురించిన చర్చలు రసవత్తరంగా సాగాయి. కట్నంలో భాగంగా ఒక మంచి గుర్రాన్ని ఇవ్వాలని మండలి నిర్ణయించింది. గంటసేపు చర్చల తరువాత కట్నం విషయం ఖరారైంది. పెళ్లిపెద్దల్ని లోపలికి పిలిచాం. అప్పటికి కాస్త తాజా గాలి పీల్చి తేరుకున్న కుజ్మా, ఒసిప్‌లు తెరిపినపడిన మొహాలతో లోపలికివచ్చారు. కొల్యా వెర్షనోవ్ అందరినీ కూర్చోనిచ్చి గంభీరంగా ప్రకటించాడు.

"మా ఓల్యాను గ్రామ సోవియట్ అధ్యక్షుడు పావెల్‌కు ఇచ్చి వివాహం చేసేందుకు కమాండర్ల మండలి సముఖంగా ఉంది. కొత్త దంపతులు వేరే ఇంటికి మారాలి. పిల్లవాడికి అతని తండ్రి తన పొలంలో ఇవ్వగలిగిన భాగం ఇవ్వాలి. పెళ్లికి మతపెద్ద రాకూడదు. పెళ్లిని రిజిస్టర్ చేయించాలి. పెళ్లి తొలిరోజు ఉత్సవాలు ఇక్కడే కాలనీలో జరుగుతాయి ఆ తరువాత వేడుకలు మీ ఇష్టం" అంటూ తరువాత ఓల్యాకు మేం ఇవ్వబోయే కట్నం జాబితాను పెద్దగా పైకి చదివాడు.

ఒక శ్రేష్టమైన ఆవు, దానితో ఒక దూడ...

ఒక మంచి గుర్రం, దాని పిల్ల...

ఐదు గొర్రెలు...

బలిసిన ఇంగ్లీషు పంది ఒకటి...

ఇలా వెర్షనోవ్ అనంతమైన ఆ జాబితాను చదువుతో పోయాడు. కట్నంగా వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, దాణా నిల్వలు, దుస్తులు, ఇంటికి కావలసిన బల్లలూ, కుర్చీలు, ఒక కుట్టు మిషన్....

చివరిలో చిన్న ఉపన్యాసం ఇచ్చాడు. "ఓల్యాకు మా సహకారం ఎల్లప్పుడూ లభిస్తుంది. ఆ దంపతులు కాలనీకి అవసరమైతే చేయూతనిస్తారు. పావెల్‌కు 'కాలనిస్ట్' అనే గౌరవ నామాన్ని ప్రదానం చేస్తాం."

అతను మాట్లాడుతున్నంతసేపూ పెళ్లి పెద్దలు బిక్కుబిక్కుమంటూ కూర్చున్నారు.

ఆడపిల్లలు నవ్వుతూ పరుగున వచ్చి పాత పద్ధతి ప్రకారం పెళ్లిపెద్దల చేతికి తువ్వాళ్లు కట్టి, వారి చేతిలో రొట్టె, ఉప్పు పెట్టారు.

అనంతరం పిల్లలు బల్లపై శుభ్రమైన వస్త్రాన్ని పరిచి మూడు సీసాల ఎర్ర వైను, డజను గ్లాసులు ఉంచారు. ఇవానోవిచ్ వైనును గ్లాసుల్లో పోసి అందరినీ తీసుకోమన్నాడు. తన గ్లాసు పైకెత్తి, "వధువు అణకువగా మెలుగుతూ జీవితంలో స్థిరపడాలి" అని ఆశీర్వదించాడు.

"ఎవరికి అణకువగా ఉండాలి?" ఒసిప్ ఆసక్తిగా అడిగాడు.

"ఇంకెవరికి? కమాండర్ల మండలికి, మొత్తంగా సోవియట్ ప్రభుత్వానికి" అని ఇవానోవిచ్ బదులిచ్చాడు.

అందరం గ్లాసులు తాకించి వైను చప్పరించి. శాండ్‌విచ్‌లు తిన్నాం.

చివరగా కుజ్మా అన్నాడు. "అంతా సవ్యంగా ముగించినందుకు కృతజ్ఞతలు. అయితే మేం వెళ్లి పెళ్లి కుమారుడిని, అతని తల్లితండ్రులను అభినందించి, శుభవార్త చెప్పవచ్చా?"

"నిరంభ్యంతరంగా వెళ్లిరండి" అన్నాడు ఇవానోవిచ్.

"మీరు అద్భుతమైన వాళ్లు" అంటూ పెళ్లిపెద్దలు బయటకు నడిచారు. వారిని పరీక్షగా గమనించిన ఇవానోవిచ్ ఏదో పొరపాటు జరిగినట్టు తల అడ్డంగా ఊపాడు. "అలాక్కాదు. వెళ్లి వాళ్లను పిలుచుకురండి. నా గదికి తీసుకురండి. బ్రాచెంకో నువ్వు బండిని సిద్ధం చెయ్యి" అని ఆదేశించాడు.

కొద్దిసేపటి తరువాత పెళ్లిపెద్దల్ని బండి ఎక్కించి గ్రామానికి పంపారు మా వాళ్లు. ఈ హడావుడిలో పెద్దరికాన్నీ, పెళ్లి పెద్దలకు ఉండాల్సిన పెద్దరికాన్నీ కోల్పోయిన కుజ్మా, ఒసిప్‌లు బండిలో వినయంగా కూలబడ్డారు. కుజ్మా మేం ఇచ్చిన నిశ్చితార్థపు రొట్టెను గుండెలకు ఆనించుకునే ఉన్నాడు అంతసేపూ.

ఆగస్టు రెండో వారంలో పెళ్లి ముహూర్తం నిశ్చయమైంది. పెళ్లి ఏర్పాట్ల కోసం కాలనీలో ప్రత్యేక బృందాల్ని ఏర్పాట్లు చేశాం. ఒక ప్రదర్శనను సిద్ధం చేశాం. పెళ్లి ఏర్పాట్లకు అనుకున్న దానికంటే చాలా ఎక్కువ ఖర్చవుతోంది. ఇవానోవిచ్ బాధగా తలపంకించాడు. "కాలనీ పిల్లలందరికీ ఇదే రీతిన పెళ్లిళ్లు చేయాలంటే మనం అడుక్కుతినాల్సిందే" అన్నాడు.

పెళ్లిరోజు రెండు డిటాచ్‌మెంట్‌ల కుర్రవాళ్లు కాలనీ వెలుపల గస్తీ బాధ్యత తీసుకున్నారు. డబ్భైమందికి ఆహ్వానాలు పంపించాం.

"కాలనీ వాసి ఓల్యా వొరోనోవాకు, గ్రామానికి చెందిన పావెల్ పావ్లోవిచ్ నికోలయెంకోకు వివాహం సందర్భంగా కాలనీలో విందుభోజనానికీ, తరువాత జరిగే ప్రదర్శనకు మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాం".

ఇట్లు
కమాండర్ల మండలి

– అంటూ క్లుప్తంగా వివాహ ఆహ్వానపత్రికలు ముద్రించాం.

మధ్యాహ్నం రెండు గంటలకల్లా కాలనీలో ఉత్సవానికి అన్ని ఏర్పాట్లూ పూర్తి అయ్యాయి. తోటలో నీటిని విరజిమ్మే ఫౌంటైన్ చుట్టూ విందు భోజనాలకు బల్లలు వేశారు. మా డ్రాయింగ్ టీచర్ జనోవి సారథ్యంలోని చిత్రకారుల బృందం తోటలో అలంకరణ ఏర్పాట్లు చూసింది. రంగులు అద్దిన సన్నటి, పొడవాటి స్తంభాలకు అందమైన పూలహారాలు కట్టారు. భోజనాల బల్లలపై నీటి జాడీల్లో షెరీ తోటనుంచి రంగురంగుల గులాబీలు తెచ్చి అమర్చారు.

ఇంతకాలం కాలనీ సాధించిన ప్రగతి ఈ రోజు స్పష్టంగా కనిపిస్తోంది. తోటలో గల విశాలమైన ఇసుకదారులకు ఇరువైపులా తలలు ఊపుతున్న పళ్ల చెట్లు మా సంపదకు చిహ్నాలుగా నిలిచాయి ఆవరణ అంతా పరుచుకున్న పచ్చిక, పళ్ల చెట్లు, పూల మొక్కలన్నీ ఆరోగ్యంగా ఎటువంటి కలుపుమొక్కలూ లేకుండా కళకళలాడుతున్నాయి. ఇవన్నీ కాలనీ కుర్రవాళ్లు తమ చెమటోడ్చి

సృష్టించిన అందమైన సంపద. కోలోమాక్ నది వొద్దు కూడా మా కుర్రవాళ్ల కృషి ఫలితంగా ఒక పెద్ద, సుందరమైన పార్కులా కనిపిస్తోంది. ఇదంతా చూస్తే ప్రకృతిపై మానవుడి ఆధిక్యత స్పష్టంగా అర్థం అవుతుంది. ఆవరణ అంతా గట్టి మట్టి రోడ్లు, అన్ని భవనాలనూ కలుపుతున్నాయి. ఎటువంటి భవనాలు లేని ఖాళీ ప్రదేశాల్లో దట్టంగా పెంచిన పచ్చిక తివాచీలా పరుచుకుంటుంది. ఇక్కడే ఆకుపచ్చ రంగులోని బెంచీలు పరిసరాల్లో భాగంగా కనిపిస్తుంటాయి. ఆహ్లాదకరమైన ఈ పరిణామాల వల్ల కాలనీ సొంత ఇల్లులా అనిపించేది. ఇదంతా చూసి, అందులో నా భాగస్వామ్యం తలచుకొని నేను గర్వంతో పొంగిపోయేవాడిని. ఈ అందమైన వాతావరణంలో నీలిరంగు లాగులు, తెల్లచొక్కాలు ధరించిన కుర్రవాళ్లు హడావుడిగా పరుగులు తీస్తున్నారు. అసాధారణమైన ఉత్సవాన్ని తిలకించేందుకు పిలవకుండానే వచ్చి, తొంగిచూస్తున్న గ్రామ ప్రజలను దూరంగా ఉంచడం, అతిధులను లోనికి ఆహ్వానించడంలో వారు నిమగ్నమై ఉన్నారు.

ఈ పిల్లలందరికీ ఎవరికి వారికి భవిష్యత్తు గురించిన కచ్చితమైన అవగాహన ఉంది. అయితే వారంతా ఆయా మార్గాల్లో ఎలా పయనిస్తారో, ఏం సాధిస్తారో, ఎలా తమ లక్ష్యాలను చేరతారో అన్నది ఊహకు అందని విషయం. ఇలా ఆలోచిస్తుంటే బొకోవా నా వద్దకు వచ్చింది.

"ఏంటి ఆలోచిస్తున్నారు మహాశయా?" అని అడిగింది.

"అందరూ నన్ను వదిలేసి ఎవరి పనుల్లో వారు పడితే, ఇలా నుంచుని ఆలోచనల్లో పడకుండా చేయగలిగింది ఏముంది?" అన్నాను.

"సరే, నాతో రండి వధువుకి వచ్చిన బహుమతులు ఏంటో చూద్దాం" అంటూ ఆమె దారితీసింది.

రెండు తరగతి గదుల్లో ఓల్యాకు వచ్చిన బహుమతులు సర్ది ఉన్నాయి., అతిధులు ఆ గదుల చుట్టూ మూగి ఎంత విలువైన బహుమతులో అంచనా వేస్తున్నారు. మహిళలు కొందరు అసూయ నిండిన కళ్లతో నా వంక కోపంగా చూస్తున్నారు. మా కాలనీ పిల్లలను కాదని వాళ్లు తమ కుర్రవాళ్లకి బయట వారితో వివాహం చేసి ఇన్ని కట్నకానుకలు కోల్పోయారు అదీ వారి కోపం.

ఇంతలో తోటలో పెళ్లిసందడి మొదలైంది. మా కుర్రవాళ్లు కాలనీ బ్యానర్‌ను ప్రధాన ద్వారం వద్ద నిలిపి, ఎదురుగా నిలిచి బ్యాండుమేళం వాయిస్తున్నారు. మిల్లు పక్కనుంచి వధూవరులు వస్తున్నారు. గుర్రాల మెడలను ఎర్ర రిబ్బన్లతో అలంకరించి, వాటి కళ్లాలు పట్టుకుని వారికి ఎదురువెళ్లారు. ఉన్నట్టుండి ఓల్యా పరుగున నా వద్దకు వచ్చి, నా మెడను కావలించుకుని అర్థం లేకుండా నవ్వడం, ఏడవడం సాగించింది. "నన్ను ఒంటరిగా వదిలేయరుగా. నాకు భయం వేస్తోంది" అంది వెక్కిళ్ల మధ్య. నేను ఆమెను ఊరడించాను.

వధూవరుల గౌరవార్థం సమావేశం జరిగింది. బొకోవా మమ్మల్ని ఆశ్చర్యపరుస్తూ వధూవరులకు విద్యాశాఖ తరఫున కొన్ని పుస్తకాలు బహూకరించింది. ఇద్దరు కాలనీ కుర్రవాళ్లు ఆ పుస్తకాల వరసలను అందంగా అలంకరించిన చెక్కబల్లలపై అమర్చారు. తరువాత వధూవరులను మేం ఊరేగింపుగా విందు జరిగే బల్లల దగ్గరికి నడిపించాం. వారి ప్రత్యేక ఆసనాలు సిద్ధంగా ఉన్నాయి.విందు ఆరంభమైంది. స్వచ్ఛమైన తెల్లటి రంగు జాకెట్లు ధరించిన ఇరవైమంది కుర్రవాళ్లు వడ్డన ఆరంభించారు. అతిధులు ఎవరూ విందులో మద్యం సేవించకుండా ముందే ఏర్పాట్లు చేశాం. టారానెట్స్ సారథ్యంలో కుర్రవాళ్లు కొందరు అతిధుల జేబులు గమనిస్తూ వారి వద్ద గల మద్యం సీసాలను నిశ్శబ్దంగా స్వాధీనం చేసుకుని కొలోమాక్ నదిలో విసిరేస్తున్నారు.

నేను యువజంట పక్కనే కూర్చున్నాను. పిల్లవాడి తల్లితండ్రులు నా ఎదురుగా కూర్చున్నారు.

అతని తండ్రి ఎందుకోగాని నిట్టూర్చాడు. కొడుకు స్వతంత్రుడవుతున్నందుకా, తాను అంతవరకూ బీరుసీసా మొహం కూడా చూడనందుకా అన్నది నాకు తెలియలేదు. టారానెట్స్ అంతకుముందే ఆయన జేబుల్లోని మద్యం సీసాను స్వాధీనం చేసుకున్నాడు. ఇవాళ కాలనీ వాసులను చూస్తుంటే తనివితీరడం లేదు. వారి ఉత్సాహం, ఆనందం, కేరింతలు అన్నీ సంతోషం కలిగిస్తున్నాయి. మా పదకొండవ డిటాచ్‌మెంట్ కుర్రవాళ్లు ఒక మూల ఐదుగురు అతిథులను చుట్టుముట్టి ఏదో మాట్లాడుతున్నారు. వాళ్లని మరీ ఆటపట్టిస్తున్నారే అనుమానంతో నేను అటుగా నడిచాను.

అక్కడ షెలాపుటిన్ మా చక్రాల కార్ఖానా బాధ్యుడు, వృద్ధుడు అయిన కోజిర్ గ్లాసులో బీరు పోస్తున్నాడు.

"చూడు. నీకు చర్చిలో పెళ్లి అయింది. చివరికది ఎలా పరిణమించిందో చూడు" అని అతన్ని ఒప్పించే ప్రయత్నంలో ఉన్నాడు.

"పోనీ, మళ్లీ పెళ్లాడతావా?" అని టోస్కీ అనే కుర్రవాడు ఆ వృద్ధుణ్ణి అనునయంగా అడుగుతున్నాడు. దానికి కోజిర్ నవ్వి "ఇంకో పెళ్లికి నాకు వయసు కాదులే" అంటున్నాడు.

అతని పక్కనే కూర్చున్న ఒక కొత్త మొహం... కాలనీ సంగతి, సందర్భాల్ని గమనించి ఆశ్చర్యంతో తలమునకలవుతున్నాడు.

"అబ్బాయిలూ, ఇక్కడ మీకు మీరే అధిపతులట. నిజమేనా?" అని ప్రశ్నించాడాయన.

"అవున"ని మరో కుర్రవాడు బదులిచ్చాడు.

"ఇక్కడ అందరూ వ్యవసాయమే చేస్తారా?"

"అబ్బే, కొందరం ఇంజనీర్లం అవుతాం, మాలో షెలాపుటిన్ పైలట్ అవుతాడు."

"అంటే, ఎవరూ వ్యవసాయం చేయరా?"

"ఎందుకు చెయ్యం? మాలో కొందరు రైతులుగానే స్థిరపడదలిచారు."

తోటలో మరో మూల తొమ్మిదవ డిటాచ్‌మెంట్ కొన్ని బల్లల బాధ్యత తీసుకుంది. అక్కడ వాతావరణం కోలాహలంగా, సందడిగా ఉంది. మా కుర్రవాడు లాపోట్ చుట్టూ అతిథులు చేరి పగలబడి నవ్వుతున్నారు. ఆ బల్ల వద్దే మిల్లు సిబ్బంది ముగ్గురు కూర్చున్నారు. వాళ్లని ఆటపట్టించేందుకు టారానెట్స్ బృందం ఒక పథకంతో సిద్ధంగా ఉంది. మిల్లు పనివారు మంచి తాగుబోతులన్న సంగతి వాళ్లకి ముందే తెలుసు. వాళ్లు విందుకి రహస్యంగా మద్యం సీసాలు తెస్తారని కుర్రవాళ్లకి తెలుసు. వీళ్లలో టారానెట్స్ మంచి జేబుదొంగ. వాడు అప్పటికే మిల్లు సిబ్బంది జేబుల్లోంచి మద్యం సీసాలు మాయంచేసి వాటి స్థానంలో మంచి నీటిసీసాలు ఉంచాడు.

ఈ సంగతి తెలియని మిల్లు పనివారు సమయం దొరికితే చాటుకెళ్లి ఓ గుక్క వేద్దామని ఆత్రుతగా ఉన్నారు. వాళ్ల ఆత్రాన్ని గమనించినట్టు లాపోట్ అనునయంగా అన్నాడు.

"ఎంతైనా మీరు మావాళ్లు, మీకు తాగాలని ఉంది. అంతేకదా," అంటూ అటుగా వెళ్తున్న టారానెట్స్‌తో ఏదో గుసగుసలాడాడు. టారానెట్స్ గంభీరంగా తల ఊపి అక్కడనుంచి ముందుకి కదిలాడు.

"చెప్పానా? పర్వాలేదు. జేబుల్లోంచి సీసాలు తీసి బల్లకింద గ్లాసుల్లో పోసుకోండి, కానివ్వండి" అని వారిని ప్రోత్సహించాడు.

అంతే, ఆ ముగ్గురూ కలిసి అతి కష్టంమీద బల్లల కిందకి చేతులు చాపి, ఎవరూ చూడడం లేదని ధృవీకరించుకుని గ్లాసులు నింపుకుని బల్లలపై ఉంచారు. చుట్టూ ఉన్న తొమ్మిదవ డిటాచ్‌మెంట్

కుర్రవాళ్లు వారిని శ్రద్ధగా గమనిస్తున్నారు. ఆ ముగ్గురూ బలహీనంగా నవ్వుతూ తమ గ్లాసుల వంక చూసుకున్నారు. అచ్చు మద్యంలానే ఉన్న నీళ్లు కలిపిన బీరు ఆ గ్లాసుల్లో ఉన్న సంగతి వారికి తెలియదు. లాపోట్ వారి వంక ప్రోత్సాహకరంగా చూసి, "కానివ్వండి" అన్నట్టు కళ్లెగరేశాడు. వాళ్లు ధైర్యం తెచ్చుకొని ఒక్కసారిగా గ్లాసులు పెకెత్తి అందులో ద్రవాన్ని గటగటా తాగేశారు. కానీ వారి మొహాల్లో అనుమానం, ముగ్గురూ ఖాళీ గ్లాసులు బల్లపై ఉంచి ఏమీ జరగనట్టే ప్రవర్తించే ప్రయత్నం చేశారు. ఫోర్కులు అందుకుని ప్లేట్లపై దృష్టి సారించారు.

మిల్లు మెకానిక్‌కు ఏదో అనుమానం కలిగినట్టుంది. అతను తన జేబులోంచి మద్యం సీసాను తీసి, దాన్ని పరీక్షించబోయాడు. ఈలోగా ఒక చెయ్యి వెనక నుంచి వచ్చి ఆ సీసాను గుంజుకుంది. అతను తలెత్తి పైకి చూస్తే ఎదురుగా టొరానెట్స్.

"ఛీ. ఎంత సిగ్గుచేటు! ఇక్కడ మద్యం తేవద్దని, నిషేధమని చెప్పాం కదా! మీరేం చేశారు?

రహస్యంగా సారా తెచ్చుకుని తాగారు? ఛీ... మీలో ఎందరు తాగారు?" అని అరిచాడు. ఈలోగా అక్కడకు చేరిన ఇవానోవిచ్ సంగతేమిటని టొరానెట్స్‌ని అడిగాడు.

"ఏముందీ? దొంగసారా? వీళ్లే..." అంటూ మిల్లు సిబ్బందిని చూపించాడు.

ఇవానోవిచ్ వాళ్లని కాల్చేసేట్టు చూశాడు. తొమ్మిదవ డిటాచ్‌మెంట్ కుర్రవాళ్లు దూరంగా నిలబడి పగలబడి నవ్వుతున్నారు. ఆ రోజు విందులో ఈ హడావుడి చివరి వరకూ సాగింది.

మధ్యమధ్యలో లాపోట్ వారి దగ్గరికెళ్లి, కన్నుగీటి, "ఎలా వుంది. బావుందా? చాలిందా? చాల్లేదా? అయ్యో పాపం....' అని ఓదార్చబోయేవాడు.

టొరానెట్స్ మాత్రం వాళ్లవంక ఉగ్రంగా చూస్తూ... "చాలకపోవడం ఏమిటి? వాళ్లని చూడు సరిగ్గా కుర్చీల్లో కూర్చోలేకపోతూన్నారు కూడా" అని బదులిచ్చాడు. దాంతో లాపోట్ వారి బల్ల వద్దకు వెళ్లి "పోనీ మెల్లగా తోట బయటికి నడుద్దాం. అందరూ గమనిస్తున్నారు కూడా" అన్నాడు. విందు భోజనం ముగింపునకు వస్తోంది.

తరువాత గోగోల్ రాసిన 'పెళ్లి' అనే నాటకం ప్రదర్శించబోతున్నాం. అంతకుముందు మా కాలనీ రాజకీయ శాస్త్ర అధ్యాపకుడు "వివిధ జాతులవారి వివాహ ఆచారాలు" అనే అంశంపై ప్రసంగించవలసి ఉంది. ఈ వేడుకలు ఒక పట్టాన పూర్తయేలా నాకు అయితే అనిపించలేదు.

11

విషాదభరితమైన వీడ్కోలు ఘట్టం

ఓల్యా పెళ్లయిన కొన్నాళ్లకే మేం ఎదురుచూస్తున్న ఉపద్రవం విరుచుకుపడింది. రబ్‌ఫాక్‌కు ఎంపికైన విద్యార్థులు కాలనీని వీడి వెళ్లాల్సిన రోజు రానే వచ్చింది. ఎన్నడో రెండేళ్లక్రితం రైసా రబ్‌ఫాక్‌కు వెళ్లిన నాటి నుంచీ మా విద్యార్థుల బృందం కూడా నేడో రేపో అక్కడికి వెళ్లాలని మాకు తెలుసు. నాటినుంచీ మే అన్నిరకాలుగా అందుకు సిద్ధపడుతున్నాం. ఉన్నత విద్య కోసం కాలనీ పిల్లలను పంపడం మా లక్ష్యంగా శ్రమిస్తున్నాం. కుర్రవాళ్లు కూడ అందుకోసం కష్టపడి చదివారు. అన్నీ నిజమే అయినా తీరా వారు వెళ్లాల్సిన రోజు వచ్చేసరికి ఆ విషాదాన్ని తట్టుకోలేకపోయారు. ఇంతకాలం తమతో కలిసి పనిచేసి, కష్టించి, నవ్వించి, కలిసి బతుకు పంచుకున్న స్నేహితులు దూరమవుతున్నారనే నిజాన్ని ఎవరూ తట్టుకోలేకపోయారు.

ఆ రోజు ఉదయం పలహారాలు కాగానే పట్టణం వెళ్లాల్సిన విద్యార్థులు సరికొత్త సూట్లు ధరించారు. తోటలో వారి కోసం వీడ్కోలు విందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కవాతు కోసం బ్యానర్‌ను,

బ్యాండు మేళాన్ని సిద్ధం చేశారు. ఈ ఉత్సవ ఏర్పాట్లు సైతం మాలో అలముకున్న విషాదాన్ని తగ్గించలేకపోయాయి. మా టీచర్ లిడియా ఉదయం నుంచి అదే పనిగా కంటతడి పెడుతోంది. ఆడపిల్లలైతే ఆ రోజు మంచాలే దిగలేదు. అంత దుఃఖంలోనూ మా టీచర్ ఎకతెరీనా అందర్నీ ఓదార్చే ప్రయత్నం చేస్తోంది. మగపిల్లలు నిశ్శబ్దంగా, గంభీరంగా ఉన్నారు. చిన్నపిల్లలు ఎప్పటికంటే నిటారుగా నిలబడి కవాతుకు సిద్ధం అవుతున్నారు. వాళ్లని చూస్తే టెలిగ్రాఫ్ తీగలపై వరుసగా కూర్చుండే పిట్టలు జ్ఞాపకం వచ్చాయి. పార్కులో బెంచీలమీద చేతుల మోకాళ్ల మధ్య ఇరికించుకు కూర్చున్న పిల్లలు దీర్ఘంగా పై కప్పులవంక ఆకాశం వంక చూస్తూ మౌనంగా ఉండిపోయారు.

నేను సైతం వారి విషాదాన్ని, విచారాన్ని పంచుకున్నాను. “బెలూఖిన్ రేపటినుంచి కాలనీలో ఉండదా? ఇదేం న్యాయం” అన్న సోలోవ్‌యెవ్ బాధ నాకు అర్థమైంది. నిజానికి బెలూఖిన్ వదిలి వెళ్తున్నది వాడిని ఒక్కడినే కాదు. ఆ మాట కొస్తే కాలనీని వదిలి వెళ్తున్నది బెలూఖిన్ ఒక్కడే కాదు. ఇంతకాలం మా మధ్య ఉండి, కాలనీకి ఒక కళను, ఒక క్రమాన్ని ఏర్పరిచిన సీనియర్లు చాలామంది వెళ్లిపోతూన్నారు. బరున్, కరబనోవ్, జదరోవ్, క్రయినిక్, వెర్షనోవ్, గొలోస్, నాసాల్యు అందరూ వెళ్లిపోతున్నారు. వీళ్లందరికి కనీసం పదేసిమంది ఆప్తమిత్రులు ఇక్కడ ఉన్నారు. వీళ్లలో బెలూఖిన్, కరబనోవ్, బరున్ లాంటి వాళ్లు ఆణిముత్యాలు. నిజమైన మనుషులు. మానవ హృదయాల్లోని అనుభూతులు తెలిసిన వ్యక్తులు. వీళ్లందరూ వెళ్లిపోవడం అంటే కాలనీలో మా జీవితం తిరిగి మొదలవడమే అవుతుంది. రబ్‌ఫాక్‌కు సిద్ధమవుతున్న కుర్రవాళ్లు కూడా ఆ ఉదయం నుంచీ బెంగటిల్లిన మొహాలతో తిరిగారు. కరబనోవ్ అయితే రోజంతా నా చుట్టూ తిరిగాడు. “రబ్‌ఫాక్‌కు వెళ్లగలగడం నిజంగా అదృష్టం. అసలు అందుకోసమే అందరం ఇంతకాలం ఎదురుచూశాం. కానీ తీరా వెళ్లే సమయం ఆసన్నమయేసరికి అదేమంత పెద్దసంగతి కాదనిపిస్తోంది. బహుశా మా ఆనందం నేటితో ఆఖరేనేమో. నాకు కాలనీని వదిలి వెళ్లాలని లేదు. ఏడుపు వస్తోంది. వెక్కివెక్కి ఏడవాలనుంది. అందరూ చూస్తారనే భయం లేకుంటే ఆ పని చేసేవాడినేమో. ఏమైనా ఈ ప్రపంచంలో వాస్తవం వంటి మరో అంశం లేదేమో” అంటూ ఏదేదో మాట్లాడాడు.

వెర్షనోవ్ మా వంక కోపంగా చూశాడు.

“ఈ ప్రపంచంలో ఉన్నది ఒకటే వాస్తవం – మనుషులు” అన్నాడు.

“కాకపోతే, పిల్లుల్లో సత్యాన్వేషణ చూద్దామనా?” అని కరబనోవ్ వెక్కిరించాడు.

“అది... అదేం కాదు, మనుషులంతా మంచివారుగా ఉండాలి. లేకపోతే సత్యం అనేదాంట్లో విశేషం ఏమిటి? ఒక మనిషి పందివంటివాడైతే మనకు సోషలిజం వచ్చి లాభం ఏమిటి; ఆ సంగతి ఇవాళే నాకు అర్థమైంది” అన్నాడు వెర్షనోవ్.

నేను అతనివంక అదే పనిగా చూశాను.

“ఇవాళ ఎందుకు అర్థమైంది?” ప్రశ్నించాను.

“ఏముంది? ఇవ్వాళ మనుషుల్ని అద్దంలో చూసినట్టుగా అనిపిస్తోంది. నేను సరిగా చెప్పలేనేమో. రోజూ పనిచేసేవాళ్లం. ప్రతిరోజూ పనిదినమే. కానీ ఇవ్వాళ ఏమైంది. అంతా స్పష్టంగా కనిపిస్తోంది. గోర్కీ ఈ సత్యాన్ని ఏనాడో మనకు అందించారు. నాకే అర్థం కాలేదు. లేదా అర్థమనే దాని ప్రాధాన్యం నాకు బోధ పడలేదు. మనిషనేవాడు అలాంటిలాంటి సాదాసీదా మనిషి కాదు. కొందరు అతి సాధారణమైన మనుషులుంటారు. మరికొందరు నిజమైన మానవులుంటారు.

✤ ✤ ✤

ఇలాంటి మాటలతో రబ్‌ఫాక్ అభ్యర్థులు తమ బాధని కప్పిపెట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే వారి కంటె ఈ విషయంలో మేమే ఎక్కువ శ్రమపడుతున్నాం. మా ఉద్వేగాల్ని అణచు కునేందుకు తంటాలు పడుతున్నాం. ఎందుకంటే రబ్‌ఫాక్ చదువులో వారికి ఒక అందమైన ప్రపంచం ఎదురుచూస్తోంది. కాలనీకి మిగిలేది మాత్రం చీకటే.

ఆ ముందురోజు రాత్రి పిల్లలంతా నిద్రలకు వొరిగిన తరువాత నా గదిలో టీచర్లందరం సమావేశం అయాం. రాత్రి వాతావరణం వెచ్చగా, ఆకాశం నక్షత్రాలమయంగా ఉంది. ఆ క్షణంలో ప్రపంచం నాకు అత్యంత రుచికరమైన, ప్రీతిపాత్రమైన, సంక్లిష్టమైన పదార్థంలా కనిపించింది. అటువంటిసమయాల్లో మనిషి తను అర్థం కాని విషయాలను జీర్ణం చేసుకునేందుకు ప్రయత్నించడం మామూలే. ఆ వాతావరణంలో ఆ గదిలో మేమంతా ఒకరినొకరు పట్టుకొని మౌనంగా ఉన్నాం. గాలికి కదిలే ఆకులు చెబుతున్న రహస్యాలు వింటూ, ఎవరి ఆలోచనల్లో వారం నిమగ్నమై ఉన్నాం.

ఆ రాత్రి నేనూ మిగిలివారినే ఆలోచిస్తూ కూర్చున్నాను. ఆ రాత్రితో నేను సాకిన తొలి బృందం కాలనీని వదిలి వెళ్లబోతోంది. అప్పుడు నేనెంత వెర్రిగా ఆలోచించానో ఎవరికీ చెప్పలేదు. నా సహచరుల ముందు బలహీనంగా కనిపించరాదని, భావోద్వేగాలకు లోనై అందరినీ బాధించరాదని నిర్ణయించుకున్నానేమో. బాధతో కుమిలిపోతున్న నా సహ అధ్యాపకులు ధైర్యంగా ఒక టేకుమానులా దృఢంగా కనిపిస్తున్న నన్ను చూసి బహుశా సిగ్గుపడిపోయారు.

నేను మాత్రం నా జీవితం ఎంత కష్టభూయిష్టంగా ఉందో, నాకెంత అన్యాయం జరిగిపోతోందో ఆలోచిస్తూ కూర్చున్నాను. నా జీవితంలో ముఖ్యమైన కాలాన్ని కేవలం ఓ డజనుమంది బాల నేరస్థులను ఉన్నత విద్యకు తయారుచేసేందుకే వృథా చేశానా? అన్న ఆలోచన నన్ను తొలిచి వేసింది. రేపు ఆ పెద్ద పట్టణంలో కొత్త స్కూల్లో ఈ పిల్లలు ఎటువంటి ప్రభావాలకు లోనవుతారో? బహుశా నా శ్రమ అంతా వృధాగా మిగిలిపోతుందేమో? నాకెందుకిలా నిరాశ కలుగుతోంది? నేను చేసింది మంచి పనికాదా? ఒక క్లబ్‌లో పాడడం కంటే, ఒక థియేటర్‌లో నాటకం ఆడటం కంటే నేను వందరెట్లు శ్రమించానే? అయితే ఆ నటీనటులకు, గాయకులకు ప్రేక్షకుల ఆదరణ లభిస్తుంది. అభిమానులంటూ ఉంటారు. వారు తమ శేష జీవితాన్ని సంతృప్తిగా గడపగలరు. నేను మాత్రం ఈ కాలనీలో, చీకటిలో మగ్గిపోవాలి. కనీసం పక్క గ్రామ ప్రజలైనా నేను సాధించిన విజయాన్ని గురించి అభినందించరు. అంతెందుకు రబ్‌ఫాక్‌కు వెళ్తున్న విద్యార్థుల కోసం నేను వెయ్యి రూబుళ్లు ఖర్చు చేశానని విద్యాశాఖ ఇన్‌స్పెక్టర్ ఎంతగా విరుచుకుపడ్డాడు? మా ఖర్చు నిర్ణీత బడ్జెట్‌ని దాటితే, అలా పెరిగిన మొత్తాన్ని నా జీతం నుంచి కత్తిరిస్తానని కూడా బెదిరించాడు, ఎందుకిలా?

అక్కడ విద్యాశాఖలో నా జీతంలో ఎంత కోత పెట్టాలో లెక్కలు వేస్తున్న అధికారులు కళ్లముందు కదిలారు. మరో గదిలో మరో విద్యావేత్త విద్యాబోధనకు సంబంధించిన ఆధునిక సిద్ధాంతాలు వివరిస్తున్నాడు. పక్కనే ఉన్నవారు భవంతిలో ఒక సమావేశం జరుగుతున్న దృశ్యం కళ్లెదుట ప్రత్యక్షమైంది. అక్కడే వేదికపై పిల్లలు 'అంతర్జాతీయ గీతం' పాడుతున్నారు. మరోపక్క విద్యావేత్త ఒకరు ఓ ఉపన్యాసం దంచుతున్నాడు.

నాకు నవ్వొచ్చింది. ఈ పెద్దమనిషి ప్రపంచానికి పనికిరాగల ఏ అంశాన్నైనా ఎలా చెప్పగలడు? రివాల్వర్ చేతిలో ఉంచుకుని, ఖార్కోవ్ రహదారిపై ప్రయాణికులను దోచుకున్న కరబనోవ్ ఆయనకు తెలుసా? ఒక ముఠాతో కలిసి ఇల్లు దోచుకున్న బరున్ గురించి ఆయన ఊహించగలడా? ఈ

బరున్ ముఠాలోని మిగతావారంతా మిలీషియా కాల్పుల్లో మరణించిన సంగతి ఆయనకి తెలుసా? ఎందుకొచ్చిన ఉపన్యాసాలు??

"ఏంటి మీలో మీరే ఆలోచించుకుంటూ, నవ్వుకుంటున్నారు" అంటూ ఎకతెరీనా నన్ను కుదిపింది.

"నా లోపల ఒక సమావేశం, చర్చ జరుగుతోంది."

"తెలుస్తూనే ఉంది కానీ, చెప్పండి. కాలనీని, కొమ్సొమోల్‌ను ఇంతకాలం ముందుకు నడిపిన కుర్రవాళ్లంతా వెళ్లిపోతున్నారు. ఇప్పుడు మళ్లీ అటువంటి కార్యనిర్వాహక బృందం ఏర్పడడం ఎలా?" అని ప్రశ్నించింది.

"చూడండి ఈ వెళ్లిపోతున్న కుర్రవాళ్లు, కార్యనిర్వహక బృందంగా ఏర్పడడం అనేది మన కళ్లముందే జరిగింది. ఇటువంటి బృందాలకు కొనసాగింపు ఉటుంది. మనం కష్టపడనవసరం లేదు" అని వివరించాను.

మర్నాడు అధ్యాపక బృందం గంభీరంగా విధులు నిర్వర్తించింది. వీడ్కోలు ఉత్సవాలు కూడ అంతే గంభీరంగా ప్రారంభమయ్యాయి. ఈ వాతావరణాన్ని మరింత బరువెక్కించడం నాకు ఇష్టం లేదు. అందుకే వేదికపై కూర్చుని ఉత్సాహంగా కనిపించే ప్రయత్నం చేశాను. పిల్లలను రబ్‌ఫాక్‌కు పంపడమే నా లక్ష్యమనీ, అది నెరవేరుతున్నందుకు ఆనందంగా ఉన్నాననీ అందరూ అనుకునేలా ప్రవర్తించాను. మధ్యాహ్నం భోజనాల సమయానికి వాతావరణం కొంత తేలికైంది. లాపోట్ తన తరహాలో చలోక్తులతో అందరినీ ఉత్సాహపరిచే ప్రయత్నం చేశాడు. మూడు గంటలకు రబ్‌ఫాక్ అభ్యర్థుల బృందాన్ని బండి ఎక్కించి, వారి వెంట అందరం స్టేషన్ వరకూ వెళ్లాం. వారికి ఘనంగా వీడ్కోలు చెప్పాం.

దారిలో గడ్ కోపంగా ఉపన్యాసం ఇస్తున్నాడు. "నేను రబ్‌ఫాక్‌కి వెళ్లనే వెళ్లను. చెప్పులు కుట్టే వృత్తి స్వీకరిస్తాను" అని వాగుడు మొదలుపెట్టాడు.

దీనికి కుడ్లాటీ కోపంగా బదులిచ్చాడు.

"నీ మొహం అవుతావు. మొన్న నా బూటు అడుగు వూడిపోతే మరమ్మతు చేశావు. కొత్త అడుగు వేశావు. ఏమైంది? సాయంత్రానికి అదీ వూడిపోయింది. అదీ నీ పనితనం" అని నిరసనగా అన్నాడు.

అందరం పూర్తిగా అలసిపోయి కాలనీ చేరుకున్నాం. ఇక అందరూ నిద్రపోవలసిన సమయం అయిందని సంకేతం అందే సమయానికి రాత్రి డ్యూటీలో ఉన్న కమాండర్ ఒసాడ్చీ బాగా తాగి ఉన్నట్టున్న గడ్‌ని నా గదికి తీసుకువచ్చాడు. ఫిర్యాదు చేశాడు.

గడ్ ధిక్కారంగా తల ఎగురవేసి నిలబడ్డాడు. నేను మౌనంగా అతని వంక చూస్తున్నాను. వాడు నా టేబుల్ మీద ఇంకుసీసాని చూస్తూ మాట్లాడాడు.

"నేను తాగాను. ఎందుకంటే అది సరైన పనే కనుక. నేను చెప్పులు బాగుచేసేవాడిని కావచ్చు. కానీ నాకు ఆత్మ అంటూ ఒకటుంది. లేదా? ఉంది. జడరోవ్ లాంటి మిత్రులు అంతమంది నన్ను వదిలివెళ్లిపోతే నేను భరించగలనా? భరించలేను. అందుకేవెళ్లి తాగాను. అందుకు నేను స్వయంగా సంపాదించిన డబ్బు ఖర్చు చేశాను. నేనేం తప్పు చేశానా? ఎవరి గొంతు కోశాను. ఎవరినైనా అవమానించానా? ఏ ఆడపిల్లపై అయినా చెయ్యి వేశానా? ఏ తప్పు చేశాను? ఆంటన్ సెమ్యోనోవిచ్ మీ ఎదుట నిలిచి ఉన్నాను" అన్నాడు.

"ఏమైనా చెబితే విని, అర్థం చేసుకొనే స్థితిలో ఉన్నావా?" అని అడిగాను.

ఉన్నానన్నాడు.

"సరే విను. చెప్పులు తయారు చేయడం కూడా అందరికీ ఎంతో అవసరమైన పనే. నువ్వు మంచి చర్మకారుడివి అవుతావు. చక్కటి బూట్లు చేయగలవు. ప్రయత్నిస్తే పెద్ద బూట్ల ఫ్యాక్టరీ డైరెక్టర్‌వి కూడా కాగలవు. అయితే ఇలా తాగితే ఏమీ కాలేవు"

"అంటే ఇంతమంది మిత్రులు వెళ్లిపోయినప్పుడూ తాగకూడదా?"

"అవును అప్పుడూ తాగకూడదు"

"అంటే, తాగి నేను తప్పు చేశానా?"

"అవును"

"సరే తాగేశాను. ఇప్పుడు ఆ తప్పు దిద్దుకోలేను. నన్ను శిక్షించండి" అన్నాడు తలవంచుకుని.

"ఈసారికి శిక్ష ఉండదు. వెళ్లి పడుకో అన్నాను.

గడ్ గదిలో మూగిన పిల్లల వంక చూసి, "నేను చెప్పలేదూ!" అన్నాడు. తరువాత నా వంక తిరిగి కాలనీ పద్ధతిలో సెల్యూట్ చేసి, గంభీరంగా "సరే మంచిది కామ్రేడ్" అంటూ బయటకు నడిచాడు.

లాపోట్ వాడిని దగ్గరకు తీసుకుని డార్మెటరీకి నడిపించాడు. ఈ మొత్తం కాలనీ నేడు అనుభవిస్తున్న విచారానికి గడ్‌ని వాడొక ప్రతీకగా పరిగణిస్తున్నాడనిపించింది.

అరగంట తరువాత కుడ్లాటీ నా గదికి వచ్చి రేపు పంపిణీ చేయవలసిన బూట్లని ప్రదర్శించాడు.

12

మరో తనిఖీ అధికారి

మరోసారి కాలనీని శీతాకాలం ఆవరించింది. అక్టోబర్ నుంచి పనుల వత్తిడి పెరిగింది. ఒక ట్రాక్టర్ లేకుండా వ్యవసాయం ముందుకు సాగదని షెరీ ఆందోళన చెందేవాడు. పిల్లలు రోజంతా శ్రమపడేవారు. ఎంత చేసినా పని ఒక కొలిక్కి వచ్చేదికాదు. త్వరలోనే రబ్‌ఫాక్ వెళ్లిన కుర్రవాళ్ల లోటును మిగిలిన వాళ్లు పూడ్చగలిగారు. మరోపక్క ఖార్కోవ్‌లో రబ్‌ఫాక్‌లో మా పిల్లలు బాగా చదువుతున్నారనే సమాచారం మమ్మల్ని ఆనందపరిచేది. వాళ్లు అక్కడ పరీక్షలో ఉత్తీర్ణులయారు. వాళ్లు మాకు దూరమైనా, ఇంకా కాలనీ సభ్యులుగా ఉన్నందుకు, మాకు సంతోషం కలిగేది. అక్కడ రబ్‌ఫాక్‌లో ఏడవ డిటాచ్‌మెంట్‌గా కొనసాగుతున్న మా పిల్లల బృందానికి జదరోవ్ కమాండర్. వాడు ప్రతివారం కుర్రవాళ్లందరి గురించి ఉత్తరాల రూపంలో కాలనీకి నివేదికలు పంపేవాడు. ఆ ఉత్తరాలని మేం మా సమావేశాల్లో అందరికీ చదివి వినిపించేవాళ్లం. జదరోవ్ అక్కడి విషయాలు రాస్తూ తన వ్యాఖ్యానాలు జోడించేవాడు.

"కరబనోవ్ ఇటీవల చెర్నిగోవ్ నుంచి వచ్చి ఇక్కడ చదువుతున్న ఒక పిల్లతో ప్రేమలో పడే ప్రయత్నంలో ఉన్నాడు. ఇదంతా ఆపమని వాడికి సలహా ఇవ్వండి. రబ్‌ఫాక్‌లో వైద్య విద్యలేనందుకు వెర్షనోవ్ అసంతృప్తితో ఉన్నాడు, వ్యాకరణం చదవలేక విసుక్కుంటున్నాడు. వాడిని మందలించండి".

ఇలా సాగేవి జదరోవ్ నివేదికలు. ఒకసారి రాశాడు. "ఒక్సానా, రఖిల్ (గతంలో అధ్యాపక శిక్షణాలయం నుంచి కాలనీకి వచ్చినవాళ్లు) తరచు మమ్మల్ని కలుస్తున్నారు. వాళ్లు మాకు అన్నివిధాలా సాయపడుతున్నారు. కోల్యకు వ్యాకరణం కొరుకుడు పడదు. గోలోస్‌కు గణితం అంటే బెదురు. అందువల్ల ఒక్సానా, రఖిల్‌లను మా ఏడవ డిటాచ్‌మెంట్‌లో చేర్చుకునేందుకు అనుమతి ఇవ్వండి. వారు మాతో ఉంటే మమ్మల్ని బాగా చదివించగలరు."

ఒకసారి కొంత డబ్బు పంపమని రాశాడు. "ఒక్సానా, రఖిల్‌లకు బూట్లు లేవు. కొందామంటే డబ్బులేదు. మా బూట్లు కూడా తెగ నడవడం మూలంగా అరిగిపోయాయి. ఆంటన్ సెమ్యోనోవిచ్ ఇదివరకు పంపిన డబ్బుతో పుస్తకాలు కొన్నాం."

ఈ అన్ని ఉత్తరాలనీ సమావేశంలో పిల్లలు ఆనందంగా వినేవాళ్లు. రబ్‌ఫాక్ విద్యార్థులకు అవసరమైన డబ్బు పంపాలని, ఒక్సానా, రఖిల్‌లు ఏడవ డిటాచ్‌మెంట్‌లో చేరేందుకు అనుమతి ఇవ్వండి, వెర్షనోవ్‌ను గొణుగుడు కట్టిపెట్టి చదువు సాగించమంటూ సలహా ఇవ్వాలని సమావేశం నిర్ణయించింది. అలాగే చేశాం కూడా.

మొత్తానికి ఖార్కోవ్ నుంచి అందే ఉత్తరాలు మా కాలనీలో కుర్రవాళ్లని బాగా ప్రభావితం చేశాయి. రబ్‌ఫాక్ అంటే సాధించలేని లక్ష్యం కాదని, అదొక కల మాత్రమేకాదనీ, కష్టపడితే తామూ అక్కడికి వెళ్లవచ్చని కుర్రవాళ్లకి అర్థమైంది. దాంతో పిల్లలు మరింత శ్రద్ధగా చదువు సాగించారు. బ్రాచెంకో, జార్జివ్‌స్కీ, ఒసాడ్చీ తదితరులు ఈసారి రబ్‌ఫాక్ పరీక్షలో ఉత్తీర్ణులు అయితీరాలనే పట్టుదలతో చదువు కొనసాగించారు.

మొదట్లో వెర్రిగా ప్రవరిస్తూ అందరినీ చికాకు పరిచిన మరూస్యా కూడా అతి శ్రద్ధగా చదువు మొదలుపెట్టింది. నటాషా సైతం ద్విగుణీకృత ఉత్సాహంతో చదివేది. ఆమె వయసు పదహారేళ్లు. నటాషా అప్పటికి నిరక్షరాస్యురాలు. తొలిరోజునుంచే ఆమె అపరిమితమైన పట్టుదల ప్రదర్శించేది. ఆమె శ్రద్ధను గమనించి ఈ శీతాకాలంలోగా ఒకటి, రెండు తరగతులు పూర్తి కావాలని ఆమెకు చెప్పాను. ఆమె సరేనని ధీమాగా చెప్పింది. అప్పటికే తను 'అంకుల్' అని పిలవడం మానుకుంది. స్వల్పకాలంలోనే ఆమె కాలనీ మనిషిగా మారింది, అందరూ ఆమెను ఇష్టపడేవారు. చోబట్‌తో ఇదివరకటి స్నేహాన్ని ఆమె కొనసాగించింది. వాడు కూడా నిశ్శబ్దంగా ఆమెను గమనిస్తూ ఎప్పుడూ ఆమెను కలవడానికి ప్రయత్నిస్తున్నట్టు కనిపించేవాడు. అయితే నటాషాకు శత్రువులంటూ ఎవరూ లేకపోవడం చోబట్ విచారాన్ని పెంచింది. ఆమె పిల్లలందరితో హాయిగా కలిసిపోయేది. దీనితో ఆమెతో ఒంటరిగా మాట్లాడడానికి చోబట్ ఎదురుచూడాల్సి వచ్చేది.

క్రమంగా నటాషా విషయాలలో చోబట్ ఆందోళన పెరిగిపోతున్న సంగతిని నేను గుర్తించాను. ఒకరోజు వాడు నా దగ్గరకొచ్చి.,

"ఆంటన్ సెమ్యోనోవిచ్, నేనొకసారి మా అన్నయ్య దగ్గరికి వెళ్లి వచ్చేందుకు అనుమతి ఇవ్వండి" అని అడిగి ఆశ్చర్యపరిచాడు. వాడికొక అన్నయ్య ఉన్న సంగతే నాకు తెలియదు. ఆ మాటే అంటే నిశ్శబ్దంగా వాడొక ఉత్తరాన్ని నాకు అందించాడు. అది వాడి అన్నయ్య రాసినదే.

"నువ్వు ఉన్న పరిస్థితిని బట్టి నువ్వు నా దగ్గరికొస్తేనే బావుంటావు. నా ప్రియసోదరా! వచ్చి నాతో ఉండు. నాది విశాలమైన ఇల్లే. పైగాకొంత పొలం వుంది. నీవంటి తమ్ముడు నాతో కలిసి ఉండడం కంటే కావలసింది ఏముంది? అందువల్ల వెంటనే రా. అలాగే ఆ యువతి అంటే నీకు అంత ఇష్టం అంటున్నావు కాబట్టి, ఆమెనూ వెంట తెచ్చేయ్" ఇదీ ఆ ఉత్తరం.

"నటాషాతో మాట్లాడావా?" అని అడిగాను.

"లేదు. నాకే నా అన్నయ్య గురించి తెలియదు. కలసి చాలా కాలమైంది. ముందు ఒకసారి నేను వెళ్తాను."

నేను సరే అన్నాను. వాడు డిసెంబర్‌లో బయలుదేరి వెళ్లి, చాలాకాలం అక్కడ ఉండిపోయాడు. నటాషా ఈ విషయాన్నే పట్టించుకున్నట్టు, కనీసం పైకి కనిపించలేదు. ఆమె పూర్తిగా చదువులో

పడిపోయింది. మిగిలిన పిల్లలకూ ఈ చదువు జబ్బు గట్టిగానే అంటింది. చదువుల పట్ల పిల్లల్లో పెరిగిన ఆసక్తి మొత్తం కాలనీ స్వరూప స్వభావాలని మార్చింది. ఇప్పుడు కాలనీ మరింత నాగరికంగా మారింది. దీనికి తోడు మాక్సిమ్ గోర్కీ నుంచీ ఒక లేఖ కుర్రవాళ్ల పఠనాసక్తిని పెంచింది.

“నా జీవిత కథ ‘నా బాల్యం’ చదవండి. నేనూ మీలాంటి వాడినే అని బోధపడుతుంది. కానీ ఆదినుంచీ నేను చదువుపై దృష్టి సారించాను. కష్టించి పనిచేయాలంటే ఎన్నడూ భయపడలేదు.” అన్నది ఆ వుత్తరం సారాంశం.

కాలనీవాసులు చాలా కాలంగా గోర్కీతో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగిస్తున్నారు. ఎన్నడో ఒకసారి ఇటలీ చిరునామాకు గోర్కీకి రాసిన లేఖకు జవాబు వస్తుందని మేం ఎవరూ ఆశించలేదు. కానీ ఆశ్చర్యకరంగా వెంటనే ఆయననుంచి మాకు సమాధానం అందింది.

అది మొదలు మా కుర్రవాళ్లంతా కలిసి గోర్కీకి క్రమం తప్పకుండా ఉత్తరాలు రాసేవాళ్లు. రాసిన తరువాత నాకు తెచ్చి చూపేవారు. అలాగే ఆయననుంచి ప్రత్యుత్తరం వస్తే కాలనీలో పండగలా ఉండేది. అందరూ గుంపుగా నా గదికి వచ్చి ఆయన రాసిన ఉత్తరాన్ని చదివించుకు వినేవారు.

మొదట్లో గోర్కీని మా వాళ్లు దైవసమానునిగా పరిగణించేవారు. ఆయన్ను అనుకరించడం మహా పాపమని భావించేవారు. ఆయన రాసిన ‘నా బాల్యం’లో ప్రతి సంఘటన నిజమేనని, అది ఆయన జీవితకథేనని వాళ్లని నమ్మించేందుకు నేను చాలా శ్రమపడవలసి వచ్చింది. కాలనీవాసులంతా కలిసి మాక్సింగోర్కీకి ఏదైనా బహుమతి పంపాలని ఒకసారి ఆలోచించారు. ఎంతో చర్చ తరువాత ఆయనకు ఇటలీ చిరునామాకే ఒక బూట్ల జత పంపాలని నిర్ణయించారు. అయితే ఆ తరువాత గోర్కీ తన లేఖలో “బూట్ల అవసరం తనకు లేదని” వివరించారు.

ఆ రోజుల్లోనే పట్టణం నుంచి ప్రజా విద్యాశాఖ నుంచి కాలనీకి ఒక ఇన్‌స్పెక్టర్ తనిఖీ కోసం వచ్చింది. ఆమె పేరు ల్యూబోవ్ జుఠిన్‌స్కయా ఆమె వచ్చీరాగానే కాలనీలో అమలులో ఉన్న కఠినమైన క్రమశిక్షణ గురించి నన్ను నిలదీసింది.

“ఏమిటీ? ఈ కాలనీలో పిల్లలకు శిక్షలుంటాయట? క్రమశిక్షణ ఉల్లంఘిస్తే అరెస్టు కూడా చేస్తారట? కేవలం రొట్టె నీళ్లు ఇచ్చి పస్తు పెడతారట?” అని ప్రశ్నల వర్షం కురిపించింది. అన్నిటికీ ‘అవున’ని సమాధానమిచ్చాను.

“కానీ, ఈ శిక్షలపై నిషేధం ఉంది?” అందామె.

“చట్టం వాటిని నిషేధించలేదు. పిల్లల శిక్షణ గురించి పండితులు రాసే రాతలు నేను పట్టించుకోను.”

“అంటే బోధనశాస్త్ర నిపుణులు రాసే సిద్ధాంతాలే చదవరా?”

“మూడేళ్లక్రితమే మానేశాను.”

“మీకు సిగ్గు అనిపించడంలేదా? అసలు మీరేమైనా చదువుతారా?

“చాలా చదువుతాను. ఆ పండిత ప్రకాండుల రాతలు తప్ప అవి చదివే వాళ్లంటే నాకు జాలి కూడా.” ఆమెకు ఆగ్రహం కలిగింది.

“మిమ్మల్ని పూర్తిగా సంస్కరించాలి. మనకు కావలసింది సోవియట్ తరహా అధ్యాపకులు” అందామె.

ఈ చర్చను పొడిగించాలని నాకు అనిపించలేదు. కటువుగా చెప్పాను” చూడండి నేను అట్టే

వాదించను. ఇక్కడ ఈ కాలనీలో సోషలిస్టు తరహా విద్యాబోధన, ఇంకా చెప్పాలంటే కమ్యూనిస్టు తరహా శిక్షణ పిల్లలకు లభ్యమవుతుంది. అనుభవం ద్వారా కానీ, లేదా నిజమైన పరిశోధన ద్వారా గానీ మీరా విషయం గ్రహించగలరు. అటువంటి వివాదాలు చర్చల్లో తేలవు. ఇంతకీ మీరెన్నాళ్లు ఉండదలిచారు?

"రెండు రోజులు"

"మంచిది ఉండండి. ఇక్కడి పరిస్థితి స్వయంగా గ్రహించండి. కాలనీ అంతా స్వయంగా మీ కళ్లతో మీరే చూడండి. పిల్లల్తో మాట్లాడండి. వాళ్లతో కలిసి భోజనం చెయ్యండి. పని చేయండి. చివరకు ఏ నిర్ణయానికి వస్తారో మీ ఇష్టం. చివరకు అవసరమనిపిస్తే నన్ను ఈ పదవినుంచి తొలగించండి. లేకుంటే ఏ పద్ధతిలో పిల్లల్ని పెంచాలో, విద్యాబుద్ధులు నేర్పి, మంచి పౌరులుగా తయారు చేయగలమో వివరిస్తూ నాకు సూచనలు ఇవ్వండి. ఆ హక్కు మీకు ఉంది.

కానీ నాకు ఏ పద్ధతి మంచిదనిపిస్తే ఆ పద్ధతినే అనుసరిస్తాను. దండన లేకుండా పిల్లలకు చదువు ఎలా చెప్పడమో నాకు తెలియదు. ఆ కళ మీకు తెలిస్తే, నేర్పిస్తే, నేర్చుకోగలను."

అయితే ల్యూబోవ్ జురిన్స్కవా ఆ తరువాత రెండు రోజులు కాదు, నాలుగు రోజులు కాలనీలో ఉంది. ఆ రోజుల్లోనే వెట్కోవ్స్కీ అనే కుర్రవాడు నా దగ్గరకి వచ్చాడు. కాలనీలో ఉండలేననీ, బయటికి వెళ్లిపోతాననీ అనుమతి అడిగాడు.

కమాండర్ల మండలి ఈ విషయం తేలుస్తుందని బదులిచ్చాను.

మండలి సమావేశంలో వెట్కోవ్స్కీ పొగరుగా వ్యవహరించాడు. తనను ఎవరూ ఆపలేరని హూంకరించాడు. తన ఇష్టమొచ్చిన చోటికి వెళ్లే హక్కు తనకి ఉందన్నాడు. వడ్రంగం చేసుకుని బతుకుతానన్నాడు. చేతకాకపోతే దొంగతనం చేస్తానన్నాడు.

అది విన్న కమాండర్ కుడ్లాటీ వాడిని తిట్టాడు.

"దొంగతనం చేస్తావా? దాంతో మాకు సంబంధం లేదా? ఇప్పుడు నేను లేచి నీ దవడ వాయిస్తాను. అప్పుడు కూడా మాకు సంబంధం లేదనగలవా?" అని ప్రశ్నించాడు.

ఆ సమావేశానికి హాజరైన ల్యూబోవ్ జురిన్స్కయా మొహం పాలిపోయింది. ఏదో మాట్లాడ బోయి నిగ్రహించుకుంది. కోపంతో రగులుతున్న కాలనీ కుర్రవాళ్లు వెట్కోవ్స్కీని తిట్టిపోశారు. గడ్ మరింత రెచ్చిపోయాడు.

"నీ బోటి దొంగ వెధవలకు కాలనీలో స్థానంలేదు. నువ్వు తక్షణం నిష్క్రమిస్తే మంచిది. నువ్వు వెళ్లిపోతే నీ వెనక వచ్చి బతిమాలతామనుకుంటున్నావేమో" అని అరిచాడు.

చివరిలో లోపాట్ చర్చను ముగించాడు.

"ఇకచాలు. వాడిని పోనిద్దాం. అయితే పేపర్లు మాత్రం ఇవ్వద్దు" అన్నాడు.

దాంతో వెట్కోవస్కీ తలవంచుకుని గొణిగాడు. "నాకు ఏ పత్రాలూ అవసరం లేదు. పది రూబుళ్ల ఇస్తే పోతాను."

ఆ విషయంపై తుది నిర్ణయం మండలిదేనన్నాను. వాళ్లు వాడికి పది రూబుళ్లు ఇచ్చేందుకు సరేనన్నారు.

నేను మరింత ఉదారంగా వాడికి ఇరవై రూబుళ్లు ఇచ్చి రసీదు తీసుకోమన్నాను.

వాడు ఆ నోట్లు అందుకుని "సెలవు, కామ్రేడ్స్" అని బయటకు నడిచాడు. ఎవరూ సమాధానం ఇవ్వలేదు.

లాపోట్ వాడి వెనకే పరుగెత్తుకెళ్లి అరిచాడు. "రేయ్ ఆ డబ్బు ఖర్చు కాగానే తిరిగి రావడానికి సిగ్గుపడద్దు. కాలనీకి వచ్చేయ్" అన్నాడు.

ఆ తరువాత ల్యుబోవ్ జురిన్స్కయా నా దగ్గరికి వచ్చి వ్యాఖ్యానించింది.

"ఆ కుర్రవాడితో ఎవరైనా నెమ్మదిగా మాట్లాడితే ఫలితం ఉండేదేమో" అని.

నేనే సమాధానం చెప్పలేదు.

తర్వాత ఆమె అంది. "మీ కమాండర్లు ఎలాంటివాళ్లు! వాళ్ల మనోనిబ్బరం అపూర్వం"

మరునాడు ఆమె స్టేషన్‌కు బయలుదేరింది. బ్రాచెంకో బండిని సిద్ధం చేశాడు. ఆ బండిలో గడ్డి, చెత్త పేరుకుని ఉన్నాయి.

"ఏమిటిది?" అని బ్రాచెంకోను గద్దించి అడిగాను.

"వ్యవధి లేకపోయింది" అని వాడు గొణిగాడు.

"చాల్లే, ఈ అశుభ్రతను సహించను. వెళ్లు, వెళ్లి నేను స్టేషన్ నుంచి వచ్చేవరకూ అరెస్టులో ఉండు అని శిక్ష విధించాను.

"మంచిదండీ, ఆఫీసు గదిలోనేనా?" అని అడిగాడు బ్రాచెంకో.

నా ఆగ్రహాన్ని చూసి ఆశ్చర్యపోయి వాడు దిగాలుగా కాలనీలోకి నడిచాడు. మేం స్టేషన్ దగ్గరికి వెళ్లేవరకూ ల్యూబోవ్ జురిన్స్కయా ఏమీ మాట్లాడలేదు. అక్కడ మాత్రం ఆమె నా చెయ్యి పట్టుకు లాగి ఆపింది.

"ఎందుకంత కఠినంగా ఉంటారు? మీది ఒక అపూర్వమైన సమిష్టి క్షేత్రం. మీరు అక్కడ అద్భుతాలు చేస్తున్నారు. నాకు ఆశ్చర్యంతో నోట మాట రావడం లేదు, చెప్పండీ.....

ఆ కుర్రవాడు... బ్రాచెంకో మీరు వెళ్లేవరకూ తనంతతానుగా నిర్బంధంలో ఉంటాడా?" అని ప్రశ్నించింది.

నేను ఆమె వంక ఆశ్చర్యంగా చూశాను.

"ఎందుకు ఉండడు. బ్రాచెంకో విశిష్టమైన కుర్రవాడు. గీసిన గీత దాటడు" అన్నాను.

"కానీ, వెట్కోవ్‌స్కీతో ఎవరైనా మాట్లాడవలసింది. ఏమైనా వాడు తిరిగివస్తాడని నాకు నమ్మకం ఉంది" అందామె.

నేను నిట్టూర్చాను. సమాధానం చెప్పలేదు.

13

ఒప్రిష్కో బహిష్కరణ

కొత్త ఏడాది 1925 ఆరంభంలో కాలనీకి కొంత విచారాన్ని మోసుకొచ్చింది.

కమాండర్ల మండలి సమావేశంలో ఒప్రిష్కో మాట్లాడతూ, తాను గ్రామానికి చెందిన లుకషెంకో కుమార్తె మరూస్యాను వివాహమాడదలిచినట్టు తెలిపాడు. అయితే మంచి కన్యాశుల్కం తెస్తే తప్ప తన కుమార్తెను ఇవ్వనని లుకషెంకో మెలికపెట్టాడు. అలా కట్నం తెస్తే వచ్చి తన ఇంట్లోనే ఉండవచ్చని, తనతో కలిసి పొలం పని చేసుకోవచ్చని అంటున్నాడు.

కమాండర్ల మండలి ఈ మాటలు విని నిశ్శబ్దంగా మిగిలిపోయింది. చివరకు లాపోట్ గొంతు విప్పాడు. "ఏం చేద్దామనుకుంటున్నావు లుకషెంకో ఆ ఇంట్లో స్థిరపడి గ్రామస్థుడిగా మారిపోతావా?" అని ప్రశ్నించాడు.

"గ్రామస్థుడిగా అంటే నీ ఉద్దేశం ఏమిటి?" ఒప్రిష్కో ప్రశ్నించాడు.

"అంటే ఏమిటో తెలియదా?"

"నువ్వేమనుకుంటున్నావో చెప్పు"

లాపోట్ మాట్లాలేదు. కొద్దిసేపు ఆగి మళ్లీ అందరినీ ఉద్దేశం అడిగాడు. ఎవరైనా మాట్లాడతారా?

ఆరవ డిటాచ్‌మెంట్ కమాండ్ వాలోఖోవ్ లేచాడు.

"కుర్రవాళ్లు ఎవరి బతుకు గురించి వారు ఆలోచించుకోవలసిందే. ఎవరూ జీవితాంతం కాలనీలో ఉండిపోరు. అయితే బయటికి వెళ్లి బతికేందుకు మనలో ఎందరికి ఇతర పనుల్లో నైపుణ్యం ఉంది. కొంతమంది కార్ఖానాల్లో పని చేయగలరు. అత్యధికులకు పొలం పనులే తెలుసు. అందువలన ఒప్రిష్కో ఒక రైతు కాదలిస్తే అదే మంచిది. కానీ ఇందులో ఏదో తిరకాసు ఉంది. ఒప్రిష్కో, నువ్వు కొమ్సొమోల్ సభ్యుడివేగా? అని అడిగాడు.

"అయితే ఏమిటి?

"ఏ లేదు. నువ్వు కొమ్సొమోల్‌లో ఉన్నావు కాబట్టి ముందు ఈ సంగతి అక్కడ తేలితే మంచిది. వాళ్లు ఈ విషయంలో కమాండర్ల మండలికి తగిన సూచనలు ఇవ్వడం సబబుగా ఉంటుంది."

కోవల్ లేచి మాట్లాడాడు. "కొమ్సొమోల్‌లో ఈ విషయం చర్చించాం. దీనిపై మా అభిప్రాయం మాకుంది. భూస్వామ్య కులక్‌లను సృష్టించడం గోర్కీ కాలనీ పని కాదు. లుకషెంకో ఒక కులక్"

దీనితో ఒప్రిష్కోకు కోపం వచ్చినట్టుంది. "ఆయన్ని కులక్‌అని ఎందుకంటున్నావు?" అని అడిగాడు.

"ఆయనకి సొంత ఇల్లు ఉంది. రెండు గుర్రాలు కూడా ఉన్నాయా?"

"ఉన్నాయి"

"పొలం పనులకోసం పాలేరు ఉన్నాడా?"

"లేదు"

"మరి ఆయన పొలం పని చేసే సెర్జీ ఎవరో?"

'సెర్జిని విద్యాశాఖ ఆయన వద్దకు పంపింది. ఆయనవాడిని దత్తత తీసుకున్నాడు."

"అవన్నీ కబుర్లే, విద్యాశాఖ పంపనీ, మరో విభాగం పంపనీ, సెర్జీ ఆయన పొలంలో పాలేరు"

ఒప్రిష్కో సూటిగా సమాధానం ఇవ్వలేదు. "ఎందుకీ మాటలు? ఓల్యాకు మనం కట్నం ఇచ్చాం.." అన్నాడు అస్పష్టంగా.

దీనికి కోవల్ వద్ద సమాధానం సిద్ధంగా ఉంది.

"ఆమె వ్యవహారం వేరు. ఆమె వివాహం చేసుకున్నది ఒక కొమ్సొమోల్ సభ్యుడిని. అదీకాక పెళ్లి తరువాత వారు కాలనీ కమ్యూన్‌లో చేరేందుకు అంగీకరించారు. చేరుతున్నారు కూడా. అందువల్ల ఓల్యాకు కట్నంగా ఇచ్చిన ఆస్తి సద్వినియోగం అవుతుంది. చివరిగా కులక్‌లను తయారుచేయడం కాలనీ పనికాదు."

"అయితే ఇప్పుడు నేనేం చేయాలి?" ఒప్రిష్కో అడిగాడు.

"అది నువ్వు తేల్చుకోవాలి".

"అదేంటి?అలా కుదరదు" అంటూ స్టుపిట్సిన్ అడ్డు తగిలాడు" వాళ్లు ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకోనిద్దాం. ఒప్రిష్కోకు కట్నం ఇద్దాం. అయితే కొత్త దంపతులు లుకషెంకో ఇంట్లో ఉండకూడదు. కమ్యూన్‌లో చేరాలి. "ఇదీ అతని ప్రతిపాదన.

"లుకషెంకో దీనికి ఒప్పుకోడు" ఒప్రిష్కో ఆందోళన.

"మరూస్యాకు చెప్పు. ముసలాడిని వదిలి నీతో రమ్మని".

"ఆమె అందుకు సిద్ధం కాదు".

"అంటే ఆమె నిన్ను తగినంతగా ప్రేమించడంలేదు. అందులో ఆశ్చర్యం లేదు. ఆమె కూడా స్వతహాగా కులక్కే కదా!"

"ఆమె నన్ను ప్రేమిస్తోందో లేదో నీకు అనసరం" అన్నాడు ఒప్రిష్కో.

"అదేం వాదన? ఆమె నిన్ను ప్రేమించకుండా పెళ్లికి సిద్ధపడిందంటే నువ్వు తేబోయే ఆస్తిపైనే ఆమెకు ఆసక్తి అని అర్థం".

"ఏమో ఆమె నన్ను ప్రేమిస్తోందేమో. బహుశా తండ్రికి ఎదురు చెప్పలేదేమో" ఒప్రిష్కో సమర్థన.

"ఆహా అట్లాగేం అయితే ఆమె గురించి కమాండర్ల మండలి దిగులు పడడం దండగ. లుకషెంకోకు కావలసిందల్లా డబ్బున్న అల్లుడు. దీన్ని మేం ఎందుకు పట్టించుకోవాలి. దాని గురించి ఈ చర్చ దండగ. ఇక ఈ సమావేశాన్ని ముగిస్తే మంచిద"ని కుద్లాటీ తేల్చేశాడు.

లాపోట్ విశాలంగా నవ్వి "మరూస్యా ఒప్రిష్కోను తగినంతగా ప్రేమించడంలేదని తేలినందున ఈ విషయంపై చర్చ అనవసరం. అందువల్ల మండలి సమావేశం ఇంతటితో ముగిసింద"ని ప్రకటించాడు.

ఒప్రిష్కో నోట మాట రాలేదు. రోజంతా వెర్రివాడిలా కాలనీలో తిరిగాడు. మర్నాడు చిత్తుగా తాగివచ్చి డార్మెటరీలో అందరితో గొడవపెట్టుకుని అల్లరి చేశాడు.

దీనిపై మళ్లీ కమాండర్ల మండలి సమావేశమైంది. ఒక డిటాచ్‌మెంట్ కమాండర్ అయి ఉండి, కొమ్సొమోల్ సభ్యుడు కూడా అయిన సీనియర్ కాలనిస్టు ఒప్రిష్కో ప్రవర్తనపై సుదీర్ఘ చర్చ జరిగింది. కొత్తవాళ్లెవరైనా ఇటువంటి పొరపాటు చేస్తే క్షమించవచ్చని కానీ ఒప్రిష్కో వంటి సీనియర్‌ను కఠినంగా శిక్షించాలని అత్యధికులు భావించారు. దీనికి ఒప్రిష్కో స్పందన హాస్యాస్పదంగా ఉంది. తనను కాలనీ నుంచి బయటికి పంపేస్తే పట్టణంలో విద్యాశాఖకు ఫిర్యాదు చేస్తానని బెదిరించాడు.

కుర్రవాళ్లు హేళనగా నవ్వారు. "అంటే నువ్వు పట్నం వెళ్లి అక్కడనుంచి ఒక కాయితం సంపాదించి కాలనీ వచ్చి మాతో కలిసి ఉంటావ్! అంతేగా సరే కానీ!" అన్నారు. తానెంత వెర్రిగా మాట్లాడినదీ ఒప్రిష్కోకు అర్థమైంది. చివరకు వాడిని కాలనీ నుంచి బహిష్కరించాలని మండలి తీర్మానించింది, వాడు నిష్క్రమించాడు.

రెండు రోజుల తర్వాత తెలిసింది. వాడు లుకషెంకో ఇంట్లో ఉంటున్నాడని. మరూస్యా తన తండ్రిని వొప్పించగలిగిందని.

ఏప్రిల్‌లో పట్టణం నుంచీ 'రబ్‌ఫాక్' విద్యార్థులు సెలవులకు కాలనీకి వచ్చారు. వాళ్లంతా గతంలో కంటే కొంత చిక్కినట్టు కనిపించారు. వాళ్లని చూసి లాపోట్ పదవ డిటాచ్‌మెంట్‌కు ఆదేశాలు జారీచేశాడు. "వీళ్లందరినీ బాగా మేపండి" అని.

రబ్‌ఫాక్ విద్యార్థులు ఎవరూ కాలనీ కుర్రవాళ్ల ముందు గొప్పలు పోకుండా అతి మామూలుగా కలిసి పోవడం చూసి నాకు ముచ్చట కలిగింది. కరబనోవ్ కాలనీలో కాలు పెట్టగానే ఎదురుపడిన కొందరిని పలకరించి పొలాల్లోకి, కార్ఖానాల్లోకి పరుగులు తీశాడు. ఎప్పటిలానే బెలూఖిన్ చుట్టూ చిన్న పిల్లలంతా గుమిగూడారు.

ఆ సాయంత్రం మేమంతా నక్షత్రాలతో మెరిసిపోతున్న ఆకాశాన్ని చూస్తూ తోటలో కూర్చొని ఇదివరకులోలాగానే కాలనీ స్థితిగతుల గురించి మాట్లాడుకున్నాం. కాలనీలో ఇటీవల జరిగిన ఉదంతాలపై కరబనోవ్ బాగా కలత చెందాడు.

అయినా మా నిర్ణయాలనే సమర్థించాడు. "వెట్కోవ్స్కీకి కాలనీలో ఉండడటం నచ్చలేదు. ఎవరేం చేయగలరు? ఇంతకంటే మంచి చోటు దొరికితే వాడు పోవడమే మంచిది పోతే ఒప్రిష్కో ఒక కులక్ అనే విషయం స్పష్టంగా తెలుస్తోంది. వాడు కులక్‌లతో కలిసి బతకాల్సిందే. అయితే ఈ విషయాల గురించి ఆలోచిస్తుంటే ఎక్కడో ఏదో లోపం ఉందనిపిస్తోంది. దీన్ని గురించి మన ఆలోచించాలి. పట్టణంలో మేం వేరే జీవితాన్ని చూశాం. అక్కడి ప్రజలు వేరే రకంగా ఉంటారు. వారి జీవిత విధానం మరో రకంగా ఉంటుంది" అన్నాడు.

"అంటే కాలనీలో మనుషులు చెడ్డవారా?"

"అదేంకాదు కాలనీ జనం మంచివాళ్లు. అతి మంచి మనుషులు. అయితే ఒక్కసారి ఆలోచించండి. రోజు రోజుకూ మనలో కులక్‌ల సంఖ్య పెరుగుతోంది. చుట్టూ ఉన్నది కూడా కులక్‌లే. అటువంటప్పుడు కాలనీ ఇక్కడే ఎలా కొనసాగగలదు?" అన్నాడు కరబనోవ్.

"విషయం అది కాదేమో అన్నాడు బరున్ సాలోచనగా. "మనం కులక్‌లకు వ్యతిరేకంగా పోరాడవలసిందే. యుద్ధంచేయాల్సిందే. కాని సమస్య అది కాదు. కాలనీలో కుర్రవాళ్లకు చేసేందుకు ఏమీ లేదు. నూట ఇరవై మంది పిల్లలున్నారు. ఎంతోమంది పనివాళ్లు, కాని వారు చేస్తున్నదల్లా వ్యవసాయం. విత్తనాలూ, కలుపుమొక్కలూ, మళ్లీ విత్తనాలు, కలుపు మొక్కలూ. ఇంతేగా, ఆ స్వల్ప ఫలితం కోసం అపారంగా శ్రమిస్తున్నారు. ఎంత వృథా. మరో ఏడాది ఇలాగే గడిస్తే పిల్లలకు విసుగొచ్చి, ఇంతకంటే మంచి జీవితం కోసం మంచి పనికోసం వెంపర్లాడతారు".

బెలూఖిన్ ఈ మాటలని సమర్థించాడు. "అవును నువ్వన్నది నిజం" అంటూ నా వంక తిరిగాడు. మన పిల్లలు అదే అనాధలు శ్రామిక వర్గానికి చెందినవారు. వారిని నిజమైన కార్మికులుగా తీర్చిదిద్దాలి. పరిశ్రమల్లో వారికి అవకాశం లభించాలి. పొలాల్లో పని ఆనందదాయకంగానే ఉంటుంది. కానీ దానివల్ల ప్రయోజనం ఏమిటి? పల్లెల్లోకి వెళ్లి బతకాలంటే పెట్టీ బూర్జువాలుగా మారాలి. అదెంత సిగ్గుమాలిన విషయం. అలా వెళ్లి పల్లెల్లో బతకాలంటే కుర్రవాళ్లకు ఉత్పత్తికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలి. ఒక ఇల్లు, గుర్రం, నాగలి వంటివి సమకూరాలి. ఒప్రిష్కో వెళ్లినట్టుగా ప్రతివారూ ఖాళీ చేతులతో బయటికి వెళ్లి కులక్‌లతో స్థిరపడలేరు. అటువంటప్పుడు ఏం చేయాలి? అందువల్ల వారిని పారిశ్రామిక కార్మికులుగా తీర్చిదిద్దాలి" అన్నాడు.

అయితే రబ్‌ఫాక్ పిల్లలంతా మర్నాడు ఆనందంగా పొలం పనులకి బయలుదేరారు. మా కమాండర్ల మండలి ఈ కుర్రవాళ్ల గౌరవార్థం వారిని మిశ్రమ డిటాచ్‌మెంట్ కమాండర్లగా నియమించింది. కరబనోవ్ ఆ సాయంత్రం పొలంనుంచి ఉత్సాహంగా తిరిగివచ్చాడు.

"పొలం పని ఎంత బావుందో? కానీ అందులో ఆనందం లేకపోవడమే బాధాకరం. ఈ పొలాల్లోనే దుస్తులు, బూట్లూ, యంత్రాలు, ట్రాక్టర్లు, కళ్లజోళ్లు, గడియారాలు, సిగరెట్లు పండితే ఎంత బావుండేది! ఈ ప్రపంచాన్ని సృష్టించిన చవటలు ముందు నన్నెందుకు సంప్రదించలేదు" అని విసుకున్నాడు.

రబ్‌ఫాక్ విద్యార్థులు మే దినోత్సవాన్ని మాతోనే గడిపారు. ఆ రోజంతా భారీ వర్షం. అయినా పట్టణంలోని స్క్వేర్ వద్దకు కవాతు చేసుకుంటూ వెళ్లాల్సిందేనని పిల్లలు పట్టుపట్టారు. పదిమైళ్ల దూరం. వాళ్ల ఉత్సాహాన్ని కాదనలేకపోయాను. అందరం మార్చ్ చేసుకుంటూ ఆ పదిమైళ్లూ నడిచి పట్నం చేరుకున్నాం. కానీ వాన మూలంగా పట్టణంలో కార్మికులు ప్రదర్శనను రద్దు

చేసుకున్నారు. మేం మళ్లీ తడుస్తూ కాలనీకి తిరిగివచ్చాం. చోబట్ నా పక్కనే నడుస్తూ శూన్యంలోకి దీర్ఘంగా చూస్తున్నాడు. వాడినిచూస్తే అంతకుముందు రెండురోజులుగా జరిగిన సంఘటనలు గుర్తుకొచ్చాయి.

✣ ✣ ✣

1925 వేసవి నాటికే కాలనీ ఒక పటిష్టమైన సమిష్టి క్షేత్రంగా రూపుదిద్దుకొంది. పిల్లలంతా మంచి సమన్వయంతో కష్టించి పని చేస్తున్నారు. వాతావరణం కూడా ఉత్సాహంగా, ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉండేది. చోబట్ ఒక్కడే దీనికి మినహాయింపుగా ఉండేవాడు.

మార్చిలో కాలనీకి తిరిగి వచ్చిన చోబట్ పల్లెలో తన అన్నగురించి మాకు చెప్పాడు. అతను కాస్త ఉన్నవాడే. కానీ పొలం ఏమీ లేదు. చోబట్ మమ్మల్ని ఏ సాయం కోరలేదు. నటాషా గురించి మాత్రం ప్రస్తావించాడు.

“నాతో మాట్లాడి ఏం లాభం? నటాషా నీతో రావాలంటే నువ్వే ఆమెను అడగాలి” అని చెప్పాను.

వారం రోజుల తర్వాత మళ్లీ నా దగ్గరకు వచ్చాడు. వాడు బాగా ఉద్రిక్తంగా ఉన్నాడు. ‘నటాషా లేకుండా నేను బతకలేను. మీరు ఆమెతో మాట్లాడండి. నాతో వెళ్లమని చెప్పండి’ అని అడిగాడు.

“చూడు చోబట్ నువ్వు విడ్డూరంగా మాట్లాడుతున్నావు. తనతో మాట్లాడవలసింది నువ్వు. నేను కాదు.”

“మీరు చెబితే వింటుంది. నేను అడిగితే ప్రయోజనం కనిపించడం లేదు.”

“ఏమంటుంది?”

“ఏమీ చెప్పదు. అదే పనిగా ఏడుస్తుంది. అంతే.”

చోబట్ నా వంక దీక్షగా చూస్తున్నాడు. తన మాటల ప్రభావం నాపై ఎలా ఉందో తెలుసుకోవడం అతనికి ముఖ్యం. ఈ వ్యవహారం అంతా బాధకరంగా అనిపిస్తోందన్న నా ఉద్దేశాన్ని నేను దాచే ప్రయత్నం చేయలేదు.

“సరే. నేను మాట్లాడతానులే.”

వాడు ఎర్రబారిన కళ్లతో నా వంక తదేకంగా చూశాడు. “మాట్లాడండి. ఒక్క విషయం గుర్తుంచుకోండి. ఆమె లేకపోతే నేను జీవించలేను.”

నాకు కోపం వచ్చింది. “ఏమిటీ పిచ్చి ధోరణి?” అని అరిచాను. “ఇలా మాట్లాడడానికి సిగ్గుగా లేదూ!” అని కసురుకున్నాను.

కానీ వాడు నన్ను పూర్తిగా మాట్లాడనివ్వలేదు. బల్లపైవాలి బిగ్గరగా ఏడవడం మొదలు పెట్టాడు. నేను నిశ్శబ్దంగా వాడి తలపై చెయ్యి వేసి ఓదార్చబోయాను. కానీ చోబట్ హఠాత్తుగా లేచి నా చేయి పట్టుకున్నాడు.

“క్షమించండి. నేనొక తలనొప్పిగా మారాను. కానీ నేనేం చేయలేను. నేను అలాంటివాడిని. మీకు అన్నీ తెలుసు. అన్నీ చూశారు. కాళ్లు పట్టుకుంటాను. నటాషా లేకుండా నేను బతకలేను” అన్నాడు.

ఆ రాత్రంతా నేను చోబట్‌తో మాట్లాడుతూ ఉన్నాను. జీవితపు ఔన్నత్యం, అద్భుతంగా బతికేందుకు గల అవకాశాలు, మానవ జీవితంలో లభించగల ఆనందం గురించి చెప్పాను. బతుకుని అతి జాగ్రత్తగా నిర్మించుకోవలసిన అవసరం గురించి, నటాషా చదువుకోవలసిన అవసరం గురించి,

ఆమెకు గల శ్రద్ధాసక్తులు, తెలివితేటల గురించి వివరించాను. ఆమె బాగా చదువుకుంటే నీకు ఉపయోగమని చెప్పే ప్రయత్నం చేశాను. నటాషావంటి యువతి ఒక పల్లెటూరులో మగ్గిపోరాదని, ఆమెకు మంచి భవిత ఉందనీ వొప్పించబోయాను. నా ఈ మాటలేవీ చోబట్‌ని కదలించలేదు. నా మాటల్ని వాడు చివరికంటా మౌనంగా, విచారంగా విన్నాడు.

"నటాషా కావాలి. నాతో రావాలి. అందుకు ఏమైనా చేస్తాను" అన్నాడు చివరిలో. నేను అతన్ని ఆ పూటకు అలా వదిలేశాను. మర్నాడు సాయంత్రం నటాషాను పిలిపించి మాట్లాడాను. ఆమె మౌనంగా ప్రశ్నలు వింది. తరువాత కళ్లెత్తి నావంక చూస్తు ప్రశ్నించింది.

"చోబట్ నన్ను కాపాడాడు... నిజమే. కానీ నాకు చదువుకోవాలనుంది."

"అంటే అతనితో వెళ్లవా? అతన్ని పెళ్లాడవా?"

"నాకు చదువుకోవాలని వుంది. కానీ మీరు వెళ్లమంటే అతనివెంట వెళ్తాను."

నిర్మలమైన ఆమె కళ్లలోకి చూశాను. "చోబట్ మానసికస్థితి ఎలా ఉందో తెలుసా" అని అడగాలనిపించింది. కానీ అడగలేకపోయాను.

"సరే వెళ్లి, పడుకో" అని అన్నాను.

"అంటే నేను అతని వెంట వెళ్లక్కర్లేదా?" అని నటాషా చిన్నపిల్లలా ఉత్సాహంతో ప్రశ్నించింది.

"అక్కర్లేదు. చదువుకో" అని బదులిచ్చాను. నేను చోబట్ గురించే ఆలోచిస్తున్నాను. ఆమె గదిలోంచి వెళ్లడాన్ని కూడా గమనించలేదు.

మరునాటి ఉదయం చోబట్ నా గది వద్దకు వచ్చి తలుపు అవతలే నిలబడి నా వంక పరీక్షగా చూశాడు. నేను తల వంచుకుని బల్లపై తాళం చెవులగుత్తిని పరిశీలిస్తున్నాను. ఉన్నట్టుండి అడిగాడు.

"అంటే నటాషా నాతో రానని తేల్చి చెప్పిందా?"

నేను అతని వంక చూశాను. వాడికి తన బాధ తప్ప మరేం పట్టడంలేదని తెలుస్తోంది. ఒక భుజాన్ని తలుపునకు ఆన్చి నిలుచున్నాడు వాడు. ఆకాశంలోకి చూసి ఏదో గొణిగాడు. "చోబట్" అని అరిచాను నేను.

వాడు పట్టించుకోలేదు. తిన్నగా నిలబడి, గిర్రున వెనుదిరిగి వెనక్కి చూడకుండా సూటిగా నడుచుకుంటూ వెళ్లిపోయాడు.

ఆ సాయంత్రం చోబట్ పనిచేసే డిటాచ్‌మెంట్ కమాండర్‌ని పిలిచి "వాడెలా ఉన్నాడని" ఆరా తీశాను.

మౌనంగా తన పనేదో తాను చేసుకుపోతున్నాడని సమాధానం వచ్చింది.

"వాడినో కంట కనిపెట్టండి. ఏమన్నా తేడా కనిపిస్తే తక్షణం నాతో చెప్పండి" అని ఆదేశించాను.

15

కష్టకాలం

ఆ తరువాత రెండు రోజులకు, మే 3 న చోబట్ ఉరిపోసుకున్నాడు.

తెల్లవారుజామున రాత్రి వాచ్‌మెన్ డ్యూటీలో ఉన్న డిటాచ్‌మెంట్ కుర్రవాళ్లు నన్ను నిద్ర లేపారు. కిటికీ మీద వారు తట్టిన శబ్దం వినగానే, ఏదో ఉపద్రవమే జరిగిందని నాకు తోచింది. అప్పటికే పిల్లలు తాడుకోసి చోబట్‌ను కిందికి దింపారు. లాంతర్ల వెలుగులో వాడిని బతికించే ప్రయత్నం చేస్తున్నారు. టీచర్ ఎకతెరీనా, పిల్లలు కలసి మొత్తానికి వాడికి ఊపిరి పోయగలిగారు. కానీ వాడికి మళ్లీ స్పృహ రాలేదు. ఆ సాయంత్రం చోబట్ మరణించాడు. పట్టణం నుంచి వచ్చిన

వైద్యులు చోబట్‌ని పరీక్షించారు. ఎవరు ప్రయత్నించినా చోబట్‌ను బ్రతికించడం అసాధ్యమయ్యేదని, ఆత్మహత్యాయత్నంలో అతని వెన్నుముక విరిగి పోయిందని చెప్పారు.

ఈ మరణవార్తను విన్న పిల్లలు జాగ్రత్తగా స్పందించారు. ఎవరూ పెద్దగా విచారం వ్యక్తం చేయలేదు. ఒక ఫెడరెంకో మాత్రం "పాపం అనవసరంగా ప్రాణాలు తీసుకున్నాడు. బతికుంటే ఓ సైనికుడు అయేవాడు" అని వ్యాఖ్యానించాడు.

చోబట్ మృతదేహంతో శవపేటికను క్లబ్‌వద్ద ఉంచినప్పుడు కోవల్ ఆ దిశగా మిర్రిమిర్రి చూశాడు. మృతదేహం గౌరవార్థం అక్కడ నిలిచేందుకు నిరాకరించాడు. అసలు అంత్యక్రియలకే రాలేదు. "చోబట్‌లాంటి వాళ్లను నేనే ఉరి తీస్తాను. ఇలాంటి వాళ్లు తమ వెర్రిపనులతో జనం కాళ్ల కింద నిప్పులు పోస్తారు" అన్నాడు.

ఆడపిల్లలు మాత్రం ఈ విషాదాన్ని తట్టుకోలేక ఏడ్చారు. చివరకు మరుస్యా లెవచెంకో కళ్లు తుడుచుకొని ఓ నవ్వు నవ్వింది.

"ఉత్త చవట. బుర్రలేని మనిషి. అటువంటి మనిషితో ఎవరైనా ఎలా కలిసి ఉండగలరు? మన నటాషా అదృష్టవంతురాలు. ఆమె అతను కోరినట్టు ఆ పల్లెటూరికి వెళ్లకపోవడం మంచిదైంది. అయినా ఈ ప్రపంచంలో చాలా మంది చోబట్‌లు ఉన్నారు. అందర్నీ ఆమె సంతోషంగా ఉంచలేదు కదా. అందులో కొందరు ఉరేసుకుంటే వేసుకోనివ్వండి" అంది.

నటాషా ఏడవడంలేదు. కానీ నేను బాలికల గదిలోకి వెళ్లి ఆమెతో మాట్లాడడం మొదలు పెట్టినప్పుడు నా వంక భయంగా, ఆశ్చర్యంగా చూసింది. నెమ్మదిగా నన్ను అడిగింది.

"నేను ఇప్పుడు ఏం చేయాలి?"

నా బదులు మరూస్యా సమాధానం చెప్పింది.

"ఏం నువ్వూ వెళ్లి ఉరిపోసుకుంటావా? సంతోషించు. నీ దారికి అడ్డు తొలిగాడు. అందుకు సంతోషించు. వాడు కనుక బతికి ఉంటే జీవితాంతం నిన్ను చిత్రవధ చేసేవాడు. ఏం చేయాలా? ముందు రబ్‌ఫాక్‌లో చేరు. అప్పుడు ఆలోచించేందుకు చాలా వ్యవధి ఉంటుంది"

'సరే'నంది నటాషా.

"నేను తనకి సంరక్షకురాలిని. మీరేం బెంగపడకండి" అంది మరూస్యా నాతో. నటాషా దిగులుతో కృశించిపోవటం లేదని తెలిసి నా హృదయం తేలికైంది.

ఆ సాయంత్రం శవపంచాయితీకి అధికారి ఒకరు వచ్చారు. నటాషాను ప్రశ్నించవద్దని ఆయన్ని కోరాను. ఆయనకి విషయం అర్థమైంది. తెలివైనవాడిలా ఉన్నాడు. క్లుప్తంగా ఒక నివేదిక రాసుకున్నాడు. మాతో భోజనం చేసి తిరిగి వెళ్లిపోయాడు. చోబట్ మరణవార్త విని కాలనీకి వచ్చిన బొకోవా ఆ సాయంత్రం మాతోనే ఉండిపోయింది. ఆ రాత్రి అందరూ నిద్రలకు వొరిగిన తరువాత ఇవానోవిచ్‌తో కలిసి ఆమె నా గదికి వచ్చింది.

"మీ కాలనీవాసులు మనుషులుకాదు. పశువులు. తోటిమనిషి మరణిస్తే నవ్వుతున్నారు. ఆ లాపోట్‌గాడు మామూలు తరహాలో ప్రతి విషయాన్నీ వేళాకోళం చేస్తున్నాడు" అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేసింది. నేనేం మాట్లాడలేదు.

మర్నాడు మా రబ్‌ఫాక్ విద్యార్థులకు వీడ్కోలు చెప్పేందుకు స్టేషన్‌కు బయలుదేరాను. దారిలో వెర్షనెవ్ తన ఆలోచనలను, అనుభూతులను నాతో పంచుకున్నాడు. "వీళ్లకి, ఈ కుర్రవాళ్లకి విషయం అర్థం కాలేదు. జీవితం బరువని తోచి ఒకమనిషి ఆత్మహత్య చేసుకున్నాడు. కానీ వీళ్లందరూ

చోబట్ ఆ పని చేసినది నటాషా కోసం అనుకుంటున్నారు. కానీ సంగతేమిటంటే వాడు తన జీవితాన్ని భరించలేకే అంతం చేసుకున్నాడు.”

బెలూఖిన్ అతనితో విభేదించాడు. “అదేం కాదులే. చోబట్ ఎన్నడూ సవ్యమైన రీతిలో బతకగలిగేవాడు కాదు. వాడు చేవగల మనిషి కాదు. ఒక బానిస. వాడికి కావలసింది ఒక యజమాని. అలాంటి వారెవరూ లేరు. అందుకే వాడు నటాషాలో ఒక దేవతను చూసేందుకు ప్రయత్నించాడు” అన్నాడు.

కరబనోవ్ ధోరణే వేరు. “మీరు మరీ ఆలోచించి బుర్రలు చెడగొట్టుకుంటున్నారు. ఒక మనిషి ఆత్మహత్య చేసుకున్నాడు. సరే అతని ఇష్టం. మనం ఏం చేయగలం. వాడిక లేడు. జ్ఞాపకాల్లోంచి తుడిచేయండి. రేపటి గురించి ఆలోచించండి. నాకేమనిపిస్తోందో చెప్పనా? ముందు కాలనీని ఇక్కడి నుంచి మార్చేయాలి. లేకుంటే అందరూ ఉరిపోసుకోవాల్సిందే” అన్నాడు.

తిరిగి వస్తూ దారిలో ఆలోచించాను. కాలనీ నిజంగానే పెను సంక్షోభంలో పడింది. ఇంతకాలం ఎంతో అద్భుతమైన విషయాలనుకున్నవే కాలనీ మనుగడని అనుమానంలో పడేస్తున్నాయి. వ్యక్తుల ఇష్టాఇష్టాలు, వారి సొంత పద్ధతులు, ఆశలు, ఆకాంక్షలు మొత్తం సమూహాన్ని సంక్షోభంలోకి నెట్టలేవు. వ్యక్తిగత ఆకాంక్షలంటే ఏముంటాయి. రేపటి రొట్టె ఎక్కడి నుంచి వస్తుందన్న ఆలోచన తప్ప? అవికాక అర్హతలనేవి ఎవరికి వారికి అతి ముఖ్యంగా తోచవచ్చు. వడ్రంగో, చర్మకారుడో, మిల్లు కార్మికుడో కావడమేనా అర్హతలు సంపాదించడం అంటే? కాదు. కానేకాదు. మన సోవియట్ వ్యవస్థలో పదహారేళ్ల కుర్రవాడు అంటే ఒక మంచి యోధుడై ఉండాలి. అంతకంటే మంచి మనిషి అయి ఉండాలి. మా కాలనీ కుర్రవాళ్ల సామర్థ్యం శక్తియుక్తుల గురించి ఆలోచిస్తుంటే ఉన్నట్టుండి లోపం ఏమిటో అర్థమైంది. ఇంతకాలం ఆ విషయం తట్టనందుకు ఆశ్చర్యం కలిగింది. ప్రస్తుత సంక్షోభానికి అసలు కారణం స్తబ్దత. ఐదేళ్లలో మేం ఎంతో సాధించి ఉండవచ్చు. కానీ కొంతకాలంగా మేం అడుగు ముందుకు వేయడం లేదు. మా కాలనీని స్తబ్దత ఆవరించింది. నిలవనీరులా అయిపోతున్నాం. అవును రెండేళ్లుగా కాలనీ దినచర్యలో ఎటువంటి మార్పులేదు. అవే పొలాలు, అవే పూలతోటల్లో అక్కడే పని. అవే కార్ఖానాల్లో శ్రమ. ఏడాది పొడవునా మార్పులేని జీవితాలు. నేను వేగంగా కాలనీ చేరాను. నేను కనిపెట్టిన విషయం నిజమోకాదో తెలుసుకునేందుకు కాలనీ వాసులు పరీక్షించాలని తొందరపడ్డాను.

కానీ, కాలనీ చేరేసరికి అక్కడ రెండుబళ్లు ఆగి ఉండడం గమనించాను. వాళ్లు పట్టణం నుంచి వచ్చిన తనిఖీ అధికారులు. ఈసారి ముగ్గురు, ల్యుబోవ్ జురిన్‌స్కయాతోపాటు మరో ఇద్దరు. ఒకామె వర్వారా బ్రెగెల్, మరొకాయన చైకిన్. వీళ్లంతా మరోసారి క్రమశిక్షణకు నేను ఉపయోగించే పద్ధతులను పరిశీలించి నన్ను సంస్కరించేందుకు వచ్చారు. రోజంతా వాదోప వాదాలు. నేను సుదీర్ఘంగా నా ఉద్దేశాల గురించి ప్రసంగించాను. వచ్చిన వారిలో చైకిన్ నాకంటే సుదీర్ఘంగా మట్లాడాడు. నేనేం పట్టించుకోలేదు. పద్ధతుల గురించి బోధనా వ్యవహారాల శాస్త్రీయమండలి ఆలోచించాలి.

ఆ రాత్రి బ్రెగెల్ నిదురపోయేందుకు సిద్ధమవుతూ నాతో ఒక్క క్షణం మాట్లాడింది. చోబట్ ఆత్మహత్య విషయంలో ఎవరూ నన్ను తప్పు పట్టడంలేదని తెలిసింది.

నేను కృతజ్ఞతలు తెలియజేశాను.

16

మార్పుకు ఒక అవకాశం

మళ్లీ వేసవి వచ్చింది. పొలం పనులు ఉధృతంగా సాగుతున్నాయి. రబ్‌ఫాక్‌లోని మా కుర్రవాళ్లు సెలవులకు కాలనీకి వచ్చారు. కరబనోవ్ తన స్నేహితురాలు గాల్యా అనే యువతిని కాలనీకి తీసుకొచ్చాడు. జదరోవ్ తన స్నేహాన్ని అపార్థం చేసుకొని కాలనీకి ఉత్తరాలు రాశాదని, నిజానికి సెలవులకు వెళ్లేందుకు ఆమెకు ఒక చోటంటూ లేనందువల్లనే తానామెను కాలనీకి తీసుకొచ్చాననీ చెప్పాడు. ఆమెకు మా కాలనీ వాతావరణం అక్కడి పద్ధతులు సహజంగానే ఆశ్చర్యం కలిగించాయి. ఆమెతో మా వాళ్లు సులభంగా స్నేహం చేశారు. గాల్యా సైతం కుర్రవాళ్లతో ఒక్కరోజులో కలిసిపోయింది.

ఈ రోజుల్లోనే జురిన్‌స్కయా నుంచి మాకో లేఖ అందింది. జుసోరోజియే ప్రాంతంలోని హోర్టిస్టా ద్వీపంలో అతిపెద్ద పిల్లల కాలనీ ఏర్పాటు చేసే ఉద్దేశం విద్యాశాఖకు ఉన్నదని మా గోర్కీకాలనీయే దాని నిర్వహణాబాధ్యతలు చేపట్టవలసి రావచ్చనీ ఆమె తెలిపింది. దానికి విద్యాశాఖ డ్నెపర్ ప్రాజెక్టు అని పేరుపెట్టింది. తుది నిర్ణయం తీసుకోడానికి కొంత సమయం పడుతుందని జురిన్‌స్కయా తెలియచేసింది.

ఏమైతేనేం. ఏదో మార్పు రాబోతోందన్న ఆనందం కాలనీని ఆవరించింది. కొత్త కాలనీలో పరిస్థితులు ఎలా ఉంటాయో పిల్లలు ప్రతి సాయంత్రం చర్చించేవారు. దీనికోసం కొన్ని పుస్తకాలు చదివారు. పిల్లలంతా ఎప్పుడు అక్కడికి మారతామా అని ఆసక్తితో ఎదురు చూసేవారు. రోజులు గడుస్తున్నా విద్యాశాఖ నుంచి ఎటువంటి సమాచారం అందకపోవడంతో చివరికి విసుగెత్తి ఆ విషయాన్ని మరచిపోవడానికి ప్రయత్నించారు. ఎటు తిరిగి మా వ్యవసాయం, పళ్ల తోటలు, పూలతోటలు, పందుల పెంపకం, ఆశ్వశాల నిర్వహణ వంటి పనులు మాకు ఉండనే ఉన్నాయి. ఈలోగా సెలవులు పూర్తి కావడంతో రబ్‌ఫాక్ విద్యార్థులు పట్టణానికి ప్రయాణం కట్టారు.

ఈ ఏడాది కొత్తగా మరో ఐదుగురు కాలనీ కుర్రవాళ్లు రబ్‌ఫాక్‌కు ఎంపికయ్యారు. వీళ్లలో నా ఆప్తమిత్రుడు, అత్యంత సన్నిహితుడు, కాలనీ ప్రారంభించిన నాటినుంచీ మాతో ఉన్న బ్రాచెంకో ఒకడు. మొదట్లో తుంటరిగా ప్రవర్తిస్తూ తర్వాతి కాలంలో ఎన్నో బాధ్యతలు నిర్వహించిన ఒసాడ్చీకూడా వెళ్లిపోతున్నాడు. వాడికి ఖార్కోవ్‌లోని సాంకేతిక శిక్షణాలయంలో అవకాశం లభించింది. వీళ్లతో పాటే జార్జివ్‌స్కీ, షినీదర్, మరూస్యాలు పట్టణానికి పయనమయ్యారు.

వీళ్ల స్థానంలో అంతవరకూ పసిపిల్లలుగా మేం పరిగణించిన కుర్రవాళ్లు వివిధ డిటాచ్‌మెంట్‌ల కమాండర్‌లుగా బాధ్యతలు స్వీకరించారు. వీళ్ల సారధ్యంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా మొదలయ్యాయి. సరిగ్గా అప్పుడే విద్యాశాఖ నుంచి మాకో లేఖ అందింది. డ్నెపర్ దీవిలోని పాపోవ్ ఎస్టేట్‌ని ఒకసారి తనిఖీచేసి రమ్మని ఆదేశాలు అందాయి. దీంతో పాటు పాపోవ్ ఎస్టేట్‌ను మాకు అప్పగించాలని జపరోజియే ప్రాంతీయ కార్యనిర్వాహక మండలిని ఆదేశిస్తూ మరో లేఖ కూడా మాకు అందింది. ఈ రెండోలేఖను చూపించి పాపోవ్ ఎస్టేట్‌ను మేం స్వాధీనం చేసుకోవాలి. దీనితో మా జీవితాల్లో పెనుమార్పు రాబోతోందని అందరికీ అర్థమైంది. సాయంత్రం జరిగిన కాలనీ సమావేశంలో పాపోవ్ ఎస్టేట్‌ను తనిఖీ చేసేందుకు నాతోపాటు మిట్కా అనే కుర్రవాడిని పంపాలని నిర్ణయించారు. మిట్కాకు అప్పటికి పదిహేనేళ్లు. వాడు వయసుకు మించిన పొడుగు

ఉండేవాడు. అప్పటికే ఆ కుర్రవాడు మిశ్రమ డిటాచ్‌మెంట్‌ల కమాండర్‌గా అపార అనుభవం సంపాదించాడు. ఏడాదిగా కొమ్సొమోల్ సభ్యుడు. ఆ వయసుకే వాడికి ఎన్నో విషయాల్లో పరిజ్ఞానం లభించింది. తొలి రోజు నుంచే ఈ కుర్రవాడు కరబనోవ్ శిష్యునిగా పనిచేశాడు. అందుకే వీడికి కరబనోవ్ ఉత్సాహం, నేర్పు, పట్టుదల, సహనం అలవడ్డాయి.

నవంబర్ ఆఖరులో మంచుపడని ఒక రోజున నేనూ, మిత్కా కాలనీ నుంచి బయలుదేరాం. ఇరవై నాలుగు గంటల ప్రయాణం తరువాత మా గమ్యం జపరోజియే చేరుకున్నాం. అక్కడ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్ మమ్మల్ని ఆప్యాయంగా ఆహ్వానిస్తాడనీ, పాపోవ్ ఎస్టేట్‌ను ఆనందంగా మా స్వాధీనం చేస్తాడని, దారి తెలుసుకొని ఒకసారి అక్కడికి వెళ్లి చూసి, కాలనీకి తిరిగివెళ్లి అందరినీ తొందరపెట్టి ప్రయాణం చేయించవచ్చనీ మేం అమాయకంగా అంచనా వేశాం. అంతే తప్ప పాపోవ్ ఎస్టేట్ మాకు నచ్చకపోవచ్చన్న ఊహే రాలేదు. ఎందుకంటే పట్టణంలో బ్రెగెల్ మాతో మాట్లాడుతూ కూడా ఈ ఎస్టేట్ గురించి గొప్పగా చెప్పింది. జురిన్స్కయా ఆమెకు వంతపాడింది. "పాపోవ్ ఎస్టేట్ అద్భుతంగా ఉంటుంది. పిల్లల కాలనీ కోసమే ఏర్పడినట్టుంది" అని ఆమె హామీని ఇచ్చింది. చివరకు బొకోవా ఉద్దేశం కూడా అదే. అందరూ అదే చెబుతుంటే మాకు ఎలాంటి అనుమానమైనా ఎందుకు కలుగుతుంది. పైగా అందరికీ ఆ ఎస్టేట్ పరిచయం అవడమే విశేషంగా కనిపించింది.

జపరోజియే ప్రాంతీయ కార్యనిర్వాహక కమిటి ఛైర్మన్ మమ్మల్ని సాదరంగానే ఆహ్వానించాడు. కానీ మేం అందించిన లేఖ చదివి నొసలు చిట్లించాడు. "పాపోవ్ ఎస్టేట్‌ని అప్పగించాలా? అక్కడ రైతుల కమ్యూన్ ఒకటుందే. అయినా గోర్కీకాలనీ ఏమిటి?" అని మమ్మల్నే ప్రశ్నించాడు. ఆయన మా ఇద్దరి వంక తదేకంగా చూశాడు. ఎందుకో మిత్కాయే అయన్ని ఆకట్టుకొన్నట్టుంది. వాడివంక చూసి నవ్వుతూ అడిగాడు.

"ఇలాంటి కుర్రవాళ్లే ఎస్టేట్ బాధ్యతలు నిర్వర్తిస్తారా?" అని స్నేహపూర్వకంగానే అడిగాడు.

మిత్కాకి అవమానంగా తోచినట్టుంది. "మాకేం తక్కువ. ఆ ముఝిక్‌లకంటే మేం బానే బాధ్యతలు నిర్వహించగలం" అన్నాడు పెంకెగా.

"ఓహో రైతులను మీరు ముఝిక్‌లని పిలుస్తారా? బానే ఉంది" అంటూ నిజంగానే రైతుల నిర్వహణలో ఎస్టేట్ పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నదన్న రహస్యం మాకు చెప్పాడు.

ఎస్టేట్‌లో పదిహేనువందల హెక్టార్ల వ్యవసాయభూములున్నాయని, అంత పెద్ద వ్యవహారంపై తుది నిర్ణయం తీసుకునే అధికారం తమకు-ప్రాంతీయ కార్యనిర్వహక కమిటీకి లేదని ఆయన వివరించాడు. వ్యవసాయ విభాగం అనుమతి అవసరమని చెప్పాడు. మాకు ఒక కారు ఇవ్వగలనని, వెళ్లి ఎస్టేట్‌ను చూసి అక్కడ రైతుల కమ్యూన్ పెద్దలతో స్వయంగా మాట్లాడమనీ, వీలైతే వారితో ఏదో ఒప్పందం కుదుర్చుకోగలమనీ సూచించాడు. అయితే తుది నిర్ణయం మాత్రం ఖార్కోవ్‌లోని వ్యవసాయ విభాగమే తీసుకోవాలని స్పష్టం చేశాడు.

నేనూ, మిత్కా వెళ్లి పాపోవ్ ఎస్టేట్‌ని చూశాం. దాని అందానికి ముగ్ధులమయ్యాం. సువిశాలమైన పచ్చికబయళ్ల అంచున ఏటవాలు దిబ్బలు పొడుచుకువచ్చాయి. వాటి మధ్య నుంచి కారీ-బెక్రాక్ ఒక నదిలాకాక సన్నని తిన్ననైన కాలువలా ప్రవహిస్తోంది. వీటన్నిటి వెనుక అతి ఎత్తైన గోడలతో అనేక కోటలు ఉన్నాయి. దూరం నుంచి గమనిస్తే ఆ కోటలపై కప్పులన్నీ కలిసిపోయినట్టు గజిబిజిగా కనిపించింది. అయితే అంత అందమైన నిర్మాణాలకు వాటి కిటికీలు మచ్చల్లా అగుపించాయి.

ఒక పెద్ద గేటు గుండా మేం ఆ ఆవరణలోకి ప్రవేశించాం. దారి అంతా రాతిపలకలు పరిచిఉన్నాయి. ఆ రాతి పలకల మధ్య ఎండిపోయిన, చలికి కొరుకుడుపడిన ఉక్రైన్ గడ్డి పొదవునా పైకి కనిపిస్తోంది. ఇక్కడ ఉన్న అన్నిరకాల పశువులూ స్వేచ్ఛగా విహరిస్తాయని, అవి వదిలిన చిహ్నాలు చూస్తే అర్థమైంది. మేం మొదటి భవనంలోకి వెళ్లాం. అది ఖాళీగా ఉంది. హాల్లో చేతులు, కాళ్లూ లేని శిల్పం ఒకటి దొర్లుతోంది. ఈ భవనాల మరమ్మతు గురించి అంచనా వేశాను. ఫరవాలేదు. ఆందోళన చెంద నవసరం లేదు. తలుపులు, కిటికీలు అమర్చాలి. పగిలిన నేలను బాగు చేయాలి. గోడలు, మెట్లు, పై కప్పు, స్టవ్వులూ అన్నీ యథాతథంగా పనికొస్తాయి. మరమ్మత్తులు కూడా అవసరం లేదు.

నేను ఇలా అంచనాలు వేస్తుంటే మిట్కా మాత్రం ఆ అందచందాలకు మురిసిపోతూ అంతా కలియతిరుగుతున్నాడు. "అబ్బ ఎంత అద్భుతంగా ఉన్నాయి ఈ భవనాలు, ఆవరణ! మనవాళ్లు ఆనందంతో తబ్బిబ్బవుతారు. నా మాట నమ్మండి. ఇక్కడ ఎంత మంది పిల్లల్ని ఉంచవచ్చంటారు? వెయ్యి మందికి సులభంగా సరిపోతుంది కదా!" అని మాట్లాడుతున్నాడు.

నా అంచనా ప్రకారం ఈ ప్రదేశం ఎనిమిది వందలమందికి సరిపోతుంది. "కానీ అంత మందిని మనం నియంత్రించగలమంటారా? పైగా మన సీనియర్ కమాండర్లంతా రబ్‌ఫాక్‌లో ఉన్నారు?" అంటూ మిట్కా అనుమానం వెలిబుచ్చాడు.

అవన్నీ యోచించేందుకు ఇది సమయం కాదు. మేం ఇద్దరం కలిసి ఆ ఎస్టేట్ వెనుక పెరటిలోకి వెళ్లాం. దాని నిర్వహణా బాధ్యతలు చూస్తున్న రైతుల కమ్యూన్ ఎంత సమర్థమైనదో ఒక్క క్షణంలో అర్థమైంది. సువిశాలమైన అశ్వశాల అంతా పేడకుప్పలమయంగా ఉంది. వాటి మధ్య ఎలాంటి సంరక్షణాలేని గుర్రాలు దీనంగా నిలబడి ఉన్నాయి. వాటి ఎముకలు పొడుచుకొచ్చి కనిపిస్తున్నాయి. పందుల కొట్టం సైతం ఇందుకు భిన్నంగా లేదు. కొట్టంలో ఎక్కడ పడితే అక్కడ గోడలకు, పైకప్పుకీ కన్నాలు. అతికొద్ది పందులే అక్కడ మిగిలాయి. అవరణలో మంచు దిబ్బలపైనే అనేక బళ్లు, విత్తులు నాటే యంత్రాలు, బండి చక్రాలు, ఇంకా అనేక వ్యవసాయ పరికరాలు అడ్డదిడ్డంగా పడి ఉన్నాయి. వీటికి తోడు ఆవరణ అంతా చెత్త, మురికి కుప్పలు. పందుల కొట్టంలో మాత్రం మాకు ఒక వృద్ధుడు కనిపించాడు.

"కమ్యూన్ ఆఫీసు కోసం చూస్తున్నారా? అది ఆ మూల ఉంది" అని చూపించాడు.

"ఇక్కడ పందులేవీ?" ప్రశ్నించాడు మిట్కా.

"ఏ పందులు...?" అంటూ ఆ ముసలాయన తన బక్కచిక్కన వేళ్లతో మీసాన్ని సవరించు కున్నాడు. "ఓహో... పందులా? వాటిని తినేశారు. వెధవలు" అన్నాడు కచ్చగా.

"ఎవరూ?"

"ఇంకెవరూ? మా వాళ్లే. ఇక్కడ కమ్యూన్ ఉందే...వాళ్లు."

"అయితే తాతా! నువ్వు కమ్యూన్‌లో లేవా?" మిట్కా ప్రశ్నించాడు.

"నేనా; కమ్యూన్‌లోనా? నేను ఆ కమ్యూన్‌లో తోడేళ్ల మందలో మేకపిల్లననుకో. ఇక్కడ ఎవరైతే పెద్దగా గొంతు పెట్టుకు అరవగలరో వారే పెద్దలు. వృద్ధులకు ఏ పదవీ ఇవ్వరు. ఇంతకీ మీరెవరు అబ్బాయ్?" అడిగాడాయన.

"మేం. పని మీద వచ్చాంలెండి"

"ఓహో. పని మీద వచ్చారా? సరే ఆఫీసుకి వెళ్లండి. అక్కడ సమావేశం జరుగుతోంది. అంటే సమావేశం అన్నమాట. వాళ్లెప్పుడూ ఇలాంటి మీటింగులు పెడుతూనే ఉంటారు. దొంగవెధవలు."

మేం ఆఫీసు వైపుకు నడిచాం. అక్కడ అడ్డదిడ్డంగా ఉన్న కుర్చీల్లో అనేకమంది కూర్చుని ఉన్నారు. సమావేశం నడుస్తోంది. ఆ గదిలో వ్యాపించిన పొగవల్ల అక్కడ ఎంత మంది ఉన్నారో కూడా అర్థం కావడంలేదు. అయితే వందమందికిపైగా ఉన్నంత గోలగా ఉంది. వాళ్లేం మాట్లాడు కుంటున్నారో కూడా అర్థం కాలేదు. ఈలోగా ఉంగరాల జుట్టు కలిగిన ఒక నల్లగడ్డం మనిషి మమ్మల్ని పలకరించాడు. ఏ పనిపై వచ్చారని అడిగాడు. సంభాషణ మొదలైంది. మేం వివరాలు చెప్పగానే వాళ్లకి ఆగ్రహం కలిగింది. ద్వేషం నిండిన గొంతులతో మాతో దెబ్బలాటకు దిగారు. వాదించారు. రెండుగంటల హోరాహోరీ వాదనల తరువాత పరిస్థితి అదుపులోకి వచ్చింది. అంటే కాస్త మాట్లాడుకునే వాతావరణం ఏర్పడింది. ఈ కమ్యూన్ సభ్యులు కేవలం సామర్థ్యం లేని వారన్న నా అంచనా తప్పు. ఎందుకంటే వీళ్లు పూర్తిగా రోగగ్రస్థులు. అయితే ఆ విషయాన్ని ఆమోదించి ఎస్టేట్‌ను అప్పగించేందుకు వారెంత మాత్రం సిద్ధంగా లేరు. అంతగా కావాలంటే అక్కడి భవనాలన్నింటినీ మాకు స్వాధీనం చేసేందుకు సిద్ధమన్నారు. ఈ కాస్త కమ్యూన్‌కు పదిహేను వందల హెక్టార్ల భూమి భారమవుతోందని, అసలు ఈ అర్థంలేని సంపదవల్లే మిమ్మల్ని ఈ పేదరికం పీడిస్తోందని వారికి నచ్చచెప్పేందుకు ప్రయత్నించాం. ఒక దశలో మిట్కా సహనం కోల్పోయి వాళ్లతో వ్యక్తిగత స్థాయిలో దెబ్బలాటకు దిగాడు. మొత్తానికి ఆ సాయంత్రానికి వ్యవసాయభూమి, భాగాలు చేసేందుకు వాళ్లని ఒప్పించగలిగాం. పూర్తిగా అలిసిపోయిన మేం గోర్కీకాలనీ ఎలా చేరామో నాకు గుర్తేలేదు. కాలనీ సమావేశంలో మా పర్యటన విశేషాలను వివరించాం. కుర్రవాళ్లు ఆనందంతో అల్లరి చేశారు. నన్ను, మిట్కాను ఆకాశానికి ఎత్తేశారు. మా ఇద్దరినీ భుజాల పైకి ఎక్కించుకొని గాలిలోకి ఎగరేశారు. ఆ సందడిలో నా కళ్లజోడు దాదాపు పగిలిపోయింది. పాపం మిట్కాకు ముక్కు, నుదుటిపై చిన్నపాటి దెబ్బలు తగిలాయి.

మా పిల్లల ఉత్సాహం చూసి విద్యాశాఖాధికారి బ్రగెల్ నన్ను మందలించింది. "మీరు ఎలాంటి పిల్లల్ని పెంచుతున్నారు సెమ్యోనోవిచ్-కలల్లో బతికేవారినా?" అని నన్ను నిలదీసింది.

వాళ్లు కలల్లోనే బతికితే మాత్రం ఏమైంది? నా మటుకు నాది కలలుకనే తత్త్వంకాదు. అదేదో ఆడపిల్లల వ్యవహారంలా తోస్తుంది. కానీ కలలు అంటూ ఉండకుండా పోతాయా? గుర్రం మీద వచ్చే రాకుమారుడి కోసం కలలు కనడం తప్పేమో. కానీ పిల్లలకాలనీలో ఎనిమిది వందల మంది బాలబాలికల నిర్వహణ బాధ్యతను చేపట్టాలనుకోవడంలో తప్పేమిటి? మొదట్లో ఆ మురికి, ఇరుకు చీకటి గదుల్లో ఉన్నప్పుడు ఇప్పటి విశాలమైన, వెలుగునిండిన గదుల గురించి కలలు కనలేదూ? చలిలో మంచులో పాదాలకు చింకిగుడ్డలే చుట్టుకు తిరిగిన రోజుల్లో నిజమైన పాదరక్షల గురించి కలలు రాలేదూ? రబ్‌ఫాక్ గురించి, కొమ్సొమోల్ గురించి ఎన్ని కలలని! మొలొడెట్స్‌లాంటి నిజమైన గుర్రం ఉండాలనీ, శ్రేష్టమైన ఉత్తమజాతి ఆవులు కావాలని కోరుకోలేదూ? నేను ఒక గోనెసంచిలో రెండు ఇంగ్లీషు పందిపిల్లలను తెచ్చినప్పుడు మా కుర్రవాడు షెలాపుటిన్ ఏమన్నాడు? ఎత్తైన బెంచీపై కళ్లు గాలిలో ఊపుతూ వాడు పైకప్పు వంక చూస్తూ, అర్ధనిమీలిత నేత్రాలతో ఏమన్నాడో మరిచిపోతే ఎలా?

"ఇప్పుడు మా దగ్గర రెండు పంది పిల్లలున్నాయి. త్వరలోనే వాటి సంఖ్య పెరుగుతుంది. ఆ తరువాత మరింత పెరుగుతుంది. ఐదేళ్లలో మన కాలనీకి వంద పందులు ఉంటాయి. వంద.. హ్వా..హ్వా..హ్వా... వంద పందులు!" అన్నాడు. మరి మా వద్ద ఇప్పుడు వందకాదు, మూడువందల

బలిసిన పందులున్నాయి. ఆ షెలాపుటిన్ కలలు ఎవరికి గుర్తున్నాయి ఇప్పుడు? కాలనీలో ఉన్న పందుల సంఖ్య ఎంతో అందరికీ తెలుసు మరి.

అసలు మనం అనుసరించవలసిన విద్యా విధానానికి, బూర్జువాల విధానికి తేడా అంతా ఇదేనేమో. ఇక్కడ మన వద్ద సమూహాలుగా ఎదిగే పిల్లలు సుందరమైన భవిత గురించి కలలు కనగలరు. సమిష్టిగా ఆ కలలను సాకారం చేసుకోగలరు. మా కాలనీ పిల్లల ఆశలు, కలలను నిరుత్సాహపరిచేందుకు నేనేనాడు ప్రయత్నించలేదు. ఆ మాటకొస్తే నేను సైతం వారితో కలసి కలలు కన్నాను. మా భవిష్యత్తు పథకాల గురించి, మా పనుల గురించి ఉత్తరం రాసినప్పుడు మక్సీమ్‌గోర్కీ సైతం ఎంత అనందించారో? ఆయన కూడా మాతో కలిసి అందమైన కలలు కన్నారు.

అయితే పాపోవ్ ఎస్టేట్‌కు తరలివెళ్లడంపై అంత ఆసక్తి చూపనివాళ్లు కాలనీలో కొందరున్నారు. అందులో ఇవానోవిచ్ ఒకరు. హృదయానికి సంబంధించి ఆయన కుర్రవాడే. కానీ కలలు కనేందుకు అది ఒక్కటి చాలదేమో. ఆయన అక్కడకు మాతో రాలేనన్నాడు. ఇక జీవితంలో దేని గురించీ భయపడవలసిన పనిలేదనీ, అయితే వృద్ధాప్యం కారణంగా తాను పెద్దగా చేయగలిగిందేమీ ఉండదనీ అన్నాడు. నిస్సహాయంగా మాపై ఆధారపడి బతకలేనన్నాడు.

మా టీచర్లు ఒసిపోవ్ దంపతులు కూడా ఇప్పటికి ఎదురైన అనుభవాలు చాలన్నారు. ఇంకా ఎనిమిది వందలమందిని సాకే ఓపిక లేదన్నారు. పైగా నేను దుస్సాహసంతో చేతులు కాల్చుకో బోతున్నానని హెచ్చరించారు.

అయితే కాలనీలో మిగిలిన వారంతా కుర్రవాళ్లే కాక, సిలాంటిని, కోజిర్ ఇతర కార్ఖానాల పనివారు, అందరూ మా వెంట వచ్చేందుకు సిద్ధమయ్యారు. వ్యవసాయ శాఖ సైతం అయిష్టంగానైనా పాపోవ్ ఎస్టేట్ భూమిని మాకు అప్పగించేందుకు సిద్ధమైంది. ఇక కొత్త ఎస్టేట్‌కి వెళ్లడానికి అవరోధాలు ఏవీ లేవనుకుంటున్న తరుణంలో ఆర్థికశాఖ మా ఆశలపై నీళ్లు చల్లింది. కొత్త ఎస్టేట్‌కు రవాణాకు, అక్కడ మరమ్మత్తులు, యంత్రపరికరాలు, వ్యవసాయ పనిముట్లు, ఎరువులు కొనేందుకు అవసరమైన ముప్పైవేల రూబుళ్లు ఇవ్వలేమని ఆర్థికశాఖ అధికారి ఒకరు స్పష్టం చేశారు. నేనెంత వాదించినా లాభం లేకపోయింది.

కాలనీలో నిరాశ అలుముకొంది.

17

సరికొత్తపాఠం

పిల్లలంతా తీవ్ర నిరాశకు గురయ్యారు. విద్యాశాఖలో మా ప్రత్యర్థులు మమ్మల్ని ఆట పట్టించారు. అయితే మా కాలనీని ఇక్కడి నుంచి మార్చవలసిన అవసరాన్ని మాత్రం గుర్తించారు. ఎక్కడికి మార్చాలి? అనేక ప్రతిపాదనలు వచ్చాయి. విద్యాశాఖ అధికారులు, మా మిత్రులు పరిసర గ్రామపెద్దలు ఎన్నెన్నో సూచనలు చేశారు. ఉక్రైన్‌లో బీడు భూములుగా పడి ఉన్న అనేక ప్రాంతాలు, పాడుపడిన ఎస్టేట్లు అనేకం మా పరిశీలనకు వచ్చాయి. మేం కూడా ఈ అన్ని చోట్లకీ వెళ్లి కాలనీని అక్కడకు మార్చే అవకాశాలను అధ్యయనం చేశాం. కానీ వీటిలో ఏ ఒక్కటీ మా అవసరాలకు, భవిష్యత్తు అంచనాలకు తగినట్టుగా లేదు.

అలా అన్ని ప్రాంతాలూ తిరుగుతున్న రోజుల్లో ఒక్కసారి ఖార్కోవ్ పట్టణంలో పిల్లల సహాయ సంఘం అధికారులను కలవడం తటస్థించింది. ఆ విభాగం ఆధ్వర్యంలోని కుర్యాజ్ పిల్లల కాలనీ గురించి చర్చ జరుగుతోంది. యుర్యేవ్ అనే విద్యాశాఖ తనిఖీ అధికారి ఆ కాలనీలో నెలకొన్న

పరిస్థితిని ఆగ్రహంతో వివరిస్తున్నాడు. అతని గొంతులో వినిపిస్తున్న నిరసన, స్పష్టంగా తెలుస్తున్న అసహ్యం, అతని ఆందోళన, ఉద్వేగం, పరిస్థితిని వివరించేందుకు వాడుతున్న కటువైన పదజాలం గమనిస్తే అక్కడి పరిస్థితి చూచాయగా బోధపడింది. వింటున్న శ్రోతలకు కుర్యాజ్ కాలనీ అంటే పూర్తిగా చెడిపోయిన, పనికిరాని, బందిపోటు దొంగల సమూహమనే అభిప్రాయం కలిగింది.

నేనది సహించలేకపోయాను. బల్లపై గట్టిగా చరిచి "ఇదంతా నిజంకాదు. పుకార్లు అయి ఉంటాయి" అన్నాను.

కానీ యుర్యేవ్ నమ్మదగినవ్యక్తిగా కనిపించాడు. అతని కళ్లలో వేదన, ఆందోళనలు నాకు అర్థమయ్యాయి. అక్కడి పరిస్థితి ఎంతో ఆందోళనకరంగా ఉంటే తప్ప అతని కళ్లలో అంత విచారం అతని మొహంలో అంత విషాదం ఉండేవి కావు. ఈ సంగతి విద్యాబోధన రంగంలోని వారికి అర్థమవుతుంది. "ఇదంతా మీతో చెప్తున్నందుకు నేను సిగ్గుపడుతున్నాను. మీ కాలనీ గురించి విన్నాను. అక్కడ మీరు కుర్రవాళ్లలో ఎవరైనా క్రమశిక్షణను ఉల్లంఘిస్తే అరెస్టు చేస్తారుట? రోజంతా రొట్టె, నీరు తప్ప మరే ఆహారం ఇవ్వరట?" అన్నాడు.

నేను ఖండించాను. "నేను నిజంగా అలా చేస్తే గోర్కీ కాలనీ కూడా మీరు చెబుతున్న కుర్యాజ్ కాలనీలానే ఉండేది" అన్నాను. ఇద్దరి మధ్యా వాదోపవాదాలు సాగాయి.

అతను నన్ను భోజనానికి ఆహ్వానించాడు. అక్కడ మాటల్లో అన్నాడు. "అవునూ, మీరే కుర్యాజ్ కాలనీని ఎందుకు తీసుకోకూడదు?" అని.

"మా కెందుకు? పైగా ఆ కాలనీ నాలుగు వందలమంది కుర్రవాళ్లతో పూర్తిగా క్రిక్కిరిసి ఉంది" అన్నాను.

"అదే అభ్యంతరం అయితే, మీ కాలనీ పిల్లల కోసం కుర్యాజ్ నుంచి ఒక నూట ఇరవై మంది పిల్లలను వేరే చోట్లకి పంపుదాం. మిగిలిన రెండువందల ఎనభైమంది బాధ్యత స్వీకరించండి చాలు" అన్నాడు.

"నా కిష్టం లేదు. చెత్త పని. పైగా మీరు అడుగడుగునా అడ్డుపడతారు" అన్నాను.

"అదేం ఉండదు. మేమంటే మీకెందుకంత భయం? మీకేం కావలస్తే అది తీసుకోండి. మీ పనికి అడ్డుపడం. మీకు ఏం చెయ్యాలనిపిస్తే అది చెయ్యండి. కుర్యాజ్‌లో పరిస్థితి దారుణంగా ఉంది. రాజధాని పక్కనే అంతమంది మురాకోర్లు అలా పెరగడం ఎంత ప్రమాదమో ఆలోచించండి. వాళ్లు గత నాలుగునెలల్లోనే రహదారి దోపిడీల్లో పద్దెనిమిది వేల రూబుళ్ల సొత్తు దోచుకున్నారు."

"అలా అయితే అక్కడి సిబ్బంది అందరినీ ముందు ఉద్యోగాల్లోంచి సాగనంపాలి"

"సరే, అందర్నీ తీసేద్దాం"

"అబ్బేబ్బే నా ఉద్దేశం అది కాదు. మేం కుర్యాజ్ కాలనీకి వెళ్లం".

"అసలు మీరు ఆ కాలనీని చూశారా?"

"లేదు."

"అయితే ఓ పని చేద్దాం. మీరు ఈ రాత్రి ఉండిపోండి. రేపు మా పిల్లల సహాయ సంఘం ఛైర్మన్ ఖాలాబుదాతో కలిసి అక్కడికి వెళ్లి పరిస్థితి చూద్దాం"

దీనికి నేను అంగీకరించాను. మర్నాడు మేం ముగ్గురం కారులో కుర్యాజ్ కాలనీకి బయలు దేరాం. ఖాలాబుదాకు ప్రపంచంలో దేనిపైనా విశ్వాసం లేదు. ఇన్నేళ్లు తమ కమిటీ లక్షలాది

రూబుళ్లు నేరస్థులైన కుర్రవాళ్లపై వృథా చేసిందని ఆయన ధృఢవిశ్వాసం. రొట్టి చేసుకునేందుకు కాస్త రైపిండి ఉంటే సమస్యలన్నీ పరిష్కారం అయిపోతాయన్నది ఆయన సిద్ధాంతం.

"ప్రజలకు కావాల్సింది కావలసినంత రైపిండి మాత్రమే. ప్రజలకు కడుపునిండా తిండి ఉంటే ఏ సమస్యా ఎదురుకాదు. గోగోల్ గ్రంథాలు చదవమని, కుర్రవాళ్లని ఎంత పోరి ఏం లాభం; చివరకి వాడికి అవసరమైన రొట్టె ఇవ్వలేకపోతే వాడేం చదివినా ప్రయోజనం ఏమిటి? అదే ముందు వాడికి కడుపునింపండి. తరువాత ఆ పుస్తకమేదో చేతికివ్వండి. కానీ వాళ్లున్నారే; వాళ్లకి పొలంలో రై పండించడం చేతకాదు" అన్నడాయన.

"అంత చేతకాని వాళ్లా?" అని అడిగాను.

"వాళ్లా? ఉత్త శుంఠలు. మీరసలు వాళ్లని చూడాలి. ఎంతసేపూ సిగరెట్లకి, వొడ్కాకి డబ్బు అడగడం తప్ప వాళ్లకి మరో పని చేతకాదు."

అలా కారులో మాట్లాడుకుంటూ ఆరు కిలోమీటర్లు ప్రయాణించి చివరకు కుర్యాజ్ కాలనీ చేరుకున్నాం. ఆ ఆవరణ వెలుపల గల చర్చి బయట మెట్లపై వృద్ధ మహిళలు కొందరు కూర్చుని ఏదో గొణుక్కుంటున్నారు. అక్కడ అంతటా పురాతనమైన ఇళ్లు అనేకం తలోమూలా వ్యాపించి ఉన్నాయి. చర్చి వెనుక మూడు అంతస్తుల పాత భవనం. కొద్ది దూరంలో రెండు అంతస్తుల చెక్క కట్టడం ఉన్నాయి. ఇంకా అనేక వంటశాలలు, రకరకాల షెడ్‌లు, పనికిరాని కట్టడాలు అంతటా పరుచుకొని కనిపిస్తున్నాయి. కాలనీలో కాలుపెట్టగానే ముందుగా సోకినది దుర్గంధం. భరింపరాని దుర్గంధం. ఎక్కడా కాలనీవాసుల జాడలేదు. మురికిగా, శుచీ, శుభ్రం లేకుండా ఉన్న కాలనీ డైరెక్టర్ మాకు ఎదురుపడ్డాడు. కారుకు ఎదురువచ్చాడు. మమ్మల్ని లోపలికి తీసుకెళ్లాడు. ఎవరు వచ్చి చూసినా విమర్శించడం వల్లనేమో అతను అయిష్టంగా ముందుకు సాగాడు.

తలుపులే లేని ఒక గదిమీదుగా ముందుకు వెళ్తూ "ఇది ప్రథమబృందం నిదురించే గది" అని చెప్పాడు. ప్రస్తుతం ఆ గదికి తలుపులే కాదు, గుమ్మాలు కూడా లేవు. మేం రెండో గదిలోకి వెళ్లి ఎడమ పక్కనగల వరండాలోకి నడిచాం. అక్కడ కూడా బయట ఉన్నంత చలి ఉంది. లోపలి గోడల వెంట కిందకి కారిన మంచు చారికలపై దుమ్ము పేరుకుపోయి కనిపించింది.

"తలుపులేం లేవా?" అని ప్రశ్నించాను.

డైరెక్టర్ మాట్లాడకుండా నవ్వి ముందుకు సాగాడు. యుర్యేవ్ గట్టిగా చెప్పాడు.

"తలుపులనెప్పుడో కాల్చేశారు. అదేం పెద్ద విషయం కాదు. వాళ్లిప్పుడు చెక్క నేలని ముక్కలు చేసి తగలబెడుతున్నారు. ఇంతకు ముందే నేలమాళిగ తలుపులు, కొన్ని బల్ల కొడవళ్లు చలిమంటల్లో బూడిదయ్యాయి."

"అంటే ఇక్కడ వంటచెరకులేదా?"

"ఏమి వంటచెరకు ఎప్పటికప్పుడు నిధులు ఇచ్చాం" అన్నాడు యుర్యేవ్.

"వంట చెరకు లేకేం ఉంది. కానీ దీన్ని కొయ్యడం, ముక్కలు చెయ్యడం వాళ్లకి ఇష్టం లేదు. కట్టెలు కొట్టడం వీళ్ల దృష్టిలో అనవసర శ్రమ. పోనీ కూలీలను పెడదామా అంటే డబ్బు కొరత" అన్నాడు ఖాలాబుదా.

చివరికి మేం మాసి ఉన్న నిజమైన తలుపు దగ్గరికి వచ్చాం. డైరెక్టర్ ఆ తలుపు తెరిచాడు. ఆ తలుపు కింద బందూకు వేలాడుతోంది. పై బందు లేనే లేదు. అది కూడా డార్మెటరీయే. మేం

లోపలికి నడిచాం. మురికిగా, విరిగి ముక్కలై ఉన్న మంచాలపై, రూపు కోల్పోయిన చిరిగిన పీలికల కుప్పల మధ్య కొందరు పిల్లలు కూర్చుని ఉన్నారు. మరి కొందరు అలాంటి గుడ్డ పీలికలనే ఉండలా శరీరాలకు చుట్టుకొని పడుకొని ఉన్నారు. శిధిలావస్థలో ఉన్న ఒక స్టవ్వు దగ్గర ఇద్దరు కుఱ్రవాళ్లు కూర్చుని కొత్తగారంగు వేసినట్టున్న ఒక చెక్కబోర్డును విరిచి ముక్కలు చేస్తున్నారు. ఆ గదిలో ఎక్కడ చూసిన చెత్త పేరుకుపోయి ఉంది. కాలనీ బయటవచ్చిన దుర్గంధమే ఇక్కడా గుప్పుమంది.

పిల్లలంతా మమ్మల్ని పరీక్షగా చూస్తున్నారు. కానీ ఎవ్వరూ కనీసం తలలు కూడా కదపలేదు. ఆ గదిలో పిల్లలంతా పదహారేళ్లకంటే ఎక్కువ వయసువారని గమనించాను.

"వీళ్లంతా సీనియర్లా? అని అడిగాను.

"అవును వీళ్లే తొలి సమిష్టి బృందం. అంతా సీనియర్లు" అని డైరెక్టర్ బదులిచ్చాడు.

ఇంతలో ఒక మూల మంచం నుంచి కేక వినిపించింది. "వాళ్లు చెప్పిందేమీ నమ్మకండి. వాళ్ళు ఉత్త అబద్ధాలకోరులు." మిగిలిన మంచాలపై కుఱ్రవాళ్లు కూడా ఏవేవో అరుపులు మొదలు పెట్టారు. మేం ఇదేమీ పట్టించుకోకుండా ముందుకు నడిచాం. యుర్యేవ్ సిగ్గుపడుతూ, నా ప్రతిస్పందనని గమనించే ఉద్దేశంతో మధ్యమధ్య నా వంక చూస్తున్నాడు. మేం బయటికి నడిచాం.

"మొత్తం ఆరు డార్మెటరీలు. అన్నీ చూస్తారా?" అడిగాడు డైరెక్టర్.

"అక్కర్లేదు. మీ వర్క్‌షాప్‌లు ఎక్కడ?"

ఖాలాబుదా నోరు విప్పాడు. వర్క్‌షాపుల కోసం తాము కొన్ని లేత్‌మిషన్లు కొన్న సంగతి ఘనంగా వివరించాడు.

మళ్ళీ మేం ఆవరణలోకి నడిచాం. ఒక చిన్న కుఱ్రవాడు తన చొక్కాను, శరీరానికి అదిమి పట్టుకొని, చిన్న చిన్న మంచు బురదగుంటలపై నుంచి గెంతుకుంటూ మా దిశగా వస్తున్నాడు. అప్పటికే చలికి నల్లబడిన చిన్నపాదాలు తడవకూడదని వాడి ప్రయత్నంలా కనిపించింది. నేను నా పక్కవాళ్లని ముందుకు నడవనిచ్చి, ఆ కుఱ్రవాడిని ఆపాను.

"నువ్వెక్కడి నుంచీ వచ్చావు బాబూ" అని వాడి నడిగాను.

వాడు ఆగి, నా వంక చూశాడు. "ఏమో తెలియదు. వీళ్లు కనుక ఇక్కడి నుంచి పంపేస్తే అప్పుడు తెలుసుకోడానికి ప్రయత్నిస్తాను."

"ఎక్కడికి పంపుతారు?"

"ఏమో. పంపించివేస్తామంటున్నారు."

"ఇక్కడ బాగోలేదా?"

"లేదు. ఇక్కడ బతకడం కష్టం. ఇక్కడ ఉంటే చలికి గడ్డకట్టి చావడం ఖాయం. అదీ కాక వాళ్లు మమ్మల్ని ఊరికే కొడుతున్నారు."

"ఎవరు మిమ్మల్ని కొడుతున్నది?"

"ప్రతి వాళ్లూ."

ఆ కుఱ్రవాడు అందంగా, కళగా ఉన్నాడు. వీధుల్లో అట్టే కాలం బతకలేదనిపించింది. కాస్త స్నానం చేయించి మంచి దుస్తులు వేస్తే చక్కటి పిల్లవాడుగా మారిపోగలడనిపించింది.

"ఎందుకలా కొడతారు?" నేను మరో ప్రశ్న వేశాను.

"వాళ్లిష్టం ఎందుకైనా కొడతారు. వాళ్లకి కావాల్సింది ఇవ్వకపోతే సరి. లేకపోతే మా భోజనం

లాక్కుంటారు. మా పిల్లలు చాలా రోజులుగా తిండిలేకుండా ఉన్నారు. ఒక్కోసారి రొట్టె ముక్క కూడా లాగేసుకుంటారు. దొంగతనం చేయమంటారు. వినకపోతే కొడతారు. అవునూ మమ్మల్ని ఎక్కడికి పంపిస్తారో, మీకేమైనా తెలుసా?"

"తెలియదమ్మా"

"వేసవి ఎప్పుడొస్తుందో ఏంటో?"

"వేసవి వస్తే ఏం చేస్తావ్?"

"ఎక్కడో అక్కడికి పోతాను"

ఈలోగా యుర్యేవ్, ఖాలాబుదా బృందం నన్ను వర్క్‌షాప్‌ల దగ్గర నుంచి పిలిచింది. ఈ కుర్రవాడిని అక్కడ అలా వదిలి పోబుద్ధి కాలేదు. కానీ, అప్పటికే వాడు గెంతుకుంటూ డార్మెటరీల వైపు వెళ్తున్నాడు. బహుశా బయటకంటే అక్కడ కొంత వెచ్చగా ఉంటుందేమో.

నేను వెళ్లి మా బృందంతో కలిసాను. కానీ, వర్క్‌షాప్‌లను చూడడం వీలుకాలేదు. వాటి తాళాలు ఎవరి దగ్గరో ఉన్నాయి. ఆయన ఎవరో జాడలేదు. మరేం చేయలేక కిటికీల్లోంచి లోపలికి తొంగిచూశాం. ఒకటి రెండు పంచింగ్ మెషిన్లు, రెండు లేత్ మిషన్లు లాంటి చిల్లర పరికరాలు కనిపించాయి. మొత్తం పరికరాల సంఖ్య డజనుకు మించదు. చెప్పుల వర్క్‌షాప్స్, దర్జీ వర్క్‌షాపులు వేర్వేరు భవంతుల్లో ఉన్నాయి. అన్నీ మూసే ఉన్నాయి.

"ఇవాళ మీకు సెలవా?" అని ప్రశ్నించాను. డైరెక్టర్ బదులివ్వలేదు. యుర్యేవ్ మళ్లీ ఆ బాధ్యత తీసుకున్నాడు.

"ఇంకా మీకు అర్థం కాలేదా ఆంటన్ సెమ్యోనోవిచ్? ఈ సరికి మీకు అర్థమై ఉండాలి. ఇక్కడ ఎవ్వరూ ఏ పనీ చెయ్యరు. అదీ పరిస్థితి. పైగా పరికరాలను ఇప్పటికే ఎత్తుకుపోయారు. ముడి సరుకు లేనే లేదు. ఇంధనం ప్రశ్నే లేదు. ఈ వర్క్‌షాపులకు బయటి నుంచి ఎవరో వచ్చి ఏమీ కొనరు. ఏ పనికోసం ఎవరూ ఇక్కడకు రారు. పైగా ఇక్కడ ఎవరికీ ఏ పనీ చేతకాదు" అని వివరించాడు.

కాలనీలోని విద్యుత్‌ప్లాంట్ గురించి ఖాలాబుదా అంతకుముందే గొప్పగా చెప్పాడు. కానీ, దురదృష్టవశాత్తూ ఏదో లోపం వల్ల అది కూడా పనిచేయడం లేదు.

"మరి స్కూలు సంగతేమిటి?"

దీనికి డైరెక్టర్ సమాధానం ఇచ్చాడు "స్కూలు అయితే ఉంది. కానీ మాకు అంతకంటే ముఖ్యమైన ఆలోచించవలసిన సమస్యలున్నాయి."

పొలాలు కూడా చూద్దామని ఖాలాబుదా కోరాడు. ఎత్తైన గోడలు దాటి బయటికి వచ్చాం. నేల బురదగా వుంది. అటువైపు పలుచటి మంచుపొర కమ్మిన పొలాలు అడవిదాకా వ్యాపించి ఉన్నాయి. ఖాలాబుదా గర్వంగా చెయ్యిచాపి ముందుకి చూపించాడు.

"దాదాపు మూడువందల పాతిక ఎకరాలు" అని చెప్పాడు.

"శీతాకాలం పంటవేశారా?" అని అడిగాను.

దీనికి ఆయన ఉత్సాహంగా సమాధానం చెప్పాడు. "వేశాం. దాదాపు ఎనభై ఎకరాల్లో రై నాటాం. దాదాపు మూడువేల పూడ్‌ల ధాన్యం పండుతోంది. మూడువేల పూడ్‌లు! దాంతో ఎవరికి తిండికి లోటుండదు. చెప్పాగా. ధాన్యం పండించగలిగితే చాలు. జనానికి ఇంకేమీ అవసరం లేదు" అంటూ ఉపన్యాసం కొనసాగించాడు.

అప్పటికే మా కారు దగ్గరికి చేరాం. అక్కడి నుంచి తిరుగుప్రయాణం ప్రారంభించాం. విచారం నిండిన కళ్లతో డైరెక్టర్ నిశ్శబ్దంగా మాకు వీడ్కోలు చెప్పాడు.

దారిలో యుర్యేవ్ నన్ను అడిగాడు 'చూశారుగా. అదీ కుర్యాజ్ పరిస్థితి ఏమంటారు?' అని.

"మాకు అవసరం లేదు" అని క్లుప్తంగా బదులిచ్చాను.

"దేనికి భయపడుతున్నారు? మీకేం కావాలంటే అది సమకూరుస్తాం. మనం ఇప్పుడు జురిన్స్కాయా దగ్గరకెళ్దాం. మా పిల్లల సహాయ సంఘం కుర్యాజ్ కాలనీని విద్యాశాఖకు అప్పగిస్తోంది. నాలుగు వందలమంది పిల్లలు. ఎంత బావుంటుందో ఆలోచించండి. అక్కడ వర్క్‌షాపులు బానే ఉన్నాయి. కుర్యాజ్ నుంచి నూట ఇరవై మంది పిల్లలని ఇతర కాలనీలకు తరలిస్తాం. మీ కాలనీ మొత్తం వచ్చి ఇక్కడ స్థిరపడవచ్చు. అంటే ఇక్కడ మిగిలే రెండువందల ఎనభై మంది బాధ్యత తీసుకుంటే చాలు" అని నన్ను వొప్పించే ప్రయత్నం తీవ్రం చేశాడు.

"ఎందుకీ కష్టం మాకు? ముందు ఈ కాలనీని సమూలంగా బాగుచెయ్యాలి. దానికి కనీసం ఇరవైవేల రూబుళ్లు అవసరం అవుతుంది" అన్నాను.

"ఫరవాలేదులే. ఖాలాబుదా ఆ డబ్బు ఇస్తారు" అన్నాడు యుర్యేవ్.

ఖాలాబుదా ఉలిక్కిపడ్డాడు. "ఇరవైవేలా? దేనికి?" అడిగాడు.

"మరమ్మతులు. తలుపులు, పరికరాలు, పిల్లలు పడుకునేందుకు సామాగ్రీ, దుస్తులు, ఇవన్నీ కావాలిగా?" అన్నాను.

"ఇరవైవేలు ఖర్చు చేసే మాటైతే మేమే అన్నీ చేసుకోగలం." అన్నాడాయన ఉక్రోషంగా ఈలోగా మేం విద్యాశాఖ కార్యాలయాన్ని చేరి జురిన్స్కయాను కలుసుకున్నాం. అక్కడ కూడా యుర్యేవ్ తన ప్రచారం మానలేదు. అతని మాటలు విని జురిన్స్కయా చిరునవ్వు చిందించింది.

"మీరంటున్నది అతి ప్రమాదకరమైన ప్రయోగం. గోర్కీ కాలనీవాసులని అంత ప్రమాదంలోకి నెట్టలేం. శుభ్రంగా కుర్యాజ్‌ను మూసివేసి పిల్లలను మిగిలిన కాలనీలకు పంపితే సరిపోతుంది" అందామె.

"అయితే మీరు ఆ కాలనీ బాధ్యత తీసుకోరా? అక్కడకు వెళ్లరా, ఇదే తుది నిర్ణయమా?" అని ప్రశ్నించాడు యుర్యేవ్.

నేను తలపంకించాను. "ముందు మా కాలనీ పిల్లలతో మాట్లాడాలి. కానీ వాళ్లు కూడా దానికి వొప్పుకుంటారనుకోను" అన్నాను.

"వొప్పుకోనిదెవరు?" ఖాలాబుదా అనుమానంగా అడిగాడు.

"మా కాలనీ పిల్లలు."

"వాళ్లకేం తెలుసు. అసలు వాళ్లెవరు నిర్ణయించడానికి?"

అప్పుడు జురిన్స్కయా ఖాలాబుదాను వారించింది. "చూడండీ ఒక కాలనీని ఎలా నిర్వహించాలో మీ కంటే, నా కంటే గోర్కీ కాలనీ కుర్రవాళ్లకీ బాగా తెలుసు. వాళ్లు కుర్యాజ్ బాధ్యతలు తీసుకుంటే చూడాలని ఉంది" అంది.

నేను వాళ్లని వదిలి స్టేషన్‌కు వెళ్లాను. అక్కడ చదువుకుంటున్న కరబనోవ్, జడరోవ్‌లు నన్ను సాగనంపేందుకు స్టేషన్‌కు వచ్చారు. వాళ్లకి కుర్యాజ్ కాలనీ గురించి వివరించాను. వాళ్లు రైలు చక్రాల వంకే చూస్తూ నేను చెప్పినదంతా విన్నారు. కొద్ది సేపు మౌనంగా వున్నారు. చివరికి కరబనోవ్ నోరు విప్పాడు.

"ఇదేమంత గౌరవనీయమైన, గొప్ప బాధ్యతకాదేమో! కానీ ఎవరికి తెలుసు? దాని గురించి ఆలోచించాలి."

"కానీ మనం వారికి దగ్గరగా ఉన్నాం. సాయం చేయకపోతే ఎలా? రేపు మనం ఓసారి కుర్యాజ్ వెళ్లివద్దాం" అన్నాడు జదరోవ్.

నేను కాలనీకి తిరిగివచ్చాను.

కాలనీలో సభ్యుల సమావేశం ప్రారంభమైంది. అందరూ నా ప్రసంగాన్ని శ్రద్ధగా, సాలోచనగా విన్నారు. మాట్లాడుతూనే నేను నా గుండెచప్పుళ్లు కూడా వినేందుకు ప్రయత్నించాను. నాకేమైంది? నిన్నమొన్నటి వరకూ పొపోవ్ ఎస్టేట్ గురించి, అక్కడి సువిశాలమైన, వెలుతురుతో నిండిన కోటల గురించి కలలు కన్నాను. దాదాపు ఏడాదికాలంగా ఈ కాలనీని మరింత కాంతివంతమైన, శోభాయమానమైన చోట్లకి తరలించాలని ఎంత తపనపడ్డాం! ఆ కలల లక్ష్యం కుర్యాజ్ కాలనీ వంటి అసంబద్ధమైన, చీకటికోపంలాంటి చోటకి తరలడమా? దాని కోసం ఈ అందమైన పూల తోటలను, కొలోమాక్ నదిని, మా చేతులతో అభివృద్ధి చేసిన ఈ ఎస్టేట్‌ను వదిలి ఎందుకు అక్కడికి వెళ్లాలి?

నేను కుర్యాజ్ కాలనీ గురించి వివరిస్తున్నంతసేపూ పిల్లలు పగలబడి నవ్వుతూ నాకు పదేపదే అడ్డుతగిలారు. ప్రశ్నలతో ముంచెత్తారు. నా ప్రతి సమాధానానికీ మరింత నవ్వారు.

"మరి ఆ నలభైమంది అధ్యాపకులు ఏం చేస్తారు?"

"నాకు తెలియదు."

నవ్వులు.

"అక్కడ భోజనాల గది ఉందా?"

"ఉంది కానీ, పిల్లలెవరికీ చెప్పులు కూడా లేవు. వాళ్లు చల్లబడిన నేలమీద నడవలేరు. అందువల్ల వాళ్ల భోజనాలను డార్మెటరీల్లోకే తెస్తారు."

నవ్వులు...

"అలా తెచ్చేదెవరు?"

"నేను చూడలేదు. బహుశా పిల్లలే మోసుకొచ్చుకొంటారేమో."

"అంటే వంతుల వారీగానా?"

"అయి ఉండవచ్చు"

"అంటే అక్కడా ఓ పద్ధతి ఉందన్నమాట."

మళ్లీ నవ్వులు.

"అక్కడ కొమ్సొమోల్‌లాంటిది ఉందా?"

ఈ ప్రశ్నకు నేను సమాధానం చెప్పకముందే అందరూ పగలబడి నవ్వారు.

చివరికి ఆందోళనగా నన్ను ప్రశ్నించారు. "మీ ఉద్దేశం ఏమిటి?"

"మీరందరూ ఏం చెబితే అదే" అని బదులిచ్చాను.

లాపోట్ నా వంక తదేకంగా చూశాడు. నా మొహంలో ఏ భావమూ కనిపించి ఉండదు. ఇంతలో కుద్లాటీ మాట్లాడడానికి ముందుకు వచ్చాడు.

వాడు అలవాటు ప్రకారం బుర్ర గోక్కోబోయి ఆగాడు. కానీ వాడు చెయ్యి ఎత్తడం చూసిన పిల్లలు ఘొల్లున నవ్వారు. కుద్లాటీ ప్రారంభించాడు "నిజం చెప్పాలంటే; నేను ప్రత్యేకంగా చెప్పేదేమీ

లేదు. కానీ కుర్యాజ్ కాలనీ వంటి చోటికి వెళ్లి పనిచేద్దామంటే మనకెవరున్నారు. అనుభవజ్ఞులంతా రబ్‌ఫాక్‌కు వెళ్లిపోయారు. అందువల్ల కుర్యాజ్ కాలనీ గురించి చర్చ అనవసరం. మనం అక్కడికి ఎందుకు వెళ్లాలి? అక్కడ రెండు వందల ఎనభైమంది ఉంటారు. మనం నూట ఇరవైమందిమి. మనలో చాలామంది కొత్త పిల్లలు. అక్కడికి వెళ్లి మనం ఏం సాధించగలం?" అన్నాడు.

అతని తరువాత మా టీచర్ ఇవాన్ లేచాడు "కామ్రేడ్స్, కాలనీ వాసులారా, నేనైతే మీతో ఎక్కడికీ రాబోవడం లేదు. అందువల్ల ఒక బయటి మనిషిగా ఈ సమస్యని పరిశీలిస్తాను. మీరసలు కుర్యాజ్ కాలనీకి ఎందుకు వెళ్లాలి? అక్కడ దాదాపు మూడువందల మంది పనికిరాని మంద ఉంటారు. మూడువందల మంది! పైగా వాళ్లలో చాలా మంది ఎదిగిన కుర్రవాళ్లని ఆంటన్ సెమ్యోనోవిచ్ చెబుతున్నారు. అది వారి సొంత స్థావరం. మీరే అక్కడికి వెళ్లాలి. వాళ్లు కనుక మిమ్మల్ని దోచుకోవడం మొదలుపెడితే ఏమవుతుంది. పైగా దోపిడీలు వాళ్లకి కొత్త కాదు. అప్పుడు మీరేమవుతారు?" అని ప్రశ్నించాడు.

"మనల్ని వేపుకు తింటారు" అన్నారెవరో ఒక మూలనుంచి.

"అబ్బే వాళ్లంత కష్టపడరు. మనల్ని ఇలానే పచ్చిగా నమిలి మింగేస్తారు" అన్నారు ఇంకెవరో.

ఇవాన్ కొనసాగించాడు ఉత్సాహంగా, "పైగా వాళ్లు దొంగలు. మనవాళ్లని పాడు చేయరని నమ్మకం ఏమిటి?"

దీనికి కుర్రవాళ్లలో ఎవరో జవాబు చెప్పారు. "అవును, మనలో నలభైమంది కొత్త కుర్రవాళ్లు. వాళ్లని పాడుచేయడం సులభం."

ఇవాన్ సంతోషంగా తన వాదనని వినిపించాడు "ఇప్పుడు లెక్కపెట్టండి. మీలో సీనియర్లు కేవలం నలభైమంది. వాళ్లు రెండువందల ఎనభైమంది. మనలో కొత్త కుర్రవాళ్లు నలభైమంది. మొత్తం కలిపి మూడువందల ఇరవైమంది. ఇదంతా దేనికి? గోర్కీకాలనీని ధ్వంసం చేయడం దేనికి? ఆంటన్ సెమ్యోనోవిచ్, ఈ ప్రతిపాదన ద్వారా మీరు మొత్తం కాలనీని నాశనం చేయగలరు" అనే హెచ్చరికతో ఇవాన్ తన ప్రసంగాన్ని ముగించాడు.

ఆ తరువాత ఇవానోవిచ్ వేదిక ఎక్కాడు. ఆయన మాట్లాడానికి అందరూ ప్రోత్సహించారు. కాలనీకి దూరమవుతున్నాననే బాధ ఆయన అలసిన కళ్లలో స్పష్టంగా కనిపిస్తోంది. ఆయన శుభ్రంగా క్షవరం చేసిన గడ్డంతో ఒక సైనికునిలా కనిపించాడు. తన ప్రసంగం ప్రారంభించాడు. ఎటువంటి ఉద్రేకం, ఉద్వేగం లేకుండా ప్రశాంతంగా మాట్లాడాడు.

"చూడండి పిల్లలూ నేను ఎలాగూ మీతో రావడం లేదు. అందువల్ల ఈ విషయానికి సంబంధించి నేను బయటిమనిషిని. అయితే ఎందుకో నాకు అలా అనిపించడంలేదు. మీరు ఎక్కడికి వెళ్తారు. మీ జీవితం మిమ్మల్ని ఎక్కడికి తీసుకువెళ్తుంది అన్నవి రెండు వేర్వేరు విషయాలు. క్రితం నెల పాపోవ్ కాలనీకి వెళ్లడానికి అంతా సిద్ధమైనప్పుడు మీరు ఉత్సాహంగా మాట్లాడేవారు. అక్కడ ఆ కాలనీలో పశువుల మందని పెంచుతామనీ, తద్వారా సంపాదించగల వెన్నను బ్రిటన్ పంపుతామని చెప్పుకొనేవారు. నేనొక ముసలివాడిని. నాకు చెప్పండి, అందరూ పాపోవ్ కాలనీకి వెళ్దామని సరదాపడ్డారు. సరే వెళ్లగలిగారే అనుకుందాం. వెన్న ఊరికే వస్తుందా? పశువులను సాకడం అంత సులభమా? ఇంగ్లండ్‌కు పంపేందుకు వెన్న అంత సులభంగా దొరుకుతుందా? అసలు పశువుల్ని పోషించడం అంటే ఏమిటి? వాటిని మేపాలి. పేడను శుభ్రం చేయాలి. ఆవులను కడగాలి, స్నానం చేయించాలి. ఇంగ్లాండుకు వెన్న పంపాలంటే మీరెంత శ్రమించాలి. ఈ సంగతులు

మీరేం ఆలోచించలేదనిపించింది. అందరికీ ఒకటే ఉత్సాహం వెళ్లిపోదాం, వెళ్లిపోదాం అని. అసలు మీరు అక్కడికి వెళ్లలేకపోవడం మంచిదైంది. ఇప్పుడు కుర్యాజ్ మన ముందు ఉంది. మీరంతా కూర్చుని తెగ ఆలోచిస్తున్నారు. అసలు మీరు దేని గురించి ఆలోచించాలి? మీరంతా ప్రగతిశీల యువకులు. ఒక్కసారి ఆలోచించండి. మీ సోదరులు మూడొందలమంది అక్కడ కుర్యాజ్ కాలనీలో వినాశనానికి సిద్ధంగా ఉన్నారు. మీరు గోర్కీవాసులు. ఆంటన్ సెమ్యొనోవిచ్ వాళ్ల గురించి మీకు వివరించారు. ఆయన మాట్లాడుతుంటే మీరంతా నవ్వుతూ ఉండిపోయారు. అందులో నవ్వేందుకు ఏముంది? రాష్ట్ర రాజధాని ఖార్కోవ్‌కు ఇంత సమీపంలో నాలుగు వందలమంది ఇటువంటి కుర్రవాళ్లు వాళ్ల ఇష్టం వచ్చినట్టు వాళ్లు ప్రవర్తిస్తుంటే ప్రభుత్వం ఏమి చేయగలదు? వీళ్లందరినీ సోవియట్ ప్రభుత్వమైనా ఏం చేయగలదు? వెళ్లి వాళ్లందరికీ సాయపడ మంటోంది. ఒక్కసారి ఆలోచించండి. మూడొందలమంది. ఈ బాధ్యత చేపట్టారంటే మిమ్మల్ని గమనించేది ఒక్క లూకా కాదు. మొత్తం ఖార్కోవ్ శ్రామికవర్గ ప్రజలు మీరేం చేస్తారోనని చూస్తారు. మీరేమో ఈ బాధ్యత తీసుకునేందుకు సిద్ధంగా లేరు. మీరు మీ గులాబీతోటలనీ, పళ్ల తోటలనీ, సుఖవంతమైన డార్మెటరీలను వదిలేందుకు సిద్ధంగా లేరు. అసలు మీరేమనుకుంటున్నారు? ఈ కాలనీని ప్రారంభించినప్పుడు ఎవరున్నారు? నేనూ, ఆంటన్ సెమ్యొనోవిచ్ ఇద్దరం. అంతే. ఆ రోజుల్లో ఏ సమావేశం ఏర్పాటు చేసి మిమ్మల్నందరినీ కాలనీలోకి తీసుకోవాలనుకున్నాం? ఎవరెవరో ఉపన్యాసాలిచ్చారు? వొలోఖోవ్, టారానెట్స్, గడ్. వాళ్లంటే మేం ఎన్నడూ భయపడలేదు. మేమంతా ఎవరి కోసం పని చేశాం? ప్రభుత్వం కోసం అదీ సోవియట్ ప్రభుత్వం కోసం. నేనేమంటానంటే వెళ్లండి. వెళ్లి ఆ కాలనీ పిల్లల బతుకులని బాగుచేయండి. మాక్సీమ్ గోర్కీ కూడా దీనికి ఎంతో సంతోషిస్తారు. నా కాలనీ పిల్లలు దేనికీ భయపడలేదని ఆయన చెప్పుకుంటారు."

ఇలా సాగింది ఇవానోవిచ్ ప్రసంగం. అతను మాట్లాడుతున్న కొద్దీ బుగ్గలు ఎర్రబడు తున్నాయి. కాలనీ పిల్లల కళ్లు కొత్తకాంతులతో వెలిగిపోయాయి. నేల మీద కూర్చున్న కొందరు పిల్లలు తన ఎదుటి వారి భుజాలపై గడ్డాలను ఆనించి ఆయన ప్రసంగాన్ని శ్రద్ధగా విన్నారు. మరికొందరు పైకి ఆకాశంలోకి చూస్తూ నిశ్చలంగా ఉండిపోయారు. గోర్కీ గురించి ఇవానోవిచ్ ప్రస్తావించి నప్పుడు పిల్లల కళ్లు నిప్పులు చెరిగాయి. ఒక లక్ష్యసాధనకోసం, పరిశ్రమించవలసిన అవసరాన్ని గుర్తించినట్టు కనిపించాయి. పిల్లలంతా ఇవానోవిచ్ ప్రసంగం సాగుతున్నంతసేపూ ఉద్రిక్తులై ఉన్నారు. అందరూ ఆయన ప్రసంగానికి సమ్మోహితులయ్యారు.

చివరికి మిట్కా లేచి చివరి వరుసల్లో ఉన్న కుర్రవాళ్లని ఉద్దేశించి గట్టిగా అన్నాడు. "మనం వెళ్దాం. కుర్యాజ్ కాలనీకి వెళ్దాం" అని, అయితే చివరి వరుసల నుంచి కూడా ఆమోదం హర్షధ్వనాల ద్వారా వ్యక్తమైంది. అప్పుడు మిట్కా తల తిప్పాడు. ఇవానోవిచ్‌కేసి చూశాడు. "అయ్యా ఇంతటి ముఖ్యమైనపని మీరే చెప్పారు. మీరు కూడా మాతో ఎందుకు రాకూడదు?" అని అడిగాడు.

పిల్లలంతా కుర్యాజ్ కాలనీకి తరలి వెళ్దామని నిర్ణయించారు.

నేను వారితో ఏకీభవించాను. వెంటనే మిట్కా పట్టణంలోని విద్యాశాఖకు ఒక టెలిగ్రాం పంపాడు. ఖార్కోవ్‌లోని విద్యా విభాగం అధికారి జురిన్‌స్కయాకు.

"పంటల కాలం సమీపించింది కాబట్టి కుర్యాజ్ కాలనీని సాధ్యమైనంత త్వరలో గోర్కీ కాలనీకి అప్పగించండి" అని.

18

ఊహించని ప్రతిఘటన

జురిన్‌స్కయా వెంటనే స్పందించింది. తక్షణం రమ్మని టెలిగ్రాం ఇచ్చింది. ఇక కుర్యాజ్‌కు తరలివెళ్లడం క్షణాల్లో పని అని మేం భావించినా, దీనికీ అడ్డంకులు ఎదురయ్యాయి. అప్పటికే ఆ కాలనీని వెంటనే అక్కడి నుంచి ఎత్తివేయాలని పరిసరాల గ్రామాల ప్రజలు ప్రభుత్వానికి అనేక విజ్ఞాపనలు పంపారు. అయితే విద్యాశాఖలో జురిన్‌స్కయా, యుర్యేవ్ తప్ప మిగిలినవారిలో చాలా మంది కుర్యాజ్ కాలనీని మాకు స్వాధీనం చేయాలనే ప్రతిపాదనను వ్యతిరేకించారు. బ్రెగెల్ ఈ బదలాయింపునకు సుముఖంగానే ఉన్నప్పటికీ కొన్ని షరతులు విధించింది. ఈ మొత్తం వ్యవహారాన్ని పర్యవేక్షించేందుకు ముగ్గురు సభ్యులతో ప్రత్యేక కమిటీ ఉండాలనీ, గోర్కీకాలనీ పద్ధతులను దశలవారి ఆ కొత్త కాలనీలో అమలు చేయాలని, మొదటి నెలరోజులూ నాకు సాయంగా ఉండేందుకు ఖార్కోవ్ నుంచి ఏభైమంది కొమ్సొమోల్ సభ్యులను వెంట తీసుకువెళ్లాలనీ షరతులు విధించింది. నేను వాటిని తిరస్కరించాను.

ఖాలాబుదా అయితే నేను అడిగిన ఇరవైవేల రూబుళ్లు ఇవ్వనుగాక ఇవ్వనన్నాడు. వీరు కాక అనుకోని రీతిలో కొత్త శత్రువులు మాకు అవరోధాలు సృష్టించారు. వారిలో క్లేమర్ ఒకరు. ఆయన కార్మిక సంఘం నాయకుడు. ఎందుకోగాని ఆయనకు గోర్కీకాలనీ అన్నా, నేనన్నా బహుచిరాకుగా ఉండేది.

"ఎవరీ మకరెంకో? ఎవరండీ? ఒక మకరెంకో కోసం మనం అన్ని చట్టాలనూ ఎందుకు అతిక్రమించాలి? కార్మికవర్గ ప్రయోజనాలను ఎందుకు దెబ్బతీయాలి? అసలు గోర్కీ కాలనీ గురించి మనకేం తెలుసు. ఎవరు చూశారు? జురిన్‌స్కయా వెళ్లి స్వయంగా చూశారట. అయితే ఏమిటి? ఆమెకి ఏం అర్థమైంది? అంటూ మాపై యుద్ధానికి దిగాడు. నేను ప్రశాంతంగా నా డిమాండ్‌లు అతని ముందుంచాను.

1. కుర్యాజ్ కాలనీలోని అధ్యాపక సిబ్బంది అందర్నీ ఎటువంటి మినహాయింపు లేకుండా వెంటనే పంపివేయాలి. దీనిపై చర్చకు తావులేదు.
2. కొత్త కాలనీలో నలభైమంది టీచర్లు అవసరంలేదు. పదిహేనుమంది చాలు.
3. ఈ టీచర్లకు నెలకు నలభైరూబుళ్లు కాక, ఎనభై రూబుళ్లు జీతం ఇవ్వాలి.
4. కొత్త సిబ్బందిని ఎంచుకొనే పూర్తి స్వేచ్ఛ నాకు ఉండాలి.

ఈ డిమాండ్‌లు చూసి క్లేమర్ గంగవెర్రులెత్తిపోయాడు.

"చూడండి ఎంత అహంకారమో! అసలు వాటి గురించి చర్చించేందుకైనా ఎవరు సిద్ధపడతారు? మొత్తం సోవియట్ చట్టాలని ఆయన తుంగలో తొక్కాలనుకుంటున్నాడు. ఆయనకి పదిహేనుమంది టీచర్లు చాలట. అంటే పాతికమందిని రోడ్లపైకి నెడతారా? కొద్దిమంది సిబ్బందినే తీసుకొని వారితో బానిసల్లా పని చేయిద్దామనుకుంటున్నట్టుంది."

నేను వాదించలేదు. వాదించినా నా మాట నెగ్గుతుందన్న నమ్మకం పోయింది. నాకు నా గోర్కీకాలనీ సామర్థ్యంపై విశ్వాసం ఉంది. వారికి ఆ నమ్మకం ఎలా కలిగించగలను?

మొత్తం మీద కుర్యాజ్ కాలనీ గోర్కీ కాలనీకి స్వాధీనం చేయడం అనే ప్రతిపాదన పెద్ద వివాదాన్ని రేపింది. ఎవరికి వారు, సంబంధం లేనివారు సైతం జోక్యం చేసుకొని వాదోపవాదాల్లోకి దిగుతున్నారు. ఇందులో ఎవరెవరికి ఏ ప్రయోజనాలున్నాయో నాకు ఏ మాత్రం బోధపడడంలేదు.

మొత్తం నా ప్రత్యర్థుల నిజాయితీపై నాకు విశ్వాసం కలుగలేదు. అందుకే తరచు ఖార్కోవ్ వెళ్లడం మానుకున్నాను.

ఈ అందరిలోకి ఒక్కరంటే ఒక్కరు కొంత నిజాయితీగా కనిపించారు. విద్యాశాఖకు చెందిన అధికారి. ఆమె పేరు జోయా. ఆమెకు నన్ను చూడగానే వ్యతిరేకత కలిగింది. ఆ విషయాన్ని దాచలేదు గూడా. నా మొహం మీద తిట్టి పోసింది.

"మకరెంకో మీరు అధ్యాపకులు కారు. ఒక నియంత. మీరు సైన్యంలో కల్నల్‌గా పనిచేశారని విన్నాను. అది నిజమేననిపిస్తోంది. మీరు మీ మిలిటరీ క్రమశిక్షణ. మీ గురించి కొందరు గొప్పగా ఎందుకు చెబుతారో అర్థంకాదు. నేనైతే పిల్లలని మీ దగ్గరకి కూడా రానివ్వను.

ఆమె అర్థరహితంగా విమర్శించినా, ఆమె నిజాయితీ నాకు నచ్చింది. పిల్లల సంక్షేమం పట్ల ఆమె ఆందోళన నన్ను ఆకట్టుకుంది. నేను వినయంగా ఆమెకు తెలియజేశాను. "నేనెన్నడూ కల్నల్‌ని కాదు జోయాగారు."

కాకపోవచ్చు. కానీ మీ కాలనీ పిల్లల్ని కుర్యాజ్‌కు తరలిస్తే జరిగేది మారణకాండ. మీ వందమందీ అక్కడ రెండువందల ఎనభైమందీ నరుక్కుచస్తారు" అంది. ఇంతలో బ్రెగెల్ జోక్యం చేసుకుంది.

"అర్థం లేకుండా మాట్లాడుతున్నారు జోయా. ఎవరు ఎవరిని నరుకుతారు? ఆ మాట లేంటి?" అంది.

మొత్తానికి ఈ వివాదం చిలికిచిలికి గాలివానగా మారి రాష్ట్ర పార్టీ ఉన్నత నాయకత్వం దృష్టికి చేరింది. ఈలోగా కుర్యాజ్‌లో పరిస్థితి నానాటికీ విషమిస్తోంది. మేం వెళ్తే ఉద్యోగాలకు ఉద్వాసన ఖాయమని అర్థమైన అక్కడి టీచర్లు ఆ కాలనీ పిల్లలకు మాపై లేనిపోనివి కల్పించి చెప్పడం ప్రారంభించారు. కుర్యాజ్ కుర్రవాళ్లు గోర్కీ పిల్లలతో యుద్ధానికి కత్తులు సిద్ధం చేసుకుంటున్నారని కూడా వారు రహస్య ప్రచారం ప్రారంభించారు. దీంతో జోయా మరింత రెచ్చిపోయింది.

"చూడండి ఒక యుద్ధానికి రంగం సిద్ధమవుతోంది. పిల్లలు ఒకరినొకరు గొంతులు కోసు కోవడానికి తయారవుతున్నారు" అని కొత్త ఆధారాలతో నాపై దాడి ప్రారంభించింది. సరిగ్గా ఆ సమయంలోనే ఒక ఉన్నతాధికారి నుంచి నాకు కబురు వచ్చింది.

పరిశుభ్రంగా క్షౌరం చేసిన గడ్డంతో, గౌరవనీయునిగా కనిపిస్తోన్న ఆ అధికారి నన్ను చూసి గౌరవంగా ఆహ్వానించాడు.

"రండి, కూర్చోండి!"

జురిన్స్కయా, క్లేమర్‌లు అప్పటికే అక్కడ ఉన్నారు.

ఆ అధికారి నన్ను ప్రశ్నించాడు. "మీరు, మీ కాలనీ పిల్లలూ కుర్యాజ్ వెళ్లి అక్కడ కుర్రవాళ్లని దారికి తేగలమన్న విశ్వాసం నిజంగా మీకుందా?"

"ఉంద"న్నాను.

ఆయన నా వంక పరీక్షగా చూశాడు.

"సరే మరో ప్రశ్న. కేవలం తెలుసుకుందామని అంతే. క్లేమర్ మీరు మాట్లాడవద్దు. సరేనా. చెప్పండి మకరెంకో కొత్త కాలనీలో నలభైమంది టీచర్లకు బదులు పదిహేనుమందే చాలని ఎందు కంటున్నారు? వారికి నలభైకి బదులు ఎనభై రూబుళ్లు జీతం ఎందుకు అడుగుతున్నారు." నేను ఒక్క క్షణం ఆలోచించాను "సరే వినండి క్లుప్తంగా చెబుతాను. నలభై రూబుళ్లకు పని చేసేందుకు

సిద్ధపడే టీచర్లు అనాథ పిల్లల సమిష్టి బృందాన్నే కాదు, ప్రపంచంలోని ఏ వ్యవస్థనైనా సమూలంగా నాశనం చేయగలరు.”

దీంతో ఆ పెద్దాయన కుర్చీలో వెనక్కి వాలి బిగ్గరగా నవ్వాడు. అలా నవ్వుతూనే ఉన్నాడు చాలాసేపు. కాస్సేపటి తరువాత నిగ్రహించుకుని, క్లేమర్ వంక వాలుచూపుతో, “అంటే మీవంటి వారున్న సమిష్టి కాలనీని కూడా వాళ్లు నాశనం చేయగలరా?” అని వినోదంగా అడిగాడు.

“నిశ్చయంగా చేయగలరు” అని మొండిగా సమాధానం చెప్పాను.

దీంతో ఆయన తన హోదాను కూడా మరచి పొట్టచెక్కలయ్యేలా నవ్వడం మొదలు పెట్టాడు. తరువాత జురిన్స్కయా వేపు తిరిగి అన్నాడు “ఎంత మంది ఎక్కువ ఉంటే, అంత మంది పనికిమాలిన వాళ్లు తయారవుతారు” అని.

కాస్త తమాయించుకుని, తిరిగి ఉన్నతాధికారికి ఉండవలసిన గాంభీర్యతని మొహానికి పులుముకొని జురిన్స్కయాతో అన్నాడు “సరే కుర్యాజ్ కాలనీని వారికి స్వాధీనం చేయండి. అదీ వెంటనే” అన్నాడు.

“మరి ఇరవైవేల సంగతి?” అన్నాను లేచి నిలబడి.

“తీసుకోండి. కానీ మరీ ఎక్కువ అడుగుతున్నారేమో?”

“లేదండీ. అది కూడా చాలదు.”

“సరే, సరే. కానివ్వండి, ఇరవై వేల రూబుళ్లు తీసుకోండి. కానీ ఒక్క విషయం. మీరు పూర్తి విజయం సాధించి తీరాలి. సత్ఫలితాలు చూపించాలి.”

నేను కాలనీకి తిరిగి వచ్చాను.

కుర్యాజ్ వెళ్లడం ఖాయమని తేలిన తరువాత కుర్రవాళ్లలో మంచి మార్పు వచ్చింది. ఒక పద్ధతి ప్రకారం ప్రయాణ సన్నాహాలు ప్రారంభించారు. ఈ ఏర్పాట్లకు లాపోట్ సారథ్యం వహించాడు. వాడిలో నాయకత్వ లక్షణాలు ఇప్పుడు మరింత స్పష్టంగా తెలిసి వస్తున్నాయి. వాడికి కుద్లాటీ సాయం అందించాడు. పిల్లలందరి మధ్యా మునుపులేని సామరస్యం, సమన్వయం ఏర్పడింది. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, ఒకరికొకరు సాయపడుతూ మిలిటరీ క్రమశిక్షణతో పనిచేయడం మొదలెపెట్టారు.

మేం వెళ్తున్నది ఎందుకో, మాపై ఎటువంటి బాధ్యత ఉందో ప్రతివారికీ అర్థమైనట్టు కనిపించింది. కాలనీపై పడిన కొత్త బాధ్యతను సమర్థంగా నిర్వర్తించేందుకు ఎంత కష్టానికైనా సిద్ధపడాలని అందరూ గ్రహించారు. అయితే దానిని ఒక త్యాగంగా వారు పరిగణిస్తున్నట్టు లేదు. ఒక బాధ్యతగా పరిగణిస్తున్నారని తెలిసిపోతోంది.

ఒక సమిష్టి కాలనీకి గల శక్తిని గ్రహించిన పిల్లలు ఆ శక్తి సామర్థ్యాలను ఒక సమున్నత లక్ష్యసాధనకు ఎలా సద్వినియోగం చేయవచ్చో ఆలోచిస్తున్నట్టు కనిపించారు. వారిలో కొత్త ఆత్మవిశ్వాసం, సరికొత్త స్థైర్యం ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. దూరాన ఉత్తర దిశగా కుర్యాజ్ కాలనీ మందపాటిగోడల మధ్య దుర్భరదారిద్రంలో మగ్గుతూ, ఆలనాపాలనా లేక, సరైన పథనిర్దేశం కొరవడి, అరాచకంగా తిరుగుతూ, గూండాల్లా వ్యవహరిస్తోన్న ఆ కుర్రవాళ్ల బాధ్యత తమపై ఉందన్న ఆలోచన మా కుర్రవాళ్లలో లేని పెద్దరికాన్ని తెచ్చింది. అయితే ఎవరూ తాము చేయబోయే పని గురించి గొప్పగా మాట్లాడం లేదు. బహుశా అంత వరకు కనీసం ఒక్కసారైనా చూడని ఆ “ప్రత్యర్థుల’ ’ను దారికి తేగలమా? అన్న సంశయం కూడా మా కుర్రవాళ్లకి ఉందేమో నాకు తెలియదు.

ఆ రోజుల్లో నేను పట్టణం నుంచి తిరిగివచ్చే సమయానికి కుర్రవాళ్లంతా దారిలో, చెట్లపై నా కోసం ఎదురు చూసేవారు. దూరంగా మలుపులో మా బండి ప్రత్యక్షంకాగానే, నా అనుమతి కోసం కూడా ఆగకుండా కాలనీ సమావేశం కోసం అదేశాలు జారీ చేసేవారు. నేను అక్కడికి చేరేసరికే సమావేశానికి సర్వం సిద్ధంగా ఉండేది. పిల్లలంతా ఉద్రిక్తభరితమైన మౌనాన్ని పాటిస్తూ నా మాటలకోసం ఎదురుచూసేవారు. మొత్తానికి మే నెల ఆరంభంలో పట్టణం నుంచి మేమంతా ఎదురుచూస్తున్న ఒప్పందపత్రంతో ఖార్కోవ్ నుంచి కాలనీకి తిరిగి వచ్చాను.

ఈ ఒప్పందం ప్రకారం విద్యావిభాగం ప్రత్యేక ఆదేశాల ప్రకారం, ఇక్కడి మాక్సిమ్ గోర్కీ కాలనీ తన అందరి సభ్యులతో, సిబ్బందితో చరాస్తులు, పశువులతో, పనిముట్లతో, అవసరమైన అన్నిరకాల సామగ్రితో కుర్యాజ్ కాలనీకి తరలివెళ్లాలి. దీనితో కుర్యాజ్ కాలనీ అన్న పాత వ్యవస్థ రద్దయిపోతోంది. అక్కడ ఇప్పుడున్న రెండువందల ఎనభైమంది పిల్లలు ఇక గోర్కీకాలనీ యాజమాన్యం కిందకు వస్తారు. గోర్కీకాలనీ డైరెక్టర్ కొత్త కాలనీలో పదవీ బాధ్యతలు చేపట్టగానే అక్కడి నలభైమంది టీచర్లు వెళ్లిపోతారు.

మే ఐదవ తేదీకల్లా కొత్త కాలనీలో పదవీ బాధ్యతలు స్వీకరించమని అధికారులు నన్ను కోరారు. పదిహేనవ తేదీకల్లా గోర్కీకాలనీని కుర్యాజ్‌కు తరలించడం పూర్తికావాలని ఆదేశించారు. ఈ ఆదేశాలు, ఒప్పందం వివరాలు చదివి వినిపించినప్పుడు కుర్రవాళ్లు ఎప్పట్లా హర్షధ్వానాలు చేయలేదు. 'హుర్రే' అంటూ కేకలు పెట్టలేదు. ఆనందంతో చిందులు వేయలేదు. ఒక్క లాపోట్ మాత్రం లేచి నిలబడి, "ఈ విషయాన్ని మాక్సింగోర్కీకి తెలియచేయాలి. ఆయనకు వెంటనే లేఖ రాయాలి" అన్నాడు.

పిల్లలంతా తలలూపారు.

ఇవానోవిచ్ ఆనందం నిండిన కళ్లతో అందరినీ పరికించి చూశాడు.

"బయలుదేరండి పిల్లలూ, దేనికీ భయపడకండి" అని దీవించాడు.

✣ ✣ ✣

మూడవ భాగం

1

ముందస్తు బృందం

మరో రెండు రోజుల్లో నేను కుర్యాజ్ కాలనీకి బయలుదేరాలి. నాతోపాటు ముందస్తు బృందంగా తొమ్మిది మందిని పంపాలని కమాండర్ల మండలి నిర్ణయించింది. వాళ్లు చాలరని మరికొందరు అవసరమని వాదించాను. కానీ కుడ్లాటీ అందుకు కారణమే చెప్పాడు.

"తొమ్మిదిమంది కాదు ఇరవైమంది ఉన్నా ఇప్పటికిప్పుడు మీరేమీ చేయలేరు. మన కాలనీ మొత్తం అక్కడికి రావాలి. మెరుపుదాడి చేయాలి. మరీ అంత నికృష్టంగా, దౌష్ట్యంగా ఉన్న దాదాపు మూడువందల మందిని తొలిబృందం సాయంతోనే అదుపులోకి తేవాలనుకోవడం అత్యాశ. అందుకే ముందు కేవలం అక్కడకు వెళ్లి స్థిరపడండి. వారం రోజుల్లో మేమంతా వచ్చిపడతాం" అన్నాడు. పైగా మూడువందల పందులు, అన్ని ఆవులు, గొర్రెలు, బళ్లు, వ్యవసాయ పరికరాలు నూట ఇరవైమంది పిల్లల దుస్తులు, బూట్లూ, పక్క బట్టలు, ఆహార నిల్వలు, ఇతర చిన్న పెద్ద సామాగ్రినంతా తరలించబడినా, వాటిని ముందు భద్రంగా సర్ది బళ్లకు ఎక్కించడానికి ఇక్కడ మనుషుల అవసరం ఉంది కూడా. అందుకే నేను ఇక వాదించలేదు. ఇన్నేళ్లు కష్టించి సాగించిన వ్యవసాయాన్ని వదలి, చెమటోడ్చి పోషించిన పళ్ల, పూలతోటలను విడిచిపెట్టి వెళ్లవలసి రావడం షెరీకి బాధ కలిగించిదను కుంటాను. అతని మొహంలో ఆ విచారం స్పష్టంగా కనిపిస్తోంది.

ఇంత ప్రయాణపు సందడిలోనూ కాలనీపిల్లలు క్రమశిక్షణను వీడకపోవడం మరో అద్భుతమైన సంగతి. కొత్త కుర్రవాళ్లు సామాన్లు సర్దే క్రమంలో, చెక్కపెట్టెల్లో వాటిని ఉంచి మేకులు బిగించేటప్పుడు ఎటువంటి వృథాకు పాల్పడినా సీనియర్లు వెంటనే ఏ మూలనుంచో వచ్చి గద్దించేవారు. ఈ పెట్టెకు కొత్త మేకులు ఎందుకు? పాతవాటిని ఉపయోగించలేవా? అని పిల్లలపై విరుచుకుపడతారు. అందరం కాలనీ వదిలివెళ్లేదాకా మీతోనే ఉండి సాయపడ తానన్న ఇవానోవిచ్ ఉన్నట్టుండి విచారంతో కుంగిపోయాడు. ఇక తాను ఒంటరిననే భావం ఆయన్ను పీడిస్తున్నట్టు కనిపించింది. హడావుడిగా పనిలో ఉన్న పిల్లల గుంపులోకి దూరి ఏవేవో సలహాలు చెప్పేవాడు. ఇంక మిగిలిన పని గురించి ఆందోళనగా ఉపన్యాసం దంచేవాడు. పిల్లలు ఆయన మనస్థితిని అర్థం చేసుకొని మర్యాదగా ఆయన చెప్పింది విని "సరేనండీ, అలాగే చేద్దాం" అని సమాధానం చెప్పేవారు. తరువాత తమ పనిలో తాము నిమగ్నమయ్యేవారు.

మేం ఖాళీ చేయబోయే కాలనీని పొరుగునే ఉన్న లునచార్స్కీ కమ్యూన్ వాళ్లు ఆక్రమించ బోతున్నారు. ఆ కాలనీ డైరెక్టర్ నెస్టర్నెకో మా కాలనీలో జొరబడి మా కుర్రవాళ్ల ప్రయాణ ఏర్పాట్లను అదేపనిగా గమనించేవాడు. అతన్ని చూస్తేనే కుడ్లాటీకి వళ్లు తెలియని కోపం వచ్చేది. కాలనీ నుంచి యేం ఎత్తుకుపోతున్నామో చూడాలన్నట్టు ప్రవర్తించేవాడు నెస్టర్నెకో. ఆయన్ని వెంటనే అక్కడనుంచి బయటికి నడవమని కుడ్లాటీ హెచ్చరించాడు. దానికి ఆయన ఇకిలించి "చూడాలిగా!" అన్నాడు.

'ఏంటి చూసేది? పొలంలో పంటవెయ్యాలా అని అడిగితే వెయ్యమన్నావు. పొలం దున్నాం. పంట వేశాం. ఇప్పుడు దాన్ని వదిలి వెళ్లిపోతున్నాం. వేసిన పంటకు డబ్బులివ్వండి'అని అడిగాడు.

దానికాయన మొహమాటంగా సిగ్గుగా నవ్వాడు. "డబ్బులేంటి... డబ్బులు... నా దగ్గర లేవుగా" అన్నాడు.

"మరి ఏ మొహం పెట్టుకొని పంట వెయ్యమని అడిగావు? పిల్లల శ్రమ దోచుకుందామనా?" కుద్లాటీ కోపంగా అడిగాడు.

ఈలోగా ఓల్గా ఒరోనోవా రంగం ప్రవేశం చేసింది. నెస్టెర్నెకోను బలవంతంగా బయటికి పంపింది. కుర్రవాళ్లను సముదాయించింది. "ముందు మనం ఇక్కడి నుంచి కదలాలి. మనకు అవసరమైన సామాగ్రినంతా తీసుకెళ్దాం. ఎవరూ మనల్ని ఆపలేరు" అంది.

అసలు సమస్య ఇది కాదు. విద్యాశాఖలో మా ప్రత్యర్థులు మాపై పగపట్టినట్టుంది. పిల్లలతో సహా అందరం కొత్త చోటుకి వెళ్తున్నప్పుడు మాకు అదనపుభారం తగిలించకూడదు. ఈ కనీస జ్ఞానం కూడా లేని అధికారులు ప్రతిరోజూ కొత్త పిల్లలని మా కాలనీకి పంపడం ప్రారంభించారు. అలా వచ్చినవాళ్లే ఒలెగ్, అకర్డీ, వాస్కా, వెరీ తదితరులు. వారిలో ఒలెగ్ పోస్టల్‌శాఖనే దోచుకోబోయిన ఘనుడు. వాడికి ఏ పనీ చేతకాదు.

అకర్డీ కథ వేరు. అతని తల్లినీ, అతన్నీ వదిలి తండ్రి జెరూసలేం వెళ్లిపోయాడు. తల్లి చనిపోవడంతో వాడు అనాథ అయ్యాడు. ఈ సంగతి తెలుసుకున్న తండ్రి వాడిని తనతో జెరూసలేంకు తీసుకెళ్లాడు. అక్కడ కూడా వాడు తన బుద్ధి మార్చుకోలేదు. దాంతో అతని తండ్రి వాడిని పై అధికారుల సిఫార్సులతో మా కాలనీలో చేర్చాడు. ఇక్కడ కూడా వాడు తన బుద్ధి మార్చుకోలేదు. వాడిని కొత్త కాలనీకి తీసుకెళ్లాలా వద్దా అన్నది చర్చనీయాంశం అయింది. ఒలెగ్ కథ కూడా అంతే.

వాస్కా సంగతి మరింత విచిత్రమైంది. వాడిని ఏ అధికారులూ కాలనీకి పంపలేదు. ఓ వర్షం కురుస్తున్న రాత్రి కాలనీ కమాండర్ల సమావేశం జరుగుతున్నప్పుడు గేటు వద్ద డ్యూటీలో ఉన్న డిటాచ్‌మెంట్ కుర్రవాళ్లు వాడిని సరాసరి మీటింగ్ హాల్లోకి తీసుకొచ్చారు. "వాడు వర్షంలో తడుస్తూ ఏడుస్తున్నాడు. ఏం చేయాలో తెలియక లోపలికి తెచ్చాం." అని వాళ్ళు చెప్పారు. విషయం ఏమిటని అడిగితే వాడు చెప్పాడు.

వాడి తండ్రి చనిపోయాడు. మరో వ్యక్తి ఆమెను పెళ్లాడాడు. ఏడాది తరువాత ఆ తల్లి కూడా చనిపోయింది. మారుటి తండ్రి మరో పెళ్లి చేసుకున్నాడు. తరువాత ఆయన దూర ప్రాంతాలకు వెళ్లిపోయాడు. దాంతో మారుటితల్లి వాడిని బయటకు గెంటింది. వాడు కొంతకాలం మరో కాలనీలో ఉన్నాడు. అప్పుడే మా గోర్కీకాలనీ గురించి ఏదో పేపర్లో చదివాడు. అక్కడినుంచి పారిపోయి వచ్చేశాడు.

ఒక రోజు స్టేషన్‌లో ఒక పోలీసుతో ఘర్షణ పడుతున్న ఒక బాలికను చూశాను. బొకోవాను రైలు ఎక్కించేందుకు నేను స్టేషన్‌కు వచ్చాను. వారి గొడవ చూసిన బొకోవా అందులో జోక్యం చేసుకొంది. ఆ పిల్లతో మాట్లాడింది. నా దగ్గరికి వచ్చి "ఆ బాలిక అనాథ. మీ కాలనీలోకి తీసుకోండి" అని కోరింది.

ఆమే వెరా. తను అప్పటికే వేశ్య. పైగా గర్భవతి. కాలనీకి తీసుకొచ్చి నాలుగురోజుల తర్వాత ఆసుపత్రికి పంపి గర్భస్రావం చేయించాను.

ఇలా పోగవుతున్న కొత్త పిల్లలు కాలనీకి భారంగా మారారు. వెళ్తున్నది కొత్త చోటికి అక్కడ ఉన్నది దాదాపు గూండాలు. ఇంతమంది కొత్తవారితో కేవలం ఎనభైమంది పాత కుర్రవాళ్లతో కుర్యాజ్ వెళ్లి మేం ఏం చేయగలమన్న అనుమానం నాతోపాటు, కమాండర్లకీ వచ్చింది. అప్పటికే మాలో ఉన్న నలభైమంది కొత్తవారే మాకు భారం. వాళ్లు అప్పటికే మా కాలనీ క్రమశిక్షణకు, పనితీరుకు, సమన్వయ-సంఘీభావాలకు అలవాటు పడలేదు. అందువల్ల కొత్తగా వస్తున్నవారిని

ఇక్కడే వదిలి వెళ్దాం అని ఒక ప్రతిపాదన వచ్చింది. దాన్ని నేను తోసిపుచ్చాను.

ఒక రోజు జురిన్‌స్కయా కాలనీకి వచ్చి, నా గదిలో ప్రవేశించి, హడావుడిగా తలుపులు వేసింది.

"కామ్రేడ్ మకరెంకో, ఇప్పటికైనా మించిపోలేదు. వద్దనుకొంటే మీ ప్రయాణం ఆపేయండి" అని చెప్పింది.

'ఎందుక'ని అడిగాను. అక్కడ కుర్యాజ్‌లో పరిస్థితి మరింత దారుణంగా తయారైందట. అత్యంత విలువైన గోర్కీ కాలనీ భవిష్యత్తును కుర్యాజ్ కోసం త్యాగం చేయనవసరంలేదంది. నేను ప్రశాంతంగా జవాబిచ్చాను.

"కుర్యాజ్‌లో పరిస్థితి దారుణంగా తయారవుతున్న కొద్దీ వారిని బాగు చేయాల్సిన అవసరం పెరుగుతోంది. ఆ విషయం అర్థం చేసుకోండి. అటువంటి వారికి మన సోవియట్ ప్రభుత్వం ఏం చేయగలదు? వాళ్లని సవ్యంగా మలిచి, మంచి మనుషులుగా తీర్చిదిద్దవలసిన బాధ్యత మనందరిపై ఉంది" అని సమాధానం చెప్పాను. "వాళ్లు సోవియట్ సమాజానికి శత్రువులుగా మారకుండా జాగ్రత్త పడవలసిన అవసరం ఉంది" అన్నాను.

మర్నాడు మా ముందస్తు బృందం కుర్యాజ్ కాలనీకి పయనమైంది. కామ్రేడ్ జురిన్‌స్కయా మాతో వచ్చింది.

2

బాలికలకు ఇది నరకమే

ముందు నాతో బయలుదేరిన డిటాచ్‌మెంట్ కమాండర్ వొలోఖోవ్. భావరహితంగా ఉండే మొహంతో ప్రతి పనిలోనూ ముందుండే ఈ కుర్రవాడు చూసేందుకు బద్ధకంగా, అంత చురుకుగా లేనట్టు కనిపించేవాడు. ఇతనికి అపారమైన ఆత్మవిశ్వాసం, ఎటువంటి వారితోనైనా పని చేయించగల సామర్థ్యం ఉండేవి. కుర్యాజ్ కాలనీ బాధ్యతల భారం ఎంతటిదో తెలిసినప్పటికీ తను ఒక్కసారైనా ఆందోళనగా ఉన్నట్టు కనిపించలేదు. మా కుర్రవాళ్లలో ఎవరైనా భవిష్యత్తు గురించి కుర్యాజ్‌లో ఎదురవబోయే అనుభవాల గురించి ఆందోళనగా మాట్లాడుతుంటే వొలోఖోవ్ వారిని మందలించేవాడు.

"కుర్యాజ్ కుర్రవాళ్ల గురించి కబుర్లు కట్టిపెట్టండి. వాళ్లేం రాక్షసులు కాదు. మనలాగే రక్తమాంసాలతో ఉండే మాములు మనుషులే" అనేవాడు. అయితే తనపై గల బాధ్యత ఎంతటిదో, దానిని సమర్థంగా నిర్వర్తించడానికి ఎటువంటి బృందం కావాలో వాడికి బాగా తెలుసు అందుకే తన డిటాచ్‌మెంట్‌లోకి మెరికల్లాంటి కుర్రవాళ్లని ఎంపిక చేసుకున్నాడు. ఆ కాలనీ అందరి గురించీ పూర్తి అవగాహన ఉన్నవాడు కావడంతో తొలి డిటాచ్‌మెంట్ ఎంపికకు అతను పెద్ద కష్టపడలేదు. ఈ డిటాచ్‌మెంట్‌లో విట్కా ఒకరు. సన్నగా రివటలా ఉండే ఈ కుర్రవాడు క్రమశిక్షణ అంటే ప్రాణం పెడతాడు. ఎదుటివారిని అంచనా వేయడంలో వాడిని మించినవాడు లేడు. ఒక్కసారి చూడగానే ఆ మనిషి ఎటువంటివాడో పూర్తిగా గ్రహించేవాడు. పిల్లలు వీడికి గోర్కోవ్ స్కీ అని మారు పేరు పెట్టారు.

రెండవవాడు మిట్కా. వాడు మా పాతమిత్రుడే. గోర్కీ కాలనీ స్ఫూర్తికి వాడు నిజమైన ప్రతిరూపం. అతని వ్యవహారశైలిని, మాటతీరును అనుకరించేందుకు కాలనీలో పిల్లలు ప్రయత్నించేవారు. ఎప్పుడూ పరిశుభ్రమైన దుస్తుల్లో సరదాగా మాట్లాడుతూ చకచకా అన్ని పనుల్లో తలదూర్చే మిట్కా మా కాలనీ తాత్విక చింతనకు పూర్తి బద్ధుడై ఉండేవాడు. కుర్యాజ్ కాలనీని దారికి తేవడం అన్నది మా

జీవన్మరణ సమస్య అని గుర్తించి అందుకు ఏం చేయడానికైనా సిద్ధపడిన యువకుడితను. దారి తప్పిన పిల్లలను సరైన పౌరులుగా తీర్చిదిద్దగల శక్తి సామర్థ్యాలు గోర్కీకాలనీకి ఉన్నాయని పూర్తి విశ్వాసం ఇతనికి ఉండేది. ఈ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడం ద్వారా మొత్తం సోవియట్ సమాజానికే సేవ చేస్తున్నామన్న నమ్మకం ఇతనికి ఉండేది.

డిటాచ్‌మెంట్‌లోని మరో కీలకసభ్యుడు మిఖాయిల్. అపారమైన తెలివితేటలతో ప్రతి అంశాన్ని అర్థం చేసుకోగల ఈ కుర్రవాడు మంచి పనివాడు కూడా. కాలనీ ప్రయోజనాల పరిరక్షణ వాడి ఏకైక ధ్యేయం. వాడు కాలనీలో చేరేసరికే దిమ్మరిలా దేశంలో ప్రధాన నగరాలు, పట్టణాలు తిరిగేశాడు. అయితే వాడిపై ఆ ప్రభావం ఏ మాత్రం కనిపించేదికాదు. కాలనీలో చేరిన తొలిరోజు నుంచే వాడు దానితో ప్రేమలో పడ్డాడు. ఇంత వరకు ఒక్కసారైనా అతను ఎటువంటి పొరపాటు చేయలేదు. వాడికి అన్ని పనులు తెలిసినా, దేనిలోనూ ప్రత్యేక నైపుణ్యం లేదు. దీనిని వాడు గ్రహించాడు. అందుకే అన్ని వ్యవహారాలనూ సక్రమంగా నడిపే యాజమాన్య పాత్రలో రాటుదేలాడు. అందర్నీ మందలిస్తూ, పనిపై తరుముతూ హడావుడి చేసినా, స్నేహంగా, సరదాగా ఉండే ధోరణి కారణంగా ఎవరికీ వాడంటే కోపం కానీ, వ్యతిరేకభావం కానీ ఉండేవి కావు. కాలనీలో అందరికంటే బలిష్టంగా ఉండే మిఖాయిల్‌ను దళ కమాండర్ కుర్యాజ్ కాలనీ కుర్రవాళ్లని దృష్టిలో ఉంచుకొనే ఈ డిటాచ్‌మెంట్‌లోకి ఎంపిక చేశాడని నా అనుమానం.

కుడ్లాటీ మరో విశిష్టమైన వ్యక్తిత్వం గల యువకుడు. సప్లైల బాధ్యునిగా అపారమైన అనుభవం గడించిన ఈ యువకుడు కమాండర్ల సమావేశంలో, కొమ్సొమోల్ మీటింగ్‌లో క్లుప్తంగా, సూటిగా మాట్లాడేవాడు. క్రమశిక్షణ ఉల్లంఘించినవారిని దండించవలసిన సందర్భాల్లో అందుకుగల కారణాలను స్పష్టంగా చెబుతూ, ఏ శిక్ష విధిస్తే మంచిదో నిక్కచ్చిగా ప్రకటించేవాడు. సాధారణంగా అతని తీర్పును ఎవరూ వ్యతిరేకించేవారు కాదు. దేన్నైనా, ఎవరినైనా కావలసిన విధంగా మలచు కోవచ్చున్న విశ్వాసం, అలా చేయగల నైపుణ్యం వాడికున్నాయి. చూడడానికి పల్లెటూరిబైతులా కనిపించే కుడ్లాటీ మంచినటుడు కూడా. మితంగా మాట్లాడే ఈ కుర్రవాడికి ఆవేశంగా ఉపన్యాసాలిచ్చే వాళ్లంటే సదభిప్రాయం ఉండేది కాదు.

ఎవజెన్‌యెవ్ ఈ బృందంలోని మరో సభ్యుడు. సంక్లిష్టమైన గతం కలిగిన ఈ కుర్రవాడు అవసరమైతే ఎవరితోనైనా, ఎంత కటువుగానైనా వ్యవహరించగలడు. తనకు గల అనుభవం వల్ల ఏ ప్రాంతానికి చెందినవారు ఎటువంటి యాసలో మాట్లాడినా వారికి అదే రీతిలో సమాధానం చెప్పగల సమర్థత ఉండేది.

మరో సభ్యుడు జోర్కా ఆది నుంచీ కొమ్సొమోల్ సభ్యుడు ఒక విధంగా వాడు కుర్రవాళ్లలో రాజకీయ కమిస్సార్‌గా పనిచేసేవాడు. ఎంతటి సంక్లిష్ట విషయాన్నైనా క్షణాల్లో అర్థం చేసుకొని పక్కవారికి వివరించ గల నైపుణ్యం ఉంది. టోస్కా, వాంకాలిద్దరూ ఈ డిటాచ్‌మెంట్‌లో అందరికంటే పిన్న వయస్కులు. అమాయకమైన మొహాలతో, చిరునవ్వులు చిందిస్తూ ఎవ్వరితోనైనా ఇట్టే కలిసిపోగల స్నేహపాత్రులు. బృందంలో చివరగా చేరిన వెట్కోవ్‌స్కీ కొంతకాలం మా అందరినీ ధిక్కరించి కాలనీ నుంచి వెళ్లిపోయిన కుర్రవాడు. మూడురోజుల్లో కుర్యాజ్ బయలుదేరతామనగా వాడు కాలనీకి తిరిగి వచ్చాడు. మొహమాటపడుతూ సిగ్గు, సిగ్గుగా కాలనీలోకి ప్రవేశించిన వెట్కోవ్‌స్కీని లాపోట్ చలోక్తులతో ఆహ్వానించాడు. "అయిందా. దేశం తిరగడం పూర్తయిందా?" అంటూ పలకరించాడు.

వొలోఖోవ్ వాడిని చూసి "ఏంటి పనిచేస్తావా?" అని అడిగాడు. వెంటనే వాడిని తన డిటాచ్‌మెంట్‌లోకి తీసుకున్నాడు.

కొత్తగా చేరిన ఇవాన్ డెనిసోవిచ్ కిర్గిజోవ్‌ని కూడా మేం తొలి బృందంలో చేర్చాం. పిరోగోవ్కా గ్రామంలో టీచర్‌గా పనిచేస్తున్న ఈ ముప్పయేళ్ల అధ్యాపకుడిని నేనే కాలనీలోకి ఆహ్వానించాను. ప్రశాంతంగా, తెలివిగా వ్యవహరించే ఈ ఇవాన్ పిల్లలందరితో దయగా ప్రవర్తించేవాడు. ఎంతటి పనినైనా నెత్తిన వేసుకునేవాడు. విసుగంటే తెలియని ఈ టీచర్ గోర్కీకాలనీ ప్రయాణ సన్నాహాల్లో అందరికీ తలలో నాలుకగా వ్యవహరించాడు. ఎవరికి, ఎప్పుడు ఏ సాయం కావలసి వచ్చినా చిరునవ్వుతో ముందుకు వచ్చేవాడు. ఎప్పుడూ ఎవరి మీదా విసుక్కోవడం చూడలేదు నేను.

అందరం కలిసి ఉదయం వేళకు ఖార్కోవ్ చేరుకున్నాం. విద్యాశాఖ ఇన్‌స్పెక్టర్ యుర్యేవ్, అక్కడ మమ్మల్ని కలుసుకున్నాడు. మమ్మల్ని మా పిల్లల్ని చూసి ఎంతో ఆనందించాడు. "వాళ్లేనన్నమాట గోర్కీకాలనీ పిడుగులు" అంటూ పిల్లలని ఆప్యాయంగా పలకరించాడు. తరువాత కుర్యాజ్ కాలనీకి ప్రయాణం ఏర్పాట్ల గురించి మాట్లాడాడు. పెద్దవాళ్లమంతా ఖాలాబుదా కారులో వెళ్దామని, పిల్లలు రైజోవ్ వరకు రైలులో వస్తే అక్కడి నుంచి కాలనీ రెండే కిలోమీటర్లు కాబట్టి అరగంటలో నడిచి అక్కడికి చేరవచ్చనీ అన్నాడు.

నేను అందుకు ఒప్పుకోలేదు. అందరికీ కార్లు తెప్పించమన్నాను. దానికి తను ప్రతిఘటించలేదు. "సరే మీరు చెప్పినట్టే చేద్దాం. నాతో ఒకరు వస్తే అలా బజారుదాకా వెళ్లి అద్దె కార్లు మాట్లాడదాం" అన్నాడు.

ఈలోగా వొలోఖోవ్ కుర్రవాళ్లలో చిన్నవాడైన టొస్కాను ఆయన వెంట వెళ్లమని ఆదేశించాడు. వాడు "అలాగే కామ్రేడ్" అని వినయంగా సమాధానం చెప్పి, కాలనీ పద్ధతిలో సెల్యూట్ చేసి యుర్యేవ్ వెంట బయలుదేరాడు. ఈ క్రమశిక్షణ చూసి యుర్యేవ్ ఆశ్చర్యపోయాడు. "బావుంది, బావుంది" అని సంతృప్తిగా నవ్వి బజారువైపు నడిచాడు.

గంటలోపు మా మూడుకార్లు కుర్యాజ్ కాలనీ చేరుకున్నాయి. చిరిగిన దుస్తులతో, మురికి శరీరంతో, కాళ్లకు చెప్పుల్లేని కుర్రవాళ్లు కొందరు మాకు కాలనీ గేటు వద్దే తారసపడ్డారు. పరిశుభ్రంగా, ఆరోగ్యంగా, కుదురుగా వున్న మా గోర్కీవాసులను వారు నిర్లిప్తంగా చూస్తూ నుంచున్నారు.

ఈలోగా కాలనీలోని ఇద్దరు టీచర్లు అక్కడకు వచ్చారు. మా రాకవల్ల తమకు ఉద్వాసన జరుగుతుందన్న కోపం వారి కళ్లల్లో, ప్రవర్తనలో వ్యక్తమవుతుంది."మీరంతా ఈ రాత్రి ఎక్కడ ఉంటారు? పెద్దవాళ్లకి టీచర్ల గదిలో పక్కలు ఏర్పాటు చేస్తాం. పిల్లలు మా డార్మెటరీల్లో చోటు దొరికిన చోట సర్దుకోవచ్చు" అని సలహా చెప్పారు.

"అదేం అవసరంలేదన్నా"ను. 'మా ఏర్పాట్లు మేం చేసుకుంటాం. మీ డైరెక్టర్ ఎక్కడ?' అని ప్రశ్నించాను.

డైరెక్టర్ ఏదో పనిపై పట్టణం వెళ్లాడట. అతని సహాయకులొకరు అయిష్టంగానే కాలనీని మాకు చూపించేందుకు వచ్చాడు. యుర్యేవ్, నేనూ ఇంతకుముందే చూడవలసిందంతా చూసినందున నెమ్మదిగా ముందుకు కదిలాం. జురిన్‌స్కయా మౌనంగా వెంట నడిచింది. కుర్రవాళ్లు మాత్రంవెంట వస్తున్న కాలనీ అధికారిని లక్ష్యపెట్టకుండా పరుగుపరుగున కాలనీలో తలోమూలకు వెళ్లారు. కొద్ది సేపటి తరువాత కుద్లాటీ మాకు ఎదురొచ్చాడు. అతనికి కాలనీ ఏమాత్రం నచ్చలేదని మొహం చూస్తేనే అర్థమవుతోంది. "ఇటువంటి చోటికి ఎందుకు దిగబడ్డాం?" అన్నట్టు చూస్తున్నాడతను నా వంక.

మరో వైపు నుంచి వచ్చి మమ్మల్ని కలిసిన మిట్కా కూడా ఆగ్రహంతో మౌనంగా మా ఎదుట నిలిచాడు. వాళ్ల ధోరణి జురిన్స్కయాకు బోధపడినట్టుంది.

"కాలనీ ఏం నచ్చినట్టు లేదు కదూ?" అని వారిని అడిగిందామె.

మిట్కా బదులివ్వలేదు. వొలొఖోవ్ మాత్రం పగలబడినవ్వాడు. "ఇక్కడ కొట్లాటలు తప్పేట్టులేవు" అన్నాడు.

"అదేంటి కొట్లాటలు దేనికి?" అని జురిన్స్కయా ఆందోళనగా ప్రశ్నించింది.

"ఈ కుర్రవాళ్లని దారికి తేవడానికి" అని చెబుతూనే అటుగా వెళ్తోన్న కాలనీ కుర్రవాణ్ణి ఒకణ్ణి కాలర్ పట్టుకొని మావైపు లాగాడు. ఆ చిన్న కుర్రవాడు తన సైజుకి రెట్టింపు ఉన్న కోటు వేసుకొని ఉన్నాడు. నెత్తిన టోపీకానీ, కాళ్లకి బూట్లుకానీ లేవు.

"వాడి చెవులు చూడండి" అన్నాడు వొలొఖోవ్.

ఆ పిల్లవాడు వినయంగా పక్కకి తిరిగి చెవులు చూపించాడు. చలికి నల్లబారిన ఆ చెవుల నిండా మురికే. పైగా వాటిపైనా, వెనుక పొక్కులు, కురుపులూ చూసేందుకే రోతగా, భయంకరంగా అనిపించింది. ఆ కురుపుల నుంచి రక్తం, చీమూ కారి ఎండిపోయి ఉన్నాయి.

"ఆ చెవులకేమయిందీ?" అంది జురిన్స్కయా.

ఆ పిల్లవాడు అదోమాదిరి నవ్వి "కురుపులు" అన్నాడు ఉల్లాసంగా.

"అలా వాటిని గోక్కుంటూ, మురికిగా ఉంచితే చస్తాననే భయం కలగడం లేదా?" అడిగాడు టోస్కా.

"ఎందుకు చస్తాం. మాలో చాలామందికి ఇలా ఉంటుంది. ఎవ్వరూ చావలేదు" అని చెప్పాడు ఆ కుర్రవాడు.

ఎందువల్లో కానీ మా కంటికి ఒకరిద్దరు తప్ప కాలనీవాసులెవరూ కనిపించలేదు. మురికిగా ఉన్న క్లబ్ పరిసరాల్లో ఒకరిద్దరు కుర్రవాళ్లు తారసపడ్డారు. దుర్గంధమయంగా ఉన్న డార్మిటరీల్లోకి వెలుగన్నది రావడంలేదు. అక్కడ కూడా మాకు ఎవరూ కనిపించలేదు. "పిల్లలంతా ఏరి?" అని మా వెంట ఉన్న టీచర్ని అడిగాను.

"అర్థం లేని ప్రశ్నలు" అంటూ అతను గొణిగాడు.

మా వెంట వస్తున్న ఓ పదిహేను ఏళ్ల కుర్రవాణ్ణి ఆపి అడిగాను. "అబ్బాయ్ ఇక్కడ ఎలా ఉంది?"

"ఛండాలంగా ఉంది. కానీ త్వరలో రోజులు మారతాయనీ అంతా బాగుపడుతుందనీ విన్నాను"

"ఎవరు చెప్పారు?"

"మా వాళ్లే అంటున్నారు. త్వరలోనే మార్పు వస్తుందట. కాకపోతే కొత్త టీచర్లు చీటికీ మాటికీ కొడతారట."

"కొట్టడం దేనికి?"

"వాళ్లు దొంగల్ని ఖాయంగా కొడతారట. పైగా ఇక్కడ అందరూ దొంగలే" అంటూ కాలనీలో జరిగిన దొంగతనాలన్నీ వివరించాడు. టీచర్ల వస్తువులు, పక్క కుర్రవాళ్ల బూట్లు, దిళ్లు, పక్కబట్టలు అన్నీ. చివరికి గత శీతాకాలంలో కొందరు స్టోర్రూం తాళాలు బద్దలు కొట్టి మొత్తం సామానును ఊడ్చుకుపోయిన వైనాన్ని వివరించాడు.

"సరే నీ మొహం అంత మురికిగా ఉందేం? కనీసం మొహం కడుక్కోవా?"

"ఎలా? నీళ్లు లేవు. పవర్‌ప్లాంట్ పాడయింది. సబ్బులేదు. తువాళ్లు లేవు" అని సమస్య చెప్పాడు ఆ పిల్లవాడు.

"నీ పేరేమిటి?"

"ప్యోటర్ మలికోవ్"

యుర్యేవ్ ఈ సంభాషణలో జోక్యం చేసుకోలేదు.

అందరం స్కూలు భవనంలోకి వెళ్లాం. పొడవాటి నడవ కు అటూఇటూ చిన్న చిన్న తరగతి గదులున్నాయి. ఒక గదిలో పిల్లలు వేసిన బొమ్మలుకొన్ని గోడలకు వేలాడుతున్నాయి. బహుశా అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు చూపించేందుకు అయిఉండాలి. అందరం గదిలోకి చేరాం. విట్కా అన్నాడు 'ఆంటన్ సెమ్యోనోవిచ్ మనమంతా ఇదే గదిలో ఉందాం' అని.

"ఇక్కడి పిల్లలకు టీచర్లంటే ద్వేషం. ఈ కుర్రవాళ్లచే గొడవకు దిగకుండా పని చేయించడం అసాధ్యం."

అందరం కలిసి కాలనీని స్వాధీనం చేసుకొనే విధి విధానాల గురించి మాట్లాడుతున్నాం. ఈలోగా కాలనీ డైరెక్టర్ పట్టణం నుంచి వచ్చాడు. అటువంటి మనిషిని కాలనీ డైరెక్టర్‌గా ఎలా నియమించారా?" అని ఆశ్చర్యపోయాను.

ఆ డైరెక్టర్ చాలా దూకుడుగా ఉన్నాడు. కాలనీ అప్పగించే తతంగం వీలైనంత త్వరగా ముగించాలనే తొందరలో కనిపించాడు.

అక్కడి పిల్లలంతా ప్రమాదకరమైన మూడ్‌లో ఉన్నారని, ఆ తరువాత జరిగే పరిణామాలకు తాను బాధ్యుడుని కానని హెచ్చరించాడు. దీనిపై యుర్యేవ్ ఆగ్రహం వెలిబుచ్చాడు. నేనదేం పట్టించుకోలేదు. కాలనీ తరపున అప్పగించవలసినవి ఏమైనా ఉంటే త్వరగా ఆ పని కానిమ్మని మర్నాడు మధ్యాహ్నం రెండుగంటలకు ఆ తతంగం పూర్తి చేయాలని నిర్ణయమైంది.

ఆ తరువాత యుర్యేవ్, జురిన్‌స్కయాలు అక్కడ నుంచి పట్టణానికి తిరిగి వెళ్లిపోయారు. నేను మా కుర్రవాళ్లతో కలిసి ఆవరణలో తిరుగుతున్నాను. భోజనాల సమయం అయి ఉండాలి. కాలనీ పిల్లలు వంటగది నుంచి డార్మెటరీలకు గిన్నెలు మోసుకెళ్తున్నారు. ఒక కుర్రవాడి చేతి కింద పెద్దరొట్టె ఉంచుకుని పులుసుగిన్నె మోస్తున్నాడు. వాడి చొక్కా చేతుల నుంచి ఆ పులుసు కారుతోంది. వాడి గుప్పెటలో ఒక మాంసం ముక్క ఉంది. అంటే పులుసు గిన్నె మోస్తూనే అందులోంచి వాడొక మాంసంముక్కను తీసుకున్నాడు.

కాలనీ ఆవరణలో తిరుగుతున్న నా వద్దకు అక్కడి కుర్రవాళ్లెరూ రాలేదు. కానీ క్రమంగా గుంపులు గుంపులుగా అనేకమంది పిల్లలు లోపలికి వస్తూ కనిపించారు. నేను డార్మెటరీలోకి వెళ్లాను. అప్పటికే అక్కడ చాలా మంది ఉన్నారు. ఆవరణలో ఉన్న అనేక షెడ్‌లు, పాకల్లో పిల్లలు మంచాలపై కూర్చొని కనిపించారు. అప్పటికే భోజనాలు పూర్తయినట్టు ఉన్నాయి. అందరూ చలికి వణుకుతూ చేతులను మోకాళ్ల మధ్య దాచుకొని కూర్చున్నారు. కొందరు పక్క బట్టల్లోని పురుగులను దులుపుతున్నారు. ఒకమూల కుర్రవాళ్లు పేకాడుతున్నారు. ఎవరూ నా వంక చూడలేదు.

ఒక గదిలో కొందరు పిల్లలు చేరి పాత పత్రికలో బొమ్మలు చూస్తున్నారు. వాళ్ల దగ్గరికెళ్లి అడిగాను. "మీ దిళ్లు ఏమయ్యాయి?" అని.

ఒక కుర్రవాడు నావంక తిరిగి "తలగడలా? మీరు మకరెంకోగారేనా?" అని అడిగాడు. అవునన్నాను. "అందరికీ తలగడలు ఉండేవి. ఇప్పుడవీ లేవు" అని నవ్వాడు.

ఒక కుర్రవాడు వివరంగా చెప్పాడు "మళ్లీ తలగడలు ఇవ్వాలంటే ఎవరెవరికి ఇచ్చిందీ రాసుకోవాలి. అంతేనా. అంటే ప్రతి వస్తువుకీ లెక్క ఉండాలి. కానీ ఆంటన్ సెమ్యోనోవిచ్. ఇక్కడ పిల్లలెందరనీ లెక్కేలేదు. ఇక తలగడల లెక్క రాసేదెవరు?" అన్నాడు.

నాకు అర్థం కాలేదు. ఉన్న కాలనీ సభ్యులు లెక్కలేదంటాడేమిటి? అదే అడిగాను.

వాడు చెప్పిన దాని ప్రకారం ఇక్కడ కాలనీ సభ్యులెవరో, కాని వారెవరో ఎవరికీ తెలియదు. ఎవరి గురించి ఎవరికీ ఏమీ తెలియదు. అందరూ ఎంతో కొంత కాలం ఇక్కడ ఉంటారు. విసుగుపుట్టి బయటికి వెళ్లిపోతారు. మళ్లీ కొంత కాలానికి తిరిగి వస్తారు. కొందరు కుర్రవాళ్లయితే అనధికారికంగానే ఇక్కడ స్థిరపడ్డారు.

వాళ్లతోనే కలిసి ఉంటున్న టిమ్కా అనే కుర్రవాడిని ఈ కాలనీకి ఎవరూ పంపలేదు! వాడు ఇదివరకు మరో కాలనీలో ఉండేవాడు. అక్కడి నుంచి పారిపోయి వచ్చాడు. గోర్కీకాలనీకి వెళ్దామని వాడి ఉద్దేశం!

"గోర్కీకాలనీ గురించి మీ కుర్రవాళ్లు ఏమనుకుంటున్నారు?" అని వాడిని ప్రశ్నించాను. కుర్యాజ్ పిల్లల్లో చాలామందికి గోర్కీకాలనీ అంటే చిరాకు. అక్కడ క్రమశిక్షణ అంటే అయిష్టం. "ఎవరో పిల్లలు కొమ్ముబూర ఊదుతారు. దాంతో పిల్లలంతా పరుగెత్తుకురావాలి. కవాతు చెయ్యాలి. మరో సంకేతం అందగానే పనుల్లోకి వెళ్లాలి. పని-! ఇక్కడ కుర్రవాళ్లలో ఎవరికీ పని అంటే ఇష్టం లేదు" అని వివరించాడు వాడు. వాడిపేరు జైచెంకో.

"నీకు పని అంటే భయమేనా?" అని అడిగాను.

వాడు అదోమాదిరి తల ఎగరేశాడు. "నేనూ, నా మిత్రుల సంగతి వేరు. మేం దొంగతనాలు చెయ్యం" అని వాడు గర్వంగా చెప్పాడు.

వాళ్లు చెప్పిన సమాచారం విని భయం కలిగింది. ఇంతటి క్రమశిక్షణారాహిత్యం, తిరుగుబోతుతనం, దొంగబుద్ధి, సోమరితనం... వీటిని సరిచేయడం మా వల్ల అవుతుందా? అనిపించింది. అలా ఆలోచిస్తూ నడుస్తుంటే ముగ్గురు కుర్రవాళ్లు ఎదురు పడ్డారు. సిగరెట్లు కాలుస్తున్నారు. నిర్లక్ష్యంగా తలలు ఎగరేస్తూ నా వంక చూశారు. వాళ్లలో ఒకడు నన్ను సమీపించి "మకరెంకో అంటే నువ్వేనా?" అని అడిగాడు.

నా రక్తం మరిగిపోయింది. లాగి ఒక్కటిద్దామనుకున్నాను. తమాయించుకొని అతని పేరు అడిగాను. వాడు నాకు సమాధానం చెప్పకుండా ముందుకు సాగిపోయాడు. ఇంతలో వెనక నుంచి ఒక ఆడగొంతు వినిపించింది. "వీళ్లతో ఎలా వేగుతారు? మీ పని ఎలా మొదలు పెడతారు?" అని అడిగింది. వెనుదిరిగి చూశాను.

ఒక యువతి నా వెనక నిలబడి ఉంది. గుండ్రటి మొహంలో నల్లటి కళ్లు నా వంక సూటిగా చూస్తున్నాయి. "నా పేరు గుల్యేవా" అంటూ పరిచయం చేసుకుంది.

ఆమె దుస్తుల తయారీ కార్ఖానాలో శిక్షకురాలు. అక్కడున్న ఏకైక పార్టీ సభ్యురాలు. ఆమె వంక పరీక్షగా చూస్తూ చెప్పాను. "ఎలా మొదలుపెట్టాలా అనే ఆలోచిస్తున్నాను. నువ్వు కలిశావుగా, ఇద్దరం కలిసి పని చేద్దాం" అన్నాను స్నేహంగా.

"సరే, నాతో రండి అక్కడ బాలికల డార్మెటరీలో పిల్లలు మీ కోసం ఎదురు చూస్తున్నారు. మీరు ఇంతవరకు వారిని చూడనే లేదు" అంది.

ఇద్దరం కలిసి ఆవరణ మధ్యలో ఉన్న రెండంతస్థుల భవనంలోకి వెళ్లాం. దారిలో ఆమె అంది "ఇక్కడున్న సిబ్బందిని మొత్తంగా తొలగించాలని మీరు మంచి షరతు విధించారు. అది మంచి పని. నన్ను కూడా పంపించెయ్యండి" అని.

"అదేం లేదు. నీ గురించి మేం చర్చించాం. నువ్వు ఇక్కడ ఉండాలి. నీ సాయం మాకు అవసరం" అన్నాను.

బాలికల డార్మెటరీ విశాలంగా ఉంది. అరవై మంచాలున్నాయి. అందరికీ దుప్పట్లు, తలగడలూ ఉన్నాయి. అంతో ఇంతో శుభ్రంగా ఉన్నాయి కూడా. అక్కడ బాలికలు నిజంగా నా కోసం ఎదురు చూస్తున్నారు కూడా.

"పిల్లలూ, ఈయనే ఆంటన్ సెమ్యోనోవిచ్. ఈయన్ని పరిచయం చేయమన్నారుగా" అంది గుల్యేవా.

పిల్లలు గుసగుసలతో నన్ను పలకరించారు. దుప్పట్లు మడతలు పెట్టి మమ్మల్ని సమీపించారు. వాళ్లని చూస్తే గుండెలు పిండినట్టయింది. వాళ్లకోసమైనా ఏమైనా చేయగలిగితే బాగుంటుందని పించింది. అందరూ మా చుట్టూ మంచాలపై సర్దుకు కూర్చున్నారు. అందరి మొహాల్లో ఏదో బెదురు, వారి కదలికల్లో అతి జాగ్రత్త. వాళ్ల దుస్తులన్నీ చిరిగి అతుకులుపడి ఉన్నాయి. ఆ పేదరికమే వారి ప్రవర్తనని శాసిస్తోందా? అర్థం కాలేదు.

"చెప్పండి అమ్మాయిలూ ఎలా ఉన్నారు?" అడిగాను.

ఎవరూ సమాధానం ఇవ్వలేదు. నా వంకే తదేకంగా చూస్తూ మౌనంగా ఉండి పోయారు. వాళ్లు నవ్వుతున్నట్టే ఉంది కానీ, ఆ నవ్వు పెదాలకే పరిమితం. వారికి నిజమైన ఆనందం ఏమిటో తెలియదని తట్టింది. "నేను అనుభవజ్ఞుడినే. కానీ, ఇక్కడ వాళ్లలో ఏదో లోపం కనిపిస్తోంది. ఏమిటది?" అని గుల్యేవాను అడిగాను.

ఆమె సమాధానం చెప్పేలోగా, గులాబిరంగు గౌను ధరించిన ఒక చిన్నపిల్ల గబుక్కున అంది "మీరు త్వరగా గోర్కీవాసులను పిలిపించండి. ఇక్కడ మేం అతిప్రమాదకరంగా బతుకుతున్నాం"

అప్పుడు విషయం నాకు అర్థం అయింది. అది భయం. వీళ్లంతా నిరంతరం భయం భయంగా, బెంగగా బతుకుతున్నారు.

"వీరి బతుకు దుర్భరంగా ఉంది ఆంటన్ సెమ్యోనోవిచ్" అంది గుల్యేవా ఉన్నట్టుండి.

"ఎందుకంత భయం చెప్పండి" అని ఆ పిల్లల్ని పదే పదే అడిగాను. నెమ్మదిగా నోరు విప్పారు. బెదురు బెదురుగా, చిన్న గొంతులతో, ఒకరి మాటకు ఒకరు అడ్డం పడుతూ మొత్తం విషయం వివరించారు. ఒకేసారి విచారం, అసహ్యం, సానుభూతి, ఆగ్రహం....వంద రకాల భావాలు కలిగాయి.

ఒక్క డార్మెటరీలో మాత్రమే వారికి అంతో ఇంతో భద్రత ఉంది. వాళ్లకు బయటకు రావడం అంటే భయం. వస్తే కుర్రవాళ్లు వెంటపడతారు. వాళ్లంతా తడుముతారు. వెకిలిగా మాట్లాడతారు. బూతులు తిడతారు. స్నానం గదుల్లోకి వెళితే బయట నుంచి లోపలికి తొంగి చూస్తారు. వీళ్లు లోపల ఉండగానే గభాలున తలుపులు తెరుస్తారు. వాళ్ల తిండిని కూడా బలవంతంగా లాక్కుంటారు. వంట కాగానే మగపిల్లలు అక్కడకు వచ్చి ఉన్న ఆహారాన్ని తమ డార్మెటరీల్లోకి తీసుకుపోతారు.

ఆడపిల్లలు అలా చొరబడలేరు. అందుకే ఆ హడావుడి అయ్యేదాకా ఆగుతారు. చివరకు భోజనాలగదికి వెళ్తే అక్కడ ఏమీ మిగలదు. అక్కడైనా ఎక్కువసేపు ఉండాలంటే భయమే. ఎందుకంటే ఉన్నట్టుండి కుర్రవాళ్లు అక్కడికి వచ్చి ఆడపిల్లలని కొడతారు. వాళ్లని 'లంజ'లని తిడతారు. బూతుమాటలు మాట్లాడమని బలవంతం చేస్తారు. ఆడపిల్లల వస్తువులన్నీ ఎత్తుకెళ్లి మార్కెట్లో అమ్మేస్తారు. బట్టలు ఉతుక్కోవాలంటే రాత్రిళ్లు మాత్రమే వీళ్లు బయటికి వెళ్లగలిగేవారు. ఇప్పుడదీ లేదు. రాత్రి సమయాల్లో, ఆడపిల్లలు లాండ్రీగదికి వస్తున్నారని తెలుసుకున్న కుర్రవాళ్లు, వీళ్లని అటకాయించి, చెప్పడానికే వీల్లేనంత అసహ్యంగా ప్రవర్తించడం మొదలుపెట్టారు. వాల్యా, మాన్యా ఇద్దరు బాలికలు క్రితం నెల మామూలుగానే రాత్రివేళ దుస్తులు ఉతుక్కుందామని లాండ్రీకి వెళ్లినప్పుడు ఏం జరిగిందన్నది ఎవరికీ తెలియదు. వాళ్లిద్దరూ డార్మెటరీకి తిరిగి వచ్చి రాత్రంతా ఏడుస్తూనే ఉన్నారు. ఉదయమే లేచి పారిపోయారు. ఎక్కడికి వెళ్లినదీ ఎవరికీ తెలియదు. ఆ సంగతిని ఒక బాలిక ధైర్యం చేసి డైరెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. తరువాత ఆమె పాయిఖానాకు వెళ్లినప్పుడు కుర్రవాళ్లు ఆమెను పట్టుకున్నారు. భయంకరంగా కొట్టారు. చివరకు పాయిఖానాలోకి మురికిని తీసి ఆమె ముఖమంతా పూశారు.

గోర్కీకాలనీ వాసులు వస్తే పరిస్థితి మారుతుందని ఎవరో వీళ్లకి ధైర్యం చెప్పారు. కానీ గోర్కీవాసులు వచ్చినా తమనేం చేయలేరని. వాళ్లని తరిమికొడతామని, కుర్రవాళ్లు బాలికలకు చెప్పారట. పిల్లలంతా మాట్లాడడం పూర్తయిన తరువాత అందరం కొంతసేపు మౌనంగా ఉన్నాం. అంతలో స్మేన్ అనే బాలిక గద్గదస్వరంతో నన్ను అడిగింది "చెప్పండి సోవియట్ సమాజంలో ఇటువంటివి జరగవచ్చా?" అని.

"కుదరద"న్నాను. "మీరు చెప్పిందంతా అత్యంత విషాదకరమైన, అవమానకరమైన విషయాలు. ఇటువంటి వాటికి సోవియట్ దేశంలో చోటు ఉండకూడదు. ఉండదు. కొద్ది రోజుల్లోనే పరిస్థితి మారుతుంది. ధైర్యంగా ఉండండి" అని హామీ ఇచ్చాను.

"కొద్ది రోజుల్లో అంటే?" అని బాలిక అడిగింది.

నాకు పట్టుదల పెరిగింది. "ఖచ్చితంగా పదిరోజుల్లో" అని జవాబు చెప్పాను.

బయటికి వచ్చానే కానీ అసంతృప్తితో, ఆగ్రహంతో, ఏం చేయాలో, చేయగలనో తెలియని నిస్సహాయతతో రగిలిపోయాను. మా కాలనీ తొలి దినాలు గుర్తుకొచ్చాయి. ఏం చేయాలి? ఆ క్షణంలో ఎవరైనా ఎదురుపడితే కాలర్ పట్టుకొని లాగి తందామన్నంత ఉద్రేకం నన్నావహించింది. ఇక్కడ ఇప్పుడు కావలసింది సామాజిక విద్యా సిద్ధాంతాలు, సోషలిస్టు సమాజ అవసరాలు, విప్లవ కర్తవ్య బోధనకాదు. సంస్కారం. కనీస మానవ సంస్కారాన్ని నేర్పాలి. ఈ పిల్లలతో తలపడటం గురించి నా తటపటాయింపు, విఫలమవుతానేమోననే అనుమానం ఆ ఆగ్రహంలో అదృశ్యమయ్యాయి. దారుణంగా, హీనాతిహీనంగా, భయం భయంగా బతుకు వెళ్లదీస్తున్న బాలికలకు పదిరోజుల్లో పరిస్థితి మారగలదని హామీ ఇచ్చాను.

అప్పటికి చీకటి దట్టమవుతోంది. డార్మెటరీల్లోంచి కుర్రవాళ్లు గుంపులు గుంపులుగా బయటకి వస్తున్నారు. వంట గదిలో దూరి చేతికి అందిన ఆహారాన్ని తెచ్చుకొని డార్మెటరీల్లోకి తిరిగి వెళ్తున్నారు. ఎక్కడా నవ్వులుకానీ, పాటలుకానీ లేవు.

3
తొలి ఘర్షణ

మర్నాడు మధ్యాహ్నం రెండు గంటలకు కాలనీ డైరెక్టర్ ఆ కాలనీని అప్పగించే పత్రాలు అందించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. పిల్లలందరినీ సమావేశపరిచేందుకు చర్చి గంటను మోగించడం అక్కడి పద్ధతి అని తెలుసుకున్నాం. షెలాపుటిన్ వెళ్లి అదేపనిగా ఆ పగిలిన గంటను మోగించాడు. ఎంత మోగించినా ఎవరిలో కదలిక లేదు. కొందరు కుర్రవాళ్లు మాత్రం వచ్చి నిశ్శబ్దంగా మీటింగ్ హాల్లో నిలబడ్డారు. ఎవరికీ కూర్చునే ఉద్దేశం లేనట్టుంది. అదీకాక అక్కడ కూర్చునేందుకు బల్లలు కూడా లేవు. టీచర్ల జాడ లేదు. ఏడాదిన్నర క్రితం నలభైమంది టీచర్లు ఇక్కడి నలభై గదులు ఆక్రమించుకున్నారు. తమతో తెచ్చుకున్న సామానంతా క్రమంగా అదృశ్యం కావడం చూసి నివ్వెరపోయారు. చివరికి వారి గదుల్లో మిగిలినవి ఫర్నిచర్, పాతపేపర్లు మాత్రమే.

ఇక్కడ క్లబ్ రూంలో సమావేశానికి గంట కొట్టి మేం ఎదురు చూస్తున్నాం. వొలోఖోవ్ మౌనంగా ఎత్తైన గోడలవంక చూస్తూ కూర్చున్నాడు. కుడ్లాటీ ఆగ్రహంతో పళ్లు నూరుతున్నాడు. "ఇవాళ ఎవరికీ భోజనాలు పెట్టవద్దు" అన్నాడు.

అలా చేయవద్దన్నాను.

ఎందుకు? ఎదురు ప్రశ్న వేశాడు. పొలాల పరిస్థితి చూడండి. ఒక్క ఎకరం కూడా ఇంతకు ముందు సాగు చేసిన దాఖలాలు లేవు. పొలాల నిండా పిచ్చిమొక్కలు. అప్పుడే మే నెల మొదటి వారం గడిచిపోతోంది. ఈ సోమరిపోతులు పొట్ట నింపుకొని కులాసాగా తిరుగుతే వారిని మేపేదెవరు?" ఇంతలో వొలొఖోవ్ నన్ను పిలిచాడు. "ఆంటన్ సెమ్యోనోవిచ్ రండి. ముందు మనమంతా మాట్లాడుకోవాలి" అని. అందరం రాత్రి మేం పడుకున్న గదిలో సమావేశం అయ్యాం.

"పొలాలని దున్ని విత్తులు నాటాలా వద్దా? అందుకు విత్తనాలేవి? పైగా ఆవరణ నిండా ఈ మురికి ఏమిటి? పని మొదలుపెట్టాలికదా? రేపు కాలనీ అంతా తరలివస్తే ముందు వచ్చిన మన గురించి ఏమనుకుంటారు? ఇక్కడ డార్మెటరీల్లో మంచాలు సరిగా లేవు. దుప్పట్లు, తలగడలు లేవు. ఎవరికీ చెప్పులు, బూట్లూ లేవు. వంటపాత్రలు అంతంత మాత్రమే. తినేందుకు పళ్లాలు, చెంచాలూ కూడా లేవు. మనం పని ఎక్కడ ప్రారంభించాలి? ఎలా మొదలు పెట్టాలి?" అని వొలొఖోవ్ ప్రసంగించాడు. పిల్లలంతా నేనేదో సలహా ఇస్తానని, దారి చూపుతానని నా వంక ఆశగా చూస్తున్నారు. నేను వేరే ఆలోచనల్లో ఉన్నాను.

పిల్లల సహాయక కమిటీతో కుదిరిన ఒప్పందం ప్రకారం వాళ్లు మాకు అతి అయిష్టంగా ఇరవై వేల రూబుళ్లు ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. కానీ ఈ కాలనీ అవసరాలు తీర్చి, ఒక దారిలో పెట్టాలంటే ఆ డబ్బు ఒక మూలకి చాలదు. ఇక్కడి వర్క్‌షాపుల్లో పనిముట్లుకాని, వ్యవసాయ పరికరాలు కానీ ఏవీ చాలవు. ఉన్నవేవీ పనికిరావు. అన్నీ కొనాలి. ప్రతి దాన్నీ పునర్నిర్మించాలి.

ఆ సాయంత్రం గ్రామం నుంచి ఇద్దరు వడ్రంగులు మా సాయానికి వచ్చారు. అవసరమైన డబ్బులిస్తే కాలనీలో చెక్క పనులకు సంబంధించిన మరమ్మతులన్నీ పూర్తి చేస్తామన్నారు. వారికి కొంత డబ్బు బయానాగా ఇచ్చాను. తరువాత వొలొఖోవ్ ఆదేశాల మేరకు మా కుర్రవాడు ఎవజేన్‌యేవ్ ఒక బండిపై అవసరమైన సామాగ్రి కొనుగోలు చేసేందుకు బయలుదేరి వెళ్లాడు. వాడికి గాటిలోనే మా రబ్‌షాక్ కుర్రవాళ్లు ఎదురుపడ్డారు.

ఈ కాలనీ పరిస్థితి ఎంత దుర్భరంగా ఉందో, చేయవలసిన పని ఎంత ఉందో స్వయంగా జూసిన కరబనోవ్, జదరోవ్‌లు పట్టణంలోని తమ ఏడవ డిటాచ్‌మెంట్ మొత్తాన్ని తరలించుకు వచ్చారు. మేమున్న అయోమయ పరిస్థితుల్లో వాళ్లు మా సాయానికి రావడం నాకెంతో ధైర్యాన్నిచ్చింది. మా పాతమిత్రులు బరున్, కరబనోవ్, బ్రాచెంకో, మిట్కా ఒసాడ్చీ, వెర్షనోవ్, మారుస్యా, నాస్త్యా, జార్జివ్‌స్కీ, షినీడర్, క్రైనిక్, గోలోస్, జదరోవ్ అంతా కదిలి వచ్చారు. వీళ్లంతా అప్పటికే రబ్‌ఫాక్‌లో మంచి విద్యార్థులుగా పేరుపొంది బాగా చదువుతున్నారు.

మా తొలినాటి అనుభవాలను వారికి వివరించాను. అంతా విన్న జదరోవ్ కొంతసేపు ఆలోచించి, "లాభంలేదు బలంతో వీళ్లని లొంగదియ్యలేం. వాళ్ల సంఖ్య చాలా ఎక్కువ" అన్నాడు. బరున్ తన విశాలమైన భుజాలు ఎగరేసి నవ్వాడు.

"అందరినీ లొంగదీయనవసరంలేదు కామ్రేడ్. అందరూ గూండాలై ఉండరు. వీళ్లలో ఒక బలమైన ముఠా ఒకటి ఉంటుంది. వాళ్లని గుర్తిస్తే చాలు. పని సులభం అవుతుంది" అన్నాడు.

ముందు కాలనీ పిల్లలందరినీ సమావేశపరచేందుకు ప్రయత్నించాలని నిర్ణయించాం. ఆ చర్చల్లో పాల్గొన్న గుల్యేవా అడ్డంగా తల ఊపింది. "అందరూనా... అందరూ సమావేశానికి రానేరారు" అంది.

కరబనోవ్ కోపంతో రెచ్చిపోయాడు. "ఎందుకు రారు? ప్రయత్నిద్దాం. రెండువందల ఎనభై మంది రాకున్నా, కనీసం నూటఎనభైమందిని తీసుకొద్దాం" అన్నాడు.

ఇప్పటికే భోజనాలకు ఆలస్యమైంది. కాలనీ కుర్రవాళ్లు ఆకలితో ఉండి ఉంటారు. ముందు భోజనం పంపిద్దాం. పిల్లలు డార్మెటరీల్లో కూర్చుని ఆహారం తీసుకొంటూండగా, మనం అంతా వెళ్లి సమావేశానికి రావలసిన అవసరం గురించి అందరికీ చెబుదాం. అది మీ మంచికేనని నచ్చచెబుదాం. ఇదీ సమావేశంలో మేం నిర్ణయించింది. అక్కడ నుంచి అందరం కలిసి భోజనాల గది వైపు వెళ్లాం. అక్కడ వంటగది గుమ్మంలో మా మిష్కా ఓచరెంకో కాపలాగా నిలబడి ఉన్నాడు. వాడి ఎదురుగా ఎర్రజుట్టు కుర్రవాడు ఒకడు నిలిచి ఉన్నాడు. వాడే గత రాత్రి తోటలో ఎదురుపడి నాతో దురుసుగా మాట్లాడినది. అయితే వాడి మొహంలో ఇప్పుడు పొగరులేదు. పైగా పెదాలూ, ముక్కు వాచిపోయి ఉన్నాయి. మిష్కా వాడితో ప్రశాంతంగా మాట్లాడుతున్నాడు.

"చూడు బాబూ పని చేయని వాడికి తిండిని డిమాండ్ చేసే హక్కు ఉండదు. అంటే నీకు ఏ హక్కూ లేదన్నమాట. అర్థమైందా? నీకు ఏ హక్కూ లేదు. కానీ నీ మీద దయతో తినడానికి ఏదైనా ఇస్తాను. కానీ చెబుతున్నాగా అది కేవలం నీ మీద జాలితో నేనుగా ఇచ్చేది మాత్రమే. ప్రతివారూ పని చేసి తీరాలి. తిని తిరుగుదామంటే కుదరదు" అంటున్నాడు.

ఆ ఎర్రజుట్టు కుర్రవాడు ఒంటికంటితో మిష్కావంక కోపంగా చూస్తున్నాడు. ఆ రెండోకన్ను ప్రస్తుతానికి ఏమీ చూడలేదు. ఆ వైపంతా మొహం వాచిపోయి కన్ను మూసుకుపోయి ఉంది. పై పెదవి, కుడి దవడలపై రక్తపు చారికలున్నాయి. ఏం జరిగింది? అర్థంకాలేదు.

మిష్కాను కోపంగా అడిగాను, "నువ్వు వాణ్ణి కొట్టావా?" అని.

"లేదు. ఆంటన్ సెమ్యోనోవిచ్. నేనెవరినీ కొట్టలేదు. అసలు ఇక్కడి నుంచి అంగుళం కూడా కదల్లేదు. వొలొఖొవ్ ఆదేశాల ప్రకారం ఇక్కడ కాపలా కాస్తున్నాను. కమాండర్ వొలొఖొవ్ ఆదేశాల ప్రకారం కుర్రవాళ్లెవరినీ వంటగదిలోకి పోన్వివకూడదు. నేను ఆ ఆదేశాలు పాటిస్తున్నాను. వాడి

పేరు ఖోవ్‌రోఖ్ అట. నేను వాడివెంటపడి తరమలేదు. కొట్టలేదు. ఇక్కడ నిలబడి ఉన్నాను. కమాండర్ వొలొఖోవ్ ఆదేశాలు మరి. ఆ పని మీదే ఉన్నాను. వాడు ఈ ఖోవ్‌రోఖ్ ఇక్కడేం పని? నాకు తెలియదు. వాడే దేన్నైనా గుద్దుకున్నాడో, లేక దేనికైనా అడ్డం పడ్డాడో వాడినే అడగండి" అని బదులిచ్చాడు.

ఖోవ్‌రోఖ్‌కు నాతో మాట్లాడే ఉద్దేశం లేనట్టుంది. వాడు మిష్కా వంక ఉగ్రంగా చూసి బొబ్బరించాడు. 'సరే, అదీ చూద్దాం. మాకు తిండిపెట్టకుండ పస్తులుంచే హక్కు ఉందను కుంటున్నావు అంతేగా. అదీ చూద్దాం. నా సంగతి నీకు తెలియదు. త్వరలో తెలుస్తుంది'

ఇటువంటి వ్యవహారం ఒక్కోసారి ఎంత ప్రమాదకర పరిణామాలకు దారి తీస్తాయో నాకు తెలుసు. అందుకే మధ్యేమార్గం అనుసరిద్దామని నిర్ణయించుకున్నాను. అందుకే మళ్లీ మిష్కాను అడిగాను. "వాడిని కొట్టే హక్కు నీకుందా?" అని.

వాడు నవ్వుతూ జేబులోంచి ఒక కత్తితీసి నాకు చూపించాడు. "చూడండి. ఇదో కత్తి. ఇది నా దగ్గరికెలా వచ్చిందనుకుంటున్నారు? నేను వీడి దగ్గర్నుంచీ దొంగిలించానా? లేదే? వోలోఖోవ్ నన్ను ఇక్కడ కాపలా ఉండి, వంటగదిలోకి ఎవరూ వెళ్లకుండా చూడమన్నాడు. నేను నిలబడ్డాను. అంగుళం కూడా కదల్లేదు. వీడు ఈ కత్తి చూపించి నన్ను బెదిరించాడు. మర్యాదగా అడ్డు తొలిగి లోపలికి వెళ్లనివ్వమన్నాడు. నేను వాణ్ని ఓ తోపు తోశాను. దాంతో వాడు కత్తి తీశాడు. పిచ్చివెధవ క్రమశిక్షణ అంటే ఏమిటో తెలియదు...."

కానీ నువ్వు వాడిని కొట్టావ్. ఆ రక్తం చూడు నువ్వేగా కొట్టింది?" అని మిష్కాను నిలదీశాను.

వాడు అయోమయంగా తన చేతుల వంక చేసుకున్నాడు. "నేనే. నేను కాక మరెవరై ఉంటారు. వొలొఖోవ్ నన్ను ఇక్కడ నిలబడమన్నాడు. అంతే. ఈలోగా ఈ ఖోవ్‌రోఖ్ కత్తితో నా దగ్గరికి వచ్చి చేతులు జాడించాడు".

"నువ్వేం చేయలేదంటావ్?"

"అలా ఎందుకంటాను? నన్ను చేతులు కదపవద్దని ఎవరూ ఆదేశించలేదే! ఇక్కడ నిలబడ మన్నారు. నిలుచున్నాను. బహుశా చేతులు కదిపే ఉంటాను. కాళ్లు మాత్రం కదల్లేదండోయ్. బహుశా చేతులు వేగంగా కదిపి ఉంటాను. అది నా తప్పా? అయినా ఖోవ్‌రోఖ్ నడిచేటప్పుడు కాస్త జాగ్రత్తగా ఉండాలి కదా? ఉదాహరణకు ఒక రైలు వస్తోందనుకో, నువ్వు నడుస్తున్నావు. రైలుని చూశావు. ఏం చేయాలి? పక్కకి తప్పుకోవాలి. అంతేకానీ నీ కత్తిని ఝుళిపిస్తూ రైలుకి ఎదురువెళ్లావనుకో, ఆహాఁ వెళ్లావనుకో. ఏమవుతుంది? చెప్పు. ఉండు నేనే చెప్తా. ముద్దముద్దగా మిగులుతావు. ఆనవాలు కూడా తెలియదు. అంతేనా. నువ్వేమైనా పసికూనవా ఇవన్నీ తెలియక పోవడానికి?" అని జవాబు చెప్పాడు మిష్కా.

రైలు రావడం, అదీ వేగంగా నడవడం, ఖోవ్‌రోఖ్ ఎదురుగా కత్తితో నిలబడడం వంటి దృశ్యాలను మిష్కా అభినయించి మరీ చూపాడు. అప్పటికే ఈ వినోదాన్ని చూసేందుకు గుమిగూడిన ఆ కాలనీ పిల్లలు పగలబడి నవ్వారు. ఆ పిల్లల్లో వాన్యజైచెంకో కూడా ఉన్నాడు. వాడు గతరాత్రి డార్మెటరీలో నాకు పరిచయమయ్యాడు. వాడు మిష్కా చెప్పిందంతా విని, ఖోవ్‌రోఖ్‌తో అన్నాడు.

"అంటే ఎవరైనా నీ మొహం పచ్చడి చేస్తే నీకు కోపం వస్తుందన్నమాట. నీకు నచ్చదన్నమాట?" అని అడిగాడు.

ఖోవ్‌రోఖ్ ఆగ్రహంతో రెచ్చిపోయాడు. "నోర్మూయ్, కుర్రకుంకా" అని అరిచాడు. చూడండి. ఖోవ్‌రోఖ్‌కు తననెవరైనా కొట్టడం అసలు నచ్చదు అంటూ వాన్య ఆనందంగా కేరింతలు కొట్టాడు. దీంతో ఖోవ్‌రోఖ్ వాడిని పట్టుకొనేందుకు ప్రయత్నించాడు. ఈలోగా వెనక నుంచి కరబనోవ్ వచ్చి వాడిని వెనక్కి లాగాడు. వాన్య నెమ్మదిగా మిష్కా పక్కన చేరాడు.

"ఖోవ్‌రోఖ్" అని పిలిచాను.

"ఏమిటి?" అన్నాడు వెనుదిరిగి.

"ఇలా రా" అని పిలిచాను. వాడికి నా మాట వినే ఉద్దేశం లేదు. కాదనే ధైర్యమూ లేదు. అందుకే ఏదో పని ఉన్నట్టు జేబులు వెతుక్కోవడం మొదలుపెట్టాడు.

"ఇలారా చెబుతాను" మళ్లీ పిలిచాను.

చుట్టూ నిశ్శబ్దం. ఏం జరుగుతోందోనని కుర్యాజ్ పిల్లలు మావంకే చూస్తున్నారు. ఖోవ్‌రోఖ్ అయిష్టంగా, బద్ధకంగా నా వేపు నడిచాడు. తన క్రోధపూరితమైన చూపుతో నన్ను భయపెట్టే ప్రయత్నంతో ఒక్కొక్క అడుగే వేస్తూ వచ్చి, నా ఎదుట నిలబడ్డాడు.

"అటెన్షన్" అని అరిచాను.

"అటెన్షన్? అంటే ఏమిటి?" అని గొణుక్కుంటూనే నిటారుగా నిలబడి, జేబుల్లోంచి చేతులు తీశాడు. కానీ నాకు లొంగిపోయినట్టు కనిపించకూడదనే ఉద్దేశంతో కాబోలు ఒక చెయ్యిని నడుంమీద పెట్టుకొని నా వంక నిర్లక్ష్యంగా చూశాడు.

వెనక నుంచీ కరబనోవ్ వచ్చి వాడి చేతిని తీసి సరిగ్గా, తిన్నగా సర్దాడు.

"చూడు నాయనా అటెన్షన్లో నిలబడమన్నప్పుడు కోతిచేష్టలు చేయకూడదు. సరిగ్గా నుంచో, తలపైకెత్తు" అని అనునయంగా చెప్పాడు.

ఖోవ్‌రోఖ్ ఒక్కసారి కోపంగా మూలిగాడు. కానీ సరిగ్గా నిలబడ్డాడు.

"నువ్విప్పుడు గోర్కీకాలనీవాసివి. నీతోటివారిని గౌరవించడం నేర్చుకోవాలి. పిల్లల్ని బెదిరించడం, కొట్టడం మానుకోవాలి. సరేనా?" అని అడిగాను. నా గొంతులో అనునయం కంటే, హెచ్చరిక, పదును వాడిని భయపెట్టి ఉండాలి.

"సరే" అన్నాడు.

"సరే అనకూడదు. మంచిదండీ, అలాగేనండీ అని జవాబివ్వాలి" అని వెనుకనుంచీ బెలూఖిన్ వాడికి తొలిపాఠం నేర్పాడు.

మాట్వీ ముందుకు వచ్చి ఖోవ్‌రోఖ్ చేతిని పైకెత్తి సెల్యూట్ చేయించాడు. తరువాత కటువైన స్వరంతో అన్నాడు "చెప్పు, అలాగేనండీ ఇక ఎప్పుడూ పిల్లల జోలికి పోనండీ అని చెప్పు" అన్నాడు. ఖోవ్‌రోఖ్ రోషం వచ్చినట్టుంది.

"మీరంతా నాపై ఎందుకు పగబట్టారు? నేనేం తప్పు చేశాను? ఆ కుర్రవాడు నన్ను కొట్టాడు. నేనేం చెయ్యలేదు" అన్నాడు మొండిగా.

కుర్యాజ్ పిల్లలంతా ఏం జరుగుతోందో చూద్దామన్నట్టు మరింత దగ్గరికి జరిగారు. కరబనోవ్ వచ్చి ఖోవ్‌రోఖ్ భుజాలపై చేతులు వేసి వాడితో అప్యాయంగా చెప్పాడు.

"చూడమ్మా. నువ్వు తెలివైనవాడివి. అర్థం చేసుకోగలవు. మిష్కా ఇక్కడ ద్యూటీలో ఉన్నాడు. ఎవరినీ వంటగదిలోకి రానివ్వకపోవడం అన్నది వాడి విధి. అందరి శ్రేయస్సు దృష్ట్యా వాడికి ఆ

ఆదేశాలు ఇచ్చారు. నువ్వేం చేశావు.... పర్లేదులే నేను చెబుతాను నా తోరా" అంటూ బయటకు తీసుకెళ్లాడు.

అందరికీ భోజనాలు పెట్టమని వొలొఖోవ్ వంటమనిషిని ఆదేశించాడు. వంటాయన అతని వంక, మిష్కావంక గౌరవంగా తలపంకించి లోపలికి వెళ్లాడు.

సాయంత్రం క్లబ్ హాల్లో సమావేశం ప్రారంభమైంది. మా ప్రచారం ఫలితమా, లేక ఉదయం వంటగది వద్ద జరిగిన సంఘటన గురించి తెలుసో కానీ, సమావేశానికి చాలా మంది పిల్లలు వచ్చారు. మళ్లీ మిష్కా క్లబ్ హాల్ ప్రవేశద్వారం వద్ద గార్డుగా నిలిచాడు. ఒసాడ్చీ, షెలాపుటిన్‌లు సమావేశానికి హాజరైన పిల్లలు పేర్లన్నీ జాబితాగా రాశారు. కొంత ఆలస్యంగా మీటింగ్‌కు వచ్చినవారు ముందుకు తోసుకొంటూ వచ్చి "ఇందులో పేర్లు లేని వారికి అన్నం పెట్టరా?" అని అడుగుతున్నారు.

నేను ఎత్తైన వేదిక పై నిలబడి ఆ పిల్లల సమూహం వంక చూశాను. ఎంత మంది అనాథలు? వాళ్లలో చిరునవ్వేది? అమాయకత్వం ఎక్కడికి పోయింది? బాల్యం ఎలా అదృశ్యమైంది? హాల్లో వెనుకగా స్టవ్వు చుట్టూ బాలికలు భయంభయంగా కూర్చున్నారు. నేను ఉపన్యాసం ప్రారంభించాను.

ముందు గోర్కీకాలనీ గురించి వివరించాను. అక్కడి పద్ధతులు, పని, క్రమశిక్షణ, పరిశుభ్రత అన్నీ సవివరంగా చెప్పాను. ప్రయత్నిస్తే మీరు ఇవన్నీ సాధించవచ్చునన్నాను. సరికొత్త జీవితం మీ కోసం ఎదురు చూస్తోందని ఆశ చూపాను. ఇప్పుడు మనకి మనమే యజమానులం. భూస్వాములు లేని సోషలిస్టు సమాజంలో బతుకుతున్నామనీ, మనమంతా స్వేఛ్ఛాయుతమైన వాతావరణంలో మనకు కావాలసిన విధంగా, మరొకరికి హాని చేయకుండా, కష్టించి పనిచేస్తే సుఖంగా జీవితాన్ని గడపవచ్చునీ చెప్పాను. కొద్దిసేపటికే నాకు అలసట వచ్చింది. పిల్లలెవరూ నా మాటలు వినడంలేదని తెలుస్తోంది. నేను మాట్లాడుతున్నది గోడలతో, బెంచీలతోనని అర్థమైంది. అయినా పట్టుదలతో కొనసాగించాను. పిల్లలంతా డిటాచ్‌మెంట్‌గా ఏర్పడాలని చెప్పాను. ఇరవయ్యేసిమంది పిల్లలు మొత్తం పద్నాలుగు డిటాచ్‌మెంట్‌లు ఏర్పడాలనీ, వారు తమ నాయకులుగా పద్నాలుగుమంది కమాండర్లను ఎన్నిక చేసుకోవాలనీ వివరించాను. వాళ్లంతా నిశ్శబ్దంగా విన్నారు. ఏమైనా ప్రశ్నలుంటే అడగమన్నాను. మౌనమే కొనసాగింది.

కుడ్లాటీ వేదికపైకి వచ్చాడు. "చూడండీ, మిమ్మల్ని చూసి మీరు సిగ్గుపడ్డాలి. మీకు రొట్టె, బంగాళాదుంపలు, మాంసంపులుసు కావాలి. కానీ, అవన్నీ మనకు ఎక్కడినుంచి వస్తాయి. ఎవరు వాటిని సమకూరుస్తారు? రేపు మీకు అన్నం పెట్టమనుకోండి? ఏం చేస్తారు?" అని వారిని నిలదీశాడు. దీనికీ ఎవరూ సమాధానం చెప్పలేదు.

కుడ్లాటీ కొనసాగించాడు. "సరే లేవండి. మీలో ప్రతి ఒక్కరూ రేపటి నుంచి రోజుకు ఆరుగంటలు పని చేసి తీరాలి. పొలం దున్నాలి. విత్తనాలు చల్లాలి. అర్థమైందా?" అని అడిగాడు.

ఒక మూలనుంచి ఎవరో అరిచారు "మేం పని చేస్తాం?". మిగిలినవాళ్లు ఆ దిశగా చూసారు.

జడరోవ్ నా వైపు తిరిగి ధైర్యం చెబుతున్నట్టు నవ్వాడు. "ఫర్వాలేదు. అంతా దారిలోకి వస్తారు" అన్నాడు.

4

అసలైన అనాథలు

కుర్యాజ్ కాలనీ పిల్లలను డిటాచ్‌మెంట్‌లుగా ఏర్పరిచి మర్నాడు పనిలోకి దింపేందుకు మా సన్నాహాలు ఆ రాత్రి కూడా కొనసాగాయి. రబ్‌ఫాక్ నుంచి వచ్చిన కుర్రవాళ్లు ఆ సాయంత్రం

సమావేశానికి హాజరైన పిల్లల పేర్ల జాబితాను తీసుకొని డార్మెటరీల్లోకి వెళ్లారు. గోర్కోవ్ స్కీని వెంటతీసుకొని నేనూ తిరిగాను. ఈ కాలనీని పటిష్టమైన వ్యవస్థగా, ఒక కమ్యూన్‌గా తీర్చిదిద్దాలంటే, ముందు వీరి మధ్య సదవగాహన, సాన్నిహిత్యం పెరగాలి. అందుకు మేం కృషి చేయాలి. ఆ ప్రయత్నమే ప్రారంభించాం. డార్మెటరీల్లో చాలామంది పిల్లలు లేనే లేరు. అనేక మంచాలు ఖాళీగా ఉన్నాయి. ఈ రాత్రి వేళ అందరూ ఎక్కడికి వెళ్లాలో ఎవరికీ తెలియదు. ఉన్న వారినే ప్రశ్నించడం మొదలుపెట్టాం. ఇక్కడ ఎవరెవరు ఎక్కువ స్నేహంగా ఉంటారు, ఎవరెవరు కలిసి తిరుగుతారు, అల్లరి చేసేవారెవరు? ఉన్న వారిలో కాస్త మంచివారెవరు... ఇలాంటి ప్రశ్నలకు అరకొర సమాధానాలే లభించాయి. కాలనీ వాసుల్లో చాలామంది మధ్య కనీసం పరిచయాల్లేవు. ఎవరి పేరు ఎవరికీ తెలియదు. పక్క మంచం మీద పడకునే కుర్రవాడు ఏమయ్యాడు అని అడిగితే తెలియదని సమాధానం! పోనీ వాడి పేరేంటని అడిగితే దానికీ అదే జవాబు! నిజంగానే ఇక్కడ ఎవరి గురించీ, ఎవరికీ ఏదీ తెలియదు.

పొడుగు ముక్కువాడు, తొంటి కాలువాడు, వొల్కీ నుంచి వచ్చిన కుర్రాడూ... ఇవీవాళ్ల పేర్లు... వాళ్లెవరూ కలిసి తిరగకపోవడం, కలిసిమెలిసి పనిచేయకపోవడం వల్ల ఈ పరిస్థితి నెలకొంది. ఆ విషయం స్పష్టంగానే తెలుస్తోంది. కొన్నిచోట్ల మాత్రం కొంతమంది బృందంగా ఏర్పడి తమ అవసరాలు గడుపుకొంటున్నారు అంతా. రాత్రి గడుస్తోన్న కొద్దీ నాకు కాలనీ పరిస్థితి అర్థమవుతున్నట్టు తోచింది.

వీళ్లంతా నిజమైన అనాథలు. వీళ్లలో చాలామంది పదమూడు-పదిహేను సంవత్సరాల మధ్య వయసుగలవారు. వాళ్లలో అత్యధికులు ఇప్పటికే కనీసం మూడేసి కాలనీల్లో బతికినవాళ్లు, కొందరైతే ఇప్పటికి పదికాలనీలను చూశారు. విద్యా విభాగంలోని అర్థం పర్థంలేని సిద్ధాంతాలు నమ్మే అధికారుల వైఖరి మూలంగా వీరిలో స్థిరత్వం లోపించింది. రేపు ఎక్కడ తెల్లవారుతుందో తెలియని అగమ్యస్థితిలో వారున్నారు. అందుకే కొత్తగా వచ్చిన మమ్మల్ని కూడా వారు నమ్మడం లేదు. ఎవరి మొహం చూసినా వారికి పరిసరాల గురించి కనీస జ్ఞానం గానీ, ఆసక్తిగానీ ఉన్నట్టు కనిపించలేదు. సామాజిక చైతన్యం అంటే వీరికి కొరుకుడుపడని మాట. ఏళ్ల తరబడి సామాజిక విద్యాకేంద్రాల్లోనే గడిపినా వీరికి సమాజమన్నా, విద్య అన్నా ఏమీ తెలియదు. వాళ్లకి జీవితం అంటే తెలియదు. లేచింది మొదలు నిద్రపోయేవరకూ వారి తాపత్రయం ఆహారం గురించే. తిండి ఉంటుందనుకున్న చోటికి అయిష్టంగానైనా, బద్ధకంగానైనా ఏదో విధంగా చేరి ఆ పూట పొట్ట నింపుకుంటే రాత్రి సంగతి అప్పుడు చూసుకోవచ్చు. అదీ వీరి ధోరణి. ఇంతవరకూ వారి సర్వశక్తులూ గంజికేంద్రాల్లో, పిల్లల కాలనీల్లో, మిగతావారితో కలబడి, పోరాడి ఇంత తిండి సంపాదించేందుకు వినియోగించారు. వారి వ్యక్తిగత జాబితాలు ఇంతవరకే - వంటశాలనుంచి నిద్రపోయే స్థలం వరకూ - పరిభ్రమించాయి. ఎవరికీ ఇంతకంటే ఏ ఆసక్తీ లేదు. కష్టపడకుండా ఎవరి వస్తువైనా దొంగిలించగలిగితే వారు దానికి సిద్ధం. లేదా పెద్ద కుర్రవాళ్ల భయంతో అయిష్టంగానైనా దొంగతనానికి బయలుదేరతారు.

అయితే వీరేమన్నా బయటి గ్రహంజీవులా? కాదు. అతిసాధారణమైన పిల్లలు. నా అనేవారు లేక వీధినపడిన అమాయకులు. మానవ వికాసానికి, అభివృద్ధికి గల ఏ అవకాశమూ లభించని దురదృష్టవంతులు. ఈ పిల్లల వెనక ఒక అదృశ్యశక్తి ఉన్నదని, అదంటే భయంతో, ద్వేషంతో బిక్కుబిక్కుమంటూ మనుగడ సాగిస్తున్నారనీ మా సీనియర్లు గుర్తించారు.

ఖోవ్‌రాఖ్ ఉండేది సీనియర్ల డార్మెటరీలో. అందులో మొత్తం పదిహేనుమంది కుర్ర వాళ్లుంటారు. కొరట్కొవ్ అనే వాడు వాళ్ల అధినాయకుడు. వాడిని నేనింత వరకూ చూడలేదు. ఈ సీనియర్లలో

చాలామంది రోజులో అధికభాగం పట్టణంలోనే ఉంటారు. మొదట వీరు కాలనీనే దోచుకున్నారు. టీచర్ల గదులు, వర్క్‌షాపులు, స్టోర్‌రూంలు ఖాళీ అయిన తరువాత పట్టణంలోని మార్కెట్లపై పడ్డారు. మరికొందరు రాత్రివేళ ఖార్కోవ్ రహదారిపై ప్రయాణికులను దోచుకుంటారు. అవసరం ఉన్నప్పుడల్లా కాలనీలో సహచరుల వస్తువులు, ఆహారం కూడా వారి సొంతమవుతాయి.

వెట్కా ఈ సీనియర్ కుర్రవాళ్ల 'యంత్రాంగం' గురించి నాకు వివరించాడు. ప్రతి సీనియర్ కుర్రవాడికీ కొందరు పిల్ల సహచరులుంటారు. ఉదయమే ఈ సీనియర్లు తమ పిల్ల అనుచరులకు ఆదేశాలిస్తారు. సాయంత్రంలోగా ఇన్ని రూబుళ్లు సంపాదించాలి అని. ఈ పిల్లలు నిజంగానే సాయంత్రంలోగా దొంగిలించో, ముష్టి ఎత్తో ఆ సొమ్ము సంపాదించి తెచ్చి తమ నాయకునికి ఇస్తారు. ఇక్కడ కూడా 'న్యాయం' ఉంది. పిల్లలు తెచ్చిందంతా ఆ నాయకుడు తీసేసుకోడు. వాళ్లు తెచ్చిందాంట్లో మూడువంతులు మాత్రం తను తీసుకొని మిగిలినదాన్ని ఆ పిల్లవాడికే ఉదారంగా వదిలేస్తాడు.

కాలనీలోనే జైచెంకో, మలికోవ్‌లాంటి పిల్లలూ ఉన్నారు. ప్రకృతి ప్రసాదించిన ఏ శక్తి వల్లనో కానీ వారు ఇంకా తమ మెరిసేకళ్లనూ, పసితనపు అమాయకత్వాన్నీ, మనిషికి సహజసిద్ధమైన ఇతరగుణాలనీ వారు పూర్తిగా కోల్పోలేదు. జీవితం తమ పట్ల ఎంత కఠినంగా ఉన్నా వారు ఇంకా పూర్తిగా గిడసబారలేదు. మా కాలనీ కుర్రవాళ్లు ఇక్కడకు రాగానే, తమకు వారికీ గల బేధాన్ని వీరు గుర్తించారు. మా కుర్రవాళ్ల ఆత్మవిశ్వాసం, చలాకీతనం, నిజాయితీ, క్రమశిక్షణ వారిని ఎంతోకొంత ఆకట్టుకున్నాయి. వాళ్ల సంఖ్య ముప్పైవరకూ ఉంటుంది.

ఇలా కాలనీలో అందరినీ పరిశీలిస్తూ, వారిపై ఒక అంచనాకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నప్పుడు మాకు అనుకోకుండా "వ్యవసాయనిపుణులు" తగిలారు. మొత్తం పధ్నాలుగుమంది. కాలనీలోని వాన్య నిజంగా వ్యవసాయ నిపుణులనే నమ్ముతున్నాడు. నాతో వాదించాడు కూడా. "ఏం ఎందుక్కాదు? వాళ్లు పొలం దున్నుతారు, విత్తనాలు చల్లుతారు. పంట పండిస్తారు" అని వివరించాడు. పైగా వాళ్లంతా తమకు వ్యవసాయనిపుణులనే డిప్లొమా సర్టిఫికేట్లు లభిస్తాయని ఎదురుచూస్తున్నారు కూడా. ఈ పధ్నాలుగు మందీ విడిగా రెండు గదుల్లో ఉంటున్నారు. నేను వాళ్లని కలుసుకున్నాను. వాళ్లు నన్ను ఏ మాత్రం విశ్వసించడంలేదని తెలుస్తూనే ఉంది. అయినా ఓపికగా మాట్లాడి విషయం తెలుసుకున్నాను.

రొట్టి తోటే మనిషికి ప్రగతి అని విశ్వసించే పిల్లల సహాయసంఘం ఛైర్మన్ ఖాలాబుదా కొంతకాలం క్రితం ఇక్కడికి ఒక ప్రతినిధిని పంపాడు. వ్యవసాయం ప్రారంభింపచేయమని, కానీ ఈ ప్రతినిధి మాట ఎవరు వింటారు? ఎలాగైతేనేం ఆయన ఈ పధ్నాలుగు మందినీ పట్టుకొని వారికి యాభయ్యేసి రూబుళ్లు యిచ్చి, కొత్త బట్టలు, దుప్పట్లు, బూట్లు కొనిచ్చి వారిని దారికి తెచ్చాడు. తనతో కలిసి వ్యవసాయం చేస్తే అనుభవం వస్తుందని ఆ తరువాత యూనివర్సిటీ నుంచి వ్యవసాయ నిపుణులనే డిప్లొమాలు ఇప్పిస్తాననీ ఆశపెట్టాడు. ఆ సర్టిఫికెట్ సాయంతో ఏ వ్యవసాయక్షేత్రంలోనైనా మంచి ఉద్యోగం వస్తుందని చెప్పాడు. ఇన్ని ఇచ్చిన మనిషి సర్టిఫికెట్ ఇప్పించలేడా అన్నది ఈ పిల్లల నమ్మకం. కానీ, పాత డైరెక్టర్ వెళ్లిపోతూ వారికి చెప్పాడట. వీలైనంత త్వరలో ఆ సర్టిఫికేట్ పంపిస్తాననీ, కానీ కొత్త డైరెక్టర్ (నేను) అడ్డుపడవచ్చనీ హెచ్చరించాడట. అదీ సంగతి.

నేను వారికి ఓపికగా వివరించాను. వ్యవసాయ నిపుణుడు కావాలంటే అందుకు చాలా సంవత్సరాలు చదువుకోవాలని, వ్యవసాయంలో నిజమైన నైపుణ్యం సంపాదించాలనీ, అయితే

వారు నన్ను నమ్మలేదు. పైగా శత్రువుగా పరిగణించారు. "నీ సంగతి మాకు ముందే తెలుసులే" అన్నట్టు వ్యవహరించారు. గోర్కీ వాసులు ఇక్కడికి వచ్చినది తమందరినీ బానిసలుగా ఉపయోగించుకొనేందుకేనన్న రహస్యం కూడా వారికి తెలుసునట.

"ఏం చెప్పగలను?"

"సరే మీ ఇష్టం. మీరు వ్యవసాయ నిపుణులైతే కాన్వివండి, కానీ మాకైతే అప్పుడే మీ సేవలు అవసరం లేదు" అని చెప్పి అక్కడినుంచి వచ్చేశాను.

మర్నాడు ఉదయం ముందు రాత్రి నిర్ణయించిన విధంగానే ఆరుగంటలకల్లా మావాళ్లు చర్చి గంట మోగించారు. లెక్క ప్రకారం డార్మెటరీల్లోంచి పిల్లలంతా లేచి మొహాలు శుభ్రం చేసుకొని, కాలకృత్యాలు తీర్చుకొని ఫలహారానికి రావాలి. కానీ నిన్ననే కొన్న ఆ కొత్త గంట ఎంతసేపు మోగినా డార్మెటరీల్లో చలనం లేదు. కాలనీ మానిటర్ బాధ్యతలు చేపట్టిన మా కొత్త టీచర్ ఇవాన్ డెనిసోవిచ్ విచారంగా తిరిగి వచ్చాడు కుర్రవాళ్లెవరూ నిదురలేవలేదు. అదీ సంగతి.

ముందు రోజు రాత్రి కొత్త డిటాచ్‌మెంట్‌ల కమాండర్లతో మా వాళ్లు గంటల తరబడి మాట్లాడారు. ఉదయమే లేచి తమ డిటాచ్‌మెంట్ సభ్యులతో చర్చి మెట్ల మీద ఉండే మిష్కా నుంచి పలుగులూ, పారలూ ఇతర పనిముట్లు తీసుకొని పొలం పని మొదలు పెట్టించాలని పదే పదే చెప్పారు. నేను సైతం ఆ చర్చల్లో పాల్గొని ఎవరి డిటాచ్‌మెంట్‌లో ఎవరెవరు సభ్యులో ఒకటికి పదిసార్లు చెప్పాను. కానీ ఏం లాభం గంట ఎంత సేపు మోగించినా ప్రయోజనం లేకపోయింది. ఈలోగా మిష్కా కొత్త పనిముట్లతో, చేతిలో ఓ నోట్‌బుక్‌తో చర్చి మెట్లపై డిటాచ్‌మెంట్‌ల రాకకోసం సిద్ధంగా ఉన్నాడు. మరోవైపు మా సీనియర్లు అశ్వశాల అంతా గాలించి ఎట్టకేలకు కొన్ని గుర్రాలు సంపాదించి మూడు నాగళ్లు సిద్ధం చేశాడు. కుద్లాటీ బండి తీసుకొని ఊళ్లోకి వెళ్లాడు. విత్తనాల దుంపలు తెచ్చేందుకు బయలు దేరాడు. తరువాత కొద్ది సేపటికి రాత్రంతా ఊళ్లో షికార్లు సాగించిన కుర్రవాళ్లు నిద్రమొహాలతో కాలనీకి తిరిగి రావడం మొదలైంది. వాళ్లని ఆపి, ప్రశ్నించి, సోదాచేసే ఓపిక, ఆసక్తి నాకు మిగల్లేదు. అలా వచ్చినవాళ్లు వచ్చినట్టు డార్మెటరీల్లోకి వెళ్లి మంచాలపై వాలిపోతున్నారు. దీనితో నిద్రపోయేవారి సంఖ్య మరింత పెరిగింది.

రాత్రి కమాండర్ల మండలి తీర్మానించిన ప్రకారం కుర్రవాళ్లలో కొందరు డార్మెటరీలను, ఆవరణను శుభ్రం చేయాలి. వాళ్ల జాడకూడా ఎక్కడా లేదు. చివరికి ఎప్పుడో గంటన్నర తరువాత డార్మెటరీలనుంచి కుర్రవాళ్లు కళ్లు నులుముకుంటూ ఫలహారాలకు సిద్ధమయ్యారు. నిన్ననే కొనుక్కొచ్చిన కొత్త పళ్లాలు, బెంచీలు అక్కడ బల్లలపై సిద్ధంగా ఉన్నాయి. పిల్లలంతా చేరి బద్ధకంగా, నెమ్మదిగా తిండికి ఉపక్రమించారు. ఇది ఉదయం పదిగంటల వరకూ సాగింది. అంతసేపు నేను భోజనాల గదిలో తిరుగుతూ డిటాచ్‌మెంట్‌ల వివరాలను అప్పటికి పదోసారి వివరించాను. ఏఏ డిటాచ్‌మెంట్‌లో ఎవరు సభ్యులో, దేనికి ఎవరు కమాండరో, ఏ బృందం ఏ యే పనులు చేయాలో గొంతు నొప్పి పెట్టేదాకా చెబుతూనే ఉన్నాను. వాళ్లు మౌనంగా తమకు అందిన రొట్టి, వెన్న, క్యాబేజిపులుసు తింటున్నారు. ఫలహారాలు పూర్తయ్యాయి.

అయితే ఒక్కరంటే ఒక్కరు కూడా మిష్కా వద్దకు వెళ్లి పనిముట్లు తీసుకోలేదు. పదవ డిటాచ్‌మెంట్ కమాండర్‌గా నియమితుడైన జైచెంకో జాడ కూడా ఎక్కడాలేదు. వాడి మీద నేను ఎక్కువ ఆశలు పెట్టుకున్నాను. వాడు ఉదయం ఫలహారానికీ రాలేదు! కమాండర్లలో ఒక్క ఖోవ్‌రోఖ్ మాత్రం వచ్చి నా పక్క నిలబడ్డాడు. వాడి ఆధ్వర్యంలోని నాల్గవ డిటాచ్‌మెంట్ ఆవరణలో అడ్డంగా ఉన్న ఒకగోడని

బద్దలుకొట్టి దారి చెయ్యాలి. కాని వాడు ఒక్కడే తీరికగా వచ్చి నిలబడ్డాడు.

"నీ డిటాచ్‌మెంట్ ఇంకా పని ప్రారంభించలేదేం? అసలు వాళ్లెక్కడ?" అని అడిగాను. వాడు నిర్లక్ష్యంగా నవ్వాడు.

"నాకేం తెలుసు. నేనే పని చెయ్యను. మిగతా వాళ్ల సంగతి నాకెందుకు" అన్నాడు.

"ఎందుకు చెయ్యవు?"

"ఎందుకంటే, నాకు చేయాలనిపించడంలేదు. కనుక-.." అంటూ మళ్ళీ నవ్వాడు.

నేనేదో అనేలోపు వాడే అందుకున్నాడు "అవునూ! గోర్కీకాలనీలో ఆడపిల్లలు బావుంటారట కదా?" అని. నాకు అసహ్యం వేసింది. మాట్లాడకుండా ముందుకు నడిచాను. వాడు వెనకే వచ్చాడు.

"మీ ఆడ టీచర్లలోనే కొందరు బ్రహ్మాండంగా వుంటారని విన్నాను. వాళ్లంతా ఎప్పుడొస్తారు? వస్తే బావుంటుంది కదా! ఇక్కడ ఒకరిద్దరు అమ్మాయిలు బానే ఉంటారు. కానీ వాళ్లకు నన్ను చూస్తే భయం. వాళ్ల వంక చూస్తే చాలు సిగ్గుతో వాళ్ల బుగ్గలు ఎర్రబారతాయి. ఏం నేనంత భయంకరంగా ఉంటానా? బావుంటానా?" అని అడుగుతున్నాడు.

ఆ ముందురోజు సాయంత్రం నుంచి నాలో రేగుతున్న ఆగ్రహాన్ని అతి కష్టం మీద అణచుకుంటున్నాను. వీడి మాటలని కొనసాగిస్తే నేనేం చేస్తానో నాకు తెలియదు. పైగా జైచెంకో ఎందుకు కనపడలేదో ఆరాతీయాలి. అందుకే-

"ఫో. ఇక్కడనుంచి" అని గట్టిగా అరిచాను.

అంత వరకు ప్రశాంతంగా ఉన్న నేను అలా అరిచేసరికి వాడు బిత్తరపోయాడు. గబగబా అక్కడి నుంచి వెళ్లిపోయాడు. నేను జైచెంకో ఉండే డార్మెటరీకి వెళ్లాను. వాడు తన మంచం మీద పడుకొని ఉన్నాడు. చుట్టూ వాడి మిత్రులు కూర్చున్నారు.

"ఏమైంది?" అని అడిగాను.

పిల్లలు మౌనంగా తొలగి నాకు దారి యిచ్చారు. "ఏమైంది నీకు?" అని మళ్లీ అడిగాను. జైచెంకో మాట్లాడలేదు. కానీ చుట్టూఉన్న కుర్రవాళ్లలో ఎవరో సమాధానం చెప్పారు.

"వాళ్లు వాడిని కొట్టారు"

"ఎవరు?"

మంచంపై నుంచి కదలకుండానే జైచెంకో చెప్పాడు. "ఎవరో తెలియదు. రాత్రి చీకట్లో వచ్చారు. నా మీద దుప్పటి కప్పి నన్ను చితక్కొట్టారు. నాకు ఛాతిలో నొప్పిగా ఉంది."

కుర్యాజ్ కాలనీలో ఒక ఆసుపత్రి వంటిది ఉన్న సంగతి నాకు తెలుసు. అక్కడి మురికి గదుల్లో ఒక మూల ఒకామె ఉంటుంది. డాక్టరో, నర్సో తెలియదు. ఆమెను తీసుకురమ్మని ఒక కుర్రవాడిని పంపాను. ఈలోగా షెలాపుటిన్ హడావుడిగా అక్కడికి వచ్చాడు.

"ఆంటన్ సెమ్యోనోవిచ్ వాళ్లు వచ్చారు. కారులో వచ్చారు. మీ కోసం అడిగారు" అని చెప్పాడు. బయట నల్లరంగు పెద్ద ఫియట్ కారు వద్ద బ్రెగెల్, కామ్రేడ్ జోయా, క్లెమోర్‌లు నిలబడి ఉన్నారు. బ్రెగెల్ నన్ను చూసి నవ్వి అడిగింది "కాలనీని స్వాధీనం చేసుకున్నారా?" అని.

తలవూపాను.

"ఎలా వుంది పరిస్థితి?"

"బానే వుంది".

జోయా నా వంక అనుమానంగా చూసింది. క్లెమర్ పరిసరాలను గమనిస్తున్నాడు.

అశ్వశాలలోంచి వొలొఖోవ్ అరుపులు వినిస్తున్నాయి.

"ఇవి గుర్రాలా, పందులా? కదిలిచావవేం? దరిద్రపుగొట్టు మొహాలు, ఒక్కటంటే ఒక్కటైనా పనికిరాదు. అడ్డగాడిదలు. మీకంటే లంజలు నయం."

ఈ మాటలు విన్న జోయా మోహం ఎర్రబారింది. నిరసనగా తలవిదిల్చి "ఇదే సామాజిక విద్య!?" అని వ్యాఖ్యానించింది.

నేను పెద్దగా నవ్వాను.

"దానికీ విద్యకీ సంబంధంలేదు. కోపంతో, విసుగుతో ఆ మనిషి ప్రయోగిస్తున్న భాష అది." తరువాత మరేం వ్యాఖ్యానించకుండా వెళ్లిపోయారు.

5

గోర్కీకాలనీలో మరో రోజు

"కాలనీలోని అధ్యాపక సిబ్బంది మొత్తాన్నీ తక్షణం కుర్యాజ్ కాలనీకి పంపించ"మంటూ గోర్కీకాలనీలోని కోవల్‌కు టెలిగ్రాం ఇచ్చాను. దానికి సమాధానం ఆ తరువాతి రోజు సాయంత్రం అందింది. "రవాణా ఇబ్బంది మూలంగా టీచర్లంతా ఇవాళ బయలుదేరుతున్నారు" అని.

తెల్లవారుఝాము రెండుగంటలప్పుడు ఎకతెరీనా, లిడియా, బుస్తాయ్, జుర్‌బిన్, గోథోవిచ్ మొదలైన టీచర్లంతా కుర్యాజ్ చేరుకున్నారు. మా సమావేశం ఉత్సాహభరితంగా సాగింది. "గోర్కీ కాలనీలో సామాన్లు సర్దడం పూర్తయింది. కేవలం వాహనాల కోసం ఎదురు చూస్తున్నారు" అని ఎకతెరీనా తెలియచేసింది.

పిల్లలంతా ఎప్పుడు బయలుదేరదామా అనే అసహనంతో ఉన్నారనీ, సామానంతా సర్దేయడంతో పెట్టెల మీద పడుకుంటున్నారనీ ఎకతెరీనా తెలిపింది. ఇక్కడి పరిస్థితి ఏమిటని అడిగింది.

"ఏమీ బాగోలేదని" చెప్పాను.

"అబ్బే. ఏం లేదు. ఇక్కడ మనం కొద్ది మందిమే అయ్యాం" అదే సమస్య వొలొఖోవ్ చెప్పాడు.

"కుర్యాజ్ కాలనీ పిల్లలేమయ్యారు?"

"మీరే చూస్తారుగా...." నవ్వాడు వొలొఖోవ్.

"అంటే మనవాళ్లు తక్షణం రావలసిందేనా?"

"చాలా అత్యవసరం. వారు వెంటనే ఇక్కడికి చేరాలి".

ప్యోటోర్ ఇవనోవిచ్ గొంతు సవరించుకున్నాడు. "అక్కడ రైల్వే అధికారులు చాలా పేచీలు పెడుతున్నారు. ఎలాంటి రాయితీ ఇవ్వమంటున్నారు. ప్రతిదానికీ అడ్డు పడుతున్నారు. ఒకసారి మీరు వెళ్తే మంచిది" అన్నాడు నాతో.

అందరూ మౌనంగా కూర్చున్నాం.

ఇంతలో వొలొఖోవ్ ధైర్యం చెప్పాడు. "ఏం ఫర్వాలేదు. ఆంటన్ సెమ్యోనోవిచ్. మీరు వెళ్లి రండి. అన్ని ఏర్పాట్లూ చూడండి. ఇక్కడి గురించి దిగులు పడకండి" అని అన్నాడు.

వాదోపవాదాల తరువాత నేను గోర్కీకాలనీకి వెళ్లేందుకు అంగీకరించాను.

రైలు ఎక్కానే కానీ, నేను పారిపోతున్నానా అనే అనుమానం కలిగింది. ఈ బాధ్యతను సవ్యంగా నిర్వర్తించగలమా అనే ఆందోళన బయలుదేరింది. కాలనీ చేరేసరికి పిల్లలంతా పరుగుపరుగున ఎదురొచ్చారు. "అక్కడ పరిస్థితి ఎలా ఉంది?" అన్నదే అందరి ప్రశ్న.

కుర్యాజ్ బయలుదేరేందుకు ఉత్సాహంతో కదంతొక్కుతున్న పిల్లలందరినీ చూశాక నాకు ధైర్యం వచ్చింది. అందరూ ప్రస్తుతం ప్రయాణానికి సిద్ధంగా, చేసేందుకు మరే పనీలేక సెలవు సరదాలో ఖాళీగా కులాసాగా కనిపించారు. కాలనీ నుంచి బయలుదేరే ముందు స్థానిక ప్రజల కోసం వీడ్కోలు సూచనగా చివరి నాటకం ప్రదర్శించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కాలనీలో ఎక్కడ చూసినా చక్కగా పెట్టెల్లో సర్ది పెట్టిన సామాన్లు ఉన్నాయి.

ఈ మొత్తం రవాణా కార్యక్రమాన్ని పర్యవేక్షించి, పనులన్నీ సక్రమంగా పూర్తి చేసేందుకు వాళ్లు ఒక స్థావరాన్ని కూడా ఏర్పాటు చేసుకున్నారు. మా టీచర్ లిడియా గదే స్థావరం. అక్కడ కోవల్, లాపోట్‌లు ఉన్నారు. నేను వెళ్లే సరికి కోవల్ రైల్వే సిబ్బందిపై నిప్పులు చెరుగుతున్నాడు.

"పనికిమాలిన అధికారులు. అయ్యో! ఇది పిల్లల కోసం అని చెప్పాం. వాళ్లు వింటేగా. కావాలంటే మేమంతా పిల్లలమని రుజువు చేసే ధృవీకరణపత్రాలు తెమ్మంటారా? అని అడిగాను. అయినా మన వాళ్లకి జనన సర్టిఫికేట్లు ఎక్కడ ఉన్నాయని? వాళ్లకి ఒక్క ముక్క అర్థం కాదు. పిల్లలెవరైనా సరే ఒకరు ఒక పెద్దమనిషితో ఉచితంగా ప్రయాణించవచ్చని రూలట. బానే ఉంది. కానీ వెళ్లే వాళ్లమందరం పిల్లలమైతే ఏం చేయాలి? పెద్ద ల్లేకుండా పిల్లలు ప్రయాణం చేయకూడదట! ఏం చెప్తాం?! ఎంతసేపూ పిల్లలు... పిల్లలూ అనే గోల. అయ్యో మాదొక లేబర్‌కాలనీ, అదీకాక మేం మాములు ప్రయాణికుల బోగీలు అడగలేదే. రవాణా బోగీలు ఇమ్మంటున్నాం. మొత్తం కాలనీ తరలివెళ్లాలి అని చెప్పాం. అయినా మట్టి బుర్రలకి అర్థం కాదే! సామాను రవాణా అయితే వేరే ఛార్జీ అట! దానికి విడిగా రుసుము కట్టాలట. గుర్రాలకి ఇంత ఛార్జీ అట. పందులకి వేరేనట. పెట్టెల్లో సామనుకి ఇంకో ధర అట. ఇంటి సామానుకైతే మరో రేటు ఉందట, చవటలు. మేమేమైనా ఉద్యోగం బదిలీపై ఇంటి సామాను రవాణా చేయబోతున్న బూర్జువా అధికారులమా? కాదే. కానీ ఆ గుమాస్తా పీనుగులకి ఆ విషయం అర్థంకాదు. అయినా వాళ్లకి వర్గ దృక్పథం గురించి వివరించాను. శ్రద్ధగానే విన్నారు. కానీ చివరికి రవాణా ఛార్జీలంటూ ఉన్నాయి కాబట్టి ఇక్కడ వర్గ దృక్పథంతో పని లేదని తేల్చారు. వాళ్లకి ఏం చెప్పగలం?" అని రుసరుసలాడుతున్నాడు.

నేను విచారంగా కుర్యాజ్ కాలనీ కష్టగాథ వివరించాను. మా ఇద్దరి ఘోషనూ విన్న లాపోట్ మొహంలో చిరునవ్వు చెరగలేదు. అసలువాడు మా ఇద్దరి ఆవేదననూ అర్థం చేసుకునే ప్రయత్నమే చేయలేదు. రైల్వేలు, కుర్యాజ్ కాలనీలు లేకపోతే మన అవసరం ఏముంది చెప్పండి మనమే అన్నిటినీ ఒక దారికి తేవాలి అంటూ తన సహజసిద్ధమైన శైలిలో హాస్యోక్తులు మొదలుపెట్టాడు. మొదట కొంత చిరాకుపడినా చివరికి వాడు మాటల మత్తులోనే విచారాన్ని మరచి హాయిగా నవ్వాను. ఈ వారం పదిరోజుల్లో లాపోట్ మరింత రాటుదేలినట్టున్నాడు. వాడి హాస్యదృష్టి ఇంకా పదునుతేలింది. దేన్నైనా తేలికగా తీసుకోవడం, అదే సమయంలో పరిష్కారం విషయంలో స్పష్టమైన మార్గాన్ని ఎంచుకోవడంతో వాడెప్పుడూ అనితరసాధ్యుడే. అందుకే వాడిచుట్టూ ఎప్పుడూ ఒక గుంపు ఉంటుంది. వాళ్లలో తెలివైనవారు, వాణ్ణి పూర్తిగా విశ్వసించేవారు, ప్రేమించేవారు, ఆరాధించేవారు, ఉత్తచవటలు, కొందరు పూర్తిగా వెర్రివాళ్లు.... ఇలా చాలా మంది ఆ గుంపులో ఉంటారు. వాళ్లందరితో విడివిడిగానూ, అందరితో కలిసి కూడా ఎలా వ్యవహరించాలో లాపోట్‌కు బాగా తెలుసు.

లాపోట్ నాకు ధైర్యం చెప్పాడు. "ఏమవుతుందండీ. అందరం వచ్చేస్తున్నాంగా. మీరు బయలుదేరండి" అన్నాడు. ఆ రాత్రి గ్రామస్థుల కోసం చివరి నాటకం ప్రదర్శించారు.

6

మర్నాడు అందరి వద్దా సెలవు తీసుకొని మళ్లీ కుర్యాజ్ బయలుదేరాను. ఐదురోజుల్లో కాలనీలోని మొత్తం సామానుతో పిల్లలమంతా తరలి వస్తామని కోవల్ హామీ ఇచ్చాడు.

రైజోవ్ స్టేషన్‌లో దిగి బండిపై కుర్యాజ్ కాలనీకి చేరాను. కాలనీని సమీపిస్తుండగానే ఏదో జరగరానిది జరిగిందన్న అనుమానం నన్ను ఆవహించింది. నిజంగానే లోపల పట్టణం నుంచి వచ్చిన దర్యాప్తు బృందం తన విచారణ సాగిస్తోంది. మళ్లీ అధికారులు పాతవారే. బ్రెగెల్, క్లెమర్, యుర్యేవ్‌లు. వారితోపాటు ప్రభుత్వ ప్రాసిక్యూటర్ కూడా ఉన్నాడు. నన్ను చూడగానే బ్రెగెల్ కనీస పలకరింపైనా లేకుండా, కోపంగా అంది. “చెప్పినట్టే పిల్లలు ఒకరినొకరు కొట్టుకోవడం మొదలైంది” అని ప్రకటించింది.

“ఎవరు, ఎవరిని కొట్టారు?” అని ప్రశ్నించాను.

“అదే తెలియడం లేదు. ఎవరిదంతా చేశారో తెలియడంలేదు” అందామె.

ప్రభుత్వ ప్రాసిక్యూటర్ మాత్రం ప్రశాంతంగా వివరించాడు. “తెలియనిదేంలేదు. అంతా స్పష్టంగానే ఉంది. దీని వెనుక కవ్వింపు, కుట్ర ఏం లేవు. ఏవో పాతకక్షలు. అవీ పెద్ద తీవ్రమైనవేం కావు. అయినా ఎవరు దీనికి కారణమో తెలిస్తే బావుంటుంది. స్వయానా కాలనీ డైరెక్టర్‌గారే వచ్చారు కనుక ఆయనే నిజానిజాలు కనుగొనే ప్రయత్నం చేస్తే బావుంటుంది”

ఈ మాటలు బ్రెగెల్‌కు నచ్చినట్టు లేదు. మారుమాట్లాడకుండా ఆమె తన కారులోకి వెళ్లి కూర్చుంది. యుర్యేవ్ నా వంక చూసి మొహమాటంగా నవ్వాడు. దర్యాప్తు కమిషన్ నిష్క్రమించింది.

కుర్యాజ్ కాలనీ కుర్రవాడు డార్మెటరీల నుండి అరడజను జతల బూట్లు మూటకట్టి గేటుగుండా వాటిని తరలిస్తున్నప్పుడు వాడి మీద దాడి జరిగింది. పరిస్థితులను బట్టి చూస్తే అంతా పథకం ప్రకారమే జరిగినట్టు అర్థమవుతోంది. కాలనీ కుర్రవాడు దొరొష్కొ డార్మెటరీల నుంచి బూట్లు తస్కరిస్తూండగా ఎవరో వాడిని నిశ్శబ్దంగా గమనించారు. తరువాత వాటితో ఉడాయిస్తున్నప్పుడు గేటు వద్ద కొందరు కుర్రవాళ్లు వెనకనుంచి వాడిపై దుప్పటి విసిరి చావగొట్టారు. అప్పుడే అశ్వశాల నుంచి బయటకు వస్తున్న మా కుర్రవాడు గొర్కోవ్ స్కీ దాన్ని గమనించి పరుగుపరుగున అక్కడికి వెళ్లే సరికి అందరూ పారిపోయారు. వెంటనే డార్మెటరీలను తనిఖీ చేసిన ప్రయోజనం లేకపోయింది. అందరూ “మంచి నిద్ర”లో ఉన్నారు. దొరోష్కొకు బాగా దెబ్బలు తగిలాయి. వాడిని కాలనీ ఆసుపత్రిలో చేర్చారు. పెద్ద ప్రమాదం ఏదీ లేదని డాక్టరు చెప్పారు. గొర్కోవ్ స్కీ వెంటనే పట్టణంలోని యుర్యేవ్‌కు ఈ సంఘటన గురించి తెలియజేశాడు.

బ్రెగెల్ నాయకత్వాన కాలనీ చేరిన బృందం ఆది నుంచి తుది వరకూ దొరోష్కొను చావబాదింది గోర్కీకాలనీ కుర్రవాళ్లు అని రుజువు చేసేందుకు విఫల ప్రయత్నం చేసింది. కానీ ఆ దాడి జరిగిన సమయంలో మా పిల్లలంతా అక్కడకు దూరంగా ఉన్నట్టు తేలడంతో ఆమె ప్రయత్నాలు ఫలించలేదు. పైగా దొరోష్కొ స్వయంగా చెప్పాడు. తనను కొట్టింది గోర్కీ కుర్రవాళ్లు కాదని, పైగా వాళ్లు కాపాడకపోతే తాను ఈసరికి ప్రాణాలతో వుండేవాడిని కాదని చెప్పాడు. అదీ సంగతి. ఈ సంఘటన తరువాత దర్యాప్తు పేరుతో అధికారుల అనుచిత ప్రవర్తన మా టీచర్లు ఎకతెరీనా, లిడియాలను బాగా కుంగదీశాయి. వారిని ఓదార్చి బయటకు వచ్చాను.

మా కుర్రవాళ్లు మొత్తంగా తరలిరావడానికి ఇంకా ఐదు రోజుల వ్యవధి ఉంది. ఆ ఐదు రోజులూ ఎలా గడిచాయో నేను చెప్పలేను. నాకు పూర్తి వివరాలు గుర్తులేవు కూడా. గుర్తున్నంత

వరకు మా వాళ్లు ప్రతిరోజూ ఉదయం ఐదుగంటలకు పనిలోకి దిగేవారు. నిదుర లేచేందుకు నిరాకరించిన కుర్యాజ్ కుర్రవాళ్లపై కోపం తెచ్చుకొనేవారు. అసలు మా తొలి డిటాచ్‌మెంట్ ఆ రోజుల్లో నిదురపోయిందనేది కూడా నాకు అనుమానమే. ఎందుకంటే ఎప్పుడు, ఏ క్షణంలో ఏ అవసరం విరుచుకుపడుతుందో ఊహించడం కష్టంగా ఉండేది. నేను వచ్చిన మర్నాడు షెర్రీ ఇక్కడకు వచ్చాడు. దాదాపు రెండు గంటలసేపు పొలమంతా తిరిగాడు. ఏవేవో కొలతలు, లెక్కలు వేశాడు. ఇక్కడి అన్ని అవుట్‌హౌస్‌లు, యార్డులు, మిద్దెలు అన్నీ పరిశీలించాడు. సాయంత్రం మా కాలనీ కుర్రవాళ్లు, రాబోయే పందులమంద కోసం స్థలాన్ని శుభ్రం చేసేవారు. వాటి కోసం ప్రత్యేకం ఒక కొట్టం నిర్మించేందుకు సన్నాహాలు ప్రారంభించారు.

ఆ రోజుల్లో వొలోఖోవ్ ఒక కమాండర్‌గా విశ్వరూపం ప్రదర్శించాడు. ఉన్న కొద్దిమంది కుర్రవాళ్లనే అన్ని పనుల్లో నిమగ్నం చేసేవాడు. అతని ఆదేశానుసారం ఒక కుర్రవాడు ఒకేసారి రెండునాగళ్లు నడిపించేవాడు. మిగిలినవారిని ఇతర పనులకి నియోగించేవాడు. ప్యోటోర్ ఇవానోవిచ్ ఉదయం ఒక పారను చేతనుబట్టి ఆవరణలో ఏదో మూల పని ప్రారంభించేవాడు. వింతగా చూస్తున్న కుర్యాజ్ పిల్లలను వచ్చి చేయి కలపమని ఆహ్వానించేవాడు. వాళ్లు అతని వంక నిర్లిప్తంగా చూసి వెళ్లిపోయేవారు. దారిలో వారికి ఎదురుపడిన బుస్తాయ్ ఏదో అవసరం కోసం గొయ్యి తవ్వుతూ వాళ్లని చూసి హేళన చేసేవాడు. "ఏయ్ సోమరిపోతులూ, మీ కోసం నేను ఎంత పని చేయాలి?" అని ప్రశ్నించేవాడు. ఓరోజు సాయంత్రం రబ్‌ఫాక్ విద్యార్థులంతా మాకు సాయం చేసేందుకు వచ్చారు. వారిని నేను వెంటనే వెనక్కి పంపేశాను. వాళ్లకి పరీక్షలు దగ్గర పడుతున్నాయని నాకు తెలుసు. ఇటువంటి కుర్యాజ్‌లు ఎన్నైనా వాళ్లు తమ చదువు పాడుచేసుకోకూడదు. అదీ నా పట్టుదల.

మా బోరోవోయ్ అక్కడ ఆవరణలో గాలీ వెలుతురు వచ్చేందుకు అవకాశం ఉండేలా పాయిఖానాల నిర్మాణంలో పడ్డాడు. మేం ఏర్పాటు చేసిన వడ్రంగుల బృందం నేల మాళిగలోని కోల్డ్ స్టోరేజ్ గదులు, పాఠశాల ఆవరణ, అపార్ట్‌మెంట్‌లలో చెక్కపని మరమ్మతులలో నిమగ్నమయ్యారు. ముగ్గురు విద్యుత్తు పనివారు మా పవర్‌ప్లాంటు మరమ్మత్తు పనులు చేపట్టారు. ఇక్కడ గతంలో క్రైస్తవ మొనాస్ట్రీ ఉండేరోజుల్లో నీటి పంపులు, నేల అడుగున ప్రవహించే మురికినీటి గొట్టాలు ఉండేవని విని ఉండటంతో ఒక ముగ్గురు మనుషులు ఆ ప్రాంతమంతా జాగ్రత్తగా తవ్వుతూ అటువంటి గొట్టాల కోసం అన్వేషించారు. మొత్తానికి చివరకు భూగర్భంలో ఉన్న ఆ మంచినీరు, మురికినీటి గొట్టాలను పట్టుకోగలిగాం. మేం చేస్తున్న పనులకు పిల్లల పెంపకం, శిక్షణ, విద్యాబోధనలకు ఎటువంటి సంబంధం లేదు. కానీ ఎన్ని మౌలిక అవసరాలు. ముందు వాటిని ఏర్పాటు చేసుకోవాలి. అదే మాకు అప్పటి లక్ష్యం.

ఇంత చేస్తే ఆ వాతావరణంలోని కుర్యాజ్ కాలనీకి చెందిన వాన్య జైచెంకో తన డిటాచ్‌మెంట్‌తో పూర్తిగా మా పక్షం చేరిపోవడం మాకు లభించిన తొలి విజయం. వాడు, వాడి బృందంలో పిల్లలూ పూర్తిగా మాతో కలిసి పని చేయడమే కాక, ఉన్నట్టుండి ఓ రాత్రి వాళ్లంతా వాగి పక్కబట్టలతో సహా వచ్చి మా గదిలో దూరారు. మురికిగా, క్రిములతో నిండిన, దుర్గంధ భూయిష్టంగా ఉన్న ఆ పక్కబట్టలూ, వారు మాతో చేరడం ఊహించని పరిణామం. కానీ ఏమనగలం?

కానీ ఈ విషయాన్ని మా మహిళా టీచర్లు లిడియా, ఎకతెరీనాలు మాత్రం తేలిగ్గా తీసుకోలేదు. ఆ కుర్రవాళ్లతో కలిసి ఉంటున్న మీరు దయచేసి మా గదులకు రావద్దు. వచ్చినా ఎక్కడా కూర్చోవద్దు.

ఏ వస్తువునూ తాకవద్దు అని ఖచ్చితంగా చెప్పారు. వారికి మాత్రం ఏం చెప్పగలం? కానీ చిత్రమైన విషయం ఏమిటంటే ఈ ఇద్దరు టీచర్లు పగలంతా కుర్యాజ్ కాలనీ డార్మెటరీల్లో తిరుగుతూ అక్కడి పరిస్థితి, పిల్లల తీరుతెన్నులను గ్రహించే ప్రయత్నం చేసేవారు.

ఈ కాలనీ ప్రస్తుతం ఉన్న తీరును పూర్తిగా మార్చితీరాలని నేను నిశ్చయించుకున్నాను. ప్రస్తుతం తరగతి గదులుగా చలామణీ అవుతున్న ప్రాంతాన్ని డార్మెటరీగా మార్చాలని, తలుపులే లేని డార్మెటరీల్లో ఆ తరువాత తరగతి గదులు ప్రారంభించాలని నిర్ణయించాను. ప్రస్తుతం పాఠశాలలో ఉన్న ఫర్నిచర్, ఇతర సామాగ్రీ అంతంత మాత్రమే. ఒక్కరోజులో దాన్ని ఖాళీ చేసి చెత్త సామానంతా బయటకు లాగాం. వెంటనే తాపీ పనివారు, వడ్రంగులు, పెయింటర్లు, ఇతర రంగాల పనివారు రంగప్రవేశం చేశారు. పనిలో పడ్డారు.

కాలనీలో ఏ మూల చూసినా శరవేగంగా మరమ్మతులు సాగుతుండేవి. అక్కడున్న ప్రతి భవనాలను, గదిని, షెడ్‌ను, యంత్రాలను శుభ్రంచేసి, బాగుచేసి, అవసరమైన చోట్ల రంగులు వేసి వాటిని ఒక దారికి తెచ్చే ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి. ఆ రోజుల్లో మేం ఆవరణలో చెట్లకిందే భోజనాలు చేసేవారం. ఒక్క డార్మెటరీల జోలికి మాత్రం వెళ్లలేదు.

అక్కడ కుర్రవాళ్లు మామూలుగానే తీరికగా నిద్రలు లేచి, భోజనాలు చేసి, పక్క బట్టల్లో క్రిమికీటకాలను వేటాడుతూ, ఒకరితో ఒకరు దెబ్బలాడుకుంటూ కాలం వెళ్లబుచ్చేవారు. కాని వారిలో ఒక మార్పు కనిపించింది. నేనూ, మా బృందం ఏం చేస్తున్నామో తెలుసుకోవాలనే ఆసక్తి వారిలో క్రమంగా పెరిగింది. నేను మాత్రం డార్మెటరీలవైపు వెళ్లడం పూర్తిగా నిలిపివేశాను. ఆ కుర్రవాళ్ల కోసం భోజనాల గదిని రోజు ఉదయం, మధ్యాహ్నం తెరిచేవాళ్లం. అయితే భోజనాల గదికి వాళ్లు ఇదివరలోలాగా పరుగులు పెట్టుకుంటూ రావడం మాత్రం కుదిరేది కాదు. ఎందుకంటే డార్మెటరీలకు, భోజనాల గదికీ మధ్య ఆవరణలో మరమ్మతుల కోసం మేం తెప్పించిన కలప దుంగలు, ఇసుక గుట్టలు, సున్నం బస్తాలు, రంపాలు, గునపాలు, గొడ్డళ్ల వంటి పనిముట్లూ అడ్డదిడ్డంగా వుండేవి. వాటిని చూస్తూ నెమ్మదిగా దాటుకుంటూ వాళ్లు ఏం ఆలోచించేవారో నాకు తెలుస్తూండేది. కాలనీని బాగు చేసేందుకు ఇంత పని జరుగుతోంది. తాము మాత్రం భోజనాల గదికీ, డార్మెటరీకి మధ్య తిరుగుతున్నాం అనే భావన వారికి కలిగి ఉండాలి.

మొదటిరోజు వారు పనులు సాగుతున్న చోట్లకు వచ్చి గుంపులుగా నిలబడేవారు. ఒకళ్ల మొహాలు ఒకరు చూసుకునేవారు. ఏం చేయాలో వారికి అర్థమయ్యేది కాదు. ఎవరూ వారిని సాయానికి పిలిచేవారు కాదు. డార్మెటరీలో ఏ పనీ ఉండేది కాదు. దొంగతనాలు చేద్దామంటే కుదరని పని. ఓసారి డార్మెటరీలోకి వెళ్లి ఏమీ తోచక మళ్లీ పని జరిగే ప్రాంతానికి వచ్చేవారు. వాళ్లని గోర్కీవాసులుకానీ, మేం నియమించిన పనివాళ్లు కానీ అసలు పట్టించుకునేవారు కాదు. పనుల్లో హడావుడిగా తిరిగే గోర్కీ పిల్లలు వీరిని అడ్డుతొలగమని కసురుకునేవారు. "అప్పుడే బయటకు వచ్చేరేంటి? భోజనానికి ఇంకా రెండుగంటల వ్యవధి వుంది. "పొండి పనులకు అడ్డం రాకండి" అనేవాళ్లు. దాంతో కుర్యాజ్ కుర్రవాళ్లు అవమానంతో మొహాలు వేళ్లాడేసుకొని భారంగా కదిలేవారు.

అప్పుడప్పుడు మా కుర్రవాళ్లు కొంత హద్దుమీరి ప్రవర్తించేవారు. "అలాగే చూస్తూ నిలబడండి. మా వాళ్లందరూ వచ్చిన తరువాత తెలుస్తుంది. మరొకరి కష్టంపై బ్రతకడం అంటే మీకు తెలిసి వస్తుంది." అని కుర్యాజ్ కుర్రవాళ్లను రెచ్చగొట్టేవారు. దాంతో వాళ్లలో కొంత ధైర్యం ఉన్న సీనియర్లు

కోపం తెచ్చుకొని "మీ వాళ్లు వస్తే ఏమవుతుంది? తల తీసి మొలేస్తారా?" అని ప్రశ్నించేవారు.

దీనికి మిష్కా నిర్దయగా సమాధానం చెప్పేవాడు."పనిచేయని సోమరిపోతుల మొహాలు బద్దలవుతాయి" అనేవాడు.

దీంతో ఖోవ్‌రాఖ్ ఒకసారి రోషంగా సమాధానం చెప్పాడు. "ఇదేం గోర్కీ కాలనీ కాదు. తేడా వస్తే పైన ఖార్కోవ్ అధికారులున్నారు" అని.

ఈ సమాధానం నిజంగా కొంత ఆలోచింపదగిందన్నట్టు మిష్కా పనిని ఆపివేసి ఒక నిమిషం సుదీర్ఘంగా ఆలోచించేవాడు. తరువాత ఫకాలున నవ్వి -

"సరే గోర్కీ కాలనీని కాదని ఖార్కోవ్ వెళ్తావ్. మంచిదే. కానీ అక్కడైనా పనిచేయని సోమరిపోతులని మేపండని ఎవరూ అనరు. తెల్సిందా?" అని తిరిగి తన పనిలో నిమగ్నమయే వాడు. అంతలోనే తలెత్తి, ఖోవ్‌రాఖ్ వంక చూసి "అవునూ, నీ పేరేంటి?" అని అడిగేవాడు. దీన్ని ఖోవ్‌రాఖ్ అవమానంగా భావించాడు. మిష్కాకు తన పేరు తెలిసి ఉండాలని వాడి నమ్మకం. పైగా వంటగది దగ్గర తనను కొట్టింది కూడా మిష్కాయే.

"నా పేరా?.. తెలియదా?" అని అడిగాడు పౌరుషంగా.

"తెలియదయ్యా బాబు, చెప్పరాదా?"

"సరే, నా పేరే ఖోవ్‌రాఖ్"

"ఆహాఁ ఖోవ్‌రాఖ్? చూశావా మరచిపోయాను. అయినా నువ్వేదైనా పని చేస్తుంటే, నీతో ఎవరికైనా ఏదన్నా పనిపడితే నిన్ను పేరుపెట్టి పిలిచేవారు. ఖోవ్‌రాఖ్ ఆ గునపం ఇలా ఇవ్వు? ఖోవ్‌రాఖ్ కాస్త దీన్ని పట్టుకో. ఖోవ్‌రాఖ్ నీ ఉద్దేశం ఏంటి, అని మాట్లాడేవారు. కానీ నీకూ పనికీ సంబంధం లేదుగా. అందుకే మరచిపోవడం సహజం. చూడు నేను పనిలో ఉన్నాను. ఈ నీటి తొట్టెను బాగుచేయాలి. ఎందుకంటే, నువ్వు పులుసులో రొట్టె ముంచుకు తిన్న తరువాత చేతుల కడుక్కోవాలంటే ఈ నీటి తొట్టె ఇక్కడ ఉండాలి. అందుకు మరి నీకు తిండి పెట్టాలి తప్పదు. తినకపోతే చస్తావ్‌గా. చచ్చిపోయావనుకో నీ శవం కుళ్లిపోతుంది. మాకే ఇబ్బంది. అంచేత వెంటనే నీకు శవపేటిక తయారుచెయ్యాలి. అంటే మళ్లీ మాకే పని..." అని అడ్డదిడ్డంగా వాగేవాడు.

భరించలేని ఖోవ్‌రాఖ్ అక్కడినుంచీ వేగంగా అదృశ్యమయేవాడు.

ఈలోగా కుర్యాజ్ పిల్లలందరినీ నేను జాగ్రత్తగా గమనిస్తున్నాను. వారంతా ఒకే మూస కాదు. ప్రతివారికీ ప్రత్యేక వ్యక్తిత్వం, విశిష్ట లక్షణాలు ఉన్నాయి. పిల్లల్లో చాలామంది నేను ఆవరణలో తిరుగుతుంటే నన్ను ఆసక్తిగా గమనించేవారు. ఆ సంగతి తెలిసినా గమనించనట్టే పచార్లు చేసేవాడిని. కాని వాళ్లలో కొంతమంది పేర్లు నాకు తెలిశాయి. కొందరి గొంతు విని గుర్తుపట్టగలిగేవాడిని. కష్టపడి వొళ్లొంచి పనిచేస్తున్న నన్ను, మా కుర్రవాళ్లని చూసి కొందరు కుర్యాజ్ పిల్లలు సిగ్గుతో తలలు తిప్పుకు వెళ్లిపోయేవారు. మరికొందరు సానుభూతిగా చూసేవారు. చాలామంది మొహమాటంగా, పలకరింపుగా నవ్వేవారు.

వాళ్లలో వొలోద్య, మిట్కా అనే ఇద్దరు పిల్లలు నాకు స్నేహితులయ్యారు. వొలోద్య మాట్లాడితే ఆడపిల్లలు మాట్లాడినట్టే ఉండేది. ఓ రోజు మిట్కా నా దగ్గర కూర్చుని కాలనీలో అక్కడక్కడ కనిపిస్తున్న తన సహచరుల గురించి చెప్పేవాడు. "అదిగో ఆ పరుగెడుతున్నాడే వాడు బర్యోక్. బర్యోక్ తెలియదా? వాడికి పాలపిచ్చి. ఒక్కసారిగా ముప్పై గ్లాసుల పాలు తాగేయగలడు. అక్కడ కిటికీలోంచి చూస్తున్నాడేవాడు వంకాజైచెంకో. వాడో దొంగ" ఇలా ఏదేదో చెప్పేవాడు.

మొత్తంమీద కుర్యాజ్ కాలనీల్లో నెమ్మదైనపిల్లలు చాలామందే ఉన్నారు. వాళ్లలో ఎక్కువమంది చిన్నపిల్లలే. ఎక్కువమంది అందంగా, అమాయకంగా ఉండేవారు. జాగ్రత్తగా గమనిస్తే వీరంతా త్వరలో జరగబోయే ఓ పెద్ద మార్పు కోసం ఎదురు చూస్తున్నారని అర్థమయేది. వాళ్లు గోర్కీ కాలనీ మొత్తంగా తరలి రావడం కోసం ఎదురుచూస్తున్నారు తెలుస్తూనే ఉంది. అలా వారు రావడం మంచికో, చెడ్డకో వారికే స్పష్టత లేదు. మా గురించి గిట్టనివారు చెప్పినదాన్ని బట్టి మేం రావడం వారికి కష్టకాలం రావడమే. కానీ ఇప్పటికే ఇక్కడకు చేరిన నన్ను, నాలాటి డిటాచ్‌మెంట్‌నూ చూస్తేవారికి అలా అనిపించేది కాదనుకుంటా. ఆడపిల్లల డార్మెటరీలో ఓల్గా నేతృత్వంలోని ఆరవ డిటాచ్‌మెంట్ కూడా జరగబోయే పరిణామాల కోసం ఆసక్తిగా ఎదురుచూసేది. ఈ డిటాచ్‌మెంట్ క్షణం ఖాళీగా ఉండేదికాదు. వాళ్లు తమ డార్మెటరీని శుభ్రంగా తుడిచి, బూజులు దులిపి, సున్నం వేసుకున్నారు. రోజూ సాయంత్రం మా కుడ్లాటీ వారి డార్మెటరీకి వెళ్లి కబుర్లు చెప్పేవాడు. బహు ధైర్యంగా ఉండమని హామీ ఇచ్చేవాడేమో.

ఈలోగా కాలనీలో అల్లరి కుర్రవాళ్ల అధినాయకుడు కొరొటోక్వ్ కూడా నాకు ఎదురుపడ్డాడు. వాడి గురించి ముందుగా నాకు వివరాలు తెలియకపోతే బుద్ధిమంతుడని పొరబడేవాడినేమో. మొత్తానికి వాడు లౌక్యం తెలిసిన పెద్దమనిషిలా వ్యవహరించేవాడు. ఎప్పుడూ తప్పుగా మాట్లాడడం కానీ, పొరపాట్లతో దొరకడం కానీ జరగలేదు. పని మాత్రం చేసేవాడు కాదు అంతే. వాడి గురించి పూర్తి సమాచారం సేకరించిన మా తొలి డిటాచ్‌మెంట్ నాయకులు కుర్యాజ్ కాలనీలో మా ప్రథమ, ప్రధాన శత్రువు వాడేనని గుర్తించారు. ఒకరోజు మా కుర్రవాళ్లు నలుగురు కలిసి కొరొటోక్వ్‌ను సరస్సు గట్టు వద్దకు పిలిచి మర్యాదగా మాట్లాడారట. కాలనీ విడిచి నీ యిష్టం వచ్చిన చోటికి పొమ్మని సలహా ఇచ్చారట. వాడు ప్రశాంతంగా విని "నేనెక్కడికీ వెళ్లను. వెళ్లాల్సిన అవసరం లేదు. ఇక్కడే ఉంటాను" అని బదులిచ్చాడు. మా వాళ్లు అంతటితో ఆ విషయాన్ని వాయిదా వేశారు.

ఆ రోజుల్లో కొరొటోక్వ్ ఎన్నడూ నాతో మాట్లాడే ప్రయత్నం చేయలేదు. నన్ను పట్టించుకోలేదు. ఎప్పుడైనా దారిలో ఎదురుపడితే తన లేతరంగు టోపిని గౌరవపూర్వకంగా లేపి "హలో కామ్రేడ్ డైరెక్టర్ ఎలా ఉన్నారు?" అని మర్యాదగా అడిగి పక్కకు తప్పుకునేవాడు.

కానీ అతని కళ్లలోకి చూస్తే వాడి ఉద్దేశం అర్థమయ్యేది. "మనం ఒకరికొకరు అడ్డు రావద్దు. మీ దారేదో మీ ఇష్టం. నేను నా ఇష్టం వచ్చినట్ట నడుస్తాను" అన్నట్టుగా ఉండేది వాడి వాలకం.

కానీ ఒకరోజు భోజనాల గదిలో కొరొటోక్వ్ నన్ను తనంతతానుగా పలకరించాడు. "కామ్రేడ్ డైరెక్టర్, మీ గోర్కీకాలనీలో లాకప్ రూం ఉండేదా?" అని అడిగాడు.

"లేదు అటువంటిదేం లేదు" అంతే పొడిగా సమాధానమిచ్చాను.

"కానీ మీరు కుర్రవాళ్లని అరెస్టు చేస్తారని నిర్బంధంలో ఉంచుతారనీ విన్నాను?"

"దాని గురించి నువ్వేం ఆందోళన చెందకు. నేను కేవలం నీ స్నేహితులను, నా వాళ్లను మాత్రమే అరెస్టులో ఉంచుతాను" ఆ మాట చెప్పి ఇక అతనిపై ఏ ఆసక్తి లేనట్టు వేరే వైపు తిరిగి ఇంకో పనిలో పడ్డాను. మే పదిహేనవ తేదిన టెలిగ్రాం వచ్చింది.

"రేపు సాయంత్రం రైల్లో బయలుదేరి వస్తున్నాం – లాపోట్"

ఆ రాత్రి భోజనాల సమయంలో ఆ విషయం అందరికీ తెలియచేశాను. "ఎల్లుండి గోర్కీ వాసులంతా ఇక్కడికి చేరతారు. మనం వారిని మిత్రుల్లా ఆహ్వానిద్దాం. ఈ విషయంలో ఎటువంటి తేడా రావద్దు. ఇకనుంచి మనమంతా ఒక్కటే. కలిసి బతుకుదాం. కలిసే పనిచేద్దాం" అన్నాను.

ఈ మాటలు విన్న బాలికలు ఒక్కసారిగా నిశ్శబ్దంగా మిగిలిపోయారు. కుర్రవాళ్లు ఒకరివంక ఒకరు సాలోచనగా చూసుకున్నారు.

ఒక మూల, ఒక టేబుల్ చుట్టూ కూర్చున్న కొరొట్కోవ్ బృందం ఉన్నట్టుండి పకాలున నవ్వింది.

ఆ రాత్రి మా గదిలో తొలి డిటాచ్‌మెంట్ సభ్యులు సమావేశమై కాలనీ నుంచి వస్తున్నవారికి ఎటువంటి స్వాగతం ఇవ్వాలో చర్చిస్తున్నారు. వారు వచ్చిన తరువాత చేయవలసిన కొమ్సొమోల్ తీర్మానంలోని ప్రతి చిన్న అంశాన్నీ సవివరంగా పరశీలించారు.

ఈలోపు గదితలుపు మెల్లగా తెరుచుకుంది. జోర్క లోపలికి వచ్చాడు. వచ్చి అందరూ కూర్చున్న చోట నిలబడేవాడు. వాడి మొహం ఒక పక్క వాచిపోయి ఉంది.

"ఏమైంది? మొహం అలా ఉందే?"

"వాళ్లు నన్ను కొట్టారు"

"ఎవరు?"

"ఏమో తెలియదు. స్టేషన్ నుంచి వస్తున్నాను. నా ఎదురుగా వచ్చి హటాత్తుగా దాడిచేశారు."

"ఒక్క నిమిషం' అని అరిచాడు వొలోఖావ్. 'కొట్టారు, నిన్ను వాళ్లు కొట్టారు. ఈ సంగతి తేలుద్దాం. కానీ అసలేం జరిగింది? వాళ్లేమన్నా అన్నారా?"

"పెద్దగా మాటలేం జరగలేదు. కొమ్సొమోల్ వచ్చాడ్రా అని ఎవరో హేళనగా అన్నారు. వెంటనే నా దవడ మీద కొట్టారు"

"నువ్వేం చేశావు?"

"నేనూ కొట్టాను. కాని వాళ్లు నలుగురు."

వొలోఖోవ్ గంభీరంగా ఆలోచనలో పడ్డాడు.

7

ఇంజన్ లేకుండా కదిలిన రైలు

పదిహేడవ తేదీన గోర్కీ వాసులను ముందుగానే కలుసుకునేందుకు నేను లుబోటిన్ స్టేషన్‌కు వెళ్లాను. ఇది ఖార్కోవ్‌కు ముప్పై కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆ చిన్న ప్లాట్‌ఫామ్ మీద వేడిగా వుంది. ప్రయాణంలో నలిగిన రైతులు అటూ ఇటూ తిరుగుతున్నారు. రవాణా బోగీల్లోంచి సామాను దింపే కూలీలు మురికి బట్టల్లో, పెద్ద బూట్లతో హడావుడి పడుతున్నారు. ఒక పెద్ద విశేషం జరగబోయే రోజిది. స్టేషన్లో ఎవరూ నన్ను పట్టించుకోలేదు. నేనెవర్ని కనుక? అందుకే సామాన్ల బండి తోసుకొస్తున్న ముసలి పోర్టర్ ఆ బండితో నన్ను తోసినా, రైలు గురించి అడిగినప్పుడు స్టేషన్ మాస్టర్ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినా నేనేం పట్టించుకోలేదు. వాళ్లెవరికీ నేను ఏ రైలు గురించి అడుగుతున్నానో అర్థం కానట్టే ప్రవర్తించారు. కుర్యాజ్ కాలనీని పూర్తిగా ఆధీనంలోకి తెచ్చుకొనేందుకు నాకు అండగా నిలిచే యోధులు మార్షల్ కోవల్, మార్షల్ లాపోట్‌ల దళాలు వస్తున్న రైలది! ఆ రైలు రావడం నాకు ఎంత ముఖ్యమో వాళ్లకి ఎలా వివరించగలను? ప్లాట్‌ఫాం మీదే అటూ ఇటూ పచార్లు చేస్తూ కుర్యాజ్ కాలనీలో పొద్దుట్నుంచి వాతావరణంలో వచ్చిన మార్పు గురించి ఆలోచిస్తున్నాను. వాళ్లలో అప్పుడే ఏదో బలహీనత ప్రస్ఫుటంగా తెలిసివచ్చింది.

నేను బాగా ఉదయమే లేచాను. అప్పటికే కాలనీలో సందడిగా వుంది. మా కుర్రవాళ్లు ఎప్పటిలానే ఐదు గంటలకు లేచి ఉదయం కార్యక్రమాల్లోకి దిగుతారు. కానీ బయట హడావుడి రోజుకంటే ఎక్కువగా అనిపించింది. బయటికి వచ్చి చూశాను.

గేటు వద్ద కుర్యాజ్ కుర్రవాళ్లు జురేన్, నిసినోవ్‌లు నిలబడి ఉన్నారు. నన్ను చూడగానే వాళ్లు అడిగారు. "గోర్కీవాసులు వస్తున్నది ఎప్పుడు? ఈ ఉదయమేనా?" "అవును, మీరేంటి పొద్దున్నే నిద్రలేచారు?"

"ఏం లేదు. సరిగా నిద్ర పట్టలేదు. వాళ్లు రైజోవ్ నుంచే వస్తున్నారా?"

"అవును, మీరు వాళ్లని కలుసుకునేది ఇక్కడే."

"అంటే ఇప్పుడే వచ్చేస్తారా?"

"లేదు, ఇంకా వ్యవధి ఉంది. మీరు స్నానాలు అవీ చేయవచ్చు"

జురేన్ వెంటనే అక్కడినుంచి కదిలాడు. నిసినోవ్‌నీ వెంట పిలిచాడు.

నేను గోరోవిచ్‌ని పిలిచి మాట్లాడాను. "గోర్కీ పిల్లలు వచ్చేసరికి కుర్యాజ్ కుర్రవాళ్లని ఆవరణలో వరుసల్లో నిలబెట్టండి. రెండు కాలనీల పిల్లలూ ఒకరికొకరు వందనం చేసుకోవాలని చెప్పండి. అయితే బలవంత పెట్టవద్దు."

నా ఆలోచనలు ఇలా సాగుతూండగా లుబోటిన్ స్టేషన్లో గంట మోగింది. స్టేషన్ సిబ్బంది ఒకరు వచ్చి ఆ గంట రహస్యం చెప్పాడు. "మీరు ఎదురు చూస్తున్న రైలు వస్తోంది."

అయితే అప్పటినుంచీ జరిగిందంతా గందరగోళం, అయోమయమే. నేనేదురు చూస్తున్న మూడొందల డబ్బైమూడు – బి రైలు కంటే ముందు ఒక లోకల్ రైలు వచ్చింది. అందులోంచి మా రబ్‌ఫాక్ మూక దిగింది. బెలూఖిన్ చేతిలో పూల గుత్తులున్నాయి. కుర్రవాళ్లంతా నన్ను చూసి ఉషారుగా అరిచారు.

బెలూఖిన్ హుందాగా చెప్పాడు. "ఈ పూలు మన ఐదవ డిటాచ్‌మెంట్‌లోని ఆడపిల్లల గౌరవార్థం" అని.

ఆ గుంపులోనే టీచర్ అప్రెంటిస్‌లు ఒక్సానా, రఖిల్‌లు ఉన్నారు. బ్రాచెంకో తన చేతిలో చెర్నకోల ఉన్నట్టు ఆ చేతిని అదేపనిగా విదిలిస్తూ, ఊపుతున్నాడు. ఎవరినీ ఉద్దేశించకుండా గాల్లో అరుస్తున్నాడు. "నేనివాళ పూర్తి స్వేచ్ఛగల రౌతుని. మెలోడెట్స్‌ని స్వారీ చేస్తా" అంటూ కేకలు పెడుతున్నాడు.

ఇంతలో ఎవరో అరిచారు. మనవాళ్లు ఎక్కిన రైలు ఎప్పుడో వచ్చేసింది. అది ఆ చివరి లైను మీద నిలిచి ఉంది అని.

ఈ సమాచారం నన్ను నివ్వెరపరిచింది. ఎప్పటినుంచో నేను ఆ రైలు కోసం, ఎదురుచూస్తుంటే ఎవరూ ఆ సమాచారం నాకు చెప్పలేదు! ఆశ్చర్యం నుంచి తేరుకోకముందే అవతల మూడవ లైన్‌పై ఆగివున్న ఒక గూడ్సు బోగీ వెనకనుంచి లాపోట్ తొంగిచూశాడు.

"అడుగో లాపోట్!" అని కరబనోవ్ అరిచాడు. అందరం అటుగా పరుగుతీశాం. కానీ వాడు గభాలున బోగీ కింద దూరాడు.

"ఆగండి ఆగండి, నన్ను చుట్టుముట్టవద్దు. ఒక్సానా, రాఖిల్‌లు ఇద్దరిని మాత్రమే ముద్దు పెట్టుకుంటాను. మిగతా వాళ్లకి ఉత్త కరచాలనాలే" అని ప్రకటించాడు.

దీంతో కరబనోవ్ వంగి లాపోట్‌ను బోగి నుంచి బయటికి ఈడ్చాడు. ఒక్సానా, రాఖిల్‌లు నిజంగానే లాపోట్ బుగ్గలపై ముద్దు పెట్టుకున్నారు. లాపోట్ నా వద్దకు వచ్చి గట్టిగా నా అరచేతిని నలిపాడు. వాడి మొహం ఎప్పటికంటే కళగా కనిపించింది.

"ప్రయాణం ఎలా సాగింది?" అని అడిగాను.

"పెద్ద సంతకెళ్తున్నట్టు, జాతరకు బయలుదేరినట్టు ఉంది. కానీ మన గుర్రం మొలోడెట్స్ మాత్రం కొంత గాభరా పడింది. రాత్రంతా బోగీలో హడావుడి చేసింది. అవును మనం ఇంకెంత సేపు ఇక్కడ ఉంటాం. ఆలస్యం అయే మాటైతే మేం స్నానాలూ అవీ పూర్తి చేసుకుంటాం...' అన్నాడు.

"పద చూద్దాం" అంటూ నేను అవతల లైనుపై నిలిచిన రైలు దగ్గరికి నడిచాను. లాపోట్ స్టేషన్ వైపు పరుగు తీశాడు. వాళ్లు వచ్చిన రైలుకి దాదాపు నలభై ఐదు బోగీలున్నాయి. అన్నీ గూడ్సు బోగీలే, తెరిచి ఉన్న వాటి తలుపుల్లోంచి, పైన టాపులేని బోగీలపై నుంచి గోర్కీవాసులు బయటికి తొంగి చూస్తున్నారు. అందరూ సంతోషంగా నవ్వుతూ, అరుస్తూ నన్ను పలకరించారు. తలుపు తెరిచిన ఒక బోగీలోంచి గడ్ నడుం వరకూ బయటపెట్టి "ఆంటన్ సెమ్యోనోవిచ్ నేనిలా తొంగి చూడడం చట్టబద్ధమా? కాదా?" అని అడిగాడు. నాకు అర్థం కాలేదు. "నువ్వేం మాట్లాడుతున్నావ్?" అని వాణ్ణి అడిగాను.

"సిగ్నల్ ఇచ్చేవరకూ ఎవరైనా బండి దిగితే తల తీసేస్తానన్నాడు ఆ లాపోట్‌గాడు. మరివాడు కమాండర్ కదా. అదీ సంగతి. వాడి ఆదేశాలు, క్రమశిక్షణతో చస్తున్నాం. త్వరగా మీరు పగ్గాలు తీసుకోండి" అన్నాడు.

అప్పటికే స్టేషన్ మాస్టారితో మాట్లాడి వచ్చిన లాపోట్ ఈ గోల విన్నాడు.

"అలాగేం. అలా అయితే దిగు చూద్దాం. సిగ్నల్ ఇచ్చేలోపు దిగేందుకు ప్రయత్నించు" అని విరుచుకుపడ్డాడు.

దాంతో గడ్ వెనక్కి తగ్గాడు. "దిగుతామని ఎవరన్నారు? నేను దిగకపోతే చచ్చిపోతాననుకున్నావా? నాకిక్కడే బావుంది" అంటూ గొణిగాడు.

"అదీ పద్ధతి. సరే సినెంకీని పంపు" అని ఆదేశించాడు.

సినెంకీ మా కాలనీలో బగిల్ ఊదే నిపుణుడు. వాడే అన్నిరకాల సంకేతాలూ రోజు ఇచ్చేది.

ఒక నిమిషం తరువాత సినెంకీ పసి, నిద్రమొహం గడ్ భుజం మీదుగా కనిపించింది. వాడు నిద్రకళ్లతోనే నన్ను ఆశ్చర్యంగా చూశాడు.

"ఆంటన్ సెమ్యోనోవిచ్!" అన్నాడు ఆశ్చర్యంగా.

"అలాగా పలకరించేది. వందనం చెప్పవా?" అని గడ్ కసురుకున్నాడు. సినెంకీ అదేం పట్టించుకోలేదు. "ఆంటన్ సెమ్యోనోవిచ్, నిజంగా మీరేనా?" అన్నాడు.

"మనం అప్పుడే కుర్యాజ్ వచ్చేశామా?" అని గడ్‌ని అడిగాడు.

గడ్ నవ్వి "ఇది కుర్యాజ్ కాదు. లుబోటిన్ స్టేషన్. త్వరగా కదులు. సిగ్నల్ ఇవ్వు. అందరం బండి దిగుదాం" అన్నాడు.

దీంతో సినెంకీ నిద్రమత్తు పూర్తిగా వదిలింది. రెండు క్షణాల్లో వాడు తన బగిల్‌తో ప్రత్యక్షమయ్యాడు. నా వంక చూసి తియ్యగా నవ్వాడు. చొక్కా చివర్లతో పెదాలు తుడుచుకున్నాడు. తరువాత తన ఎర్రటి పెదాల మధ్య బగిల్ అంచును బిగించి బుగ్గలు పొంగించి బిగ్గరగా ఊదాడు. ఆ నాదంతో స్టేషన్ పరిసరాల ప్రతిధ్వనించాయి. పిల్లలంతా ఒక్కపెట్టున బోగీల్లోంచి కిందకి ఉరికారు. అందరూ నవ్వుతూ నా చుట్టూచేరి గోలగోలగా మాట్లడడం ప్రారంభించారు. అప్పటికే బోగీ పైకి ఎక్కిన లాపోట్ అందర్నీ గద్దించాడు. "కబుర్ల కోసం వచ్చామా; రండి త్వరగా తయారవండి. వెంటనే బోగీలన్నీ శుభ్రం చేయండి" అని ఆదేశించాడు.

ఈలోపు పక్కనున్న ప్లాట్‌ఫాం నుంచి టారానెట్స్ ఇకిలిస్తూ ముందుకి వచ్చాడు. వాణ్ణి చూసి లాపోట్ భగ్గుమన్నాడు. "ఇదేనా క్రమశిక్షణ? నీకేం చెప్పాను? అందరి స్నానాలు ఎక్కడో చూశావా? తిండి ఏర్పాట్లు చేశావా?" అని అడిగాడు.

టారానెట్స్ ప్రశాంతంగా సమాధానం ఇచ్చాడు. "రైలు ఇంకో నలభై ఐదు నిమిషాలు ఆగుతుంది. అందరూ అవతల ఉన్న పెద్ద పంపు వద్ద స్నానం చేయవచ్చు. ఫెడరెంకో ఇప్పటికే పలహారం సిద్ధం చేశాడు. ఎక్కడ కావాలంటే అక్కడ తినొచ్చు.

దీంతో పిల్లలంతా గబగబా మళ్లీ బోగీల్లో దూరి వాటిని శుభ్రం చేయడం ప్రారంభించారు. కొందరు కుర్రవాళ్లు చెత్తగంపలతో బోగీల వద్దకు వెళ్లి లోపల వాళ్లు తుడిచి ఎత్తి పోసినదంతా వాటిల్లో తీసుకుని, అవతల పారబోస్తున్నారు. అరగంటలో ఆ పని పూర్తయింది. స్నానాలు పూర్తిచేసి పరిశుభ్రమైన నీలం లాగులు, తెల్లటి చొక్కాలు ధరించి ప్లాట్‌ఫాం మీద వరసగా పలహారాల కోసం కూర్చున్నారు. గబగబగా తినడం పూర్తిచేసి క్షణాల్లో మళ్లీ రైలు ఎక్కారు. ఇంజన్ భారంగా కదిలింది. నలభై నిమిషాల తరువాత మా రైలు రైజోన్ స్టేషన్ చేరుకుంది. అక్కడ స్టేషన్లో ఎక్‌తెరీనా, లిడియా, గొల్యోవా తదితరులు మాకు స్వాగతం చెప్పారు. కోవల్ నా వద్దకు వచ్చి "ఇంకా ఆలస్యం ఏమిటి? సామాన్లు దింపేద్దాం" అన్నాడు. గబగబా స్టేషన్ మాస్టర్ వద్దకు వెళ్లాడు. సామాన్లు దింపాలంటే రైలుబండిని ఆ చివరి ప్లాట్‌ఫాం నుంచి మొదటి ప్లాట్‌ఫాంపైకి తేవాలి. కానీ రైలుని అంతవరకూ తెచ్చిన ఇంజన్ వెంటనే ఖార్కోవ్ బయలుదేరి పోయింది. మరో ఇంజన్ రావాలి? ఎప్పుడొస్తుంది. ఎవరికీ తెలియదు. దాదాపు గంటసేపు వేచి ఉన్నాం. ఇంజన్ రాలేదు. స్టేషన్ మాస్టర్ని అడిగితే ఎప్పుడొస్తుందో తనకు తెలియదన్నాడు. పిల్లల్లో అసహనం పెరిగిపోతుంది.

"ఇంజన్ ఎప్పుడు వస్తుంది?" అంటూ వందోసారి కోవల్ స్టేషన్ మాస్టర్ని అడిగాడు. దాంతో ఆయన కస్సుమన్నాడు. "ఏమో రేపు రావచ్చు" అన్నాడు.

పిల్లలు అశాంతిగా తిరుగుతున్నారు.

టారానెట్స్ నా వద్దకు వచ్చి మెల్లగా అన్నాడు. "ఇంజన్ ఇప్పట్లో రాదు. మనమే దాన్ని తోసుకుంటూ మొదటి ప్లాట్‌ఫాం పైకి తెద్దాం" అని.

వాడికి పిచ్చిగానీ ఎక్కిందా? అనిపించింది.

"మేమే తోసుకొస్తాం సెమ్యోనోవిచ్. లారీలని సామానుతో సహా తొయ్యగా లేనిది, పట్టాల మీద బోగీలని తొయ్యలేమా?" అన్నాడు.

"చెత్త మాట్లాడద్దు" అని వాడిపై విసుక్కున్నాను.

కరబనోవ్ వచ్చి "అంత తేలికేం కాదు. మొత్తం రైలుని సిగ్నల్ పాయింట్ల వరకూ తోసి ఆ తరువాత మలుపు తిప్పి ఇటు తీసుకురావాలి" అన్నాడు సాలోచనగా.

టారానెట్స్ తన మొండిపట్టు వీడలేదు. నన్ను బతిమాలడం ఆపలేదు. పిల్లలూ వాడినే సమర్థిస్తున్నారు.

దాంతో లాపోట్ కలుగచేసుకున్నాడు. "దీనికి వాదన ఎందుకు? ప్రయత్నించనిద్దాం? పని జరిగితే మంచిదే? లేకపోతే నష్టంలేదు" అన్నాడు.

"పోనీ ముందు రెండు మీటర్లు, కేవలం రెండు మీటర్లు తోసి చూస్తాం. కదిలితే ఆ తరువాత సంగతి ఆలోచిద్దాం" అన్నాడు టారానెట్స్ ప్రాధేయపూర్వకంగా.

చివరికి చేసేదిలేక వొప్పుకున్నాను. ఏం చేయాలో అప్పటికే అర్థం చేసుకున్న పిల్లలంతా ఆ రైలు బోగీల పొడవునా నిలిచి ఎదురు చూస్తున్నారు.

ఈలోగా స్టేషన్ మాస్టర్ అక్కడికి వచ్చాడు. "ఏమిటిది? ఏం చేస్తున్నారు?" అంటూ కంగారుగా గావుకేకలు పెట్టాడు.

"రెండు మీటర్లు, రెండే మీటర్లు తోసి చూస్తాం" అంటున్నాడు కోవల్. ఆయనకి ఏం అర్థంకాక అయోమయంగా చూస్తున్నాడు. పిల్లలంతా గోలగోలగా నవ్వుతున్నారు. ఈలోగా లాపోట్ తన టోపీ ఎత్తి పిల్లలకు సిగ్నల్ ఇచ్చాడు. స్టేషన్ మాస్టర్ అప్రయత్నంగా వాడిని అనుకరిస్తూ తల ఊపాడు. "తొయ్యండి" అని బోగీల వెనకనుంచి ఎవరో అరిచారు.

పిల్లలంతా పెదాలు బిగించి చేతులు జాచి, నడుములు వంచి బోగీలపై బలాన్ని ప్రయోగిస్తున్నారు. కొద్ది సెకన్లసేపు ఏమీ జరగలేదు. ప్లాట్‌ఫాంపై నిశ్శబ్దం. కానీ చక్రాల వంక చూస్తుంటే వాటిలో నెమ్మదిగా చలనం కనిపిస్తోంది. మరుక్షణంలో రైలు కొంచె కదిలింది. క్రమంగా వేగం పెరుగుతోంది. స్టేషన్ మాస్టర్ నుదిటిపై చెమటలు. "జాగ్రత్త ఎవ్వరూ చక్రాల కింద పడకండి. జాగ్రత్త" అని కేకలు పెట్టాడు. "సిగ్నల్స్ సంగతేమిటి?" అని ఎవరో ఆయన్ని అడిగారు.

"వాటి సంగతి నేను చూస్తాను. అన్ని రైళ్లను ఆపుతాను. మీరు కానివ్వండి" అంటూ ఆయన వడివడిగా తన గదివైపు వెళ్లాడు.

ఒక నిమిషం తరువాత రైలు వేగం పుంజుకొంది. మరో నిమిషంలో సిగ్నల్ పాయింటువరకూ చేరింది. అక్కడినుంచి రైలుని చివరికి తీసుకెళ్లి తిరిగి మొదటి ప్లాట్‌ఫాంపైకి దాన్ని తోస్తున్న పిల్లలను చూస్తుంటే వాళ్లసలు శ్రమపడుతున్నట్టే అనిపించలేదు. అందరూ నవ్వుతున్నారు. సరదాగా రైలు బోగీలపై చేతులు వేసి నడుస్తున్నట్టుందే తప్ప రైలుని తోస్తున్నట్టు కనిపించలేదు. క్రమంగా రైలు మొదటి ప్లాట్‌ఫాం వద్దకు చేరింది.

ఈలోగా వెనకనుంచి ఎవరో పిలిచారు. "కామ్రేడ్ మకరెంకో" అని. వెనుదిరిగి చూశాను. అక్కడ బ్రెగిల్, ఖాలాబుదా, జోయా నిలచి ఉన్నారు. బ్రెగిల్ నా వంక చీదరగా చూస్తోంది.

"వీళ్లేనా మీ పిల్లలు" అని ప్రశ్నించింది. నేను సమాధానం ఇచ్చేలోగా ఆవిడే అంది. "ఎవరికైనా ఏ ప్రమాదమైనా జరిగితే మీదే బాధ్యత."

కామ్రేడ్ జోయా అందుకుంది. "పిల్లలంటే మకరెంకోకు ఎంతో ప్రేమ అని ప్రచారం. అలా అనే వాళ్లని పిలిచి ఈ దృశ్యం చూపించాలి" అందామె నిప్పులు చెరుగుతూ.

నా గుండె ఒక్క క్షణం వేగంగా కొట్టుకొంది. గొంతులో ఏదో అడ్డం పడినట్టనిపించింది. ఆమెకు తగ్గట్టు అంతే ఆవేశంగా, హేళనగా బదులు ఇద్దామనుకున్నాను. కానీ తమాయించుకున్నాను. ఈలోగా ఖాలాబుదా జోక్యం చేసుకున్నాడు. "వాళ్లేదో సరదాగా ఆ పని చేస్తున్నారు. భడవలు సరదా అంతే. చూడు బ్రెగిల్ చివర్న ఆ కోతిని చూడు" అంటూ నిండుగా నవ్వాడు. తరువాత గభాలున తానూ ప్లాట్‌ఫాం దిగి రైలును ముందుకు తొయ్యడంలో చెయ్యి అందించాడు. జోయా, బ్రెగిల్‌లు మౌనంగా చూస్తూ నిలబడ్డారు.

ఇరవై నిమిషాల తరువాత బ్రాచెంకో మా కాలనీ గుర్రం మెలొడెట్స్‌పై వేగంగా స్వారీ చేస్తూ కుర్యాజ్ వైపు దూసుకుపోయాడు.

ఇక్కడ స్టేషన్‌లో ఒసాడ్చీ నేతృత్వంలోని డిటాచ్‌మెంట్ పిల్లలందర్నీ స్టేషన్ బయట ఉన్న చిన్న ఖాళీ స్థలంలో బారులుగా నిలిపింది. మళ్లీ బగిల్ శబ్దం మార్మోగింది. మా బ్యాండ్ వాయిద్యాల

ఘోష మొదలైంది. నేను నా స్థానంలో నిలిచాను. కోవల్ మార్చింగ్ ఆదేశాలు జారీచేశాడు. అందరం బ్యాండు వాయిద్యానికి అనుగుణంగా, లయబద్ధంగా అడుగులు వేసుకుంటూ కుర్యాజ్ వైపు బయలుదేరాం. మా బృందానికి ముందు ఆరుగురు బగ్లర్లు, ఎనిమిది మంది డ్రమ్ము వాయిద్యకారులు నడిచారు. వారి వెంట డ్యూటీలో ఉన్న కమాండర్ టారనెట్స్ కాలనీ పతాకాన్ని పట్టుకొని నడుస్తున్నాడు. తెల్లటి చొక్కాలు, నీలం లాగుల్లో పిల్లలు ఆ ఉదయం ఎండలో మెరిసిపోతున్నారు. మధ్య నాలుగు వరసల్లో బాలికలు కవాతులో పాల్గొన్నారు. దారిలో ఎన్ని ఎగుడుదిగుళ్లూ, గతుకులు వచ్చినా ఎవ్వరూ తొట్రుపడడం కానీ, తూలి పడటం కానీ లేదు. అందరూ నిటారుగా, తలలు పెకెత్తి బిగించిన గుప్పిటలను ముందుకూ వెనక్కూ కదుపుతో వేగంగా ముందుకు సాగుతున్నారు. మా బ్యాండ్ వాయిద్యం పరిసరాలను ఉలిక్కిపరుస్తూ అంతకంతకూ కుర్యాజ్‌కు దగ్గరవుతోంది. కాలనీ దగ్గరవుతున్న కొద్దీ డ్రమ్ముల శబ్దంలోని వేగం పెరుగుతోంది. మా బృందం మొదటి పొడ్వార్కీ గ్రామ వీధుల్లోకి ప్రవేశించంది. ఒకప్పుడు ఇప్పటి కుర్యాజ్ కాలనీలో ఉన్న క్రైస్తవ మొనస్ట్రీకి అనుబంధంగానే ఈ గ్రామం ఏర్పడింది. మొనస్ట్రీ పెద్దలు అక్కడ పిల్లల కాలనీ మొదలైనా మూడు వందల ఏళ్లుగా ఆ గ్రామంలో స్థిరపడినవారి మనసుల్లో, ఆలోచనల్లో ఇసుమంత మార్పు రాలేదు. మొనస్ట్రీలోని చర్చికి వచ్చే భక్తులు ఇచ్చే రాగి కాసులే జీవనాధారంగా తరతరాలు గడిపిన గ్రామీణులకు మారిన పరిస్థితులు కంటగింపుగా ఉండడంలో ఆశ్చర్యం లేదు. గ్రామవాసులంతా తమ ఇళ్ల ప్రహరీలపై నుంచి, కంచెల అవతల నిలబడి మా కవాతు చూస్తూ నిలిచారు. వాళ్లలో వారు గుసగుసలాడు కుంటున్నారు. వాళ్లంతా మమ్మల్ని శత్రువులుగానే పరిగణిస్తున్నారనే విషయం అర్థమైంది. ఒక్క క్షణం గోర్కీ వాసుల గురించి ఆలోచించాను.

వాళ్లు తమ కాలనీని వదిలి వచ్చారు. తమ పొలాలని, పళ్లతోటలని, కొలోమాక్ నదిని వదిలి కుర్యాజ్ బయలుదేరారు. కుర్యాజ్ కాలనీలో వీళ్లు స్థిరపడగలరో లేదో తెలియదు. ఆ కాలనీవాసులదే పై చెయ్యి అయి వీరు పరాజితులైతే భవిష్యత్తు ఏమిటో అగమ్యం.

మా బ్యాండు వాద్యకారుల బృందం కుర్యాజ్ కాలనీ గేటు వెలుపల గల ఏటవాలు దిబ్బని సమీపించింది. కాలనీ గేట్ వద్ద నించున్న వాన్య జైచెంకో పరుగు పరుగున నా దగ్గరికి వచ్చాడు. "ఆంటన్ సెమ్యొనోవిచ్, నేను మీతో నడవచ్చా" అని అడిగాడు. "నడువు మరి" అన్నాను.

వాడు నా పక్కనే చేరి, తల పైకెత్తి గుప్పిళ్లు బిగించి గంభీరంగా ముందుకు నడిచాడు.

కాలనీలో మా బ్యాండు వాయిద్యం కొత్త చలనాన్ని తెచ్చినట్టు అనిపించింది. అక్కడ ఆవరణలో కుర్యాజ్ కాలనీ పిల్లలంతా అనేక వరసల్లో నిలిచి ఉన్నారు. గోలోవిచ్ వారి అందరికంటే ముందు నిలిచి చేయి పైకెత్తి సెల్యూట్ చేస్తూ శిలా ప్రతిమలా కనిపించాడు.

8

ఊహించని విజయం

గోర్కీ కాలనీ కుర్రవాళ్లు – కుర్యాజ్ కాలనీ పిల్లలూ ఏడెనిమిది మీటర్ల దూరంలో ఎదురెదురుగా బారులుతీరి నిలిచి ఉన్నారు. గోరోవిచ్ ఆధ్వర్యంలో హడావుడిగా బారులు తీరిన కుర్యాజ్ కుర్రవాళ్లు కొంత కంగారుగా కనిపించారు. మీ కుర్రవాళ్లు కవాతు చేస్తూ వచ్చి అడ్డంగా వరసలుగా నిలిచిన తరువాత కొద్ది క్షణాలు అక్కడ నిశ్శబ్దం అలుముకొంది. పిల్లలంతా ఒకరినొకరు పరీక్షగా చూసు కుంటున్నారు. ఇంతవరకూ మా తొలి బృందంలోని పిల్లలనే కుర్యాజ్ కాలనీ చూసింది. వాళ్లు కేవలం పనిచేసేందుకే అక్కడికి వచ్చినవారు. వచ్చిన నాటి నుంచి బండపనిలో మునిగితేలారు.

పనిచేసే దుస్తుల్లో ఎప్పుడూ మట్టి కొట్టుకొని మురికిగా కనిపించారు. కానీ ఇప్పుడు కుర్యాజ్ పిల్లలు చూస్తున్నది నిండు యూనిఫారాల్లో శుభ్రంగా, క్రమపద్ధతిలో నిలిచిన గోర్కీ పిల్లలను, తెల్లటి శుభ్రమైన చొక్కాలు, నీలిగా నిగనిగలాడుతున్న లాగులు, తళతళా మెరిసే బెల్టు బకిల్సు, ఆరోగ్యంగా కనిపించే బలమైన కాళ్లు, కుదురుగా, పొందికగా ఉన్న పాదాలతో మిలిటరీ క్రమశిక్షణతో నిలిచిన పిల్లలను వారిప్పుడు చూస్తున్నారు.

మా వాళ్లని చూసి కుర్యాజ్ పిల్లలు ఏమనుకుంటున్నారో అంచనా వేసేందుకు కొద్ది క్షణాలు ప్రయత్నించాను. కుర్యాజ్ పిల్లల కళ్లల్లో ఆశించిన శత్రుభావం లేదు. కొంత ఆశ్చర్యం తప్ప! పైగా గత వారం పదిరోజుల్లో వారిలోనూ మార్పు వచ్చింది. వారు మమ్మల్ని నిర్లక్ష్యంగా, ద్వేషపూరితంగా చూడడం ఎప్పుడో మానారు. మొదట్లో వారంతా మూసపోసిన నిర్లక్ష్యంతో, అవధులు మీరిన అహంకారంతో తిరిగేవారు. కానీ గత వారం పదిరోజుల్లో మా పనితో, వారితో పెంచుకున్న సాన్నిహిత్యంతో వారిలో అప్పటికే కొంత మార్పు వచ్చింది. ప్రస్తుతం చాలామంది మొహాలు ప్రసన్నంగా, కొంత ఆసక్తిగా మా వాళ్లని గమనిస్తున్నాయి. వారిలో చాలామంది చిన్నపిల్లలు ఎప్పుడు మా శ్రేణుల్లో కలిసిపోదామా అని ఉత్సాహంగా కూడా ఉన్నట్టు కనిపించింది. దూరంగా ఉన్న అందమైన ఆటబొమ్మని సొంతం చేసుకొందామనే ఉత్సుకత ఉన్న పసిపిల్లల్లా వారు మా గోర్కీ పిల్లల వంక చూస్తున్నారు. నెసినోవ్, జురేన్‌లు ఒకరి భుజాలపై ఒకరు చేతులు వేసుకుని మా పిల్లల వంకే కళ్లార్పకుండా చూస్తూ నిలిచారు. వాళ్లని చూస్తే వాళ్ల కళ్లని గమనిస్తే ఏవో కలలు కంటున్నట్లు కనిపించారు. బహుశా తాము కూడా గోర్కీ వాసుల్లాగా పరిశుభ్రమైన దుస్తుల్లో, అంత ఆత్మ విశ్వాసంతో, కవాతు చేయగలిగే దెన్నడు? అన్న ఆలోచన వారి బుర్రలో మెదలుతుందేమో. వారందరి మొహాల్లో మా వాళ్లని చూస్తుంటే ఒక రకమైన సంతోషం, సంతృప్తి, నమ్మకం కొంత అసూయ ఉన్నట్టు తోచింది. నేను ఊహించినట్టు వేళాకోళం, హేళన, కోపం వారి చూపుల్లో లేవు. కొంత ధిక్కార ధోరణిని ప్రదర్శిద్దామని భావించినవారు కూడా బహుశా మా ముందు వరసల్లో బలమైన ఛాతితో, కండలు తిరిగిన శరీరంతో, బలిష్టంగా, ఆరోగ్యంగా కనిపిస్తున్న ఫెదెంకో, కొరిటో, నెచిట్లలో తదితరులను చూసి తమ వైఖరిని మార్చుకొని వుండాలి. అందరికంటే ముందున పసిపిల్లవాడు సినెంకీ తన బూరను మోకాలుకు ఆన్చి, అందరివంక నిర్భయంగా, సంతోషంగా చూస్తున్నాడు. వాడి కళ్లు ఆసక్తితో మెరిసిపోతున్నాయి. వాడిని చూస్తే నిన్నమొన్నటివరకూ వీధుల్లో తిరిగిన అనాథలా నాకే అనిపించడం లేదు. పూర్తి భద్రత కలిగిన సొంత కుటుంబం మధ్య పెరుగుతున్న పిల్లవాడిలా ఉత్సాహంగా ఉన్నాడు.

ఈ నిశ్శబ్దం కొద్ది నిమిషాల సేపే ఉంది. ఒకే దెబ్బతో రెండు కాలనీ పిల్లల మధ్య ఉన్న అగాధాన్ని, ఏడుమీటర్ల దూరాన్ని పూడ్చాలని నేను నిర్ణయించుకున్నాను. వారి మధ్య నిలిచి మాట్లాడడం ప్రారంభించాను.

"కామ్రేడ్స్ ఈ క్షణంనుంచి మనమంతా మొత్తం నాలుగు వందలమందిమి ఒకే సమిష్టి బృందంగా ఉందాం. దాని పేరు గోర్కీ కాలనీ. ఈ సంగతిని మీరెవ్వరూ ఎన్నడూ మరువకూడదు. మీరు ఎప్పుడూ మిమ్మల్ని గోర్కీ కాలనీ వాసులుగానే పరిగణించాలి. తోటి గోర్కీ వాసిని సన్నిహిత కామ్రేడ్‌గా, మంచి స్నేహితునిగా భావించాలి. ఒకరినొకరు గౌరవించుకోవాలి అవసరాల్లో ఒకరినొకరు కాపాడాలి. తప్పులు చేస్తే సరిదిద్దాలి. పోతే, అందరూ కచ్చితమైన క్రమశిక్షణ పాటించాలి. ఇందులో

ఎవరికీ మినహాయింపు లేదు. మనం చేయవలసింది సాధించవలసింది ఎంతో ఉంది. క్రమశిక్షణతోనే మనం లక్ష్యాన్ని చేరగలం."

ఇటువంటి విషయాలే మరికొంత సేపు మాట్లాడాను. ఈ పేదరికం నుంచి బయటపడాలనీ అందుకు కష్టించి శ్రమించాలనీ, దీనితో పాటే శ్రద్ధగా చదువుకోవాలనీ, అందరం నిజమైన శ్రామిక వర్గ ప్రజానీకంగా ఎదగాలనీ, ప్రతి ఒక్కరూ నిజమైన యువ కమ్యూనిస్టుగా కాలనీ నుంచి బయట పడాలనీ, దాని వల్ల బయట సమాజానికి మనమెంతో ఉపయోగపడగలమనీ చెప్పాను.

నాకు ఆశ్చర్యం కలిగించిందేమిటంటే కుర్యాజ్ కాలనీ కుర్రవాళ్లు నా మాటలని అతి శ్రద్ధగా వినడం. ఈ ఉపన్యాసాలు అలవాటైన, నేను చెబుతున్న విషయాలన్నీ ఎప్పుడో విని, జీర్ణించుకున్న గోర్కీ పిల్లలు ఇంకా కొంత పరధ్యానంగా ఉన్నట్టు కనిపించారు. కానీ కుర్యాజ్ పిల్లలు మాత్రం ఇటువంటి సంగతులు జీవితంలో తొలిసారిగా వింటున్నట్లు నోళ్లు వెళ్లబెట్టుకుని వింటున్నారు.

ఒక్క పదిహేను రోజుల క్రితం ఇదే విషయాలు చెప్పబోతే వీళ్లు ఎలా ప్రవర్తించారో తలచుకుంటే ఆశ్చర్యం వేసింది. పిల్లలకు ఏదైనా బోధించడం అన్నది ఎంత సంక్లిష్టమైనది? బోధన అన్నది ఒక శాస్త్రమేనా అన్న అనుమానం ఎవరికైనా కలుగుతుంది. ఇప్పుడు నా వెంట గోర్కీవాసుల బలం ఉన్నది కాబట్టి కుర్యాజ్ పిల్లలు నేను చెబుతున్నది వింటున్నారని అనుకుంటే పొరపాటే. సంఖ్యాబలం దృష్ట్యా ఇప్పటికీ మేం కుర్యాజ్ పిల్లల కంటే తక్కువే. అందువల్ల భయంతో వాళ్లు వింటున్నా రనుకుందుకు లేదు. ఠీవీగా ఎగురుతున్న కాలనీ పతాకమో, గంభీరంగా ఎగిసిన మా బ్యానరో, పిల్లల యూనిఫారాలో, మా బ్యాండు వాద్యపు ఘోషో ఆ పిల్లలను దారికి తెచ్చిందనడం విద్యాబోధనా శాస్త్ర సిద్ధాంతాలకే వ్యతిరేకం. ఏ కారణాల వల్లనైతేం, కుర్యాజ్ పిల్లల వైఖరిలో గుణాత్మకమైన మార్పు ఉంది.

మరో అరగంటలో కాలనీ సభ్యులందరితో సమావేశం జరుగుతుందని ఈలోగా రెండు కాలనీ పిల్లలూ పరిచయాలు చేసుకోమని చెప్పి ఉపన్యాసం ముగించాను. దీంతో మా పిల్లలు కుర్యాజ్ వాసులతో చేతులు కలిపి పరిచయం చేసుకుంటారని నా ఉద్దేశం. కానీ మా వాళ్లు నా ఉపన్యాసం పూర్తికాగానే చప్పున కాలనీలోకి పరుగెత్తారు. ఒక్క క్షణం బిత్తరపోయిన కుర్యాజ్ పిల్లలు వెంటనే తేరుకుని వెంబడించారు. నవ్వుతూ, అరుపులూ, గోల వినిపిస్తున్నాయి.

ఒక మూల సమాధి రాళ్లపై కూర్చున్న బ్రెగిల్, జోయాల వైపు నడిచాను. "మీ వాళ్లకి దార్మెటరీలు సిద్ధంగా ఉన్నాయా?" అని అడిగింది జోయా.

"లేదు. కానీ ఏదో విధంగా సర్దుకుంటార్లెండి"

అప్పుడే మా స్టుపిట్సిన్ తన పందుల సమూహంతో కాలనీలో అడుగుపెట్టాడు. అవి గుంపులు గుంపులుగా నెమ్మదిగా లోపలికి ప్రవేశించాయి. వొలోఖోవ్ తన సహచరులతో వారికి ఎదురువెళ్లాడు. వారంతా కలసి పందులను వాటి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షెడ్లలోకి తోలుతున్నారు. వెనక స్టుపిట్సిన్, షెరీ, ఖాలాబుద్‌లు ఏదో మాట్లాడుకుంటూ వస్తున్నారు.

మమ్మల్ని చూసి ఖాలాబుద్ చిరునవ్వుతో సమీపించాడు. ఆయన చేతిలో చిన్న పందికూన ఉంది. చూడండి ఈ పందులు ఎంత బావున్నాయో. మన పిల్లలు వీటి క్రమశిక్షణలో సగం నేర్చుకుంటే చాలు అని వ్యాఖ్యానించాడు.

"కామ్రేడ్ మకరెంకో అభిప్రాయం కూడా అదేలా ఉంది" అంటూ జోయా ప్రారంభించింది. "చూడండి పందులకు వెచ్చగా, సౌకర్యంగా ఉండే షెడ్లు సిద్ధంగా ఉన్నాయి. పిల్లలు ఎక్కడ

పడుకుంటారంటే మాత్రం వాళ్ల ఏర్పాట్లు వాళ్లే చేసుకుంటారని చెబుతున్నాడాయన" అందామె నిరసనగా.

ఈ మాటలు బ్రిగెల్‌కి బాగా నచ్చినట్టుంది. ఆమెకి నన్ను విమర్శించేందుకు ఒక సాకు దొరికినట్టుంది. "దీనికి మకరెంకో ఏం చెబుతారు? పందుల కాపరి మకరెంకో కాదు. అధ్యాపకుడైన మకరెంకో ఏం చెబుతారో వినాలని ఉంది" అందామె.

ఆమె కంఠంలో ధ్వనించిన హేళన, ద్వేషభావం చూసి విచలితుడనయ్యాను. కానీ తమాయించుకున్నాను. ఇటువంటి సంతోషకరమైన రోజు పనికిమాలిన సిద్ధాంత చర్చలతో వృధా పుచ్చడం అనవసరం అనిపించింది.

"చూడండి కాలనీవాసులు ఇక్కడ సర్వాధినేతలు. పందులు వారి ఆధీనంలోని జీవులు" అని బదులిచ్చాను.

"మరి తమరు" అంది బ్రెగిల్ అంతే విషం నిండిన గొంతుతో.

"నేను ఆ పిల్లల సహచరుడిని."

ఈ వివాదం ఇంకా కొనసాగేదే. కానీ ఇంతలో పాలబుగ్గల సినెంకీ పరుగున వచ్చాడు. వచ్చి గందరగోళంగా మాట్లాడడం ప్రారంభించాడు.

"లాపోట్ మొదలుపెట్టమంటాడు... కోవలో ఆగమంటాడు. లాపోట్‌కి కోపం వచ్చింది. తను చెప్పినట్టు చెయ్యమని అరిచాడు. పిల్లలంతా డార్మెటరీల్లో తిరుగుతున్నారు. కోవల్ మాతో మాట్లాడతానంటున్నాడు..." ఆపకపోతే ఇలా అనంతంగా అర్థంపర్థం లేకుండా వాగేట్టున్నాడు వాడు.

నేను లాలనగా అన్నాను. "మిగతా పిల్లలు, లాపోట్, కోవల్ ఏమంటున్నారో అర్థం అయింది. నువ్వేమంటున్నావో తెలియలేదు ఇంతకీ నన్నేం చేయమంటావ్?"

సినెంకీ నిర్ఘాంతపోయాడు.

"మిమ్మల్నా? మిమ్మల్నేమీ చేయమనడం లేదు. కానీ లాపోట్ చెబుతున్నాడు." "ఏమిటి?"

"కానీ కోవల్ ఏమో...."

"కామ్రేడ్ సినెంకీ ఇక్కడ లాపోట్ ఏం చెప్పాడో ప్రధానం. అదేంటో చెప్పు" అన్నాను. కామ్రేడ్ అని సంభోదించినందుకు సినెంకీ ఉప్పొంగిపోయాడు.

"లాపోట్ చెబుతున్నాడు సమావేశానికి సంకేతం ఇవ్వమని."

"మరి ముందు నువ్వు ఆ మాట చెప్పి ఉండాల్సింది"

అప్పుడు కామ్రేడ్ జోయా వంగి సినెంకీ గులాబీ బుగ్గలను తన చేతివేళ్లతో నిమిరి, దగ్గరగా నొక్కింది. దాంతో వాడి ఎర్రటి పెదవులు విచిత్రంగా కోలగా మారాయి.

"పిల్లవాడు ఎంత ముద్దొస్తున్నాడో" అన్నదామె అపేక్షగా.

సినెంకీ ఆమె చేతుల నుంచి గింజుకుని విడిపించుకున్నాడు. ఆమె వంక చూశాడు కోపంగా.

"పిల్లవాణ్నా నేనా! నేను మిమ్మల్ని అలాచేస్తే ఎలా ఉంటుంది? నేనేం పసివాణ్ణి కాదు. కాలనిస్టుని తెలుసా" అన్నాడు ఉక్రోషంగా.

ఇంతలో కోవల్ అక్కడికి వచ్చాడు. "అందరం సిద్ధంగా ఉన్నాం. తీర్మానం కూడా సిద్ధమైంది. అయితే ఆ తీర్మానానికి వాళ్లని ఒప్పించేదెలా? బలవంతం చేద్దామా?" అన్నాడు.

కామ్రేడ్ జోయా నొసలు చిట్లించింది. "ఏమిటీ బలప్రయోగంతో మీ తీర్మానానికి అందర్నీ ఒప్పిస్తారా?" అంది కోపంగా.

"అది మా మాటతీరులెండి" అన్నాడు కోవల్ తేలిగ్గా.

నాకు ఈ సంవాదం విసుగును పెంచింది. "సినెంకీ సమావేశానికి సిగ్నల్ ఇవ్వు" అని ఆదేశించాను.

వాడు వెంటనే తన బగిల్ అందుకుని కాలనీ గోడలు, చర్చి శిఖరాలను ఉద్దేశించి సమావేశానికి సూచనగా సంకేతం ఊదాడు. ఆ శబ్దం మొత్తం కాలనీలో ప్రతిధ్వనించింది.

"దీనికంటే గంట నయం" అంది జోయా చెవులు మూసుకుని.

"గంట ఉత్త బదుద్దాయి వ్యవహారం. దానికి ఏ అర్థం ఉండదు. ఇలా సంగీతం సంకేతంలా ఉంటే ఒక్కొక్క సందర్భానికి ఒకలా రాగం ఆలపించవచ్చు" అన్నాడు కోవల్.

మొత్తానికి సంకేతం వినగానే పిల్లలంతా గుంపులు గుంపులుగా క్లబ్ వైపు కదిలారు. డార్మెటరీల నుంచీ, అనుబంధ భవనాల నుంచీ, భోజనశాల, వంటగది, వర్క్‌షాపుల నుంచి పిల్లలు గుంపులు గుంపులుగా క్లబ్ వైపు నడిచారు. చిన్నపిల్లలైతే పరుగు అందుకున్నారు. అప్పటికే రెండు కాలనీల పిల్లల మధ్య కొంత సయోధ్య కుదిరినట్టు వారి తీరునుబట్టి తెలుస్తోంది. రెండు కాలనీల కుర్రవాళ్ల కలిసిన బృందాలు ఏవేవో మాట్లాడుకుంటూ వస్తున్నారు. అయితే అప్పటికీ కుర్యాజ్ కాలనీ పిల్లలు చాలామంది దూరంగా విడిగా నడుస్తూ కనిపించారు.

అందరూ చల్లగా ఉన్న క్లబ్ గదిలో చేరారు. కానీ గోర్కీవాసులు వేదిక చుట్టూ చేరారు. గమనిస్తే అది కూడా టారానెట్స్ పథకంలో భాగమనిపించింది. పరీక్షగా చూస్తే సంఖ్యాపరంగా గోర్కీకాలనీ ఎంత బలహీనంగా ఉన్నదో తెలిసివచ్చింది. మా రెండు, మూడు, పదవ డిటాచ్‌మెంట్‌లు బయట ఆవరణలో పశువులను, గుర్రాలను, పందులను వాటివాటి నిర్ణీత స్థానాలకు తరలించడంలో హడావుడిగా ఉండడం వలన, రబ్‌ఫాక్ విద్యార్థులు కూడా లేనందువల్ల మొత్తంమీద మా వాళ్ల సంఖ్య పలచగా అనిపించింది. అంటే అక్కడ గుమిగూడిన దాదాపు నాలుగువందల మందిలో గోర్కీవాసులు ఏభై అరవై మంది లోపే. మా బాలికలను ఇక్కడి ఆడపిల్లలు ఎంతో ఆప్యాయంగా ఆహ్వానించి తమ డార్మెటరీల్లోనే చోటిచ్చారు. వాళ్లంతా వెనకగా నిలబడి ఉన్నారు.

సమావేశాన్ని ప్రారంభించేందుకు జొర్కావొల్కోవ్ నాతో గుసగుసలాడాడు. "తిన్నగా విషయం మొదలుపెడదామా?" అన్నాడు.

"అలాగే కానివ్వమన్నాను"

జోర్కాద్ వేదికపైకి చేరాడు. వాడు చదవబోయే తీర్మానాన్ని మా కొమ్సొమోల్ ఎన్నో చర్చల అనంతరం ఖరారు చేసింది. జోర్కా, వొలోఖోవ్, కుద్లాటీ, జెవెరీ, గోర్కోవ్‌స్కీ తదితరులు అనేక విషయాలు పరిగణనలోకి తీసుకుని దీనిని రూపొందించారు. అందులో గోర్కీకాలనీ క్రమశిక్షణ, అక్కడి కామ్రేడ్ల మధ్య సాన్నిహిత్యం, పనిలో సమన్వయం, తప్పుచేసిన వారిని దండించేతీరు, కాలనీ రోజువారీ పని పద్ధతులు మొదలైనవన్నీ వివరంగా ఉన్నాయి. పేరుకి అది రహస్యపత్రమే అయినా, కాలనీలో సీనియర్లంతా దాని రూపకల్పనలో సాయపడ్డారు. గోర్కీ కాలనీలో తిరిగి ఇక్కడ కుర్యాజ్‌లో జరిగిన సమావేశాల్లో దానికి ఎన్నో మార్పులు చేశారు. తీర్మానం చదివే ముందు జోర్కా ఉపోద్ఘాతంగా కొంత మాట్లాడాడు. "కాలనీలోని కామ్రేడ్స్ వృధా మాటలు, అనవసర ప్రసంగాలూ వద్దు. అయితే ఎక్కడ ఎలా ప్రారంభించాలో నాకు అర్థం కావడం లేదు. తీర్మానం చదవగానే మనం ఎక్కడ ఎలా ప్రారంభించాలో అర్థం అవుతుంది. విషయం ఏంటంటే అందరూ పనిచేయాలి. చేయకపోతే వారు కాలనీవాసులు కారు. కామ్సొమోల్ సభ్యులు కాలేరు. మట్టిలోనే

దొర్లుతాం, బురదలోనే పొర్లుతాం అంటే మీ ఇష్టం. అయితే మీరేం చేయాలనుకుంటున్నారో ఏం కావాలనుకుంటున్నారో అన్నది ముఖ్యం. కేవలం ఆహారం చుట్టూ ముసిరే క్రిమికీటకాల్లా మిగిలిపోవాలా అన్నది మీరే తేల్చుకోవాలి."

"అది మా తప్పా?" గుంపులోంచి ఎవరో ప్రశ్నించారు.

"కచ్చితంగా మీ తప్పే. మీ స్వయంకృతాపరాధం. ఎంతసేపూ తప్పు మరొకరి పైకి నెట్టి, ఎవరినో శాపనార్థాలు పెడుతూ, ఏడుస్తూ, కుమిలిపోతారా? అది పొరపాటు. మీ చుట్టూ ఉన్న మురికి చూడండి. ఇంత మురికికూపంలో బతకమని మిమ్మల్ని ఎవరు శాసించారు? అది మీ హక్కు అనుకుంటున్నారా? మేం మా పందుల్ని కూడా సబ్బుతో స్నానం చేయిస్తాం. అవికూడా స్నానాన్ని, శుభ్రతను కాదనవు. పైగా మా చేతుల్లో జలకాలాడి ఆనందంతో తోకలు ఊపుతాయి. కృతజ్ఞతగా తలల వంచుతాయి."

"సబ్బులో? అవి మాకెవరూ ఇవ్వరు. అసలేమీ ఇవ్వరు" అన్నారు పిల్లల్లోంచే మరొకరు.

దీనికి జోర్కా సమాధానం చెప్పాడు "ఎవరు ఇవ్వాలి; ఎవరో మీకు ఎందుకివ్వాలి? మీకు మీరే యజమానులు. మీకేం కావాలో మీరు నిర్ణయించుకోవాలి వాటి కోసం కష్టపడాలి. సాధించుకోవాలి.

"మరి మీ యజమాని ఎవరు? మకరెంకోనా? గుంపులోని మరొకరి సందేహం.

జోర్కా నిరసనగా నవ్వాడు. "ఇలాంటి ప్రశ్న అడగడానికి సిగ్గుగా లేదా? మేం ఆంటన్ సెమ్యోనోవిచ్ మకరెంకోను విశ్వసిస్తాం. ఆయన మాలో ఒకరు. అందరం కలిసి శ్రమిస్తాం. ఈ ప్రశ్న అడిగిన వారెవరో బుద్ధిలేని శుంఠ. కానీ ఇంతకంటే చవటలకుకూడా గుణపాఠం నేర్పడం మాకు తెలుసు. అసలు ఎవరో ఒక యజమాని లేనిదే పని చేయలేని అశక్తతకు ముందు మీరు సిగ్గుపడాలి" అన్నాడు. ఈ మాటలతో పిల్లలంతా ఘొల్లుమని నవ్వారు.

"మన సోవియట్ భూమిలో శ్రామికులు, కార్మికులే యజమానులు. కానీ మీరంతా ప్రభుత్వం అందించే ఆహారంపై ఆధారపడ్డారు. మీరు చేసేదల్లా తినడం, నేల పాడుచేయడం"

జూర్కా శ్రుతిమించుతున్నాడనిపించింది. కుర్యాజ్ పిల్లలను మరీ అవమనిస్తున్నాడనిపించింది. జోక్యం చేసుకుందామనేలోపే గుంపులోంచి మరో గొంతు వినిపించింది. "తిన్న తరువాత అదే నేలను మీరెలా పాడుచేస్తారో చూస్తాంగా" అని.

మళ్లా అందరూ నవ్వారు.

జూర్కా దీనిని అవమానంగా తీసుకోలేదు. తానూ నవ్వాడు. సరే "పాయిఖానాల పక్కనే ఒక కుర్చీ వేయిస్తాను. మీరు కూర్చుని పరిశీలించండి. కనీసం అదైనా ఉపయోగపడుతుంది. పాయిఖానాలను ఎలా ఉపయోగించాలో తెలుస్తుంది అదేం పెద్ద విద్య కాదు. కానీ ఆరోగ్య కారణాల దృష్ట్యా ఆ చిన్నపనైనా అందరికీ తెలియాల్సిందే" అన్నాడు.

కుర్యాజ్ పిల్లల మొహాలు ఎర్రబారాయి. కానీ వారు సైతం నవ్వకుండా ఉండలేకపోయారు. ఆడపిల్లలు మాత్రం మొహాలు చిట్లించి తమ నిరసన తెలిపారు. గోర్కీవాసులు తమ నవ్వును దాచుకుని జూర్కా వంకా, అతని మాటలు కుర్యాజ్ పిల్లలపై కలిగిస్తోన్న ప్రభావాన్ని గమనించేందుకు వారి వంకా పరీక్షగా చూస్తున్నారు.

నవ్వులు ముగిసిన తరువాత కుర్యాజ్ కుర్రవాళ్లు జూర్కా మాటలని మరింత శ్రద్ధగా వినేందుకు సిద్ధపడ్డారు. వారి కళ్లలోకొంత స్నేహం పొటమరించింది. అందరివంకా పరిశీలనగా చూసి, తీర్మానం కాగితం తెరిచి చదవడం ప్రారంభించాడు.

"ఇది గోర్కీకాలనీ కొమ్సొమోల్ 1926 మే 15న ఆమోదించిన తీర్మానం. దీని ప్రకారం

1. ఈ క్షణంనుంచి ఇంతవరకూ గోర్కీ కాలనీలో, కుర్యాజ్ కాలనీలో ఉన్న అన్ని డిటాచ్‌మెంట్‌లూ రద్దవుతాయి. ఆ వెంటనే ఇరవై డిటాచ్‌మెంట్‌లు ఏర్పడతాయి.
   (ఇక్కడ జోర్కా ప్రతికొత్త డిటాచ్‌మెంట్‌లోని సభ్యుల పేర్లు, వాటి కమాండర్ల పేర్లూ పైకి చదివాడు.)
2. కామ్రేడ్ లాపోట్ ఇకముందు కూడా కమాండర్ల మండలి కార్యదర్శిగా కొనసాగుతారు. అలాగే డెనిస కుద్లాటీ సప్లై మేనేజర్‌గా, అలాక్సీమల్కోవ్ స్టోర్‌కీపర్‌గా వ్యవహరిస్తారు.
3. కమాండర్ల మండలి ఇప్పుడు ఈ తీర్మానంలో వచ్చే అన్ని అంశాలనూ కచ్చితంగా అమలుచేసి, అన్ని లక్ష్యాలనూ సాధించే బాధ్యతను చేపట్టాలి.
4. కుర్యాజ్ కాలనీ వాసుల దుస్తులు, లోదుస్తులు, పక్కబట్టలు, దుప్పట్లు, పరుపులు, తువాళ్లు వంటి అన్ని రకాల బట్టలూ ఈ రోజే స్వాధీనం చేసుకుని వాటిని పరిశుభ్రం చేసేందుకు అప్పగించాలి. తరువాత వాటిని మరమ్మతు చేయించాలి.
5. ఆ వెంటనే పిల్లల కోసం గోర్కీకాలనీ బాలికలు కుట్టి సిద్ధంచేసిన లాగులు, చొక్కాలు కుర్యాజ్ కాలనీలోని పిల్లలకు ఇవ్వాలి, వారం రోజుల్లో అందరికీ రెండో జత కూడా అందించాలి.
6. ఆడపిల్లలు తప్ప కాలనీ పిల్లలంతా వెంటనే శుభ్రంగా క్షవరం చేయించుకోవాలి. ఆ తరువాత వారికి టోపీలు సరఫరా చేస్తాం.
7. కాలనీవాసులంతా ఈ రోజు స్నానం చేసి తీరాలి. ఎవరెక్కడ స్నానాలు చేయాలో కమాండర్లు నిర్ణయిస్తారు.
8. ప్రస్తుతానికి డార్మెటరీల మరమ్మతు ప్రారంభం కానున్న దృష్ట్యా పిల్లలంతా మునుపటి గోర్కీవాసుల వద్ద ఉన్న పక్కబట్టలతోనే సర్దుకుని ఊరుకోవాలి.
9. పడుకునే స్థలం గురించి ఎవరూ పేచీలు పెట్టకూడదు. సమస్య వస్తే పరిష్కారం కోసం సమిష్టిగా ఆలోచించాలి.
10. కాలనీవాసులంతా తమతమ డిటాచ్‌మెంట్‌లతో కలిసే, రెండు షిఫ్టులుగా భోజనాలు చేయాలి. భోజనాల సమయంలో డిటాచ్‌మెంట్‌లలోని కుర్రవాళ్లు అటూ ఇటూ మారకూడదు.
11. పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి.
12. దర్జీ షాపుల్లో తప్ప మిగిలిన ఏ వర్క్‌షాపులోనూ ఆగస్టు 1 వరకూ ఎటువంటి పనీ జరగదు. ఈలోగా వివిధ డిటాచ్‌మెంట్‌లు కింది బాధ్యతలు నిర్వర్తించాలి.

"కాలనీలోని పూర్వపు మొనస్ట్రీని బద్దలుకొట్టి, ఆ ఇటుకలతో ఇతర సామాగ్రితో 300 పందుల కోసం ఒక కొట్టం నిర్మించాలి."

"అన్ని తలుపులు, కిటికీలు, గుమ్మాలు, కమ్మీలు, చువ్వలు, మంచాలకు రంగులు వేయాలి."

"పొలంలో ట్రక్ గార్డెన్‌లో పనులు కొనసాగాలి."

"పాడైన కుర్చీలు, బల్లలూ బాగుచేయాలి."

"మొత్తం ఆవరణను, చుట్టూ ఉన్న ఏటవాలు దిబ్బలు శుభ్రం చేయాలి. దారులన్నీ మరమ్మతు చేయాలి. అవసరమైతే కొత్త దారులు వేయాలి. పూలతోట కోసం, భూమిని తవ్వి సిద్ధం చేయాలి. ఒక ఔట్‌హౌస్‌ని నిర్మించాలి."

"కాలనీవాసులందరికీ మంచి దుస్తులు, చలికాలం కోసం బూట్లు సిద్ధం చేయాలి."

"ఆవరణ వెలుపల ఉన్న సరస్సులో పూడిక తీసి, శుభ్రం చేయాలి. స్నానానికి పనికొచ్చేలా చూడాలి."

"ఆ కొండ దక్షిణం వైపు ఏటవాలుగా కొత్త తోటను వేయాలి."

"ఆగస్టు ఒకటి నుంచి వర్క్‌షాపులో పనిచేసేందుకు అవసరమైన పనిముట్లు సిద్ధంచేయాలి."

వినడానికి చాలా నిరాడంబరంగా, పెద్ద పదాలతో హడావుడిగా లేకున్నా ఆ తీర్మానం మొత్తం కాలనీవాసులను ఆకట్టుకొందనడంలో సందేహం లేదు. అందరూ చెవులొగ్గి ఆ తీర్మానంలోని విషయాలన్నీ విన్నారు. ఆ తీర్మానాన్ని రూపొందించిన మేమే పిల్లలలో అది కలిగించిన ప్రభావాన్ని చూసి ఆశ్చర్యపోయాం. పైగా పదిహేను రోజుల ముందు వచ్చి ఏమీ పట్టించుకోనట్టుగా తిరిగిన మా తొలిబృందం మొత్తం కాలనీ పరిస్థితిని అంచనా వేసిందని, అవసరాలను క్షుణ్ణంగా పరిశీలించిదని కుర్యాజ్ పిల్లలకు అర్థమైపోయింది.

కొత్త డిటాచ్‌మెంట్‌ల ఏర్పాటు కూడా అందర్నీ సంతృప్తిపరచింది. ఈ విషయంలో కామ్సొమోల్ తీసుకున్న జాగ్రత్తలు నన్ను సైతం అబ్బురపరిచాయి. కుర్యాజ్ వాసుల మధ్య స్నేహాలు, సాన్నిహిత్యాలు, శత్రుత్వాలు, పాత కక్షలు, వారి మధ్య ఉండగల సమన్వయం వంటి అంశాలన్నింటిని క్షుణ్ణంగా అధ్యయనం చేసిన తరువాతే వారీ డిటాచ్‌మెంట్‌లను రూపొందించారని అర్థమవుతూనే ఉంది. మా తొలి డిటాచ్‌మెంట్ పదిహేను రోజుల ముందే ఇక్కడకు వచ్చినది ఊరికే కాదని కుర్యాజ్ పిల్లలకూ అర్థమైపోయింది. అంత నేర్పుగా బృందాలను ఏర్పరిచిన ఘనత జూర్కా గోర్కోవ్‌స్కీ జువేలదే.

ఈ కొత్త డిటాచ్‌మెంట్ ప్రతిదానిలోనూ ముగ్గురు నలుగురు అయినా పాత గోర్కీవాసులు ఉండేలా జాగ్రత్తపడ్డారు. ఈ కూర్పు కోసం ఎంత కష్టపడ్డారో డిటాచ్‌మెంట్‌లను చూస్తే తప్ప అర్థం కాదు.

జూర్కా ఆ తీర్మానం చదువుతున్న తీరు, అందులోని విషయాలు కుర్యాజ్ పిల్లలను అంతగా ఆకట్టుకున్నాయంటే మధ్యలో ఎవరికైనా ఏ మాట వినపడకపోయినా, అర్థం కాకున్నా ఆత్రంగా పక్కవారిని అడిగి తెలుసుకోవడం కనిపించింది.

జూర్కా తీరానాన్ని చదవడం పూర్తి కాగానే హాల్లో పూర్తి నిశ్శబ్దం ఆవరించింది. ఈ నిశ్శబ్దంలో ఎంతో అర్థం ఉంది. ఆ తీర్మానాన్ని ఆమోదించాలా, తిరగబడాలా, హర్షించాలా, తిట్టాలా? తేల్చుకోలేని సంశయం ఆ నిశ్శబ్దంలో ఇమిడి ఉంది.

అంతా పూర్తయిన తరువాత జూర్కా ఆ కాగితాన్ని మౌనంగా మడిచి హాల్లో అందరివైపూ చూశాడు. ఎవ్వరూ మాట్లాడలేదు.

ఈలోగా లాపోట్ గొంతు అల్లరిగా వినిపించంది. "నాకేం నచ్చలేదు. నా పరుపూ, నా దుప్పటీ నాకున్నాయి. నేనవరితో పంచుకోవాలి. ఎక్కడ పడుకోవాలి. పొదలమాటునా? ఏ పొద దగ్గర? మా కమాండర్ కుద్లాటీ ఎక్కడ? ఏమండీ కమాండర్‌గారూ నేను ఏ పొదపక్కన పడుకోవాలి?" అంటూ గోల ప్రారంభించాడు.

"నీ కోసం ఒక పొదని చూసే ఉంచాను" అన్నాడు కుద్లాటీ గంభీరంగా.

"ఏం పొదండి? చెర్రీపళ్లు కాస్తాయా? ఏపిల్ చెట్టా? దానిమీద నైటింగేల్ పక్షులుంటాయా?" మొహంలో లేనిపోని ఆత్రం పులుముకొని లాపోట్ ప్రశ్నించాడు. తరువాత తన చేతిలోని కాగితం చూసి పరిశీలించాడు. ఇందులో పాత గోర్కీవాసులు ఎనిమిదిమంది. అంటే ఎనిమిది పరుపులూ,

ఎనిమిది దుప్పట్లూ అన్నమాట. కాని డిటాచ్‌మెంట్‌లో ఇరవై రెండుమంది ఉన్నారే. ఎవరు వారు? ఎవరూ? స్టెన్నీ? బాబూ స్టోగ్నీ ఎక్కడ? ఎక్కడున్నావు? ఇలారా? అని పిలిచాడు.

జీవితంలో స్నానం ఎరుగనట్టున్న ఎన్నడో రాతియుగంలో మాత్రమే జుట్టు కత్తిరించుకున్నట్టున్న ఒక కుర్రవాడు భయంభయంగా వేదికపైకి వచ్చాడు. వాడిని పరీక్షగా చూసిన లాపోట్ "అంటే నీతో కలిసి నేను నిదురించాలన్న మాట. కొంపతీసి నిద్రలో తన్నవుకాదా?" అన్నాడు.

పిల్లలంతా వినోదం చూస్తూ నవ్వుతున్నారు. స్టెగ్నీ కూడా సిగ్గుగా నవ్వి, అప్పుడు నోటినుంచి కారిన ఉమ్మిని మురికి చేతులతో తుడుచుకున్నాడు.

'సరే బానే ఉంది. నా పక్కనే పడుకుందువుగాని, కానీ అంతకు ముందు నిన్ను నది దగ్గరికి తీసుకెళ్లి శుభ్రంగా ఉతకాలి. ఆ మురికినంతా వదిలించాలి. ఆ బొచ్చు కత్తిరించాలి. అర్థమైందా?' అని అడిగాడు.

స్టెగ్నీ సిగ్గుగా నవ్వి 'సరే' అన్నాడు.

లాపోట్ అంతటితో ఆ అల్లరి మొహాన్ని గంభీరంగా మార్చాడు. మౌనంగా వేదిక ఎక్కాడు.

"అందరికీ అర్థమైందా?" అని గుంపునుద్దేశించి ప్రశ్నించాడు.

"స్పష్టంగా అర్థమైంది" అంటూ అనేక గొంతుకలు బదులిచ్చాయి.

'బావుంది. అందరికీ అర్థమైంది కాబట్టి మనం ఈ తీర్మానాన్ని ఆమోదిద్దాం. ఏమంటారు?' అని అడిగాడు. ఆమోదించడం అంటే తెలియని కుర్యాజ్ పిల్లలు అయోమయంగా నిలబడ్డారు. జోర్కా ఓటింగ్ జరుపు అని లాపోట్ ఆదేశించాడు.

దాంతో పిల్లలంతా పగలబడి నవ్వారు. అందర్నీ నిశ్శబ్దంగా ఉండమని హెచ్చరించిన జోర్కా తాను ఆ తీర్మానంపై ఓటింగ్ జరుపుతున్నట్టు ప్రకటించాడు.

"తీర్మానాన్ని సమర్థించేవారు చేతులు ఎత్తండి" అని ఆదేశించాడు.

వందలాది చేతులు పైకి లేచాయి. నేను హాలంతా పరిశీలనగా చూశాను. అక్కడి ప్రతి ఒక్కరూ చేతులు ఎత్తి ఉన్నారు. తలుపు వద్ద నిలబడి కొరొట్కోవా బృందం కూడా నవ్వుతూ చేతులు పైకెత్తి నిలబడి కనిపించింది. ఆడపిల్లలంతా తమ తలలు పక్కకు వాల్చి, చిరునవ్వుతో, మృదువైన తమ అరచేతులను గాలిలో ప్రదర్శించారు. నాకు ఆశ్చర్యం కలిగింది. చివరికి కొరొట్కోవా బృందం కూడా అంతే నిస్సంకోచంగా తీర్మానాన్ని సమర్థించడం చూసి నివ్వెర పోయాను. కొరోట్కావ్ గోడను ఆనుకొని నిలబడి ఇంకా తన చేతిని పెకెత్తి ఉంచాడు. వాడి కళ్లు ప్రశాంతంగా వేదికపై ఉన్న మా వంక చూస్తున్నాయి.

ఈ ప్రశాంత, గంభీర, పవిత్ర వాతావరణాన్ని ఉన్నట్టుండి రంగప్రవేశం చేసిన బొరొవాయ్ కొంత దెబ్బతీశాడు. వాడు తన అకార్డియన్‌తో సహా వచ్చి సంగీతం ప్రారంభించబోయాడు. తలుపువద్దే వున్న కొరోట్కోవ్ వాడి భుజంపై చెయ్యివేసి, వాడి కళ్లలోకి అర్థవంతంగా చూశాడు. దాంతో వాడు భుజాలు ఎగురవేసి నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

అప్పుడు జోర్కా తీర్మానంపై ఓటింగ్ ఫలితాలను ప్రకటించాడు. "అనుకూలంగా మూడు వందల ఏభై నాలుగు వచ్చాయి. వ్యతిరేకంగా ఒక్కటీ లేదు."

దీంతో గోర్కీ పిల్లలు ఆనందంగా చప్పట్లు చరిచారు. వారిని చూసి కుర్యాజ్ పిల్లలు చేతులు చరచడం ప్రారంభించారు. అందుకు వారు సంశయించిన తీరు, పడిన మొహమాటం చూస్తే, జీవితంలో అలా, ఉషారుగా కేరింతలు పెడుతూ చప్పట్లు కొట్టడం వారికదే మొదటిసారి అనిపించింది.

జదరోవ్ వేదిక ఎక్కేదాకా అలా చప్పట్లు వినిపిస్తోనే ఉన్నాయి. జదరోవ్ ఎప్పుడు వచ్చాడో నేను గమనించలేదు. వాడి మొహంపై, బట్టలనిండా తెల్లటి పిండిమరకలు ఉన్నాయి. స్టేషన్‌నుంచి ఎవైనా సప్లైలు తెచ్చాడేమో నాకు తెలియదు. వాడు వేదిక ఎక్కి పిల్లలతో సరాసరి మాట్లాడడం మొదలుపెట్టాడు.

"నేను కొన్ని మాటలు చెప్పదలచాను. కామ్రేడ్స్ గోర్కీ కాలనీలో నేను మొట్టమొదటివాడిని. అందరికంటే పాతవాడిని. ఒక దశలో కాలనీలో అందరికంటే పరమదుష్టుడిని, అరాచకుడిని. ఆంటన్ సెమ్యోనోవిచ్‌కి బహుశా ఆ ఉదంతాలు గుర్తుండే ఉండాలి. నేను గోర్కీ కాలనీలో పెరిగాను, ప్రస్తుతం సాంకేతి శిక్షణ సంస్థ విద్యార్థిని. అందువల్ల నామాట జాగ్రత్తగా వినండి. మీరంతా ఇప్పుడు ఆమోదించిన తీర్మానం పరమ ఉత్కృష్టమైనది, అద్భుతమైనది. దాన్ని యధాతథంగా ఆచరించడం కొంత కష్టం కావచ్చు. కానీ నన్ను నమ్మండి. ఆ తీర్మానాన్ని అమలుచేయండి." అంటూ అందరివంకా పరీక్షగా చూశాడు.

పిల్లల్లో చాలామంది చప్పట్లు చరుస్తూ అపేక్షగా నవ్వారు. వాడు కొనసాగించాడు. "కష్టమో నష్టమో మీరు దాన్ని ఆమోదించారు. దాన్ని మరచిపోకండి. ఏదో ఆమోదించాలేం. సమయం వచ్చినప్పుడు చూడవచ్చు అని మీలో ఎవరైనా అనుకుంటున్నారేమో. అలా భావించేవారు నా దృష్టిలో మనుషులు కాదు. మన చట్టం ప్రకారం సర్వ సభ్య సమావేశం ఆమోదించిన తీర్మానం అక్షరాలా అమలవ్వాలి. దాన్ని ఉల్లంఘించిన వారికి ఒకటే దారి. బహిష్కరణ, బయటికి గెంటడం అంతే."

జదరోవ్ పిండి మరకలతో నిండిన పెదాలు బిగించాడు. పిడికిలి బిగించి గాలిలో ఊపాడు. "గెంటేయడమే" అని స్పష్టంగా, బిగ్గరగా అరిచాడు.

పిల్లలంతా నిశ్శబ్దంగా ఉండిపోయారు. ఇంకేం బెదిరింపులు వినాల్సి వస్తుందోననే అనుమానం వారిలో కనిపిస్తోంది.

ఈలోగా కరబనోవ్ వేదిక ఎక్కి జదరోవ్‌ను పక్కకు తోశాడు.

"ఎవరిని గెంటేయాల్సింది. చెప్పండి క్షణాల్లో పని" అని చేతులు రుద్దుకున్నాడు.

"అదేం లేదులే. అందరికీ చెబుతున్నాడు అంతే" అని లాపోట్ సర్ది చెప్పబోయాడు.

"అందరినీ అయినా పర్వాలేదు. గెంటేయమంటే చెప్పండి" అన్నాడు కరబనోవ్.

ఎవరూ మాట్లాడలేదు. "ఏం లేదా? మీరేంటి మీరంతా పల్లెటూరి మనుషుల్లా మొహాలు వేలాడేసుకు నుంచున్నారు" అని అడిగాడు.

"అబ్బే మేం బానే ఉన్నాం" ఎవరో బదులిచ్చారు.

"బావున్నారా? మరి సంగీతం ఏదీ? డాన్సుల్లేవా?" అని కరబనోవ్ నిలదీశాడు.

"ఇదిగో ఇక్కడ. నేనున్నాను. అంటూ బొరోవాయ్ ఆనందంగా తన అకార్డియన్‌తో ముందు కొచ్చాడు.

"ఉన్నావా? మరి అలా నుంచున్నారేం. రండి డాన్స్ చేద్దాం. పిల్లలంతా దూరంగా జరగండి. గుండ్రంగా నిలబడండి. అమ్మాయిలూ ఆ స్టవ్వుల పక్క చలికాగడం చాలు. రండి నృత్యం చేద్దాం నటాషా ఎక్కడ?" అని గోలగోలగా అరిచాడు.

పొడవాటి జడలతో, తళతళలాడుతున్న కళ్లతో నటాషా ఆడపిల్లల బృందంలోంచి ముందు కొచ్చింది.

కరబనోవ్ వంగి ఆమెకు సలాం చేసి గుంపు మధ్యకు ఆహ్వానించాడు. హోపక్ నృత్యం కానిద్దాం. బోరోవాయ్ ఆరంభించు అంటూ చేతులు పైకెత్తి ఒక కాలెత్తి గుంపు మధ్యకు దూకాడు. బోరొవాయ్ అకార్డియన్‌ను శృతి చేశాడు. కరబనోవ్ పూనకం పూనినవాడిలా కాళ్లు ఎగరేస్తూ గిర్రున తిరుగుతూ నృత్యం ప్రారంభించాడు. నటాషా కొద్ది క్షణాలు అతనివంక ఓరగా చూసి తానూ రంగంలోకి దూకింది. సంగీతం ఊపందుకుంది. కరబనోవ్ ఆమె వంక ఒకసారి చూసి ఆమె చుట్టూ శరవేగంగా తిరుగుతూ నృత్యం కొనసాగించాడు. అతనికి కాళ్ల కదలిక చూస్తే ఒకసారి దజను కాళ్లు గాలిలో గిర్రున తిరుగుతున్నట్టు కనిపించింది.

నటాషా సైతం ఒక్కసారి వేగాన్ని పెంచి, గిర్రున తిరుగుతూ కదం తొక్కింది. ఆమె ధరించిన స్కర్ట్ ఆమె నడుం చుట్టూ కుచ్చులు కుచ్చులుగా తిరుగుతూ అలలు సృష్టిస్తోంది. కుర్యాజ్ కాలనీ కుర్రవాడు పెరెట్స్ కూడా వారితో కలిసి కొన్ని అడుగులు వేస్తున్నాడు. పిల్లలంతా హర్షధ్వానాలు చేస్తూ సంగీతానికి అనుగుణంగా చప్పట్లు చరుస్తున్నారు.

అప్పుడు నేను కొరొట్కొవ్ ఎక్కడున్నాడా అని గుంపునంతా పరీక్షగా చూశాను. ఆ పక్కన కనిపించాడు. ఏదో ఆలోచనలో ఉన్నట్టు వాడి కనుబొమలు ముడివడి ఉన్నాయి. వాడు హఠాత్తుగా నా వంక చూశాడు. నేను తన వంకే దీక్షగా చూస్తున్నానని గమనించాడు. గుంపుని తప్పించుకుంటూ నా వైపు నడిచాడు. నా దగ్గరికి వచ్చి చెయ్యి చాచి "ఆంటన్ సెమ్యోనోవిచ్ ఇవాళ నేను మిమ్మల్ని పలకరించనేలేదు" అన్నాడు.

9

కుర్యాజ్ పిల్లలను ప్రక్షాళనం చేసి గోర్కీవాసులుగా మార్చే క్రమం, సమావేశం పూర్తయిన వెంటనే మొదలైంది. సమావేశం ముగిసిందని జోర్కా ప్రకటించగానే క్లబ్ హాలులో తొక్కిడి మొదలైంది. కొత్తగా నియమితులైన కమాండర్లు తమతమ డిటాచ్‌మెంట్ సభ్యులను పేర్లు పెట్టి పిలుస్తూ, వారందరినీ ఒకవైపు నిలబెట్టడం ప్రారంభించారు. కొద్దిసేపట్లోనే మీటింగ్ హాల్లో పిల్లలంతా తమతమ డిటాచ్‌మెంట్‌లలో బారులు తీరి నిలిచారు. వేర్వేరు డిటాచ్‌మెంట్లు వేర్వేరు మూలల్లో ప్రత్యేకంగా నిలచేందుకు ప్రయత్నించాయి. ప్రతి డిటాచ్‌మెంట్‌లోనూ చిరిగిపోయి, శిథిలావస్థలో వున్న దుస్తులతో, స్నానమెరుగని శరీరాలతో నిలిచిన పిల్లలతో పాటు ఉదయమే పరిశుభ్రంగా తయారై యూనిఫారాల్లో ఉన్న పిల్లలూ ఉన్నారు. ఇప్పుడందులో గోర్కీకాలనీవాసులే. అన్నీ గోర్కీకాలనీ డిటాచ్‌మెంట్లే మరి.

తరువాత పిల్లలంతా మీటింగ్ హాల్లోంచి బయటికి నడిచి తిన్నగా డార్మెటరీల్లోకి వెళ్లారు. అక్కడ కొద్ది నిమిషాల పాటు నిశ్శబ్దం. అందరూ డార్మెటరీల్లోని దుస్తులన్నింటినీ మూటలు కడుతున్నారని అర్థమవుతూనే వుంది. నేను నెమ్మదిగా చర్చి మెట్లపై కూర్చున్న మహిళా బృందం వైపు నడిచాను. ఎకతెరీనా, లిడియా లిద్దరు చాలా సంతోషంగా కనిపించారు. వారు కామ్రేడ్ జోయా ప్రశ్నలకు సమాధానాలు చెబుతున్నారు. బ్రెగెల్ మాత్రం నిలబడి మెట్లని ఆనుకున్న రైలింగ్‌ని పట్టుకుని గోల్యేవాను ప్రశ్నిస్తోంది.

"అంతా పద్ధతి ప్రకారం జరుగుతోందనే భావన కలిగించేందుకు తప్ప ఇప్పుడు జరిగిన సమావేశం ప్రయోజనం ఏమిటి? అంతా పై మెరుగేగా?" అని.

గుల్యేవా నా వంక జూసింది. "ఆంటన్ సెమ్యోనోవిచ్ మీరే సమాధానం చెప్పాలి. ఇలాంటి విషయాలు నాకు తెలీదు" అంది.

"అబ్బే నాకు ఈ సిద్ధాంతాలు పెద్దగా తెలియవులే" అన్నాను తిరస్కారంగా.

డార్మెటరీల్లో పిల్లలు అక్కడున్న పరుపులు, దుప్పట్లు, తువ్వాళ్లు మూటలుగా చుట్టి బయటకు తెస్తున్నారు. బయట బళ్లు ఆగేచోట అల్యోషాములర్కోవ్ ఆ మూటలని అందుకుని లెక్క రాసుకుంటున్నాడు. తరువాత వాటిని శుభ్రం చేసేందుకు పంపుతున్నాడు. మరోవైపు జెవిలా నిలబడి చేతిలో జాబితా సరిచూసుకుంటూ పిల్లలకు కొత్త దుస్తులు, సబ్బు ఇస్తున్నాడు.

ఈలోగా సినెంకీ పరుగున నా వద్దకు వచ్చి "కమాండర్ల మండలి సమావేశం కోసం సిగ్నల్ ఇమ్మని టారానెట్స్ చెబుతున్నాడు" అని తెలియచేశాడు.

"ఇవ్వు మరి" అని అనుమతి జారీ చేశాను.

సినెంకీ అదే వేగంతో భోజనాల గది వద్దకు వెళ్లి తన బగిల్‌తో మూడుసార్లు సంకేతాలు పంపాడు. వాడివంకే చూస్తున్న బ్రెగిల్ ఉన్నట్టుండి నా వంక తిరిగింది. నన్ను ప్రశ్నించింది. "అవునూ ప్రతిసారి సంకేతాలు ఇవ్వవలసినప్పుడల్లా వాడు మీ అనుమతి కోసం వస్తాడేంటి?"

"అది మా నిబంధన. అనుకోని సందర్భాల్లో సంకేతాలు ఇవ్వవలసినప్పుడు నా అనుమతి తప్పనిసరి" అని క్లుప్తంగా బదులిచ్చాను.

"బావుంది. కానీ ఇదంతా పైపటాటోపమేగా?" అందామె.

నాకు వెర్రి కోపం వస్తోంది. ఇటువంటి చక్కటిరోజు వీళ్లు నన్ను ప్రశాంతంగా ఉండనివ్వ రెందుకు? వాళ్ల ఉద్దేశం ఏమిటి? కుర్యాజ్ కాలనీ నాశనమైపోయిందని గగ్గోలు పెట్టింది వీళ్లేగా? దాన్ని ఓ దారిలో పెట్టేందుకు నడుం బిగించిన నాకు ఈ గూటింపులేమిటి?

"మీ బ్యానర్లు, బ్యాండు మేళం, కవాతు, వందనాలు... ఇవన్నీ పిల్లలని మభ్యపెట్టడానికి తప్ప మరెందుకు పనికివస్తాయి?" మరో తెలివైన ప్రశ్న వేసిందామె.

"నోరు మూస్కోండి" అందామని చివరిదాకా వచ్చింది. కానీ తమాయించుకున్నాను.

"పిల్లలను సంస్కరించే క్రమంలో వారిని ఆకర్షించడం అవసరం" అని బదులిచ్చాను.

"ఏదేమైనా, ఇదంతా మిలిటరీ స్కూలు పద్ధతి" అంది బ్రెగిల్.

ఇక నిగ్రహించుకోలేకపోయాను. "చూడండి వర్వరా బ్రెగిల్ ఈ చర్చని ఇక ఆపుదాం. మనిద్దరి భాషా ఇద్దరికీ అర్థం కాదు. అటువంటప్పుడు దాన్ని అర్థం చేసుకోగల మనిషి మధ్య ఉన్నప్పుడు మనం మాట్లాడుకుంటే మంచిది" అన్నాను కోపంగా.

ఈలోగా గడ్ నేతృత్వంలోని తొలి డిటాచ్‌మెంట్ మమ్మల్ని సమీపించింది. గడ్ తన చేతిలోని జాబితా చూసుకుంటూ స్లీవా, క్లెబ్‌యెంకో ఎవరండీ మీలో ఇద్దరూ ఇలా రండి అంటున్నాడు.

ఇద్దరూ ముందుకు వచ్చారు. నల్లగా, సన్నగా, బలహీనంగా ఉన్న ఆ పిల్లలు దుస్తులు వారిసైజు కంటే రెట్టింపు ఉన్నాయి. ఇద్దరూ మొహమాటంగా నవ్వుతున్నారు. వాళ్లని చూసి గడ్ తల విదిల్చాడు. ఎక్కడి పిల్లలర్రా మీరు. తిండి తింటున్నారా. ఆ మొకాలేంటి? ఇలానా ఉండడం. అంటూ నా వంక చూశాడు. ఆంటన్ సెమ్యోనోవిచ్ మొదటి డిటాచ్‌మెంట్ ఇలా ఉంటే ఎలాగండీ? ముందు అందరికీ శుభ్రంగా తిండి పెట్టాలి. సరిపడా ఆహారం దొరుకుతుంది కదా?" అన్నాడు. పిల్లలంతా నవ్వుతున్నారు.

అప్పుడు గడ్ మళ్లీ నాతో అన్నాడు. "ఆంటన్ సెమ్యోనోవిచ్ ఏమనుకోకండి. మా మొదటి డిటాచ్‌మెంట్ ఈ రాత్రికి ఇక్కడ నిద్దరపోవాలని అనుకుంటున్నాం. దయచేసి మీరంతా బయట పార్కులోని బెంచీల వద్దకు వెళ్తే ఇక్కడంతా కడిగి శుభ్రం చేస్తాం" అని అడిగాడు.

నేను వాడికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకొని ఆ వైపు నడిచాను, జోయా, బ్రెగిల్ తదితరులు నా వెంట వస్తున్నారు. ఈ అతిథులు ఎప్పుడు వదులుతారా అని అసహనంగా పళ్లు కొరుక్కున్నాను.

జువేలా దుస్తులు పంచుతున్న చోట ఇంకా హడావుడిగానే ఉంది. పిల్లలు కొత్త దుస్తులు భుజాలపై వేసుకుని జాకెట్లు చేతబట్టి సబ్బు పెట్టెలతో నిలబడి ఉన్నారు. ఆ పక్కనే బ్రెగిల్ పట్టణం నుంచి వచ్చిన కారు ఆగి ఉంది. డ్రైవర్ ఆమెగారు ఎప్పుడు వస్తారా అని అసహనంగా ఎదురు చూస్తున్నాడు. ఆమె కనుక ఇక కాలనీ నుంచి దయచేస్తే విశ్రాంతిగా చర్చి పక్క పచ్చికలో పడుకుని ఎన్నో విషయాలు ఆలోచించాలని ఉంది. పిల్లలంతా శుభ్రంగా తయారై వచ్చేసరికి కనీసం రెండు గంటలు పడుతుంది. ఎన్నో ఆలోచించి, ఎన్నో పథకాలు రూపొందించ వచ్చు.

అంతలో గట్టిగా నవ్వుకుంటూ నడుస్తున్న కుర్రవాళ్ల బృందం గేటు గుండా బయటకు వెళ్తోంది. నాకెంతో ఆనందంగా అనిపించింది. అది ఎనిమిదవ డిటాచ్‌మెంట్. ఆ బృందం ముందు ఫెడరెంకో నడుస్తున్నాడు. మధ్యలో కారిటో, నెచటాలియో, ఒలెగ్ తదితరులున్నారు. మిగిలివారిని చూసి ఆశ్చర్యపోయాను, వారు గోర్కీవాసులే గుర్తుపట్టలేకపోయాను. నా పరధ్యానానికి నాకే నవ్వు వచ్చింది. గోర్కీ కాలనీ యూనిఫారంలో ఉన్నవారందరూ కొత్తగా మాలో చేరినవారు. ఈ మార్పుకోసమే గత పదిహేను రోజులుగా మేం రాత్రింబగళ్లు కష్టపడినది. ఆ పిల్లలంతా అప్పుడే స్నానాలు చేసి శుభ్రంగా కనిపిస్తున్నారు. చక్కగా, చిన్నగా కత్తిరించిన క్రాఫింగులు పైన టోపీలు, సరికొత్త దుస్తుల్లో మా మిగిలిన పిల్లల్లానే హాయిగా కనిపించారు. నన్ను చూసి ఫెడరెంకో తన సహజ సిద్ధమైన శైలిలో పక్కకు తప్పుకొని "ఆంటన్ సెమ్యొనోవిచ్ మా ఎనిమిదవ డిటాచ్‌మెంట్ సిద్ధంగా ఉంది" అన్నాడు. కొరోట్కోవ్ ఆ డిటాచ్‌మెంట్‌లోనే ఉన్నాడు. ఆశ్చర్యమేముంది? నేనే స్వయంగా అతన్ని ఆ డిటాచ్‌మెంట్‌లో చేర్చాలని ఆదేశించాను. నేను కొరొట్కోవ్ వంకే చూస్తున్నానని గమనించిన ఫెడరెంకో ఆ కుర్రవాడి చుట్టూ ఆప్యాయంగా చేతులు వేసి "ఆంటన్ సెమ్యొనోవిచ్ మీరు మా డిటాచ్‌మెంట్‌కు అద్భుతమైన కుర్రవాణ్ణి ఇచ్చారు. నేను తనతో మాట్లాడాను. ఇతనొక రోజున మంచి కమాండర్ అవుతాడు చూడండి" అన్నాడు.

ఈ లోపు కొరోట్కోవ్ నా వంక తిరిగి "మీతో ఒకసారి మాట్లాడాలి"' అన్నాడు.

"ఏమిటి మాట్లాడేది? మాట్లాడేందుకు ఏముంది. మాటల వల్ల ప్రయోజనం ఏముంది గనుక? అసలు జనం ఎందుకు మాట్లాడతారు?" అన్నాడు ఫెడరెంకో.

"కాదు నేను ఆంటన్ సెమ్యొనోవిచ్‌తో ప్రత్యేకంగా మాట్లాడాలి" అన్నాడు కొరోట్కోవ్ పట్టుదలగా.

"ఏమిటది?" అడిగాను నేను.

"నన్ను కూడా మీరు ఒకసారి అరెస్టు చేయాలి. నిర్బంధంలో ఉంచాలి" అన్నాడతను వేడుకోలుగా.

ఫెడరెంకో గట్టిగా నవ్వాడు. "అదీ సంగతి. తొందరపడుతున్నావు సోదరా! అరెస్టు కావాలంటే ముందు కాలనిస్టు బిరుదు సంపాదించాలి. అంటే ఈ బ్యాడ్జి సంపాదించాలి. అంతవరకూ కోరుకున్నా నువ్వు అరెస్టు కావు. నువ్వు అరెస్టులో ఉండు అని ఆదేశించారనుకో ఏమంటావ్? నేనేం తప్పు చేశాను? అని ప్రశ్నిస్తావు. అంతేనా" అన్నాడు.

"అవును. తప్పేమీ చేయనప్పుడు అలాగే అంటాను" అని కొరొట్కోవ్ చెప్పాడు.

"అదే విషయం, నీకు అర్థం కాలేదంతే. నువ్వు తప్పు చేశావో లేదో నువ్వు నిర్ణయించుకుంటున్నావు. ఇప్పుడు ఒకసారి కాలనిస్టువి అయిన తరువాత అట్లా ప్రశ్నించవు. నీకెలా చెప్పేది? క్రమశిక్షణ

అంటే నీకు అప్పుడే అర్థంకాదు. నువ్వు తప్పు చేశావా లేదా అన్నది నీ సమస్య కాదు. అరెస్టులో ఉండమంటే ఉండాలి. అంతే. అదీ క్రమశిక్షణ అంటే. అంతేనా ఆంటన్ సెమ్యోనోవిచ్?" అని ఫెడరెంకో నన్ను ప్రశ్నించాడు.

పక్కనే ఉన్న బ్రెగిల్‌కు మా సంభాషణ తీరు, ముఖ్యంగా క్రమశిక్షణ గురించిన వివరణ అసలు నచ్చదు. నాకు తెలుసు అందుకే "ఆ గుంపు ఏమిటి; అని ఫెడరెంకోను ప్రశ్నించాను.

"అదా జైచెంకో డిటాచ్‌మెంట్" అని ఫెడరెంకో బదులిచ్చాడు. అంతటితో ఆగకుండా "ఆ కుర్రవాడు జైచెంకోను పాపం ఎవరో మెత్తగా కొట్టారట." అన్నాడు.

"ఎవరు కొట్టింది" అని బ్రెగిల్ ఆత్రంగా అడిగింది.

"ఇక్కడివాళ్లే ఒక రాత్రి వాణ్ణి కొట్టారు" అని చెప్పాను.

"ఎందుకు? ఎప్పుడు జరిగిందది? నా దృష్టికి ఎందుకు తేలేదు?" అని బ్రెగిల్ తీవ్రంగా ప్రశ్నించింది.

నాకు కోపం ఆగలేదు "చూడండి వర్వరా బ్రెగిల్ – ఎన్నో ఏళ్లుగా ఇక్కడ కుర్యాజ్‌లో పిల్లలను హీనంగా చూస్తున్నారు. మీరెన్నడూ ఇంతకుముందు ఆ విషయాలను పట్టించుకోలేదు. కాబట్టి ఇప్పుడు పట్టించుకోకుండా ఉండడం ఉత్తమం. అదీకాక ఆ వ్యవహారాన్ని నేనే స్వయంగా పరిశీలించాను." అంటూ నేను తీవ్ర స్వరంతో సమాధానం చెప్పాను. నా ఆగ్రహాన్ని బ్రెగిల్ సరిగ్గానే అర్థం చేసుకుంది.

"సరే, సెలవ్" అంటూ వెళ్లి కారులో జోయా పక్కన కూర్చుంది.

"హమ్మయ్య" అనుకుని జైచెంకో సారథ్యంలోని పద్దెనిమిదవ డిటాచ్‌మెంట్‌ని సమీపించాను. వాడు ఠీవిగా తన డిటాచ్‌మెంట్‌తో కవాతు చేయిస్తున్నాడు. మేం కావాలనే వాడి డిటాచ్‌మెంట్‌ని పూర్తిగా కుర్యాజ్ కుర్రవాళ్లతో నింపాం. దానివల్ల కమాండర్‌గా, మొత్తం డిటాచ్‌మెంట్‌కే ఒక ప్రత్యేకత ఉంటుందని నా అభిప్రాయం.

ఈ డిటాచ్‌మెంట్‌లోని ఇరవైమంది పిల్లలూ నిటారుగా తలలు పైకెత్తి నిజమైన సైనికుల్లానే చేతులు క్రమబద్ధంగా కదుపుతూ కవాతు చేస్తున్నారు. ఇంత తక్కువ వ్యవధిలో జైచెంకో, వాడి బృందం ఇంత చక్కగా మార్చ్ చేయడం ఎలా నేర్చింది? నాకు ఆశ్చర్యం కలిగింది.

మొత్తం తమ రూపురేఖల్లో, దుస్తుల్లో వచ్చిన మార్పు కుర్యాజ్ పిల్లలని అనూహ్యంగా సంతృప్తి పరిచింది. వాళ్లు పదే పదే తమ దుస్తులను తడుముకుంటూ, కొత్త టోపీలని మాటిమాటికీ చేత్తో తీసి పట్టుకుంటూ తబ్బిబ్బవుతున్నారు. మీటింగ్ హాల్లో ఉన్న ఏకైక అద్దంలో వాళ్లు తమ కొత్త రూపాలని చూసుకొంటున్నారు. కుర్యాజ్ పిల్లల్లో చాలామంది అందంగా ఉన్నారని వారివంటిపై మురికి వదిలిన తరువాత అనిపించింది. మిగిలిన పిల్లలు కూడ సరిగ్గా తిండి లభిస్తే, కష్టించి పనిచేస్తే చక్కగా రూపుదిద్దుకుంటారని తెలుస్తూనే ఉంది.

బాలికల డార్మెటరీల్లోనూ ఇంతకంటే కోలాహలంగా ఉంది. ఈ పిల్లల కోసం మా అమ్మాయిలు ప్రత్యేకంగా సేటిన్ స్కర్టులు, బ్లౌజ్‌లు కుట్టారు. వాటికి లేత నీలిరంగు మేజోళ్లతో పాటు, బ్యాలేకి పనికివచ్చే బూట్లు కూడా అమిరాయి. అక్కడ ఆ పిల్లలు తమ దుస్తులను సరిగ్గా తమకు సరిపోయేలా మార్చుకునేందుకు కుట్టుమిషన్లతో కుస్తీలు పడుతున్నారు.

దారిలో ఎదురుపడిన పెరెట్స్‌తో చెప్పాను. "ముందు ఆ యూనిఫారం విప్పి మామూలు పనిచేసే దుస్తులు వేస్కో. తరువాత లాండ్రీలో బాలికల కోసం బాయిలర్ ముట్టించు" అని చెప్పాను.

"నేనా? అమ్మాయిల కోసం బాయిలర్ ముట్టించాలా?" అన్నాడు వాడు ఆశ్చర్యంతో.

"అవును నువ్వే. నడు" అని గద్దించాను.

"మంచిదండీ" అంటూ వాడు గోర్కీ కాలనీ పద్ధతిలో సమాధానం చెప్పి వినయంగా అక్కడినుంచి వెళ్లిపోయాడు.

క్రమంగా కుర్యాజ్ కుర్రవాళ్లు దారిన పడ్డారు. చివరికి తాము వ్యవసాయ నిపుణులమని బీరాలు పలికిన కుర్రవాళ్లు కూడా తలొక డిటాచ్‌మెంట్‌లో చేరారు. ఆ రాత్రి అందరం కలిసి భోజనాల గదిలో కూర్చున్నాం. అప్పుడు నేను చిన్న ఉపన్యాసం ఇచ్చాను.

పని గురించి కానీ, క్రమశిక్షణ గురించి కానీ, బాధ్యతల గురించి కానీ నేను ప్రస్తావించలేదు. వారి నడవడికపై కూడా ఎటువంటి అనుమానాలూ వ్యక్తం చేయలేదు. వారి సరికొత్త జీవితం ఆనందమయంగా సాగుతోందన్న విశ్వాసాన్ని మాత్రం వ్యక్తం చేశాను.

తరువాత మనం ఒంటరి మనుషులం కాదనీ మాక్సీం గోర్కీ వంటి విశ్వ విఖ్యాత రచయిత ఆశీస్సులు మనకున్నాయని వారికి చెప్పాను. రుజువుగా ఆ కాలనీ ప్రగతికి సాయపడవలసిందిగా గోర్కీయే స్వయంగా మా విద్యాశాఖకు రాసిన లేఖ చదివి వినిపించాను.

ఈ ఉత్తరం చదువుతున్నంత సేపూ పిల్లలు నా వంకే చూస్తుండిపోయారు. అప్పుడు కరబనోవ్ "అంతర్జాతీయ గీతం" అందుకున్నాడు. కొత్తపిల్లల్లో చాలామందికి ఆ గీతం తెలియదని అర్థమైనా, గమనించనట్టు ఊరకున్నాను.

విందు కోలాహలంగా ముగిసింది.

10

మే, జూన్ నెలల్లో షెరీ సారధ్యంలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. కాలనీలో కొత్త కుర్రవాళ్లపై ఊహించనంత పని భారం పడింది. దానిని వారు ప్రతిఘటించనప్పటికీ పనిని తప్పించుకునే ప్రయత్నం చేయకపోలేదు. అటువంటి వారిని మిగతా పిల్లలు ఆటపట్టించి వేళాకోళం చేసి, పోటీ స్ఫూర్తి రగిలించి తిరిగి పనిలోకి దింపేవారు. వందలాదిమంది పిల్లలు క్రమపద్ధతిలో, కమాండర్ల సారథ్యంలో కొత్త పనులు నేర్చుకుంటూ, వచ్చిన పనుల్లో నైపుణ్యం మెరుగు పరుచుకుంటూ రేయింబవళ్లు శ్రమించడం గురించి చెప్పాలంటే అదో గ్రంథమే అవుతుంది.

కొత్త కుర్రవాళ్లతో మళ్లీ కొత్త సమస్యలు, సరికొత్త పరిష్కారాలు, వారిని దారిలో పెట్టేందుకు కమాండర్ల మండలి వ్యవహరించిన తీరు మరో పెద్ద కథ. చిత్రమేమిటంటే కుర్యాజ్ కాలనీలో ముఠా పెద్దలుగా, దొంగలుగా, పిల్లలని హింసించే వారిగా పేరుపడినవారే. మాతో కలిసి ఎక్కువ శ్రమించడం, పట్టుదలగా లక్ష్యాలను పూర్తి చేయడం.

ఇదే సమయంలో కాలనీ మరమ్మత్తులు శరవేగంగా సాగాయి. మే నెలాఖరు కల్లా కాలనీకి కొత్త రూపం వచ్చింది. జూలై 5న అప్పటికే నిండుగా పండిన ధాన్యానికి కోతలు ప్రారంభించాలని షెరీ నిర్ణయించాడు. ఆ సందర్భంగా పెద్ద ఉత్సవమే నిర్వహించాం. మా నిరంతర విమర్శకులు, విద్యాశాఖలో ప్రత్యర్థులు, మిత్రులు, పరిసర గ్రామాల పెద్దలూ అందరినీ ఆ ఉత్సవానికి ఆహ్వానించాం.

నెలలు గడుస్తున్నాయి. కార్ఖానాల్లో పనులు ఊపందుకొన్నాయి. కొత్త కొత్త శిక్షకులు కార్ఖానాల్లో చేరారు. పిల్లలంతా కొత్త పనులు నేర్చుకొంటున్నారు.

ఈస్టర్ పర్వదినం సమయంలో ఖార్కోవ్‌కు ఆవలి వైపు మరో పిల్లల కాలనీ నిర్మాణాన్ని చేపడుతున్నారని సమాచారం అందింది. వేసవిలో అధికారులు మా కాలనీకి వచ్చి అక్కడ తాము

నిర్మిస్తున్న జెర్జిన్‌స్కీ కమ్యూన్ భవన సముదాయాన్ని ఒకసారి పరిశీలించమని కోరారు. నేను వారి వెంట వెళ్లాను.

నివ్వెరపోయాను. అంత సువిశాలమైన, విలాసవంతమైన, భవన సముదాయాన్ని అనాధ పిల్లలకు కేటాయించేంత పెద్దమనసు విద్యాశాఖకు ఎలా వచ్చిందో అర్థం కాలేదు. కానీ పిల్లలకు సరైన రీతిలో విద్యాబోధన సాగించేందుకు, వారిని సవ్యంగా పెంచేందుకు అటువంటి వాతావరణమే ఉండాలన్నది మొదటినుంచీ నా ఆకాంక్ష. అది ఇన్నాళ్లకు తీరుతున్నందుకు సంతోషం కలిగింది.

అయితే అంత అద్భుతమైన కాలనీలో పనిచేసే అవకాశం దొరికే అదృష్టవంతులెవరో అని కొంత ఈర్ష్యపడ్డాను కూడా. మరికొద్ది నెలల్లో జెర్జిన్‌స్కీ భవన నిర్మాణం పూర్తయింది. ఆ కాలనీ వైభవం ఏమని వర్ణించగలను? అత్యాధునికమైన యంత్ర పరికరాలు, వర్క్‌షాపులు, కాంతివంతమైన డార్మెటరీలు, మంచి తోట... మొత్తం మీద ఆ కాలనీవాసులు అదృష్టవంతులే అవుతారు. ఆ భవనాన్ని నిర్మించిన విభాగం, దాని ప్రారంభోత్సవ ముహూర్తాన్ని నిర్ణయించి, ఆలోగా అక్కడ అన్ని పనులూ పూర్తయ్యేలా చూడమని నన్ను మా కాలనీని కోరింది. ఆ సాయం చేశాం. ఈ కాలనీ నిర్మాణం, నిర్వహణ బాధ్యతలను రహస్య పోలీసు విభాగం 'చెకా' చేపట్టింది, అంటే అధికారికంగా ఆ విభాగం కాకున్నా, దాని సిబ్బంది ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

జెర్జిన్‌స్కీ పేరిట నిర్మాణమైన ఈ కొత్త సముదాయాన్ని కాలనీ అని కాక, కమ్యూన్ అని పిలవాలని వారు నిర్ణయించారు. ఇందులో వంద నూటయాభై మంది పిల్లలను మించి ఉంచేందుకు వీల్లేదు. భవనం అయితే బాగా కట్టారు కానీ, ఇందులో అధ్యాపక సిబ్బంది ఎక్కడనుంచి వస్తారో, దాని నిర్వహణ బాధ్యతలు ఎవరు చేపడతారో అన్న అనుమానం తీరనేలేదు. ఇంతలో 'చెక్' అధికారి ఒకరు నన్ను పిలిపించి మాట్లాడారు. "ఇక్కడ ఒక కమ్యూన్‌ను అభివృద్ధి చేద్దామని మా లక్ష్యం. కానీ అది ఒకరోజులో అయ్యే పని కాదు. కాబట్టి ముందు సుశిక్షుతులైన మీ కాలనీ పిల్లలను ఒక యాభైమందిని ఇక్కడకు బదిలీ చెయ్యండి" అని నన్ను కోరాడు. విద్యాబోధన, పిల్లల శిక్షణ తదితర అంశాల గురించి ఆయనకు పెద్దగా వివరించదలచలేదు. ఏదేమైనా మా కాలనీ పిల్లలు యాభైమందికి సకల సౌకర్యాలతో చదువుకొనేందుకు ఒక మంచి వ్యవస్థ అందుబాటులో ఉంటుందని మాత్రం సంతోషించాను. ఆ రాత్రి కమాండర్ల మండలి సమావేశంలో ఈ విషయం చర్చించాం. 'తెలివైన, మంచి పిల్లలందరిని అక్కడికి పంపుదాం" అని లాపోట్ అన్నాడు. కాలనీలో సీనియర్లు ఇప్పటికే రబ్‌ఫాక్‌లో ఉన్నారు. మిగిలినవారిలో అత్యధికులు కూడా ఆ దారిలో ఉన్నారు. అందువల్ల చిన్నపిల్లలు, కొత్తపిల్లలకు అవకాశం ఇద్దాం" అని లాపోట్ సూచించాడు.

అందరూ తనతో ఏకీభవించారు. సుదీర్ఘ చర్చల అనంతరం కొత్త కమ్యూన్‌కి పంపవలసిన యాభైమంది పిల్లల జాబితాను రూపొందించాం. కొత్త కమ్యూన్ అధికారుల కోరిక మేరకు మా టీచర్ కిర్జీజోన్‌ను కూడా సెలవుపై అక్కడికి బదిలీ చేశాం.

ఈ మొత్తం క్రమంలో అనుదినం విద్యాశాఖ అధికారులకు, నాకూ మధ్య యుద్ధం సాగింది. "ఆలోచించగల విద్యా విషయాల నిపుణులు" పదే పదే నాపై విమర్శలు కురిపిస్తూ, నా నిర్ణయాలను తప్పుపడుతూ, నా పద్ధతులను దుయ్యపడుతూ యుద్ధానికి దిగేవారు. ఆ సమయంలో నేను ఎక్కడలేని ఓపిక, సహనం పాటించాను. నెలల తరబడి సాగిన ఈ పోరాటం ప్రభావం నా పనిపై పడకుండా ఉండేందుకు చాలా శ్రమించాల్సి వచ్చింది. ఏదో ఒక గొడవ జరగని రోజంటూ ఉండేది కాదు.

దాదాపు ఆ సమయంలోనే మా కాలనీకి పదికిలోమీటర్ల దూరంలో ఖార్కోవ్‌లో "పిల్లల మిత్రులు" పేరిట ఒక సదస్సు జరిగింది. దీనికి మమ్మల్నీ ఆహ్వానించారు. మా వాళ్లంతా ఉత్సాహంగా బయలుదేరారు. ఒక విహార యాత్రగా బయలుదేరాం. నెమ్మదిగా నడుస్తూ, దారిలో విశ్రాంతి కోసం ఆగుతూ, పెద్ద జాతరకు వెళ్లినట్టు మా యాత్ర సాగింది. దారి పొడవునా ప్రజలు మమ్మల్ని గుర్తించి, గోర్కీ వాసులమని గ్రహించి మాతో కబుర్లు చెప్పారు. ఎన్నో ప్రశ్నలు వేశారు. మొత్తానికి సదస్సు జరిగే చోటుకి వారు చెప్పిన సమయానికి చేరుకున్నాం. కానీ మమ్మల్ని చూడగానే ఆగ్రహం చెందిన మేధావులు కొందరు నన్ను నిలదీశారు.

"ఇంత త్వరగా ఎందుకు వచ్చారు? పిల్లలు సదస్సు మొదలయేదాకా వీధుల్లో ఎదురు చూడవలసిందేనా?" అని ప్రశ్నించారు.

నేను గడియారం వంక చూపించాను. మీరు రమ్మన్న సమయానికి వచ్చాం. ఆలస్యం అవుతుందంటే పొరపాటు మీది అని స్పష్టంగా చెప్పాను.

"సరే, ఆ చిన్న పిల్లలను పది కిలోమీటర్లు నడిపించారెందుకు? మీ పేరు ప్రఖ్యాతుల కోసం తాపత్రయం తప్ప, పిల్లలను హింసిస్తున్నామనే ఆలోచనే రాలేదా?" అంటూ మరోవైపునుంచి దాడి మొదలుపెట్టారు.

"అదేం లేదు. మొత్తం కాలనీగా తరలి వచ్చాం. పిల్లలకు ఇది విహారయాత్రగా తోచింది. వాళ్లు తెగ సంతోషించారు కూడా. సదస్సు మొదలైన తరువాత అందరికీ అభినందనలు తెలిపి సర్కస్‌కి వెళ్దామని పిల్లల సరదా" అని వివరించాను.

"సర్కస్‌కా? అర్ధరాత్రి దాటిపోదూ? అంతవరకూ పసిపిల్లలని మెలుకువ ఉంచుతారా?" అంటూ ఒక మహిళా విద్యావేత్త విరుచుకుపడింది. 'వెంటనే చిన్నపిల్లలని వెనక్కి పంపెయ్యండి' అంది.

నాకు విసుగు పుట్టింది. మావాదన అర్థమైన జైచెంకో, మలికోవ్, జోరేన్, సినెంకీ వంటి చిన్నపిల్లలు నేను ఎక్కడవారిని వెనక్కి పంపేస్తానో అని భయపడుతూ, ఆ విద్యావేత్త వంక కోపంగా చూస్తున్నారు. నేను ఆమెకు స్పష్టంగా చెప్పాను. "మీ ఆదేశాలు మన్నించలేను."

"అలా అయితే పిల్లలని వెనక్కి పొమ్మని నేనే ఆదేశిస్తాను" అందామె.

"మీ ఇష్టం" అని ఊరుకున్నాను.

"పిల్లలు మీరు అలిసిపోతారు. వెనక్కి వెళ్లిపోండి" అని ఆమె ఆప్యాయంగా ఆదేశం జారీ చేసింది.

పిల్లలంతా గోలగోలగా నవ్వారు. 'భలే చిత్రంగా మాట్లాడుతుందే ఈవిడ" అని వేళాకోళం చేశారు.

దాంతో ఆమె మొహం కందగడ్డలా చేసుకుని అక్కడనుంచి చరచరా వెళ్లిపోయింది.

కొన్ని రోజుల తర్వాత రబ్‌ఫాక్ విద్యార్థులు రెండు రోజులు సెలవులు మాతో గడిపేందుకు వచ్చారు. వారు తమ వెంట తెచ్చుకొన్న డబ్బు, కొంత సామాను కాలనీలోనే ఎవరో కొట్టేశారు. ఇటువంటి దుర్ఘటన జరగడం చాలా రోజుల తరువాత ఇదే తొలిసారి. దర్యాప్తు జరిపిన మీదట అర్కడీ ఉజికోవ్ అనే కుర్రవాడు ఈ పని చేశాడని తేలింది. మామూలుగా ఇటువంటి అంశాలను కమాండర్ల మండలే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలి. కానీ అప్పటికే మా పని పద్ధతులపై పలు విమర్శలు వస్తున్న దృష్ట్యా ఈ కేసు విచారణను కమాండర్ల న్యాయస్థానంలో విచారించాలని

నిర్ణయించాం. కాలనీ సభ్యులంతా కలిసి కమాండర్ల కోర్టులో న్యాయమూర్తులను ఎన్నుకొన్నారు. కుడ్లాటీ, గోర్కోవ్‌స్కీ, జైచెంకో, స్టుపిట్సిన్, పెరెట్స్‌లు న్యాయమూర్తులుగా నియమితులయ్యారు. పట్టణం నుంచి బ్రెగిల్, జురిన్‌స్కయాలు పరిశీలకులుగా వచ్చారు.

విచారణ మొదలైంది. నిందితుడు ఏడాదిగా కాలనీలో ఉన్న ఏమాత్రం తన పద్ధతులు మార్చుకోలేదు. దొంగతనాలు మానలేదు. పని విషయంలో శ్రద్ధ లేదు. వాడికి ఎవరన్నా గౌరవం లేదు. ఈ అంశాలన్నీ ఆధారాలతో రుజువు అయ్యాయి. కాలనీ కమాండర్ల ప్రాసిక్యూటర్‌గా వ్యవహరించిన మిషా చివరకు న్యాయమూర్తులకు విజ్ఞప్తి చేశాడు. "అర్కడే వల్ల కాలనీకి చెడ్డ పేరు వస్తుందని కొందరు భయపడుతున్నారు. కానీ వాడు ఇంకా 'కాలనిస్టు' కాదు. వాడసలు ఒక మనిషిలా వ్యవహరించడం లేదు. వాడిని బహిష్కరించడం మంచిది."

ఈలోగా పట్టణం నుంచి వచ్చిన బ్రెగిల్ మాట్లాడేందుకు అనుమతి కోరింది.

"ఈ కుర్రవాడు దొంగ అనీ, అందుకువాడిని శిక్షించాలనీ, కాలనీ నుంచి బహిష్కరించాలనీ మీరంతా అంటున్నారు. వాడు దోషి అయితే, మొత్తం కాలనీవాసులంతా దోషులే" అందరూ నిశ్శబ్దంగా ఆమె వంక చూస్తున్నారు.

"వీడు ఏడాదిగా మీతో ఉంటున్నాడు. అయినా దొంగతనాలు మానలేదు. అంటే వాడి పెంపకం విషయంలో లోపం జరిగింది. వాడిని ఎలా దారిలో పెట్టాలో మీకు తెలియలేదు. సవ్యంగా జీవించడం ఎలాగో మీరు నేర్పలేదు. అతని పట్ల చూపవలసిన శ్రద్ధ చూపించలేదు. ఇటువంటి పరిస్థితుల్లో అర్కడేని శిక్షించడం అంటే వాడిపై కక్ష సాధించడమే. అంత హీనస్థాయికి మీరు దిగజారవద్దు. వాడికి మీ అందరి చేయూతకావాలి. వాడసలు మనిషే కాదంటున్నారు. కాకపోతే మీలో మంచి మనుషులు కొందరు వాడి బాధ్యతను తీసుకోవాలి. అంతేకాని బహిష్కరణ సరైన శిక్ష కాదు" అని ప్రసంగించి కూర్చుండిపోయిందామె.

న్యాయమూర్తులు తమ నిర్ణయాన్ని ప్రకటించేందుకు వీలుగా కోర్టును కొంతసేపు వాయిదా వేశారు.

విద్యాబోధన, పిల్లల శిక్షణకు సంబంధించి మా అందరికీ ఒక విశిష్టమైన మార్గాన్ని జూపిన సంతృప్తి బ్రెగిల్ కళ్లలో ద్యోతకమవుతోంది.

"నాతో మీరు ఏకీభవించరనుకొంటాను" అందామె.

"టీ తీసుకుంటారా?" అని అడిగాను సమాధానంగా. చివరకు న్యాయమూర్తులు తీర్పును ప్రకటించారు.

"ఊజికోవ్‌ను కాలనీలోనే ఉండనిద్దాం. అయితే నెలరోజుల పాటు అతన్ని కాలనీవాసిగా గుర్తించవద్దు. అతన్ని డిటాచ్‌మెంట్ నుంచి ఈ నెలరోజులు సస్పెండ్ చేయాలి. అందరితో కలిసే ఏ పని ఇవ్వకూడదు. కాలనీలో ఎవరూ అతనితో మాట్లాడకూడదు. అతని పక్క కనీసం కూర్చో కూడదు. డార్మెటరీలో అతనికి విడిగా మంచి ఏర్పాటు చేయాలి. ఎవరూ అతనితో కలిసి నడవకూడదు. ఒక కమాండర్ మాత్రం పని గురించి అవసరమైనప్పుడు మాట్లాడతాడు. అనారోగ్యం సంభవిస్తే డాక్టర్‌తో మాట్లాడవచ్చు. ఈ తీర్పును ధిక్కరించిన వారెవరినైనా తక్షణం కాలనీ నుంచి బహిష్కరించాలి. డైరెక్టర్ ఆంటన్ సెమ్యోనోవిచ్ ధృవీకరణ అనంతరం, ఈ తీర్పు అమల్లోకి వస్తుంది."

పిల్లలంతా ఈ తీర్పుపైన సంతృప్తి వ్యక్తం చేశారు. బ్రెగిల్ నా వద్దకు వచ్చి, "మీరు ఈ తీర్పును ధృవీకరించరుగా?" అంది.

"తప్పక ధృవీకరిస్తాను" అని స్పష్టం చేశాను. కోర్టు ముగిసింది.

తరువాత జురిన్స్కయా నాతో వివరంగా మాట్లాడింది. ఈ తీర్పు సరైనదేనంటారా? అని ప్రశ్నించింది. అవునన్నాను.

"సంఘ బహిష్కరణ అనేది సాధారణంగా ప్రమాదకరమైన ఆయుధం. కానీ ఈ కేసులో అది తప్పదనుకొంటాను. ఎందుకంటే ఊజికోవ్ కాలనీలో అందరికీ వ్యతిరేకి. అందరికీ వాడంటే ద్వేషం. కానీ రోజువారీ అవసరాల వల్ల, వాతావరణం పాడవుతోందనే భయం వల్ల అందరూ వాడితో కలిసి వుంటున్నారు. ఈ తీర్పు వల్ల వాడికీ కాలనీలోని ఇతరులకూ గల నిజమైన సంబంధాలకు చట్టబద్ధత ఏర్పడింది. తన పట్ల కాలనీవాసుల అభిప్రాయం ఏమిటో ఉజికోవ్‌కి స్పష్టంగా అర్థం అవుతోంది. దానిని వాడు తట్టుకొని, తన పద్ధతులు మార్చుకుంటే కాలనీలో కలిసిపోతాడు."

"తట్టుకోలేకపోతే?"

"వాడిని కాలనీ నుంచి బయటికి పంపడమే పరిష్కారం."

"అదెలా సాధ్యం"

"మొత్తం కాలనీ రక్షణ కోసం ఒక ఉజికోవ్‌ను బహిష్కరించవలసివస్తే దాని గురించి ఆలోచన అనవసరం. సమిష్టి ప్రయోజనాల కోసం ఒకరిని వదులుకోవడం పెద్ద నష్టం కాదు."

శిక్షా కాలంలో ఉజికోవ్‌లో ఆశించిన మార్పు కనిపించింది. వాడు తన కమాండర్ అప్పచెప్పిన పనిని శ్రద్ధగా చేయడం మొదలుపెట్టాడు. తనతో మాట్లాడని, తన వంక చూడని పిల్లలని శ్రద్ధగా గమనిస్తున్నాడు. వాడేదో ఆలోచిస్తున్నట్టు కనిపిస్తున్నాడు. కాలనీ ఆవరణ పరిశుభ్రం చేసే పనిని కమాండర్ వాడికి అప్పగించాడు. వాడు పొద్దున్నుంచీ, రాత్రి వరకూ అదే పనిలో పడ్డాడు. ఒకరోజు సాయంత్రం వాడు క్లాసురూంలో కూర్చుని ఒక పెద్ద అట్టమీద ఏదో రాశాడు. మర్నాడు దానిని ఆవరణలో అందరికీ కనిపించేలా అమర్చాడు.

"కాలనీవాసుల్లారా, మీతోటి కామ్రేడ్ శ్రమని గౌరవించండి. ఆవరణను పరిశుభ్రంగా ఉంచండి" అని ఆ బోర్డుపై రాసి ఉంది.

ఈ శిక్ష అమలులో ఉండగానే కామ్రేడ్ జోయా కాలనీకి వచ్చింది. అది భోజనాల సమయం. ఉజికోవ్ ఒంటరిగా ఒక టేబుల్ వద్ద కూర్చుని భోజనం చేస్తున్నాడు. జోయా అతనితో మాట్లాడ బోయింది. వాడు గౌరవంగా తిరస్కరించాడు. "కమాండర్ అనుమతి లేకుండా నేను మీతో మాట్లాడలేను క్షమించండి."

జోయా విసురుగా కమాండర్ వద్దకు వెళ్లి, "వాడికి నాతో మాట్లాడే అవకాశం ఇవ్వండి" అని కోరింది. వాడు కుదరదని కచ్చితంగా చెప్పాడు. ఆమె సరాసరి నా వద్దకు వచ్చింది. "నేనేం చేయలేనని" చెప్పేశాను.

మర్నాడు కాలనీ వాసుల సమావేశంలో నటాషా మాట్లాడింది. "పిల్లలూ అర్కడీ ఇప్పుడు శ్రద్ధగా పనిచేస్తున్నాడు. వాడిలో మార్పు వచ్చింది. వాడిని ఇక క్షమిద్దాం" అని ప్రతిపాదించింది.

ఉజికోవ్ దళ కమాండర్ కూడా దాన్ని బలపరిచాడు. "నిన్న పట్టణం నుంచి అధికారి వచ్చి పలకరించినా ఉజికోవ్ మాట్లాడలేదు. వాడు మన తీర్పును అక్షరాలా పాటిస్తున్నాడు. వాడిలో పూర్తిగా మార్పు వచ్చింది" అని చెప్పాడు.

కొంత చర్చ తరువాత వాడిని ఇక అందరిలో మామూలుగా కలిపేసుకోవాలని నిర్ణయించాం. లాపోట్ వెళ్లి స్టవ్ పక్కన ముడుచుకొని కూర్చున్న ఉజికోవ్‌కి ఈ విషయం తెలిపాడు.

ఉజికోవ్ సరాసరి వేదికపైకి వచ్చాడు. ఏదో మాట్లాడేందుకు నోరు తెరిచాడు. వాడి నోటమ్మట మాట రాలేదు. అక్కడ నిలబడి భోరున ఏడవడం మొదలుపెట్టాడు. మీటింగ్ హాల్లో వాతావరణం ఉద్వేగభరితంగా మారింది.

ఎవరో అరిచారు. "ఇవాళ వద్దులే. రేపు మాట్లాడుదువుగాని" అని.

కానీ వాడు కళ్లు తుడుచుకున్నాడు. "కృతజ్ఞతలు కామ్రేడ్స్. మీకందరికీ... నటాషాకు... నాకు అర్థమైంది. నేను.. నాకు..." వాడికి మాట రావడం లేదు. ఏడుపే వస్తోంది.

"ఇకచాల్లే, జరిగింది మరిచిపోదాం" అన్నాడు లాపోట్ స్థిరంగా సమావేశం ముగిసింది.

డిసెంబర్లో జెర్జిన్‌స్కీ కమ్యూన్ ప్రారంభమైంది. మా కాలనీ నుంచి ఏభైమంది పిల్లల్ని పంపాం. అనుకోకుండా ఆ కమ్యూన్ పనిభారం కూడా నాపైనే పడింది. రెండు కాలనీల మధ్య తిరగడం ఎక్కువైంది. అలాగే రెండు కాలనీల పిల్లల మధ్య బలమైన సంబంధాలు ఏర్పడ్డాయి. కొత్త కమ్యూన్‌లో కొత్తగా బయటనుంచి వందమంది పిల్లలు వచ్చి చేరారు. వారు సైతం అతి స్వల్పకాలంలోనే మాతో కలిసిపోయారు.

ఏప్రిల్‌లో అనుకోని అద్భుతం జరిగింది. మాక్సిమ్ గోర్కీ నించి మాకు ఒక లేఖ అందింది. జూలైలో తాను ఖార్కోవ్ వస్తున్నాననీ, కాలనీలో పిల్లల్తో మూడు రోజులు గడుపుతాననీ ఆయన రాశారు. ఎంతటి అదృష్టం. అప్పుడే ఇటలీ నుంచి తిరిగివచ్చిన మహారచయిత గోర్కీకి యావత్ సోవియట్ ప్రజానీకం బ్రహ్మరథం పడుతోంది. ఆయనకు అనేక వేల ఆహ్వానాలు అందుతున్నాయి. అయినా ఆయన మమ్మల్ని గుర్తు పెట్టుకొని తనంతతానుగా మా కాలనీకి బయలుదేరి రానున్నారు. ఆనందంతో పరవశించిపోయాం. ఆయనకు ఎలా స్వాగతం చెప్పాలి. ఆ మూడురోజులూ ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించాలి అనే చర్చల్లో మునిగిపోయాం.

అప్పుడే పట్టణం నుంచి పిలుపు వచ్చింది. నా విద్యా బోధనా పద్ధతులు, పిల్లల శిక్షణకు సంబంధించి నేను అనుసరిస్తున్న విధానం గురించి సమగ్ర చర్చకు నన్ను పిలిచారు. వెళ్లాను. విద్యాబోధన, పిల్లల శిక్షణకు సంబంధించి నా విశ్వాసాలను తెలుసుకోగోరిన పండితులు అక్కడ కొలువుతీరి ఉన్నారు. వారికి నేను చెప్పగలనని కానీ, చెప్పినా వారికి అర్థమవుతుందని కానీ నాకు నమ్మకం లేదు. అయినా పీఠాధిపతుల్లా, ప్రవక్తల్లా ఆ వేదికపై కూర్చున్న అనుభవశూన్యులకు నా ఉద్దేశ్యాలు, అభిప్రాయాలూ స్పష్టంగానే వివరించాను. అసలు ఎక్కడా, ఏ అనుభవమూ లేని ఈ కుర్ర పండితులకు నేను ఇలా వివరించవలసి రావడమే అవమానకరమైనా సహించాను.

కొన్నేళ్ల క్రితం క్రమశిక్షణకు సంబంధించిన నా పద్ధతులపై 'వివరణాత్మక విశ్లేషణ' జరిపిన మరో ప్రముఖుడు చైకిన్ కూడా ఆ మందలో ఉన్నాడు. నా వివరణ పూర్తవగానే ఆయన లేచి మొదట దాడి ప్రారంభించాడు.

"విధి నిర్వహణ ప్రాతిపదికనే విద్యార్జన క్రమం కూడా కొనసాగించాలన్నది కామ్రేడ్ మకరెంకో అభిప్రాయం. దానికే ఆయన కార్మికవర్గ దృక్పథం అన్న మాటను కూడా జోడిస్తున్నాడు. అంతమాత్రాన ఆయన సిద్ధాంత సారంలోని నిజాన్ని మనం చూడలేకపోము. కర్తవ్యం, విధి నిర్వహణ అన్న భావనల చారిత్రక మూలాలను సమగ్రంగా అధ్యయనం చేయాలని ఈ సందర్భంగా కామ్రేడ్ మకరెంకోకు సూచిస్తున్నాం. జాగ్రత్తగా పరిశీలిస్తే అది బూర్జువా ఆలోచనా ధోరణి అని, మరింత

స్పష్టంగా చెప్పాలంటే వ్యాపారాత్మక ధోరణి అని అర్థమవుతోంది. అయితే విద్యాబోధనాక్రమంలో పిల్లల సృజనశీలత, వారి అభిరుచులు, చొరవ, మొదలైన అంశాలకు పూర్తి స్వేచ్ఛనివ్వాలని. సోవియట్ విద్యా బోధన శాస్త్ర నిపుణులు భావిస్తున్నారు.

శ్రమ ఆవశ్యకత గురించి ఆయన వ్యక్తం చేసిన అన్ని అభిప్రాయాల గురించి ఇక్కడ చర్చించలేం. పాదార్థిక స్వావలంబన సాధించడం అనే దృష్టితో చూస్తే విద్యార్జనక్రమంలో శ్రమ పడడం అన్నది ఒక బోధనశక్తిగా ఉపయోగపడవచ్చు. అయితే పిల్లలకు విద్యను అందించే క్రమాన్ని శ్రమవల్ల సాధించే ప్రయోజనాలు ప్రభావితం చేయడం అన్న భావనను విద్యాబోధన శాస్త్రం ఆమోదించదు. అంతేకాదు శ్రమద్వారా ఆర్థిక ప్రయోజనాలు సాధించడం అనేది విద్యార్జనాక్రమానికి స్ఫూర్తినివ్వ గలదన్న మకరెంకో అభిప్రాయాన్ని పూర్తిగా వ్యతిరేకించాలి. అటువంటి సూత్రీకరణలు శ్రామికవిద్య అనే భావనను మలినం చేస్తాయి కూడా." ఇలా ఆయన ప్రసంగం సాగింది.

ఇదే ధోరణిలో మరికొందరు వక్తలు కూడా మాట్లాడారు. చాలామంది మౌనం పాటించారు. చివరికి నేను సహనం కోల్పోయాను.

"బహుశా మీరు చెప్తున్నదే సరైనదేమో. బహుశా మనం చెప్పేది ఒకరిదొకరికి అర్థం కాదేమో. ఎందుకంటే మీరు చెప్తున్నది నాకు అర్థమే కావడం లేదు. పిల్లలకు చదువుకోవాలనే చొరవ ఉండటాన్ని ఉత్తేజంగా పరిగణిస్తున్నారు. మరి ఈ ఉత్తేజం ఎక్కడినుంచి వస్తుందో ఆ భగవంతునికే తెలియాలి. గాల్లోంచి అయితే పుట్టదుకదా? నేను మరోసారి చెబుతున్నాను. ఎక్కడైతే లక్ష్యసాధన ఆవశ్యకత ఉంటుందో, ఎప్పుడైతే అది తప్పనిసరి అవుతుందో, అప్పుడు చొరవ అనేది పుడుతుంది. బాధ్యత ఏర్పడుతుంది. ఆ బాధ్యతను పూర్తి చేయాలనే తపన కలుగుతుంది. మొత్తం సమిష్టి ప్రయోజనాల సాధనకు కృషి చేయాలనే భావన కలుగుతుంది. దీన్ని మీకు అర్థం చేయలేకపోతున్నాను. మీరు అర్థం చేసుకోవడం లేదు. దీనికి బదులు శ్రమకి అతీతంగా ఒక పవిత్రమైన చొరవ, ఉత్తేజం పిల్లల్లో కలుగుతుందని, కలిగించాలని మీరంటున్నారు. ముక్కు మూసుకొని జపం చేస్తే ఈ ఉత్తేజం పుడుతుందా?" అని కటువుగానే ప్రశ్నించాను.

దాంతో వారు కంగుతిన్నారు. నామీద విరుచుకుపడ్డారు. వారి ధోరణి చూస్తుంటే నేను పూర్తిగా ఒంటరినయ్యానని అర్థమైంది. ఇక పోయేందుకు ఏముంది. విజృంభించాను. "విద్య గురించి కానీ, దీన్ని సాధించేందుకు అవసరమైన చొరవ గురించి గానీ ఎలాంటి తీర్పులు చెప్పే, నిర్ధారణలు చేసే అర్హత మీకు లేదు. అసలు వాటి గురించి మీకు తెలిసినది శూన్యం" అని స్పష్టం చేశాను. మళ్లీ అందరూ గోలగోలగా మాట్లాడారు. మధ్యలో లెనిన్ ప్రవచనాలను తీసుకొచ్చారు. ఆ విధంగా చూసినా వారు చెబుతున్నది తప్పని నేను ఓపికగా వివరించాను.

చివరికి వారందరూ కలిసి నేను ప్రతిపాదిస్తున్న పద్ధతి, సోవియట్ వ్యతిరేక పద్ధతి అని తేల్చారు. ఆ సదస్సులో నా మిత్రులు చాలామందే ఉన్నారు. అందరూ మౌనం పాటించారు. అక్కడకు రహస్య పోలీసు విభాగం 'చెకా' సిబ్బంది కూడా వచ్చారు. వారు మా వాదనను నిశ్శబ్దంగా నోట్సు రాసుకుని నిష్క్రమించారు.

ఆ రాత్రి కాలనీకి మేం ఆలస్యంగా చేరుకున్నాం. నాతోపాటు మా టీచర్లు, మా కొమ్సొమోల్ సభ్యులు ఉన్నారు. వారు నన్ను సమర్థిస్తూ సదస్సులోని ఇతర విద్యావేత్తలను నిందిస్తూ నన్ను ఓదార్చబోయారు. "ఇదేం పెద్ద విషయంకాదనీ పట్టించుకోవద్దనీ వారికి సర్ది చెప్పాను. కానీ అప్పటికే నేను తుది నిర్ణయం తీసుకున్నాను.

మర్నాడే వెళ్లి యుర్యేవ్‌కు నా రాజీనామా ఇచ్చాను. అతను దాన్ని పరిశీలించి ఏమీ మాట్లాడకుండా కరచాలనం చేశాడు. నేను గదినుంచి బయటకు వస్తూండగా 'ఒక్క నిమిషం' అని ఆపాడు.

"గోర్కీ వస్తున్న సంగతి మరిచారా?" అని అడిగాడు.

"లేదు గోర్కీని నేనే కాలనీలోకి ఆహ్వానిస్తున్నాను. మరొకరిని ఆ పని చేయనిస్తానా?" అని నవ్వాను. యుర్యేవ్ ఆందోళనగా పచార్లు సాగించాడు. మధ్యలో ఆగి ఏదో నిశ్చయానికి వచ్చినట్టు నా వంక చూశాడు. "నేనూ రాజీనామా చేస్తాను" అన్నాడు.

నేను అతన్ని అక్కడే వదిలి వచ్చేశాను.

కాలనీలో ఎవరికీ నా రాజీనామా సంగతి చెప్పలేదు. కానీ ఒక్కరోజుకూడా వృధా చేయలేదు. వివిధ ఫ్యాక్టరీల్లో నాకు గల స్నేహితులను కలిసాను, చెకా అధికారుల సాయం పొందాను. నా అభిమానులు, మిత్రులను కలుసుకున్నాను. కాలనీ సీనియర్లందరికి ఎక్కడెక్కడో ఉద్యోగాలు వెదికాను. వారందరిని పట్టణంలో నివసించేందుకు వీలుగా. గదులు సంపాదించి సిద్ధపరిచాను. ఈ అందరు కుర్రవాళ్లకి అవసరమైన దుస్తులు తదితర సరంజామా అంతా ఎకతెరీనా, గుల్యేవాలు సమకూర్చారు. పెద్ద పిల్లలంతా ఎలాగో బయట స్థిరపడేందుకు సిద్ధంగా ఉన్నారు కాబట్టి వారు పెద్దగా ఆశ్చర్యపోలేదు. ఒకరి తరువాత ఒకరుగా సీనియర్లు అంతా కాలనీ వదిలివెళ్లడం మొదలైంది. బాధతో కాదు కానీ, మమ్మల్ని విడిచి వెళ్తున్నందుకు బెంగతో వారంతా వరసగా నిష్క్రమించారు. మళ్ళీ మేం కలుస్తామని మాకు తెలుసు. టారానెట్స్, వారోఖోవ్, గడ్, లెషీ, గలటెంకో, ఫెదరోంకో, కొరిటో వొల్కోవ్ సోదరులు, లాపోట్, కుడ్లాటీ, స్టుపిట్సిన్, సొరొకాతో పాటు చాలామందిని ఇలానే సాగనంపాను.

అయితే కాలనీని పూర్తి అనాధగా వదిలి వెళ్లడం తప్పని కొందరు అధ్యాపకులను కొనసాగించాను. 'రబ్‌ఫాక్' కు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులను జర్జిన్‌స్కీ కమ్యూన్‌కు బదిలీ చేశాను. ఒక్క ఓవల్ మాత్రం కాలనీలో ఉండలేనని చెప్పి వెళ్లిపోయాడు.

నెమ్మదిగా ఒక్కొక్కరు నిష్క్రమిస్తున్నా వారి స్థానంలో శూన్యం ఏర్పడకపోవడం ఇన్నేళ్ల నా కృషికి నాకు లభించిన నిజమైన సంతృప్తి. సీనియర్లు ఉద్యోగాలకు, చదువులకు వెళ్తూండగానే ద్వితీయశ్రేణి నాయకత్వం వారి స్థానాలను భర్తీ చేస్తూ కాలనీలో గందరగోళం ఏర్పడకుండా నిరోధించగలిగింది. కాలనీ జీవితం యధాతథంగా ప్రశాంతంగా కొనసాగింది.

రోజులు ప్రశాంతంగా గడుస్తున్నాయి. మా సాయంత్రాలు పిల్లల నవ్వులు, కేరింతల మధ్య పూలతోటల నడుమ అందంగా గడుపుతున్నాను. మా పిల్లల కలలు, ఆశలు, ఆకాంక్షలు వారిని ముందుకు నడిపిస్తాయన్న నమ్మకం నాలో చెదరలేదు.

మాక్సీమ్ గోర్కీ రావాల్సిన రోజు సమీపిస్తోంది. అందరం అందుకు సన్నాహాలు ఉధృతం చేశాం. ఆయన వచ్చే రోజు పట్టణమంతా కోలాహలం. కాలనీ చుట్టూ జనమే జనం. దూర ప్రాంతాలనుంచి వచ్చిన అభిమానులు, అధికారులు, జాతీయ అంతర్జాతీయ పత్రికా విలేఖరులు, ఫోటోగ్రాఫర్లు, సినీప్రముఖులు అంతా విచ్చేశారు. పరిసరాల భవనాలన్నింటిని తోరణాలతో, పతాకాలతో అలంకరించారు. విశ్వ విఖ్యాత రచయితకు రహదారిపైనే వందన సమర్పణకు పిల్లల అశ్వికదళం అఖ్కిర్‌హైవే పైకి చేరుకుంది.

సన్నగా, పొడవుగా ఉన్న గోర్కీ కారు దిగారు. చుట్టూ చూశారు. వణుకుతున్న వేళ్లతో తన మీసాన్ని సవరించుకొన్నారు. విశాలంగా నవ్వారు. ఆయన మొహంలో ఒక రుషికి ఉండే ప్రశాంతత కళ్లలో స్నేహం -

"పిల్లలూ ఎలా ఉన్నారు? ఇలా రండి." అని పిలిచారాయన.

పిల్లలు తమ చిరకాల ఆప్తమిత్రునికి ఆహ్వానం పలికేందుకు తమ హృదయాలను ఆయన పాదాల ముందు పరిచారు.

పిల్లలతో కలిసి ఆయన ముందుకు సాగారు.

ఉపసంహారం

ఏడేళ్లు గడిచిపోయాయి. అదంతా ఇప్పుడు చరిత్ర. కానీ అందులో ప్రతిక్షణం నాకు గుర్తుంది., గోర్కీతో కదిలిన క్షణం, మా ఆలోచనలు, ఉద్వేగాలు ఆ రైలువెంటే పయనించాయి. పిల్లల కళ్లు వీడ్కోలు జ్ఞాపకాలతో మెరుస్తున్నాయి. ఇంకో చిన్న పని మిగిలి ఉంది నాకు. ప్లాట్‌ఫారం మీద గోర్కీవాసులు, జెర్జిన్‌స్కీ కాలనీ పిల్లలూ బారులు తీరి నిలబడి ఉన్నారు. మమ్మల్నందరినీ రైజోవాకు తీసుకువెళ్లే లోకల్ రైలు ఎదుటి ప్లాట్‌ఫారంపై ఆగివుంది. మా టీచర్ జుర్బిన్ నన్ను సమీపించి "పిల్లలంతా ఆ రైలు ఎక్కేయవచ్చా? ఆలస్యం ఉందా?" అని అడిగాడు.

"ఏం లేదు కానిమ్మన్నాను".

పిల్లలు మా కాలనీ బ్యానర్‌ను నా ఎదుటి నుంచే తీసుకెళ్లారు. మరుక్షణంలో పరిశుభ్రమైన దుస్తుల్లో పిల్లలు రైలు బోగీ కిటికీలోంచి బయటకు చూస్తున్నారు.

"ఆంటన్ సెమ్యోనోవిచ్ మా బోగీలో ఎక్కండి" అంటూ అందరూ ఉత్సాహంగా అరుస్తున్నారు.

నేను స్థిరంగా నిలిచాను. వారివంక చూసి చిరునవ్వు చిందించాను. జుర్బిన్‌ను పిలిచి అతని చేతిలో నా తుది ఆదేశాల పత్రం ఉంచాను. నేను 'సెలవు'పై వెళ్తున్న కారణంగా కాలనీ బాధ్యతలు అతని కప్పగిస్తున్నట్టు ఆ పత్రంలో ఉంది.

జుర్బిన్ అయోమయంగా చూశాడు.

"అంటే ఇదే ఆఖరా?" అని అడిగాడు.

"అవును" అని చెప్పాను.

"కానీ.. కానీ...' అంటూ అతనేదో చెప్పబోయాడు. కానీ ఈలోగా గార్డు విజిల్ ఊదాడు. జుర్బిన్ తన మాట పూర్తి చేయలేక, నా వంక నిస్సహాయంగా చూసి రైలు వైపు పరుగుతీశాడు. లోకల్ రైలు కదిలింది. పిల్లలంతా సెలవులకు ఎక్కడికో బయలుదేరినట్టు నాకు 'గుడ్‌బై' చెబుతున్నారు. సరదాగా నవ్వుతున్నారు. చివరి బోగీలో కొరోట్కావ్ నన్ను చూసి శాల్యూట్ చేసి నవ్వాడు.

నేను స్టేషన్‌లోకి వచ్చి జుర్బిన్‌స్కీ కాలనీ ప్లిలలను తీసుకుని కమ్యూన్‌కేసి నడిచాను. ఏడేళ్లయిపోయింది. ఇదంతా జరిగి.

✣ ✣ ✣

ఈ ఏడేళ్లలో సోవియట్ ఎంతో పురోగమించింది. తూర్పు యూరప్ దేశాల ప్రజలు ప్రజ్ఞా పాటవాలు ప్రపంచం గుర్తించడం మొదలైంది. ఈ వ్యవధిలో ఆ ప్రజానీకం అభివృద్ధి సాధించింది. మా సొంత మేధావులు ఆవిర్భవించారు.

అప్పటికే సోవియట్‌లో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు వెళ్లిన మా గోర్కీవాసులూ ఎదిగారు.

ఇప్పుడు కావాలనుకొన్నా వారందరిని ఒకచోట చూడడం అసాధ్యం. జదరోవ్ ఎక్కడో తుర్కుమెనిస్తాన్ నిర్మాణ సంస్థలో ఇంజనీర్. దూరప్రాచ్య సైనిక దళాల్లో వెర్షనోవ్ ఒక డాక్టర్, యారూస్తావ్‌లో బరున్ మరో డాక్టర్. పిల్లకుంకలు నెసినోవ్, జురోవ్ కూడా దూరతీరాలకు

ఎగిరిపోయారు సోవియట్ విమానాల ఉక్కురెక్కల సాయంతో. షెలాపుటిన్ కూడా వారిలానే ఒక పైలట్. జువెలీ సోదరుల్లో ఒకరు పైలట్ అయితే మరొకరు నావికాదళంలో ఉన్నాడు.

గోర్కీ కాలనీ వివరాలు తెలుసుకొనేందుకు నా వద్దకు వచ్చి కొందరు అడుగుతుంటారు. ఈ పిల్లల్లో అన్ని రంగాలకు చెందినవారూ అభివృద్ధి అయారు. కానీ రచయితలూ, కళాకారులు లేరా అని. లేకేం. వారు లేకుంటే కాలనీలో గోడ వార్తాపత్రిక, నాటకాలూ ఉండేవి కావు. కానీ అంతిమంగా వారెవరూ కళాకారులు కాలేకపోయారని నేను అంగీకరిస్తాను. దానికి కారణం వారికి నైపుణ్యం లేక కాదు. జీవితం, దాని భారం వారిలోని కళాతృష్ణకు మెరుగులు దిద్దలేక పోయాయి.

కరబనోవ్ తాను ఆశించినట్టు వ్యవసాయంలో స్థిరపడలేదు. పిల్లల మధ్య కాకుండా వేరేలా ఉండలేనని నిర్ణయించుకున్నాడు. ఇంకా అనాథల్లా మిగిలిన అద్భుతమైన పిల్లలని నేను అలానే వదలలేను అని తీర్మానించుకొన్నాడు. సామాజిక విద్యారంగంలో ప్రవేశించాడు. అధ్యాపకునిగా మారాడు. రబ్‌ఫాక్ రోజుల్లోనే ప్రేమించిన చెర్నిగోవ్ యువతిని పెళ్లాడాడు. వారికో బాబు కలిగాడు. చూసేందుకు నల్లటి కళ్లతో తల్లిలా, ప్రవృత్తిరీత్యా తండ్రిలా ఉండేవాడు. ఈ పసివాడిని కరబనోవ్ నడిపే కాలనీలో ఉండే ఒక కుర్రవాడు ఉన్మాదంలో హత్య చేశాడు. అయినా కరబనోవ్ తన మార్గం వీడలేదు. ఎవరినీ ద్వేషించలేదు. జరిగిన సంఘటన గురించి నాకు చిన్న లేఖ మాత్రం రాశాడు.

బెలూఖిన్ సైతం ఇంజనీర్ కావాలనే తన ఆశయాన్ని మధ్యలోనే వదిలిపెట్టాడు. సైన్యంలో చేరుతున్నట్టు తెలియచేస్తూ ఉత్తరం రాశాడు.

మిగిలిన వారు కూడా సాంకేతిక నిపుణులుగా, కారు డ్రైవర్లుగా, నీటిపారుదల నిపుణులుగా, అధ్యాపకులుగా, విద్యుత్ కార్మికులుగా, ఫోర్‌మెన్‌లుగా స్థిరపడ్డారు. చాలా మంది పార్టీ కార్యకర్తలుగా మారారు.

కానీ ఈ ఏడేళ్ల కాలంలో ఒక్క బ్రాచెంకో ఆచూకి మాత్రం నాకు తెలియలేదు. వాడు ఏ గుర్రాల మందలో అదృశ్యమయ్యాడో తెలియదు. అలాగే లాపోట్, గడ్, టారానెట్‌ల ఆచూకి కూడా నాకు తెలియదు.

కానీ మొత్తం మీద సోవియట్ భూమిలో ఇప్పుడు విద్యాబోధనకు అధిక ప్రాధాన్యం లభిస్తోంది. అనాథ పిల్లలు, నైతిక లోపం ఉన్న పిల్లలు అనే జాఢ్యాన్ని సమూలంగా తుడిచిపెట్టేందుకు, అది తిరిగి తలెత్తకుండా చూసేందుకు కమ్యూనిస్టు పార్టీ నిరంతర కృషి సాగిస్తోంది.

బహుశా ఇకపై జనం విద్యాబోధనపై సిద్ధాంత రాద్ధాంతాలు మానుకుంటారేమో.

✣ ✣ ✣

విద్యాబోధనా రంగంలో ప్రజాస్వామ్య భావనలను, సిద్ధాంతాలను ప్రవేశ పెట్టేందుకు పాటుపడిన విద్యావేత్తల్లో **ఆంటన్ మకరెంకో** (1888-1938) ప్రముఖులు. ఆయన ప్రపంచంలోని గొప్ప విద్యావేత్తల్లో ఒకరిగా అపారమైన ఖ్యాతిని ఆర్జించారు. మకరెంకో రాసిన పుస్తకాలు పలుఖండాల్లో లక్షల సంఖ్యలో ప్రచురితమై ఎంతో ప్రజాదరణ పొందాయి.

సోవియట్ రష్యాలో ఒక పెయింటర్ కుమారుడిగా జన్మించిన మకరెంకో- 17 ఏళ్ళ వయసులోనే రైల్వే కార్మికుల పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన ప్రాథమిక పాఠశాలలో టీచరుగా జీవితాన్ని ఆరంభించారు. బోధనారంగంలో అనేకానేక కొత్త ఆలోచనలకు తలుపులు తెరిచారు. విద్యాబోధన పద్ధతుల గురించి అనేక పుస్తకాలు రాశారు. ఈ పుస్తకం గోర్కీకాలనీ (1920-28)లోను, ఆ తర్వాత జర్‌జిన్‌స్కీ కమ్యూన్ (1927-35)లోను తన వద్ద చదువుకున్న అల్లరి, పెంకి పిల్లల్లో చక్కటి మార్పు తీసుకువచ్చేందుకు మకరెంకో అనుసరించిన రకరకాల వినూత్న పద్ధతులను వివరిస్తుంది. 'ఒక మనిషి నుంచి మనం ఎంతైన ఆశించవచ్చు. ఎన్ని డిమాండ్లయినా చెయ్యవచ్చు. కానీ అదే సమయంలో ఆ వ్యక్తికి ఎంత గౌరవం ఇవ్వగలమో అంతా ఇవ్వాలి' అని నొక్కి చెబుతుంది.

విద్యాబోధన విషయంలో మకరెంకో చేసిన తార్కిక సూత్రీకరణలు ఏమిటో, అనుసరించిన పద్ధతులు ఏమిటో తల్లిదండ్రులుగా, టీచర్లుగా మనం తెలుసుకోవడం చాలా అవసరం. మకరెంకో విద్యార్థుల జీవితం మొత్తం ఒక క్రమంలో నడిచేలా విద్యా విధానాలను తీర్చిదిద్దారు. ఆయన ఒక విస్పష్ట కార్యాచరణతో విద్యార్థులతోనే 'జనరల్ అసెంబ్లీ'ని ఏర్పాటు చేశారు. పిల్లలు తమ వ్యవహారాలను తామే సమర్థంగా నిర్వహించుకునే ఉమ్మడి వేదికగా రూపుదిద్దుకున్న ఈ 'కలెక్టివ్' - దాని నిర్వహణలో ప్రతి విద్యార్థికీ భాగస్వామ్యాన్ని కల్పించటం ఆసక్తికరమైన అనుభవం.